# కవిత్రయ మహాభారతము

## (సంగ్రహ వచనం)

రచన

**డా. అద్దంకి శ్రీనివాస్**

ప్రకాశకులు

**చల్లా సాంబిరెడ్డి** B.A., LL.B.,

**అధ్యక్షులు**

**శ్రీ పావని సేవాసమితి**

**హైదరాబాదు**

**కవిత్రయ మహాభారతము**

(సంగ్రహ వచనం)


**రచన** : డా. అద్దంకి శ్రీనివాస్

**ఇమెయిల్** : addankidr@gmail.com

**ప్రథమ ముద్రణ** : 2019

**ద్వితీయ ముద్రణ** : 2021

**ప్రతులు** : 1000



**హక్కులు** : ప్రకాశకులవి



**ప్రకాశకులు**

**అధ్యక్షులు : చల్లా సాంబిరెడ్డి**

**శ్రీ పావని సేవాసమితి**

ఇం.నం. 3-499 ఎ

రోడ్ నం.7, హిమాయత్ నగర్

హైదరాబాద్ - 500 029.

sripavanisevasamithi@gmail.com

**ప్రింటింగ్ & బైండింగ్**

**వై.వి. రెడ్డి. ప్రింటర్స్ & బైండర్స్,**

దిల్‌సుక్‌నగర్, హైదరాబాద్ - 500036.

సెల్ : 9391015317

yvr.postpresssolutions@gmail.com

**మూల్యం :** అమూల్యం

# నా మాట

మహాభారతాన్ని 'పంచమవేదం' అని పిలుస్తారు.

భారతంలోని కొన్ని అంశాలు ఇప్పటి దృష్టితో చూస్తే చాలామందికి నమ్మశక్యంగా ఉండవు. అయినా అందులోని సందేశాలు నేటికీ పరమసత్యాలుగా, ప్రామాణికాలుగా విలసిల్లుతూ ఉన్నాయి.

ఆ సత్యాలే స్థిరంగా ఇప్పటికీ మన జీవితంలో కలిసిపోయాయి. మన వెంట నడుస్తున్నాయి. మనల్ని జాగ్రత్తగా నడిపిస్తున్నాయి. అయితే వాటిలో కొన్ని అమానుషాలూ, అతిమానుషాలూ కావచ్చుగాక. కానీ ధర్మాధర్మాలకూ, న్యాయాన్యాయాలకూ మంచిచెడ్డలకూ మాత్రం అవి ముమ్మూర్తులా కరదీపికలే.

మహాభారతంలో ఉన్నవి కేవలం వింత వింత కథలు మాత్రమే కావు. ఉద్రేకాన్ని రేకెత్తించే ఘట్టాలూ కావు. సత్యాసత్య వివేచనతో మానవజీవనానికి కావలసిన అన్ని శాస్త్రాల సారాంశాన్నీ అందించే గొప్ప గొప్ప ఇతివృత్తాలు. అందుకే ధర్మశాస్త్రవేత్తలు మహాభారతాన్ని ధర్మశాస్త్రంగా, ఆధ్యాత్మికవేత్తలు వేదాంతంగా, నీతిశాస్త్రజ్ఞులు నీతిశాస్త్రంగా, కవీంద్రులు మహాకావ్యంగా ఇలా ఎవరికి వాళ్ళు భారతాన్ని తమ గ్రంథం గానే భావిస్తారని అన్నాడు నన్నయ. ఆ మాట నిత్యసత్యం. 'ఏ పట్టునఁ బూజ్యమూర్తియగు భారతసంహిత'అన్న తిక్కన్న అభిప్రాయమూ నన్నయ మాటనే వక్కాణిస్తోంది.

కవిత్రయభారతంలో పాత్రపోషణ పూర్తిగా స్వతంత్రమైనది. దేశ, కాల ప్రాంతాలకు అనుగుణంగా కవిత్రయం కవులు చేసిన కల్పనలు శిల్పధర్మానికి పరాకాష్ఠలు. దానికి కొలమానం మన అనుభవమే. ఈ పాత్ర ఇలా తప్ప వేరేలా తీర్చిదిద్దడానికి వీల్లేదు, ఈ కవి తప్ప వేరే కవి తీర్చిదిద్దలేడు అన్నట్లుగా రససిద్ధి పొందిమరీ కవిత్రయం వాళ్ళు రచించారు.

అవును నిజంగా వాళ్ళు ఋషులే. 'ఋషివంటి నన్నయ రెండవ వాల్మీకి' అని విశ్వనాథవారు ఊరికే అంటారా! ఈ సన్నివేశం ఇలాగే ఉండాలి. ఇలా ఉంటే బావుంటుంది ఈ సందర్భం ఇలా పరిణమించడం న్యాయం, సహజం – అని నిర్ణయించడానికి మన అనుభవమో, దానివల్ల ఏర్పడిన భావనాశక్తో సాధనం కావచ్చు. అయితే అవి సముద్రంలాంటి భారతాన్ని పొదివిపట్టుకోలేని రెండు దోసిళ్ళలాంటివే.

'వింటే భారతం వినాలి తింటే గారెలే తినాలి' అన్నది నానుడి. భారతంలో అంత గొప్పదనం ఏముంది? అంటే చదివితేనే అది తెలుస్తుంది.

మహాభారతం కథలకు పెట్టింది పేరు. ప్రతి కథ ఒక మంచి సందేశాన్ని ఇస్తుంది. ప్రధానమైన కథ అందరికీ తెలిసినదే! అది కాకుండా ఆయా సందర్భాలలో వచ్చే కథలూ, వాటిలోని నీతులూ మనకు ప్రస్తుత జీవనానికి కావలసిన ఎన్నో సూచనల్ని అందిస్తాయి. కాబట్టి కథ చెప్తూ, నేటి తరానికి అవసరమైన సూక్తుల్ని విడిచిపెట్టకుండా, మరీ సంగ్రహంగానూ కాకుండా, అలా అని విస్తృతంగానూ రాయకుండా కవిత్రయ మహాభారతం లోకానికి మంచి వచనంలో అందించాలని శ్రీ చల్లా సాంబిరెడ్డిగారి కోరిక. ఇప్పటికే వీరు రామాయణ భారత భాగవతాలను వివిధ స్థాయిలలో రాయించి, ముద్రించి లోకానికి అందించారు. ఇంటింటికీ అందిస్తానని కంకణం కట్టుకొన్నారు. ఇది మహోపకారం.

సాగరంలాంటి మహాభారతాన్ని ఇలా 310 పుటల్లో నిబంధించడం అసిధారావ్రతమే! ఎంతవరకూ కృతకృత్యుణ్ణయ్యానో పాఠకులు మీరే చెప్పాలి! అందుకు మీకు సాదర స్వాగతం.

మీ

**అద్దంకి శ్రీనివాస్**

# వరప్రసాదం

ఇందులో ఉన్నదే లోకంలో ఉంది. ఇందులో లేనిది లోకంలో ఎక్కడా లేదు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలను సాధించేందుకు అవసరమైన మార్గాన్ని భారతం అందిస్తుందంటూ వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పిన మాట అందరికీ శిరోధార్యం. డాక్టర్ అద్దంకి శ్రీనివాస్‌గారు అనాయాసంగా అర్థమయ్యే రీతిలో మహాభారతాన్ని సరళమైన, సుందరమైన వచనంలో రాయడం ఆధునిక యుగంలో బాలబాలికలకూ, యువతీయువకులకూ వరప్రసాదం. మహాభారతంతో పాటు భాగవత, రామాయణ గ్రంథాలను సైతం అద్దంకివారి సహకారంతో మూడు దశల పరిజ్ఞానం, గ్రాహ్యశక్తి కలిగిన వారికోసం మూడు పాకాలలో వండించి వడ్డించడం మిత్రులు చల్లా సాంబిరెడ్డిగారి వాస్తవిక దృక్పథానికి నిదర్శనం. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన గ్రంథాలూ, తెలుగు అకాడెమీ వేయించిన పుస్తకాలూ, తెలుగు విశ్వవిద్యాలయం వెలువరించిన రచనలూ ఎంతమందికి అందుబాటులో ఉన్నాయన్నదీ, ఎంతమందికి అర్థం అవుతున్నాయన్నదీ అనుమానమే. ఈ సూక్ష్మం గ్రహించిన సాంబిరెడ్డిగారి నాయకత్వంలోని శ్రీపావని సేవా సమితి మూడు రకాల పాఠకులను రంజింపజేసే విధంగా మూడు స్థాయిలలో రచనలు ప్రచురించడమే కాకుండా వాటిని వేలాదిమందికి అందజేయడం భారతీయ సంస్కృతికీ, ఇతిహాసానికీ చేస్తున్న మహోపకారం. అప్పుడప్పుడే భాషపైన పట్టు సాధిస్తున్న బాలబాలికలకోసం అతిసరళంగా ద్రాక్షాపాకంలో ఒక దశ, తెలుగుపైన ఎంతోకొంత అధికారం సంపాదించిన యువతీయువకులకోసం కదళీపాకంలో రెండో దశ, కష్టతరమైనప్పటికీ ప్రయత్నించి అర్థం చేసుకోవడంలో ఆనందం పొందేవారికోసం నారికేళపాకంలో మూడో దశ వచన రచన నడిపించడం విశేషం.

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఎంతోమంది పండితులు సమష్టిగా చేయవలసిన బృహత్కార్యాన్ని ఒక స్వచ్ఛంద సంస్థ తలకెత్తుకోవడం, స్వయంగా నిర్దేశించుకున్న బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం సహస్రధా అభినందనీయం.

ముఖ్యమైన ఘట్టాలలో వచనం, మధ్యలో అక్కడక్కడా తెలుగు భారతంలోని పద్యాలు ఉటంకించడం, వాటి తాత్పర్యం స్థూలంగా చెప్పడం వల్ల పద్యాలపట్ల అనురక్తి, తెలుగులో పాండిత్యం సంపాదించాలన్న ఆసక్తి బాలబాలికలలో, యువతీయువకులలో విధిగా కలుగుతాయి. ఈ కారణంగా తెలుగుభాషకూ, తెలుగుజాతికీ ఎనలేని సేవ చేస్తున్నారు శ్రీ పావని సేవాసమితి సభ్యులు. నిగూఢంగా, నిర్లజ్జగా, అమానవీయంగా సాగుతున్న వర్తమాన రాజకీయాలను అర్థం చేసుకోవడానికీ, కార్యకారణ సంబంధాలు తెలుసుకోవడానికీ మహాభారత పరిజ్ఞానం చాలా దోహదం చేస్తుంది. ఏ రాజకీయ నాయకుడి వ్యూహం ఏమిటో, లక్ష్యం ఏమిటో ఊహించడానికీ, విశ్లేషించడానికీ ఉపకరిస్తుంది. కలియుగంలో ధర్మం ఒకే పాదం మీద నడుస్తున్నదని అనుకున్నప్పటికీ మనం చూస్తున్న సమాజంలో ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్ముడు, ధర్మరాజు, దుర్యోధనుడు, భీముడు, శకుని వంటి వ్యక్తులు  రాజకీయ రంగస్థలిని రక్తి కట్టిస్తున్నారు. ఘటనాఘటన సమర్థులు కొందరు కృష్ణుడి పాత్రను తలపిస్తారు. అప్రతిహతంగా, అవలీలగా రాజకీయ చక్రవ్యూహాన్ని ఛేదించేవారు అర్జునుడిని గుర్తుచేస్తారు. మన రాజకీయ నాయకులు వారికి తెలియకుండానే భారతంలోని పాత్రల తరహాలో వ్యవహరిస్తూ ఉంటారు. భాగవతం, రామాయణం, భారతం చదివినవారికి భారతీయతత్త్వం బోధపడుతుంది. ధర్మవర్తనం, ప్రాపంచిక దృక్పథం, విజయసోపానంలో పురోగమించేందుకు అవసరమైన వ్యూహరచనాసామర్థ్యం అలవడతాయి. నిత్యజీవితంలో సమస్యలను పరిష్కరించుకుంటూ నెగ్గుకురావడానికీ, అవరోధాలను అధిగమించి విజయాలు సాధించడానికీ సామాన్య మానవులకు సైతం తోడ్పడతాయి. సమాజ శ్రేయస్సుకు ఇది అమృతంగా పనిచేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

మూడు కావ్యేతిహాసాలనూ తెలుగువారికి సులభగ్రాహ్యంగా అందించే మహాసంకల్పసిద్ధికోసం అహరహం శ్రమిస్తున్న శ్రీపావని సేవా సమితి సారథులకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ పుస్తకం చదవడం ఆరంభించినవారు చివరి పుటవరకూ ఆగకుండా చదువుతారు. ఇందుకు అసాధారణమైన కథాసంవిధానంతో పాటు పరిష్కర్తల ఆచరణాత్మకమైన దృష్టి కూడా కారణం. ఈ సాహిత్య ప్రయోగంలో కీలకపాత్రలు పోషిస్తున్న డా. అద్దంకి శ్రీనివాస్‌గారికీ, శ్రీమాన్ చల్లా సాంబిరెడ్డిగారికీ ప్రత్యేకంగా తెలుగుజాతి తరఫున కృతజ్ఞతలు. ఈ నాలుగు మాటలూ రాసే మహదవకాశం కలగడం నా పురాకృత శుభాధిక్యం.

**– కొండుభట్ల రామచంద్రమూర్తి**

(కె. రామచంద్రమూర్తి)

చీఫ్ ఎడిటర్, సాక్షి డైలీ

## వ్యాసప్రబోధం

న జాతు కామా న్న భయా న్న లోభాత్
త్యజేద్ధర్మం జీవితస్యాపి హేతోః ।
ధర్మో నిత్యః సుఖదుఃఖే త్వనిత్యే
జీవో నిత్యో హేతురస్య త్వనిత్యః ॥ (భారత సావిత్రి - 4)

ఏ జాతినైనా దాని స్వభావానికి తగిన విధంగా సంఘటితం చేసి కాపాడేది ధర్మం. మానవుడు ఏవో కోరికలవల్లనో, ఏవేవో భయాలవల్లనో, ఏవైనా అత్యాశలవల్లనో, చివరికి తన ప్రాణాలకోసమైనా సరే, ధర్మాన్ని వదలి పెట్టకూడదు. ఎందుకంటే, ధర్మం శాశ్వతమైనది. సుఖదుఃఖాలు వస్తూ పోతూ వుంటాయి. (ఇంకా లోతుగా ఆలోచిస్తే, లోపల ఉన్న జీవుడు శాశ్వతమైనవాడు. వాడిని వ్యక్తపరచే శరీరాదులు అశాశ్వతమైనవి. శాశ్వతుడైన జీవుడు శాశ్వతమైన ధర్మాన్నే గట్టిగా పట్టుకోవాలి గానీ, అశాశ్వతపదార్థాలను కాదు.)

## వ్యాసుని నిర్వేదం

ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేష
న చ కశ్చిత్ శృణోతి మామ్,
ధర్మా దర్థశ్చ కామశ్చ
స కిమర్థం న సేవ్యతే? (మహాభారతమ్)

ప్రతివాడూ సంపదలు (అర్థం) కావాలనీ, కోరికలు (కామం) తీరాలనీ ఆరాట పడుతున్నాడు. ఎవరి ధర్మాన్ని వాళ్ళు ఆచరిస్తూ ఉంటే, ఆ ధర్మమే వారికి సంపదలు ఇస్తుంది. న్యాయమైన కోరికలన్నీ తీరుస్తుంది. నేను చేతులెత్తుకొని ఈ విషయాన్నే అరిచి గోల పెడుతుంటే నా మాట ఎవరూ వినరేమిటి? అని వాపోయాడు వ్యాసమహర్షి.

కాబట్టి మనమంతా తప్పక ధర్మబద్ధంగానే నడుచుకుందాం! ఆ మహర్షి ఆశయాన్ని నెరవేరుద్దాం!

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | అవతారిక | 1 |
| 1. | ఆదిపర్వం | 27 |
| 2. | సభాపర్వం | 69 |
| 3. | అరణ్యపర్వం | 97 |
| 4. | విరాటపర్వం | 159 |
| 5. | ఉద్యోగపర్వం | 169 |
| 6. | భీష్మపర్వం | 203 |
| 7. | ద్రోణపర్వం | 213 |
| 8. | కర్ణపర్వం | 223 |
| 9. | శల్యపర్వం | 227 |
| 10. | సౌప్తికపర్వం | 231 |
| 11. | స్త్రీపర్వం | 237 |
| 12. | శాంతిపర్వం | 249 |
| 13. | ఆనుశాసనికపర్వం | 267 |
| 14. | అశ్వమేధపర్వం | 275 |
| 15. | ఆశ్రమవాసపర్వం | 279 |
| 16. | మౌసలపర్వం | 295 |
| 17. | మహాప్రస్థానికపర్వం | 299 |
| 18. | స్వర్గారోహణపర్వం | 303 |

# కవిత్రయ మహాభారతము
## అవతారిక

అది రాజమహేంద్రవరం.

ఆ నగరాన్ని రాజధానిగా చేసుకొని రాజరాజనరేంద్రుడు అనే ఒక మహారాజు పరిపాలిస్తున్నాడు. భారతీయ ధర్మం అన్నా, వైదిక ఆచారాలన్నా, భారతీయవాఙ్మయం అన్నా  అతడికి ఎంత ఇష్టమో చెప్పలేం. అలాంటి రాజుగారి ఆస్థానంలో ఒక మహాకవి ఉన్నాడు. అతడి పేరు నన్నయభట్టు.

ఒకరోజు రాజరాజనరేంద్రుడు నన్నయభట్టును పిలిచి –

**చం.  విమలమతిం బురాణములు వింటి ననేకము లర్థధర్మశా**
**స్త్రములతెఱం గెఱింగితి నుదాత్తరసాన్వితకావ్యనాటక**
**క్రమములు పెక్కు సూచితి జగత్పరిపూజ్యములైన యీశ్వరా**
**గమములయందు నిల్పితిఁ బ్రకాశముగా హృదయంబు భక్తితోన్ (ఆది:1-10)**

'మహాత్మా! నేను విమలమతితో అనేక పురాణాల్ని విన్నాను. ఎన్నో శాస్త్రాల్ని అధ్యయనం చేశాను. కావ్యనాటకాల్నీ, ఈశ్వర ఆగమాలనూ భక్తితో చదివాను. నాకు కొన్ని ఇష్టాలు ఉన్నాయి. అవి ఏమిటో తెలుసా..

**మ.  ఇవి యేనున్ సతతంబు నాయెడఁ గరం బిష్టంబు లై యుండుఁ బా**
**యవు భూదేవకులాభితర్పణమహీయఃప్రీతియున్ భారత**
**శ్రవణాసక్తియుఁ బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో**
**త్సవమున్ సంతతదానశీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్ (ఆది:1-12)**

ఎల్లప్పుడూ బ్రాహ్మణుల్ని సేవించడం, భారతం వినడం, శివుణ్ణి పూజించటం, దానం చేయడం, సజ్జనులతో గడపడం. ఈ అయిదింటిలో మహాభారతం వినడం అంటే నాకు మరీ ఇష్టం. దానికి మరో కారణమూ ఉంది.

**చం. హిమకరుఁ దొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్**
**క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయవం**
**శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవో**
**త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్ (ఆది:1-14)**

మాది చంద్రవంశం. పూరుడు, భరతుడు, కురువు, పాండవులు మొదలైన చక్రవర్తులు మా పూర్వికులు. అందువల్ల పాండవులూ మాకు పూర్వికులే కాబట్టి వాళ్ళ చరిత్ర వినాలని నాకు ఎంతో కుతూహలంగా ఉంది.

**చం. అమలసువర్ణశృంగఖురమై కపిలంబగు గోశతంబు ను**
**త్తమబహువేదవిప్రులకు దానము సేసిన తత్ఫలంబు త**
**థ్యమ సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్ మదీయచి**
**త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రవణంబ కావునన్ (ఆది:1-15)**

కొమ్ములకూ, గిట్టలకూ బంగారు తొడుగులు తొడిగిన వంద కపిల వర్ణం గల ఆవుల్ని ఉత్తమ బ్రాహ్మణులకు దానం చేస్తే ఏ ఫలం వస్తుందో మహాభారతాన్ని వింటే ఆ ఫలం వస్తుందట. అంతేకాదు -

**కం. బహుభాషల బహువిధముల**
**బహుజనములవలన వినుచు భారతబద్ధ**
**స్పృహులగు వారికి నెప్పుడు**
**బహుయాగంబులఫలంబు పరమార్థ మిలన్ (ఆది:1-17)**

అనేక భాషలలో, అనేక విధాలుగా, అనేకులు చెప్పగా భారతాన్ని శ్రద్ధగా విన్నవారికి అనేక యాగాలు చేసిన పుణ్యమూ లభిస్తుందిట' అన్నాడు అంజలి ఘటిస్తూ.

నన్నయ అతడి మాటలు విన్నాడు. విని ఇలా అన్నాడు - 'ప్రభూ!

చం. **అమలినతారకాసముదయంబుల నెన్నను, సర్వవేదశా**
**స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధిబాహువి**
**క్రమమున దుర్గమార్థజలగౌరవ భారతభారతీసము**
**ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁ బోలునే (ఆది:1-19)**

ఆకాశంలోని చుక్కల్ని లెక్కపెట్టడం, సర్వవేదశాస్త్రాలలోని సారాన్ని అర్థం చేసుకోవడం, బుద్ధి అనే భుజశక్తితో భారతం అనే సముద్రాన్ని ఈదడం (భారతాన్ని అర్థం చేసుకొని తెలుగులోనికి రాయడం) బ్రహ్మదేవుడికైనా సాధ్యం కాదు. అయినా తమరు ఆదేశించారు కాబట్టి ప్రయత్నిస్తాను' అన్నాడు.

అన్నమాట ప్రకారం భారత రచన ప్రారంభించాడు. ముందుగా ఇష్టదేవతల్ని స్తుతించాడు సంస్కృతంలో భారతాన్ని 'జయము' అనే పేరుతో రచించిన మహర్షి వేదవ్యాసుడు.

ఉ. **భారతభారతీశుభగభస్తిచయంబులఁ జేసి ఘోరసం**
**సారవికారసంతమసజాలవిజృంభముఁ బాపి సూరిచే**
**తోరుచిరాబ్జబోధనరతుండగు దివ్యుఁ బరాశరాత్మజాం**
**భోరుహమిత్రుఁ గొల్చి మునిపూజితు భూరియశోవిరాజితున్ (ఆది:1-22)**

భారతంలోని వాక్కులు సూర్యకిరణాలలాంటివి. వాటితో సంసారంలోని దుర్గుణాలు అనే చీకట్లను పోగొట్టి పండితుల హృదయాలు అనే పద్మాలను వికసింపజేసిన మహానుభావుడు వ్యాసుడు. అలాంటి వేదవ్యాసుడు అనే సూర్యుడిని కొలిచి,

ఉ. **పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా**
**రాయణునట్లు వానస ధరామరవంశవిభూషణుండు నా**
**రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుం దన కిష్టుఁడున్ సహా**
**ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగన్ (ఆది:1-25)**

భారతయుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు ఎలాంటి సహాయం అందించాడో తనకు భారతరచనలో అలాంటి సహాయం అందించినవాడూ, బ్రాహ్మణవంశానికి అలంకారమైనవాడూ, వాఙ్మయధురంధరుడూ, మిత్రుడూ, సహాధ్యాయుడూ అయిన నారాయణభట్టు తోడై నిర్వహిస్తూ ఉండగా నన్నయ భారతరచన చేశాడు.

**ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో**
**నారసి మేలు నా నితరు లక్షరరమ్యత నాదరింప నా**
**నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా**
**భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్ (ఆది: 1-26)**

లోకం రకరకాలుగా ఉంటుంది. కవీంద్రులు – మహాభారతంలోని కథల్ని చక్కగా చెప్తే ఆనందిస్తారు. ఇతరులకు అక్షరాలను రమ్యంగా ప్రయోగిస్తే ఇష్టం. మరికొందరు మంచి మంచి సూక్తుల్ని ఏర్చికూర్చి రచిస్తే మెచ్చుకుంటారు. ఇలా ఈ మూడు గుణాలు తన కవిత్వంలో ఉండేలా జాగ్రత్త పడ్డాడు నన్నయ.

ఆ తరువాత కొంతకాలానికి 12వ శతాబ్దిలో తిక్కన మహాకవి ఉద్యోగపర్వం మొదలుకొని చివరిదాకా మహాభారతాన్ని రచించాడు.

అరణ్యపర్వంలో మిగిలిన భాగాన్ని (అరణ్యపర్వశేషం) మరికొంత కాలం తరువాత 13వ శతాబ్దిలో ఎఱ్రాప్రగడ పూర్తి చేశాడు. ఇలా ఈ ముగ్గురు కవులూ (కవిత్రయం) తెలుగు మహాభారతాన్ని పూర్తి చేసి లోకానికి అందించారు.

## ఆంధ్రమహాభారత ప్రణాళిక

కవిత్రయం వారి మహాభారతంలోనూ 18 పర్వాలు ఉంటాయి. అవి –

**ఆది పర్వము:** అవతారిక, కురువంశం కథ, రాకుమారుల జననం, విద్యాభ్యాసం మొదలైనవి.

**సభా పర్వము:** సభారంగం, మయసభ, జూదం, పాండవుల ఓటమి, రాజ్యం కోల్పోవడం.

**అరణ్య పర్వము:** పాండవుల 12 సంవత్సరాల అరణ్యవాసం.

**విరాట పర్వము:** విరాటరాజు కొలువులో ఒక సంవత్సరం పాటు పాండవుల అజ్ఞాతవాసం.

**ఉద్యోగ పర్వము:** కౌరవ పాండవ సంగ్రామానికి సన్నాహాలూ, రాయబారాలూ.

**భీష్మ పర్వము:** భీష్ముడు సేనాపతిగా సాగిన యుద్ధం.

**ద్రోణ పర్వము:** ద్రోణుని నాయకత్వంలో సాగిన యుద్ధం.

**కర్ణ పర్వము:** కర్ణుడి నాయకత్వంలో సాగిన యుద్ధం.

**శల్య పర్వము:** శల్యుడు సారథిగా, తరువాత నాయకుడిగా సాగిన యుద్ధం. దుర్యోధనుడి మరణం.

**సౌప్తిక పర్వము:** నిద్రపోతున్న ఉపపాండవులను అశ్వత్థామ హతమార్చడం.

**స్త్రీ పర్వము:** గాంధారి మొదలైన కౌరవ స్త్రీలు, మరణించినవారికోసం రోదించడం.

**శాంతి పర్వము:** యుధిష్ఠిరుడికి రాజ్యాభిషేకం చెయ్యడం, భీష్ముడి ధర్మబోధ.

**ఆనుశాసనిక పర్వము:** భీష్ముడి ఉపదేశాలు (అనుశాసనాలు).

**అశ్వమేధ పర్వము:** యుధిష్ఠిరుడి అశ్వమేధయాగం నిర్వహణ.

**ఆశ్రమవాస పర్వము:** ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవి మొదలైనవాళ్ళంతా చివరి రోజులలో ఆశ్రమంలో జీవించడం.

**మౌసల పర్వము:** యదువంశంలో ముసలం పుట్టి, అంతఃకలహాలతో యాదవవంశం నాశనం కావడం.

**మహాప్రస్థానిక పర్వము:** పాండవులు మరణ పర్యంతం సుదూర ప్రయాణం చేయడం.

**స్వర్గారోహణ పర్వము:** పాండవులు స్వర్గాన్ని చేరడం.

వీటిలో మొదటి అయిదు పర్వాలను 'ఆదిపంచకము' అనీ, తరువాత ఆరు పర్వాలను 'యుద్ధషట్కము' అనీ, ఆ తరువాత ఏడు పర్వాలను 'శాంతిసప్తకము' అనీ అంటారు. శ్రీకృష్ణుడి జీవితగాథ కూడా మహాభారతంలో భాగమే. హరివంశం రచిస్తేనే మహాభారతం పూర్తి అయినట్లు లెక్క. అందుకే తెలుగు మహాభారతాన్ని అరణ్యపర్వశేషంగా రచించిన ఎఱ్ఱన మహాకవే హరివంశపురాణాన్ని కూడా తెలుగులో రచించి మహాభారతరచనను పూర్తి చేసి లోకానికి అందించాడు.

## కథా ప్రారంభం

అది నైమిశారణ్యం. అక్కడ శౌనకమహర్షి 12 సంవత్సరాలు నడిచే సత్త్రయాగం ఒకటి చేస్తున్నాడు. అప్పుడు అక్కడికి సూతమహర్షి వచ్చాడు. ఇతడి పేరు ఉగ్రశ్రవసుడు. ఈయన రోమహర్షణుడి కుమారుడు. శౌనకాది మునులు వినయంగా చేతులు జోడించి –

**కం. ఏయది హృద్య మపూర్వం**
**బేయది యెద్దాని వినిన నెఱుక సమగ్రం**
**బై యుండు నఘనిబర్హణ**
**మేయది యక్కథయ వినఁగ నిష్టము మాకున్ (ఆది:1-30)**

'సూతమహర్షీ! **ఏ కథ మనోహరమో, ఏది ఇంతకుముందెన్నడూ జరగలేదో, దేన్ని వింటే సమగ్రమైన జ్ఞానం లభిస్తుందో, ఏది పాపాలని తొలగించేదో ఆ కథ వినటం అంటే మాకు చాలా ఇష్టం'** అని వేడుకున్నారు.

వాళ్ళు అలా కోరిన మీదట సూతమహర్షి ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

"పూర్వం వేదాలు నాలుగూ ఒకటిగానే ఉండేవి. వాటిని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని కృష్ణద్వైపాయన మహర్షి విభజించాడు. వేదాల్ని వ్యసనం (విభాగం) చేశాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అనే పేరు వచ్చింది.

వాటికి తన శిష్యులైన పైలుడు, వైశంపాయనుడు, సుమంతుడు, జైమిని అనే వారి చేత సూత్రాలు రాయించాడు వేదవ్యాసుడు. తరువాత బ్రహ్మగారి ఆదేశంతో 18 పురాణాలూ రచించాడు. ఆ తరువాత వేదంలోని సారాన్నంతటినీ సామాన్య జనులకు కూడా అందేలా సంస్కృతంలో మహాభారతాన్ని రచించాడు. దీనికి 'జయసంహిత' అని పేరుపెట్టాడు. ఇది మొదట 8,800 శ్లోకాలు కలది మాత్రమే. తరువాత లక్ష శ్లోకాల వరకూ విస్తరించి మహాభారతం అయ్యింది. ఈ మహాభారతాన్ని –

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని,
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని
యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యం బని మహిఁ గొనియాడుచుండ

ఆ.వె. వివిధవేద తత్త్వవేది వేదవ్యాసుఁ
దాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండఁ జేసె భారతంబు (ఆది:1-32)

ధర్మశాస్త్రం తెలిసినవాళ్ళు ఇది ధర్మశాస్త్ర గ్రంథం అనీ, ఆధ్యాత్మికవేత్తలు వేదాంత గ్రంథం అనీ, నీతిశాస్త్రజ్ఞులు నీతిశాస్త్రం అనీ, కవీంద్రులు మహాకావ్యం అనీ, లాక్షణికులు చక్కని లక్షణ గ్రంథం అనీ, ఇతిహాస నిపుణులు ఇది మంచి ఇతిహాసగ్రంథమనీ, పౌరాణికులేమో పురాణ గ్రంథమనీ అంటుంటారు. అలాంటి మహాభారతాన్ని వేదవేత్త, సాక్షాత్తు విష్ణుస్వరూపుడు అయిన వేదవ్యాసుడు సకల జనులకు మేలు చేకూర్చేదిగా (విశ్వస్మై జనాయ హితం) రచించాడు.

వ్యాసుడు రచించిన భారతంలో 100 పర్వాలు ఉన్నాయి. దీనిని వ్యాసుడు మూడు సంవత్సరాలలో రచించాడు. దీనిని వ్యాప్తి చేయడానికి నారదమహర్షిని స్వర్గలోకానికీ, దేవలుణ్ణి పితృలోకానికీ, తన కుమారుడైన శుకమహర్షిని గరుడ-గంధర్వ-యక్ష-రాక్షస లోకాలకూ, సుమంతుణ్ణి సర్పలోకానికీ, వైశంపాయనుణ్ణి భూలోకానికీ పంపించాడు.

మహాభారత యుద్ధం 18 రోజులు జరిగింది. దానికి భీష్ముడు 10, ద్రోణుడు 5, కర్ణుడు 2, శల్యుడు సగం రోజు యుద్ధం చేయగా, మిగిలిన సగం రోజులో భీముడు - దుర్యోధనుడు గదాయుద్ధం చేశారు.

ఈ యుద్ధంలో పాండవుల పక్షంలో ఏడు అక్షౌహిణుల సైన్యం, కౌరవుల పక్షంలో పదకొండు అక్షౌహిణుల సైన్యం పాల్గొంది. శమంతపంచకం అనే ప్రదేశంలో జరిగిన ఈ యుద్ధంలో ఇంత సైన్యమూ నశించింది.

పూర్వం తన తండ్రిని చంపినందుకు పరశురాముడు ఇరవై ఒక్కసార్లు క్షత్రియవంశాల్ని నిర్మూలించాడు. ఆ రాజుల రక్తం పారిన ప్రదేశమే శమంత పంచకం.

1 రథం, 1 ఏనుగు, 3 గుర్రాలు, 5 మంది సైనికులు గల సైన్యానికి 'పత్తి' అని పేరు. 3 పత్తులు ఒక 'సేనాముఖం'. 3 సేనాముఖాలు – ఒక గుల్మం. 3 గుల్మాలు ఒక గణం. 3 గణాలు ఒక వాహిని. 3 వాహినులు ఒక పృతన. 3 పృతనలు ఒక చమువు. 3 చమువులు ఒక అనీకిని. 10 అనీకినులు ఒక అక్షౌహిణి. అంటే 21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65,610 గుర్రాలు, 1,09,350 సైనికులు. ఇలాంటి 18 అక్షౌహిణుల సైన్యంతో కురుక్షేత్ర యుద్ధం జరిగింది.

## సరమ శాపం

పాండవులలో మధ్యముడు అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు కురుక్షేత్ర యుద్ధంలో మరణించాడు. ఆ అభిమన్యుడి భార్య ఉత్తర. వీరి కుమారుడు పరీక్షిత్తు. ఆ పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు.

అర్జునుడి మునిమనుమడూ, అభిమన్యుడి మనుమడూ, పరీక్షిత్తు మహారాజు కొడుకూ అయిన ఆ జనమేజయుడు ఒక యాగం చేస్తున్నాడు.

సరమ అనే దేవతల కుక్క ఒకటి ఉంది. దాని కుమారుడు సారమేయుడు. జనమేజయుడు యాగం చేసే ప్రాంతానికి వచ్చి ఆడుకుంటున్నాడు. జనమేజయుడి తమ్ముళ్ళు శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు ఆ కుక్క పిల్లను తరిమికొట్టారు. సారమేయుడు ఏడుస్తూ తల్లి వద్దకు పోయి ఆ విషయం చెప్పడంతో సరమ జనమేజయుడి వద్దకు వచ్చి – 'జనమేజయా! నీ తమ్ముళ్ళు జాలి లేకుండా నా కుమారుడిని కొట్టారు. ఇది అధర్మం.

కం. తగు నిది తగదని యెదలో
వగవక సాధులకుఁ బేదవారల కెగ్గుల్
మొగిఁ జేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్ (ఆది: 1-85)

**ఇది తగినది, ఇది తగనిది అనే యుక్తాయుక్తవిచక్షణ లేకుండా మంచి వారికి గానీ పేదలకు గాని అపకారం చేస్తే అలా చేసిన నీతిహీనులకు అనుకోని ఆపదలు వచ్చిపడతాయి'** అని పలికి అక్కడి నుండి వెళ్ళిపోయింది.

యజ్ఞం పూర్తిచేసి జనమేజయుడు హస్తినాపురానికి వెళ్ళిపోయాడు. వెళ్ళాడుకానీ సరమ మాటలు అతడి చెవుల్లో మార్మోగుతున్నాయి. జరిగిన అపరాధానికి పరిహారం చేసుకోకపోతే సమస్యలు ఎదురవుతాయని భావించిన జనమేజయుడు శాంతి జరిపించడానికి తగిన ముని కోసం అన్వేషించాడు. ఆ ప్రయత్నంలోనే శ్రుతశ్రవసుడు అనే ఒక మహర్షిని కలుసుకున్నాడు. అతడికి నమస్కరించి 'అయ్యా! మీ కుమారుడైన సోమశ్రవసుణ్ణి నాకు ఋత్విక్కుగా పంపించండి' అని ప్రార్థించాడు. అందుకు శ్రుతశ్రవసుడు అంగీకరించి, తన కుమారుడిని జనమేజయుని వద్దకు పంపాడు. జనమేజయుడు అతడి సాయంతో అనేక పుణ్యకార్యాలు చేశాడు.

## ఉదంకోపాఖ్యానం

వ్యాసమహర్షి శిష్యుడైన పైలుడి శిష్యుడు ఉదంకుడు అనే ఒక మునికుమారుడు గురుకులంలో విద్యను అభ్యసించాడు. ఉదంకుడు గురువులను భక్తితో సేవించి, అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అనే అష్టసిద్ధులు పొందాడు.

ఒక రోజు ఉదంకుడు గురువు దగ్గరకు వెళ్ళి గురుదక్షిణ ఇవ్వాలనుకున్నట్లు చెప్పాడు. అప్పుడు గురుపత్ని గురుదక్షిణగా పౌష్యుడి భార్య కుండలాలు తెచ్చి ఇమ్మని అడిగింది. ఉదంకుడు అందుకు అంగీకరించాడు. వెంటనే పౌష్యమహారాజు వద్దకు బయలుదేరాడు. అలా వెళ్తున్న సమయంలో ఒక దివ్యపురుషుడు అతడికి

కనిపించి గోమయం (ఆవుపేడ) తినమని సూచించాడు. ఉదంకుడు మారుమాట్లాడకుండా అలాగే చేశాడు.

ఆ తరువాత ఉదంకుడు పౌష్యుడి వద్దకు వెళ్ళి 'నేను నా గురుపత్నికి గురుదక్షిణగా మీ భార్య కుండలాలను తెచ్చి ఇస్తానని మాట ఇచ్చాను. అవి నాకు ఇప్పించారంటే నేను తీసుకొని వెళ్ళిపోతాను' అని అడిగాడు.

ఉదంకుడి కోరికను మన్నించిన మహారాజు 'మహాత్మా ! నా భార్య వద్దకు వెళ్ళి ఆమెను అడిగి ఆ కుండలాలను ఆవశ్యం తీసుకు వెళ్ళండి' అని బదులిచ్చాడు.

ఉదంకుడు అలాగే పౌష్యమహారాణి వద్దకు వెళ్ళాడు. కానీ అక్కడ ఆమె కనిపించక తిరిగి మహారాజు వద్దకు వచ్చి 'మహారాజా! నాకు ఆమె కనిపించ లేదు. కాబట్టి మీరు వెళ్ళి తెచ్చి ఇవ్వండి' అన్నాడు.

పౌష్యమహారాజు 'మహాత్మా! ఆమె మహాపతివ్రత, చాలా పవిత్రురాలు, ఆమె కనిపించాలంటే శౌచం పాటించాలి' అని చెప్పాడు.

ఉదంకుడికి అప్పుడు తాను గోమయం తిన్నాక స్నానం చెయ్యని విషయం గుర్తుకు వచ్చింది. కాళ్ళు చేతులు కడుగుకొని ఆచమనం చేసి తిరిగి వెళ్ళాడు. అప్పుడు అతడికి పౌష్యమహాదేవి కనిపించింది. ఆమె ఉదంకుడి కోరిక మీద కుండలాలను ఇస్తూ 'మునికుమారా! ఆ తక్షకుడు ఒక సర్ప జాతివాడు. ఈ కుండలాలను దొంగిలించాలని చాలా కాలంగా కాచుకొని ఉన్నాడు. అతడు మాయావి. జాగ్రత్త. నువ్వు ఈ కుండలాలు అతడి కంట బడకుండా జాగ్రత్తగా తీసుకుని పో' అని చెప్పింది.

**పౌష్యుడి అభ్యర్థనపై ఉదంకుడు భోజనానికి కూర్చున్నాడు. ఆహారంలో ఒక వెంట్రుక వచ్చింది. అందువల్ల ఆహారం అపవిత్రం అయిందని కోపంతో పౌష్యుణ్ణి గుడ్డివాడివి కమ్మని శపించాడు ఉదంకుడు.**

'నీకు సంతానం కలుగకపోవుగాక' అని ప్రతిశాపం ఇచ్చాడు పౌష్యుడు. ఉదంకుడు వెంటనే – 'రాజా! నాకు సంతానం కావాలి. శాపం ఉపసంహరించుకో' అని వేడుకున్నాడు. అప్పుడు రాజు –

ఉ. నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు, నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుఁ డోపు, నో
పం డతిశాంతుఁ డయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపగన్

(ఆది:1-100)

ఉదంకా! బ్రాహ్మణుల మనసు అప్పుడే చిలికి తీసిన వెన్నపూసలాగా మృదువుగా ఉంటుంది. మాట వజ్రాయుధంలా కఠినంగా ఉంటుంది. క్షత్రియులకు మనసు కర్కశం. మాట సౌమ్యం. కాబట్టి కోమల హృదయం గల నువ్వు శాపాన్ని వెనక్కి తీసుకోగలవు. కఠిన హృదయం గల నేను అలా వెనక్కి తీసుకోలేను' అన్నాడు. అప్పుడు ఉదంకుడు 'నా శాపం కొద్ది కాలమే ఉంటుంది లే!' అని చెప్పి బయలుదేరాడు. దారిలో ఒక సరస్సు కనిపించింది. ఆ కుండలాలను అక్కడే ఒక శుభ్రమైన ప్రదేశంలో ఉంచి, ఆచమనం చేసుకోవడానికి వెళ్ళాడు.

తక్షకుడు నగ్నంగా వచ్చి వాటిని తీసుకొని నాగలోకానికి పారిపోయాడు. ఉదంకుడు వెంటపడ్డాడు. నాగలోకంలో ఉదంకుడికి మొదట ఆదిశేషుడు కన్పించాడు.

చం. బహువన పాదపాబ్ధికుల పర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యయైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్

(ఆది:1-104)

'అనేక వనాలు, వృక్షాలు, సముద్రాలు, కులపర్వతాలు, నదులూ మొదలైన వాటితో కూడిన భూభారాన్ని నిరంతరమూ తన వేయిపడగలపై ధరిస్తూ భరింప శక్యం కానివాడూ, శ్రీమహావిష్ణువునకు నిరంతరం పాన్పుగా ఉండేవాడూ, సర్పరాజూ, పాపాలను పోగొట్టేవాడూ అయిన అనంతుడు మాకు ప్రసన్నుడగుగాక' అంటూ స్తుతించాడు.

ఆ తరువాత వాసుకినీ, ఐరావతులనే సర్పరాజులనూ, తక్షకుణ్ణీ స్తుతించి, వీరందరూ నాపట్ల అనుగ్రహాన్ని చూపించుదురు గాక' అని వేడుకొన్నాడు.

అక్కడ తెలుపు నలుపు దారాలతో వస్త్రాలను నేస్తున్న ఇద్దరు స్త్రీలు, 12 ఆకుల చక్రాన్ని తిప్పుతున్నారు. వీరికి ఆరుగురు కుమారులు ఉన్నారు. అలాగే ఒక పెద్ద గుర్రంపై ఒక దివ్యపురుషుడు కనిపించాడు. వీళ్ళందరినీ చూశాడు ఉదంకుడు. ఉదంకుడు ఆ దివ్యపురుషుణ్ణి 'నాకు ఈ నాగులు వశమై ఉండాలి. అనుగ్రహించు' అన్నాడు.

దానికి దివ్య పురుషుడు 'అయితే ఈ గుర్రం చెవిలో గట్టిగా ఊదు' అన్నాడు. ఉదంకుడు ఊదాడు. అప్పుడా గుర్రం నుండి భయంకరమైన అగ్నిజ్వాలలు పుట్టుకొచ్చాయి. నాగులన్నీ భయంతో వణికిపోయాయి. తక్షకుడు భయపడి కుండలాలు తెచ్చి ఇచ్చాడు. వాటిని తెచ్చి గురుపత్నికి ఇచ్చాడు ఉదంకుడు.

'పక్కనే ఉన్న పౌష్యుడి దగ్గరకి వెళ్ళి రావడానికి ఇంత ఆలస్యమా?' అన్నాడు గురువుగారు. ఉదంకుడు జరిగినదంతా చెప్పాడు.

అప్పుడు గురువుగారు – 'ఉదంకా! ఆ దివ్య పురుషుడు ఇంద్రుడు. ఆ ఎద్దు– ఐరావతం. నువ్వు తిన్న ఆవుపేడ – అమృతం. నాగలోకంలో నువ్వు చూసిన స్త్రీలు – ధాత, విధాత. తెలుపు, నలుపు దారాల వస్త్రాలు – రాత్రి, పగలు. 12 ఆకుల చక్రం – సంవత్సరం. ఆరుగురు కుమారులు – ఋతువులు. ఆ గుర్రంపై వచ్చిన వాడు – ఇంద్రుడి మిత్రుడు పర్జన్యుడు. అని తెలియజేసి నువ్వు గురుదక్షిణ చెల్లించుకున్నావు. ఇంక నువ్వు వెళ్ళవచ్చు' అని పంపివేశాడు.

ఉదంకుడు జనమేజయ మహారాజు వద్దకు వచ్చి తక్షకుడి మీద కోపంతో అతణ్ణి ఎలాగైనా చంపాలని ఇలా అన్నాడు. రాజా!

**ఉ. కాదన కిట్టిపాటి యపకారముఁ దక్షకుఁ డేకవిప్ర సం**
**బోధనఁ జేసి చేసె నృపపుంగవ! నీవు ననేక భూసురా**
**పాదిత సర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కా**
**కోదర సంహతిం హుతవహోగ్ర సమగ్ర శిఖాచయంబులన్**

**(ఆది:1–124)**

ఆ తక్షకుడు ఒక బ్రాహ్మణుడి ప్రేరణవల్ల, కాదనకుండా నీ తండ్రిని చంపి ఇంతటి మహాపకారాన్ని చేశాడు.కాబట్టి నువ్వు కూడా అనేక బ్రాహ్మణులతో సర్పయాగం చేయించి ఆ యాగంలో చెలరేగే మహోగ్రమైన అగ్నిశిఖలలో ఆ తక్షకుడితోబాటు సర్పజాతి నంతటినీ భస్మం చెయ్యి, అంటూ ఉదంకుడు జనమేజయుడిని సర్పయాగానికి ఉసిగొల్పాడు. ఒక్క తక్షకుడు చేసిన తప్పుకి సర్పజాతి అంతా ఎందుకయ్యా బలికావడం? అని అడుగుతావేమో. 'ఓ రాజా! ఇదీ విను.

**ఉ. ప్రల్లదుడైన యొక్క కులపాంసను చేసిన దాన దత్కులం**
**బెల్లను దూషితం బగుట యేమి యపూర్వము? కావునన్ మహీ**
**వల్లభ తక్షకాధము నెపంబున సర్పములెల్ల నగ్నిలో**
**ద్రెళ్ళగ సర్పయాగ మతిధీయుత చేయుము విప్రసన్నిధిన్**

**(ఆది:1-125)**

కులనాశకుడైన ఒక్క దుర్మార్గుడివల్ల ఆ కులమంతా దూషింపబడటం కొత్త విషయమేమీ కాదు కదా. అలాగే ఒక్క తక్షకుడి వల్ల సర్పజాతికంతటికీ ఆ దోషం చుట్టుకుంది. కాబట్టి ఆ పాములన్నీ అగ్నిలో మాడిపోయేట్టుగా నువ్వు సర్పయాగాన్ని తప్పకుండా చెయ్యి' అన్నాడు. జనమేజయుడు అంగీకరించాడు.

అప్పుడు వెంటనే శౌనకాది మహర్షులు ఆశ్చర్యంగా 'మహర్షీ! అసలు జనమేజయుడు చేసిన ఆ సర్పయాగంలో సర్పజాతి మొత్తం భస్మం కావడానికి కారణం ఏమిటి? మాకు తెలుసుకోవాలని ఉంది. వివరంగా సెలవియ్యండి.' అని వేడుకున్నారు.

అప్పుడు సూతుడు 'అందుకు కారణం సర్పాల తల్లి కద్రువ. ఆమె సర్పాలకు ఇచ్చిన శాపంవల్లనే అవి భస్మం అయ్యాయి' అంటూ ఇలా ప్రారంభించాడు.

## భృగువంశకీర్తనం

మహర్షులారా! పూర్వం భృగువు అనే మహాముని ఉండేవాడు. అతడి భార్య పులోమ. ఆమె నిండు గర్భవతిగా ఉన్న సమయంలో భృగువు స్నానానికి వెళ్తూ

భార్యని హోమాగ్నిని సిద్ధం చేయమన్నాడు. అప్పుడు పులోముడు అనే ఒక రాక్షసుడు వచ్చి పులోమను చూశాడు. అంతే. అతడికి ఈ పులోమ మీద మోహం కలిగింది.

అప్పుడా పులోముడు అగ్నిదేవుడి దగ్గరకు వెళ్ళి ఆమె ఎవరని అడిగాడు. అగ్నిదేవుడు ఇరకాటంలో పడ్డాడు. ఎందుకంటే ఈ పులోముడే ఒకప్పుడు పులోమను పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాడు. అయితే పులోమ తండ్రి ఆమెను భృగువుకు ఇచ్చి వివాహం చేశాడు. ఇప్పుడు నిజం చెప్తే పులోముడు పులోమను ఏమి చేస్తాడో ఏమో.. ఒకవేళ వాడు ఏమైనా చేస్తే అందుకు కారణం తానే అవుతాడు. కాబట్టి భృగువు తనను శపించకమానడు. కానీ నిజం చెప్పకపోతే తనకు అసత్య దోషం అంటుకుంటుంది. ఇలా ఆలోచించి సరే. ముని శపిస్తే శపించాడు కానీ తాను అసత్యం ఆడనని నిశ్చయించుకొన్నాడు.

**తే.గీ. అనఁగ నగ్నిదేవుఁ డనృతంబునకు విప్ర**
**శాపమునకు వెఱచి 'శాపభయము**
**దీర్చుకొనఁగఁ బోలుఁ దీర్పరా దనృతాభి**
**భాషణమున నైన పాపభయము' (1-2-129)**

అలా అసత్య దోషానికి భయపడి 'ఆమె భృగువు భార్య' అని నిజం చెప్పాడు. అది వినగానే పులోముడు పులోమను గుర్తు పట్టాడు. తాను చేసుకోవాలనుకున్న పులోమను భృగువు వివాహం చేసుకున్నాడు కాబట్టి వాళ్ళమీద ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఇన్నాళ్ళకు తనకు కలిగిందని సంబరపడ్డాడు పులోముడు. వెంటనే వరాహరూపంలో వచ్చి పులోమను ఎత్తుకుని వెళ్ళాడు. అలా తీసుకు వెళ్ళేటప్పుడు ఆ కుదుపులకు పులోమగర్భంలోని శిశువు జారి కింద పడ్డాడు. అలా కింద పడినందువల్ల అతడికి చ్యవనుడు అనే పేరు వచ్చింది.

చ్యవనుడు కళ్ళు తెరచి చూశాడు. అతడి తేజస్సుకు పులోముడు దగ్ధం అయిపోయాడు.

తరువాత పులోమ కుమారుడితో సహా భర్త దగ్గరకు చేరింది. ఆ సమయంలో పులోమ కంటి నుండి కన్నీరు ప్రవహించింది. అలా జాలువారిన కన్నీరే ఒక నదిగా మారి ప్రవహించ సాగింది. ఆ నదికి బ్రహ్మదేవుడు వధూసర అని పేరు

పెట్టాడు. నదీ స్నానానికి వెళ్ళిన భృగువు ఆశ్రమానికి తిరిగి వచ్చి తేజస్వంతుడైన కుమారుడిని చూశాడు. అప్పుడు పులోమ జరిగినదంతా భర్తకు చెప్పింది.

అప్పుడు భృగువు కోపించి అగ్నిదేవుడితో 'ఆ రాక్షసుడు నా భార్యకు అపకారం చేస్తాడని తెలిసీ నువ్వు నా భార్య గురించి చెప్పావు కాబట్టి నువ్వు క్రూరుడివీ, సర్వభక్షకుడివీ అగుగాక!' అని అగ్నిదేవుడిని శపించాడు.

దానికి అగ్నిదేవుడు 'మహర్షీ! అసత్యం పలికిన వాడు నరకానికి పోతాడని నీకు తెలియదా! నేను అసత్యదోషానికి భయపడే అలా చెప్పాను. కర్మసాక్షిని అయిన నేను అసత్యం పలుకగలనా! నా అపరాధం ఏమీ లేకుండానే నాకు నువ్వు శాపం ఇచ్చావు. నేనూ నీకు ప్రతిశాపం ఇవ్వగలను. అయినా, పరుషోక్తులు పలికినా, కొట్టినా, తిట్టినా ఉత్తమ బ్రాహ్మణులు పూజనీయులే! నేను ఎల్లప్పుడూ బ్రాహ్మణులను పూజిస్తాను. బ్రాహ్మణుల మీద కోపించడానికి భయపడతాను. నువ్వు ఉత్తమ బ్రాహ్మణుడివి. కాబట్టి నేను నిన్ను శపించను. సమస్త లోకాలకు హితం చేసే నన్ను శపించి లోకాలకు అపకారం చేశావు. నిత్య నైమిత్తిక పూజలో భాగంగా అగ్నిలో వేసే హోమద్రవ్యాలను (హవిస్సులను) తీసుకు వెళ్ళి దేవతలకు, పితరులకు ఇస్తాను. అందు వల్ల నన్ను హవ్యవాహనుడు అని అంటారు. నీ శాపకారణంగా నేనిక అపవిత్రుడిని ఔతాను కాబట్టి నే నా పని చెయ్యలేను. నే నా పని చేయకపోతే లోకాలు స్తంభిస్తాయి' అని చెప్పాడు.

అసత్యదోషానికి భయపడి నిజం చెప్పిన తనకు వచ్చిన శాపానికి కలత చెందాడు అగ్నిదేవుడు. సర్వభక్షకుడైన తాను పితృకార్యానికి, దేవకార్యానికి పనికి రానని తన జ్వాలలను తాను ఉపసంహరించాడు. లోకంలో దేవక్రతువులు, యజ్ఞయాగాలు అన్నీ ఆగి పోయాయి. దేవతార్చనల్లో దీపాలు ఆరిపోయాయి. పితరులకు చేసే పిండప్రదానాలూ ఆగి పోయాయి. ప్రజలు హాహాకారాలు చేస్తూ మహర్షుల వద్దకు వెళ్ళారు. వారంతా దేవతల వద్దకు వెళ్ళారు. దేవతలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళారు.

బ్రహ్మదేవుడు అగ్నిదేవుని అనునయించి 'అగ్నిదేవా! సమస్త ప్రాణులకూ నువ్వు యజమానివి. చరాచర సృష్టికి నువ్వే కారణం. సమస్త దేవతలకు నువ్వు ముఖంలాంటి వాడివి. నువ్వు ఇలా చెయ్యడం ధర్మం కాదు. భృగువు వాక్కు అసత్యం కాదు. సర్వభక్షకుడివి అయినా నువ్వే సర్వ కార్యాలలో ప్రథముడివి. నువ్వు ఎప్పటికీ పవిత్రుడివే. శుచులలో శుచివి, పూజింప తగిన వారిలో అగ్రపూజ్యుడివి. కాబట్టి నీ తేజస్సును తిరిగి ప్రజ్వలింప చెయ్యి. బ్రాహ్మణుల సహాయంతో దేవతలకు హవిస్సును అందించు' అని అర్థించాడు. అందుకు అగ్నిదేవుడు సమ్మతించాడు.

## రురుడు – ప్రమద్వర

ఆ చ్యవనుడికి శర్యాతి కుమార్తె సుకన్యకూ వివాహమయ్యింది. వారికి ప్రమతి అనే కుమారుడు ఉన్నాడు. ప్రమతికి క్షీరసాగర మథన సమయంలో అమృత కలశంతో పుట్టిన 'ఘృతాచి' అనే అప్సరసతో వివాహం జరిగింది.

ప్రమతికీ ఘృతాచికీ పుట్టిన కుమారుడే రురుడు. రురుడు స్థూలకేశుడు అనే మహర్షి ఆశ్రమంలో పెరుగుతున్న ప్రమద్వరను వివాహం చేసుకోవాలని అనుకున్నాడు.

ఆ ప్రమద్వర – విశ్వావసువు అనే గంధర్వరాజుకూ మేనకకూ పుట్టిన కుమార్తె. ఆమె ఒక రోజు పాముకాటుతో మరణించింది.

ప్రమద్వర మరణానికి ఆశ్రమవాసులు బాధపడుతూ ఉంటే అది విన్న రురుడు రోదిస్తూ అరణ్యంలోకి పరుగు పరుగున వెళ్ళాడు.

రురుడు ఏడుస్తూ ప్రమద్వరను బ్రతికించమని 'ఓ దేవతలారా! ఓ బ్రాహ్మణులారా! నేను దేవయజ్ఞాలు, వేదాధ్యయనం, వ్రతాలు, పుణ్యకార్యాలూ చేసిన వాడిని అయితే, నేను నా గురువులను భక్తితో సేవించిన వాడినే అయితే, నేను ఘోరమైన తపస్సు చేసిన వాడినే అయితే నా ప్రేయసి ప్రమద్వరకు మీ దయ వల్ల విషం నుండి విముక్తి కలుగు గాక' అని ప్రార్థించాడు.

అలాగే 'మంత్ర తంత్రాలు, విషం విరుగుడు వైద్యం తెలిసిన వాళ్ళు ఎవరైనా ప్రమద్వర విషాన్ని హరిస్తే అతడికి నా తపః ఫలాన్నే కాదు, అధ్యయనఫలాన్ని కూడా ధారపోస్తాను' అని రోదించాడు.

అప్పుడు ఆకాశం నుండి ఒక దేవదూత 'బ్రాహ్మణోత్తమా! ప్రమద్వర కాలవశాత్తూ మరణించింది. ఆయుష్షు తీరిపోతే ఆపడం ఎవరి తరం? అయినా దానికి నేను ఒక ఉపాయం చెప్తాను. ఎవరైనా తమ ఆయుష్షులో సగం ఇస్తే ఆమె బ్రతుకుతుంది' అని చెప్పాడు. రురుడు అందుకు అంగీకరించి, తన ఆయుర్దాయంలో సగం ఇచ్చి ఆమెను బ్రతికించుకొని వివాహం చేసుకున్నాడు.

అప్పటినుండీ సర్పాల మీద రురుడికి పగ. కనిపించడం పాపం. పాములను కర్రతో కొట్టి మరీ చంపడం ప్రారంభించాడు. చెట్ల వెంటా పుట్టల వెంటా తిరుగుతూ కనిపించిన పాములను చంపేస్తున్నాడు. అలా చంపుతూ ఒక రోజు దుండుభం అనే ఒక పామును చంపడానికి కర్రను పైకి ఎత్తాడు.

ఆ పాము భయపడి 'అయ్యా! నువ్వు బ్రాహ్మణుడివి. అందులోనూ నీ ముఖంలో తేజస్సు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇలా పాములను చంపడానికి కారణం ఏమిటి? అని అడిగింది.

దానికి రురుడు 'నా పేరు రురుడు. నేను ప్రమద్వర అనే ఆమెను ప్రేమించాను. నేను ప్రాణప్రదంగా ప్రేమించిన ప్రమద్వరను ఒక పాము కాటు వేసింది. అందు వల్ల నేను పాములను చంపుతున్నాను. నిన్ను కూడా చంపుతాను' అని చెప్పి కర్రను పైకెత్తాడు. వెంటనే ఆ పాము ఒక మహర్షిగా మారి ఇలా చెప్పసాగింది.

'నేను సహస్రపాదుడు అనే మునీశ్వరుడిని. నా సహచరుడు ఖగముడు. అతడు ఒక రోజు అగ్ని కార్యం చేస్తున్నాడు. ఆసమయంలో నేను అతడి మీద పరిహాసంగా గడ్డితో చేసిన పాముని వేశాను. అతడు నాపై కోపించి నన్ను విషం లేని పాముగా పడి ఉండమని శపించాడు'. 'ఏదో సరదాకి చేస్తే నన్ను ఇలా శపిస్తావా! క్షమించలేవా?' అని ప్రార్థించాను. నా ప్రార్థన మన్నించి ఖగముడు – 'మిత్రమా! నా మాట జరిగి తీరుతుంది. అయినా నువ్వు పాముగా పడి ఉన్న

తరుణంలో రురుడు అనే భృగువంశీయుడు వస్తాడు. అతడిని చూడగానే నీకు నీ రూపం వస్తుంది' అని చెప్పాడు.

'అయ్యా! మీరు బ్రాహ్మణులు. దయాగుణం కలవాళ్ళు. పూర్వం నీ తండ్రి శిష్యుడైన ఆస్తీకుడు కద్రువశాప కారణంగా సర్పయాగంలో ఆహుతి అవుతున్న పాములను కాపాడాడు. నువ్వు కూడా పాములను చంపడం ఆపలేవా?' అన్నాడు. అది విన్న రురుడు అప్పటినుండి పాములను చంపడం ఆపివేశాడు" అన్నాడు సూత మహర్షి.

ఈ కథను వింటున్న మహర్షులు 'మహర్షీ! అసలు కన్నతల్లి ఎక్కడైనా కొడుకులకు శాపం ఇస్తుందా? చాలా ఆశ్చర్యంగా ఉందే! మాకు సవిస్తరంగా చెప్పండి'అని వేడుకున్నారు కుతూహలంగా.

దానికి సూతమహర్షి చిరునవ్వు చిందిస్తూ సుపర్ణోపాఖ్యానాన్ని ప్రారంభించాడు.

## సుపర్ణోపాఖ్యానం

కద్రువ, వినత కశ్యపప్రజాపతి భార్యలు. ఇద్దరూ గర్భం ధరించారు. కద్రువకు వెయ్యి అండాలు, వినతకు రెండు అండాలు కలిగాయి. కొన్నాళ్లకు కద్రువ అండాలు పగిలి అందులో నుండి వాసుకి, శేషుడు, తక్షకుడు మొదలైన సర్పాలు బయటకు వచ్చాయి.

తనకింకా సంతానం కలగలేదని ఉక్రోషంతో వినత ఒక అండాన్ని బలవంతంగా చిదిమింది. అందులో నుంచి తొడలు వరకే శరీరం ఉన్నవాడు ఒకడు పుట్టాడు. అతడే అరుణుడు (అనూరుడు).

తొందరపడి అండాన్ని పగలగొట్టి తన అంగవైకల్యానికి కారణమైనందుకు అరుణుడు తల్లిని 'నువ్వు నీ సవతికి దాసీవౌతావు' అని శపించి, మళ్లీ తల్లిపై జాలితో 'కనీసం రెండో అండాన్నైనా జాగ్రత్తగా చూసుకో! అందులో నుండి ఒక మహాబలవంతుడు పుడతాడు. అతడే నీ దాస్యాన్ని పోగొడతాడు' అని చెప్పి తాను సూర్యుడికి రథసారథిగా వెళ్ళిపోయాడు.

ఒకరోజు దేవేంద్రుడి వాహనమైన 'ఉచ్చైశ్శ్రవం' అనే తెల్లని గుర్రం సముద్రం ఒడ్డున తిరుగుతోంది. దానిని కద్రువ, వినత ఇద్దరూ చూశారు. ఆ గుర్రం తెల్లగా ఉందనీ దాని తోక మాత్రం నల్లగా ఉందనీ అంది కద్రువ. వినత కాదంది.

'సరే! దాని తోక నల్లగా ఉంటే నువ్వు నాకు దాసివి కావాలి. లేకపోతే నేనే నీకు దాసినవుతాను. పందెమా?' అంది కద్రువ. వినత ఒప్పుకుంది. అప్పటికే చీకటి పడింది. 'రేపు వచ్చి చూద్దాం' అని ఇద్దరూ వెళ్ళిపోయారు.

తరువాతి రోజు వచ్చి చూస్తే నిజంగానే దాని తోక నల్లగా ఉంది. దానికి కారణం కద్రువ పన్నాగం.

కద్రువ తన పుత్రులైన సర్పాలను పిలిచి 'మీరు ఆ గుర్రం తోకను చుట్టుకొని ఉండాలి. దాని తోక నల్లగా కనబడాలి' అని చెప్పింది. వాసుకి మొదలైన చాలామంది అందుకు ఒప్పుకోలేదు. దానికి కోపంతో కద్రువ 'మీరు జనమేజయుడు చేసే సర్పయాగంలో మాడి మసైపోండి' అని శపించింది.

కర్కోటకుడు అనే పాము కద్రువ చెప్పినట్లే చేశాడు. అందుకే గుర్రం తోక నల్లగా కనబడింది. వినత కద్రువకు దాసి అయ్యింది.

కొంతకాలానికి వినతకు రెండో అండం నుంచి గరుత్మంతుడు పుట్టాడు. తల్లితో పాటే తను కూడా కద్రువకూ, ఆమె పుత్రులకూ దాస్యం చెయ్యక తప్పలేదు గరుత్మంతుడికి. అమృతాన్ని తెచ్చి ఇస్తే మీ తల్లీకొడుకుల దాస్యం పోగొడతానంది కద్రువ.

మహాబలవంతుడైన గరుత్మంతుడు బయలుదేరాడు. అతడికి బాగా ఆకలిగా ఉంది. అతడి తండ్రి కశ్యప ప్రజాపతి– 'దారిలో నీకు ఒక పెద్ద ఏనుగు, పెద్ద తాబేలూ కనిపిస్తాయి. వాళ్ళు నిజానికి విభావసుడు, సుప్రతీకుడు అనే ఇద్దరన్నదమ్ములు. ఆస్తికోసం తగాదాపడ్డారు. ఒకరినొకరు శపించుకొని ఇలా గజకచ్ఛపాలుగా పడి ఉన్నారు. వాళ్ళను తిను. నీ ఆకలి తీరుతుంది' అని చెప్పాడు.

గరుడుడు వాటిని తిని, స్వర్గానికి వెళ్ళి, అమృత భాండాన్ని తీసుకొని గాలిలోనికి ఎగిరాడు. విష్ణుమూర్తి అతడి ఉత్సాహానికీ, బలానికీ, వేగానికీ, చేతికి అందివచ్చిన అమృతాన్ని కూడా తాగాలనే ఆసక్తి లేకపోవటానికీ ముచ్చటపడి మెచ్చుకున్నాడు. అమృతం తాగకపోయినా ముసలితనం, చావూ రాకుండా ఉండేట్లూ, తనకు సదా భక్తుడై ఉండేట్లూ గరుడునికి వరాలిచ్చి అతణ్ణి తన వాహనంగానూ, ధ్వజంగానూ చేసుకున్నాడు.

ఇంద్రుడు గరుడుడిపై వజ్రాయుధాన్ని వేశాడు. అది అతడిని ఏమీ చేయలేక పోయింది. దానిని గౌరవించడం కోసం తన శరీరంలోని ఒక ఈకను విదిలించాడు గరుడుడు. ఇంద్రుడు అతడి బలానికి ఆశ్చర్యపోయి, గరుడుడితో స్నేహం చేసుకొని అమృతాన్ని క్రూరులైన సర్పాలకు ఇవ్వవద్దని వేడుకున్నాడు.

అప్పుడు గరుడుడు 'పాములకు అమృతాన్ని ఇవ్వడం వరకే నా పని. నేను ఇచ్చాక మళ్ళీ దానిని నువ్వు తెచ్చుకో! నేను అడ్డురాను' అన్నాడు.

గరుడుడు అమృతకలశాన్ని దర్భలపై ఉంచి 'సర్పాల్లారా! శుచిగా స్నానం చేసి వచ్చి ఈ అమృతాన్ని తాగండి' అని చెప్పి దాస్యవిముక్తుడై తల్లిని తీసుకొని వెళ్ళిపోయాడు.

ఇంతలో ఇంద్రుడు వచ్చి అమృతకలశాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు. సర్పాలు, తీరా స్నానం చేసి వచ్చి చూస్తే అమృతం లేదు. అమృతం తొణికిన దర్భల్ని అవి ఆశగా నాకాయి. అందువల్ల వాటి నాలుకలు రెండుగా చీలిపోయాయి. ఆనాటి నుండి నాగులు ద్విజిహ్వులు అయ్యారు.

అమృతం పెట్టిన కారణంగా దర్భలు పవిత్రం అయ్యాయి. ఇదంతా చూసిన ఆదిశేషుడు తల్లినీ, తమ్ముళ్ళనూ అసహ్యించుకొని, వారిని విడిచి వెళ్ళిపోయాడు. బ్రహ్మను గురించి తపస్సు చేశాడు. అతడి తపస్సుకూ, సత్యసంధతకూ, ధర్మనిష్ఠకూ మెచ్చిన బ్రహ్మదేవుడు భూభారాన్ని మోసే వరాన్ని ఆదిశేషుడికి ప్రసాదించాడు.

## నాగరక్షణ

ఆదిశేషువు వెళ్ళిపోయాడు. ఇక తక్కిన కద్రువకుమారులకు సర్పయాగం భయం పట్టుకుంది. వాసుకి నాగులను పిలిచి – 'బ్రహ్మదేవుడు క్షీరసాగరమథన సందర్భంలో సహాయపడినందుకు నాకు చిరంజీవత్వం అనుగ్రహించారు. కాబట్టి నాకు ప్రాణభయం లేదు. కానీ తక్కిన నాగులను రక్షించే ప్రయత్నం చేయాలి' అన్నాడు. అది విని ఏలాపుత్రుడు అనే సర్పం అమ్మ శాపం ఇచ్చే సమయంలో నేను అమ్మ ఒడిలో పడుకుని దేవతల మాటలు విన్నాను. దేవతలు –

'బ్రహ్మదేవా! ఎంతమాత్రమూ దయ లేకుండా కద్రువ తన కన్న కుమారులకే శాపం ఇచ్చింది. దీనికి విముక్తి లేదా?' అని అడిగారు.

అప్పుడు బ్రహ్మదేవుడు దేవతలతో – 'సర్పాలు లోకానికి హాని చేస్తాయి కాబట్టి ఈ శాపం మంచిదే! అయినా మంచి సర్పాలను రక్షించే ప్రయత్నమూ జరుగుతుంది. జరత్కారుడు, జరత్కారువు అనే పేర్లుగల దంపతులకు పుట్టిన ఆస్తీకుడు ఆ పని చేస్తాడు' అన్నాడు.

ఇదంతా విన్న ఏలాపుత్రుడు ఇప్పుడు నాగులకు చెప్పాడు..

ఆ తరువాత వాసుకి తన సోదరి జరత్కారువు వివాహమాడే జరత్కారుడి కోసం ఎదురు చూస్తున్నాడు.

జరత్కారువు ఒక ముని. అతడు వివాహం చేసుకోకుండా బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తున్నాడు. ఒక రోజు ఒక మడుగు సమీపంలో ఎలుకలు కొరకగా మిగిలిన రెల్లు దుబ్బులను చూశాడు. వాటిని ఆధారం చేసుకుని కొందరు ఋషులు వేలాడుతున్నారు. ఆ ఋషులను చూసి 'మహాత్ములారా! ఇలా తలకిందులుగా ఎందుకు వేలాడుతున్నారు?' అని అడిగాడు. అందుకు వారంతా 'మా వంశంలో పుట్టిన జరత్కారువు అనే ఒక పాపాత్ముడు వివాహం చేసుకోవడం లేదు. మా వంశాభివృద్ధి ఆగిపోయింది. మేము అతడి పితృదేవతలం. అందువల్ల మాకు ఉత్తమగతులు కలగలేదు. నీకు అతడు కనిపిస్తే మా సంగతి వివరించి మాకు ఉత్తమగతులు కలిగించమని చెప్పు' అని వేడుకున్నారు.

అది విని జరత్కారువు పితృరుణం తీర్చుకోవడం కోసం వివాహానికి అంగీకరించి తనపేరులాంటి పేరు కలిగిన కన్య కోసం వెతుకుతున్నాడు. కానీ అతడికి అలాంటి కన్య దొరకలేదు.

అది తెలుసుకున్న వాసుకి తన చెల్లెలిని తీసుకుని జరత్కారుడి దగ్గరకు వెళ్ళాడు.

వాసుకి జరత్కారుడితో 'మహాత్మా! ఈమె నీ పేరు కలిగిన కన్య. ఈమెను వివాహం చేసుకోండి' అన్నాడు.అందుకు సమ్మతించి జరత్కారువును వివాహం చేసుకున్నాడు జరత్కారుడు.

పెళ్ళి అయ్యాక అతడు తన భార్యతో 'నువ్వు నాకు ఎదురు చెప్పిన రోజున నేను నిన్ను విడిచి తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోతాను' అన్నాడు. ఆమె అందుకు అంగీకరించింది.

జరత్కారువు గర్భవతి అయింది. ఒకరోజు భర్త తన ఒడిలో తలపెట్టుకొని నిద్రపోతున్నాడు. అప్పుడు సంధ్యావందనం చేసుకునే సమయం అయ్యింది. ఆ విషయాన్ని చెప్పాలని భర్తను నిద్ర లేపి చెప్పింది.

అందుకు జరత్కారుడు కోపంతో 'నన్ను నిద్ర లేపి అవమానించావు. కాబట్టి మన ఒప్పందం ప్రకారం నేను నిన్ను విడిచి తపస్సుకు వెళ్తాను. నువ్వు నీ అన్న వాసుకి దగ్గరకు వెళ్ళు'అన్నాడు.

జరత్కారువు వాసుకి ఇంటికి వెళ్ళింది. వాసుకి ఇంటికి చేరిన జరత్కారువు ఒక పుత్రుడికి జన్మ ఇచ్చింది. అతడే ఆస్తీకుడు.

ఆస్తీకుడు చ్యవనమహర్షి కుమారుడైన ప్రమతి వద్ద విద్యాభ్యాసం చేశాడు.

## పరీక్షిత్తు శాపం

తక్షకుడి మీద పగ పట్టిన ఉదంకుడు జనమేజయుడికి అతని తండ్రి పరీక్షిత్తు మరణవృత్తాంతం చెప్పి సర్పయాగానికి ప్రోత్సహించాడు.

జనమేజయుడు తన మంత్రులను పిలిచి తన తండ్రి మరణవృత్తాంతం వివరించమని కోరాడు. అప్పుడు మంత్రులు ఇలా చెప్పారు. రాజా మీ తండ్రిగారైన పరీక్షిత్తు మహారాజు వేటకై అడవిలోకి వెళ్ళి ఒక మృగాన్ని వేటాడుతూ శమీకుని ఆశ్రమంలోకి వెళ్ళాడు. అక్కడ తపస్సులో ఉన్నాడు శమీకుడు. అతడిని చూసి 'అయ్యా! నేను వేటాడుతున్న మృగం ఇటుగానీ వచ్చిందా?" అని అడిగాడు.

ధ్యానంలో ఉన్న కారణంగా శమీకమహర్షి బదులివ్వలేదు. ఆగ్రహించాడు పరీక్షిత్తు. అక్కడే చచ్చి పడి ఉన్న ఒక పాముని తీసి అతని మెడలో వేసి హస్తినాపురానికి వెళ్ళిపోయాడు.

శమీకుడి శిష్యుడు కృశుడు ఇది చూశాడు. ఆ సమయంలో శమీకుడి కుమారుడైన శృంగి అక్కడ లేదు. కృశుడు శృంగి దగ్గరకు వెళ్ళి జరిగింది చెప్పాడు.

అది విన్న శృంగి 'అడవిలో తపస్సు చేసుకుంటున్న నా తండ్రిని అవమానించిన పరీక్షిత్తు ఈ రోజు నుండి ఏడు రోజులలో తక్షకుడు అనే సర్పరాజువల్ల మరణించు గాక' అని శపించాడు. తరువాత జరిగినదంతా శృంగి ద్వారా తెలుసుకున్న శమీకుడు ఎంతగానో బాధపడి– కుమారా!

**కం. క్రోధమ తపముం జెఱుచును**
**గ్రోధమ యణిమాదులైన గుణముల బాపుం**
**గ్రోధమ ధర్మక్రియలకు**
**బాధ యగుం గ్రోధిగాఁ దపస్వికిఁ జన్నే! (ఆది:2-173)**

**కోపం తపస్సును పాడుచేస్తుంది. తపస్సు వల్ల లభించిన అణిమాది గుణాలను పోగొడుతుంది. కోపం ధర్మానికి హాని కలిగిస్తుంది. కోపం తపస్వికి తగదు.**

**కం. క్షమ లేని తపసితపమును,**
**బ్రమత్తుసంపదయు, ధర్మబాహ్యు ప్రభు రా**
**జ్యము, భిన్నకుంభమున తో**
**యము లట్టుల యధ్రువంబులగు నివి యెల్లన్ (ఆది:2-174)**

**క్షమాగుణం లేని తపస్వి చేసిన తపస్సు, అజాగ్రత్తపరుడి సంపద, ధర్మాన్ని పాటించని పాలకుడి రాజ్యం, పగిలిన కుండలోని నీటిలా అస్థిరాలు.**

అయితే తపస్సు వ్యర్థమయిపోయిందని కాదు నా బాధ! లోకాన్ని పరిపాలించే రాజు దైవంతో సమానం. కాబట్టి అలాంటి రాజుకు శాపమివ్వడం తగదు 'రాజు లేకపోతే బాధపడేది ప్రజలే కాదు. మనం కూడా.మనం నిశ్చింతగా తపస్సు చేసుకొంటున్నామంటే అది రాజు దయవల్లే కదా! పరీక్షిత్తు ధర్మరక్షకుడు. ఆకలి దప్పులకు ఆగలేక విసుగులో ఈ పని చేసి ఉంటాడు. నీ శాపాన్ని ఉపసంహరించు' అన్నాడు. అందుకు శృంగి అంగీకరించలేదు. శమీకుడు గౌరముఖుడు అనే శిష్యుడిని పిలిచాడు. పరీక్షిత్తుని కలిసి జరిగినది వివరించి ఆపద తొలగే ఉపాయం ఆలోచించమని చెప్పి పంపాడు. గౌరముఖుడి ద్వారా విషయం తెలుసుకున్న పరీక్షిత్తు తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. పాములన్నీ లోకానికి హాని చేస్తుంటే బ్రహ్మదేవుడు పాము కాటుకు మరణించిన వారిని రక్షించే విద్యను ఒకటి కశ్యపుడు అనే ఒక మునికి ఉపదేశించాడు. ఆ కశ్యపుడు పరీక్షిత్తుని రక్షించడానికి బయలుదేరాడు.

అటువైపు శాపాన్ని అమలు చేయడానికి బయలుదేరాడు తక్షకుడు. కశ్యపుడు, తక్షకుడు మార్గమధ్యంలో కలుసుకున్నారు. కశ్యపుడు పరీక్షిత్తుని రక్షించడానికి వెళుతున్నాడని తక్షకుడు తెలుసుకుని – 'పరీక్షిత్తుని రక్షించడం అసంభవం' అన్నాడు. కశ్యపుడు సంభవమేనన్నాడు. తక్షకుడు వెంటనే పక్కన ఉన్న ఒక వృక్షాన్ని కాటు వేసి దీన్ని బతికించు చూద్దాం' అన్నాడు.

కశ్యపుడు ఆ బూడిదను మంత్రించాడు. అంతే! ఆ చెట్టు నవనవలాడుతూ పూర్వస్థితికి వచ్చింది. తక్షకుడు కశ్యపునితో 'మహాత్మా! శృంగి ఇచ్చిన శాపం తిరుగు లేనిది. మహారాజు ఇచ్చేవాటికన్నా నేను అధికం ఇస్తాను. తిరిగి వెళ్ళు' అన్నాడు. కశ్యపుడు జరగబోయే దానిని దివ్యదృష్టితో గ్రహించి, తక్షకుడు ఇచ్చిన కానుకలు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఇదంతా ఆ చెట్టుపైన ఉన్న కట్టెలు కొట్టే వాడొకడు చూసి, హస్తినాపురానికి వచ్చి చెప్పాడు.

తక్షకుడు ఒక పథకం పన్నాడు. నాగకుమారులతో బ్రాహ్మణవేషాలు వేయించాడు. వాళ్ళు వెళ్ళి పరీక్షిత్తుకు పండ్లు సమర్పించారు. ఆ పండ్లలో తాను పురుగులా మారి లోపలికి వెళ్ళాడు. అలా పరీక్షిత్తు దగ్గరకు చేరిన తక్షకుడు, బయటకు వచ్చి విషాగ్నులు చిమ్ముతూ కాటు వేశాడు. అంతే, పరీక్షిత్తు మరణించాడు.

## సర్పయాగము

ఇదంతా జనమేజయుడికి చెప్పిన మంత్రులు 'మహారాజా! ఇది తగదని అనుకోకుండా తక్షకుడు ఒక బ్రాహ్మణుడి ప్రేరణతో నీ తండ్రి మరణానికి కారణమయ్యాడు. కాబట్టి నువ్వు కూడా సర్పయాగం చేసి, తక్షకుడితో సహా పాములన్నింటినీ అంతం చెయ్యి' అన్నారు.

ఈ ఉదంతం విన్న జనమేజయుడు ఆగ్రహించి ఋత్విక్కులను పిలిచాడు. సర్పయాగానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆ సందర్భంలోనే వాస్తు శాస్త్ర నిపుణుడు ఒకడు వచ్చి జనమేజయునితో 'రాజా! సర్పయాగం మంచిదే కానీ ఈ యాగం పూర్తికాదు. మధ్యలో ఆగిపోతుంది' అని చెప్పాడు. అయినా జనమేజయుడు ఆగకుండా తన భార్య వపుష్టమతో కలిసి సర్పయాగం మొదలుపెట్టాడు.

ఋత్విక్కులు మంత్రాలు చదువుతుంటే సర్పాలన్నీ వచ్చి హోమగుండంలో పడుతున్నాయి. తక్షకుడు భయంతో ఇంద్రుణ్ణి ఆశ్రయించాడు. అది గమనించిన ఋత్విక్కులు 'ఇంద్రుడితో సహా తక్షకుడు వచ్చుగాక!' అని మంత్రం చదివారు. ఇంద్రుడు భయపడి తక్షకుణ్ణి విడిచిపెట్టాడు. ఏం చెయ్యాలో తెలియక ఆకాశంలో తిరుగుతున్నాడు తక్షకుడు. అప్పుడు వాసుకి తన చెల్లెలిని ప్రార్థించడంతో ఆమె కొడుకు ఆస్తీకుడు బయలుదేరాడు. జనమేజయుడికి హితబోధ చేసి యాగాన్ని ఆపించాడు. తక్షకుడు ఆపద నుంచి బయటపడ్డాడు.

ఈ యాగానికి వ్యాసమహర్షి, వైశంపాయనుడు మొదలైన మహర్షులెందరో వచ్చారు. జనమేజయుడు అందరినీ సత్కరించాడు. వ్యాసమహర్షికి నమస్కరించి, కౌరవ పాండవుల కథను వినాలని ఉందని దయచేసి వివరించమని జనమేజయుడు కోరాడు. అప్పుడు వేదవ్యాసుడు వైశంపాయనుణ్ణి ఆదేశించడంతో వైశంపాయనుడు –

శా. **ఆయుష్యం బితిహాసవస్తుసముదాయం బైహికాముష్మిక**
**శ్రేయఃప్రాప్తినిమిత్త, ముత్తమసభాసేవ్యంబు, లోకాగమ**
**న్యాయైకాంతగృహంబునాఁ బరగి నానావేదవేదాంతవి**
**ద్యాయుక్తంబగుదానిఁ జెప్పఁదొడఁగెం దద్భారతాఖ్యానమున్ (ఆది: 3-11)**

ఆయువును పెంచేదీ, ఇతిహాసాల కథాసముదాయం అయినదీ, ఈలోకానికి పరలోకాలకూ సంబంధించిన పరమానందాన్ని మానవుడు పొందటానికి కారణమైనదీ, లోకాలకు సంబంధించిన ఆగమాలకూ, న్యాయాలకూ నెలవు అనదగినదీ, అనేక వేదవేదాంత విద్యలతో కూడినట్టిదీ అయిన మహాభారతమనే కథను వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు అంటూ ఉగ్రశ్రవసుడు చెప్పడం ప్రారంభించాడు.

# ఆదిపర్వం

'అత్రి మహర్షి బ్రహ్మమానస పుత్రుడు. ఇతడి కొడుకు చంద్రుడు. చంద్రుడి కొడుకు బుధుడు. ఈ బుధుడు వైవస్వతమనువు కుమార్తె అయిన 'ఇల' ను పెళ్ళి చేసుకున్నాడు. వీరికి పురూరవుడు పుట్టాడు.

పురూరవుడి భార్య దేవనర్తకి అయిన ఊర్వశి. వీరికి – ఆయువు, అమావసువు, ధీమంతుడు, దృఢాయువు, వనాయువు, శతాయువు అనే ఆరుగురు కొడుకులు.

ఆయువు భార్య స్వర్భానవి. వీరికి నహుషుడు, వృద్ధశర్మ, గయుడు, అనేనసుడు కొడుకులు. ఆయువు తరువాత 'నహుషుడు' చక్రవర్తి అయ్యాడు.

వృత్రాసురుణ్ణి చంపిన కారణంగా ఇంద్రుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. దాంతో ఇంద్ర పదవి ఊడిపోయింది. పారిపోయి ఎక్కడో తలదాచుకోవలసి వచ్చింది.

అప్పుడు దేవతలంతా ఆలోచించి నహుషుణ్ణి ఇంద్ర సింహాసనం ఎక్కించారు. పదవీగర్వం నహుషుణ్ణీ వదలలేదు. అహంకారంతో ఇంద్రుడి భార్య అయిన శచీదేవినే కామించాడు. తన కోరిక తీర్చమన్నాడు.

శచీదేవి బృహస్పతిని ఆశ్రయించింది. బృహస్పతి సూచనతో 'నువ్వు సప్తర్షులే బోయీలుగా మోస్తున్న పల్లకి ఎక్కి వస్తే నేను నీ కోరిక తీరుస్తాను' అంది.

నహుషుడు అలాగే చేసి మహర్షుల కోపానికి గురయ్యాడు. అగస్త్య మహర్షి నహుషుణ్ని కొండచిలువగా పడి ఉండమని శపించాడు.

నహుషుడికి యతి, యయాతి, సంయాతి, అయాతి, ఆయతి, ధ్రువుడు అని ఆరుగురు కొడుకులు. యతి, రాజ్యంపై విరక్తితో తపస్సుకు వెళ్ళిపోయాడు.

యయాతి రాజయ్యాడు. ఇతడి భార్య దేవయాని. ఈమె రాక్షసుల గురువైన శుక్రాచార్యుడి కూతురు.

## దేవయాని – శర్మిష్ఠ

యయాతి – దేవయానుల కలయిక, పెళ్ళి విచిత్రంగా జరిగింది. అంతకుముందు దేవయాని కచుణ్ణి ఇష్టపడింది. ఇతడు బృహస్పతి కుమారుడు.

శుక్రాచార్యుడికి మృతసంజీవని విద్య తెలుసు. దానిని నేర్చుకోవడానికి శిష్యుడిగా వచ్చాడు కచుడు. అతణ్ణి దేవయాని ఇష్టపడింది. రాక్షసులు అసూయతో కచుణ్ణి చాలాసార్లు చంపుతూ వచ్చారు. చంపినప్పుడల్లా దేవయాని కోసం శుక్రాచార్యుడు అతణ్ణి బతికిస్తూ వచ్చాడు. ఈసారి ఇలా కాదని రాక్షసులు కచుణ్ణి చంపి, కాల్చి, బూడిద చేసి శుక్రాచార్యుడు తాగే మద్యంలోనే కలిపేశారు.

ఆ విషయం తెలిసిన శుక్రాచార్యుడు మద్యం తాగడం వల్ల వచ్చే అనర్థాలు అన్నీ ఇన్నీ కావని ఇలా బాధపడ్డాడు.

**ఆ.వె. మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్**
**పరఁగఁ బెక్కుసేసి పడయఁ బడిన**
**యట్టి యెఱుక జనుల కాక్షణ మాత్రన**
**చెఱుచు మద్యసేవ సేయ నగునె?**

**కం. భూసురులాదిగఁ గల జను**
**లీ సుర సేవించిరేని యిది మొదలుగఁ బా**
**పాసక్తిఁ బతితు లగుదురు**
**చేసితి మర్యాద, దీని చేకొనుఁడు జనుల్ (ఆది:3-120, 121)**

**'పూర్వం ఎన్నో జన్మల్లో పుణ్యాలు చేసి పొందిన జ్ఞానం మద్యపానం వల్ల క్షణంలో నశిస్తుంది. బ్రాహ్మణులు మొదలైన జనులు ఈ సురను సేవించినట్లయితే వారికి పాపం అంటుకుంటుంది. పతితులై పోతారు. ఇది నా తీర్మానం' అంటూ మద్యపానం చేసినవాళ్ళు నరకానికి పోతారని శపించాడు.** చివరికి మృతసంజీవని విద్య ద్వారా తన పొట్టలో ఉన్న కచుణ్ణి బతికించాడు. కచుడు బయటకు వస్తే

తాను మరణిస్తాడు కాబట్టి, ముందుగా అతడికి ఆ విద్యను నేర్పి, బయటకు వచ్చాక తనను బతికించమని చెప్పాడు. కచుడు అలాగే చేశాడు.

**దేవయాని తనను పెళ్ళాడమని కచుణ్ణి కోరింది. అప్పుడు కచుడు 'దేవయానీ! నువ్వు గురుపుత్రివి. అంటే నాకు సోదరితో సమానం' అంటూ ఆమె కోరికను తోసిపుచ్చాడు.** దేవయాని కోపంతో 'నీకు మృతసంజీవని విద్య పనికిరాకుండా పోతుంది' అని శపించింది.

సరే! నాకు పనికిరాకపోయినా నేను ఎవరికైనా నేర్పితే ఉపయోగపడుతుంది కదా! అనుకొని 'దేవయానీ! నువ్వు ధర్మం తప్పావు కాబట్టి బ్రాహ్మణ కన్యవైన నీకు బ్రాహ్మణుడితో వివాహం కాదు' అని శపించాడు.

అందువల్ల యయాతి మహారాజుతో దేవయానికి వివాహం అయ్యింది. అది ఎలా అంటే – రాక్షసులకు రాజు వృషపర్వుడు. అతడి కూతురు శర్మిష్ఠ. ఒకరోజు దేవయాని, శర్మిష్ఠ మరికొందరు చెలికత్తెలు (వెయ్యిమంది) కొలనులో స్నానానికి దిగారు. వారు ఒడ్డున విడిచిన బట్టలు గాలికి కలిసిపోయాయి. స్నానం అయ్యాక శర్మిష్ఠ పొరపాటున దేవయాని బట్టలు కట్టుకుంది. అంతే! దేవయానికి కోపం వచ్చింది. మాటామాటా పెరిగింది. చివరికి దేవయానిని ఒక నూతిలోనికి తోసి శర్మిష్ఠ వెళ్ళిపోయింది. యయాతి మహారాజు వేట కోసమని అటువైపే వచ్చాడు. నూతిలో పడిపోయిన దేవయానిని చూసి జాలిపడి బయటకు తీసి, తన నగరానికి తాను వెళ్ళిపోయాడు.

దేవయాని వృషపర్వుడి రాజ్యంలో కాలుపెట్టనని భీష్మించుకొని కూర్చుంది. **అప్పుడు శుక్రాచార్యుడు వచ్చి 'అమ్మా! దేవయానీ! నీకు కోపం తగదమ్మా! ఎన్నో యజ్ఞాలూ, యాగాలూ చేసిన వారికంటే కోపం లేనివాడే గొప్పవాడమ్మా!**

**కం. అలిగిన నలుగక, యెగ్గులు**
**పలికిన మతి విననియట్లు ప్రతివచనంబుల్**
**వలుకక, బన్నము వడి యెడఁ**
**దలపక యున్నతఁడు చూవె! ధర్మజ్ఞుఁడిలన్ (ఆది: 3-147)**

**ఎవరు ఎన్ని చేసినా కోపగించకుండా వారితో స్నేహంగా ఉండటమే గొప్ప ధర్మం' అని నచ్చచెప్పాడు.**

దేవయాని ససేమిరా అంది. తన కూతురు లేకుండా తానూ ఆ నగరంలో ఉండకూడదని నిర్ణయించుకున్నాడు శుక్రుడు.

ఈ విషయాలన్నీ తెలిశాయి వృషపర్వుడికి. పరుగుపరుగున వచ్చాడు.

'గురుదేవా! మీ దయ లేకుండా మేం బతకలేం. కరుణించండి' అని ప్రాధేయపడ్డాడు. చివరికి తన కుమార్తె శర్మిష్ఠనూ, ఆమె వెయ్యి మంది పరిచారికలనూ దేవయానికి దాసీలుగా చేస్తానని వాళ్ళను తన నగరానికి తీసుకువెళ్ళాడు.

నూతిలో నుంచి బయటకు తీసేటప్పుడు పాణిగ్రహణం జరిగిపోయింది. కాబట్టి తనను పెళ్ళాడమని దేవయాని కోరడంతో యయాతి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు.

దేవయాని శర్మిష్ఠనూ, చెలికత్తెల్నీ తీసుకొని అత్తవారింటికి వెళ్ళింది. దేవయానికీ యయాతికీ యదువు, తుర్వసుడు అని ఇద్దరు పుత్రులు కలిగారు.

యయాతి శర్మిష్ఠను కూడా రహస్యంగా పెళ్ళి చేసుకొని, ఆమె ద్వారా ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే ముగ్గురు కుమారుల్ని పొందాడు.

కొన్నాళ్ళకి ఈ విషయం బయటపడింది. శుక్రాచార్యుడు కోపంతో యయాతిని ముసలివాడివి కమ్మని శపించాడు. తరువాత కొంత శాంతించి 'నీ పుత్రులలో ఎవరైనా తన యౌవనాన్ని నీకు ఇచ్చి నీ ముసలితనాన్ని తీసుకొంటే – నీకు మళ్ళీ యౌవనం వస్తుంది' అని అన్నాడు.

అందుకు ఒక్క పూరుడు తప్ప ఎవరూ ముందుకు రాలేదు. యయాతి పూరుడి యౌవనాన్ని తీసుకున్నాడు.

**కొంతకాలం తరువాత ఈ కోరికలు ఎప్పటికీ తృప్తిని ఇవ్వవని తెలుసుకొని పూరుడి యౌవనాన్ని అతడికి తిరిగి ఇచ్చి అతడినే రాజును చేశాడు యయాతి.**

పెద్ద కొడుకు యదువు ఉండగానే పూరుణ్ణి ఎందుకు రాజును చేశాడో ప్రజలకు వివరంగా ఇలా చెప్పాడు.

**కం. తనయుండు దల్లిదండ్రులు**
**పనిచిన పని సేయడేని పలు కెదలోఁ జే**
**కొనఁడేని వాడు తనయుం**
**దనఁబడునే? పితృధనమున కర్హుండగునే? (ఆది: 3-199)**

**తల్లిదండ్రులు చెప్పిన పని చేయనివాడు, వాళ్ళ మాట లెక్క చేయనివాడు కొడుకెలా అవుతాడు? అలాంటి వాడు తండ్రి ఆస్తికి వారసుడెలా అవుతాడు? అంటూ పూరుణ్ణి పిలిచి 'నాయనా! గొప్పవాళ్ళ చరిత్రలు చదువు. మంచివాళ్ళతో ఉంటూ ధర్మం గురించి తెలుసుకో. తెలుసుకొని మరిచిపోకుండా దానిని ఆచరించు. యోగ్యతకు తగిన ధనం ఇవ్వాలి. సభల్లో క్లుప్తంగా, అందంగా, తగినట్లు మాట్లాడాలి' అంటూ నీతులు చెప్పి అడవికి వెళ్ళిపోయాడు యయాతి.**

## శకుంతలోపాఖ్యానం

పూరుడి వంశంలో కొన్ని తరాల తర్వాత దుష్యంతుడు అనే ఒక మహారాజు జన్మించాడు. ఒకసారి ఆయన వేటకు బయలుదేరాడు. అడవిలో ఒక ముని ఆశ్రమం కనిపించింది. అది కణ్వముని ఆశ్రమం. అప్పుడు కణ్వుడు ఆశ్రమంలో లేడు. ఒక అందమైన మునికన్య ఉంది. ఆమె పేరు శకుంతల.

శకుంతల మేనకకూ విశ్వామిత్రుడికీ కలిగిన కూతురు. విశ్వామిత్రుడి తపస్సును భగ్నం చేయడానికి వచ్చింది మేనక. ఆమె వల్ల విశ్వామిత్రుడి తపస్సు చెడింది. ఆమెకూ విశ్వామిత్రుడికీ పుట్టిన కుమార్తె శకుంతల. మేనక ఈ శకుంతలను కని స్వర్గానికి వెళ్ళిపోయింది. అప్పుడు ఆ పసిపాపను శకుంతాలు (పక్షులు) రక్షిస్తూ ఉంటే అది చూసిన కణ్వమహర్షి తన ఆశ్రమానికి తీసుకువచ్చి శకుంతల అని పేరు పెట్టి, అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేశాడు.

దుష్యంతమహారాజు శకుంతలను గాంధర్వ పద్ధతిలో అప్పటికప్పుడే వివాహం చేసుకొని, కొంతసేపు గడిపి తన నగరానికి వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆశ్రమానికి వచ్చిన కణ్వుడు జరిగింది తెలుసుకున్నాడు.

కొన్నాళ్ళకు శకుంతలకు దుష్యంత మహారాజు వల్ల ఒక కొడుకు పుట్టాడు. అతడి పేరు భరతుడు. అడవిలో ఉండే అన్ని జంతువుల్నీ తన మహాబలంతో అణచివేస్తున్న ఆ బాలుణ్ణి చూసి, అక్కడి మునులు అతడిని 'సర్వదమనుడు' అనే పేరుతో పిలిచేవాళ్ళు.

ఆ బాలుడు క్రమంగా పెరిగి పెద్దవాడయ్యాడు. ఒకరోజు కణ్వమహర్షి శకుంతలను పిలిచి 'అమ్మా!

**ఆ.వె. ఎట్టి సాధ్వులకును బుట్టిన యింఢ్లను**
**బెద్దకాల మునికి తద్ద తగదు**
**పతుల కడన యునికి సతులకు ధర్మువు**
**సతుల కేడుగడయుఁ బతుల చూవె (ఆది: 4-66)**

**ఎంత గొప్ప స్త్రీలైనా పుట్టింట్లో ఎక్కువకాలం ఉండకూడదు. భార్య - భర్త దగ్గర ఉండటమే ధర్మం. భార్యకు భర్తే దిక్కు (ఏడుగడ)'.** అని పలికి కొందరు శిష్యులతో దుష్యంతుడి వద్దకు ఆమెను పుత్రుడితో సహా పంపాడు.

దుష్యంతుడు లోకాపవాదానికి భయపడ్డాడు. నువ్వెవరో తెలియదన్నాడు. దానికి శకుంతల తల్లడిల్లిపోయింది. ఆవేదనతో ఇలా అంది.

**చం. విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే**
**దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్**
**యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా**
**ర్థము లివియుండఁగా నరుఁడు దక్కొననేర్చునె తన్ను ప్రుచ్చిలన్**
**(ఆది: 4-80)**

**స్వచ్ఛమైన కీర్తికి నిలయమైన వాడా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, మూడు సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు పురుషుడి ప్రవర్తనను చూస్తూనే ఉంటాయి. ఇవి ఉండగా నరుడు తనను తాను దాచుకోలేడు.**

**'రాజా! నీలా ఎవరైనా ఇల్లాలిని దూరం చేసుకుంటారా? నాలుగు పురుషార్థాలనూ భర్తకు సాధించిపెట్టేది భార్యే. వంశానికీ, గౌరవానికీ, గృహవిద్యకూ మూలమైనదీ భార్యే. భార్యాపుత్రుల్ని చక్కగా చూసుకొనేవాడికి ఏ ఆపదా ఉండదు.**

**చం. సుతజల పూరితంబులగు నూతులు నూరిటికంటె సూనృత**
**వ్రత! యొక బావి మేలు, మఱి బావులు నూఱిటికంటె నొక్క స**
**త్క్రతువది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు, త**
**త్సుతశతకంబు కంటె నొక సూనృతవాక్యము మేలు సూడగన్ (ఆది: 4-94)**

**మహారాజా! మంచినీళ్ళతో నిండిన వంద నూతుల కంటే ఒక బావి, అలాంటి వందబావుల కంటే ఒక క్రతువు (యజ్ఞం), అలాంటి వంద క్రతువుల కంటే ఒక కొడుకు, వందమంది కొడుకుల కంటే ఒకే ఒక్క సత్యవాక్యం మేలు.** దయచేసి నిజం చెప్పండి! నేను మీకు తెలీదూ?!' అంది.

ఇంతలో ఆకాశవాణి 'రాజా! ఈమె నీ భార్య! అతడు నీ కుమారుడు' అని చెప్పింది.

దుష్యంతుడు ఆమెను స్వీకరించాడు. వీళ్ళ పుత్రుడే భరతుడు. అప్పటి నుండి చంద్రవంశానికి భరతవంశం అనే పేరూ వచ్చింది.

భరతుడి వంశంలో 'హస్తి' అనే చక్రవర్తి ఉండేవాడు. ఇతడే తన పేరు మీద హస్తినాపురాన్ని నిర్మించాడు. ఇదే భరతవంశ రాజులకు రాజధాని.

హస్తి పుత్రుడు అజామీఢుడు. ఇతడి పుత్రుడు ఋక్షుడు. ఇతడి పుత్రుడు సంవరణుడు. ఇతడి భార్య తపతి. వీళ్ళ పుత్రుడు కురువు. ఇతడు తపస్సు చేసిన ప్రదేశమే కురుక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. అలా కురువు వంశంలో పుట్టినవాళ్ళు కౌరవులయ్యారు.

కురువు సంతానంలో జహ్నుడు అని ఒక రాజు ఉన్నాడు. అతడి కొడుకు ప్రతీపుడు. 'మహాభిషుడు' అనే ఇక్ష్వాకుచక్రవర్తి- ఒక శాపం వల్ల మరుసటి జన్మలో ఈ ప్రతీపుడికి కొడుకుగా పుట్టాడు. అతడే శంతనుమహారాజు.

## శంతను మహారాజు

ఒకరోజు శంతనుడు వేటకు వెళ్ళి అక్కడ గంగాదేవిని చూసి ఇష్టపడ్డాడు. ఆమె కొన్ని షరతులు విధించింది.

ఆమె మాటను కాదనకూడదు. ఏదికోరినా ఇవ్వాలి. తిట్టకూడదు. ఎదురు ప్రశ్నించకూడదు. ఇలా షరతులు పెట్టింది.

శంతనుడు అంగీకరించాడు. వివాహం జరిగింది.

కొంతకాలానికి వారికి ఒక కుమారుడు పుట్టాడు. పుట్టగానే వాణ్ణి తీసుకువెళ్ళి నదిలో పడవేసి వచ్చింది గంగ. శంతనుడు ఏమీ అనలేదు. అంటే వెళ్ళిపోతుందేమోనని భయం. తరువాత మరో ఆరుగురు కొడుకులు పుట్టారు. వాళ్ళనీ అలాగే చేసింది. తరువాత ఎనిమిదో కుమారుడు. వాణ్ణీ అలాగే చేస్తుందని శంతనుడు ఆమెను వారించాడు.

అప్పుడు ఆమె – 'రాజా! నేను జహ్నుమహర్షి కుమార్తెను. గంగానదిని. శాపం వల్ల భూలోకానికి వచ్చి నీ భార్యనయ్యాను. ఈ ఎనిమిదిమంది కొడుకులూ ఎవరో కాదు. అష్టవసువులు. వసిష్ఠ మహర్షి శాపం వల్ల వాళ్ళు ఇలా పుట్టారు. వీడు ఎనిమిదో వసువు. వీడికి దేవవ్రతుడు అని పేరు పెడుతున్నాను. పెంచి పెద్ద చేసి నీకు అప్పగిస్తాను' అంటూ తీసుకువెళ్ళి పెద్దవాణ్ణి చేసి తిరిగి అప్పగించింది.

కొంతకాలం తరువాత శంతనుమహారాజు వేటకి వెళ్ళి అక్కడ ఒక అందమైన స్త్రీని చూశాడు. ఆమె పేరు సత్యవతి. ఈమె ఉపరిచరవసువుకు, అద్రిక అనే అప్సరసకూ పుట్టింది. ఈమెను దాశరాజు పెంచి పెద్ద చేశాడు కాబట్టి దాశకన్య అనీ, చేపల వాసన కలది కాబట్టి మత్స్యగంధి అనీ ఈమెను పిలుస్తారు.

ఈమె పడవనడుపుతూ ఉంటే పరాశరుడు అనే మహర్షి చూసి వరించాడు. వీళ్ళిద్దరికీ పుట్టినవాడే వేదవ్యాస మహర్షి. ఇతడు కృష్ణద్వీపంలో పుట్టాడు కాబట్టి కృష్ణద్వైపాయనుడు. పరాశరుడి కొడుకు కాబట్టి పారాశర్యుడు.

పుట్టగానే వేదవ్యాసుడు 'అమ్మా! నేను తపస్సుకు వెళ్తున్నాను. నీకు అవసరమైనప్పుడు నన్ను తలుచుకో! నీ ముందు ప్రత్యక్షమవుతాను' అని వెళ్ళిపోయాడు. పరాశరుడూ తపస్సుకు వెళ్ళిపోయాడు.

అలా పరాశరుడూ, కుమారుడు వేదవ్యాసుడూ దూరంగా ఉన్న ఆ సత్యవతిని చూసిన శంతనుడు ఆమె నుండి ఒక యోజనం వరకూ సువాసన రావడాన్ని గమనించాడు. అది పరాశరుడు ఆమెకు ఇచ్చిన వరం. చేపల వాసన కాస్తా సువాసనగా మారి, ఆ పరిమళం ఒక యోజనం దాకా వ్యాపిస్తుందని వరం ఇచ్చాడు. అప్పటి నుండి ఆమె యోజనగంధి అయ్యింది.

శంతనుడు ఆమెతో మాట్లాడి ఆమె ద్వారా దాశరాజును కలిసి ఆమెను వివాహం చేసుకోవాలని ఉందని అడిగాడు. దానికి దాశరాజు 'సరే! నా కుమార్తెకు పుట్టినవాడికే రాజ్యం ఇస్తానని నువ్వు వాగ్దానం చేస్తే నాకు సమ్మతమే!' అన్నాడు.

శంతనుడు ఒప్పుకోలేదు. ఇంటికి తిరిగి వచ్చాడు.

విచారంగా ఉన్న తండ్రిని చూశాడు దేవవ్రతుడు. విషయం తెలుసుకొని, దాశరాజు దగ్గరకు వెళ్ళాడు.

## భీష్ముడు

'దాశరాజా! నేను రాజ్యం చేపట్టను. నీ కుమార్తెకు కలిగే పుత్రుడికే రాజ్యాధికారం!' అన్నాడు.

అప్పుడు దాశరాజు 'నువ్వు ధర్మాత్ముడివే! నీ పుత్రులు నీ మాటను గౌరవిస్తారా? తరువాత మేమే వారసులం అని గొడవకు దిగితే,మా పరిస్థితేంగాను?' అన్నాడు.

దానికి దేవవ్రతుడు – 'నేను అసలు వివాహమే చేసుకోను. బ్రహ్మచర్యాన్ని చచ్చేవరకూ పాటిస్తాను' అని ప్రతిజ్ఞ చేశాడు.

అలా భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు కాబట్టి అప్పటి నుండీ దేవవ్రతుడికి భీష్ముడు అనే పేరు ఏర్పడింది.

శంతనుడికీ సత్యవతికీ వివాహం జరిగింది. వీరికి చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే ఇద్దరు కొడుకులు జన్మించారు. శంతనుడు మరణించాడు. చిత్రాంగదుడు ఒక గంధర్వుడి చేతిలో మరణించాడు. ఇక మిగిలిన విచిత్రవీర్యుణ్ణే భీష్ముడు రాజును చేశాడు.

## అంబ, అంబిక, అంబాలిక

కాశీ రాజుకు అంబ, అంబిక, అంబాలిక అని ముగ్గురు కూతుళ్ళు. వాళ్ళ కోసం స్వయంవరం ప్రకటించాడు కాశీరాజు. భీష్ముడు అక్కడికి వెళ్ళి రాజులందర్నీ ఓడించి ఆ ముగ్గురు కన్యల్నీ తీసుకొని వచ్చాడు.

భీష్ముడు ఓడించినవారిలో సాళ్వుడు అనే రాజు కూడా ఉన్నాడు. సాళ్వుణ్ణి కాశీరాజు పెద్ద కుమార్తె అంబ ప్రేమించింది. ఆమె కోరికపై అంబను వెనక్కి పంపి తక్కిన ఇద్దర్నీ విచిత్రవీర్యుడికి ఇచ్చి పెళ్ళి చేశాడు.

తీరా వెళ్తే సాళ్వుడు అంబను తిరస్కరించాడు. అదలా ఉండగా కొంతకాలానికి సంతానం కలగకుండానే విచిత్రవీర్యుడు కూడా మరణించాడు.

అప్పుడు సత్యవతి వేదవ్యాసుడిని పిలిచి, దేవరన్యాయం ద్వారా తన కోడళ్ళకు పుత్రభిక్ష పెట్టమంది. (ఏదైనా కారణంవల్ల సంతాన విచ్ఛిత్తి కలిగితే ఒక స్త్రీ తన భర్త సోదరుడి ద్వారా సంతానం పొందడాన్ని దేవరన్యాయం అంటారు).

అలా వేదవ్యాసుడి ద్వారా అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, విచిత్రవీర్యుడి మరో శూద్ర భార్యకు విదురుడు జన్మించారు. ఈ విదురుడు ఎవరో కాదు. మాండవ్యముని శాపం వల్ల జన్మించిన యమధర్మరాజే! అందుకే విదురుడు గొప్ప నీతికోవిదుడయ్యాడు.

## ద్రోణాచార్యుడు

గంగాతీరంలో భరద్వాజ మహర్షి తపస్సు చేసుకొంటూ ఉండేవాడు. అతడికి ఒక కుమారుడు. అతడి పేరు ద్రోణుడు. ఈ భరద్వాజుడికి పృషతుడు అనే పాంచాల రాజు మంచి స్నేహితుడు. ఇతడి కొడుకు ద్రుపదుడు. పృషతుడు తన కొడుకును భరద్వాజుడి ఆశ్రమంలోనే ఉంచాడు. కాబట్టి ద్రోణుడు, ద్రుపదుడు స్నేహితులయ్యారు. చక్కగా చదువుకొంటున్నారు. కొన్నాళ్ళకు పృషతుడు మరణించడంతో ద్రుపదుడు రాజయ్యాడు. ద్రోణుడు 'అగ్నివేశుడు' అనే మహర్షి ద్వారా విలువిద్యలో నైపుణ్యాన్ని పొందాడు.

## కృపాచార్యుడు

గౌతమమహర్షి కుమారుడు శరద్వంతుడు. ఇతడు విలువిద్యలో గొప్పవాడు. ఇతడికి ఒక బాలుడు, బాలిక జన్మించారు. వీరిని అడవిలో ఒక రెల్లు పొదలో విడిచి వెళ్ళి పోయాడు శరద్వంతుడు. వాళ్ళను శంతనుమహారాజు పెంచి పెద్ద చేశాడు. వాళ్ళ పేర్లే కృపుడు, కృపి. తరువాత శరద్వంతుడు వచ్చి వీళ్ళకు ధనుర్వేదాన్ని బోధించాడు.

ద్రోణుడు కృపిని వివాహం చేసుకున్నాడు. వీళ్ళకు ఒక పుత్రుడు. అతడి పేరు అశ్వత్థామ. ద్రోణుడు పరశురాముడి నుండి కూడా చాలా అస్త్రాలను పొందాడు. కానీ ఆర్థికమైన ఇబ్బందులు తలెత్తడంతో సహాయం కోసం తన చిన్ననాటి స్నేహితుడైన ద్రుపదుడి వద్దకు వెళ్ళాడు. కానీ ద్రుపదుడు అవమానించి పంపాడు.

## కర్ణుడు

యదువంశానికి చెందిన 'శూరుడు' అనే రాజుకు వసుదేవుడు మొదలైన పది మంది కొడుకులు, పృథ మొదలైన ఏడుగురు కూతుళ్ళు ఉన్నారు. ఇతడి మేనత్త కొడుకు కుంతిభోజుడు పృథను తీసుకువెళ్ళి పెంచుకున్నాడు. దాంతో పృథ కుంతీదేవిగా ప్రసిద్ధురాలయ్యింది. ఈమె సూర్యుడి అనుగ్రహం వల్ల కవచకుండలాలతో ప్రకాశించే ఒక పుత్రుణ్ణి పొందింది. అయితే ఆ పుత్రుణ్ణి ఒక పెట్టెలో పెట్టి గంగానదిలో విడిచిపెట్టింది. ఆ పెట్టె అతిరథుడు – రాధ అనే సూతదంపతులకు దొరికింది. వాళ్ళు ఈ బాలుణ్ణి పెంచి పెద్ద చేశారు. అతడే కర్ణుడు.

## పాండురాజు – ధృతరాష్ట్రుడు

ధృతరాష్ట్రుడు గాంధార దేశ రాజకుమార్తె అయిన గాంధారిని పెండ్లాడాడు. పాండురాజు కుంతీదేవినీ, మద్రదేశరాజకుమార్తె మాద్రినీ పెళ్ళాడాడు.

పాండురాజు దిగ్విజయయాత్ర చేసి ఎందరో రాజుల్ని ఓడించాడు. అపారమైన ధనరాశుల్ని హస్తినాపురానికి తరలించాడు. ధృతరాష్ట్రుడికి రాజ్యం అప్పగించాడు. కొంతకాలం తరువాత ఒకసారి వేటకు వెళ్ళాడు. అక్కడ కలిసిమెలిసి ఉన్న రెండు

జింకల్ని చూసి అయిదు బాణాలు వేశాడు. అవి నిజానికి జింకలు కావు. కిందముడు అనే మహర్షి, అతడి భార్య.

జింక రూపంలో ఉన్న మహర్షి ఇలా అన్నాడు **'రాజా! వేట రాజధర్మమే! కానీ ఆయాసంతో పరిగెత్తలేని వాటినీ, అన్యోన్యంగా ఉన్నవాటినీ, ప్రసవించడానికి సిద్ధంగా ఉన్నవాటినీ, రోగాలతో ఉన్నవాటినీ కర్కోటకుల్లాంటి వేటగాళ్ళు కూడా వేటాడరే! అలాంటిది భరతవంశంలో పుట్టిన నువ్వే ఇలా చేశావు. కాబట్టి నువ్వు కూడా నీ భార్యతో కలిశావో మరుక్షణం మరణిస్తావు. నీతో పాటు నీ భార్యకూడా మరణిస్తుంది'** అని శపించి ప్రాణాలు వదిలాడు. అప్పుడు తెలిసివచ్చింది పాండురాజుకి.

**కం.** **ఎట్టి విశిష్టకులంబునఁ**
**బుట్టియు, సదసద్వివేకములు గల్గియు, మున్**
**గట్టిన కర్మఫలంబులు**
**నెట్టన భోగింపకుండ నేర్తురె మనుజుల్ (ఆది: 5-58)**

**'ఎంత ఉన్నతమైన వంశంలో పుట్టినా, మంచీచెడు తెలిసినా, పూర్వ జన్మలో చేసిన కర్మఫలాన్ని ఎంతటివారైనా అనుభవించాల్సిందే!'** అని బాధపడి, అన్నీ సేవకులకు దానం చేశాడు. భార్యలతో కలిసి శతశృంగ పర్వతం మీద తపస్సు చేసుకొంటూ కాలం గడుపుతున్నాడు.

**'మానవుడు పుడుతూనే నాలుగు (దేవ - ఋషి - పితృ - మనుష్య) ఋణాలతో పుడతాడు. యజ్ఞం - తపస్సు, స్వాధ్యాయం, శ్రాద్ధం, అతిథి సేవ ద్వారానే వాటిని తీర్చుకోవాలి. మిగిలిన మూడూ తీరిపోయాయి. శాపం వల్ల నాకు సంతానం కలుగదు. కాబట్టి పితృఋణం తీరే అవకాశమే లేదు'.** అని బాధపడుతున్నాడు.

## పాండవులు - కౌరవులు

అప్పుడు పాండురాజు కోరికతో కుంతీదేవి తనకు దుర్వాసమహర్షి ఇచ్చిన వరం ద్వారా దేవతల్ని ఆహ్వానించింది. యమధర్మరాజు అంశంతో ధర్మరాజు, వాయుదేవుడి అంశంతో భీముడు, ఇంద్రుడి అంశంతో అర్జునుడు అనే పుత్రుల్ని పొందింది.

పాండురాజు కోరిన మీదట మాద్రి కూడా అశ్వినీదేవతలను ఆరాధించింది. వారివల్ల నకులుడు, సహదేవుడు అనే ఇద్దరు పుత్రుల్ని పొందింది.

అక్కడ హస్తినాపురంలో గాంధారి కూడా గర్భం ధరించింది. సంవత్సరం అయినా ప్రసవం కాలేదు. ఈలోగా కుంతీదేవికి ధర్మరాజు పుట్టాడు. అది తెలిసి అసూయతో తన కడుపు బాదుకుంది. దానివల్ల లోపలి పిండం జారి బయటపడింది. అప్పుడు వేదవ్యాసుడు వచ్చి దానిని 101 భాగాలు చేసి నేతికుండలలో పెట్టి రక్షించాడు. కుంతీదేవికి భీముడు పుట్టిన సమయానికి మొదటి కుండనుండి కలి అంశతో ఒక పుత్రుడు పుట్టాడు. అతడే దుర్యోధనుడు.

ధృతరాష్ట్రుడికి మరో వైశ్య భార్య ఉంది. ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. అతడి పేరు యుయుత్సుడు.

ఆ తరువాత రోజుకొకరుగా ఆ కుండల నుండి 99 మంది పుట్టుకొచ్చారు. చివరి కుండ నుండి దుస్సల అనే అమ్మాయి పుట్టింది.

దుర్యోధనుడు పుట్టినపుడు అపశకునాలు కనిపించాయి. అతడి వల్ల వంశానికి తీవ్రమైన నష్టం కలుగుతుంది కాబట్టి ఆ ఒక్క బిడ్డనీ ఎక్కడైనా వదిలి వేయమని పండితులు సలహా ఇచ్చారు. కానీ పుత్ర వ్యామోహం! ధృతరాష్ట్రుడు ఆ పని చేయలేదు.

కొంతకాలానికి పాండురాజు, మాద్రీ మరణించారు. కుంతీదేవి తన బిడ్డలు ఐదుగురినీ తీసుకొని హస్తినాపురానికి వచ్చింది. కాలం గడుస్తోంది. ఒకరోజు వేదవ్యాసుడు వచ్చి సత్యవతితో ఇలా అన్నాడు.

**కం. మతిఁ దలఁపఁగ సంసారం**
**బతిచంచల మెండమావు లట్టుల సంప**
**త్ప్రతతు లతిక్షణికంబులు**
**గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్ (ఆది: 5-159)**

**'అమ్మా! ఈ సంసారం ఒక ఎండమావి. చంచలమైనది. ఈ సంపదలన్నీ కూడా క్షణికాలే! కాబట్టి ఆలోచిస్తే వచ్చేకాలం కంటే గడిచిన కాలమే**

**మంచిదనిపిస్తోంది.** ఎందుకు చెప్తున్నానంటే – ధృతరాష్ట్రుడి కొడుకులు మంచివాళ్ళు కారు. ముందు ముందు చాలా ఘోరాలు జరుగుతాయి. నువ్వు చూడలేవు. కాబట్టి కోడళ్ళను తీసుకొని అడవులకి వెళ్ళి తపస్సు చేసుకొంటూ ప్రశాంతంగా ఉండు' అన్నాడు.

సత్యవతి అలాగే చేసింది. కొన్నాళ్ళకు అంబిక, అంబాలికలతో సహా తనువు చాలించి స్వర్గానికి చేరుకుంది.

ధృతరాష్ట్రుడి పుత్రులు ధార్తరాష్ట్రులు. వీరికే కౌరవులు అని ప్రసిద్ధి. పాండురాజు పుత్రులు పాండవులు. అందరూ పెరుగుతున్నారు.

పాండవులంటే దుర్యోధనుడికి మొదట్నుంచీ కంటగింపుగా ఉండేది. భీముడంటే మరీను. ఒకసారి భీముణ్ణి తాళ్ళతో కట్టి నదిలో పడవేయించాడు. భీముడు తేరుకొని కట్లు తెంచుకొని బయటపడ్డాడు. మరోసారి విషం కలిపిన అన్నం పెట్టి చంపబోయాడు. ఆ విషం భీముడిని ఏమీ చేయలేదు. చక్కగా జీర్ణమైపోయింది.

వీళ్ళకు గురువు కృపాచార్యుడు. ద్రోణుణ్ణి కూడా విలువిద్య నేర్పడానికి నియమించాడు భీష్ముడు. అర్జునుడిలో ఉన్న ఆత్మవిశ్వాసం ద్రోణుడిని ఆకర్షించింది.

అర్జునుడు ద్రోణాచార్యుడికి ప్రియశిష్యుడయ్యాడు.

ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ. అతడు కూడా వీళ్ళతో పాటే విద్యాభ్యాసం చేస్తున్నాడు. అర్జునుడు చీకట్లో కూడా బాణాలు గురి చూసి వెయ్యడం నేర్చుకున్నాడు. అది చూసి, అతడి సాధనకు మెచ్చిన ద్రోణాచార్యుడు 'నిన్ను సాటిలేని మేటి విలుకాణ్ణి చేస్తాను' అని మాట ఇచ్చాడు.

## ఏకలవ్యుడు

హస్తినాపురానికి పక్కనే ఒక అడవి ఉంది. అందులో హిరణ్యధన్వుడు అనే కిరాతరాజు ఉన్నాడు. అతడి కొడుకు ఏకలవ్యుడు. ఇతడికీ విలువిద్య అంటే పంచప్రాణాలు. ద్రోణుడి వద్దకు వచ్చి తనకు ఆ విద్య నేర్పమని అడిగాడు.

ఆనాటి ధర్మశాస్త్రం ప్రకారం ధనుర్వేదాన్ని నేర్చుకొనే అర్హత ఏకలవ్యుడికి లేదు. అందుకని చెప్పనన్నాడు. అయినా ఏకలవ్యుడు పట్టుదలగా మట్టితో ద్రోణుడి బొమ్మను ఒకటి చేసుకొని దాని ముందు కూర్చొని సాధన చేశాడు. నైపుణ్యాన్ని సంపాదించాడు.

ఒకరోజు కౌరవ పాండవులందరూ వేటకు వెళ్ళారు. దారి తప్పారు. అక్కడ ఏకలవ్యుడి గురించి తెలిసింది. ఒక వేట కుక్క మొరుగుతూ ఉంటే – దానికి గుచ్చుకోకుండా, అది అరవలేకుండా ఏడు బాణాలు వేసి దాని నోరు మూయించాడు ఏకలవ్యుడు. అది చూసి ఆశ్చర్యపోయారు వీళ్ళంతా. ఏకలవ్యుడు తన గురువు ద్రోణాచార్యులేనంటూ అతని విగ్రహాన్ని చూపించాడు.

వీళ్ళందరూ హస్తినాపురానికి తిరిగి వచ్చి ద్రోణుడికి ఆ విషయం చెప్పారు. ద్రోణుడు ఆశ్చర్యపోయి ఏకలవ్యుడి దగ్గరకు వెళ్ళాడు.

ఏకలవ్యుడు భక్తితో ద్రోణుణ్ణి పూజించి 'గురుదేవా! మీ అనుగ్రహం వల్ల నాకు ఈ విద్య వచ్చింది. కాబట్టి మీకు గురుదక్షిణగా ఏం కావాలో చెప్పండి. సంతోషంగా ఇస్తాను' అన్నాడు. బొటనవేలు లేకపోతే బాణ ప్రయోగం చేయలేడనీ, దానివల్ల అర్జునుడికి తానిచ్చిన మాట వమ్ముకాదనీ భావించి ద్రోణుడు ఏకలవ్యుడి బొటనవేలును గురుదక్షిణగా అడిగాడు. ఏకలవ్యుడు ఎంత మాత్రం సంకోచం లేకుండా సంతోషంగా సమర్పించాడు.

## అస్త్ర విద్యా ప్రదర్శన

కౌరవులూ పాండవులూ తాము నేర్చుకొన్న విద్యల్ని ప్రదర్శిస్తున్నారు. అర్జునుడు చూపించిన ధనుర్విద్యా నైపుణ్యానికి అందరూ ఆశ్చర్యపోయారు.

అదే సమయంలో కర్ణుడు వచ్చి అర్జునుడు చూపించిన విద్యలన్నీ తానూ చేసి చూపించాడు. అందరూ ఆశ్చర్యపోయారు.

దుర్యోధనుడు ముగ్ధుడై కర్ణుణ్ణి కౌగిలించుకొన్నాడు. అంగరాజ్యం ఇచ్చి తనకు స్నేహితుణ్ణి చేసుకున్నాడు.

విద్యాభ్యాసం పూర్తయ్యింది. ద్రోణాచార్యుడి కోరిక మేరకు ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి ద్రోణుడి కాళ్ళ దగ్గర పడవేశాడు అర్జునుడు.

ద్రుపదుణ్ణి తానూ పరిహాసాలాడి, అవమానించి విడిచి పెట్టాడు ద్రోణుడు.

కొంతకాలం తరువాత భీష్ముడు ధర్మరాజును యువరాజుగా చేశాడు. భీమార్జునులూ, నకులసహదేవులూ నాలుగు దిక్కులకూ వెళ్ళి అందర్నీ జయిస్తున్నారు.

ద్రోణుడు తన ప్రియశిష్యుడైన అర్జునుడికి బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఇచ్చాడు.

పాండవుల వైభవం చూస్తుంటే దుర్యోధనుడికి కడుపు రగిలిపోతోంది. కర్ణుణ్ణీ, శకునినీ, దుశ్శాసనుడూ మొదలైన తన వాళ్ళనందరినీ సమావేశపరిచాడు. అప్పుడు శకుని కణికుడు అనే రాజనీతిజ్ఞుణ్ణి పిలిపించాడు.

## కణిక నీతి

ఆ కణికుడు ఇలా హితవు పలికాడు.

**తరువోజ.**

**ధరణీశుఁ డుద్యతదండుఁ డై యుచిత దండవిధానంబుఁ దప్పక ధర్మ**
**చరితులఁగా మహీజనుల రక్షించి సద్వృత్తుఁ డగునది; సర్వవర్ణములు**
**వరుసన తమతమ వర్ణధర్మముల వర్తిల్లుదురు గడవక దండభీతి**
**నరిమిత్రవర్జితుఁ డై సమబుద్ధి యగు మహీవల్లభు ననుశాసనమున**

**(ఆది: 6-102)**

**ప్రభువు గొప్ప అధికారం కలవాడై, తగిన విధంగా దండనీతిని అవలంబిస్తూ, ప్రజలను ధర్మ మార్గాన నడిపించాలి. మంచి ప్రవర్తన కలవాడై ఉండాలి. దండనీతిలో స్వపరభేదాలు చూపించ కూడదు. సమబుద్ధితో ప్రవర్తించాలి. అలా ఉంటే ప్రజలు కూడ తమ జాతిధర్మాలు ఉల్లంఘించరు. ఇవి చేయదగిన పనులు, ఇవి చేయకూడని పనులని రాజు తెలుసుకోవాలి. చెడు నడవడికతో, ప్రజల మేలు కోరనివాడు ఎవడైనా రాజు వాడిని శిక్షించాలి. ఆ శిక్ష ప్రజలందరికీ తెలిసేలా అమలు చేయాలి.**

ఏ పని చేసినా, బుద్ధిమంతులతో ఆలోచించి చేయాలి. ముందుగా విచారించి చేసిన పని ఎప్పుడూ చెడి పోదు. రాజు నేర్పుతో ఎవరినీ నొప్పించని పని చేత కానీ, భయంకరమయిన పని చేత కానీ మొదట తనని తాను కాపాడు కోవాలి. తనకు ప్రమాదం లేకుండా చూసుకుని తరువాత రాజధర్మాలు నడపాలి.

స్వచ్ఛమయిన బుద్ధితో తన లోపాలు ఇతరులు తెలుసుకోకుండా, ఇతరుల లోపాలను తాను తెలుసుకుంటూ, దేశకాల పరిస్థితులను గమనిస్తూ మిత్ర బలాన్ని సమకూర్చుకుంటూ రాజు తన రాజధర్మాలు నిర్వర్తించాలి.

శత్రువు బలహీనమయినప్పుడే చంపడం రాజనీతి. వాళ్ళు అధికబలంతో. మిత్రులను కూడదీసుకుంటే వారిని చంపడం సాధ్యం కాదు సుమా!

రాజు! ఎప్పుడూ దూతల వల్ల అన్ని విషయాలూ తెలుసుకుంటూ ఉండాలి. విసుక్కో కూడదు. తన పనుల గురించే కాక, శత్రువుల పనులను గురించి కూడ తెలుసుకుంటూ ఉండాలి. శత్రు దేశ విషయాల కోసం ఎక్కువ సంఖ్యలో పాషండులను (వేదబాహ్యులను) పంపాలి. రాజు చాలా చోట్లకు వెళ్తూ ఉంటాడు. అందుకని రాజు ఎక్కడికి వెళ్ళబోతున్నా, ముందుగా ఆ ప్రదేశాలని క్షుణ్ణంగా పరిశీలించేలా చేయాలి. ఆయా ప్రదేశాలు పరిశీలించి, రాజుకి ఆపద కలిగించే వ్యక్తులు కానీ, ఆయుధాలు కానీ ఉంటే ముందుగానే తొలిగించేలా చర్యలు తీసుకోవాలి.

తే. వీరు నమ్మంగఁ దగుదురు వీరు నమ్మఁ
దగరు నాకు నా వలవదు; తత్త్వబుద్ధి
నెవ్వరిని విశ్వసింపక యెల్ల ప్రొద్దు
నాత్మరక్షాపరుం డగు నది విభుండు (ఆది: **6-110**)

రాజైన వాడు 'వీడు నమ్మదగిన వాడు', 'వీడు నమ్మరాని వాడు' అని భావించకూడదు. నిశ్చయబుద్ధితో తన రక్షణ తానే ప్రధానంగా చూసుకోవాలి. ఎవరినీ అంతగా నమ్మ కూడదు. మరో విషయం. రాజు తనని తాను కాపాడు

కోవడమే కాదు – తన రహస్యపుటాలోచనలనీ కూడ జాగ్రత్తగా కాపాడు కోవాలి. రహస్యపుటాలోచనల్ని రాజు ఎంతగా కాపాడుకుంటాడో అంతగా అతడికి విజయం. రహస్యాలను కాపాడు కోలేకపోతే ఆ బృహస్పతి పనులు కూడ ఫలవంతాలు కావు సుమా!

ఇక మనుషుల నైజం గురించి చెబుతాను. చెడ్డ వాళ్ళు మాటి మాటికీ ఒట్లు పెడుతూ ఉంటారు. చేతులుజోడించి దండాలు పెడుతూ ఉంటారు. తియ్యగా మాట్లాడుతూ ఉంటారు. నక్క వినయాలు చూపిస్తూ ఉంటారు. దుర్మార్గుడు తనకు అనుకూలమయ్యే వరకూ మిత్రుడిలా నటిస్తాడు. అనుకూలత ఏర్పడిన వెంటనే కాటు వేస్తాడు.

పిడుగు పడడం, గాలి వీచడం – ఇవి ప్రజలకు ఎప్పుడు తెలుస్తాయి? అవి జరిగి నప్పుడే కదా? అలాగే కోపం కానీ, స్నేహం కానీ ఇతరులకు వాటి అనుభవ కాలానికే తెలియాలి. రాజు అలా మసలుకోవాలి.

రాజు, తనకు ఇంతకు ముందు అపకారం చేసిన వాడిని అల్పుడే కదా అని ఆదరించ కూడదు. ముల్లు చిన్నదే కావచ్చు. అది గుచ్చుకుంటే నడవ గలమా? శత్రువుని ఎప్పుడూ తక్కువ అంచనా వెయ్య కూడదు. బాలుడని చులకన భావంతో అతనితో కలిసి ఉండ కూడదు. భయంకరమయిన పర్వతాలను, అరణ్యాలను కాల్చిపారెయ్యడానికి ఒక చిన్న నిప్పు కణికె చాలదూ?

తనకి అపకారం చేసిన వాడిని చేర దీసి, దగ్గర ఉంచుకునే వాడు బుద్ధి హీనుడు. వాడెలాంటి వాడంటే, ఎత్తయిన చెట్టు కొమ్మ మీద ఏమరుపాటుతో నిద్రించే వాడితో సమానం!

మరో ముఖ్య విషయం… రాజా! అపకారాలు చేసే వాళ్ళని, సామ దానభేద దండోపాయాల చేత కానీ, దయ చూపడం చేత కానీ, వారికి నమ్మకం కలిగేలా చేయి. అలా మాటలాడి వారిని నమ్మించు. కావాలంటే ఒట్టు పెట్టు. వారికి నమ్మకం కలిగించి, తర్వాత ఏమాత్రం ఆలస్యం చేకుండా చంపెయ్యి. శుక్రుడు కూడ ఇదే చెప్పాడు. అందు చేత ఏ విధంగానయినా రాజనీతితో శత్రువులను హతమార్చాలి.

కం. తన కపకారము మదిఁ జే
సిన జనుఁ దల్పుఁడని నమ్మి చేకొనియుండం
జన దొక యించుక ముల్లయి
నను బాదతలమున నున్న నడవగనగునే? (ఆది: 6 -115)

**'రాజా! మనకు కీడు చేసిన వాడు అల్పుడే అయినా ఉపేక్షించకూడదు సుమా! ముల్లు చిన్నదే! కానీ కాలిలో గుచ్చుకొని ఉంటే నడవగలమా? అలాంటి వాణ్ణి చంపి ఆత్మరక్షణ చేసుకోవడమే రాజధర్మం'** అన్నాడు.

ఆ మాటలు బాగానే పని చేశాయి. దుర్యోధనుడు తండ్రి వద్దకు వెళ్ళి పాండవుల్ని ఎలాగైనా వారణావతానికి పంపివేయమనీ లేకపోతే మనకు పేరు ప్రతిష్ఠలు రావనీ గొడవ పెట్టేవాడు. ధృతరాష్ట్రుడు మొదట అంగీకరించకపోయినా పుత్రవ్యామోహం వల్ల అతడికి తప్పింది కాదు.

## లక్కయిల్లు

పాండవులు అతడి మాట మన్నించి బయలుదేరారు. దీనిలో ఏదో కుట్ర ఉందని విదురుడు హెచ్చరించాడు. అతడు హెచ్చరించినట్లుగానే ఒక ప్రమాదం జరిగింది.

వారణావతంలో పాండవుల కోసం నెయ్యి, నూనె, బంక, లక్క కలగలిపి ఒక భవనాన్ని పురోచనుడు అనే శిల్పితో కట్టించాడు దుర్యోధనుడు. వాళ్ళు ఆ ఇంటిలో ఉండగా నిప్పు పెట్టి చంపాలన్నది అతడి ఆలోచన.

పాండవులు అది గ్రహించారు. ఈలోగా విదురుడు ఎవరికీ తెలియకుండా ఒక కందకాలు తవ్వే సేవకుణ్ణి పంపి లక్క ఇంటిలో నుండి ఒక సొరంగం తవ్వించాడు.

ఆనాడు కృష్ణ చతుర్దశి. కుంతీదేవి నగరంలోని బ్రాహ్మణ స్త్రీలు అందరినీ పిలిచి భోజనం పెట్టింది. అప్పుడే కుంతీదేవి సేవకురాలైన ఒక నిషాదస్త్రీ తన అయిదుగురు కొడుకులతో వచ్చింది. పీకలదాకా తిని, మద్యం తాగి పుత్రులతో కలిసి అక్కడే పడి నిద్రపోయింది.

ఆ రాత్రే లక్క ఇంటికి నిప్పు పెట్టాలని నిశ్చయించుకున్నాడు పురోచనుడు. అది తెలిసిన భీముడు ముందుగానే పురోచనుడి భవనానికి నిప్పు పెట్టి, తమ లక్క యింటికి కూడా నిప్పుపెట్టి, సొరంగమార్గం ద్వారా తల్లినీ, సోదరుల్నీ తీసుకొని బయటపడ్డాడు.

తెల్లవారింది. లక్క యింట్లో మద్యంతాగి పడిపోయిన నిషాదస్త్రీ ఆమె కొడుకుల శవాలు కనిపించాయి. వాటిని చూసి అందరూ కుంతీదేవీ పాండవులూ మరణించారని అనుకున్నారు.

## హిడింబాసురుడు

భీముడు అడవిలో తనవాళ్ళకు కాపలాగా ఉన్నాడు. తక్కిన వాళ్ళందరూ నిద్రపోతున్నారు. అప్పుడు అక్కడికి హిడింబాసురుడు అనే రాక్షసుడు వచ్చాడు. తన వాళ్ళకు నిద్రాభంగం కలగనివ్వకుండా వాణ్ణి దూరంగా తీసుకువెళ్ళి చంపాడు భీముడు.

ఆ రాక్షసుడి చెల్లెలు హిడింబ భీముణ్ణి చూసి మనసు పడింది. ఆమె రాక్షసస్త్రీ. కాబట్టి నమ్మలేదు భీముడు. అప్పుడు ధర్మరాజు కలుగజేసుకొని – 'భీమసేనా వధించడానికి అర్హుడైన హిడింబాసురుణ్ణి సంహరించావు నువ్వు. అది ధర్మమే! నువ్వు వాణ్ణి చంపడంతో ఈమె అబల అయ్యింది. కాబట్టి ఈమెను స్వీకరించవలసిన బాధ్యత నీపైనే ఉంది. రాక్షసస్త్రీ అని ఉపేక్షించకు.

**కం. ఆపదయైనను ధర్మువ**
**ప్రాపుగ రక్షింపవలయుఁ బరమార్థము ధ**
**ర్మాపాయము ధార్మికులకు**
**నాపద, జన్మాంతరమున ననుగతమగుటన్ (ఆది: 6-221)**

**ఆపద కలిగే పరిస్థితి ఉన్నా ధర్మాన్నే ఆధారంగా గ్రహించి మానవుడు దానిని రక్షించాలి. ఇది పరమార్థం. ధర్మాన్ని నిష్ఠతో ఆచరించేవారికి ధర్మం దెబ్బతినటమే గొప్ప ఆపద. ఎందుకంటే ఇది తరువాత జన్మలలో కూడా వెంట వస్తుంది, అన్నాడు.** తరువాత కుంతీదేవి ఆదేశంతో ఆమెను స్వీకరించాడు భీముడు.

అందరూ కలిసి అరణ్యంలో ముందుకు సాగిపోయారు. దారిలో వేదవ్యాస మహర్షి కనిపించాడు. పాండవుల్ని ఓదార్చాడు. 'ఏకచక్రపురంలో బ్రాహ్మణ వేషాల్లో ఉంటూ కాలం గడపండి. త్వరలో మీ కష్టాలన్నీ గట్టెక్కుతాయి' అని చెప్పి వెళ్ళిపోయాడు.

భీముడికీ హిడింబకు ఒక కుమారుడు జన్మించాడు. అతడే ఘటోత్కచుడు. పుట్టగానే యౌవనవంతుడై 'ఏ అవసరం వచ్చినా నన్ను తలుచుకోండి. వెంటనే వస్తాను' అని తండ్రులకు చెప్పి తల్లిని తీసుకొని వెళ్ళిపోయాడు.

పాండవులు ఏకచక్రపురంలో బ్రాహ్మణ వేషాల్లో ఉంటూ భిక్షాటన ద్వారా జీవిస్తున్నారు. వండిన దాంట్లో సగం భీముడికి, మిగిలినది అందరికీ.

## బకాసుర వధ

ఆ ఊరి పొలిమేరల్లో బకాసురుడు ఉండేవాడు. రోజూ వాడి దగ్గరకు ఒక బండెడు అన్నం, ఒక మనిషిని ఆహారంగా పంపాలి. ఆ రోజు పాండవులు ఉంటున్న ఇంటి యజమాని వంతు వచ్చింది. ఆ యజమాని విలపిస్తున్నాడు. అది చూసి కుంతీదేవి భీముడితో –

**కం. 'కృత మెఱుగుట పుణ్యము, స**
**న్మతి దానికి సమము సేఁత మధ్యము, మఱి త**
**త్కృతమున కగ్గలముగ స**
**త్కృతి సేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్ (ఆది: 6–244)**

**నాయనా! భీమసేనా! చేసిన మేలును గుర్తుంచుకొంటే పుణ్యం వస్తుంది. దానికి ప్రతిగా వాళ్ళకు మేలు చేస్తే మధ్యమం. చేసిన దానికంటే ఎక్కువ మేలు చేస్తే అది అన్నింటికంటే ఉత్తమం. కాబట్టి ఆ బకాసురుణ్ణి చంపి ఈ ఊరిని కాపాడు' అంది.**

సరేనన్నాడు భీముడు. కానీ అతడికి బాగా ఆకలిగా ఉంది. కడుపునిండా తిని చాలా రోజులయ్యింది. అందుకే ఆ ఇంటి యజమానిని తనకు తృప్తిగా

భోజనం పెట్టమన్నాడు. వెంటనే ఆ బ్రాహ్మణుడు రకరకాల పిండివంటలతో గొప్ప విందు ఏర్పాటు చేశాడు.

భీముడు కడుపునిండా తిని, బండి నిండా ఆహార పదార్థాలు నింపుకొని, బకాసురుడి దగ్గరకు వెళ్ళాడు. గట్టిగా అరిచిమరీ బకాసురుణ్ణి పిలిచాడు. వాడు గుహలోంచి బయటకు వచ్చేలోగా తాను తెచ్చిన ఆహార పదార్థాలను తిని వేశాడు.

అది చూసిన బకాసురుడికి అరికాలిమంట నెత్తికెక్కింది. భీముడి మీదికి వేగంగా దూకాడు. ఎంతవేగంగా దూకాడో అంతే వేగంగా భీముడి చేతుల్లో చచ్చాడు.

## ద్రౌపది జననం

భీముడు బకాసురుణ్ణి చంపిన తరువాత, పాండవులూ కుంతీదేవి ఏకచక్రపురంలో కొంత కాలం నివసించారు.

ఒకరోజు ఒక బ్రాహ్మణుడు వారి ఇంటికి వచ్చాడు. ధర్మరాజు అతిథి సత్కారాలు చేసి 'బ్రాహ్మణోత్తమా! తమరు ఏ ఏ దేశాలు తిరిగారు? అక్కడ విశేషాలు ఏమిటి? అని అడిగాడు.

దానికి ఆ బ్రాహ్మణుడు – 'నేను ఎన్నో దేశాలు చూశాను, కానీ ద్రుపదరాజు పాలించే పాంచాలదేశాన్ని మించిన దేశాన్నిమాత్రం ఎక్కడా చూడలేదు. ఆ ద్రుపద మహారాజుకు అగ్నిగుండం నుండి ఒక కూతురు పుట్టిందట. ఆమె పేరు ద్రౌపది. ఆమెకు వివాహం చేయాలనుకుంటున్నాడు ద్రుపదుడు' అన్నాడు. ధర్మరాజు ఆశ్చర్యంగా 'బ్రాహ్మణోత్తమా! ఆమె ఎందుకు అందరిలా జన్మించలేదు?' అన్నాడు. 'ద్రోణుడు, ద్రుపదుడు మంచి స్నేహితులు. వారిద్దరూ ఒకే గురువు గారి దగ్గర వేదాలు చదువుకున్నారు. అగ్నివేశుడి వద్ద ధనుర్విద్యను నేర్చుకున్నారు. తరువాత వారికి విరోధం వచ్చింది. ద్రోణుడు హస్తినాపురం వెళ్ళిపోయాడు. అక్కడ కురు కుమారులకు అస్త్రవిద్య నేర్పించి,గురుదక్షిణగా ద్రుపదుణ్ణి బంధించి తెమ్మని కోరాడు. అర్జునుడు ద్రోణుడి ప్రియశిష్యుడు కాబట్టి ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి, గురువుగారి కాళ్లమీదే పడేలా చేశాడు. ద్రోణుడు ద్రుపదుణ్ణి అవమానించి విడిచి పెట్టాడు.ఆ

అవమానాన్ని భరించలేక ద్రుపదుడు ఎలాగైనా ద్రోణుణ్ణి చంపే కొడుకునూ, అర్జునుణ్ణి వివాహమాడే కూతురినీ పొందాలని నిశ్చయించుకున్నాడు. యాజుడు అనే బ్రాహ్మణోత్తముణ్ణి యాజ్ఞికుడిగా చేసుకొని యజ్ఞం మొదలుపెట్టాడు. ద్రుపదుణ్ణి, అతడి భార్య కోకిలాదేవిని కూర్చోపెట్టి యాజుడు వారి చేత యజ్ఞం చేయించాడు.

అప్పుడు యజ్ఞకుండంలోనుండి భయంకరమైన శరీరంతో చేతిలో పెద్దవిల్లుతో ఒక మహాపురుషుడు ఉద్భవించాడు. తరువాత ఒక అద్భుత సౌందర్యరాశి బయటకు వచ్చింది.

అప్పుడు ఆకాశవాణి వారికి ధృష్టద్యుమ్నుడు, కృష్ణ (నల్లని శరీరము కలది) అని నామకరణం చేసింది. (ఆ కృష్ణకే ద్రుపదుడి కుమార్తె కాబట్టి ద్రౌపది అని పేరు).

ఇప్పుడు ఆ కన్యకు పెళ్లీడు వచ్చింది. ద్రుపదుడు ఆమెకు అర్జునుడితో వివాహం చేయాలనుకున్నాడు కానీ అర్జునుడు, తన సోదరులతో సహా లక్క ఇంటిలో చనిపోయాడని తెలిసి చాలా దుఃఖించాడు.

కానీ ద్రుపదుడి పురోహితుడు మాత్రం 'పాండవులకు అన్నీ శుభశకునాలే గోచరిస్తున్నాయి కాబట్టి వాళ్ళు మరణించి ఉండరు' అని చెప్పడంతో ఎలాగైనా అర్జునుణ్ణి రప్పించాలని ఒక ఉపాయం ఆలోచించాడు ద్రుపదుడు.

ఒక బలమైన ధనువును తయారు చేయించి,అక్కడే ఒక మత్స్యయంత్రాన్ని నిర్మించి, ఆ ధనువును ఎక్కుబెట్టి ఆ మత్స్యయంత్రం కొట్టినవాడికే తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని స్వయంవరం ప్రకటించాడు. అందుకని రాజులంతా వెళుతున్నారు' అన్నాడు బ్రాహ్మణుడు.

అంతా వింటోంది కుంతీదేవి. వెంటనే ధర్మరాజుతో 'ధర్మజా! మనం చాలా కాలంగా ఈ బ్రాహ్మణుని ఇంటిలో ఉంటున్నాం. ఇతరుల ఇళ్ళలో ఎక్కువ కాలం ఉండటం ఉచితం కాదు. అందువల్ల మనం కూడా పాంచాల దేశానికి వెళ్దాం' అంది.

తల్లిగారి ఆజ్ఞ. అందరూ పాంచాల దేశానికి బయలుదేరారు. దారిలో వ్యాసమహర్షి ఆశ్రమం ఉంది. దానిని సందర్శించారు. అప్పుడు వ్యాసముని వారిని

ఆశీర్వదించి నాయనా! ధర్మజా! ఒక రాజకన్య పూర్వజన్మలో భర్త కోసం తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ కంగారులో 'నాకు భర్తను ప్రసాదించు' అని అయిదుసార్లు అడిగింది. 'నీ కోరిక వచ్చే జన్మలో తీరుతుంది' అని చెప్పి శివుడు వెళ్ళిపోయాడు. ఆ రాజకన్య ఇప్పుడు ద్రుపదుడికి కూతురుగా జన్మించింది. మీరు పాంచాలరాజ్యానికి వెళ్ళండి. శుభం కలుగుతుంది' అని అశీర్వదించి పంపాడు.

## అంగారపర్ణుడి గర్వభంగం

పాండవులు నడుస్తున్నారు. రాత్రిళ్ళు, పగళ్ళు ప్రయాణం చేస్తూ ఒక అర్ధరాత్రి గంగాతీరానికి చేరుకున్నారు. అక్కడ సోమశ్రవ తీర్థం ఉంది. అందులో స్నానం చేద్దామనుకొన్నారు. ఈలోగా అదే సమయానికి అక్కడికి అంగారపర్ణుడు అనే గంధర్వుడు తన భార్యలతో విహారానికి వచ్చాడు. పాండవులను చూసి అంగారపర్ణుడికి కోపం వచ్చింది.

'మానవులారా! ఇది అర్ధరాత్రి. యక్ష, రాక్షస, గంధర్వులు తిరిగే సమయం. ఈ వేళలో మానవులు సంచరించకూడదు. నేను అంగారపర్ణుడు అనే గంధర్వుడిని. ఈ అడవి, గంగాతీరం నా అధీనంలోనివే. వెంటనే మీరు ఇక్కడ నుండి వెళ్ళిపొండి. లేకపోతే అనవసరంగా నా బాణాలకు బలైపోతారు' అన్నాడు గర్వంగా.

దానికి అర్జునుడు 'నువ్వు చెప్పిన మాటలు విని బలహీనులైన మానవులు భయపడతారేమో! కానీ మాలాంటి మహావీరులు కాదు. ఈ భూమి మీద ఉన్న నదులు అందరివీను. పైగా ఈ పవిత్ర గంగానది అందరికీ చెందిన పుణ్యనది. ఇది ఏ ఒక్కరి సొంతమూ కాదు' అన్నాడు ఆవేశంగా.

ఒక మానవమాత్రుడు తనకు మాటకు మాట ఎదురు చెప్తాడా! అని అంగారపర్ణుడికి ఎక్కడలేని కోపం వచ్చింది. అర్జునుడి మీద పదునైన బాణాలు కురిపించాడు.

అర్జునుడు ఊరుకోలేదు. ఆ బాణాలను, తన చేతిలోని కొరివితో అడ్డుకొని 'ఓరీ గంధర్వా! ఇదుగో! కాచుకో! ఇది ఆగ్నేయాస్త్రం. దీనిని పూర్వం అగ్నిదేవుడి

నుంచి బృహస్పతి, భరద్వాజుడు, పరశురాముడు ద్రోణుడు వరుసగా ఒకరినుంచి ఒకరు పొందారు. నా గురువైన ద్రోణాచార్యులవారు నాకు ప్రసాదించారు' అంటూ ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు.

వెంటనే అంగారపర్ణుడి రథం కాలిపోయింది. అతడు నేలమీద పడ్డాడు. నేలమీదపడ్డ అంగారపర్ణుడిని అర్జునుడు, ధర్మరాజు వద్దకు తీసుకొని వచ్చాడు. **'అర్జునా, ఓడిపోయిన వాడినీ, శౌర్యం కోల్పోయిన వాడినీ శిక్షించకూడదు. విడిచిపెట్టు'** అన్నాడు ధర్మరాజు.

అప్పుడు అంగారపర్ణుడు అర్జునుని చూసి, **'అర్జునా, నీ పరాక్రమానికి మెచ్చాను. నీతో స్నేహం చెయ్యాలని ఉంది.** నీకు చాక్షుషీ విద్యనూ, మహావేగం కల గుఱ్ఱాలను ఇస్తాను. నాకు నీ వద్ద ఉన్న ఆగ్నేయాస్త్రాన్ని ఇవ్వు' అని అడిగాడు.

దానికి అర్జునుడు 'గంధర్వా!మనం ఎంత స్నేహితులమైనా, నీ వద్ద నుండి విద్యలనూ, ధనాన్ని స్వీకరించలేను. నీకు ఆగ్నేయాస్త్రాన్ని ఇస్తాను. నీ వద్ద నుండి గుఱ్ఱాలను స్వీకరిస్తాను' అని అన్నాడు.

దానికి గంధర్వుడు సమ్మతించాడు. అర్జునుడు గంధర్వుని చూసి 'గంధర్వా! మేము ధర్మబుద్ధి కలవాళ్ళం. మమ్మల్ని చూసి నువ్వు ఎందుకు అలా గర్వంగా మాట్లాడావో చెప్పు?' అని అడిగాడు. 'అర్జునా! మీరు ఎవరో నాకు తెలుసు. **కానీ పక్కన ఆడవాళ్ళు ఉంటే ఎంత వివేకవంతుడైనా అహంకారిస్తాడు. అలాంటి సమయంలోనే ఎవరైనా ఒక బ్రాహ్మణుడు పురోహితుడుగా ఉంటే, అతడు మనకు మంచీ చెడూ బోధిస్తాడు. మనల్ని తప్పు చెయ్యకుండా నివారిస్తాడు.** కాబట్టి ఓ తాపత్యా! మీరు పురోహితుడు లేకుండా ఇలా సంచరించడం భావ్యం కాదు. కాబట్టి మీరూ ఒక ఉత్తమ బ్రాహ్మణుడిని పురోహితుడిగా చేసుకోండి' అని అన్నాడు. అప్పుడు అర్జునుడికి ఒక సందేహం కలిగింది. 'గంధర్వా! మేము కుంతీపుత్రులమైతే, నువ్వు 'తాపత్యా' అని పిలుస్తున్నవేమిటి? అని అడిగాడు.

దానికి ఆ గంధర్వుడు ఇలా చెప్పసాగాడు – 'సూర్యుడికి ఒక కూతురు ఉండేది. ఆమె సావిత్రికి చెల్లెలు. పేరు తపతి. ఆ కన్య మహాసౌందర్యవతి. అజామీఢుడి కొడుకు సంవరణుడు. అతడు సూర్యుడిగురించి తపస్సు చేస్తున్నాడు. ఇది తెలిసిన సూర్యుడు, సంవరణుడే తన కూతురు తపతికి తగిన భర్త అనుకున్నాడు.

ఒకరోజు సంవరణుడు అడవికి వేటకు వెళ్ళి అక్కడ విహరిస్తున్న తపతిని చూసి ఆమె సౌందర్యానికి ముగ్ధుడయ్యాడు. 'ఓ అబలా!ఎవరు నువ్వు? ఈ అరణ్యంలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?'అని అడిగాడు.

తపతి బదులు చెప్పలేదు. మౌనంగా వెళ్ళిపోయింది.

సంవరణుడు ఆమె మీద మోహంతో, పిచ్చివాడిలా ఆమె కోసం వెదుకుతున్నాడు. తపతికి కూడా సంవరణుడంటే ఇష్టమే! అతడి దగ్గరకు వచ్చి 'ఓ రాజా! నన్ను చూసి ఎందుకు ఇష్టపడ్డావు?' అని అడిగింది.

దానికి సంవరణుడు 'ఓ సౌందర్యవతీ! నేను ఎవరికీ భయపడలేదు. కానీ నీ సౌందర్యం చూసి నువ్వు నాకు దక్కవేమో అని భయపడుతున్నాను. నిన్ను గాంధర్వవివాహం చేసుకుంటాను'అని అడిగాడు.

తపతి 'తన వివరాలు చెప్పి, నాకు నిర్ణయం తీసుకొనే స్వాతంత్ర్యం లేదు. నీకు నాపై ప్రేమ ఉంటే, నా తండ్రిని అడుగు. మన వివాహం జరుగుతుంది'అని చెప్పి వెళ్ళిపోయింది.

అప్పటి నుండి సంవరణుడు అక్కడే ఉండి సూర్యుణ్ణి పట్టుదలతో ఆరాధిస్తున్నాడు.

ఒకరోజు వసిష్ఠుడు సంవరణుడి దగ్గరకు వచ్చాడు. అతని బాధను తెలుసుకొని, వెంటనే సూర్యుని వద్దకు వెళ్ళి –

'పూరువంశంలో పుట్టినవాడు, ధర్మాత్ముడు, సద్గుణ సంపన్నుడు అయిన సంవరణుడు నీ కుమార్తె తపతిని చూసి మోహించాడు. నువ్వు నీ కుమార్తెను అతనికి ఇచ్చి వివాహం చెయ్యాలి' అని చెప్పాడు.

సూర్యుడు సంతోషంగా అంగీకరించాడు. వసిష్ఠుడు ఇద్దరికీ వివాహం జరిపించాడు.

తరువాత కొన్నాళ్ళకి సంవరణుడికీ, తపతికీ కురు మహారాజు జన్మించాడు. మీరు కురు వంశజులు కాబట్టి, మీరు తాపత్యులు అయ్యారయ్యా!' అని వివరించాడు అంగారపర్ణుడు.

## కల్మాషపాదుని వృత్తాంతం

అప్పుడు అర్జునుడు అంగారపర్ణుడితో 'గంధర్వా! మా పూర్వులకు గురువులు, పురోహితులు అయిన వసిష్ఠుడి గురించి ఇంకా వినాలని ఉంది' అని అడగడంతో అంగారపర్ణుడు ఇలా చెప్తున్నాడు.

పూర్వం కన్యాకుబ్జ నగరాన్ని విశ్వామిత్రుడు అనే మహారాజు పరిపాలిస్తుండేవాడు. అతడు ఒక రోజు వేటకు వెళ్ళాడు. వేటాడి వేటాడి అలసిపోయాడు. సమీపంలోనే వశిష్ఠమహర్షి ఆశ్రమం ఉంది.

వసిష్ఠుడు విశ్వామిత్ర మహారాజుకూ, అతడి సైన్యానికీ అథితిసత్కారాలు చేశాడు. వశిష్ఠుడి వద్ద నందిని అని ఒక ధేనువు ఉంది. ఆ ధేనువు సహాయంతో విశ్వామిత్రుడికీ, అతడిసైన్యానికీ అద్భుతమైన విందు ఏర్పాటు చేశాడు. అది చూసి విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు. ఆ ధేనువుపై అతడికి కన్నుపడింది. లక్ష పాడి ఆవులు ఇస్తాను ఆ ధేనువును ఇమ్మని వశిష్ఠుని అడిగాడు విశ్వామిత్రుడు. వసిష్ఠుడు నిరాకరించాడు. బలవంతంగా ఆ ధేనువును తీసుకురమ్మని తన సైన్యానికి ఆజ్ఞాపించాడు విశ్వామిత్రుడు. నందిని వసిష్ఠుడివైపు చూసింది. వసిష్ఠుడు మౌనంగా ఉన్నాడు. అంతే! నందిని విజృంభించింది, తన శరీరం నుండి అనేక సైన్యాలను పుట్టించింది. అవి విశ్వామిత్రుని సైన్యాలను చిటికెలో మట్టి కరిపించాయి.

విశ్వామిత్రునికి అప్పటికిగానీ జ్ఞానోదయం కాలేదు. క్షాత్రబలం కన్నా తపోబలం గొప్పది అని తెలుసుకొని, రాజ్యాన్ని విడిచిపెట్టి తపస్సుకు వెళ్ళిపోయాడు. దివ్యశక్తులను పొందాడు. కానీ వసిష్ఠుడి మీద మాత్సర్యం మాత్రం పోలేదు.వసిష్ఠుడు

కల్మాషపాదుడు అనే మహారాజుకు యాజకుడు (యజ్ఞాలు చేయించే పురోహితుడు). కల్మాషపాదుడికి తానూ యాజకుడు కావాలని విశ్వామిత్రుడూ ప్రయత్నిస్తున్నాడు.

ఒకరోజు కల్మాషపాదుడు వేటకు వెళ్ళి అలసిపోయి వసిష్ఠుడి ఆశ్రమానికి వెళ్తున్నాడు. దారిలో వసిష్ఠుడి నూరుగురు కుమారులలో పెద్దవాడైన శక్తి ఎదురు వచ్చాడు. కల్మాషపాదుడు – గర్వంతో 'నాకే ఎదురు వస్తావా తప్పుకో. నాకు దారి ఇవ్వు' అన్నాడు.

'రాజా! ఎంతటి గొప్ప వారైనా, బ్రాహ్మణులు ఎదురు వచ్చినపుడు తప్పుకొని దారి ఇస్తారు. ఇది ధర్మం' అని అన్నాడు శక్తి.

ఆ మాటలకు కోపంతో కల్మాషపాదుడు తన చేతికర్రతో శక్తిని కొట్టాడు.

శక్తికి కోపం వచ్చింది. 'నన్ను రాక్షసబుద్ధితో అవమానించావు కాబట్టి నువ్వు రాక్షసుడివై నరమాంసం తింటూ జీవించు' అని శపించాడు.

కల్మాషపాదుడు రాక్షసుడిగా మారిపోయాడు. అలా సంచరిస్తూ నరమాంసభక్షకుడై చివరికి శక్తినీ అతడి సోదరులనూ చంపి తిన్నాడు. తన నూర్గురు పుత్రులూ రాక్షసునికి ఆహారం కావడం చూసిన వసిష్ఠుడు తట్టుకోలేక పుత్రశోకంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.

వసిష్ఠుడి అవస్థను శక్తి భార్య అదృశ్యంతి చూస్తూనే ఉంది. అప్పుడు ఆమె గర్భవతి. ఆమె కడుపులో ఉన్న బిడ్డ వేదాలు సుస్వరంతో వల్లె వేస్తున్నాడు. అది విని వసిష్ఠుడు ఆశ్చర్యపోయాడు. తన మనుమడిని చూడాలన్న కోరికతో ఆత్మహత్యా యత్నం విరమించాడు.

కొన్నాళ్ళ తరువాత ఒకరోజు రాక్షసరూపంలో ఉన్న కల్మాషపాదుడు అదృశ్యంతినీ చంపపోయాడు. వసిష్ఠుడు అది గమనించి అతడిపై మంత్రించిన నీళ్ళు జల్లడంతో కల్మాషపాదుడికి శాపవిమోచనం కలిగింది.

కల్మాషపాదుడు వసిష్ఠుడికి నమస్కరించి 'మహామునీ! నీ దయవల్ల నాకు శాపవిమోచనం అయ్యింది' అన్నాడు. అప్పుడు వసిష్ఠుడు 'బ్రాహ్మణులను అవమానిస్తే ఎలాంటి అనర్థాలు వస్తాయో చూశావుగా! ఇకనైనా బ్రాహ్మణులను పూజించు'

అని హితబోధ చేశాడు. వసిష్ఠుడివద్ద సెలవు తీసుకొని కల్మాషపాదుడు అయోధ్యానగరానికి వెళ్లిపోయాడు.

అలా వెళ్ళి రాజ్యపాలన చేస్తున్నాడు. అయితే అతడు రాక్షసుడిగా ఉన్నప్పుడు ఒక సంఘటన జరిగింది. ఒక బ్రాహ్మణ దంపతులు కామక్రీడలలో ఉన్నప్పుడు, ఆ బ్రాహ్మణుడిని చంపి తిన్నాడు. దానికి కోపించిన ఆ బ్రాహ్మణ వనిత 'నువ్వు స్త్రీతో కలిశావంటే నా భర్తలాగా మరణిస్తావు' అని శపించింది.

అందువల్ల ఆ భయంతో కల్మాషపాదుడు భార్యతో కలవలేకపోయాడు. సంతానం పొందలేకపోయాడు.

సంతానం కావాలనే కోరిక మాత్రం అతడికి బాగా ఉంది. దానితో, వసిష్ఠుణ్ణి ఆశ్రయించాడు. అతడి అనుగ్రహంతో కల్మాషపాదుడి భార్య మదయంతి గర్భం దాల్చింది. పన్నెండేళ్లు గడిచాయి. ఎంతకూ ప్రసవం కాలేదు. అందుకని ఒక పదునైన రాతిముక్కతో ఆమె తన గర్భం చీల్చుకుంది. అప్పుడు ఆమెకు పుట్టినవాడే అశ్మకుడు అనే రాజర్షి.

అదే సమయానికి వసిష్ఠుడికోడలు అదృశ్యంతికీ ఒక పుత్రుడు కలిగాడు. అతడే పరాశరుడు.

పరాశరుడు పెరిగి పెద్దవాడు అయ్యాడు. తన తండ్రి శక్తిని ఒక రాక్షసుడు చంపాడని తన తల్లి వల్ల తెలుసుకొని తన తపశ్శక్తితో లోకాలన్నీ భస్మం చేస్తానని శపథం చేశాడు. తాత వశిష్ఠుడు అతడిని వారిస్తూ –

పరాశరా! అది ధర్మవిరుద్ధం. పూర్వం కృతవీర్యుడు అనే మహారాజు భృగువంశ బ్రాహ్మణులను యాజ్ఞికులుగా చేసుకుని ఎన్నో యాగాలు చేశాడు. కృతవీర్యుడు వారికి సాటిలేని ధనాన్ని ఇచ్చాడు. దానిని వారు దాచుకున్నారు. తరువాత కొంతకాలానికి కొంతమంది క్షత్రియులు 'ఈ భృగువంశ బ్రాహ్మణులే కృతవీర్యుడి ధనాన్ని అపహరించారు' అని పుకారు పుట్టించారు. అది విని కొంతమంది బ్రాహ్మణులు తమ వద్ద ఉన్న ధనాన్ని ఆ క్షత్రియులకు ఇచ్చారు. మరికొంతమంది

బ్రాహ్మణులు ఆ ధనాన్ని భూమిలో పాతిపెట్టారు. క్షత్రియులు ఇది చూసి, ఆ బ్రాహ్మణులను చంపి ఆ ధనం తీసుకుని వెళ్లారు. భృగువంశ బ్రాహ్మణులనందరినీ, గర్భంలో ఉన్న బిడ్డలతో సహా చంపేశారు. ఆడవాళ్ళు వీళ్ళకు భయపడి హిమాలయాలకు వెళ్లిపోయారు. అందులో ఒక బ్రాహ్మణుడి భార్య తన తొడలో గర్భం ధరించింది. ఆమె తొడలో నుండి ఔర్వుడు అనే అత్యంత తేజస్వియైన కుమారుడు జన్మించాడు. అతడి తేజస్సుకు, కృతవీర్యుడి వంశంలోని క్షత్రియులందరూ దృష్టి కోల్పోయి గుడ్డి వాళ్లయ్యారు. తరువాత ఔర్వుడు తన తండ్రి, మిగిలిన బంధువులూ ఒక్కసారే చనిపోయారని తెలుసుకొని, లోకాలన్నింటినీ నాశనం చెయ్యాలని సంకల్పించి, ఘోరమైన తపస్సు చెయ్యాలని సంకల్పించాడు. అతడి పితృదేవతలు ఔర్వుడిని చూసి 'మేం అసమర్థులమై క్షత్రియులచేతితో చనిపోలేదు. మేం ధనానికి ఆశపడి ధనాన్ని దాచలేదు. మేం ఎంతో తపస్సు చేశాం. మా తపోమహిమ వల్ల మాకు మరణం రావడం లేదు. ఆత్మహత్య చేసుకుందామంటే అది పాపం కదా! ఈ మనుష్యలోకంలో ఎక్కువ కాలం ఉండలేక, కావాలనే క్షత్రియులతో వైరం తెచ్చుకుని వారి చేతిలో మరణించాం. అంతే! కాబట్టి నువ్వు లోకాలను నాశనం చేస్తాననడం ధర్మం కాదు' అన్నారు.

వాళ్ళ మాటలు విని, ఔర్వుడు తన ప్రయత్నం విరమించాడు. కాబట్టి పరాశరా! కోపంతో నువ్వు చెయ్యబోయే తపస్సు మంచిది కాదు. కాబట్టి శాంతం వహించు" అన్నాడు వసిష్ఠుడు.

తాతగారి మాటను మన్నించాడు పరాశరుడు. కానీ తన తండ్రి శక్తినీ, పిన తండ్రులను చంపిన రాక్షసుడి మీద మాత్రం కోపం పోలేదు. రాక్షసవినాశనానికి సత్రయాగం సంకల్పించాడు. దానికి మాత్రం వసిష్ఠుడూ అడ్డు చెప్పలేదు. ఆ సత్రయాగంలో పడి రాక్షసజాతి అంతరించిపోతూ ఉంటే అది చూసి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనేవాళ్ళు వచ్చి వసిష్ఠుణ్ణి ఆ యాగం ఆపించమని వేడుకున్నారు. అప్పుడుగానీ పరాశరుడు తన సత్రయాగాన్ని ఆపలేదు అన్నాడు అంగారపర్ణుడు. అప్పుడు అర్జునుడు ఆ వివరాలన్నింటికీ ఆనందించి 'మిత్రమా!

ఇక్కడ మాకు ఎవ్వరూ తెలియదు. నువ్వే మాకు దారి చూపించాలి. మంచి పురోహితుడు ఎవరు దొరుకుతారో కూడా నువ్వే చెప్పాలి సుమా!'అన్నాడు.

అప్పుడా అంగారపర్ణుడు 'అర్జునా! ఇక్కడికి దగ్గరలో ధౌమ్యుడు అనే బ్రాహ్మణుడు తపస్సు చేసుకుంటున్నాడు. మీరు అతడిని పురోహితునిగా చేసుకోండి' అని చెప్పాడు.

వెంటనే పాండవులు ధౌమ్యుణ్ణి కలిసి అభ్యర్థించి, అతణ్ణి తమకు పురోహితుడిగా చేసుకున్నారు.

## ద్రౌపది స్వయంవరం

మళ్ళీ పాంచాల దేశానికి ప్రయాణం మొదలయ్యింది. దారిలో కలిసిన బ్రాహ్మణులద్వారా ద్రౌపది స్వయంవరం గురించి తెలుసుకొని ద్రుపదనగరంవైపు సాగిపోయారు. ఆ బ్రాహ్మణులతోనే కలిసి ప్రయాణించి, ద్రుపదనగరం చేరుకుని అక్కడ ఒక కుమ్మరి ఇంటిలో విడిది చేశారు.

## మత్స్యయంత్రం

ద్రౌపదీ స్వయంవరం. ఎందరెందరో రాజకుమారులు, ఉత్సాహంగా వచ్చారు. మత్స్యయంత్రాన్ని కొట్టినవారిని వరించడానికి పుష్పమాలికచేతిలో పట్టుకొని ద్రౌపది సిద్ధంగా ఉంది.

ధృష్టద్యుమ్నుడు, స్వయంవరానికి వచ్చిన రాజులందరికీ మత్స్యయంత్రం గురించి వివరించాడు. ద్రౌపదికీ, స్వయంవరానికి వచ్చిన రాజుల గురించి చెప్పాడు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు వారి సోదరులు, వారి పక్కనే కర్ణ, అశ్వత్థామ, సోమదత్త, శ్రుతసేనాది వీరులూ శల్యుడు, విరాటుడు, జరాసంధుడు, గాంధార రాజులూ, సారణుడు, సాత్యకి, సాంబుడు, సంకర్షణుడు,ప్రద్యుమ్నుడు, కృతవర్మ, అనిరుద్ధుడు, యుయుధానుడు మొదలైన వారూ, సుమిత్రుడు, సుకుమారుడు, సుశర్మ, సుదక్షిణుడు, సుషేణుడు, సేనాబిందుడు, చంద్రసేనుడు, సముద్రసేనుడు, ఔశీనరుడు, చేకితానుడు, శిశుపాలుడు, జనమేజయుడు,

జయద్రథుడు, బృహద్రథుడు, సత్యవ్రతుడు, చిత్రాంగదుడు, శుభాంగదుడు, భగీరథుడు, భగదత్తుడు, పౌండ్రక వాసుదేవుడు, వత్సరాజు మొదలైన రాజులు, ఇంకా యదు, వృష్ణి, భోజ, అంధక వంశ రాజులూ విచ్చేశారు. ఆ రాజులతో సభాభవనం క్రిక్కిరిసి ఉంది.

'మహావీరులారా! అదిగో! విల్లు. ఇదుగో! మత్స్యయంత్రం. అందుకోండి! ఈ యంత్రాన్ని ఎవరు పడగొడతారో వారినే నా కూతురు వరిస్తుంది' అన్నాడు ద్రుపదుడు.

ఒకటే కోలాహలం. రాజకుమారులు పోటీ పడ్డారు. కానీ కనీసం విల్లును ఎత్తనైనా ఎత్తలేకపోయారు.

శ్రీకృష్ణుడూ, తన అన్న బలరాముడితో స్వయంవరానికి వచ్చాడు. వచ్చిన వారినందరినీ తేరిపారా చూశాడు శ్రీకృష్ణుడు. బ్రాహ్మణ సమూహంలో, నివురు కప్పిన నిప్పుకణికల్లా ఉన్న పాండవులను గుర్తించాడు. (మహాభారతంలో శ్రీకృష్ణుడి ప్రస్తావన మొదటిసారి వచ్చేది ఈ ఘట్టంలోనే. శ్రీకృష్ణపాండవమైత్రికి ఇక్కడే నాంది). ఒక్క కనుసైగతో, యదువీరుల నెవ్వరినీ స్వయంవరంలో పాల్గోవద్దని ఆదేశించాడు శ్రీకృష్ణుడు. స్వయంవరం మొదలైంది.

ఒక్కొక్కరే వస్తున్నారు కానీ ఎవ్వరూ ఆ విల్లును ఎక్కుపెట్టలేకపోయారు. శిశుపాలుడు, కర్ణుడు, శల్యుడు లాంటి కొందరు వీరులు ఎక్కుపెట్టారు. కానీ మత్స్యయంత్రాన్ని ఛేదించలేకపోయారు.

అంతా చూస్తున్నాడు అర్జునుడు. అన్నగారి వైపు చూశాడు. కనుసైగతోనే ధర్మరాజు ఆజ్ఞ లభించింది. అర్జునుడు కదిలాడు. సభాస్థలి వైపు వెళ్లాడు.

అది చూసి అక్కడ ఉన్న బ్రాహ్మణులు ఆశ్చర్యంతో 'మహా మహా వీరులే ఎక్కుపెట్టలేకపోయారు, ఇతడివల్ల అవుతుందనేనా? వచ్చిన వాడు వచ్చినట్టే సంభావన పుచ్చుకొని వెళ్ళిపోవాలిగానీ ఎందుకీ తెలివితక్కువపనులు? బ్రాహ్మణులను నవ్వులపాలు చెయ్యడానికి కాకపోతే!' అని ఒకటే చెవులు కొరుక్కుంటున్నారు.

కొందరు బ్రాహ్మణులు మాత్రం 'మన పరువు నిలబెట్టాలి. నీకు శుభం జరుగుతుంది' అని ఆశీర్వదించారు.

అర్జునుడు విల్లు దగ్గరకు వెళ్లాడు. దానికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, నమస్కారం చేశాడు. అలవాటైన వాళ్ళు ఎత్తినట్టుగా ధనుస్సును అవలీలగా ఎత్తి సంధించాడు. ఐదు బాణాలతో మత్స్యయంత్రాన్ని పడగొట్టాడు.

వచ్చిన రాజులందరూ ఆశ్చర్యపోయారు, వారికి నోటమాట రాలేదు.

బ్రాహ్మణులందరూ తమ తమ ఉత్తరీయాలను, చెంబులనూ గాలిలో ఊపుతూ ఒకటే కేరింతలు.

వెంటనే ధర్మరాజు, భీముడిని అర్జునుడికి సహాయంగా ఉంచి, నకుల సహదేవులతో తన విడిదికి వెళ్లిపోయాడు.

ద్రుపదరాజపుత్రి ద్రౌపది మందగమనంతో వచ్చి, అర్జునుడి మెడలో వరమాల వేసింది.ఇది చూసి స్వయంవరానికి వచ్చిన రాజులందరికీ కోపం భగ్గుమంది. అక్కడే ఉన్న దుర్యోధనుడు కలుగజేసుకొని ద్రుపదుడితో 'తన విద్యాపటిమతో, మత్స్యయంత్రాన్ని భేదించి, ద్రౌపదిని గెల్చుకున్న ఈ బ్రాహ్మణుడిదేం తప్పులేదు. కానీ ఇంతమంది రాజులను స్వయంవరానికి ఎందుకు పిలవాలి? ఎందుకు మర్యాదలు చెయ్యాలి? ఎందుకు అవమానించాలి? దీనికంతటికీ కారకుడు ఈ ద్రుపదుడే. ఇతని బలాన్ని అణచాలి' అని అన్నాడు కోపంగా.

ద్రుపదుడు అర్జునుడి పక్కన నిలబడ్డాడు. అక్కడ ఉన్న బ్రాహ్మణులంతా 'ఓహో! అలాగా! అయితే రండి తేల్చుకుందాం' అంటూ తమ ఉత్తరీయాలను ఎగురవేస్తూ ఆ రాజులను కవ్వించారు.

అర్జునుడు నవ్వుతూ భీముడికి సైగ చేయగా ఇద్దరూ విజృంభించారు. భీముడు పక్కనే ఉన్న వృక్షాలనూ, స్తంభాలను పెకలించి వారి మీదకి విసిరాడు.

ఇదంతా చూసి శ్రీకృష్ణుడు ఆశ్చర్యపోయాడు. తన అన్న బలరాముణ్ణి చూసి 'అన్నయ్య! చూశావా? వాళ్ళే పాండవులు. అదుగో! చేతిలో విల్లు ఉందే అతడే!

అర్జునుడు. చూడు ఆ పక్కనే చెట్టును పెకలిస్తున్నవాడే భీముడు! ఇందాక సభ నుండి వెళ్లిపోయారే వాళ్ళే ధర్మరాజ నకుల సహదేవులు'అని పరిచయం చేశాడు.

బలరాముడు ఆశ్చర్యపోయాడు. ఎప్పుడో లక్క ఇంటిలో చనిపోయారు అనుకున్న పాండవులు ఇక్కడ ఈ విధంగా ప్రత్యక్షం కావడం ఎంతో ఆనందం కలిగించింది బలరామునికి.

కర్ణుడు అర్జునుడితో యుద్ధం చేస్తున్నాడు. ఒక బ్రాహ్మణుడికి ఇంత విలువిద్యా నైపుణ్యమా! ఎలా వచ్చిందబ్బా! అనుకుంటూ కర్ణుడు –

'ఓరీ! బ్రాహ్మణా! నా ముందు ఒక్క పరశురాముడు, దేవేంద్రుడు, అర్జునుడు తప్ప వేరేవాళ్ళు నిలవలేరు. అసలు నువ్వు ఎవరు?' అని అడిగాడు.

అర్జునుడు నవ్వుతూ 'నేను వీరిలో ఎవ్వరినీ కానులే. ముందు నాతో యుద్ధం చెయ్యి' అన్నాడు.

భీముడు శల్యుణ్ణి మల్లయుద్ధంలో ఓడించాడు.

ఈ బ్రాహ్మణులతో యుద్ధం ఏమిటని రాజులందరూ వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. కానీ దుర్యోధనుడు మాత్రం 'ఈ బ్రాహ్మణులు ఎవరు? ఏమిటి? ఎక్కడ ఉంటారు? ఎక్కడ నుండి వచ్చారు?' అని ఆరాలు తీయడం మొదలుపెట్టాడు.

అది గమనించిన శ్రీకృష్ణుడు – 'సుయోధనా! ఇతరులు ఎవ్వరూ చెయ్యలేని కార్యాన్ని ఆ బ్రాహ్మణుడు చేశాడు. ద్రౌపదిని భార్యగా పొందాడు, అంతే కదా! అతని గురించి మనకెందుకు? వెళ్దాం పద' అంటూ పక్కకు తీసుకు వెళ్ళాడు. చివరికి దుర్యోధనుడూ మిగిలిన రాజులూ సరే! అని వెళ్లిపోయారు.

భీమార్జునులు ద్రౌపదిని తమతో తీసుకువెళ్ళారు. విడిది ఇంట్లో ఉన్న కుంతీదేవి స్వయంవరోత్సవాన్ని చూడటానికి వెళ్లిన తన కొడుకులు ఇంకా ఎందుకు రాలేదోనని కంగారు పడుతోంది. ఒకవేళ కౌరవులు ఏమైనా చేశారేమోనని ఆవిడ అనుమానం. ఇలా రకరకాలుగా ఆలోచిస్తూ ఉంటే ధర్మరాజు, నకుల సహదేవులు ముందుగా వచ్చారు. ఆ తరువాత కొంచెంసేపటికి భీమార్జునులు వచ్చారు.

రాగానే అర్జునుడు "అమ్మా, మేము ఒక భిక్ష తీసుకొని వచ్చాం" అని అన్నాడు. దానికి కుంతీదేవి సంతోషించింది. "నాయనా! మీరు ఐదుగురూ దానిని ఉపయోగించండి" అంది. కానీ కొడుకు తెచ్చిన ఆ భిక్ష ఒక కన్య అని తర్వాత తెలిసిందామెకు. తాను చెయ్యమన్నట్లు చేస్తే అది అధర్మం అవుతుందేమోనని భయపడుతూ –

"నాయనా ధర్మరాజా! మీరు ఏం తెచ్చారో తెలీక నేను అలా అన్నాను కానీ నిజానికి అది అధర్మం కదా! కాబట్టి ధర్మరాజా! ఇప్పుడు కర్తవ్యం ఏమిటో నువ్వే ఆలోచించు" అంది.

అప్పుడు ధర్మరాజు అర్జునుణ్ణి చూసి "అర్జునా! ఈమెను స్వయంవరంలో గెలిచినవాడివి నువ్వే కాబట్టి అగ్నిసాక్షిగా నువ్వే వివాహమాడు"అన్నాడు.

దానికి అర్జునుడు "పెద్దవారు మీరుండగా నేను వివాహం చేసుకోవడం ఉచితమా చెప్పండి? కాబట్టి ఈమెను మీరే వివాహం చేసుకోండి" అన్నాడు. ధర్మరాజు సోదరులందరినీ పరిశీలించాడు. పైకి చెప్పలేకపోతున్నారు గానీ అందరికీ ఆమెను పెళ్ళాడాలని ఉంది. అలా వాళ్ళ మనసు గ్రహించిన ధర్మరాజు

'సరే ! మనం ఐదుగురమూ ద్రౌపదిని వివాహం చేసుకుందాం' అని అన్నాడు. అలా ద్రౌపది ఐదుగురికీ భార్య అయ్యింది.

అదే సమయానికి బలరామకృష్ణులూ వచ్చారు. వారిని అభినందించి వెళ్ళిపోయారు.

మత్స్యయంత్రాన్ని కొట్టి తన కూతుర్ని చేపట్టిన ఆ బ్రాహ్మణుడు అర్జునుడేనని తెలుసుకొని ద్రుపదుడూ ఆనందించాడు.

***

అక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు – 'నాన్నగారూ! మనం చేసిన ప్రయత్నం వ్యర్థం అయ్యింది. పైగా ఇప్పుడు ద్రుపదుడు పాండవులకు

బంధువయ్యాడు. యాదవులూ పాండవులకు తోడుగా ఉంటారు. ఇలా అయితే కష్టం. ఎలా అయినా ద్రుపదుణ్ణీ పాండవుల్నీ ఇక్కడికి రప్పించాలి' అన్నాడు.

ధృతరాష్ట్రుడు పెద్దలందరినీ పిలిచి దుర్యోధనుడి ఆలోచన గురించి చెప్పాడు. దానికి భీష్ముడు 'దుర్యోధనా! నీ ఆలోచన మంచిది కాదు. నాకు మీరూ పాండవులూ ఒక్కటే! ఈ రాజ్యంపై ఇద్దరికీ అధికారం ఉంది. సొంత అన్నదమ్ములే రాజ్యం కోసం కొట్లాడుకుంటే మన వంశప్రతిష్ఠ దెబ్బతింటుంది.

**ఆ.వె. కీర్తి లేని వానికిని జీవనంబు ని**
**రర్థకంబ సూవె! యవని మీద**
**నిత్యమయిన ధనము నిర్మలకీర్తియ**
**యట్టికీర్తి పడయుట శ్రమంబె! (ఆది:8-31)**

**'నాయనా! పేరూ ప్రతిష్ఠా లేనివాడి బతుకు ఎందుకు? ఈ భూమిపై కీర్తే శాశ్వతమైన ధనం. దాన్ని పొందటం చాలా కష్టం సుమా! కీర్తి లేకపోతే గౌరవం ఉండదు. కీర్తి వల్ల స్వర్గం. అపకీర్తి వల్ల నరకం. కాబట్టి కీర్తిని పొందే పని చెయ్యాలి'** అని హితవు పలికాడు.

భీష్ముడి మాటల్ని ద్రోణుడు సమర్థించాడు. కర్ణుడు ఖండించాడు. అంతలో విదురుడు వచ్చి అందరినీ శాంతింప జేశాడు. తానూ ధృతరాష్ట్రుడికి హితవు పలికాడు. వీళ్ళందరి మాటల్నీ విన్న ధృతరాష్ట్రుడు, కుంతీదేవినీ, పాండవుల్నీ పిలిపించాడు. అందరి సమక్షంలో అర్ధరాజ్యం ఇచ్చి ధర్మరాజుకు పట్టాభిషేకం కూడా చేశాడు.

పాండవులు ఖాండవప్రస్థం అనే చోట శ్రీకృష్ణుడి సహాయంతో విశ్వకర్మ ద్వారా ఒక అందమైన నగరాన్ని కట్టించుకున్నారు. అది ఇంద్రుడి స్వర్గాన్ని తలదన్నేలా ఉంది. దానికే ఇంద్రప్రస్థం అని పేరు వచ్చింది.

శ్రీకృష్ణుడు చాలాకాలం అక్కడే వారితో ఉండి, తర్వాత ద్వారకకు వెళ్ళిపోయాడు.

## సుందోపసుందుల వృత్తాంతం

ఒక రోజు ఇంద్రప్రస్థానికి నారదమహర్షి వచ్చాడు. ధర్మరాజు ఆయనను సాదరంగా ఆహ్వానించి 'మహర్షీ! మాపూర్వ జన్మ సుకృతంగా మీ దర్శనభాగ్యం లభించింది' అన్నాడు.

నారదుడు పాండవులను ఏకాంతానికి పిలిచి – 'పాండుపుత్రులారా! మీకు తెలియని ధర్మం అంటూ ఏదీ లేదు. ద్రౌపది మీ ఐదుగురికీ భార్య. ఇది లోక విరుద్ధం, శాస్త్ర విరుద్ధం కూడా. కాబట్టి ఈమె వల్ల మీలో మీకు గొడవలు రాకూడదు. **స్త్రీవల్ల మనస్పర్ధలు రావడం సహజం. ఇలా ఒక గొడవపడిన సుందోప సుందుల వృత్తాంతం చెబుతాను వినండి. వీళ్ళు ఒక స్త్రీ వల్ల వివాదం వచ్చి వాళ్ళలో వాళ్ళు కొట్టుకుని మరణించారు.**

నికుంభుడు అనే రాక్షసుడికి సుందుడు, ఉపసుందుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వాళ్ళిద్దరూ బ్రహ్మను గురించి ఘోరమైన తపస్సు చేసి కామ గమనం, కామ రూపం, మరణం రాకుండా వరాలు ఇమ్మని కోరారు.

బ్రహ్మదేవుడు మిగిలిన వరాలు ఇచ్చి, మరణమే రాకుండా వరమివ్వడం మాత్రం సాధ్యం కాదని చెప్పాడు. అప్పుడు వాళ్ళు తమకు ఇతరుల చేతిలో చావు రాకూడదని కోరారు. బ్రహ్మదేవుడు అంగీకరించాడు.

ఆ వర బలంతో వాళ్ళు తాపసులను, రాజులను వేధించడం మొదలుపెట్టారు. వాళ్ళంతా బ్రహ్మదేవుడి దగ్గర మొర పెట్టుకున్నారు.

బ్రహ్మదేవుడు వారికి ఇతరుల చేతిలో మరణం లేదు, కానీ ఒకరి చేతిలో ఒకరు మరణించ వచ్చు కదా! అనుకుని విశ్వకర్మని పిలిచి లోకోత్తరమైన ఒక సుందరిని సృష్టించమని అడిగాడు.

విశ్వకర్మ అప్పుడు 'తిలోత్తమ' అనే సుందరిని సృష్టించాడు. ఆ తిలోత్తమ బ్రహ్మదేవుడిని తనను ఎందుకు సృష్టించారని అడిగింది. బ్రహ్మదేవుడు ఆమెతో సుందోపసుందుల వృత్తాంతం చెప్పి వారిద్దరూ ఒకరితో ఒకరు కలహించుకుని ఇద్దరూ మరణించేలా చెయ్యమని చెప్పాడు.

తిలోత్తమ అలాగేనని బ్రహ్మదేవుడికి భక్తితో ప్రదక్షిణ చేసింది. బ్రహ్మదేవుడు ఆమె అందానికి ముగ్ధుడై నలుపక్కలా ముఖం తిప్పాడు. దానివల్ల అతడు అప్పటి నుండి చతుర్ముఖుడయ్యాడు. తిలోత్తమ అందానికి దేవేంద్రుడికి రెండు కళ్ళు చాలలేదు. వళ్ళంతా కళ్ళు పెట్టుకుని చూశాడు. అప్పటి నుండి అతడు వేయికళ్ళవాడయ్యాడు.

తిలోత్తమ సుందోపసుందుల కంట పడింది. పడగానే వాళ్ళు కామంతో తిలోత్తమ నాది అంటే నాది అని చెరో  చెయ్యి పట్టుకుని లాగుతూ 'నీకు ఎవరు కావాలి?' అని అడిగారు తిలోత్తమను.

తిలోత్తమ వగలుపోతూ 'మీలో ఎవరు బలవంతులైతే వారినే నేను ప్రేమిస్తాను' అని చెప్పింది.

వెంటనే విచక్షణ కోల్పోయిన వారిద్దరూ యుద్ధం మొదలు పెట్టారు. అలా యుద్ధం చేసి ఒకరినొకరు చంపుకొని ఇద్దరూ మరణించారు.

**కాబట్టి ఎంత బలవంతులకైనా, ధైర్యవంతులకైనా స్త్రీ కారణంగా విరోధం రావచ్చు.** అందుకే చెబుతున్నా! ద్రౌపది ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరి ఇంటిలో ఉండేలా నియమం పెట్టుకోండి. ఆమె ఎవరితో ఉంటుందో ఆ ఇంట్లోకి తక్కినవాళ్ళు వెళ్ళకూడదు. ఆ నియమాన్ని తప్పినవాళ్ళు ఒక సంవత్సరం తీర్థయాత్రలు చేసి రావాలి' అన్నాడు.

పాండవులు అలాగేనంటూ నారదుడి ఎదుట ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞ చేసినట్లుగానే నడుచుకొంటున్నారు కూడా.

ఒక రోజు ఒక సంఘటన జరిగింది. ఎవరో ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. అతడి ఆవును ఎవరో దొంగిలించారట! ఆ బ్రాహ్మణుడు అర్జునుడి వద్దకు వచ్చి దొంగలను శిక్షించి, తన గోవును తనకు తెచ్చి ఇవ్వమని అడిగాడు.

అప్పుడు అర్జునుడి ధనుస్సు ఆయుధశాలలో ఉంది. దాన్ని తీసుకోవాలంటే ధర్మరాజు ద్రౌపదితో నివాసం ఉన్న భవనంవైపునుండి వెళ్ళాలి. అక్కడికి వెళితే నియమభంగం ఔతుంది. కానీ బ్రాహ్మణుడి బాధను నివారించడం తన ధర్మం. ఇలా అలోచించి చివరికి ఆయుధశాలకి వెళ్ళి ధనుస్సు తెచ్చుకున్నాడు. ఆ దొంగలను చంపి గోవును తెచ్చి బ్రాహ్మణుడికి ఇచ్చాడు.

బ్రాహ్మణుడి కోరికనైతే తీర్చాడు కానీ మొత్తానికి నియమభంగం అయ్యింది. కాబట్టి ఒప్పందం ప్రకారం అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు.

ధర్మరాజు మాత్రం 'అర్జునా! నువ్వు వచ్చింది సత్కార్యంకోసమే కాబట్టి నియమం తప్పినట్లు కాదులే!' అన్నాడు. అయినా అర్జునుడు 'అన్నయ్యా! ఏదో ఒక సాకు చెప్పి ధర్మాన్ని తప్పడం భావ్యం కాదు. కాబట్టి తీర్థయాత్ర చేయడానికి నాకు అనుమతి ఇవ్వండి' అని వేడుకున్నాడు.

ధర్మరాజు తన తమ్ముడి ధర్మనిరతికి పొంగిపోతూ 'వెళ్ళిరా నాయనా' అంటూ పంపించాడు.

బ్రాహ్మణులతోనూ, పౌరాణికులతోనూ కలిసి అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. ముందుగా గంగాతీరం చేరుకున్నాడు. అక్కడికి ఒకరోజు ఉలూచి అనే నాగకన్య వచ్చింది. అమె అర్జునుని చూసి మోహించింది. అర్జునుడు తాను బ్రహ్మచర్య వ్రతంలో ఉన్నానని అన్నగారి ఆదేశంతో తీర్థయాత్ర చేస్తున్నాననీ అలా పవిత్రకార్యంలో ఉన్న నన్ను ఇలా కోరడం భావ్యం కాదనీ వారించాడు. అప్పుడు ఉలూచి అర్జునుడితో 'మీ గురించి అంతా నాకు తెలుసు. ఇంతమాత్రానికే వ్రత భంగం కాదు లెండి! నా కోరిక తీర్చకుంటే ఆత్మహత్య చేసుకుంటాను. అలా జరిగితే ఎన్ని దానధర్మాలు చేసినా ఆ పాపం పోదు' అంది.

అర్జునుడు అంగీకరించాడు. అలా అర్జునుడికీ ఉలూచికీ 'ఇరావంతుడు' అనే పుత్రుడు జన్మించాడు.

తరువాత అర్జునుడు గయ, గంగాసాగరసంగమం మొదలైన క్షేత్రాలు సందర్శిస్తూ మణిపురం అనే నగరానికి వెళ్ళాడు. ఆ దేశపురాజు చిత్రవాహనుడు. అతడి కుమార్తె చిత్రాంగదను అర్జునుడు ప్రేమించాడు.

చిత్రవాహనుడు అర్జునుడితో 'అర్జునా! నా కుమార్తెను నీకు ఇవ్వడానికి నాకు ఏ అభ్యంతరం లేదు. కానీ మా వంశంలో అందరికి ఒక కుమారుడే పుడుతూ వచ్చాడు. నాకు మాత్రం కుమార్తె పుట్టింది కాబట్టి నా రాజ్యానికి వారసుడు లేడు. చిత్రాంగదకు పుట్టబోయే కుమారుడు నాకు వారసుడుగా కావాలి. అందుకు అంగీకరిస్తే ఈ వివాహానికి అంగీకరిస్తాను' అన్నాడు.

అర్జునుడు అందుకు అంగీకరించి చిత్రాంగదను వివాహం చేసుకున్నాడు. వారికి బభ్రువాహనుడు పుట్టాడు. అర్జునుడు అక్కడి నుండి ద్వారకకు బయలుదేరాడు. చిత్రవాహనుడి కోరికపై తన కొడుకును అతడికే అప్పగించి ప్రభాసతీర్థానికి చేరుకున్నాడు అర్జునుడు. అక్కడికి దగ్గరలోనే ఉంది ద్వారకానగరం.

## సుభద్రాపరిణయం

యతివేషంలో ద్వారకానగరానికి వచ్చాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు అతడి రాకను ముందే తెలుసుకొని అర్జునుణ్ణి రైవతకాద్రిపై ఉంచాడు.

తరువాత రోజు 'రైవతకాద్రికి పూజలు చెయ్యండి' అని నగరంలో చాటింపు వేయించాడు శ్రీకృష్ణుడు. అందరూ వెళ్ళారు. వారిలో శ్రీకృష్ణుడి చెల్లెలు సుభద్ర కూడా ఉంది. ఆమె అర్జునుణ్ణి ప్రేమించింది. అతడితో తన పెళ్ళి జరగాలని కోరుకుంటూ ఆ పర్వతాన్ని పూజించింది.

బలరాముడు కూడా వచ్చాడు. అక్కడ యతిరూపంలో ఉన్న అర్జునుణ్ణి చూశాడు. తమ ఇంటికి ఆహ్వానించాడు. అతడికి సేవలు చేయడానికి సుభద్రనే నియమించాడు.

సుభద్ర అతడికి సేవ చేస్తూ ఒకరోజు 'స్వామీ! మీరు తీర్థయాత్రలు చేస్తూ ఉంటారు కదా! మా బావ అర్జునుడు కూడా తీర్థయాత్రలకు వెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు. నాకెందుకో దిగులుగా ఉంది. మీకేమైనా కనిపించాడా?' అని తన మనసులో మాట చెప్పింది.

అర్జునుడు యతివేషాన్ని తొలగించాడు. సుభద్ర ఆశ్చర్యపోయింది.

శ్రీకృష్ణుడు ఇక ఆలస్యం చెయ్యకూడ దనుకున్నాడు. ఒక మంచి ముహూర్తంలో అద్భుతమైన పథకం వేసి వాళ్ళకు పెళ్ళి చేసి సుభద్రను అర్జునుడితో రథంపై పంపించాడు.

తరువాత విషయం తెలిసిన బలరాముడు మొదట ఆగ్రహించినా శ్రీకృష్ణుడి మాటలు విని శాంతించాడు.

కొంతకాలం తరువాత సుభద్రకూ అర్జునుడికీ అభిమన్యుడు అనే పుత్రుడు జన్మించాడు.

ద్రౌపదికీ ధర్మరాజు ద్వారా ప్రతివింధ్యుడు, భీముడి ద్వారా శ్రుతసోముడు, అర్జునుడి ద్వారా శ్రుతకీర్తి, నకుల సహదేవుల ద్వారా శతానీక శ్రుతసేనులనే కొడుకులు కలిగారు. వీళ్ళకే ఉపపాండవులని పేరు.

## ఖాండవ వన దహనం

పూర్వం శ్వేతకి అనే మహర్షి దీర్ఘసత్రయాగాన్ని చేశాడు. వంద సంవత్సరాల పాటు సాగింది ఆ యాగం. అందులో సమర్పించిన నెయ్యిని తాగిన అగ్నిదేవుడికి అజీర్తి రోగం పట్టుకుంది. అది పోవాలంటే వనమూలికలతో ఉన్న ఖాండవవనాన్ని దహించమని బ్రహ్మదేవుడు చెప్పాడు.

అగ్ని ఆ వనాన్ని దహించడం మొదలు పెట్టాడు. ఇంతలో దట్టమైన మేఘాలు వచ్చి వర్షం కురిపిస్తున్నాయి. మళ్ళీ బ్రహ్మదేవుడి దగ్గర మొరపెట్టుకున్నాడు అగ్నిదేవుడు.

అప్పుడు బ్రహ్మదేవుడు 'అందుక్కారణం ఆ వనంలో తక్షకుడు ఉన్నాడు. ఆ తక్షకుడు ఇంద్రుడికి మిత్రుడు. కాబట్టి నువ్వు కొంతకాలం అక్కడే వేచి ఉండు. కృష్ణార్జునులు వస్తారు' అని చెప్పాడు.

అందుకే వేచి ఉన్నాడు అగ్నిదేవుడు.

ఒకరోజు శ్రీకృష్ణార్జునులు ఖాండవవనం వద్దకు వచ్చారు. అగ్నిదేవుడు వాళ్ళకు తన బాధ గురించి చెప్పి రక్షించమని వేడుకొన్నాడు.

ఇంద్రుడితో యుద్ధం చేయడానికి అర్జునుడు అవసరమైన రథాన్నీ, వింటినీ, అక్షయతూణీరాన్నీ ఇవ్వమని అడిగాడు. అగ్నిదేవుడు వెంటనే వరుణుణ్ణి పిలిచి వాటన్నింటినీ ఇప్పించాడు. అలాగే శ్రీకృష్ణుడికి సుదర్శనమనే దివ్యచక్రాన్ని, కౌమోదకి అనే గదనూ సమర్పించాడు.

శ్రీకృష్ణార్జునుల అండతో అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహించి వేశాడు. మొదట ఇంద్రుడు వీళ్ళతో యుద్ధం చేశాడు. కానీ శ్రీకృష్ణార్జునులే నరనారాయణులని తెలుసుకొని యుద్ధం విరమించాడు.

అయితే ఈ వనంలో అశ్వసేనుడు అనే సర్పం, మయుడు అనే రాక్షసుడు, మందపాలమహర్షి భార్య జరిత, ఆమె నలుగురు పిల్లలూ మాత్రం కాలిపోకుండా సురక్షితంగా బయటపడ్డారు.

# సభాపర్వం

మయుడు దేవశిల్పి. వృషపర్వుడు అనే రాజు మయుణ్ణి ఒక భవనం నిర్మించి ఇమ్మని అడిగాడు. అందుకు కావలసిన పరికరాలన్నింటినీ సిద్ధం చేసుకొని వాటిని బిందుసరోవరంలో ఉంచాడు.

**మయసభా వైభవం**

కృష్ణార్జునులు మయుడిని వెంట పెట్టుకుని ఇంద్రప్రస్థానికి వెళ్ళారు. ధర్మరాజుతో జరిగినది చెప్పి మయుణ్ణి పరిచయం చేశారు.

అర్జునుడితో మయుడు 'అర్జునా! నీ దయ వల్ల నేను అగ్నికి ఆహుతి కాకుండా బ్రతికాను. నేను దానవ శిల్పిని. చిత్ర విచిత్రమైన నిర్మాణాలు చేయగలను. మీకు ఇష్టమైనది ఏదో చెప్పండి చేస్తాను' అన్నాడు.

అర్జునుడు శ్రీకృష్ణుడి వంక చూశాడు.

శ్రీకృష్ణుడు 'కురువంశ మహారాజు ధర్మరాజు వైభవానికి తగినట్లు ఒక భవనం నిర్మించి ఇవ్వు' అని మయుడితో అన్నాడు.

మయుడు 'ఈ భూమిపై ధర్మరాజుని మించిన రాజు లేడు. అందుకని ప్రజలు మెచ్చేలా చిత్ర విచిత్రమైన భవనాన్ని నిర్మించి ఇస్తాను. వృషపర్వుడనే రాక్షసరాజుకు ఒక సభ నిర్మించడానికి అన్నీ సమకూర్చుకున్నాను. కారణాంతరాల వల్ల నిర్మించలేకపోయాను. ఆ ఉపకరణాలను బిందుసరోవరంలో దాచి ఉంచాను. వాటిని తెచ్చి భవననిర్మాణం చేస్తాను. నా వద్ద భౌమాదిత్యుడు దాచిన గద, శంఖం ఉన్నాయి. గదను భీమసేనుడికీ, దేవదత్తం అనే శంఖాన్ని అర్జునుడికీ ఇస్తాను' అన్నాడు.

మయుడు బిందుసరస్సులో ఉన్న దూలాలూ, స్తంభాలూ ఉపయోగించి చిత్రమైన ఒక భవనాన్ని నిర్మించాడు. ఇంద్రనీల మణులతో నీటినీ, పద్మరాగ మణులతో ఎర్రని పద్మాలనూ, వెండితో తెల్ల తామరలను, రాజహంసలను, వజ్రాలతో చేపలను, ముత్యాలతో నురుగునూ, మరకత మణులతో నీటిలోని నాచునీ తయారు చేశాడు. అవి నిజమని భ్రమించేలా నిర్మించాడు.

నీటి యంత్రాలు, చెట్లు, నీటి పక్షులు, పక్షిగూళ్ళు మొదలైనవి, వివిధ రత్న కాంతులతో శోభిల్లే ఆ భవనం 14 నెలల్లో నిర్మించాడు. దానిని ఎనిమిది వేల మంది బలిష్ఠులతో ఆకాశమార్గాన తెచ్చి ధర్మరాజుకు బహూకరించాడు.

ధర్మరాజు ఒక శుభముహూర్తాన పురోహితుడైన ధౌమ్యుడి ఆశీర్వాదంతో భార్యతో తమ్ముళ్ళతో మయసభలోనికి ప్రవేశించాడు. సామంతరాజులు ధర్మరాజుని దర్శించి కానుకలు సమర్పించారు.

మయసభలో ధర్మరాజు దేవేంద్రుడిలా వెలిగిపోతున్నాడు. ఒకరోజు నారదమహర్షి అక్కడికి విచ్చేశాడు.

## నారదుడి హితబోధ

ధర్మరాజు నారదమహర్షికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, సత్కరించి, రాజనీతి గురించి చెప్పమని అడిగాడు. అప్పుడు నారదుడు – ధర్మరాజా! **నువ్వు ధర్మ మార్గాన్నే అనుసరిస్తున్నావు కదా!రాజకార్యాలను ధర్మనిష్ఠతో , స్వబుద్ధితో అర్ధరాత్రి దాటిన తరువాత కూడా ఆలోచిస్తున్నావు కదా! రాజోద్యోగాలలో యోగ్యులనూ, స్థిరచిత్తులనూ నియమించావు కదా! సమర్థులైన బ్రాహ్మణులనూ, శాస్త్ర నియమాలు తెలిసిన వారినీ మంత్రులుగా నియమించావు కదా! విజయానికి కారణం మంత్రాంగమే. దానిని ఎవరికి తెలియకుండా రక్షిస్తున్నావు కదా!**

**నీతో యజ్ఞాలు చేయించిన యాజ్ఞికుడు యజ్ఞాలు సక్రమంగా నిర్వహిస్తున్నాడు కదా!**

**ఎల్లవేళలా నీ మేలు కోరేవారినీ, విశ్వాసపాత్రులనూ సైన్యాధ్యక్షులుగా నియమించావు కదా!మంచి పలుకుబడి ఉన్న మంత్రి నీకు వ్యతిరేక కార్యాలలో**

దిగి నీకు ద్రోహం తలపెట్టడం లేదు కదా! ఎందు కంటే ధనం, అధికారం ఎలాంటి వారికైనా గర్వం, దురాశను కలిగిస్తాయి.నీ రాజ్యంలోని శాస్త్రజ్ఞులు – రాబోయే ఉత్పాతాలను ముందుగానే కనిపెట్టి శాంతిప్రక్రియలు చేపడుతున్నారు కదా!

ఆయుర్వేద వైద్యులు ప్రజలకు ప్రేమతోనే సేవ చేస్తున్నారా! ఆర్థిక కార్యాలలో నైపుణ్యం కలవారినీ, మంచి చరిత్ర కలవారినీ, నీతి నియమాలు కలవారినీ, ధర్మ పరీక్షలో నెగ్గిన వారినీ నియమించావా లేదా? యోగ్యులను ఉద్యోగాలలో నియమిస్తున్నావా? నీ ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు ఇస్తున్నావా? లేకపోతే రాజుకు అదే పెద్ద కీడు. వంశపారంపర్యంగా నీకు సేవ చేస్తూ ప్రాణాలు అర్పించటానికి సిద్ధంగా ఉన్న ఉద్యోగులను గుర్తించి సత్కారాలు చేస్తున్నావు కదా!

నీ రాజ్యంలో నీ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలకు తిండి, బట్ట, నీడ కల్పిస్తున్నావు కదా! లోభబుద్ధి కలవాళ్ళను, దొంగలను, శత్రువులతో స్నేహంగా ఉండేవాళ్ళనూ, పిరికివాళ్ళనూ, దుర్మార్గులనూ రాజకార్యాలను నిర్వహించడానికి పంపడం లేదు కదా! నీ రాజ్యంలో అనావృష్టి లేదు కదా! చెరువులన్నీ నిండి ఉన్నాయి కదా! పేద రైతులకు ఉచితంగా విత్తనాలూ అవీ ఇస్తున్నావు కదా!

పౌరులకు నూటికి ఒకటి చొప్పున వడ్డీకి ఋణసౌకర్యం కల్పిస్తున్నావు కదా! నీ రాజ్యంలోని వికలాంగులు, అనాథలు, దిక్కులేని వారిని దయతో పోషిస్తున్నావు కదా! యుద్ధంలో శరణన్న వారిని కాపాడుతున్నావు కదా! నీకు మేలు చేసిన వారిని తగినవిధంగా సత్కరిస్తున్నావు కదా! నీకు వచ్చిన ఆదాయంలో నాలుగు లేదా రెండు లేదా మూడో భాగాన్ని మాత్రమే ఖర్చు చేస్తున్నావు కదా!

ఆయుధాగారానికి, ధనాగారానికి సమర్థులూ, నీతి మంతులూ అయిన వాళ్ళనే నియమించావు కదా!

వృద్ధశిల్పులనూ, గురువులనూ, వర్తకులనూ పోషిస్తున్నావు కదా! బయట ఉన్న వారి వల్ల కానీ, లోపల ఉన్న వారి వల్ల కానీ, శత్రురాజుల వల్ల కానీ ముప్పు రాకుండా వేగులను నియమించి కాపాడుకుంటున్నావు కదా!

మంచి విద్వత్తు కలిగిన ప్రముఖులతో రాగద్వేషాలు లేకుండా ధర్మం పాటిస్తూ వ్యవహారాలు చక్కపెడుతున్నావు కదా! నీ పరిరక్షణలో ఉన్న ప్రాంతాలు, కోటలు, రాజ్యాలు అన్నీ ధనధాన్యాలతో సమృద్ధిగా ఉన్నాయి కదా! ఉప్పు, పులుపు, కారం కలిగిన ఆహార పదార్థాలు వివిధ పానీయాలు, వంటసామగ్రి,వంటచెరుకు సమృద్ధిగా ఉన్నాయి కదా!

నీ కోటలన్నీ శత్రువులకు అభేద్యంగా ఉన్నాయి కదా! నువ్వు నీ అంతఃశత్రువులను జయించి పాలిస్తున్నావు కదా! మదాంధులైన శత్రువులను జయిస్తున్నావు కదా! నీ శత్రురాజులు నీపై దండెత్తకుండా వారిపై సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగిస్తున్నావు కదా! అని రకరకాలుగా నారదమహర్షి రాజులకు ఉపయోగపడే విధులన్నీ ప్రస్తావించి, ధర్మజా! రాజు చేయకూడని పనులు చెప్తాను విను, అంటూ చెప్పడం ప్రారంభించాడు.

## రాజులు చేయకూడని పనులు

రాజు నాస్తికుడిగా ఉండకూడదు. అబద్ధం ఆడకూడదు. ప్రమాదాలను ఆలస్యంగా గుర్తించ కూడదు. తెలివి తక్కువ వాళ్ళతో సమాలోచన చెయ్యకూడదు. ఎక్కువగా కోపగించుకోకూడదు. చేయవలసిన పనులను నాన్చకూడదు. ఆలస్యం చేయకూడదు. తెలివైనవారిని ఆలస్యంగా గుర్తించకూడదు. ప్రయోజనకరమైన విషయాలే ఆలోచించాలి తప్ప అప్రయోజకమైన ఆలోచనలు చేయకూడదు. నిర్ణయించిన పనులు ఆపకూడదు. ప్రభుత్వం తాలూకా రహస్యాలను బయటపడనీయకూడదు. ప్రజాహితకార్యాలు చేయకుండా ఆలస్యం చేయకూడదు. ఇంద్రియసుఖాలకు ప్రాముఖ్యం ఇవ్వకూడదు. సోమరితనం, నిర్లిప్తత, నిష్క్రియాపరత్వం రాచకార్యాలలో తగదు’ అన్నాడు నారదమహర్షి.

ఆ మాటలను శ్రద్ధగా ఆలకించిన ధర్మరాజు – 'మహర్షీ! నా యథాశక్తి ధర్మ మార్గంలో పాలన సాగిస్తున్నాను. తమరు మయసభను చూశారా ఎలా ఉంది?' అని అడిగాడు. దానికి నారదుడు 'ధర్మరాజా! నేను దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవుల దివ్యసభలే కాక ఇంకా ఎన్నో సభలు చూసాను. అన్నింటి కన్నా మయసభ అపూర్వంగా ఉంది'అన్నాడు.

ఒకసారి నేను బ్రహ్మ సభను చూసాను. అది ఎంత అద్భుతంగా ఉందో చెప్పలేను. మరీచి, మనువు, సూర్యచంద్ర గ్రహాలు, దేవగణాలు,వసువులు, రుద్రులు, సిద్ధులు, సాధ్యులు, మహర్షులు, అశ్వినీ దేవతలు, విశ్వకర్మ, పితృదేవతలు, ధర్మార్థ, కామమోక్షాలు, శబ్ద, గంధ, రూపాలు, తపస్సు, దమం, ధృతి, స్మృతి, మేధ, క్షమ, బుద్ధి, కీర్తి, సంకల్పం, వికల్పం, ప్రణవం, క్షవం, లవం, తృటి, కాష్ఠ, ముహూర్తం, పగలు,రాత్రి, పక్షం, మాసం మొదలైన విభాగాలతో కూడిన కాలచక్రం, చతుర్వేదాలు, వేదాంగాలు, పురాణేతిహాసాలు, సాకారంగా బ్రహ్మదేవుణ్ణి సేవిస్తుంటే సరస్వతీసమేతుడై పద్మాసనంపై కూర్చుని జీవసృష్టి చేస్తుంటాడు.

ధర్మరాజుకు వెంటనే ఒక సందేహం కలిగింది. నారదుడు వివిధ సభలను వర్ణిస్తూ కృతవీర్యుడు, జనమేజయుడు, పాండురాజు యమసభలో ఉన్నట్లు చెప్పాడు. కానీ మహారాజు హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉన్నట్లు చెప్పాడు. 'మహర్షీ! పరమ ధర్మాత్ముడైన నా తండ్రిగారు యమసభలో ఉండగా హరిశ్చంద్రుడు మాత్రం ఇంద్రసభలో ఎందుకు ఉన్నాడు. దీనికి కారణం ఏమిటి?'అని అడిగాడు.

ధర్మరాజా! త్రిశంకుమహారాజు పుత్రుడైన హరిశ్చంద్రుడు రాజసూయ యాగం చేశాడు. అందువల్ల ఇంద్రసభలో ఉన్నాడు. నీ తండ్రి యమసభలో ఉన్నాడు. నేను యమసభను సందర్శించినప్పుడు పాండురాజు నాతో 'రాజసూయయాగం చేసిన రాజులు ఇంద్రసభలో ఉంటారు. కాబట్టి నా కుమారుడు ధర్మరాజుని రాజసూయయాగం చేయమని ఆజ్ఞాపించానని చెప్పండి' అని అన్నాడు. కాబట్టి 'ధర్మరాజా! అద్భుతం! నువ్వు రాజసూయయాగం చెయ్యి. ఇది మీ తండ్రి పాండురాజు కోరిక. నన్ను చెప్పమని పంపాడు. నీ తండ్రి యమసభలో ఉన్నాడు. మీరు

రాజసూయయాగం చేస్తే అప్పుడతడు ఇంద్రసభకు వెళ్ళే అర్హత వస్తుంది. నేను ఇందుకే వచ్చాను' అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

**జరాసంధుడు**

'రాజసూయం చెయ్యాలంటే ముందు జరాసంధుణ్ణి చంపాలి' అన్నాడు శ్రీకృష్ణుడు. అప్పుడు భీముడు –

**కం. ఆరంభరహితుఁ బొందునె**
**యారయ సంపదలు? హీనుఁడయ్యును బురుషుం**
**డారంభశీలుఁడయి యకృ**
**తారంభుల నోర్చు నెంత యధికుల నయినన్ (సభా: 1-123)**

**'అన్నయ్యా! ఏ ప్రయత్నమూ చేయని వాడికి సంపద లెలా వస్తాయి? ఒక బలహీనుడు గట్టిగా ప్రయత్నం చేస్తే, ఎలాంటి ప్రయత్నమూ చేయని బలవంతుణ్ణైనా జయించవచ్చు. శ్రీకృష్ణుడి దయ, అర్జునుడి తోడు ఉంటే నేను ఆ జరాసంధుణ్ణి వధిస్తాను' అన్నాడు.**

ఆ తరువాత ధర్మరాజు తన పురోహితుడు ధౌమ్యుడు ఇతర మంత్రులతో రాజసూయయాగం గురించి చర్చించాడు.

అందుకు ధౌమ్యుడు 'ధర్మరాజా! నీ తండ్రి కోరిక తీర్చడం నీకర్తవ్యం. ఈ యాగం వల్ల సమస్త రాజులూ నీకు సామంతులు ఔతారు. నువ్వు సంపదలు సమకూర్చుకోవడానికి ఇదే తగిన సమయం. ఆలస్యం చెయ్యకు' అని హితవు పలికాడు.

ధర్మరాజు తన తమ్ముళ్ళతో కూడా చర్చించి రాజసూయయాగం చేయడానికే నిర్ణయం తీసుకున్నాడు. ఈ యాగ నిర్వహణకు శ్రీకృష్ణుడే తగిన సమర్థుడు అని శ్రీకృష్ణుణ్ణి తీసుకు వచ్చేందుకు ద్వారకకు ఆప్తులైన కొందరిని పంపాడు. ధర్మరాజు సందేశం అందుకుని శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వచ్చాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని తగిన రీతిని సత్కరించాడు. శ్రీకృష్ణుడు ఎంతో సంతోషించి ధర్మరాజుతో 'ధర్మనందనా!

నీ నిర్ణయం మంచిదే! పూర్వం జమదగ్ని కుమారుడైన పరశురాముడు క్షత్రియ వంశాలన్నింటినీ నిర్మూలించాడు. అప్పుడు ఎలాగో ఇక్ష్వాకు, ఇల అనే రెండు వంశాలు మిగిలాయి. అవి రెండే సహజమైన వంశాలు. మిగిలినవి మిశ్రమ వంశాలే. ఆ రెండు వంశాలు నూటొక్క వంశాలుగా వృద్ధి చెందాయి. యయాతి, భోజ, వంశాల వల్ల మరో పదునాలుగు వంశాలు ఏర్పడ్డాయి. ఈ రాజవంశాల నన్నింటినీ జరాసంధుడు జయించాడు.

చేదిదేశానికి రాజైన శిశుపాలుడు జరాసంధుడికి సైన్యాధిపతి. హంసడిభకులు అనే మహాబలవంతులు కూడా జరాసంధునికి ఆప్తులే. కౌశిక చిత్రసేనులు జరాసంధుడికి కుడి ఎడమ భుజాలు. చేది రాజులలో పురుషోత్తముడు, అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజులు, ఇంకా పౌండ్రక వాసుదేవుడు జరాసంధుణ్ణి సేవిస్తున్నారు.

తూర్పు దక్షిణదేశాల రాజులు పురుజితుడు, కరూశుడు, కలభ, నకుల, సంకర్షణ, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులు కూడా జరాసంధుణ్ణి కొలుస్తున్నారు.

ఉత్తర దిక్కున పద్దెనిమిది మంది రాజవంశాలు భయంతో జరాసంధుణ్ణి కొలుస్తున్నారు.

నేను వధించిన కంసుడి భార్య జరాసంధుని కుమార్తె. అందు వల్ల జరాసంధుడు నా పై పగతో ఉన్నాడు.

ధర్మరాజా! ఆ హంసడిభకులూ జరాసంధుడూ కలిస్తే మూడు లోకాలనూ జయించగలరు. ఒకసారి హంసడిభకులతో మధురమీద దండెత్తాడు. ఒక ఉపాయంతో హంసడిభకులను చంపాం. ఇప్పుడు జరాసంధుడు నిస్సహాయుడు. మేము జరాసంధుడితో విరోధం వల్ల రైవతకాద్రిలో కోట కట్టుకుని ఉంటున్నాం. మనం ముందు జరాసంధుడిని వధించాలి. అప్పుడే రాజసూయం చేయడం సాధ్యం. నీ రాజ్యం సుస్థిరమవుతుంది. **జరాసంధుడు ఎంతటి బలవంతుడైనా దుర్మార్గుడు కాబట్టి పతనం తప్పదు' అన్నాడు శ్రీకృష్ణుడు.**

అప్పుడు భీముడు ధర్మరాజుతో 'అన్నయ్యా! ప్రయత్నం చేస్తే విజయం తప్పక లభిస్తుంది. శ్రీకృష్ణుడి దయ, అర్జునుడి సహాయం, నీ అనుమతి ఉంటే జరాసంధుణ్ణి నేను సంహరిస్తాను' అన్నాడు.

అర్జునుడు 'అన్నయ్యా! రాజులందరినీ జయిస్తాం. రాజసూయం నిర్వహిస్తాం. లేనిపక్షంలో ఈ గాండీవం ఎందుకు' అని అన్నాడు కోపంగా.

భీమార్జునుల మాటలు విని శ్రీకృష్ణుడు సంతోషించాడు. ధర్మరాజు 'శ్రీకృష్ణా! అసలు జరాసంధుడు అంతటి బలవంతుడు ఎలా అయ్యాడు?' అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు 'ధర్మనందనా! మగధరాజైన బృహద్రథుడు కాశీరాజు పుత్రికలను వివాహమాడాడు. వారికి సంతానం కలుగలేదు. అతడు భార్యలిద్దరితో అరణ్యాలకు పోయి చండకౌశికుడు అనే మునిని భక్తితో సేవించాడు. వారి సేవలకు చండకౌశికుడు సంతోషించి 'ఏమి వరం కావాలి కోరుకో' అన్నాడు.

అందుకు బృహద్రథుడు 'మహాత్మా! నాకు పుత్రసంతానం ప్రసాదించండి' అని కోరాడు. అప్పుడు ఒక మామిడి చెట్టు మీద నుండి ఒక మామిడి పండు ఆ మహర్షి తొడమీద పడింది. మహర్షి ఆ పండును మంత్రించి, బృహద్రథుడికి ఇచ్చాడు. 'ఈ పండు తిన్నవారికి సంతానం కలుగుతుంది' అని చెప్పాడు.

సంతోషంతో ఆ పండును ఇద్దరు భార్యలకు కోసి ఇచ్చాడు బృహద్రథుడు. ఇద్దరు గర్భం ధరించి ప్రసవించారు. ఇరువురికీ నిలువుగా సగం చీలిన శరీరంతో ఇద్దరు శిశువులు జన్మించారు. ఆ శిశుఖండాలను చూసి భార్యలిద్దరూ భయపడి, బృహద్రథుడికి చూపించటానికి సిగ్గుపడి పరిచారికలకు ఇచ్చి బయట పారేయించారు.

అర్ధరాత్రి జర అనే రాక్షసి వాటిని తినాలని రెండు ముక్కలను పట్టుకుంది. ఆశ్చర్యంగా రెండూ కలిసి ఒక బాలుని రూపంగా మారింది. ఆ బాలుని ఏడుపు విని అంతఃపురం లోని స్త్రీలు పరుగెత్తుకు వచ్చారు. వారిని చూసి రాక్షసి పారి పోయింది. ఇంతలో అక్కడికి వచ్చిన బృహద్రథుడు బాలుణ్ణి చూసి సంతోషించాడు. ఇది గమనించిన రాక్షసి బృహద్రథుడి వద్దకు వచ్చి – 'మహారాజా! నేను జర అనే

రాక్షసిని. ఆ శిశుఖండాలు నా చేతిలోనే కలిసి బాలుడుగా మారాయి. ఇతడు వజ్రశరీరం కలవాడు' అని బాలుణ్ణి అందించింది. ఇతనిని స్వీకరించు'.

బృహద్రథుడు జరతో 'నీ దయ వల్ల నా వంశం ఉద్ధరింపబడింది. కాబట్టి ఈ బాలుడికి జరాసంధుడు అని నామకరణం చేస్తాను. నువ్వు నాపాలిట పుణ్య దేవతవు' అన్నాడు.

ఒకసారి చండకౌశికుడు బృహద్రథుని వద్దకు వచ్చాడు. బృహద్రథుడు ఆ మహర్షిని పూజించి తన కుమారుడిని చూపించాడు.

చండకౌశికుడు బృహద్రథునితో 'వీడు పరాక్రమవంతుడౌతాడు. ఎలాంటి ఆయుధాలు, అస్త్రాలు, ఇతడిని చంపలేవు. ఇతడు రాజులందరినీ జయిస్తాడు. ఆ రాజుల సంపదలన్నీ పొందుతాడు. ఆ పరమశివుడిని ప్రత్యక్షం చేసుకుంటాడు' అన్నాడు. అందువల్ల జరాసంధుడు అసమాన బలాఢ్యుడు అయ్యాడు. బృహద్రథుడు జరాసంధుడికి రాజ్యం అప్పగించి తపోవనాలకు వెళ్ళాడు.

'ధర్మరాజా! భీమసేనుడు ఒకడే జరాసంధుణ్ణి చంపగల సమర్థుడు. అందుకని భీమార్జునులను నాతో పంపు' అన్నాడు. 'శ్రీకృష్ణా! నీ అండ ఉండగా మాకు పొందలేనిది ఏముంటుది? ఇక జరాసంధుడు మరణించినట్లే! రాజసూయం నిర్విఘ్నంగా నెరవేర్చినట్లే!' అని భీమార్జునులను దీవించి శ్రీకృష్ణునితో పంపాడు.

శ్రీకృష్ణుడు భీమార్జునులతో కలసి కపట బ్రాహ్మణరూపాలలో జరాసంధుడి నగరమైన గిరివ్రజపురం సమీపించాడు. ఆ పురం చుట్టూ ఉన్న పర్వతాలు ప్రాకారాలలా ఆ పురాన్ని రక్షిస్తున్నాయి. పక్కనే చైత్యకమనే కొండ ఉంది. దానిపై మూడు ఢక్కలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు భీమార్జునులకు ఆ ఢక్కలను చూపించి 'భీమా! నగరంలోకి ఎవరన్నా కొత్త వాళ్ళు ప్రవేశిస్తే ఆ ఢక్కలు మోగుతాయి' అని చెప్పాడు.

భీమార్జునులు ఆ ఢక్కలను పగులకొట్టి చైత్యకపర్వత మార్గంలో నగరంలో ప్రవేశించారు. శ్రీకృష్ణుడు భీమార్జునులు సిగలో పూలు అలంకరించుకున్నారు.

స్నాతకుల లాగా గోశాలలో ప్రవేశించారు. జరాసంధుడికి బ్రాహ్మణులంటే భక్తి ప్రపత్తులు ఎక్కువ. కాబట్టి బ్రాహ్మణులు రాజమందిరంలోకి ఎప్పుడైనా వెళ్ళవచ్చు.

బ్రాహ్మణవేషాలలో ఉన్న శ్రీకృష్ణుడు, భీమార్జునులకు అర్ఘ్యపాద్యాలను ఇచ్చాడు జరాసంధుడు. వాళ్ళు వాటిని పుచ్చుకోలేదు. జరాసంధుడు సందేహపడి వారిని 'మీరు గంధపుష్పాలు ధరించినా స్నాతకులుగా లేరు. మీ ఆకారాలు క్షత్రియుల్లా ఉన్నాయి. మీరు ఎవరు? ఎందుకు వచ్చారు?" అని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడు 'మేము క్షత్రియులమే! ముఖద్వారంలోంచి మిత్రుల ఇంటికి,వెనుక ద్వారంలోంచి శత్రువుల ఇంటికి ప్రవేశించడం క్షత్రియ ధర్మం' అన్నాడు. జరాసంధుడు 'నేను ఎవరికీ అపకారం చేయలేదు. నేను బ్రాహ్మణులకు, దేవతలకు, మునులకు భక్తుడిని. ఉత్తమ క్షత్రియ ధర్మాలు ఆచరిస్తున్నాను. మీకు నేనెలా శత్రువునయ్యాను' అన్నాడు. 'ఓ జరాసంధా! ధర్మరాజు ఆజ్ఞపై శత్రుసంహారానికి వచ్చాం. ఉత్తమ క్షత్రియుడిని అని చెప్పుకుంటున్న నువ్వు క్షత్రియులను పట్టి బంధించి శివుడికి బలి ఇచ్చి శివపూజలు ఎలా నిర్వహిస్తావు? ఉత్తమ క్షత్రియులు ఇలా చేస్తారా?

నిష్కారణంగా సాధుహింస చేసే వాళ్ళు, జనులను హింసించే వాళ్ళు అందరికి శత్రువులు కారా? నిర్దోషులైన సాటి కులం వారిని చంపడం పాపం కాదా! అలాంటి పూజలు ఫలిస్తాయా? నీలాంటి పాపులను విడిచి పెడితే మాకు పాపం వస్తుంది. కాబట్టి నీతో యుద్ధానికి వచ్చాం. నేను కృష్ణుణ్ణి, ఇతడు భీముడు, అతడు అర్జునుడు. ఇప్పటికైనా చెరలో ఉన్న రాజులను విడిచిపెడితే సరే! లేకపోతే వీరు నీ గర్వమణచి వారిని విడిపిస్తారు' అన్నాడు శ్రీకృష్ణుడు.

జరాసంధుడు కోపంతో 'పరాక్రమంతో రాజులను జయించడం నేరమా? పరమశివుడికి బలి ఇవ్వడానికి తెచ్చిన వారిని నేను ఎందుకు వదిలి పెడతాను? సైన్యంతో వస్తే సైన్యంతో యుద్ధం చేస్తాను. లేకపోతే మీ ముగ్గురితో కానీ, ఇద్దరితో కానీ, ఒక్కరితో కానీ యుద్ధం చేస్తాను. మీకు ఏది ఇష్టమో చెప్పండి' అన్నాడు.

శ్రీకృష్ణుడు 'ముగ్గురూ నీతో యుద్ధం చేయడం ధర్మంకాదు. మా ముగ్గురిలో నీకు సరిజోడుని కోరుకో. అతను మల్ల యుద్ధంలో నిన్ను జయిస్తాడు' అని అన్నాడు.

జరాసంధుడు 'నాకు సరిజోడు భీముడే. కాబట్టి అతనితో యుద్ధం చేస్తాను' అని చెప్పాడు.

జయాపజయాలు దైవాధీనం కాబట్టి జరాసంధుడు ముందుగా తన కుమారుడు సహదేవుడికి రాజ్యాభిషేకం చేశాడు.

భీముడూ జరాసంధుడూ ఘోరంగా తలపడ్డారు. ఒకరిని ఒకరు జయించాలన్న కోరికతో ఒకరిని మించి ఒకరు భీకరంగా పోరాడుతున్నారు. ఇలా కార్తిక శుద్ధ పాడ్యమి నుండి త్రయోదశి వరకు సాగింది యుద్ధం.

అప్పటికి జరాసంధుడు అలసిపోయాడు. శ్రీకృష్ణుడు 'భీమా! జరాసంధుడు అలసిపోయాడు. ఇది తగిన సమయం. అతణ్ణి సంహరించు' అన్నాడు.

భీమసేనుడు తన తండ్రి వాయుదేవుడిని తలుచుకున్నాడు. యుద్ధం మల్ల యుద్ధం. జబ్బలు చరుచుకుంటూ భయంకరంగా సాగింది. చివరికి భీముడు జరాసంధుణ్ణి నేల మీద చాచి కొట్టి ఎముకలు విరిచి పారవేశాడు. అంతే! జరాసంధుడి ముక్కుల నుండి చెవుల నుండి రక్తం ధారలై ప్రవహించింది.

జరాసంధుణ్ణి గిరా గిరా తిప్పి నూరుసార్లు విసిరి వేశాడు. అతడి ఎముకలు విరిచి ఘోరంగా సంహరించాడు. జరాసంధుని మృతదేహాన్ని అతని ముఖద్వారం ముందు పడవేశాడు.

శ్రీకృష్ణుడు మగధవాసులకు అభయం ఇచ్చాడు. జరాసంధుడి చెరలో ఉన్న రాజులను విడిపించాడు. జరాసంధుడి కుమారుడైన సహదేవుడికి ధైర్యం చెప్పాడు. తరువాత వాళ్ళు ఇంద్రప్రస్థానికి బయలుదేరారు. ధర్మరాజుకు జరిగినది చెప్పి విడిపించిన రాజులను చూపించాడు. రాజులంతా వారి వారి రాజ్యాలకు పయనమయ్యారు. శ్రీకృష్ణుడు ద్వారకకు చేరుకున్నాడు.

## రాజసూయయాగం

రాజసూయ యాగానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. తమ్ముళ్ళను జైత్రయాత్ర కోసం తలా ఒక దిక్కుకూ పంపించాడు ధర్మరాజు. వెళ్ళిన వాళ్ళు అపారమైన ధనరాశులతో తిరిగివచ్చారు.

యాగం ప్రారంభమయ్యింది. ధృతరాష్ట్ర, భీష్మ, ద్రోణ, కృపాచార్య, అశ్వత్థామ, సోమదత్త, భూరిశ్రవ, శకుని, కర్ణ, దుర్యోధన, సైంధవ, దుశ్శాసన, వికర్ణాది ప్రముఖులంతా వచ్చారు. ధర్మరాజు అందరికీ తలా ఒక బాధ్యత అప్పగించాడు. దుర్యోధనుడికి వివిధ దేశాల రాజులు తెచ్చే బహుమానాలను అందుకొనే బాధ్యత అప్పగించాడు.

భీష్ముడు ధర్మరాజుతో 'ధర్మజా! ఈ యాగంలో ఒక మహాత్ముణ్ణి పూజించాలి. అలా పూజించడానికి అన్నివిధాలా తగినవాడు శ్రీకృష్ణుడే'

**సీ. రోదసీకుహరంబు రుచిరాంశుతతి జేసి**
**యర్కుండు వెలిగించునట్టు; లమృత**
**సందోహనిష్యందచంద్రిక జేసి శీ**
**తాంశుఁ డానందించునట్టు సకల**
**జనులకు దనదైన సదమలద్యుతిఁ జేసి**
**తనరంగఁ దేజంబుఁ దనుపుదాన**
**చేయుచునున్న సత్సేవ్యుండు పుండరీ**
**కాక్షుండు కృష్ణుఁ డనాదినిధనుఁ**

**ఆ.వె. డబ్జనాభుఁ డుండ నర్ఘ్యంబునకు నిందు**
**నర్హు లొరులు గలరె? యజ్ఞపురుషు**
**నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు**
**మధిప! యదియ చూవె యజ్ఞఫలము (సభా: 2-6)**

సూర్యుడు తన కిరణాలతో భూమ్యాకాశాల మధ్యభాగాన్ని వెలిగించినట్లు, అమృతం జాలువారే వెన్నెలతో చంద్రుడు సంతోషపెట్టేవిధంగానూ, సకలజనులకూ తన నిర్మలమైన కాంతితో వెలుగునూ, తృప్తినీ కలిగిస్తున్నాడీ మహాపురుషుడైన శ్రీకృష్ణుడు.

అతడు మంచివారికి సేవింపదగినవాడు, తెల్లతామరల్లాంటి కన్నులు కలవాడు. పుట్టుక, మరణం లేనివాడు. అతడి నాభి బ్రహ్మపుట్టుకకు కారణం. అతడు సాక్షాత్తుగా ఇక్కడ ఉండగా అర్ఘ్యం అందుకోవడానికి ఇంకెవ్వరికీ అర్హత ఎలా ఉంటుంది? అలాంటి యజ్ఞపురుషుడు, అఖిలలోకపూజ్యుడూ అయిన అచ్యుతుణ్ణి పూజించు అదే యజ్ఞఫలం' అన్నాడు.

ధర్మరాజు ఆనందంగా శ్రీకృష్ణుడికి అర్ఘ్యాన్ని సమర్పించి పూజించాడు.

అది శిశుపాలుడికి నచ్చలేదు. పూజించిన ధర్మరాజునీ, పూజించమని చెప్పిన భీష్ముణ్ణి, గౌరవాన్ని అందుకున్న శ్రీకృష్ణుణ్ణీ నానామాటలు అన్నాడు.

అయినా ధర్మరాజు శాంతంగానే –

**కం. భూరి గుణోన్నతు లనదగు**
**వారికి ధీరులకు ధరణివల్లభులకు వా**
**క్పారుష్యము చన్నె? మహా**
**దారుణమది విషముకంటె దహనము కంటెన్ (సభా: 2–17)**

**'శిశుపాలా! గొప్ప గుణవంతులకూ, ధీరులకూ, రాజులకూ నోటిదురుసు పనికిరాదు. అది విషం కన్నా అగ్ని కన్నా దారుణమైనది' అంటూ నచ్చచెప్పబోతుంటే భీష్ముడు కలుగజేసుకొని – 'శ్రీకృష్ణుడు జ్ఞాని. బాలుడైనా జ్ఞానం కలవాడైతే పూజింపదగినవాడే' అంటూ శ్రీకృష్ణుడి గొప్పతనాన్ని చెప్పాడు.**

సహదేవుడు చివాలున లేచాడు. 'శ్రీకృష్ణుడే తగినవాడని ఈ యాగంలో అతణ్ణి పూజిస్తున్నాం. దీనికి ఆక్షేపించే వాళ్ళెవరైనా ఉంటే రండి! వాళ్ళ తలపై నా కాలు ఉంచుతాను' అన్నాడు.

అప్పుడు శిశుపాలుడు భీష్ముడితో -

**ఆ.వె. అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్ను**
**బరఁగ బొగడికోలుఁ బ్రబ్బికోలు**
**నాపగాతనూజ! యార్యవృత్తములు గా**
**వనిరి వీని నాద్యులయిన మునులు (సభా: 2-49)**

**'భీష్మా! ఇతరులను పొగడడం గానీ, తిట్టడం కానీ, తనను తాను పొగడు కోవడంగానీ, తిట్టుకోవడం కానీ ఆర్యులు చెయ్యవలసినవి కావన్నారు మన మహర్షులు. ఇది తెలుసుకో'** అంటూ తిట్టిపోశాడు.

భీముడూ ఆవేశంగా గద పైకెత్తాడు. భీష్ముడు అతణ్ణి వారించి 'ఈ శిశు పాలుడి చావు శ్రీకృష్ణుడి చేతుల్లోనే ఉంది. శిశుపాలుడి తల్లి సాత్వతి. తన కొడుకును వంద తప్పుల వరకూ క్షమించమని శ్రీకృష్ణుణ్ణి కోరింది. అందుకే నేను ఆగాను. లేకపోతేనా?' అన్నాడు.

శ్రీకృష్ణుడు సభాసదులందరికీ శిశుపాలుడి అరాచకాల్ని తెలియజెప్పి వెంటనే సుదర్శనచక్రంతో అతడి తల ఖండించాడు.

యాగం ముగిసింది. కౌరవులకు ఇంకా అసూయ పెరిగిపోయింది. ఒకరోజు మయసభను చూడడానికి లోపలికి వచ్చాడు దుర్యోధనుడు. అంతా మాయ. తలుపు మూసినట్లు ఉంది. తీరా వెళ్తే తెరిచే ఉంది. మరోచోట తెరిచినట్లు ఉంది. సరేనని వెళ్తే తలుపు మూసి ఉండి తలకు తగిలి బొప్పి కట్టింది.

ఒకచోట జలాశయం కన్పించింది. తీరా చూస్తే అది నీలపురాళ్ళతో తీర్చిదిద్దిన ప్రాంతం. మరోచోట నిజమైన జలాశయం ఉంది. అదీ అలాంటిదే! అనుకొని దిగి తటాలున నీళ్ళలో పడ్డాడు దుర్యోధనుడు.

సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చిన ద్రౌపది, పాండవులు అతడి అవస్థ చూసి ఆగలేక నవ్వుకున్నారు. అది దుర్యోధనుడిని తీవ్రంగా కలచివేసింది. అతడి అవస్థ చూసి ధర్మరాజు సుయోధనుడికి నూతన వస్త్రాలు ఇచ్చాడు. కానీ దుర్యోధనుడు

అది తనకు జరిగిన అవమానంగా భావించాడు. ఆ అవమానభారంతోనే హస్తినకు బయలుదేరాడు. మయసభా వైభవం అతడిలో అసూయ అనే అగ్నిజ్వాలను రగిలించింది. దానివల్ల దుర్యోధనుడు రోజురోజుకూ కృశించి పోసాగాడు.

శకుని ఇది గమనించి, 'సుయోధనా! నీకు ఏమైంది?'అని అడిగాడు. దుర్యోధనుడు 'మామా! మయసభ చూశావు కదా. అంతటి మయసభ కలిగిన ధర్మరాజు ఎంతటి అదృష్ట వంతుడు! ధర్మరాజు చక్రవర్తి అయ్యాడు. రాజులంతా ధర్మరాజుకు అమూల్యమైన కానుకలు సమర్పించారు. శ్రీకృష్ణుడు శిశుపాలుణ్ణి వధించినా రాజులు పొగిడారే కానీ నిందించలేదు. పాండవుల ఐశ్వర్యం సహించరానిదిగా ఉంది. అభిమానధనుడు దాయాదుల వైభవాన్ని సహిస్తాడా?' అని దుర్యోధనుడు పగ, ప్రతీకారం, అసూయ, అవమానాలతో రగిలిపోతూ అన్నాడు. అప్పుడు శకుని – 'సుయోధనా! బాధపడకు. ఆ ధర్మరాజు ఐశ్వర్యం మొత్తాన్నీ మాయాజూదం ఆడి నీకు వచ్చేలా చేస్తాను. పద' అంటూ దుర్యోధనుణ్ణి తీసుకొని ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు.

రాజా!'నీ కుమారుడు క్రుశించి పోతున్నాడు చూడు!' అన్నాడు. అది విని ధృతరాష్ట్రుడు 'నాయనా సుయోధనా! సంపదనంతా నీకే ఇచ్చాను కదా! దేవేంద్రుడితో సమానమైన భోగభాగ్యాలు నీకు ఉన్నాయి. నీకేం లోటు? కృశించడం ఎందుకు?'అని అడిగాడు.

'తండ్రీ! పాండవుల ఐశ్వర్యం దేవేంద్రుని కంటే గొప్పది. వారి కీర్తి నలుదిశలా వ్యాపించింది. వారితో పోల్చడానికి మూడు లోకాలలోని రాజులూ సరిపోరు. హరిశ్చంద్రుడు చేసిన రాజసూయయాగం కంటే పాండవులు చేసిన రాజసూయ యాగం చాలా గొప్పదంటూ సామంతులు అశేషరత్నాభరణాలు ఇస్తున్నారు.

ధర్మరాజుకు సాత్యకి ముత్యాల గొడుగు పట్టాడు. భీముడు చామరం వీచాడు. రాజులందరి చేత శ్రీకృష్ణుడు ధర్మరాజుకు మొక్కించాడు. 'సాటి రాజకుమారుడుగా నేనిది భరించలేకపోతున్నాను' అన్నాడు. వెంటనే అందుకొని శకుని దుర్యోధనునితో 'ధర్మరాజు జూదప్రియుడు. అక్షవిద్యలో నన్ను కొట్టినవాడు లేదు. జూదంలో

ధర్మరాజుని అక్రమంగా ఓడించి అతని సంపద అంతా సుయోధనుని హస్తగతం చేస్తాను' అన్నాడు.

సుయోధనుడు సంతోషించి 'తండ్రీ! ఇందుకు మీరు అంగీకరించండి' అన్నాడు.

ధృతరాష్ట్రుడు 'విదురుడు చాలా దూరదృష్టి కలవాడు. నీతికోవిదుడు. మీ ఇరువురి క్షేమం కోరేవాడు. అతనితో చర్చించి నిర్ణయం తీసుకుంటాను' అని అన్నాడు.

దుర్యోధనుడు 'తండ్రీ!విదురుడు పాండవపక్షపాతి. మీరు ఒప్పుకోకపోతే నేను అగ్నిప్రవేశం చేస్తాను మీరు విదురుడు సంతోషంగా ఉండండి' అన్నాడు.

జూదం తగదని సంశయిస్తూనే ఉన్నాడు ధృతరాష్ట్రుడు. అయినా కుమారుణ్ణి సంతోషపెట్టడానికి జూదం కోసం ఒక సభానిర్మాణానికి ఏర్పాట్లు చెయ్యమని చెప్పాడు.

ఒకరోజు విదురుడితో సుయోధనుడి అభిప్రాయం చెప్పాడు. అప్పుడు విదురుడు 'రాజా పాండవులకు కౌరవులకు విరోధం కలగడానికి పునాది వెయ్యద్దు. ఎంతటి శాంతస్వభావులనైనా జూదం రెచ్చగొడుతుంది. పాండవులూ కౌరవులూ కలసి ఉండేలా చూడు' అన్నాడు.

ధృతరాష్ట్రుడు దుర్యోధనుణ్ణి పిలిచి 'దుర్యోధనా! జూదం మంచిది కాదని విదురుడు కచ్చితంగా చెప్తున్నాడు. నీకు సంపద కావాలంటే నువ్వు కూడా యాగం చెయ్యి. మీరిద్దరూ రాజ్యాన్ని పాలించండి' అన్నాడు.

దుర్యోధనుడు 'మహారాజా! ధర్మరాజు జూదం ఆడుతుంటే చూడటం ఒక యజ్ఞం. నేను సకలైశ్వర్యాలూ పొందడానికి అది మార్గం. శత్రువుల అభివృద్ధిని ఉపేక్షిస్తే మనల్ని అది నాశనం చేస్తుంది. పాండవుల ఐశ్వర్యాన్ని కొల్లగొడితే కానీ నాకు ఉపశమనం లేదు " అన్నాడు.

వెంటనే శకుని 'సుయోధనా! ఎలాంటి సైన్యం లేకుండా యుద్ధం రక్త పాతం లేకుండా పాచికలాడించి పాండవ రాజ్యలక్ష్మిని నీకు ఇస్తాను. జూదం కాక వేరే ఏ విధంగానైనా పాండవులను జయించడం ఎవరి తరమూ కాదు' అన్నాడు.

ధృతరాష్ట్రుడి మనసు జూదానికి అంగీకరించలేదు. 'మీరు ఎన్ని చెప్పినా నేను వినను. విదురుడు జూదం అనర్థ హేతువని చెప్పాడు. అతడు నీతికోవిదుడు. నేను అతడి మాట మీరను. జూదం మాట వదిలెయ్యి. ఎప్పటిలా ఉండు' అన్నాడు.

దుర్యోధనుడు 'తండ్రీ! విదురుడు మనకు ఆప్తుడు కాడు. జూదం ఆడవచ్చని పురాణాల్లో కూడా ఉంది. స్నేహంతో ఆడుకునే జూదం హాని కాదు. కాబట్టి శకునితో జూదం ఆడడానికి అనుమతి ఇవ్వండి' అన్నాడు.

## ద్రౌపది వస్త్రాపహరణం

అలా దుర్యోధనుడు అడిగేసరికి తప్పనిసరి పరిస్థితిలో ధృతరాష్ట్రుడు విదురునితో 'విదురా! మనం ఒక సభ నిర్మించాం కదా! దానిని చూడటానికి ధర్మరాజునీ అతడి తమ్ముళ్ళనీ ఆహ్వానించి నీతో తీసుకుని రా! కాలక్షేపానికి ధర్మరాజు దుర్యోధనుడితో జూదం ఆడుతాడులే!' అన్నాడు. విదురుడు జూదం అనర్థమని చెప్పి చూశాడు. కానీ ప్రయోజనం లేక పోయింది. ఇక తప్పదని ఇంద్రప్రస్థానికి వెళ్ళాడు. తాను వచ్చిన విషయం చెప్పాడు.

ధర్మరాజు విదురుణ్ణి సాదరంగా ఆహ్వానించి 'విదురా! మా తండ్రిగారి ఆహ్వానం మన్నించి నీ వెంట వస్తాం. సభను చూస్తాం. కానీ జూదం ఆడడం తగినదేనా? జూదం వల్ల ఎన్నో గొడవలు వస్తాయి. అయినా ధృతరాష్ట్రుడి ఆజ్ఞ మాకు శిరోధార్యం. అందుకని మీతో వస్తాం' అన్నాడు.

***

అందరూ హస్తినాపురం చేరుకున్నారు. భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు, శకుని, అశ్వత్థామ, సైంధవుడు అక్కడే ఉన్నారు. పుత్రులతో ఉన్న ధృతరాష్ట్రుడికీ, భానుమతి మొదలైన కోడళ్ళతో ఉన్న గాంధారికీ ధర్మరాజాదులు నమస్కరించారు.

ద్రౌపది సౌందర్యాన్ని చూసిన గాంధారి కోడళ్ళకు ఒకపక్క ఆశ్చర్యం, మరో పక్క అసూయ కలిగాయి.

దుర్యోధనుడితో కలసి పాండవులు సభా భవనాన్ని చూసి వచ్చారు. ఆ సమయంలో దుర్యోధనుడు 'ధర్మజా! కొంచెం సేపు జూదం ఆడదాం. నీకు జూదం అంటే ఆసక్తి ఉంది కదా!' అన్నాడు. ధర్మరాజు 'సుయోధనా!

**తే.గీ. క్షత్రనీతి విక్రమములు గావు సూవె**
**నికృతియును జూదమును; ధర్మనిత్యులైన**
**వారి కీ రెండు వర్జింపవలయు నెందుఁ**
**బాపవృత్తంబు జూదంబు పార్థివులకు**

**ఆ.వె. కుటిలమార్గు లయిన కుత్సితకితవుల**
**తోడఁ గడఁగి జూదమాడఁ జనదు**
**దానఁజేసి యర్థధర్మవివర్జితు**
**లగుదు రెట్టివారు జగములోన (సభా: 2-166, 167)**

**'దుర్యోధనా! మోసం, జూదం అనే రెండూ రాజనీతిలో గొప్పవి కావు. ధర్మాన్ని పాటించేవాళ్ళు ఈ రెండింటినీ విడిచిపెట్టాలి. ఎక్కడైనా రాజులకు జూదం ఆడడం పాపకార్యమే! అందులో మోసంతో ఆడే జూదం క్షత్రియ ధర్మం కాదు. కుటిలులతో జూదం తగదు. దాని వల్ల ఎంతటి వారైనా సంపద కోల్పోతారు. ధర్మ జూదంలో గెలవడం పుణ్యం, కపట జూదంలో గెలవడం పాపం' అన్నాడు.**

వెంటనే శకుని కలుగజేసుకొని 'ధర్మజా! జూదంలో నేర్పరులూ, లోకజ్ఞానం కలవారూ, సుక్షత్రియులూ, రాజనీతి తెలిసినవారూ అయిన మీలాంటివారే జూదాన్ని నిందించటం ఏమీ బాగాలేదు. బలహీనులు బలవంతులను ఓడించటానికి మాయలు పన్నడం పరిపాటే కదా. అయినా నీకు భయమైతే ఆడవద్దు. ఇందులో బలవంతం ఏమీ లేదు సుమా' అన్నాడు.

ధర్మరాజు 'బలవంతంగా జూదానికి ఆహ్వానాన్ని అందుకున్నాం. ఆడక తప్పుతుందా! ఇక మాటలెందుకు కానివ్వండి' అన్నాడు.

ధర్మరాజు 'మీలో నాతో ఎవరు జూదం ఆడతారు?' అని అడిగాడు.

దుర్యోధనుడు 'ధర్మజా! నా తరపున మా మామ శకుని నీతో జూదం ఆడతాడు. అతడు ఓడిపోతే నా ధనరాశులు అన్నీ నీవే' అన్నాడు.

ధర్మరాజు 'ఒకరి కోసం ఒకరు ఆడతారా? ఇది అక్రమం' అనుకున్నాడు. అయినా చేసేది లేక తన చేతిలో ఉన్న రత్నఖచిత కంకణాన్ని ముందుగా పణంగా పెట్టాడు.

జూదం స్నేహపూరితంగానే జరుగుతోంది. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు వికలమైన మనస్సులతో చూస్తున్నారు. శకుని తనకోసం చేయించుకున్న ప్రత్యేక పాచికలతో జూదం ఆడి గెలుస్తున్నాడు.

ధర్మరాజులో పంతం పెరిగింది. ఒకటి తరువాత ఒకటిగా ఒడ్డుతూ ఓడిపోతున్నాడు. బంగారు భాండాగారాలు, వజ్రాల భాండాగారాలు, రత్నభాండాగారాలు, బంగారు నిధులు, అశ్వాలు, ఏనుగులు, సేవకులు, దాసదాసీ జనాలు, గోవులు, సేనావాహిని, అన్నింటినీ ఓడి పోయాడు.

ఇది చూసి విదురుడు ధృతరాష్ట్రుడితో 'దుర్యోధనుడు పాపాత్ముడు. కురు వంశం పాపంతో నిండిపోతుంది. ధర్మాన్ని రక్షించు. వినాశనాన్ని ఆపించు. దుర్యోధనుని బహిష్కరించు. అతడు బలవంతులతో యుద్ధానికి కాలుదువ్వుతున్నాడు. జూదాన్ని ఆపు. ఉపేక్షించకు' అన్నాడు కంగారుపడుతూ.

పుత్రుల మీద మమకారంతో ధృతరాష్ట్రుడు ఏమీ మాట్లాడలేదు. విదురుడు ఈసారి దుర్యోధనుడితో 'సుయోధనా! నువ్వు శకుని సహకారంతో పాండవులను కపటజూదంలో కొల్లగొడుతుంటే ప్రజలు నిన్ను ఛీ కొట్టరా? ఇలా మోసం చెయ్యటం మంచిదా!' అన్నాడు. అప్పుడు దుర్యోధనుడు విదురుడితో కోపంగా 'నువ్వు ఎప్పుడూ పాండవులవైపే మాట్లాడతావు. నువ్వు మా ఇంట్లో ఉంటే విషసర్పం ఉన్నట్లే! శత్రువుల సంపదను సులభమార్గంలో అపహరించడం రాజధర్మం. కాబట్టి మాకు సుద్దులు చెప్పవద్దు' అని దూషించాడు.

అప్పుడు విదురుడు

తే. మొదల నప్రియమయ్యును దుదిఁ గరంబు
పథ్యమగు పల్కు ప్రియులందు బలిమినైనఁ
బలుకవలయు మోమోడక యొలసి, యట్టి
వాఁడ దగు సహాయుండు భూవల్లభునకు (సభా: 2-192)

**మొదట అప్రియంగా కనిపించినా చివరికి మంచి చేసే మాటలు ఇష్టమయినవారికి బలవంతంగానైనా మొహమాటం లేకుండా చెప్పాలి. అలా చెప్పేవాడే రాజుకు శ్రేయోభిలాషి' అని మిన్నకుండిపోయాడు.**

వెంటనే శకుని ధర్మరాజుతో 'ధర్మజా! నువ్వు నీ సంపదనంతా పందెంలో ఒడ్డి ఓడిపోయావు. తరువాత పందెం ఏమిటి?' అన్నాడు.

అప్పటికే ధర్మరాజు జూదానికి బానిస అయ్యాడు. తన సమస్త రాజ్యాన్నీ ఒడ్డి ఓడిపోయాడు. తరువాత బ్రాహ్మణులకూ, దేవాలయాలకూ ఇచ్చిన భూములు తప్ప మిగిలిన ఆస్తులను సైతం పందెంగా ఒడ్డాడు. ఆ తరువాత తన తమ్ముళ్ళను ఒడ్డి ఓడిపోయాడు. చివరికి తనను తాను ఒడ్డుకున్నాడు.

అప్పుడు శకుని 'ధర్మజా ! అదేమిటి నిన్ను నువ్వు ఒడ్డుకున్నావు. నీ వద్ద మరో ధనం ఉంది కదయ్యా! మరిచి పోయావా? అదే నీ భార్య. ద్రౌపది. అమె నీ ధనం కాదా?' అని ఎత్తి పొడిచాడు.

అప్పుడు పాచికలు అందుకున్న ధర్మరాజు ద్రౌపదిని పణంగా పెట్టాడు. చివరికి అందులోనూ ఓడిపోయాడు. ఆట ముగిసింది.

ఇదంతా చూస్తున్న భీష్మునకు నోట మాటరాలేదు. విదురుడు దుఃఖిస్తున్నాడు. కర్ణుడు, సైంధవుడు ఆనందంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రునికి తెలివి వచ్చింది. 'విదురా! ఏమైంది? ఎవరెవరు ఏ పందాలు ఒడ్డారు?' అని అడిగాడు. అప్పుడు దుర్యోధనుడు విదురుణ్ణి చూసి 'ఇక నుండి ద్రౌపది నా దాసి. అమెను పిలుచుకురా' అని ఆజ్ఞాపించాడు. విదురుడు 'ఛీ నీలాంటి మూర్ఖుడు

ఈ ప్రపంచంలోనే లేదు. ఇలాంటి పనికి నన్ను పంపుతారా! ద్రౌపది అంటే ఎవరనుకున్నావు? ఈ సమస్త భూమండలానికీ పట్టమహిషి. ఆ సాధ్విని అవమానిస్తారా!' అని అన్నాడు. సుయోధనుడు ప్రాతిగామి అనే సూతనందనుణ్ణి పిలిచి 'నువ్వు వెళ్ళి ద్రౌపదిని సభకు తీసుకొని రా' అన్నాడు. ప్రాతిగామి ద్రౌపది వద్దకు వెళ్ళాడు. వెళ్లి 'అమ్మా! ధర్మరాజు జూదంలో సమస్త సామ్రాజ్యాన్నీ, తమ్ముళ్ళనూ, తననూ, నిన్నూ ఓడిపోయాడు. దుర్యోధనుడు నిన్ను సభకు తీసుకురమ్మని నన్ను పంపాడు. పదమ్మా!' అన్నాడు. అప్పుడు ద్రౌపది

**ఆ.వె. ఏ యుగంబునందు నెట్టి దుష్కితవుండు**
**భార్య నొడ్డి యోటువడిన భర్త**
**గలఁడె? యిది వినంగఁ గడు నపూర్వం బయ్యె**
**నిట్లు సేయునొక్కొ! యిందుకులుడు** **(సభా: 2-208)**

**తే.గీ. మున్ను దన్నోటువడి మఱి నన్ను నోటు**
**వడియెనో, నన్ను మున్నోటువడి విభుండు**
**గ్రన్నఁ దన్నోటువడియెనో యన్న! నాకు**
**నెఱుగఁ జెప్పుము దీని నీ వెఱుగుదేని** **(సభా: 2-209)**

అయ్యా! ఏ యుగంలోనైనా ఇలాంటి చెడ్డ జూదగాడు ఉంటాడా? ధర్మరాజు ఇలా చేసాడా? తనను కూడా ఓడాడు అంటున్నావు. 'తన్నోడి నన్నోడెనా? నన్నోడి తన్నోడెనా? తెలుసుకుని వచ్చి నన్ను తీసుకు పో' అంది.

ప్రాతిగామి తిరిగి వచ్చి ఇదే విషయం అడిగాడు. 'ఇది సమాధానం చెప్పడానికి వీలులేని విషయం. ఇక్కడికే వచ్చి అడగమను. నువ్వు వెళ్ళి ద్రౌపదిని తీసుకు రా!' అని పంపాడు సుయోధనుడు. ప్రాతిగామి ద్రౌపది వద్దకు పోయి 'అమ్మా! నువ్వు అడిగిన విషయం తెలుసుకోవడానికైనా నిన్ను అక్కడికి రమ్మన్నారు' అన్నాడు.

చేసేది లేక ద్రౌపది ఏకవస్త్ర అయి ఉండికూడా సభకు వచ్చింది. వచ్చి ధృతరాష్ట్రుడి పక్కన నిలబడింది. ద్రౌపది దుస్థితిని చూడలేక పాండవులు తలలు దించుకున్నారు.

అప్పుడు దుర్యోధనుడు దుశ్శాసనుడిని చూసి 'దుశ్శాసనా! నువ్వు వెళ్ళి ఆ ద్రౌపదిని ఇక్కడికి తీసుకు రా!'అని హుకుం జారీ చేశాడు.

ద్రౌపది ఒక్క పరుగున గాంధారి పక్కకు వెళ్ళి నిలబడింది.

దుశ్శాసనుడు ద్రౌపదితో – 'పాంచాలీ! ఎక్కడికి పోతావు. నిన్ను జూదంలో గెలుచుకున్నాం. ఇప్పుడు నువ్వు దుర్యోధనుడి సొత్తు అయ్యావు' అంటూ దగ్గరికి వచ్చాడు.

'అయ్యా! నేను ఏకవస్త్రను. నన్ను ముట్టుకోవద్దు. నేను సభకు రాకూడదు' అంది.

దుశ్శాసనుడు పకపకా నవ్వి 'ఏకవస్త్రవైనా విగతవస్త్రవైనా రాక తప్పదు. నేను నిన్ను తీసుకు పోతాను' అంటూ ద్రౌపది కురులు పట్టుకుని ఈడ్చుకుంటూ సభకు తీసుకు వచ్చాడు.

ద్రౌపది కురువంశ పెద్దలను చూసి 'అయ్యా! దుశ్శాసనుడు నన్ను ఈ సభకు ఈడ్చుకు వచ్చాడు. మీరందరూ చూస్తుండగానే మీ కళ్లముందే అవమానించాడు. అధర్మం పెరిగిపోయింది' అంటూ భయంతో మనసులోనే శ్రీకృష్ణుడిని ధ్యానించింది.

భీముడు ధర్మరాజుని చూసి 'ఓ ధర్మజా! ద్రుపదరాజపుత్రిని జూదంలో పెట్టడం తగునా? అందువల్ల ద్రౌపది అవమానాల పాలైంది. జరుగుతున్నది అధర్మ జూదమని తెలిసీ నువ్వు జూదం ఆడావు' అన్నాడు. అర్జునుడు కలుగజేసుకొని 'అన్నయ్యా! **స్నేహంగా ఆడుకునే జూదానికిగానీ, ధర్మయుద్ధానికిగానీ పిలిస్తే వెళ్ళడం రాజధర్మం.** అందుకనే ధర్మరాజు ధర్మం పాటించి ఆడాడు. కానీ విధి వైపరీత్యానికి ఏమి చేస్తాం?' అన్నాడు.

దుర్యోధనుడి తమ్ముడు వికర్ణుడు అనే వాడు చివాలున లేచి 'ఈ సభలో ఇంతమంది కురువృద్ధులు, గురువులు, పెద్దలు ఉన్నారే. అందరూ ఇలా మౌనంగా ఉంటారా? మిగిలిన వారైనా ధర్మం చెప్పండి. ఆలోచించండి. ఇక్కడ జరుగుతున్నది ధర్మమేనా?'అన్నాడు. ఎవరూ బదులు చెప్పలేదు. అప్పుడు మళ్ళీ వికర్ణుడే 'నేనే

ఇక్కడ ధర్మనిర్ణయం చేస్తాను. **జూదం, వేట, మద్యపానం, అతిగా తినడం దుర్వ్యసనాలు. వీటి వల్ల మానవులు ధర్మం తప్పి ప్రవర్తిస్తారు. అలాంటి వాళ్ళు చేసే పనులు లెక్కలోకి రావు. ఒక జూదరి పిలిస్తే, వ్యసనపరుడైన మరో జూదరి వస్తే అలా వచ్చిన ధర్మరాజు పాండవుల ఉమ్మడి ధనమైన ద్రౌపదిని పణంగా పెట్టి ఆడి ఓడడం ధర్మం కాదు. పైగా ఏకవస్త్రను సభకు తీసుకు రావడం అన్యాయం ఇంకా'అన్నాడు.**

కర్ణుడు వికర్ణుడిని చూసి 'వికర్ణా! ఎందుకీ అధికప్రసంగం? చిన్నవాడివి. ధర్మం గురించి నీకేమి తెలుసు? ఇంత మంది పెద్దలు ఉండగా ధర్మనిర్ణయం చెయ్యడం నీకు తగదు. ద్రౌపది ధర్మరాజు ధనం. కాబట్టి ధర్మవిజిత. లేకుంటే పాండవులు అంగీకరిస్తారా? అనేక భర్తలు కలిగిన ద్రౌపది బంధకి. అలాంటి వారిని ఏకవస్త్రగానే కాదు. విగత వస్త్రగా తెచ్చినా అధర్మం కాదు' అన్నాడు.

సెహభాష్ కర్ణా! కర్ణుడు భలే బాగా చెప్పాడు. 'సోదరా! దుశ్శాసనా! ఈ పాండవుల వస్త్రాలూ, ఆ ద్రౌపది వస్త్రాలు తొలగించు' అన్నాడు దుర్యోధనుడు.

పాండవులు తమ పైవస్త్రాలను తీసి కింద ఉంచారు. దుశ్శాసనుడు ద్రౌపది చీర పట్టుకొని లాగాడు. ద్రౌపది నిస్సహాయంగా శ్రీకృష్ణుణ్ణి –

**"కృష్ణా! గోపీజనప్రియా! కేశవా! కౌరవులు నన్నిలా పరాభవిస్తుంటే నీకు తెలియటం లేదా? ప్రభూ! రమావల్లభా! వ్రజనాథా! ఆర్తినాశకా! మహాయోగీ! విశ్వాత్మా! విశ్వభావనా! కౌరవుల మధ్య కలతపడుతూ నిన్ను శరణుగోరుతున్నాను. నన్ను రక్షించు జనార్దనా!"** అంటూ మనసులో ధ్యానించింది.

దుశ్శాసనుడు లాగుతూనే ఉన్నాడు. ఎంతకీ చీర అయిపోదే! లాగి లాగి వాడు అలసిపోయాడు. లాగలేక కుప్పకూలిపోయాడు.

భీముడు ఆ అవమానాన్ని సహించలేక పోయాడు.

మ. **కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో**
**ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ**
**కరలీలన్ వధియించి తద్విపుల వక్ష శ్శైల రక్తౌఘనిర్**
**ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్ (సభా: 2-233)**

'ఇంతమంది పెద్దలు చూస్తుండగా ఇంతటి దారుణానికి ఒడిగట్టిన ఆ దుశ్శాసనుణ్ణి చంపి, వాడి గుండెల్లోంచి పొంగే వేడి రక్తాన్ని తాగుతాను' అని శపథం పట్టాడు.

ఇంతలో **విదురుడు సభలోనికి వచ్చి 'అయ్యా! సభలో ఎవరైనా ధర్మసందేహాన్ని వెలిబుచ్చితే - అది తెలిసి కూడా చెప్పకపోతే అసత్య దోషంలో సగం అంటుకుంటుంది. ధర్మం తెలిసినప్పటికీ దానిని దాచిపెట్టి సొంతలాభం కోసమో, పక్షపాతం వల్లనో లోభంతోనో అధర్మాన్ని చెప్తే వాళ్ళు అసత్యదోషాన్ని పూర్తిగా పొందుతారు'** అందరూ శాంతంగా ఆలోచించండి. వికర్ణుడు చిన్నవాడైనా బృహస్పతిలా ధర్మం చెప్పాడు. **ధర్మం తెలిసి కూడా పక్షపాతంతో కాని,లోభంతో కానీ చెప్పక పోతే అసత్యదోషం అంటుకుంటుంది.** పూర్వం ప్రహ్లాదుడి కొడుకు విరోచనుడు, సుధన్వుడు అనే ఒక బ్రాహ్మణుడు ఒక కన్య కోసం తగువులాడుకొని ప్రహ్లాదుని వద్దకు తీర్పు కోసం వెళ్ళారు.

కొడుకు విషయంలో తీర్పు చెప్పటానికి ప్రహ్లాదుడు భయపడి, కశ్యపుణ్ణి సలహా అడిగాడు. అప్పుడు కశ్యపుడు

**తే.గీ. సాక్షియును ధర్మదర్శియు సాక్ష్యవిధులు**
**తప్పఁ గాదు, తప్పినను నధర్మయుక్తి**
**వరుణపాశ సహస్రంబు వానిఁ గట్టి**
**పాయు నేఁటేఁట నొక్కొక్కఁ డాయతముగ (సభా: 2-242)**

**సాక్షి, న్యాయమూర్తి సాక్ష్యం నియమాల్ని పాటించాలి. నియమాలను తప్పకూడదు. అలా తప్పితే ఆ అధర్మంవల్ల వేయివరుణపాశాలు వారిని బంధిస్తాయి. సంవత్సరానికి ఒక పాశం చొప్పున వేయేళ్లకు కానీ ఆ పాశాలు వదలవు. అందువల్ల ధర్మాన్ని అనుసరించి ధర్మ బద్ధమైన తీర్పు చెప్పాలి. అలా చెయ్యకపోతే న్యాయమూర్తికి సభాసదులకు పాపం వస్తుంది. కాబట్టి కామక్రోధాలకు అతీతంగా తీర్పు చెప్పు' అని కశ్యపుడు చెప్పాడు.**

ప్రహ్లాదుడు సంతోషించి తన కొడుకు అని ఆలోచించక సుధన్వుడికి అనుకూలంగా తీర్పు చెప్పాడు. కాబట్టి మనం ఈ నాడు ద్రౌపదికి న్యాయం చేయకుంటే అందరికి పాపం వస్తుంది' అన్నాడు.

దుర్యోధనుడికి భయపడి ఎవరూ బదులు చెప్పలేదు.

ద్రౌపది సభాసదులను చూసి 'నేను పాండవుల ఇల్లాలిని. శ్రీకృష్ణుడి సోదరిని. ఇదుగో ఇప్పుడు ఇలా అవమానాన్ని పొందాను. నేను అడిగిన దానికి సమాధానం ఎక్కడ? నేను దాసినా కాదా చెప్పండి!' అని దుఃఖంతో అడిగింది.

భీష్ముడు 'అమ్మా! నీ ప్రశ్నకు ధర్మరాజు ఒక్కడే సమాధానం చెప్పగలడు' అని అన్నాడు.

కర్ణుడు 'తరుణీ! ఐదుగురు భర్తలకన్నా ఒక్క భర్త మేలు కదా ! జూదంలో భార్యను ఓడి పోని వ్యక్తిని భర్తగా ఎంచుకో' అని ఎగతాళి చేశాడు.

దుర్యోధనుడు ద్రౌపదిని తన తొడపై కూర్చోమన్నట్లు సైగ చేశాడు. అది చూసిన భీముడు కోపంతో –

**ఉ. ధారుణి రాజ్యసంపదమదంబున గోమలి గృష్ణఁ జూచి రం**
**భోరు నిజోరుదేశమున నుండగఁ బిల్చిన యిద్దురాత్ము దు**
**ర్వార మదీయ బాహుపరివర్తిత చండగదాభిఘాత భ**
**గ్నోరుతరోరు జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్**

**(సభా: 2-249)**

'ఈ దుర్యోధనుడు రాజ్యం ఉందన్న మదంతో తన తొడపై కూర్చోమని ద్రౌపదిని పిల్చిన దురాత్ముడు. అలాంటి వీణ్ణి నా గదాఘాతాలతో కొట్టి, తొడలు విరిచి చంపుతాను' అని ప్రతిజ్ఞ చేశాడు.

భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఇది తగిన సమయం కాదని భీముణ్ణి శాంతింప చేశారు.

అప్పటికే చలించిపోయిన గాంధారి విదురుడితో ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చింది. ద్రౌపదికి జరిగిన అవమానాన్ని వివరించింది.దానికి ధృతరాష్ట్రుడు

'నాయనా సుయోధనా! పాండవ పట్టమహిషిని ఇలా అవమానించడం తగునా? నీ కారణంగా పాండవులు చూడు ఎంత బాధపడుతున్నారో' అన్నాడు. వెంటనే ద్రౌపదిని పిలిచి 'అమ్మా! ద్రౌపదీ!

**కం. మనమున వేరమిఁ దలపమి**
**యును సక్షమచిత్తుఁ డగుటయును గుణములఁ గై**
**కొని దోషంబులు విడుచుట**
**యును నుత్తముఁడయిన పురుషు నుత్తమగుణముల్ (సభా:2-266)**

**'మనసులో శత్రుత్వం లేకుండా ఉండడం, ఓర్పుతో ఉండడం, మంచిని తీసుకొని చెడును విడిచిపెట్టడం ఉత్తముడి లక్షణాలు. కాబట్టి నా కొడుకు చేసిన తప్పును క్షమించు. మనసులో పెట్టుకోకు. నా కోడళ్ళలో నువ్వు చాలా గొప్పదానివి. నీకు ఏం వరం కావాలో కోరుకో ఇస్తాను'** అన్నాడు.

ద్రౌపది 'ముందు నా భర్తను దాస్యం నుండి విముక్తుణ్ణి చేయండి' అని అడిగింది. 'ఇంకో వరం కోరుకో' అన్నాడు. 'ధర్మరాజునూ అతడినలుగురు తమ్ముళ్ళను దాస్యవిముక్తుల్ని చేసి వారి వారి ఆయుధాలను వాళ్ళకు ఇప్పించండి' అంది. 'సరే!మరో వరం కోరుకో' అన్నాడు ధృతరాష్ట్రుడు. 'వైశ్యసతి ఒక వరం, క్షత్రియ సతి రెండు వరాలు కోరుకోవాలి. ఇదే ధర్మం. కాబట్టి ఇక వరాలు చాలు' అంది.

ద్రౌపది ధర్మనిరతికి ధృతరాష్ట్రుడు సంతోషించి పాండవులను పిలిచి జూదంలో పోగొట్టుకున్న రాజ్యాన్నీ సమస్త సంపదనూ తిరిగి ఇచ్చి 'నాదే తప్పు. నా బుద్ధి గడ్డి తిని జూదాన్ని సాగనిచ్చాను. వృద్ధుడిని, పైగా అల్పబుద్ధినీ. మీ తల్లి గాంధారి ముఖం చూసి దుర్యోధనాదులు మీకు తలపెట్టిన అవమానాన్ని సహించండి. వాళ్ళని క్షమించండి. మీరు ఇంద్రప్రస్థానికి వెళ్ళి హాయిగా జీవించండి' అని దీవించాడు.

భీముడు 'భార్యవల్ల పాండవులకు రాజ్యం వచ్చింది అనిపించుకోవడం కంటే యుద్ధం చేసి సంపాదించడమే మేలు కదా' అన్నాడు పౌరుషంగా.

ధర్మరాజు భీముడిని వారించి, ఇంద్రప్రస్థానికి తీసుకు వెళ్ళాడు.

***

కొంతకాలం గడిచింది. దుర్యోధనుడు కర్ణుడితో, శకునితో మంతనాలు జరిపి తిరిగి ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి 'తండ్రీ! శత్రువును చంపడం వివేకమని దేవగురువు బృహస్పతి చెప్పాడు. పాండవులు మనకు శత్రువులు. ఎంత చేసినా మనం వారికి మంచి వాళ్ళం ఎలా అవుతాం? మనం వాళ్ళను విడిచి పెట్టి తప్పు చేశాం. అర్జునుడు గాండీవం, భీముడు గదాయుధం, ధర్మరాజ, నకుల సహదేవులు వారి వారి ఆయుధాలు పడితే మనం వారిని గెలవడం సాధ్యం కాదు.

పాండవులు ఇప్పుడు బుసకొట్టే పాముల్లా ఉన్నారు. వాళ్ళను చంపకుండా విడిచిపెట్టడం ఎంత అవివేకం! మాయోపాయం ద్వారా ఏదో విధంగా మట్టుపెట్టకపోతే మనల్ని బతకనివ్వరు' అంటూ దుర్యోధనుడు ధృతరాష్ట్రుడికి బాగా నూరిపోశాడు.

వాళ్ళ ప్రోద్బలంతో ధృతరాష్ట్రుడు మళ్ళీ జూదానికి రమ్మని ప్రాతిగామిని పంపించాడు. తండ్రి మాట జవదాటకూడదని ధర్మరాజు జూదానికి వచ్చాడు.

అదే సభామంటపం. అదే శకుని. పాచికలతో సిద్ధంగా ఉన్నాడు. ఎదురుగా ధర్మరాజు. శకుని 'ధర్మరాజా! ధృతరాష్ట్ర మహారాజు మీరు పోగొట్టుకున్న సమస్త సంపదలూ రాజ్యాన్నీ తిరిగి ఇచ్చాడు. ఇక అవి జూదంలో పెట్టడం తగదు. ఇన్ని పందాలు అక్కర్లేదు. ఒక్కటే పందెం. ఓడినవాళ్ళు కట్టుబట్టలతో బయలుదేరి 12 ఏళ్ళు వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చెయ్యాలి. అజ్ఞాతవాసంలో బయటపడితే తిరిగి వనవాసం, అజ్ఞాతవాసం చెయ్యాలి. నీకు సమ్మతమేనా?' అన్నాడు శకుని. ధర్మరాజుకు 'సరే' అనక తప్పలేదు మరి.

శకుని పాచిక వేశాడు. అతడి పాచిక పారింది. ధర్మరాజు ఓడిపోయాడు. కౌరవుల పక్షంవాళ్ళు ఆనందంతో వికటాట్టహాసాలు చేశారు. ఫలితంగా పాండవులు ద్రౌపదితో సహా వనవాసానికి బయలుదేరారు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుల వద్ద సెలవు తీసుకున్నారు. కుంతీదేవి వద్దకు వచ్చారు.

కుంతీదేవి హృదయం తల్లడిల్లిపోయింది. ఆమె 'పుత్రులారా! ఇలాంటి దుస్థితి వస్తుందని ముందుగా ఊహించి మీ తండ్రీ, మాద్రీ స్వర్గానికి వెళ్ళిపోయారు.

నేనో దురదృష్టవంతురాలిని. ఈ దారుణం చూడడానికి ఇంకా బతికే ఉన్నాను. హే శ్రీకృష్ణా! నా కుమారులను కాపాడు' అని ప్రార్థించింది. గుండె రాయి చేసుకొని కొడుకులనూ కోడలినీ దీవించి పంపింది. అందరూ అడవికి పయనమయ్యారు. కోపంతో నిండిన తన చూపులు పడితే జనులు మాడి మసైపోతారని ధర్మరాజు ముఖానికి వస్త్రం అడ్డం పెట్టుకుని బయలుదేరాడు. ఎలాగైతేనేం చివరికి యుద్ధంలో తన వీరత్వం ప్రదర్శించే అవకాశం వచ్చిందని భీముడు రొమ్ము విరుచుకుంటూ నడిచి వెళ్ళాడు. ఇంత కంటే ఎక్కువగా అస్త్రాలు వేసి శత్రువులను సంహరిస్తాననుకుంటూ అర్జునుడు చేత్తో ఇసుక చల్లుకుంటూ వెళ్ళాడు. తమ అందచందాలు చూసి జనులు విలపిస్తారని నకులసహదేవులు మలినమైన వస్త్రాలతో బయలుదేరారు. తడిసిన బట్టలతో విడిపోయిన కురులతో దుఃఖిస్తూ యుద్ధంలో భర్తలను పోగొట్టుకున్న కౌరవుల భార్యలు ఇలాగే రాజ్యం వదిలి వెళతారని సూచిస్తూ ద్రౌపది వెళ్ళింది.

పాండవులతో ధౌమ్యుడు, ఇంకా వేలకొద్దీ బ్రాహ్మణులూ బయలు దేరారు. కుంతీదేవిని విదురుడు ఎంతో సాదరంగా తన ఇంటికి తీసుకువెళ్ళాడు.

# అరణ్యపర్వం

## అక్షయపాత్ర

పాండవులు అరణ్యానికి బయలు దేరారు. ఉత్తర దిక్కుకు ప్రయాణం సాగించారు. వారి వెంట వారి సేవకులు పధ్నాలుగు వేల రథాలతో తరలి వెళ్ళారు. వారి వెంట సుభద్ర, అభిమన్యుడు, ఉపపాండవులూ వెళ్ళారు.

ఆ దృశ్యాన్ని చూసి పురజనులు 'ఎక్కడో ఉన్న పాండవులను పిలిపించి జూదం ఆడించి సర్వస్వం హరించి అడవులకు పంపడం భావ్యమా?' అనుకుని కంట తడి పెట్టారు. 'భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు ఉండికూడా ఎందుకు ఆపలేదు? ఇక్కడ ధర్మం ఎక్కడుంది? కాబట్టి మేము మీతో అరణ్యాలకు వస్తాం' అని పౌరులు పాండవుల వెంట బయలు దేరారు.

ధర్మరాజు 'అయ్యలారా! మీరు మా పట్ల చూపిస్తున్న అభిమానానికి మేం కృతజ్ఞులం. మీరు మా వెంట రావద్దు' అన్నాడు. ధర్మరాజు మాటను మన్నించి పౌరులు వెనుకకు వెళ్ళారు. తరువాత పాండవులు గంగాతీరం చేరుకున్నారు. కానీ వారి వెంట నిత్యాగ్నిహోత్రులూ, వారి శిష్యులూ వచ్చి చేరారు.

ధర్మరాజు 'బ్రాహ్మణోత్తములారా! మీరు పూజ్యులు. మేం అడవులలో కందమూలాలు తింటూ బ్రతకాలి. మీరు మా వెంట వచ్చి కష్ట పడటం ఎందుకు? మరలి వెళ్ళండి' అన్నాడు.

అందుకు వాళ్ళు 'అయ్యా! మీరు లేక మేము బ్రతుకలేం. మీలా మేమూ కందమూలాలు తింటూ ఉంటాం. మా ఆహారం మేం సంపాదించుకుంటాం. మీరు లేని హస్తినాపురంలో మేము ఉండలేం' అన్నారు. అది చూసిన ధర్మరాజు 'మంచి భోజనం తినే వీళ్ళు కందమూలాలను ఎలా తినగలరు?' అన్నాడు విలపిస్తూ.

అంతా విని అక్కడే ఉన్న శౌనకుడనే ఋషి 'ధర్మరాజా! వివేకులు ఎందుకూ దుఃఖించరు. ఎందుకింత బాధపడతావు? ఈ బంధాలు తాత్కాలికాలు. కాబట్టి కలత చెందవద్దు. **బంధంవల్ల అభిమానం, అభిమానం వల్ల కోరిక, కోరిక వల్ల కోపం, దాని వల్ల ఆశ పుడతాయి. ఆశ సమస్తదోషాలకు మూలం. కాబట్టి ఆశను వదిలి పెట్టు.**

**కం. శారీర, మానస మహా**
**దారుణ దుఃఖములఁ జేసి తఱిఁగి శరీరుల్**
**క్రూరతరబాధఁ బొందుదు**
**రారెంటిని జెఱతు రార్యు లమలినబుద్ధిన్ (అరణ్య: 1-21)**

**వివేకవంతుడు దుఃఖం వచ్చినా, భయంకలిగినా కలత చెందదు. జ్ఞానం ఉన్నచోట మమకారాలు ఉండవు. స్నేహం వల్ల ప్రేమ. ప్రేమ వల్ల కామం. కామం వల్ల కోపం. కోపం వల్ల అత్యాశ. దీనిని మించిన దుఃఖం వేరొకటి లేదు. నాశనం తప్పదు.** కాబట్టి ఐశ్వర్యంపైనుండి దృష్టి మరల్చు

**కం. అర్థమ యనర్థమూలం**
**బర్థమ మాయావిమోహనావహము నరుం**
**డర్థార్జనదుఃఖమున న**
**పార్థీకృతజన్ముఁ డగుట పరమార్థ మిలన్ (అరణ్య:1-28)**

**ధనమే అన్ని అనర్థాలకూ మూలం. ధనమే మాయామోహాలతో కూడి ఉంటుంది. మానవుడు ధనసంపాదనలో పడి,అందులో ఉన్న దుఃఖంతోనే వ్యర్థంగా కాలాన్ని గడుపుతాడు. ఈ మాట సత్యం. కాబట్టి ధనం మీద కోరిక కలవాడు పతనంకాక తప్పదు. ధనవంతుడి చుట్టూ బంధువులు చేరి అతడిని పీడించి ధనాన్ని హరిస్తారు. ధనం వల్ల గర్వం, అహంకారం, భయం కలుగుతాయి. కాబట్టి ధనార్జనకు పోవద్దు. తామరాకు మీద నీటి బొట్టులా ఉండు'** అని హితవు చెప్పాడు.

అందుకు ధర్మరాజు 'అయ్యా! ధనం నా కోసం కాదు. ఈ బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి కదా! వాళ్ళు మా అతిథులు. **గృహస్థుకు అతిథిపూజ పరమ**

ధర్మం కదా! ఆర్తుడికి శయ్య, భయంతో ఉన్నవాడికి రక్షణ, అలసిన వాడికి ఆసనం ఇవ్వడం గృహస్థ ధర్మం. తనకోసం మాత్రం వండుకొని తినడం పాపం. కాబట్టి అతిథిసత్కారం చేయడం నా ధర్మం' అన్నాడు.

అందుకు శౌనకుడు 'ధర్మరాజా! ఇంద్రియాలు సుఖాలను కోరతాయి. ఎంతటి జ్ఞానులకైనా ఇంద్రియాలు లొంగవు. ఇంద్రియ సుఖాలకు లోబడి దేహధారులు సంసార చక్రంలో పడి తిరుగుతుంటారు. కానీ మహనీయులు ప్రేమ, అసూయలను విడిచిపెట్టడం, ఇంద్రియాలను నిగ్రహించడం, గురువులను సేవించడం, నియమంగా ఆహారం తినడం, విద్యను అభ్యసించడం, ఫలితం మీద ఆశ లేకుండా పనులు చేయడం అనే నియమాలను ఆచరిస్తారు. అలాంటి వాళ్ళు సంసారబంధాలను అధిగమిస్తారు. కాబట్టి ధర్మరాజా! నువ్వు కూడా గురుసేవ, పెద్దలు చెప్పినది వినడం, విన్నదానిని అర్థం చేసుకోవడం, అర్థం చేసుకున్నదానిని మనసులో నిలుపుకోవడం, అవసరమైన దానిని ఆచరించడం, అవసరం లేనిదానిని వదిలివేయడం చెయ్యి. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, తపస్సు చేసి ఐశ్వర్యాన్ని పొందారు. కాబట్టి తపస్సు చేసి నీ కోరికలు తీర్చుకో' అన్నాడు.

ధర్మరాజు ధౌమ్యుడితో 'అయ్యా! ఇదేమో అడవి. బ్రాహ్మణులు మా మాట వినరు. వీరికి మేము ఆహారం ఎలా సమకూర్చగలను' అని అడిగాడు.

ధౌమ్యుడు ధర్మరాజుతో 'ధర్మరాజా! జీవకోటికి ఆహారాన్ని, నీటిని ప్రసాదించేవాడు సూర్యభగవానుడు. కాబట్టి నువ్వు సూర్యుడిని ప్రార్థించి నీ కోరిక నెరవేర్చుకో' అని ఉపదేశించాడు.

ధర్మరాజు నిష్ఠతో సూర్యుని పూజించాడు. సూర్యుడు ప్రత్యక్షమై ధర్మరాజుకు ఒక రాగి పాత్రను ఇచ్చి 'ధర్మరాజా! ఈ పన్నెండేళ్ళు అరణ్యవాసంలో మీరు అడవిలో సేకరించిన దుంపలు, పళ్లు, కాయగూరలు మీ భార్య ద్రౌపదిచే వండించినపుడు, అవి నాలుగు విధాలైన వంటకాలుగా ఏర్పడతాయి. అవి ఎప్పటికీ అక్షయంగా ఉంటాయి' అని వరం ఇచ్చి వెళ్ళి పోయాడు. అదే అక్షయపాత్ర. ఆ పాత్రతో ద్రౌపది అందరికీ వండి వడ్డించేది. ఎంతమందికి వడ్డించినా పదార్థాలు తరిగిపోవు. అదీ ఆ పాత్ర గొప్పదనం.

కొంతకాలం తరువాత కామ్యక వనానికి చేరుకున్నారు పాండవులు.

## కిమ్మీర వధ

హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు విదురుడితో 'విదురా! పాండవులు ఏమి చేస్తుంటారు'అని అడిగాడు. దానికి విదురుడు 'పాండవులు దైవాంశసంభూతులు. జూదం వల్ల అన్నదమ్ములకు వైరం వస్తుందని చెప్పాను. నువ్వు వినలేదు. ఇప్పటికైనా నా మాట విని పాండవులను పిలిపించి, వారి రాజ్యం వారికి ఇచ్చి ధర్మం నిలబెట్టు. కర్ణ, శకుని మాటలు విని చెడిపోతున్న నీ కొడుకు సుయోధనుడిని విడిచి పెట్టు. ద్రౌపదికి, భీముడికి దుశ్శాసనుడితో క్షమాపణలు చెప్పించు' అన్నాడు.

ఆ మాటలు ధృతరాష్ట్రుడికి కోపం తెప్పించాయి. 'సుయోధనుడు నా కన్న కొడుకు. వాడిని ఎలా వదలుకోమంటావు? నీకు నా కొడుకులంటే పడదు. వాళ్ళు ఉన్నతులైతే సహించలేవు. నీ సాయం నాకు అక్కరలేదు. నువ్వు పాండవుల దగ్గరికే వెళతావో ఇంకెక్కడి వెళతావో నీ ఇష్టం పో' అని పంపించివేశాడు.

వెంటనే విదురుడు కామ్యకవనంలో ఉన్న పాండవుల వద్దకు వచ్చాడు. ధర్మరాజు తన తండ్రి గురించి అడిగాడు. విదురుడు జరిగినది చెప్పాడు.

ధృతరాష్ట్రుడికి విదురుడు పాండవులవద్ద ఉన్నాడని తెలిసింది. విదురుని విడిచి ఉండలేక అతడి కోసం సంజయుడిని పంపాడు. సంజయుడు కామ్యకవనం వెళ్ళి విదురుడికి నచ్చచెప్పి తీసుకు వచ్చాడు.

ధృతరాష్ట్రుడు 'విదురా! నువ్వు నీతిమంతుడివి. నాకు బుద్ధి లేదు. అందుకే నిన్ను వెళ్ళగొట్టాను. నన్ను క్షమించు' అని వేడుకున్నాడు.

విదురుడు 'ధృతరాష్ట్రా! నువ్వూ నీ కొడుకులూ ధర్మం తప్పి నడుస్తున్నప్పుడు మీకు ధర్మం చెప్పడం నా ధర్మం. మహా పరాక్రమవంతులైన పాండవులతో వైరం మంచిది కాదు' అన్నాడు. విదురుడు తిరిగి రావడం దుర్యోధనుడికి ఇష్టం లేదు. విదురుడు తన తండ్రి మనసు మార్చేస్తాడని అతడి అనుమానం.

దుర్యోధనుడు కర్ణ, శకుని, దుశ్శాసనులతో చర్చిస్తూ 'పాండవుల దగ్గరకు వెళ్ళిన విదురుడు మళ్లీ వచ్చాడు. మనకు మంత్రి అయ్యాడు. ఒకవేళ విదురుడు, ధృతరాష్ట్రుడు కలసి పాండవులను తిరిగి రమ్మంటే ఏమి చేయాలి?' అన్నాడు.

అప్పుడా శకుని 'సత్యసంధులైన పాండవులు ఎట్టి పరిస్థితిలో తిరిగి రారు. ఆ భయం నీకు వద్దు' అన్నాడు.

కర్ణుడు 'ఈ అదను చూసుకుని వారి మీద యుద్ధం చేసి వారిని హతమారుద్దాం. శత్రుశేషం లేకుండా చేద్దాం' అన్నాడు.

కర్ణుడి మాట విని దుర్యోధనుడు సైన్యం సమీకరిస్తున్నాడు. పాండవులపై యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు.

ఇది తెలిసి వ్యాసుడు ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి 'నీ కుమారుడు పాండవుల మీదకు యుద్ధానికి వెళ్తున్నాడు. పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాల తరువాత ఎలాగూ యుద్ధం తప్పదు. తొందరెందుకు?' అన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'మహాత్మా! నన్ను ఏం చెయ్యమంటారు? జూదం వల్ల చెడు జరిగింది. నేను పుత్రవాత్సల్యం వల్ల నా కొడుకుని విడువలేను' అన్నాడు.

వ్యాసుడు 'ధృతరాష్ట్రా! పుత్రవాత్సల్యం ఉండవలసిందే కానీ అడవిలో ఉండే పాండవుల మీద దయ చూపించు. నాకు ఇద్దరూ సమానులే. ధర్మరాజు స్నేహంతో నీ కొడుకు సుయోధనుడు మారవచ్చు' అన్నాడు.

ధృతరాష్ట్రుడు 'అయ్యా! వాడు నా మాట వినడు. మీరే వాడికి నచ్చ చెప్పండి' అన్నాడు. వ్యాసుడు 'మైత్రేయ మహర్షి వచ్చి నీ కొడుక్కు నచ్చ చెబుతాడులే!' అని వెళ్ళి పోయాడు.

వ్యాసుడు చెప్పినట్లే కొన్ని రోజుల తరువాత మైత్రేయుడు వచ్చాడు. ముందుగా పాండవులను చూసి ఆ తరువాత హస్తినాపురం వచ్చాడు. ధృతరాష్ట్రుడు మైత్రేయుడికి అర్ఘ్యపాద్యాలు ఇచ్చాడు. మైత్రేయుడు 'నేను కామ్యక వనంలో ఉన్న పాండవులను చూసి వచ్చాను. వాళ్ళు అడవులలో కందమూలాలను తిని జీవిస్తున్నారు' అన్నాడు. 'పాండవులు క్షేమంగా ఉన్నారా?' అని ధృతరాష్ట్రుడు అడిగాడు. **మైత్రేయుడు 'ఓ రాజా! పాండవులు ధర్మబుద్ధి కలవాళ్ళు. వారికి మహర్షుల దీవెనలు ఉన్నాయి. అందు వల్ల క్షేమమే!' అన్నాడు.**

దుర్యోధనుని వైపు తిరిగి 'కుమారా! పాండవులతో వైరం వదులుకో. అలా చేస్తే నువ్వు కురువంశానికి మేలు చేసిన వాడివి ఔతావు. పాండవులు వజ్ర శరీరులు. భీముడు హిడింబ, బకాసుర, జరాసంధ, కిమ్మీరాది వీరులను వధించిన బలాఢ్యుడు. అతడిని వధించగల యోధులు లేరు. శ్రీకృష్ణుడు, ధృష్టద్యుమ్నుడి బంధుత్వం పాండవులకు మరింత బలాన్నిచ్చింది. కాబట్టి నువ్వు పాండవులతో స్నేహం చేయటం మంచిది' అన్నాడు. ఆ మాటలు విన్న దుర్యోధనుడు కాలిబొటన వేలుతో నేలను రాస్తూ హేళనగా నవ్వాడు. తొడల్ని గట్టిగా చరిచాడు. అతడి నిర్లక్ష్యాన్ని చూసి మైత్రేయ మహర్షికి కోపం వచ్చింది.

అందుకు మైత్రేయుడు ఆగ్రహించి 'సుయోధనా! యుద్ధభూమిలో భీముని గదాఘాతంతో నీ తొడలు బద్దలవుతాయి' అని శపించాడు.

ధృతరాష్ట్రుడు భయపడి మహర్షిని శాపవిమోచనం ఇవ్వమని వేడుకున్నాడు. మైత్రేయుడు 'మహారాజా! నీ కొడుకు పశ్చాత్తాపం చెంది మంచి బుద్ధి కలిగి ఉంటే ఈ శాపం వర్తించదు' అన్నాడు.

దుర్యోధనుడికి శాపం ఇచ్చిన తరువాత ధృతరాష్ట్రుడు 'మహాత్మా! కిమ్మీరుడనే రాక్షసుడు భీముని చేతిలో చనిపోయాడని చెప్పారు కదా! ఎలా చనిపోయాడో వివరిస్తారా?' అని అడిగాడు.

మైత్రేయుడు 'నా మాటను నీ కొడుకే వినలేదు. నేనెందుకు చెప్పాలి? విదురుణ్ణి అడిగి తెలుసుకో!' అని చెప్పి వెళ్ళి పోయాడు. అప్పుడు విదురుడు కిమ్మీరుడి వృత్తాంతం ఇలా ప్రారంభించాడు. 'పాండవులు అడవిలో ఉండగా వికృతాకారుడైన ఒక రాక్షసుడు వచ్చి పాండవుల దారికి అడ్డంగా నిలిచాడు. ఆ రాక్షసుణ్ణి చూసి ద్రౌపది భయంతో కళ్ళు మూసుకుంది. ఇంతలో ధౌమ్యుడు తన మంత్రశక్తితో ఆ రాక్షసుని మాయను భగ్నం చేశాడు. ఆ రాక్షసుణ్ణి చూసి ధర్మరాజు 'నువ్వెవరు? ఈ అడవిలో ఎందుకు ఉన్నావు?' అని ఆడిగాడు.

దానికా రాక్షసుడు 'నేను బకుడు అనే రాక్షసుని తమ్ముడిని. నా పేరు కిమ్మీరుడు. మనుష్యులను చంపి తింటూ ఉంటాను. నాకు భయపడి ఎవరూ ఈ

అరణ్యానికి రారు. ఇంతకీ మీరు ఎవరు? ఈ అరణ్యానికి ఎందుకు వచ్చారు?'అని అడిగాడు.

ధర్మరాజు 'నా పేరు ధర్మరాజు. వీరు నా సోదరులు. మేము వనవాసం చేస్తూ ఇక్కడకు వచ్చాం' అన్నాడు. ఇది విని ఆ కిమ్మీరుడు 'నా అన్న బకుణ్ణి చంపిన భీముడు వీడేనా? వీడిని చంపి నా ఆకలి తీర్చుకుంటాను. నేనూ వీడి కోసమే వెతుకుతున్నాను' అని వికటాట్టహాసం చేశాడు.

అర్జునుడు గాండీవం ఎక్కు పెట్టాడు కానీ ఈలోగా భీముడు కిమ్మీరుణ్ణి ఎదుర్కొన్నాడు. ఇద్దరూ ఘోరంగా యుద్ధం చేశారు. చెట్లతోనూ రాళ్ళతోనూ కొట్టుకున్నారు. చివరకు భీముడు కిమ్మీరుణ్ణి కూడా అతని అన్న బకుని చంపినట్లు దేహాన్ని విరగదీసి చంపాడు. ఈ విధంగా భీముడు కామ్యకవనంలో రాక్షస భయం లేకుండా చేశాడు' అని చెప్పాడు. ఇది విని ధృతరాష్ట్రుడి కలత రెట్టింపమయ్యింది. జరిగినదంతా తెలుసుకున్న శ్రీకృష్ణుడు యాదవులతో సహా పాండవుల వద్దకు వచ్చి – 'ధర్మజా! అందర్నీ సంహరించి నిన్ను రాజును చేస్తాను' అన్నాడు ఆవేశంగా. అప్పుడు అర్జునుడు అతణ్ణి శాంతింపజేశాడు. అంతలో ద్రౌపది వచ్చి తనకు జరిగిన పరాభవం గురించి చెప్పుకొని బాధ పడింది. శ్రీకృష్ణుడు ఆమెను ఓదార్చాడు. పాండవులు ప్రతీకారం తీర్చుకుంటారని భరోసా ఇచ్చాడు.

## సాళ్వుని వధ

అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి చూసి 'శ్రీకృష్ణా! నువ్వు పురాణ పురుషుడివి. గంధమాదన పర్వతం మీద పదివేల సంవత్సరాలు తపస్సు చేశావు. పుష్కరంలో పదుకొండు వేల సంవత్సరాలు తపస్సు చేశావు. సరస్వతీ తీరంలో పన్నెండు సంవత్సరాలు వ్రతం చేశావు. దితి కుమారులనూ దనువు కుమారులనూ సంహరించి ఇంద్రపదవి సుస్థిరం చేశావు. నువ్వు అదితి కుమారుడివి. ఇంద్రుడి తమ్ముడివి. ఉపేంద్రుడివి. మొదట వామనుడిగా తరువాత త్రివిక్రముడిగా లోకాలను ఆక్రమించావు. లోక కంటకులైన శిశుపాలుడినీ, కంసుడినీ వధించావు. నువ్వు అవతార మూర్తివి. అనృతం, మదం, కోపం, మత్సరం నీ దగ్గరకైనా రావు' అని

స్తుతించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! నువ్వు నరుడివి. నేను నారాయణుడిని. మనం ఒకరికి ఒకరం మిత్రులం" అన్నాడు.

అప్పుడు ద్రౌపది శ్రీకృష్ణుని చూసి 'శ్రీకృష్ణా! నువ్వు యజ్ఞ పురుషుడివి. సర్వవ్యాపివి. సజ్జనులకు నీవే దిక్కు. నీకు తెలియనిది లేదు. నాకు జరిగిన పరాభవం చెప్తాను –

నేను చక్రవర్తి అయిన పాండురాజు కోడలిని. పాండవుల భార్యను. మహావీరుడైన ధృష్టద్యుమ్నుడి సోదరిని. అలాంటి నన్ను దుశ్శాసనుడు జుట్టి పట్టి ఈడ్పించాడు. నా వలువలు విప్పాడు. దారుణంగా నిండు సభలో అవమానించాడు. భీమార్జునులు అక్కడే ఉన్నా నా మొర ఆలకించ లేదు. కర్ణుడు నన్ను చూసి నవ్వాడు. ఎందరు ఉండి ఏం లాభం? ఎవరూ లేనిదానిని అయ్యాను. ఆ నవ్వు నా మనస్సును కలచివేస్తోంది. ఆ కౌరవులు భీముడికి విషం పెట్టారు. పాములతో కరిపించారు. లక్క ఇంట్లో పెట్టి కాల్చాలనుకున్నారు. ఇప్పుడు జూదమాడి మా రాజ్యం లాక్కున్నారు. పాండవులు తమ శౌర్యం మరిచిపోయారు. కానీ నేను మర్చిపోలేదు. మర్చిపోలేను అంది. శ్రీకృష్ణుడు అంతా విని 'అమ్మా! అర్జునుడి బాణాల ధాటికి కౌరవులు చావడం తథ్యం. బాధపడకు' అని ఓదార్చాడు. శ్రీకృష్ణుడు 'ధర్మరాజా! జరిగినదంతా యుయుధానుడు చెప్పాడు. విని చాలా బాధపడ్డాను. ఆసమయంలో నేను మీదగ్గర లేను. ఉంటే ఇంత అనర్థం జరిగేది కాదు. నేను ఆ సమయంలో సాల్వుడితో యుద్ధం చేస్తున్నాను' అన్నాడు. ధర్మరాజు వెంటనే శ్రీకృష్ణుడితో 'శ్రీకృష్ణా! ఆ వృత్తాంతం వివరించు' అన్నాడు. శ్రీకృష్ణుడు ఇలా చెప్పసాగాడు– 'రాజసూయయాగం సమయంలో శిశుపాలుడు నా చేతిలో మరణించిన విషయం మీ అందరికీ తెలుసు కదా! శిశుపాలుని తమ్ముడు సాళ్వుడు. అన్నను చంపిన దానికి పగ తీర్చుకోవడానికి ద్వారక మీదకు యుద్ధానికి వచ్చాడు. అప్పుడు నేను మీ వద్ద ఉన్నాను. ద్వారకాపురిని ముట్టడించి నగరం వెలుపలి వనాలను నాశనం చేశాడు. ఆ సమయంలో ద్వారకలో ఉన్న సాంబుడు, ప్రద్యుమ్నుడు సాళ్వుడితో ఘోరంగా యుద్ధం చేశారు. ప్రద్యుమ్నుడు సాళ్వునిపై బ్రహ్మాస్త్రాన్ని

ప్రయోగించాడు. సాళ్వుడు మూర్ఛపోయాడు. ప్రద్యుమ్నుడు సాళ్వుణ్ణి చంపబోయాడు. ఇంతలో నారదుడు అడ్డుపడి 'కుమారా! ఇతడిని నువ్వు చంపకూడదు. ఇతడు నారాయణుడి చేతిలో హతుడు కావలసి ఉంది' అన్నాడు. కాబట్టి ప్రద్యుమ్నుడు ఊరుకున్నాడు. సాళ్వుడు బతికి పోయాడు. నేను ద్వారకకు వెళ్ళగానే సాళ్వుడు ధ్వంసం చేసిన వనాలను చూశాక నాకు కోపం వచ్చింది. సాళ్వుడి మీదకు యుద్ధానికి వెళ్ళాను. ఘోరంగా యుద్ధం జరిగింది. సాళ్వుడు గెలవలేక మాయాయుద్ధం మొదలు పెట్టాడు. నేను వాడి మాయలు అరికట్టి చివరికి సాళు వ్వనిపై చక్రాయుధాన్ని ప్రయోగించి అతడిని వధించాను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

తరువాత శ్రీకృష్ణుడు తన చెల్లెలు సుభద్రను తీసుకుని ద్వారకకు వెళ్ళిపోయాడు. ధృష్టద్యుమ్నుడేమో ఉపపాండవులను తీసుకుని పాంచాలదేశం వెళ్ళిపోయాడు. బ్రాహ్మణులు తమ ముఖ్య సేవకుడైన ఇంద్రసేనుణ్ణి, ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులనూ తీసుకుని ద్వైతవనానికి వెళ్ళారు. ధర్మరాజు 'ఈ అడవిలో క్రూరమృగాలు ఉన్నాయి. రాక్షసులు ఉన్నారు. మనం జాగ్రత్తగా ఉండాలి' అని మిగిలిన వారితో అన్నాడు. వాళ్ళు అక్కడ కుటీరాలు నిర్మించుకుని సంతోషంగా కాలం గడుపుతున్నారు.

ఒకరోజు మార్కండేయ మహర్షి వచ్చాడు. ధర్మరాజు ఆ మహర్షిని తగినరీతిగా సత్కరించాడు. అప్పుడు మార్కండేయుడు కొన్ని హితవాక్యాలు చెప్తున్నాడు.

**ఉ. ధర్మమ సల్పుచుం దగిలి ధర్మపథంబునఁ జేసి యర్థముం**
**బేర్మియు గాంచి ధర్మవిధిఁ బెండిలియై ప్రజలన్ సృజించి స**
**త్కర్మములం బ్రశస్తములుగాఁ గ్రతువుల్ వొనరించు సజ్జనుల్**
**ధర్మజ! యిందు నందును ముదంబునఁ గాంతు రభీష్టసౌఖ్యముల్**

**(అరణ్య: 4-177)**

**ధర్మతనయా! మానవుడు ధర్మాన్నే ఆచరిస్తూ ఉండాలి. ధర్మమార్గంలోనే ధనాన్ని సముపార్జించాలి. పెండ్లి చేసుకోవాలి. సంతానం పొందాలి. మంచి యజ్ఞాలను చేస్తూ ఉండాలి. ఈవిధమైన జీవన విధానంతో ప్రవర్తించేవారు సజ్జనులు.**

వారు మిక్కిలి ఆనందంతో ఈలోకంలోనూ, పరలోకంలోనూ కోరిన సౌఖ్యాలు పొందుతారు.

ఆ.వె. సత్యమును శమంబుశౌచంబు లేక, నా
స్తిక్యమును నిషిద్ధసేవనంబు
గలిగి తిరుగు దుష్టకష్టజనశ్రేణి
పొలియునుభయలోకములకుఁగాక (అరణ్య: **4-178**)

సత్యం, ఇంద్రియనిగ్రహం, పవిత్రత లేకుండా, నాస్తికులై శాస్త్రాలు వద్దన్న పనులనే ఆచరిస్తూ ఉండే దుర్మార్గులు, నీచులు అయిన మనుష్యులు ఈలోకానికీ, పరలోకానికీ కాకుండా నశించిపోతూ ఉంటారు. ఇక కలియుగ ధర్మాలు కొన్ని చెబుతాను విను.

సీ. సత్యంబు నరులకు సంక్షిప్తమగు, సత్య
హాని నాయువు గడు నరిగిపోవు;
నాయువు దరిగిన నల్పంబులగు విద్య
లల్పవిద్యలను మోహంబు మిగులు
మోహంబువల్ల బైముసురు లోభంబు; లో
భావేశమునఁ గామ మగ్గలించుఁ
గామంబు పెంపునఁ గడఁగుఁ గ్రోధంబు; క్రో
ధంబున వైర మెంతయును బెరుగు

ఆ.వె. వైరమున నశేషవర్ణులు నన్యోన్య
పీడసేయుచును విభిన్నబుద్ధి
నొక్కడొకని మేర నుండక వర్ణసం
కరము సేయగలరు కలియుగమున (ఆరణ్య: **4-287**)

మానవులలో సత్యం తరిగిపోతుంది. సత్యానికి హాని కలిగితే ఆయువు క్షీణిస్తుంది. ఆయువు క్షీణిస్తే విద్యలు క్షీణిస్తాయి. అలాంటి అల్పవిద్యలవల్ల మోహం, దానివల్ల లోభం, లోభంవల్ల కామం, దానివల్ల క్రోధం ఏర్పడతాయి. క్రోధంతో

**పగ పెంపొందుతుంది. ఆ పగతో అన్ని వర్ణాలవారూ ఒకరినొకరు బాధించు-కుంటారు. ఎవరి హద్దుల్లో వాళ్ళు ఉండరు.** 'ధర్మరాజా! నాడు తండ్రి ఆజ్ఞమేరకు అడవులకు వెళ్ళిన శ్రీరాముణ్ణీ, సీతనూ, లక్ష్మణుణ్ణీ చూశాను. తరువాత మిమ్మల్ని చూస్తున్నాను. పూర్వపు రాజులైన సగరుడు, నలుడు, భరతుడు, యయాతి, వైన్యుడు, నభాగుడు మొదలైన వాళ్ళు పాటించిన సత్య ధర్మాలు పాటిస్తే వాళ్ళు పొందినట్లే మీరూ ఉత్తమ లోకాలు పొందుతారు. మీకు శుభం కలుగుతుంది'అని చెప్పి ఆశీర్వదించి వెళ్ళాడు.

## ద్రౌపదీపాండవుల సంవాదం

ఒకరోజు ద్రౌపది ధర్మరాజుతో 'ధృతరాష్ట్రుడు తన కొడుకు మాటలు విని మిమ్మల్ని రాజ్యం నుండి వెళ్ళగొట్టాడు. కానీ అతనికి మీ మీద కోపం పోయిందా? పోదు. ఎందుకంటే అతని హృదయం పాషాణం. తన కొడుకు మిమ్మల్ని నిష్ఠూరంగా మాట్లాడినప్పుడు ధృతరాష్ట్రుడు వారించనూ లేదు. రాజభోగాలు అనుభవించవలసిన మీరు అడవులలో ఇలా కష్టాలు పడుతున్నారు. ఇది నేను చూసస్తూ భరించలేకపోతున్నాను. ఆ ధృతరాష్ట్రుడిలాగా బ్రహ్మదేవుడు కూడా మిమ్మల్ని సకల సుఖాలనుంచీ దూరం చేసి మీకు శత్రువయ్యాడా ఏమిటి?'

మీ తమ్ముళ్లు మీ మాటమీద గౌరవంతో తమ పరాక్రమం విడిచిపెట్టి ఉన్నారు. ఆనాడు సామంతరాజుల కిరీటకాంతులతో ఎర్రబడ్డ మీ పాదాలు నేడు బండ రాళ్ళ మీద నడచి నడచి ఎర్రబడ్డాయి. ఎందరో బ్రాహ్మణులకు భోజనం పెట్టిన మీరే ఈ రోజు అడవుల్లో తిండిలేక కందమూలాలు తింటున్నారు. ఇలాంటి దుర్దశలో కోపం విడిచి పెట్టడం తగినదేనా?

చూడండి!అమితబలశాలియైన భీమసేనుడు కందమూలాలు తిని ఎలా చిక్కిపోయాడో! విలువిద్యలో మేటి అయిన అర్జునుడు అడవి జంతువుల మధ్య తిరుగుతున్నాడు. మీరు ఇంకా ఓర్పు వహిస్తున్నారా?

**క్షమనూ తేజస్సునూ సమయానుకూలంగా ఉపయోగించని రాజు ప్రజల మన్నన పొందలేడు.** పూర్వం బలి చక్రవర్తి క్షమ గొప్పదా? తేజస్సు గొప్పదా? అని తన తాత అయిన ప్రహ్లాదుని అడిగితే అందుకు ప్రహ్లాదుడు –

తే.గీ. క్షమయ తాల్చియుండc జన దెల్లప్రొద్దు దే
జంబు దాల్చియుండ జనదు పతికి
సంతతక్షముండు సంతతతేజుండు
నగుట దోషమందు రనఘ! జనులు (అరణ్య: 1-217)

అన్ని సమయాలలో క్షమ పనికిరాదు. అలాగే సదా ప్రతాపం చూపకూడదు. రెండూ సమపాళ్ళలో చూపాలి. ఎప్పుడూ క్షమిస్తుంటే సేవకులు పనిచేయరు. యజమానిని గౌరవించరు. ఎక్కువ కర్కశంగా ఉంటే రాజు ప్రజాకంటకు డౌతాడు' అని ప్రహ్లాదుడు చెప్పాడు.

తే.గీ. ఆది నపరాధ మొక్కటియైన నదియు
నల్పమైనను క్షమియించు నదియుగాక
చెనసి యపరాధములు పెక్కు సేయుచున్న
పాపకౌరవ్యులకు సహింపంగ నేల (అరణ్య: 1-219)

ఒక తప్పు చేస్తే సరే క్షమించవచ్చు. కానీ అదేపనిగా తప్పులు చేస్తున్న కౌరవులను క్షమించవచ్చా? కాబట్టి మనం మన పరాక్రమం, తేజస్సు చూపించ వలసిన సమయం ఇదే' అంది.

అందుకు ధర్మరాజు 'ద్రౌపదీ!

సీ. క్రోధంబు పాపంబు, క్రోధంబునన చేసి
యగుc జువ్వె ధర్మకామార్థహాని
గడుcగ్రోధి గర్జంబు గానందు, క్రుద్ధుండు
గురునైన నిందించుc, గ్రుద్ధుcడైన
వాc డవధ్యులనైన వధియించు, మఱి యాత్మ
ఘాతంబు సేయంగc గడcగుc గ్రుద్ధుc,
దస్మాదృశులకు ధర్మానుబంధుల కిట్టి
క్రోధంబు దాల్చుట గుణమె చెపుమ?

ఆ. యెఱుక గల మహాత్ముఁ డెఱుకయ న్జలముల
నార్చుఁ గ్రోధ మను మహానలంబుఁ
గ్రోధవర్జితుండు గుఱుకొని తేజంబు
దాల్చు దేశకాలతత్త్వ మెఱిఁగి (అరణ్య: 1-222)

'క్రోధం మహాపాపం. క్రోధంవల్ల ధర్మకామార్థాలకు హాని. కోపిష్ఠివాడు కార్యసాధకుడు కాడు. గురువునైనా నిందిస్తాడు. చంపగూడని వారినైనా వధిస్తాడు. ఆత్మహత్యైనా చేసుకుంటాడు. కాబట్టి మనలాంటి వారికి ఇలాంటి క్రోధం పనికి రాదు. వివేకవంతుడు క్రోధాన్ని విడిచిపెట్టి తేజస్వి అవుతాడు.

కం. క్షమ గల వానికిఁ బృథ్వీ
సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్;
క్షమి యైనవాని భుజవి
క్రమము గడున్ వెలయు సర్వకార్యక్షమమై (అరణ్య: 1-223)

భూదేవిలాంటి క్షమ కలవాడికి నిత్యమూ విజయం సిద్ధిస్తుంది. క్షమాగుణం ఉన్నవాడి పరాక్రమం ఇంకా ప్రకాశిస్తుంది. దుర్యోధనునికి క్షమాగుణం లేదు కాబట్టి అతడు పతనం కాక తప్పదు' అన్నాడు.

అందుకు ద్రౌపది 'ఓ అజాతశత్రూ! అందుకే నువ్వు ధర్మంతో వర్ధిల్లుతున్నావు. కానీ క్షమ శత్రువుల వద్ద చూపించవచ్చా? వంచకుల పట్ల వంచనతో ప్రవర్తించాలి. ఓ బ్రహ్మదేవా! నువ్వు వంచకులకేమో సుఖాన్ని ఆనందాన్ని అభ్యుదయాన్నీ ఇచ్చి, ధర్మాత్ముల సంపదలు తీసుకొని వారికి శోకాన్ని మిగులుస్తున్నావా? వంచకులే నీకు బంధువులా? ధర్మాత్ములు శత్రువులా?' అని అంది బాధను దిగమింగుకుంటూ.

ధర్మరాజు మళ్ళీ 'ద్రౌపదీ! నువ్వు నాస్తికురాలిలా మాట్లాడుతున్నావు. అది తప్పు. ధర్మాత్ములైన మార్కండేయ, వ్యాస, నారదాది మహామునులు నన్ను ధర్మాత్ముడనంటూ గౌరవిస్తున్నారు. ఇతరులు నా పట్ల అధర్మంగా ప్రవర్తించినా నేను ఎందుకు ధర్మం తప్పాలి? పుణ్యకార్యాలకు ఫలితం తప్పకుండా ఉంటుంది. లేకపోతే మునులు వాటిని ఎందుకు ఆచరిస్తారు చెప్పు? నువ్వూ ధృష్టద్యుమ్నుడూ

**పుణ్యఫలంగానే పుట్టారుకదా!'** అన్నాడు. దానికి ద్రౌపది **'కర్మఫలానికి విధి కారణం కాదు అని నేననను. కాని కర్మ చేయడం మానవధర్మం కదా? కర్మఫలం పొందాలంటే మానవప్రయత్నం ఉండాలి. ఆ తరువాత దైవబలం. పురుషుడు మొదట సంకల్పించాలి. ఆ తరువాత ప్రయత్నం చేయాలి. అప్పుడు దైవసాహాయ్యం తప్పక లభిస్తుంది.**

**నువ్వు గింజలో నూనె ఉన్నా, కర్రలో నిప్పు ఉన్నా పురుష ప్రయత్నం లేకుండా ఎక్కడైనా నూనె వస్తుందా? పురుష ప్రయత్నం లేకుండా దైవాన్నీ, ధర్మాన్ని నమ్ముకుంటే ఫలితం ఉంటుందా?** కాబట్టి మీ తమ్ముళ్ళ పరాక్రమంతో ఒక లక్ష్యం పెట్టుకొని ప్రయత్నించు.ఫలసిద్ధిని పొందు. ఇది నా విన్నపం' అంది.

ద్రౌపది మాటలకు భీమసేనుడు వంతపాడుతూ 'అన్నయ్యా! రాజ్యం మన తండ్రి తాతలది. దానిని నువ్వు ఇతరుల పరం చేసి ఇక్కడ ధర్మవచనాలు పలుకుతున్నావే. చెడ్డవారిని ధర్మబుద్ధితో జయించడం సాధ్యమేనంటావా? పరాక్రమంతో శత్రువులను జయించాలి కాని ధర్మం ధర్మం అంటూ ధర్మపన్నాలు వల్లిస్తూ కూర్చుంటే ఎలా? పరాక్రమం లేనివాడు క్రుంగి పోవాలి కానీ నీలాంటి వారు కాదన్నయ్యా! ఆనాడే శత్రువులను చంపిపారేసి ఉంటే మనకు ఈ గతి పట్టేది కాదు. ఒప్పందాన్ని మీరు అతిక్రమించలేక పోవడం కౌరవులకు చులకన అయింది. అది మన పిరికితనం అనుకుంటున్నారు వారంతా. నువ్వు అనుసరిస్తున్నావే ధర్మం! అది మనకీ,మన బంధువర్గాలకీ ఎంత బాధ కలిగిస్తోందో ఒక్కసారి ఆలోచించు. **శత్రువులను జయించడం, ప్రజల భయాన్ని పోగొట్టడం, దానధర్మాలు చేయడం, యజ్ఞయాగాదులు నిర్వహిస్తూ బ్రాహ్మణులను పూజించడం- ఇవి క్షత్రియధర్మాలు. కేవలం ధర్మాచరణతో శత్రువులను జయించగలమా! మోసాన్ని మోసంతో జయించాలి. ఒప్పందాన్ని పక్కన పెట్టి కౌరవులను ఒక పట్టుపడదాం.రాజులంతా మనకు సాయం చేస్తారు. కౌరవ రాజ్యంలోని ప్రజలు కూడా నీ పాలన కోరుకుంటున్నారు' అన్నాడు భీముడు ఆవేశంగా.**

అతడిమాటలకు ధర్మరాజు 'భీమసేనా! నీ మాటలు ధర్మంగానే ఉన్నాయి కానీ నేను సభలో పన్నెండేళ్ళు అరణ్యవాసం ఒక ఏడు అజ్ఞాతవాసం చేస్తానని మాట ఇచ్చాను. **క్షణికమైన సుఖాలకోసం ఇచ్చిన మాటను తప్పి అసత్యదోషానికి పాల్పడలేను. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని వదిలే ప్రసక్తే లేదు. మనకు మేలు జరిగే వరకూ వేచి ఉంటాను'** అన్నాడు.

భీముడు 'అన్నయ్యా! మృత్యువు ఎప్పుడూ మనవెనుక పొంచి ఉంటుంది. ఈ జీవితం అశాశ్వతం. కాబట్టి వేచి ఉండడం తగదు. మరణించే లోపైనా పగ తీర్చుకోవాలి కదా? 'శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవాలని నా హృదయం పరితపిస్తోంది. నా తమ్ముళ్ల దుఃఖాన్నీ, ద్రౌపది బాధనూ తీర్చడం కూడా ధర్మమే. దయ దయ అంటూ కూర్చోవడం మంచిదేనా? నువ్వు అనుసరించే మార్గం బ్రాహ్మణులకు సరిపోతుంది. క్షత్రియులకు కాదు. క్షాత్రధర్మం ప్రకారం యుద్ధం చేస్తాం. అడవిలో పన్నెండేళ్ళు గడపవచ్చు. కానీ జనపదాలలో పన్నెండు నెలలు గడపడం అసాధ్యం. జగత్ప్రసిద్ధులమైన మనం ఎవరికీ తెలియకుండా బతకడం అసంభవం. కాబట్టి తిరిగి అరణ్యవాసం, అజ్ఞాతవాసం. ఇలా ఎన్నాళ్ళు? ఇప్పటికి మనం పదమూడు నెలల వనవాసం పూర్తిచేసుకున్నాం. ఈ పదమూడు నెలల్ని పదమూడేళ్ళుగా భావించడంలో తప్పేమీ లేదు' అన్నాడు భీముడు మళ్ళీ.

ధర్మరాజు భీముడితో 'భీమా! నీకు పాండిత్యం, పరాక్రమం, దర్పం అన్నీ ఉన్నాయి. కాబట్టి నేను చెప్పేది ఆలోచించు. కౌరవులతో యుద్ధం సామాన్యమైనది కాదు. ధృతరాష్ట్రుడి కుమారులు మహావీరులు. పైగా దుర్మార్గులు. వారికి కర్ణుడు, భూరిశ్రవుడు, శల్యుల అండ ఉంది.

రాజసూయయాగంలో మనచేతిలో ఓడిన రాజులంతా మనపై కోపంతో కౌరవ పక్షంలో చేరారు. కర్ణుడు మహావీరుడు, కవచకుండలధారి. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుల లాంటి మహా యోధులు మరో పక్క ఉన్నారు. వాళ్ళకు మనతో విరోధం లేదు. అయినా వాళ్ళు ధర్మాన్ని అనుసరించి యుద్ధం చేస్తారు. వారిని ముందుగా జయిస్తే కానీ దుర్యోధనుడిపై చెయ్యి వెయ్యలేం. కాబట్టి యుద్ధానికి ఇది తగిన సమయం కాదు' అన్నాడు. అంతలో వ్యాసమహర్షి అక్కడికి

వచ్చాడు. ధర్మరాజు వ్యాసుడిని సాదరంగా అర్చించాడు. అప్పుడా వ్యాసుడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! నీ మనస్సు దిగులు పడుతోంది. అది గుర్తించే నేను ఇక్కడకు వచ్చాను. నేను నీకు 'ప్రతిస్మృతి' అనే విద్యను నేర్పిస్తాను. దానిని నువ్వు అర్జునుడికి ఉపదేశించు. దాని ప్రభావంతో అర్జునుడు అధికంగా తపస్సు చేసి దేవతలను మెప్పించి, దివ్యాస్త్రాలను సంపాదిస్తాడు. ఇక మీరు ఇక్కడ ఉండడం మంచిది కాదు. ఈ అడవిని విడిచి వేరే అడవికి వెళ్ళండి' అని చెప్పాడు .

వ్యాసుని ఆజ్ఞ ప్రకారం పాండవులు కామ్యకవనానికి వెళ్ళారు. ధర్మరాజు ఒకరోజు అర్జునుడితో 'అర్జునా! భీష్ముడు, ద్రోణుడు దివ్యాస్త్ర సంపన్నులు. వారిని గెలవాలంటే మనకూ దివ్యాస్త్రాలు కావాలి. వ్యాసుడు అందుకు మార్గం చెప్పి మంత్రోపదేశం చేశాడు. నేను నీకు ఆ మంత్రం ఉపదేశిస్తాను. నువ్వు తపస్సు చేసి దివ్యాస్త్రాలు సంపాదించు. వృత్రాసురుడికి భయపడి దేవతలంతా తమతమ అస్త్రాలను ఇంద్రుడికి ఇచ్చారు. అవి నీకూ లభిస్తాయి. పరమ శివుడిని ఆరాధించు. అతడి అనుగ్రహంతో పాశుపతాస్త్రం సంపాదించు. అంతా నీకు మంచే జరుగుతుంది' అని చెప్పి అర్జునుడికి వ్యాసుడు ఉపదేశించిన 'ప్రతిస్మృతి' అనే విద్యను ఉపదేశం చేశాడు.

అన్న అనుమతితో అర్జునుడు తపస్సు చేయడానికి గంధమాదన పర్వతం చేరుకున్నాడు.

## పాశుపతాస్త్రం

అర్జునుడు ఆయుధాలు ధరించి నడుస్తున్నాడు. ఇంతలో హఠాత్తుగా 'ఆగు' అన్న గొంతు వినబడింది. ఇంద్రుడు ఒక వృద్ధుడి వేషంలో వచ్చి 'ఇది మహర్షులు తిరిగే ప్రాంతం. ఇక్కడ ఎవరూ ఆయుధాలు ధరించకూడదు' అన్నాడు.

అర్జునుడు ఎంతమాత్రమూ చలించలేదు. అతడి స్థిరమైన మనస్సుకు మెచ్చిన ఇంద్రుడు ప్రత్యక్షమై 'నేను నీకు తండ్రిని. నీకు స్వర్గభోగాలు అందిస్తాను రా!' అన్నాడు. దానికి అర్జునుడు 'దేవేంద్రా! నా సోదరులు కష్టాల్లో ఉంటే నేను దివ్యభోగాల్ని ఎలా అనుభవిస్తాను? నాకు ముందుగా దివ్యాస్త్రాల్ని పొందే మార్గం చెప్పు' అని వేడుకున్నాడు.

ఇంద్రుడు మెచ్చి దివ్యాస్త్రాలకై శంకరుణ్ణి ఆరాధించమన్నాడు.

తరువాత అర్జునుడు శివుడి గురించి ఘోర తపస్సు చేశాడు. శివుడు అర్జునుడిని పరీక్షించాలని కిరాతరూపం ధరించాడు. మూకాసురుడు ఒక పందిగా మారి అర్జునుడిపై దూకాడు. అర్జునుడు తప్పించుకొని దానిపైకి బాణం వేశాడు. శివుడూ అదే సమయంలో బాణం వేశాడు. ఇద్దరి బాణాలూ ఒకేసారి గుచ్చుకొని పంది నేలకొరిగింది.

ఈ పందిని నేను కొట్టానంటే నేను కొట్టానని ఇద్దరికీ గొడవ జరిగింది. అది యుద్ధం దాకా దారి తీసింది. అర్జునుడి బాణాలు ఆ కిరాతుణ్ణి ఏమీ చేయలేక పోయాయి. కిరాతుడి బాణాలు మాత్రం అర్జునుణ్ణి గాయపరిచాయి. అర్జునుడు వీరోచితంగా పోరాడాడు గానీ ఏమీ చేయలేకపోయాడు. గాయాలతో నేలపై పడ్డాడు. అప్పుడు శివుడు నిజరూపం ధరించాడు.

అర్జునుడు సాష్టాంగపడి, క్షమించమని ప్రార్థించి, పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించమని వేడుకొన్నాడు. శివుడు అనుగ్రహిస్తూ ఆ అస్త్రాన్ని అల్పులమీద ప్రయోగించవద్దని చెప్పి వెళ్ళిపోయాడు.

తరువాత తక్కిన ఇంద్రాదిదేవతలు కూడా వచ్చి వివిధ అస్త్రాలను అనుగ్రహించారు. ఇంద్రుడు అర్జునుణ్ణి స్వర్గానికి తీసుకువెళ్ళి, తన సింహాసనంపై కూర్చోపెట్టి కొన్నాళ్ళు అక్కడే ఉండమన్నాడు.

ఒకరోజు దేవనర్తకి ఊర్వశి అర్జునుణ్ణి చూసి మోహించింది. తన కోరిక తీర్చమంది. అర్జునుడు 'ఊర్వశీ! నువ్వు మా వంశానికి మూల పురుషుడైన పురూరవుడికి భార్యవి. నాకు తల్లితో సమానం' అని తిరస్కరించాడు.

'దేవవేశ్యలకు వావివరసలు ఉండవు' అంది ఊర్వశి.

'అమ్మా! నేను కర్మభూమిలో పుట్టిన మానవుణ్ణి. ధర్మాన్ని తప్పలేను' అన్నాడు. దానికి కోపగించిన ఊర్వశి 'నువ్వు కొన్నాళ్ళు స్త్రీల మధ్యలో నపుంసకుడివై ఉంటావు' అని శపించింది.

***

కామ్యకవనంలో ధర్మరాజు ఆందోళనగా ఉన్నాడు. అర్జునుడు ఇంకా రాలేదనే ఆ ఆందోళన. ఇంతలో బృహదశ్వ మహర్షి వాళ్ళ దగ్గరకు వచ్చాడు. ఆ మహర్షిని చూసి ధర్మరాజు 'మహర్షీ! నాలాంటి దీనుడెవరైనా లోకంలో ఉంటాడా?' అని అడిగాడు. దానికా మహర్షి 'లేకేం నాయనా! నలమహారాజు ఉన్నాడు' అంటూ నలచరిత్ర చెప్పడం ప్రారంభించాడు.

## నలచరిత్ర

నలుడు నిషధదేశానికి రాజు. వీరసేనుడి కుమారుడు.

దమయంతి విదర్భరాజు భీముడి కుమార్తె. వీళ్ళిద్దరూ ఒకరి గురించి ఒకరు విని ఇష్టపడ్డారు. ఒక హంస వీళ్ళిద్దరికీ రాయబారాన్ని కూడా నడిపింది.

ఇంతలో భీముడు స్వయంవరాన్ని ప్రకటించాడు. ఇంద్రుడు మొదలైన దిక్పాలకులూ స్వయంవరానికి బయలుదేరారు. దారిలో నలుణ్ణి కలిసి 'నలమహారాజా! నువ్వు మాకొక సహాయం చేసిపెట్టాలి' అన్నారు.

నలుడు చేస్తానని మాట ఇచ్చాడు. అప్పుడు వాళ్ళు తామెవరో చెప్పి 'దమయంతి స్వయంవరానికి వెళ్తున్నాం. నువ్వు ముందుగా వెళ్ళి మాలో ఎవరో ఒకర్ని ఆమె వరించేలా దమయంతీదేవికి చెప్పాలి' అన్నారు.

నలుడు మనసు దిటవు చేసుకొని ముందుగానే దమయంతిని కలిసి తాను వచ్చిన విషయం చెప్పాడు.

దమయంతి ఆ వచ్చిన వాడు నలుడేనని గ్రహించింది. 'తాను త్రికరణ శుద్ధిగా నలుణ్ణే పతిగా వరించా'నని తన మనసులో ఉన్న మాటను కచ్చితంగా చెప్పింది. నలుడు ఎంత నచ్చచెప్పినా ఆమె వినలేదు. చివరికి నలుడు తిరిగివచ్చి జరిగినదంతా దేవతలకు చెప్పాడు. నిస్స్వార్థంగా తన విధిని తాను నిర్వర్తించాడు.

***

స్వయంవరం మొదలయ్యింది. ఇంద్రాది దేవతలూ నలమహారాజు రూపంలో వచ్చి కూర్చున్నారు. మొత్తం ఐదుగురు నలమహారాజులు. అప్పుడు ఆమె దేవతల్ని

ప్రార్థించింది. వాళ్ళు అనుగ్రహించారు. నిజమైన నలుణ్ణి గుర్తించేలా వాళ్ళు రెప్పలు వేయకుండా, కాళ్ళు నేలకు తగలకుండా నిలబడ్డారు.

దమయంతి నలుణ్ణి వరించింది. దేవతలు వరాలు కురిపించి బయలుదేరారు.

కలిపురుషుడు కూడా దమయంతీ స్వయంవరానికి బయలుదేరాడు. అప్పటికే దమయంతి నలుణ్ణి వరించిందని తెలిసి మండిపడ్డాడు.

నలమహారాజు దమయంతితో కలిసి చక్కగా పరిపాలన చేస్తూ, పుణ్య కార్యాలు నిర్వర్తిస్తున్నాడు. అతడు ఏదైనా తప్పుచేయకపోతాడా! అని ఎదురు చూస్తున్నాడు కలిపురుషుడు.

ఒకరోజు నలుడు మూత్ర విసర్జన చేసి కాళ్ళు కడుక్కోకుండా సంధ్యావందనం ఆచరించాడు. అంతే! కలి పురుషుడు నలుడిలో ప్రవేశించాడు. ఆ ప్రభావం వల్ల నలుడు తన దాయాదియైన పుష్కర మహారాజుతో జూదం ఆడాడు. ప్రతి ఆటలోనూ ఓడిపోతున్నాడు. అది చూసిన దమయంతి –

**ఆ. 'ఎంత యోటువడిన నంతియ జూదంబు**
**నందుఁ దగులుఁ, జలము నతిశయిల్లు,**
**నేమి సేయు దాన ? నిది యెగ్గునకు మూల'**
**మని లతాంగి దుఃఖితాత్మ యగుచు. (అరణ్య: 2-63)**

**'జూదంలో ఓడినకొద్దీ ఆసక్తి, పట్టుదల అధికమౌతుంది. మాత్సర్యం ఇది పతనానికి కారణం'** అని బాధపడింది.

నలుడు సర్వస్వమూ కోల్పోయి భార్యతో కలిసి అడవుల పాలయ్యాడు. తినడానికి తిండి లేదు. కొన్నాళ్ళు నీళ్ళు తాగి బతికారు. ఆకాశంలో కొన్ని పక్షుల్ని చూసి వాటి కోసం తన శరీరంపై ఉన్న వస్త్రాన్ని విసిరాడు. ఆ పక్షులు ఆ వస్త్రాన్ని ఎగరేసుకుపోతూ 'రాజా! మేము నిజమైన పక్షులం కాదు. నీ సంపదల్ని హరించిన పాచికలం' అంటూ ఎగిరిపోయాయి.

నలుడు దిగంబరుడై పోయాడు. దమయంతి తాను కట్టుకున్న చీరను చించి సగం ముక్క అతడికి ఇచ్చింది.

దమయంతి పడుతున్న కష్టాల్ని చూసి ఆమెను పుట్టింటికి వెళ్ళిపొమ్మన్నాడు నలుడు. అప్పుడు దమయంతి 'స్వామీ!

**తే.** **'అధికదుఃఖరోగార్తున కౌషధంబు**
**సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;**
**నొనర భార్యాసమేతుడై యున్నవాని**
**కెంతలయ్యును నాపద లెఱుకపడవు. (అరణ్య: 2–73)**

**దుఃఖం అనే రోగానికి ఔషధం – భార్య. భార్యతో ఉంటే భర్తను ఏ కష్టమూ బాధించదు.**

**కం.** **అలసి నెడ, దస్సి నెడ, నాఁ**
**కలి దప్పియు నైన యెడలఁ గదుకొని ధరణీ**
**తలనాథ! పురుషునకు ని**
**మ్ముల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్ (అరణ్య: 2–74)**

**బాగా అలసిపోయినప్పుడు, ఆకలి దప్పికలతో బాధపడుతున్నప్పుడు భర్తను దుఃఖం నుండి రక్షించేది భార్యే.** కాబట్టే మీరూ నాతో రండి' అంది.

ఈ పరిస్థితుల్లో అత్తవారింటికి వెళ్ళడం ఇష్టం లేదు నలుడికి. అందుకే ఆమె నిద్రించే సమయం చూసి ఆమెను విడిచి వెళ్ళిపోయాడు.

దమయంతి నిద్ర నుండి మేల్కొని నలుడి కోసం ఆక్రోశించింది. వెదికి వెదికి వేసారి పోయింది.

**'నాథా! ఎన్ని చదివినా అవి ఒక్క సత్యంతో సాటి వస్తాయా? సత్యంతో సాటియైనది ఏదీ లేదు.** నేను మీ ప్రాణమన్నారే! విడిచి వెళ్ళనన్నారే! ఇలా విడిచి వెళ్ళిపోవడం భావ్యమా? అని విలపించింది. ఇంతలో ఒక కొండ చిలువ వచ్చి ఆమెను చుట్టేసింది. 'నాథా రక్షించు' అని దమయంతి అరిచింది. ఒక వేటగాడు వచ్చి కొండచిలువను కత్తితో చీల్చి ఆమెను రక్షించాడు. అటుపైని ఆమెను చెరబట్టాలని ప్రయత్నించాడు. ఆమె శాపానికి గురై కాలి బూడిదైపోయాడు.

అడవంతా తిరుగుతూ నలుణ్ణి వెదుకుతూ ఒక వర్తకుల గుంపుతో కలిసి ప్రయాణించి, నానా అగచాట్లు పడి, చేదిదేశం చేరుకొని – రాజమాత ఆశ్రయాన్ని పొందింది దమయంతి. ఆమెకు సైరంధ్రిగా పనిలో చేరింది.

అక్కడ నలుడు పిచ్చివాడిలా అడవిలో తిరుగుతున్నాడు. దావాగ్నిలో చిక్కుకున్న కర్కోటకుడు అనే సర్పాన్ని రక్షించాడు. పాముకు పాలుపోసినట్లు తనను రక్షించిన నలుణ్ణే కాటువేసిందా సర్పం. అందంగా ఉన్న నలుడి శరీరం వికృతంగా మారిపోయింది.

ఆ కర్కోటకుడు ఒక మహర్షి శాపవశాత్తూ అలా మారాడు. 'ఈ రూపం నీకు వరమే అవుతుంది. నిన్ను ఎవరూ గుర్తుపట్టలేరు కాబట్టి నీకు శత్రుబాధ ఉండదు. నువ్వు నీ రూపాన్ని పొందాలనుకున్నప్పుడు నన్ను తలుచుకో! అప్పుడు నీ దగ్గరికి ఒక వస్త్రం వస్తుంది. దాన్ని ధరించగానే నువ్వు నీ నిజరూపాన్ని పొందుతావు' అని చెప్పి కర్కోటకుడు వెళ్ళిపోయాడు.

అతడి సూచనమీదనే నలుడు ఇక్ష్వాకువంశానికి చెందిన ఋతుపర్ణుడు అనే రాజు దగ్గరకు వెళ్ళి 'రాజా! నాపేరు బాహుకుడు. అశ్వహృదయవిద్యలో బాగా అనుభవం ఉంది. అలాగే పాకశాస్త్రంలో కూడా ప్రావీణ్యం ఉంది. నాకేదైన పని ఇప్పించండి' అని అడిగాడు.

ఋతుపర్ణుడు నలుణ్ణి అశ్వశాలకు అధిపతిని చేశాడు.

విదర్భరాజైన భీముడు నలదమయంతులను వెదకడానికి కొందరు బ్రాహ్మణుల్ని పంపాడు. వారిలో సుదేవుడు అనే బ్రాహ్మణుడు చేది దేశంలో సైరంధ్రిగా ఉన్న దయమంతిని గుర్తుపట్టాడు. దమయంతికి కనుబొమల మధ్య ఒక పుట్టుమచ్చ ఉంది. దానితో అతడు గుర్తించాడు.

రాజమాతకు విషయం తెలిసి ఆమె కూడా దమయంతిని ఓదార్చింది. దమయంతి కొంతకాలం తరువాత విదర్భ దేశానికి వెళ్ళింది. నలమహారాజును వెదికించడానికి కొందరు తెలివైన బ్రాహ్మణుల్ని పంపుతూ 'బ్రాహ్మణోత్తములారా! మీరు వెళ్ళి ప్రతి చోటా 'ఓ రాజా! నువ్వు సత్యవ్రతుడివి కదా! భార్యను విడిచిపెట్టనని

వాగ్దానం చేసి, ఆమెను మోసగించి వెళ్ళిపోవడం న్యాయమా?' అని అనండి. ఈ మాటలకు ఎవరైతే స్పందిస్తారో అతడే నలచక్రవర్తి" అంది. అందరూ వెళ్ళారు. వారిలో 'పర్ణాదుడు' అనే బ్రాహ్మణుడు తిరిగివచ్చి దమయంతితో 'అమ్మా! మీరు చెప్పమన్నట్లుగానే చెప్తూ అనేక దేశాలు తిరిగాను. అయితే ఇక్ష్వాకు వంశరాజైన ఋతుపర్ణుడి రాజ్యంలో ఒక అశ్వశాలాధిపతి ఈ మాటలకు స్పందించాడు. నన్ను రహస్యంగా కలుసుకొని 'అయ్యా!

**ఆ. 'పురుషునందు దోషపుంజంబు గలిగిన**
**నెఱిఁగి యెద సహించునేని భార్య**
**పురుషునం దభీష్టభోగంబు, దేహాంత**
**రంబునందు ధర్మరతియుఁ బడయు.' (అరణ్య. 2-160)**

**భర్త చేసిన తప్పుల్ని సహించేదే భార్య. అలా సహనంతో ఉంటే ఎప్పటికైనా భర్తను కలుస్తుంది. సుఖాల్ని పొందుతుంది. మరో జన్మకు కూడా ధర్మబద్ధంగా ఆమె కోరుకున్నవన్నీ నెరవేరతాయి'** అని చెప్పి వెళ్ళిపోయాడు. 'అయితే అతడు చూడడానికి నలమహారాజులా లేడు. వికృతంగా ఉన్నాడు' అన్నాడు వినయంగా.

అప్పుడు దమయంతి తెలివిగా సుదేవుడు అనే బ్రాహ్మణుణ్ణి పంపి, 'దమయంతీ దేవికి రెండో స్వయంవరం. దానికి తమరికి ఆహ్వానం పలుకుతున్నారు మా భీమమహారాజుగారు' అని ఋతుపర్ణుడికి వర్తమానం పంపింది.

ఋతుపర్ణుడు బాహుకుణ్ణి పిలిచి 'మనం సాయంత్రానికల్లా విదర్భ దేశానికి చేరుకోవాలి. రథం సిద్ధం చెయ్యి' అని ఆజ్ఞాపించాడు.

నలమహారాజు అశ్వహృదయవిద్యను ప్రదర్శించి రథాన్ని చాలా వేగంగా నడిపాడు. దానికి సంబరపడిన ఋతుపర్ణుడు తనకు తెలిసిన అక్షహృదయవిద్యను నలుడికి ప్రసాదించాడు.

నలుడిలో ఆ విద్య ప్రవేశించగానే నలుణ్ణి ఆవహించిన కలిపురుషుడు అతడిలో ఉండలేకపోయాడు. బయటకు వచ్చి క్షమించమని వేడుకొని వెళ్ళిపోయాడు.

నలమహారాజు ఋతుపర్ణుడితో కలిసి విడిది ఇంట్లో దిగాడు. రాజుగారికి వండి పెడుతున్నాడు.

ఋతుపర్ణమహారాజుతో వచ్చింది నలుడేనని గుర్తించింది దమయంతి. కానీ నిర్ధారించడం కోసం తన చెలికత్తె అయిన కేశినిని పంపి, అతడు వండిన వంటకాన్ని తెప్పించుకొని రుచి చూసింది. ఇంకేముంది? అతడు నలుడే అని నిర్ధారించుకుని తన తల్లి ద్వారా బాహుకుణ్ణి అంతఃపురానికి రప్పించింది.

దమయంతిని చూసి, ఆమె పడుతున్న వేదనను చూసి నలమహారాజు జరిగినదంతా చెప్పాడు. 'సరే! నేను బ్రతికి ఉండగా నీకు మళ్ళీ స్వయంవరమా? ఇది ధర్మమేనా?' అని ప్రశ్నించాడు.

'ప్రభూ! మీరు ఎక్కడ ఉన్నారో కనిపెట్టడానికే అలా చేయవలసి వచ్చింది' అంది దమయంతి.

ఇంతలో వాయుదేవుడు ఆకాశం నుండి 'నలమహారాజా! దమయంతి పరమ పతివ్రత. ఆమెను స్వీకరించు' అని చెప్పాడు. బాహుకుడు సంతోషించి, తన పూర్వరూపాన్ని తిరిగి పొందాడు. నలదమయంతులు కలుసుకున్నారు.

ఋతుపర్ణుడు విషయమంతా తెలుసుకొని తనను క్షమించమని నలమహారాజును వేడుకున్నాడు. నలుడు ఆయన కోరినట్లు అశ్వహృదయవిద్యను ఆయనకు నేర్పించాడు. నిషధరాజ్యానికి వెళ్ళి పుష్కరుణ్ణి జూదంలో ఓడించి తన రాజ్యాన్ని తిరిగి పొందాడు. చక్కగా రాజ్యపాలన చేసి షట్చక్రవర్తులలో ఒకడిగా పేరుగాంచాడు.

'నలమహారాజు చరిత్ర పరమపావనమైనది. ఆ చరిత్రను విన్నా, పఠించినా కలిదోషాలు తొలగి పుణ్యం లభిస్తుంది' అని ధర్మరాజుకు చెప్పి వెళ్ళిపోయాడు బృహదశ్వమహర్షి.

## పుణ్య తీర్థాలు, వాటి ఫలాలు

ధర్మరాజు అర్జునుడి కోసం నిరీక్షిస్తున్న సమయంలోనే అతని వద్దకు నారద మహర్షి వచ్చాడు. ధర్మరాజు నారదునికి అతిథి మర్యాదలు చేసి 'మునీంద్రా! నాకు ఒక ధర్మ సందేహం ఉంది. తీర్చగలరా?'అని అడిగాడు.

నారదుడు నవ్వి అలాగే అడగమన్నాడు. ధర్మరాజు 'ఈ భూమిలో తీర్థాలను సేవించిన ధన్యులకు ఎలాంటి ఫలితం కలుగుతాయి?'అని అడిగాడు.

నారదుడు 'ధర్మరాజా! చెబుతాను విను' అంటూ 'పూర్వం భీష్ముడు గంగాతీరంలో వేదాధ్యయనం చేస్తూ చాలా మంచి పనులు చేస్తూ ఉండేవాడు. భీష్ముడి వద్దకు ఒకసారి పులస్త్యుడు అనే ముని వచ్చాడు. అతడికి అతిథి మర్యాదలు చేసిన భీష్ముడు పులస్త్యుణ్ణి చూసి నువ్వు నన్ను అడిగినట్లే అడిగాడు. ఆ మహర్షి భీష్ముడితో చెప్పిన విషయాలు నీకు చెప్తాను' అని చెప్పడం ప్రారంభించాడు.

**'ఇంద్రియాలను త్రికరణ శుద్ధిగా పెట్టుకున్న వాళ్ళు, దృఢమైన మనసు కలిగిన వాళ్ళు, అహంకారం లేని వాళ్ళు, ఇతరుల నుండి ఏమీ ఆశించని వాళ్ళు మిత భోజనం చేసేవాళ్ళు, ఎల్లప్పుడూ సత్యం పలికే వాళ్ళు, శాంత స్వభావం కలిగిన వాళ్ళు తీర్థయాత్రలు చేస్తే ఎన్నో యజ్ఞాలు చేసిన ఫలితం వస్తుంది. మలినమైన మనస్సుకలవాళ్ళు, పాపాత్ములు ఎన్ని తీర్థాలు సేవించినా ఫలితం శూన్యం. దానధర్మాలు చేయని వాళ్ళు, తాము చేసిన అపరాధం వల్ల దరిద్రులు ఔతారు. అలాంటి వాళ్ళు యజ్ఞాలు చేయలేరు. కాబట్టి పుణ్య తీర్థాలు చేసి పుణ్యం పొందవచ్చు. సాధారణంగా బ్రహ్మదేవుడు తీర్థాలలో విహరిస్తుంటాడు. అందులో పుష్కరతీర్థం ప్రసిద్ధమైనది. దానిలో స్నానం చేస్తే పది అశ్వమేధయాగాలు చేసిన ఫలితం వస్తుంది. ఆ పుష్కరంలో పది సంవత్సరాలు నివసిస్తే బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. జంబూ మార్గంలోని అగస్త్యవటం అనే తీర్థంలో స్నానం చేస్తే అశ్వమేధం చేసిన ఫలితం వస్తుంది. కణ్వాశ్రమం మొదలైన పుణ్యక్షేత్రాలను దర్శించిన వారికి అన్ని పాపాలు పోతాయి. ఇంకా మహాకాళం, కోటి తీర్థం, నర్మదా నదీ స్నానం, దక్షిణ నదీ స్నానం, చేస్తే ఎంతో పుణ్యం.**

వసిష్ఠాశ్రమంలో ఒకరోజు నివాసం, ప్రభాస తీర్థస్నానం, సరస్వతీనదీ సంగమ స్నానం పుణ్యఫలాన్నిస్తుంది. ద్వారావతీపురంలోని పిండారకతీర్థంలో శివుణ్ణి పూజించినా, సాగర సింధు సంగమంలో స్నాన మాచరించినా, బ్రహ్మతుంగ తీర్థం సేవించినా, శక్రకుమారీ యాత్ర చేసినా, శ్రీకుండంలో బ్రహ్మదేవుని

సందర్శించినా, బడబ తీర్థంలో అగ్ని దేవుణ్ణి సేవించినా ఎన్నో గోదానాలు భూదానాలు చేసిన ఫలితం వస్తుంది.

శివుడు నివసించే దేవికా క్షేత్రాన్ని, కామ క్షేత్రాన్ని, రుద్రతీర్థాన్ని, దీర్ఘసత్రాన్ని సేవించిన వారికి అష్ట కామ్య సిద్ధి కలుగుతుంది. శశియాన తీర్థం స్నానం సహస్ర గోదాన ఫలం కలిగిస్తుంది. రుద్రకోటిలో శివుడిని అర్చిస్తే కైలాసం లభిస్తుంది.

కురుక్షేత్రం, నైమిశ తీర్థం, పుష్కర తీర్థం అనేవి మూడూ పవిత్ర క్షేత్రాలు. కురుక్షేత్రంలో శమంతపంచకం నడుమ ఉన్న రామహ్రదం అనే సరస్సు పవిత్రమైనవి. విష్ణు స్థానంలో విష్ణు మూర్తిని పూజించినా, పారిప్లవ తీర్థం, శాలూకినీ తీర్థం, సర్పతీర్థం, వరాహతీర్థం, అశ్వినీ తీర్థం, సోమతీర్థం, కృతశౌచ తీర్థాలలో స్నాన మాచరిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది.

అగ్నివట క్షేత్రంలో, ముంజవట క్షేత్రంలో శివారాధన చేసినా, యక్షిణీ తీర్థంలో స్నానం చేసినా కామ్యసిద్ధి కలుగుతుంది.

'ధర్మజా! జమదగ్ని కుమారుడైన పరశురాముడు, తన గొడ్డలితో రాజులందరిని వధించినప్పుడు వారి రక్తం ఐదు పాయలుగా పారింది. వాటిని శమంతపంచకం అంటారు. అందులో పరశురాముడు తన తండ్రికి తర్పణం విడిచాడు. అప్పుడు పితృదేవతలు సాక్షాత్కరించి వరాలు కోరుకొమ్మని అడిగారు. పరశురాముడు తనకు రాజులను సంహరించిన పాపం నశించాలనీ తనకు పుణ్యలోక ప్రాప్తి కలగాలనీ కోరుకున్నాడు. ఈ శమంతపంచకం పవిత్రతమైనది కావాలనీ అని కోరాడు. అప్పటి నుండి శమంతపంచకం పుణ్యతీర్థంగా భాసిల్లుతోంది. వాటిలో స్నానం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలితం కలుగుతుంది. అంటూ భరతఖండంలో ఉన్న ప్రసిద్ధతీర్థాలనూ వాటిలో స్నానం చేస్తే వచ్చే ఫలాలనూ సవిస్తరంగా బోధించాడు.

కాబట్టి 'ధర్మరాజా! నువ్వూ తీర్థ యాత్రలకు వెళ్ళి రా! రోమశుడు అనే మహర్షి నీ దగ్గరకు వచ్చి నిన్ను తీర్థయాత్రలు చెయ్యమని ఆదేశిస్తాడు. నువ్వు ధౌమ్యుని అనుమతితో తీర్థయాత్రలు చేసి రా!'అని చెప్పి నారదుడు వెళ్ళిపోయాడు.

***

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. కొంత కాలానికి ఇంద్రలోకం నుండి రోమశమహర్షి వచ్చాడు. అర్జునుడు క్షేమంగా ఉన్నాడన్న సమాచారం అందించాడు. 'అర్జునుడు వచ్చేలోగా తీర్థయాత్రలు చేస్తే మంచిది' అని ధౌమ్యుడు కూడా అన్నాడు. రోమశమహర్షి తానూ వస్తాననడంతో అందరూ బయలుదేరారు.

రోమశమహర్షి ముందుగా వాళ్ళను గయాక్షేత్రానికి తీసుకువెళ్ళాడు. అక్కణ్ణుంచి అగస్త్యాశ్రమానికి తీసుకువెళ్తూ ఇలా చెప్పడం ప్రారంభించాడు.

## అగస్త్యమహర్షి

'పూర్వం ఈ అగస్త్యుడు బ్రహ్మచారిగా ఉన్నప్పుడు ఒక విచిత్రాన్ని చూశాడు. ఒక అందుగు చెట్టుపై చిటారుకొమ్మకు వెళ్ళాడుతూ కొందరు వ్యక్తులు కన్పించారు. వాళ్ళు ఎవరో కాదు. ఇతడి పితృదేవతలే! అగస్త్యుడు వివాహం చేసుకోకపోయేసరికి ఉత్తమలోకాలకు వెళ్ళలేక వాళ్ళు అలా వ్రేళ్ళాడుతున్నారు.

వాళ్ళ కోసం అగస్త్యుడు పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించి తన తపఃశక్తితో విదర్భరాజుకు ఒక కుమార్తెను అనుగ్రహించాడు. ఆమె పేరు లోపాముద్ర. ఆమె పెరిగి పెద్దదయ్యాక అగస్త్యుడు వెళ్ళి ఆమెను తనకు ఇచ్చి వివాహం చెయ్యమని అడిగాడు. విదర్భరాజు నిరాకరించాడు. 'అంతఃపురంలో అల్లారుముద్దుగా పెరిగిన అమ్మాయి, అడవుల్లో అగస్త్యుడితో కందమూల ఫలాలు తిని ఎలా బతుకుతుంది?' ఇదే అతడి ఆలోచన. కానీ లోపాముద్ర అగస్త్యుణ్ణే చేసుకుంటానంది. వివాహం జరిపించాడు రాజు.

రోజులు గడుస్తున్నాయి. భార్య కోరికపై ఆమెకు సకల భోగాలను సమకూర్చడం కోసం అందుకు కావలసిన ధనం కోసం యాచనకు బయలుదేరాడు అగస్త్యమహర్షి. నిజానికి తన తపః శక్తితో దేన్నైనా పొందగలడు. కానీ అల్పమైన వాటికోసం విలువైన తపశ్శక్తిని వెచ్చించడం అతడికి ఇష్టం లేదు. అందుకే మొదట శ్రుతపర్వుడు అనే రాజు దగ్గరకు వెళ్ళి 'నీ దగ్గర నీ అవసరాలకు మించి ఏదైనా మిగులు ధనం ఉంటే నాకు ఇవ్వు' అని అడిగాడు. అయితే ఆ రాజు 'నా ఆదాయ వ్యయాలు సమానంగానే ఉన్నాయి' అన్నాడు. ఆ తరువాత బ్రధ్నశ్వుడు, త్రసదస్యుడు

అనే మరో ఇద్దరు రాజుల్ని అలాగే అడిగాడు. వాళ్ళదీ అదే పరిస్థితి. అయితే త్రసదస్యుడి సూచనపై 'ఇల్వలుడు' అనే వాడి దగ్గరకు ఈ ముగ్గురు రాజులతో కలిసి వెళ్ళాడు.

ఇల్వలుడు, వాతాపి ఇద్దరూ అన్నదమ్ములు. ఇల్వలుడు వాతాపిని మేకలా మార్చి, దానిని చంపి అతిథులకు వడ్డిస్తాడు. వాళ్ళు తిన్నాక లోపల ఉన్న వాతాపిని పిలుస్తాడు. వాడు వాళ్ళ పొట్ట చీల్చుకొని బయటికి వచ్చాక, ఇద్దరూ కలిసి వాళ్ళని తినేస్తారు. ఇదీ అతడి పన్నాగం. దానిని ముగ్గురు రాజులూ గ్రహించారు. అగస్త్యుడికి అతిథి మర్యాదలు చేసి ఇల్వలుడు వాతాపిని వండి వడ్డించాడు. రాజులు అగస్త్యుణ్ణి తినవద్దన్నారు. కానీ అగస్త్యుడు సుష్టుగా భోంచేశాడు. ఇల్వలుడు 'వాతాపీ! బయటకురా!' అన్నాడు. అగస్త్యుడు 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అన్నాడు తన పొట్టను నిమురుకుంటూ. అంతే! వాతాపి జీర్ణమైపోయాడు.

అప్పుడు అగస్త్యుడు 'ఇల్వలా! నాకు 20 వేల ఆవులు, 20 వేల బంగారు కడ్డీలు, ఒక బంగారు రథం, అలాగే ఈ ముగ్గురు రాజులకు ఒక్కొక్కరికీ 10 వేల ఆవులు, 10 వేల బంగారు కడ్డీలు కావాలి' అని ఆదేశించాడు. ఇల్వలుడు వాటన్నింటినీ ఇచ్చాడు.

అగస్త్యుడు తన ఆశ్రమానికి వచ్చి భార్య కోరినవన్నీ ఇచ్చి, ఆమెతో సుఖంగా కాలం గడిపాడు. వీరికి ఒక కుమారుడు కలిగాడు. అతడి పేరు దృఢాస్యుడు. ఇతడి కొడుకు ఇధ్మవాహనుడు. అలా అగస్త్యవంశం విస్తరిల్లింది. అతడి పితృదేవతలకు ఉత్తమగతులు లభించాయి.

పూర్వం కాలకేయులు అనే రాక్షసులు సముద్రంలో నివసించేవాళ్ళు. వాళ్ళని చంపాలంటే సముద్రాన్ని శుష్కింపచేయాలి. అందుకు దేవతల అభ్యర్థనపై అగస్త్యుడు సముద్రాన్ని ఒక్క చుక్క కూడా మిగలకుండా పూర్తిగా త్రాగివేశాడు. అప్పుడు దేవతలు కాలకేయుల్ని వధించారు. తరువాత భగీరథుడు ఆకాశగంగను భూమిపైకి రప్పించడంతో ఆ నీటితో తిరిగి సముద్రం నిండిపోయింది.

## సగరపుత్రులు

పూర్వం ఇక్ష్వాకు వంశంలో సగరుడు అనే మహారాజు సంతానం కోసం తపస్సు చేసి పరమేశ్వరుణ్ణి మెప్పించాడు. శివుడు ప్రత్యక్షమై 'రాజా! నీ పెద్ద భార్య వైదర్భికి 60 వేల మంది, చిన్న భార్య శైబ్యకు ఒకే ఒక్క పుత్రుడు జన్మిస్తారు' అని అంతర్ధానుడయ్యాడు.

కొంతకాలానికి సగరుడి భార్యలిద్దరూ గర్భాల్ని ధరించారు. శైబ్యకు ఒక పుత్రుడు జన్మించాడు. అతడి పేరు అసమంజసుడు.

వైదర్భి కడుపున ఒక పెద్ద సొరకాయ పుట్టింది. అప్పుడు ఆకాశవాణి 'ఆ సొరకాయలోని గింజల్ని తీసి ఒక నేతికుండలో వేసి సంరక్షించు' అని చెప్పింది. వాటి నుండి 60 వేల మంది పుత్రులు జన్మించారు. వీరే సగరపుత్రులు.

సగరుడు అశ్వమేధయాగం చేసి యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. దానికి రక్షణగా సగరపుత్రుల్ని పంపాడు. ఆ అశ్వం అలా వెళ్తూ అదృశ్యమైపోయింది. దానిని వెదుకుతూ సగరపుత్రులు బయలుదేరారు. నీళ్ళు లేని సముద్ర ప్రాంతాన్ని తవ్వి పాతాళానికి చేరుకున్నారు. అక్కడ కపిలమహర్షి ఆశ్రమంలో ఆ అశ్వాన్ని చూశారు. అశ్వాన్ని అపహరించినది కపిలమహర్షే అనుకొని ఆయనను నిందించారు.

కపిలమహర్షి కోపంగా చూశాడు. అంతే! వీళ్ళందరూ బూడిద కుప్పలై పోయారు.

నారదుడి ద్వారా ఈ విషయం విన్న సగరుడు అసమంజసుడి పుత్రుడైన అంశుమంతుణ్ణి పంపాడు. అంశుమంతుడు వెళ్ళి కపిలమహర్షికి నమస్కరించి, అతడి అనుగ్రహంతో అశ్వాన్ని తీసుకువచ్చాడు. యాగం పూర్తయ్యింది.

## భగీరథుడు

కాలం గడుస్తోంది. సగరుడి తరువాత అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు వరుసగా రాజులయ్యారు. భగీరథుడు తన పూర్వులకు మోక్షం కలిగించాలని పట్టుదల పట్టాడు. ఆకాశగంగను భూమి మీదికి రప్పించాలని తీవ్రమైన తపస్సు చేశాడు.

గంగ ప్రత్యక్షమై 'భగీరథా! నేను నీ కోరికపై భూమి మీదికి వస్తాను. నా వేగాన్ని భూమి తట్టుకోలేదు. ఆ శక్తి ఒక్క పరమశివుడికే ఉంది. కాబట్టి ముందు ఆయనను ప్రసన్నం చేసుకో' అంది.

భగీరథుడు తపస్సు చేసి గంగను తన జటాజూటంలో ధరించడానికి శివుణ్ణి ఒప్పించాడు. ఆ రకంగా గంగ భువికి దిగింది. పాతాళంలో ఉన్న సగరపుత్రుల భస్మరాశులపైకి ప్రవహించింది. వాళ్ళకు ఉత్తమగతుల్ని ప్రసాదించింది'.

ఇలా రోమశుడు చెప్తూ ధర్మరాజాదులచేత పుణ్యతీర్థాలన్నింటిలో పుణ్య స్నానాలు చేయిస్తున్నాడు. వారంతా ఋషభకూట తీర్థాన్ని సేవించి, విశ్వామిత్ర మహర్షి ఆశ్రమాన్ని సందర్శించి, కౌశికీనదిని దాటి ఋష్యశృంగ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు.

## ఋష్యశృంగుడు

'ధర్మజా! ఈ ఋష్యశృంగుడు విభాండకుడి పుత్రుడు. కశ్యపుడు, మరీచి ఇతడి తాతముత్తాతలు. ఋష్యశృంగుడు తండ్రి చాటు బిడ్డ. తండ్రే లోకం. తండ్రితో పాటే తపస్సు చేసుకొంటూ అడవుల్లో నివసించేవాడు.

ఆ సమయంలోనే రోమపాదుడనే రాజు అంగదేశాన్ని పాలిస్తున్నాడు. అతడి రాజ్యంలో తీవ్రమైన కరవు సంభవించింది. అహంకారంతో రాజు తన పురోహితుణ్ణి అవమానించాడు. దాన్ని సహించని పురోహితుడూ, తక్కిన విప్రులూ ఆ రాజ్యాన్ని విడిచి వెళ్ళిపోయారు. దానివల్ల యజ్ఞాలు జరగడం లేదు. అందుకే తీవ్ర అనావృష్టి.

ప్రజలు నానా అగచాట్లు పడుతుంటే రోమపాదుడు చలించిపోయాడు. పక్క దేశంలోని విప్రుల్ని పిలిచాడు. ఏదైనా మార్గం చూపమన్నాడు. అప్పుడు వాళ్ళంతా 'పరమ పవిత్రుడైన ఋష్యశృంగ మహర్షిని నీ రాజ్యానికి రప్పించు. వర్షాలు కురుస్తాయి' అని చెప్పారు.

రోమపాదుడు గొప్ప జాణలైన వేశ్యల్ని పంపి, ఉపాయంగా ఋష్యశృంగుణ్ణి తన రాజ్యానికి రప్పించాడు. అతడు రావడంతోనే చక్కగా వర్షాలు కురిశాయి. భూమి పులకించింది.

రోమపాదుడు తన కుమార్తె శాంతను అతడికి ఇచ్చి పెళ్ళి చేశాడు.

విభాండకుడు ఈ విషయం తెలుసుకొని ఆనందించాడు. కొంతకాలం తర్వాత కొడుకునూ కోడలినీ ఆశ్రమానికి తీసుకువచ్చాడు అని చెప్తూ రోమశమహర్షి అనేక ప్రాంతాలను చూపిస్తున్నాడు.

ధర్మరాజు మొదలైనవాళ్ళు రోమశ మహర్షి ద్వారా ఆయా ప్రాంతాల విశేషాల్ని తెలుసుకుంటున్నారు. అలా గంగానది సముద్రంలో కలిసే ప్రాంతాన్నీ, కళింగదేశంలోని వైతరిణీ నదినీ, మహేంద్రగిరినీ, దక్షిణ దేశంలో ప్రసిద్ధి చెందిన గోదావరీనదినీ, అగస్త్యతీర్థాన్నీ, శూర్పారకతీర్థంలో ఉన్న పరశురామవేదినీ, ప్రభాసతీర్థాన్ని, పయోష్ణితీర్థాన్నీ, నర్మదానదినీ, వైదూర్య పర్వతాన్ని సందర్శించారు.

## చ్యవనమహర్షి

'శర్యాతి అనే మహారాజు ఇక్కడే యజ్ఞం చేశాడు. ఆ రాజుకుమార్తె వృద్ధుడైన చ్యవనుణ్ణి పెళ్ళాడింది. అయితే అశ్వినీ దేవతలు అనే దైవవైద్యుల అనుగ్రహం వల్ల చ్యవనుడు నవయౌవనుడు అయ్యాడు. తనకు యౌవనాన్ని ప్రసాదించిన ఆ ఆశ్వినులకు దేవతలు త్రాగే సోమరసాన్ని తాగే యోగ్యత కలిగేలా చేశాడు చ్యవనమహర్షి. దానికి అంగీకరించని దేవేంద్రుడు వజ్రాయుధంతో ఆయనపై విజృంభించాడు. ఆ ఆయుధంతో సహా అతణ్ణి స్తంభింపజేసి, అశ్వినీదేవతలకు దివ్యత్వాన్ని కలిగించిన మహానుభావుడు ఈ చ్యవనమహర్షి' అన్నాడు రోమశమహర్షి.

తరువాత అందరూ యమునాతీరానికి చేరుకున్నారు. 'ఇక్కడే మాంధాతృ చక్రవర్తి అనేక యజ్ఞాలు చేశాడు' అంటూ అతడి చరిత్రను చెప్పాడు. తర్వాత సరస్వతీనదీ తీరానికి చేరుకున్నారు. అక్కడ సోమకుడి వృత్తాంతాన్ని చెప్పాడు రోమశమహర్షి. తరువాత భృగుతుంగ పర్వతాన్ని చూపిస్తూ అక్కడ శిబిచక్రవర్తి కథను ఇలా చెప్తున్నాడు.

## శిబిచక్రవర్తి

ఉశీనరదేశానికి రాజు శిబిచక్రవర్తి. శిబి గొప్ప యాగం చేస్తుంటే అతణ్ణి పరీక్షించాలని ఇంద్రుడూ, అగ్నిదేవుడూ గ్రద్దగా, పావురంగా మారి అతడి చెంతకు వచ్చారు.

గ్రద్ద తరుముతోంది. పావురం ప్రాణభయంతో శిబిచక్రవర్తిని ఆశ్రయించింది. శిబి అభయమిచ్చాడు. అప్పుడు గ్రద్ద 'రాజా! ఇది నా ఆహారం. దీనికి ఆశ్రయం కల్పించి, నా నోటి దగ్గరి కూడును లాక్కున్నావు. ఇది నీకు ధర్మమేనా?

**కం. ధర్మజ్ఞులైన పురుషులు**
**ధర్మువునకు బాధసేయు ధర్మువునైనన్**
**ధర్మముగా మదిఁ దలఁపరు**
**ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్ (అరణ్య: 3-230)**

**రాజా! ధర్మం తెలిసిన వాళ్ళు ఆ ధర్మానికి కీడు కలిగించే ధర్మాన్ని ధర్మంగా భావించరు. ఎందుకో తెలుసా? ఏ ధర్మమైనా అందరికీ మేలు చేసేలా ఉండాలి. ఇతరులకి హాని కలిగించేది ధర్మం కాదు.** ఈ పావురం లేకపోతే నేను బతకను. నేను లేకపోతే నాపై ఆధారపడి ఉన్న నా కుటుంబమూ బతకదు' అంది.

దానికి శిబి చక్రవర్తి 'నేను ఈ పక్షికి ఆశ్రయమిచ్చాను. కాబట్టి రక్షించి తీరతాను. నువ్వు కావాలంటే మరేదైనా పక్షిని ఆహారంగా తిను' అన్నాడు.

దానికా గద్ద 'సరే! నువ్వు దీన్ని కాపాడాలనుకొంటే ఆ పావురం ఎత్తు మాంసాన్ని నీ శరీరం నుంచి కోసి ఇవ్వు' అని అడిగింది.

శిబి చక్రవర్తి సరేనన్నాడు. తన శరీరాన్ని కోసికొన్ని కండల్ని త్రాసులో పెట్టాడు. ఆశ్చర్యం! ఎంత మాంసం వేసినా పావురంతో సమానంగా తూగడం లేదు. చివరికి తానే త్రాసులో కూర్చున్నాడు.

ఆ దృశ్యాన్ని చూసి ఇంద్రాగ్నులు ప్రత్యక్షమై అతడి దానగుణాన్ని వేనోళ్ళా కొనియాడారు' అంటూ రోమశమహర్షి పాండవుల్ని శ్వేతకేతుమహర్షి ఆశ్రమానికి తీసుకువెళ్ళి అక్కడ అష్టావక్రుడి వృత్తాంతాన్ని చెప్పటం ప్రారంభించాడు.

## అష్టావక్రుడు

'పూర్వం ఏకపాదుడు అనే మహర్షి తన శిష్యులతో ఎడతెరిపి లేకుండా వేదాధ్యయనం చేయిస్తూ ఉండేవాడు. అతడి భార్య సుజాత – గర్భవతి. ఆమె గర్భంలోని శిశువు తండ్రితో 'మీరు ఇలా నిరంతరం వాళ్ళను గుక్కతిప్పు కోనివ్వకుండా చదివిస్తే వాళ్ళకు నిద్ర కరువై చదివినది కూడా మర్చిపోతున్నారు. అపస్వరాలు పలుకుతున్నారు. తగిన విశ్రాంతి ఇవ్వకపోవడం తప్పు కాదా?' అంది.

ఆ మాటలకు ఏకపాదుడికి కోపం వచ్చింది. 'నాకే నీతులు చెప్తావా? నువ్వు ఎనిమిది వంకరలతో పుడతావు' అని శపించాడు. అలా పుట్టిన వాడే అష్టావక్రుడు.

ప్రసవానికి ముందు ఏకపాదుడు ధనం కోసం జనకమహారాజు యాగవాటికకు వెళ్ళాడు. అక్కడ శాస్త్ర చర్చలు జరుగుతున్నాయి. 'వంది' అనే పండితుడు ఆ చర్చల్లో పండితులందరినీ ఓడించి ఓడినవాళ్ళనందరినీ సముద్రంలో ముంచేస్తున్నాడు. ఏకపాదుడు కూడా అలాగే మునిగిపోయాడు.

కొంతకాలానికి అష్టావక్రుడు పుట్టాడు. అదే సమయంలో సుజాత తల్లికి కూడా ఒక పుత్రుడు కలిగాడు. అతడి పేరు శ్వేతకేతువు. సుజాత తండ్రి ఉద్దాలకుడు. ఏకపాదుడు లేకపోవడంతో సుజాత పుట్టింటికి వెళ్ళిపోయింది.

అష్టావక్రుడు తన తాత అయిన ఉద్దాలకుణ్ణే తండ్రిగా భావించేవాడు. ఒకసారి తాతగారి ఒళ్ళో ఉన్న అష్టావక్రుణ్ణి శ్వేతకేతువు క్రిందికి లాగి 'ఈయన నీ తండ్రి కాదు' అని ఈసడించాడు.

అష్టావక్రుడు తల్లి దగ్గరకు వెళ్ళి తన తండ్రి గురించి అడిగాడు. ఆమె జరిగినదంతా చెప్పింది. అష్టావక్రుడికి కోపం వచ్చింది. వెంటనే శ్వేతకేతుణ్ణి వెంటపెట్టుకొని జనక మహారాజు యాగవాటికకు వెళ్ళాడు. అప్పుడు వీళ్ళు పిల్లలని చెప్పి ద్వారపాలకులు లోపలికి వెళ్ళనివ్వలేదు. అప్పుడు వీళ్ళిద్దరూ –

కం. అలయక యేండ్లు గడుం బె
క్కులు జీవించుట నర గలుగుటయుం దగు వృ
ద్ధుల లక్షణమే? జ్ఞానము
గలఁడేనిన్ బాలుఁడయినఁ గడువృద్ధు మహిన్ (అరణ్య: 3-248)

**'ద్వారపాలకులారా! ఏ అలసటా లేకుండా ఏండ్లూ పూండ్లూ జీవించడం, వెంట్రుకలు నెరిసిపోవడం ఇవేనా వృద్ధుల లక్షణాలు? జ్ఞానం ఉన్నవాడు బాలుడైనా వృద్ధుడే. ఎల్లప్పుడూ అధ్యయనం చేసేవాడు, ఆచారపరుడైనవాడు బాలుడైనా అందరికీ ఇష్టమైనవాడే అవుతాడు.** మమ్మల్ని లోపలికి వెళ్ళనివ్వండి' అన్నారు.

అలా లోపలికి వెళ్ళి వందిని ఓడించి తన తండ్రినీ, తక్కిన పండితుల్నీ విడిపించాడు అష్టావక్రుడు. తరువాత పెరిగి పెద్దవాడై వదాన్యుడు అనే మహర్షి కుమార్తెను వివాహం చేసుకున్నాడు' అన్నాడు రోమశమహర్షి.

తరువాత భరద్వాజ ఆశ్రమం చేరుకున్నారు. అక్కడ యవక్రీతుడి చరిత్రను ప్రారంభించాడు మహర్షి.

## యవక్రీతుడు

రైభ్యుడు, భరద్వాజుడు అనే ఇద్దరు మహర్షులు ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళు. రైభ్యుడికి ఇద్దరు కొడుకులు– అర్థావసుడు, పరావసుడు. వాళ్ళు మంచి పండితులు. భరద్వాజుడి కుమారుడు యవక్రీతుడు. రైభ్యుడి కొడుకులు పండితులు కావడం వల్ల వాళ్ళకు పండిత సభల్లో మంచి గౌరవం లభించేది. యవక్రీతుడు తానూ అంతటి విద్యను పొందాలని తపస్సు ప్రారంభించాడు. గురువు లేకుండానే అన్ని విద్యలూ పొందాలన్నది అతడి ప్రయత్నం. ఇంద్రుడు ప్రసన్నుడయ్యాడు. 'నాయనా! ఏ విద్యనైనా గురువు ద్వారా నేర్చుకోవడమే మంచిది. అలా కాని విద్యలు అహంకారాన్నీ, అసూయనీ కలిగిస్తాయి' అన్నాడు. అయినా యవక్రీతుడు ఒప్పుకోలేదు. సరే! అని అతడు కోరినట్లే సకలవిద్యల్నీ అతడికి అనుగ్రహించాడు ఇంద్రుడు.

ఒకరోజు యవక్రీతుడు రైభ్యుడి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ పరావసుడి భార్యను చూసి కామించాడు. ఆ విషయం రైభ్యుడికి తెలిసింది. కోపంతో తన జటను పీకి అగ్నిహోత్రంలో వేశాడు. అందులోంచి ఒక అందమైన స్త్రీ, ఒక రాక్షసుడు పుట్టుకొచ్చారు. ఆ స్త్రీ వెళ్ళి యవక్రీతుణ్ణి వశపరుచుకొని అతడి కమండలాన్ని లాక్కొంది. దానితో అతడి తపశ్శక్తి పోయింది. ఆ రాక్షసుడు వెదికి మరీ యవక్రీతుణ్ణి సంహరించాడు. భరద్వాజుడు పుత్రశోకంతో కొడుకు చితిలోనే దూకి మరణించాడు.

అర్థావసుడూ, పరావసుడూ – బృహద్ద్యుమ్నుడు అనే రాజు చేస్తున్న సత్రయాగానికి ఋత్విక్కులుగా ఉన్నారు. పరావసుడు చీకట్లో తన తండ్రిని ఏదో క్రూరమృగ మనుకొని వధించాడు. జరిగిన పొరపాటును తన సోదరుడు అర్థావసువుతో చెప్పి 'అన్నా! నా బ్రహ్మహత్యాపాతకం పోగొట్టే వ్రతం నువ్వు చెయ్యి. నేను ఒక్కడినే అది చేయలేను. నువ్వు చెయ్యగలవు. నేను ఈ యాగాన్ని చూసుకుంటాను' అని అడిగాడు.

అర్థావసుడు అంగీకరించి, ఆ వ్రతాలు పూర్తి చేసి తిరిగి యాగశాలకు వచ్చాడు. అప్పుడు పరావశువు రాజుగారితో 'రాజా! ఇతడు శుభకార్యాలు చెయ్యకుండా బ్రహ్మహత్యా పాతకాన్ని నివారించే వ్రతాలు చేస్తున్నాడు. యాగశాలలోనికి రానివ్వకు' అన్నాడు.

అర్థావసువు అసలు నిజం చెప్పాడు. దానికి దేవతలు సంతోషించి అర్థావసుడిని ఏదైనా వరం కోరుకోమన్నారు. అప్పుడు అర్థావసుడు తన తండ్రి రైభ్యుణ్ణీ, భరద్వాజుణ్ణీ, యవక్రీతుణ్ణీ బతికించమని వేడుకొన్నాడు. అలా బతికిన యవక్రీతుడు దేవతల ద్వారా 'గురువు లేని విద్య రాణించదు' అని ఉపదేశాన్ని పొందాడు' అన్నాడు.

ఈ కథలన్నీ వింటూ ధర్మజాదులు కాలశైలం, సప్తగంగ, మందరపర్వతం, కైలాసపర్వతం మొదలైన ఎన్నో ప్రాంతాలను సందర్శించారు. వాళ్ళు వెళ్ళే దారి నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంది.

భీముడు ఘటోత్కచుణ్ణి తలుచుకున్నాడు. ఘటోత్కచుడు అతడి పరివారమూ వీళ్ళందరినీ తమ వీపులపై మోస్తూ ఆయా పుణ్యతీర్థాల్ని చూపించి, తిరిగి బదరికాశ్రమానికి చేర్చారు.

## హనుమంతుడు

ఒకసారి గంధమాదన పర్వత ప్రాంతంలో ద్రౌపది – భీముడు విహరిస్తుంటే వెయ్యి రేకుల తామరపువ్వు ఒకటి ఎగిరి వచ్చిపడింది. అది చూసిన ద్రౌపది ఇంకా అలాంటి పువ్వులు కావాలని కోరింది.

భీముడు బయలుదేరాడు. దారిలో హనుమంతుడు తారస పడ్డాడు. హనుమంతుడు భీముణ్ణి పరీక్షించాలనుకొన్నాడు. భీముడు వచ్చే దారికి అడ్డంగా తోక పెట్టుకొని వృద్ధవానరం రూపంలో పడుకున్నాడు.

భీముడు సింహనాదం చేశాడు. హనుమంతుడు మేల్కొని 'నాకు నిద్రాభంగం చేశావేమయ్యా! మానవుడివేగా... దయా ధర్మం తెలియవూ...' అన్నాడు.

భీముడు తన వివరాలు చెప్పి 'అడ్డంగా ఉన్న నీ తోకను తియ్యి' అన్నాడు.

అందుకు హనుమంతుడు 'నేను దానిని కదిలించే స్థితిలో లేను. నువ్వే కాస్త పుణ్యం కట్టుకో' అన్నాడు.

భీముడు సరే! అని ఎత్తబోయాడు ఆ తోకని. కదిలితేనా? ఊహు... ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

'మహానుభావా! తమరెవరో సెలవియ్యండి' అన్నాడు చేతులు జోడించి.

'సోదరా! భీమసేనా! నేను హనుమంతుణ్ణి' అన్నాడు.

భీముడు 'అన్నా' అంటూ పాదాలకు నమస్కరించాడు.

భీముడికో కోరిక ఉంది. హనుమంతుడు సముద్రాన్ని లంఘించిన నాటి రూపాన్ని చూడాలని. హనుమంతుడు ఆ రూపంతో భీమునికి కనిపించి, అతని కోరిక తీర్చాడు. ఆపైన భీముడితో –

**ఆ.వె. కార్యసిద్ధి పొంది కాలంబు దేశంబు**
**నెఱిఁగి బుద్ధిమంతు లెల్ల ప్రొద్దు**
**సాహసంబు విడిచి సామాద్యుపాయ ప్ర**
**యుక్తి చేయుదురు యథోచితముగ (అరణ్య: 3-348)**

**'చేసే పనిలో విజయం సాధించాలంటే అందుకు తగిన సమయాన్ని, ప్రదేశాన్ని తెలుసుకోవాలి. తొందర పడకూడదు. సామదానాది ఉపాయాల్ని యథోచితంగా ప్రయోగించాలి'** అని హితబోధ చేసి, 'రాబోయే సంగ్రామంలో నన్ను తలుచుకో. మీపై వాత్సల్యంతో నేను మహావీరుడైన అర్జునుడి జెండాపై ఉండి, యుద్ధంలో మీ బలపరాక్రమాలు చూస్తాను. విజయోஉస్తు' అని సౌగంధిక సరోవరానికి దారి చూపాడు.

భీముడు ఆ సరోవరాన్ని చేరుకొని కాపలాగా ఉన్న యక్షులను జయించి సౌగంధిక పుష్పాల్ని తీసుకువచ్చి ద్రౌపదికి ఇచ్చాడు. తరువాత ఘటోత్కచుడు వీళ్ళ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

**జటాసురుడు**

అతడు వెళ్ళాక జటాసురుడు అనే రాక్షసుడు బ్రాహ్మణవేషంలో వచ్చి తాను పరశురాముడి శిష్యుణ్ణనీ, వారికి సేవ చేసుకుందామని వచ్చాననీ చెప్పి వారితోనే కలిసి ఉండసాగాడు.

కాలం గడుస్తోంది. ఒకసారి భీముడు లేని సమయం చూసుకొని తక్కిన పాండవుల్నీ, ద్రౌపదినీ ఎత్తుకొని వెళ్ళిపోయాడు జటాసురుడు. సహదేవుడు గట్టిగా అరిచి భీముణ్ణి పిలవడంతో మెరుపు వేగంతో వచ్చాడు భీముడు. అంతే వేగంగా ఒకే ఒక్క దెబ్బతో జటాసురుణ్ణి హతమార్చాడు.

ఆ తరువాత మాల్యవంత పర్వత ప్రాంతంలో విహరిస్తున్న ద్రౌపదికి అయిదురంగుల దివ్యపుష్పం ఒకటి కన్పించింది. దానిని చూసి ముచ్చటపడింది ద్రౌపది. భీముడు ఆ పుష్పాల కోసం కుబేరుడి సైన్యంతో పోరాడాడు. భీముడి పరాక్రమానికి మెచ్చిన కుబేరుడు వాళ్ళనందరినీ ఆర్ష్టిషేణుడి ఆశ్రమంలో పదిహేను రోజులు ఉండమన్నాడు. పదిహేనోరోజుకు అర్జునుడు వస్తాడని చెప్పాడు.

అన్నట్లుగానే దివ్యాస్త్రాలను సాధించిన అర్జునుడు ఇంద్రరథంపై అక్కడికి వచ్చాడు. అర్జునుణ్ణి చూసిన అతడి సోదరులు ఆనందంతో ఉప్పొంగి పోయారు. అర్జునుడు విశేషాలన్నీ పూసగుచ్చినట్లు వారికి వివరించాడు.

రోమశమహర్షి ధర్మరాజుకు అనేక ధర్మాల్ని బోధించి తిరిగి స్వర్గానికి వెళ్ళిపోయాడు. పాండవులు ఆ గంధమాదనపర్వతంపై కొన్నాళ్ళు ఉండి ఆ తరువాత కామ్యకవనం చేరుకున్నారు.

పాండవులు తీర్థయాత్రలు ముగించుకొని వచ్చారని తెలిసి శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి కామ్యకవనానికి వచ్చాడు. అదే సమయంలో మార్కండేయ మహర్షి అక్కడికి వచ్చి పాండవులకు ఎన్నో ధర్మాలు చెప్తున్నాడు.

## ద్రౌపదీ సత్యభామల సంవాదం

ధర్మరాజు మార్కండేయ మహర్షి వద్ద అనేక విషయాలు తెలుసుకుంటున్న సమయంలో ద్రౌపదీ సత్యభామలు ఇష్టాగోష్ఠి సలుపుతున్నారు. సత్యభామ ద్రౌపదిని 'ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలు. వారిపట్ల నువ్వు భక్తితో ఉన్నావు. వాళ్ళూ నీపట్ల అనురాగంతో ఉన్నారు. ఇదెలా సాధ్యం! నీ వద్ద ఏదైనా మంత్రంగానీ ఔషధం గానీ ఉందా? ఈ మహిమ నీకు ఎలా కలిగింది? నీ అలంకరణ సామర్థ్యమా? లేక సంభాషణా చాతుర్యమా? నాకు తెలుసుకోవాలని ఉంది. ఆ కిటుకు ఏదో చెబితే నేనూ నా భర్త అయిన శ్రీకృష్ణుణ్ణి వశం చేసుకుంటాను'అని అడిగింది ఆశగా.

ఆ మాటలకు ద్రౌపదికి కించిత్ కోపం వచ్చింది. ఆమె సత్యభామతో 'సత్యా! నువ్వు నన్ను దుష్టస్త్రీగా భావిస్తున్నావా? ఆ పురుషోత్తముడికి నువ్వు భార్యగా తగినదానివి కాదని నా భావన. మంత్ర తంత్రాలతో భర్తను వశం చేసుకోవాలి అనుకోవడం నీ భ్రమ. అలాంటి పనులు చేస్తే భర్తకు భార్య మీద ఉన్న ప్రేమ పోతుంది. అలాంటి భార్యతో చెలిమి పాముతో చెలగాటం అని భర్త భావిస్తాడు. అలాంటి మందులకు భర్తకు రోగం, భార్యకు అపకీర్తి వస్తుంది.

భర్తల పట్ల భార్యలు ఇలాంటి కపటబుద్ధితో ఉండడం తప్పు. వారిని మోసగించకూడదు. అలా మోసగిస్తే నరకం తప్పదు. **భర్తకు అనుకూలవతిగా ఉండడమే భార్యకు ఉత్తమ ధర్మం.** నేను పాండవుల పట్ల ఎలా ఉంటానో నీకు చెప్తా విను.

నా భర్తలు పరస్త్రీలతో మెలగినప్పటికీ నేను అసూయపడను. అంతే కాదు, వారి పట్ల అహంకరించను. పూజ్యభావంతోనే ఉంటాను. **నా భర్తలు తప్ప మిగిలిన వాళ్ళు దేవతలైనా, యక్ష, గంధర్వ, కింనర, కింపురుషులైనా నాకు తృణప్రాయం. స్నానం, భోజనం, శయనం ఏదైనా భర్తలు చేశాకే తరువాతే నేను ఆచరిస్తాను. భర్తల మనసెరిగి వారికి కావలసినవి సమకూరుస్తాను. భర్తవైపు ఉండే బంధు మిత్రుల పట్ల ఆదరం చూపిస్తాను. గృహనిర్వహణలో పరిశుభ్రత పాటిస్తాను. ఏదీ వ్యర్థం చేయను. అనవసరమైన ఖర్చులు చేయను. భర్తలు ఇంటిలో లేనప్పుడు పువ్వులు ధరించను. అలంకారం చేసుకోను. భర్తలపై మనసును నిలిపి వారి కోసం నిరీక్షిస్తుంటాను. ఎక్కువ సేపు వాకిట్లో నిలబడటం, అతిగా నవ్వడం, దుష్టులతో స్నేహం చెయ్యడం లాంటివి చేయను.**

నా భర్తలు ఎంతటి సున్నిత మనస్కులో అంతటి కోపాన్ని ప్రదర్శిస్తారు. వారి పట్ల భయభక్తులతో ప్రవర్తిస్తాను.

మా అత్త కుంతీదేవికి స్నానపానాదులు నేనే సమకూరుస్తాను. నా భర్త ధర్మరాజు ప్రతి రోజు పదివేల బ్రాహ్మణులకు, పదివేల యతీశ్వరులకు అన్న సంతర్పణ చేస్తాడు. ఆ ఏర్పాట్లు నేనే స్వయంగా దగ్గరుండి చేసి వారికి ఆనందం సమకూరుస్తాను.

అంతఃపురంలో పనిచేసే వేలకొలది సేవకుల బాగోగులు నేనే స్వయంగా చూస్తాను. వాళ్ళు వారి విధులను క్రమశిక్షణలో నిర్వర్తించేలా చూస్తాను.

భాండాగారంలో ఉన్న రత్నాలు, మణులు, ఆభరణాలు, ధనం మొదలైన వాటి లెక్కలన్నీ నాకు తెలుసు. పని వారికి ఇవ్వవలసిన జీతభత్యాలు నేనే ఇస్తాను. అందువల్ల పాండవులు సంసార భారం నా మీద మోపి నిశ్చింతగా ఉంటారు.

నాకు రాత్రి ఒక జాము మాత్రమే నిద్రపోవడానికి సమయం ఉంటుంది. భోజనం చేయటానికి సరిగా సమయం ఉండదంటే నమ్ము. ఇలా ప్రవర్తిస్తూ నేను నా భర్తల ఆదరణను పొందుతున్నాను కానీ మందులు ఔషధాలు ఉపయోగించి కాదు. ఇంద్రజాలం అసలే కాదు తెలిసిందా!అంది కొంచెం చిరాగ్గా. ఆ మాటలు విన్న సత్యభామ సిగ్గుపడి – 'ద్రౌపదీ! నాకు నీ సంగతి తెలియక ఏదో పరిహాసంగా అలా అన్నాను. ఏమీ అనుకోకు. నన్ను మన్నించు' అంది. ద్రౌపది 'సత్యా! దానిదేముంది? అలాగే పరిహాసంగానే తీసుకుంటాను. భర్త మనసు చూరగొనే ఉపాయం చెప్తాను విను.

**పతిని మించిన దైవం భార్యకు లేదు. భర్త దయ వల్ల భార్యకు కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. సమస్త సంపదలు సమకూరుతాయి. భర్తకు సేవలు చేస్తే భార్యకు సులువుగా పుణ్యం లభిస్తుంది. కాబట్టి భర్తకు ప్రతి రోజు ప్రేమతో ఆరాధనతో సేవలు చెయ్యి. నీకు భర్త అనురాగం లభిస్తుంది.**

**భర్త రాగానే చిరునవ్వుతో ఎదురేగి స్వాగతం పలుకు. భర్త పనులు స్వయంగా నువ్వే చెయ్యి. నీ భర్త మాటల సందర్భంలో చెప్పిన రహస్యం బట్టబయలు చేసి సపత్నుల ముందు అవమానపడకు. అందువల్ల భర్తకు నీపై అనురాగం సన్నగిల్లుతుంది.**

**నీ భర్తకు అపకారం చేసే వాళ్ళు నీకు మిత్రులైనా వారిని ఆదరించకు. భర్త బంధుమిత్రులను ఆదరించు. నీ పుత్ర సమానులైన ప్రద్యుమ్నాదులతో కూడా ఒక శయ్యపై కూర్చోవద్దు. కులస్త్రీలతో మాత్రమే స్నేహసంబంధాలు పెట్టుకో. విలాసజీవితంపై ఆసక్తి కలవారూ అహంభావులూ అయిన స్త్రీలతో స్నేహం వద్దు. ఇలా ప్రవర్తిస్తే నీకు పరమ సౌభాగ్యం కలుగుతుంది'** అంది. సత్యభామ ద్రౌపదితో 'నీ భర్తలు దైవసమానులు. నువ్వు ధర్మం తెలిసిన దానివి. నీ కుమారులు పరాక్రమవంతులు, నువ్వు వీరమాతవు. వారిని ద్వారకలో రుక్మిణీ సుభద్రలు తమ కుమారుల కంటే ప్రేమగా చూసుకుంటున్నారు. కలత చెంద వద్దు. వాళ్ళు

ద్వారకలో క్షేమంగా ఉన్నారు. త్వరలోనే మీకు మీ రాజ్యం లభిస్తుంది. దుర్యోధనాదులు కష్టాలు అనుభవించగలరు' అంది. శ్రీకృష్ణుడు ధర్మరాజు మార్కండేయ మహర్షి వద్ద సెలవు తీసుకుని ద్వారకకు పయనమైయ్యాడు.

***

హస్తినాపురవాసి అయిన ఒక బ్రాహ్మణుడు ద్వైతవనానికి వెళ్ళి పాండవులను కలుసుకుని తిరిగి హస్తినకు వచ్చాడు. ధృతరాష్ట్రుడు ఆ బ్రాహ్మణుడిని పాండవుల యోగక్షేమాలు గురించి విచారించాడు.

అప్పుడా ఆ బ్రాహ్మణుడు –

'వా రయిదుగురూ ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా అగచాట్లు పడుతున్నారు. దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు. వీరులైన నాథులు కలిగికూడా అనాథలా పాంచాలి దుఃఖిస్తోంది.' అన్నాడు దీనంగా.

దానికి ధృతరాష్ట్రుడు విషణ్ణహృదయుడై కన్నీరు కారుస్తూ కొంతసేపు ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు. తరువాత నిట్టూర్పు నిగిడ్చి గద్గదకంఠంతో ఇలా అన్నాడు.

'అయ్యో! నా కుమారుడి చెడ్డప్రవర్తనే కథను ఇంతదాకా తీసుకువచ్చింది. దీనికంతటికీ కారణం నా చేతకానితనమే! ధర్మరాజు నా పెద్ద కొడుకు. అతడికి ఆ బ్రహ్మదేవుడు ఎన్ని కష్టాలు రాశాడో కదా! హంసతూలికాతల్పంపై నిద్రించే ధర్మరాజు ఇప్పుడు కటిక నేలపై పడుకున్నాడు. పవనకుమారుడూ అతిబలవంతుడూ అయిన భీముడు అడవిసింహంలా వనాలలో తిరుగుతున్నాడు. అన్నదమ్ములూ ద్రౌపదీ పడుతున్న కష్టాలు చూసి అర్జునుడు మనసులో రగిలి పోతున్నాడు. సుకుమారులైన నకులసహదేవులు అడవులలో ఎన్ని కష్టాలు పడుతున్నారో! వాయు పుత్రుడైన ఆ భీముడు అతిబలవంతుడు. అన్నగారి మాటకోసం అరణ్యవాసం చేస్తున్నాడు కానీ అతడిని ఆపడం ఎవరి తరం?

శకుని మోసం, దుశ్శాసనుడి దుష్టచేష్టలు, కర్ణుడి తులువతనం, దుర్యోధనుడిదుర్మార్గం ధర్మరాజు మనసులో ముల్లులా గుచ్చుకుంటూ ఉండవూ!

భీముడి చేతిలో నా కుమారులకు చావు రాసిపెట్టి ఉందేమో! విచారించి ఏం లాభం? నేను జూదం ఆపలేక పోయాను.

**తే. రాత్రి తెగుదల దిన మేల రాకయుండు?**
**దినము తెగుదల రాత్రి యేతేర కున్నె?**
**పరcగ సుఖదుఃఖములు గాల పర్యయమున**
**నెందు మనుజులcబొందక యేల యుడుగు? (అరణ్య: 5-340)**

**రాత్రి పూర్తయిన తరువాత పగలు రాకుండా ఎలా ఉంటుంది? పగలు పూర్తి అయిన తరువాత రాత్రి రాకుండా ఉంటుందా? వరుసగా సుఖ దుఃఖాలు కాలక్రమంలో ఎక్కడైనా మనుషులను పొందకుండా ఉంటాయా?**

**ఉ. మేలున సంతసిల్లు నెడ మేకొని యాపద లొందు, నాపదల్**
**దూలcగ భూరిసౌఖ్యములు దోcచుc గృతంబులు తప్ప వెమ్మెయిం**
**బోలcగ నింతయుం గని ప్రబుద్ధమనస్కులు ఖేదమోదని**
**ర్గాళితధైర్యసాగరులు గాక సుఖింతురు సర్వకాలమున్ (అరణ్య: 5-341)**

**చక్కగా ఆనందంగా ఉన్నప్పుడు ఆపదలు వస్తాయి. ఆపదల్లో ఉన్నప్పుడు గొప్ప సౌఖ్యాలు వస్తాయి. ఎలా చూసినా కర్మఫలం అనుభవించక తప్పదు. ధీమంతులు సుఖదుఃఖాలకు అతీతంగా అన్నికాలాలలోనూ సుఖంగా ఉంటారు.**

కాబట్టి కష్టాల వెంటే సుఖాలు వస్తాయి. అర్జునుడు పరమశివుణ్ణి మెప్పించి పాశుపతాన్ని సాధించాడు. సశరీరంగా స్వర్గానికి పోవడమే కాక ఇంద్రుడి అర్ధ సింహాసనం అధిష్ఠించాడు. అర్జునుడు ఏ జన్మలో చేసిన పుణ్యమో ఇది' అని పరిపరివిధాలుగా విలపించాడు.

దుర్యోధనుడు అది చూసి 'మామా! మా తండ్రి చూడు ఎంత భయపడుతున్నాడో. దీనిని గురించి ఆలోచించాలి' అన్నాడు.

వారిరువురూ కర్ణుడితో చేరి ఏకాంతప్రదేశంలో మంతనాలు జరిపారు.

కర్ణుడు 'సుయోధనా! పాండవుల సంపదలన్నీ నీ వశమయ్యాయి. వారు అడవుల పాలయ్యారు. రాజులంతా నీకే కప్పం చెల్లిస్తున్నారు. సార్వభౌముడివైన

నీ పాలన ప్రజామోదాన్ని పొందింది. నువ్వు ద్వైతవనానికి వెళ్ళి అక్కడ కష్టాలు పడుతున్న పాండవులకు నీ భోగభాగ్యాలు ప్రదర్శించి వారికి దుఃఖాన్ని కలిగించాలి. అలాగే వారు పడుతున్న కష్టాలు చూసి ఆనందించాలి. ఆ ద్రౌపది కూడా నీ భార్యల సౌభాగ్యం చూసి కుళ్ళి కుళ్ళి ఏడవాలి'. 'సుయోధనా! ద్వైతవనంలో ఉన్న మన ఆలమందను చూసే నెపం పెట్టిమీ తండ్రిగారి అనుమతి తీసుకుందాం' అన్నాడు. దుర్యోధనుడు సరే నన్నాడు. వెంటనే వాళ్ళు ఒక పథకంతో ఒక గొల్లవాడిని ధృతరాష్ట్రుడిదగ్గర ప్రవేశపెట్టారు. అతడు వినయంగా – 'మహారాజా! నేను ద్వైతవనం నుండి వస్తున్నా. అక్కడ మన ఆవులకు క్రూరమృగాల బెడద ఎక్కువయ్యిందంటే నమ్మండి. మీరు వెంటనే ఏదో ఒకటి చెయ్యకపోతే మన ఆవులు మనకి దక్కవు' అన్నాడు రాజుగారితో.

శకుని, కర్ణుడు ఆ గోపాలుడి మాటలకు వంత పాడారు. సుయోధనుణ్ణి గోసంరక్షణార్థం ద్వైతవనానికి పంపమని చెప్పారు.

ధృతరాష్ట్రుడు 'గోసంరక్షణ మంచిదే కానీ అక్కడే పాండవులు కూడా ఉన్నారు కదా! మీరు అక్కడికి వెళ్ళి ఊరుకుంటారా! పాండవులను అవమానిస్తారు. వారు ఇప్పటికే మీ చేతుల్లో అవమానాలు పడీ పడీ ఉన్నారాయె! మిమ్మల్ని వదిలిపెడతారా! అనవసరమైన గొడవలు.అసలే భీముడు మంచి కాకమీద ఉన్నాడు. అతణ్ణి రెచ్చగొట్టడం మంచిది కాదు. అర్జునుడూ అమోఘమైన అస్త్రాలు సాధించాడు. అతణ్ణి ఇప్పుడు ఎదిరించడం క్షేమం కాదు. మీరు వారికి హానితలపెట్టడం అవివేకం. గోసంరక్షణకు సమర్థులైన వారి పంపుదాం. మీరు వెళ్ళవద్దు' అన్నాడు.

ఆ మాటలకు శకుని 'మహారాజా! పాండవులు అమిత శౌర్య పరాక్రమాలు కలవాళ్ళు. వారికి మేము హాని ఎలా తలపెడతాం? మేము అలా చేసినా ధర్మాత్ముడైన ధర్మరాజు ఆడిన మాట తప్పడు. అతడి తమ్ముళ్ళు అతడి మాట జవదాటరు. మాకు కూడా వేటాడాలని ఉంది.కాబట్టి మాకు అనుజ్ఞ ఇవ్వండి. మేము ఆవులను మాత్రమే రక్షిస్తాం. పాండవుల జోలికి వెళ్ళం' అని నచ్చచెప్పాడు.

మొత్తానికి ధృతరాష్ట్రుడు అంగీకరించాడు. వెంటనే దుర్యోధనుడు ఘోషయాత్రను ప్రకటించాడు.

***

మార్కండేయ మహర్షి ధర్మరాజుకు అనేక వృత్తాంతాలను ధర్మాచరణకు ఉదాహరణలుగా చెబుతున్నాడు. అందులో ముఖ్యంగా ఇంద్రద్యుమ్నవృత్తాంతం ప్రారంభించాడు.

## ఇంద్రద్యుమ్నుడి వృత్తాంతం

ధర్మరాజు 'మహర్షీ! బ్రాహ్మణ ప్రభావం గురించి వివరించండి" అని అడిగాడు. మార్కండేయుడు – 'ధర్మరాజా విను. పూర్వం పరీక్షిత్తు అనే మహారాజు అయోధ్యను పాలిస్తుండేవాడు. ఆ రాజు అడవిలో వేటాడుతూ ఒక సుందరిని చూసి మోహించి – 'ఓ సుందరీ! నీ వెవరు? ఈ అడవిలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?' అని అడిగాడు. అందుకా యువతి 'నేను అవివాహితని. తగిన వరుడి కోసం వెతుకుతున్నాను' అంది. అందుకు ఆ రాజు 'నన్ను వివాహమాడతావా' అని అడిగాడు. ఆమె అంగీకరించింది. కానీ తనను జలవిహారానికి ఎప్పుడూ తీసుకు వెళ్ళకూడదని షరతు విధించింది. అందుకు అంగీకరించి ఆమెను వివాహమాడి రాజధానికి తీసుకు వెళ్ళాడు పరీక్షిత్తు.

ఒకరోజు వాళ్ళిద్దరూ ఉద్యానవనంలో విహరిస్తున్నారు. ఆ సమయంలో రాజు కొలనులో స్నానం చేస్తూ ఆమెను కూడా పిలిచాడు. ఆమె అలాగే కొలనులో దిగింది. కానీ వెంటనే అదృశ్యం అయింది.

రాజు భటులను పిలిచి ఆ కొలనులోని నీటిని బయటకు పోయించాడు. కొలను అడుగున అసంఖ్యాకంగా కప్పలు ఉన్నాయి. ఆ కప్పలే తన భార్యను మాయం చేసి ఉంటాయని భావించాడు. వెంటనే లోకంలోని కప్పలన్నిటినీ నాశనం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

సేవకులు రాజు చెప్పినట్లే కప్పలను వెతికిమరీ చంపడం మొదలు పెట్టారు. కప్పల నాయకుడు ఒక మహర్షి రూపంలో రాజు వద్దకు వచ్చి – 'రాజా! కప్పలను నిష్కారణంగా చంపడం అమానుషం. దయచేసి ఈ దారుణాన్ని ఆపు' అని అర్థించాడు. అందుకు రాజు 'అవి నా ప్రేయసిని మింగేసాయి. అందుకే చంపుతున్నాను' అన్నాడు.

కప్పల నాయకుడు 'మహారాజా! నేను కప్పల దొరను. ఆమె నా కూతురు. ఆమె నీ లాగే చాలా మందిని మోసం చేసింది' అన్నాడు.

పరీక్షిత్తు 'ఐతే ఆమెను తెచ్చి నాకు అప్పగించు' అన్నాడు రాజు .

ఆ కప్పలదొర తన కూతురును అక్కడికి పిలిపించి ఆమెతో 'ఎంతో మంది రాజులను ఇలాగే మోసగించావు. కాబట్టి నీకు పుట్టే బిడ్డలు దుర్మార్గులు, మోసగాళ్ళు ఔతారు'అని శపించాడు.

తరువాత వారికి శలుడు, నలుడు, వలుడు అనే ముగ్గురు కుమారులు జన్మించారు. తరువాత ఆ రాజు శలుడికి రాజ్యం అప్పగించి తపోవనాలకు వెళ్ళాడు. ఒకరోజు శలుడు వేటకు వెళ్ళాడు. ఒక మృగం అతడి బాణం దెబ్బ తిని పారిపోయింది. రాజు సారథితో ఆ మృగాన్ని వెంటాడమని చెప్పాడు. సారథి – 'రాజా ఆ మృగం చాలా వేగంగా పరుగెత్తింది. మనం ఎంత వేగంతో రథం నడిపినా దానిని చేరలేం. మన గుఱ్ఱాలు వామ్యజాతికి చెందినవి అయితేనే ఆ మృగాన్ని పట్టగలవు. అలాంటి గుఱ్ఱాలు వామదేవుడు అనే మహర్షి దగ్గర ఉన్నాయి' అని అన్నాడు.

వెంటనే ఆ రాజు వామదేవుని వద్దకు వెళ్ళి 'మునీంద్రా! నేను ఒక మృగాన్ని కొట్టాను. అది దెబ్బతిని పారిపోయింది. ఆ మృగాన్ని పట్టుకోడానికి నీ అశ్వాలను ఇవ్వు' అని అడిగాడు.

వామదేవుడు 'రాజా! ఆ గుఱ్ఱాలను తీసుకు వెళ్ళి నీపని కాగానే నాకు తిరిగి ఇవ్వాలి' అన్నాడు. అలాగే అని చెప్పి శలుడు ఆ అశ్వాలను తీసుకు వెళ్ళి మృగాన్ని పట్టుకుని రాజధానికి వెళ్ళిపోయాడు.

ఇంత వేగం కలిగిన గుఱ్ఱాలు రాజుల వద్ద ఉండాలి కానీ ఆ మునికి వీటితో పని ఏమిటి? అనుకుని వాటిని తన వద్దనే ఉంచుకున్నాడు.

ఎన్ని రోజులైనా రాజు తన గుఱ్ఱాలను తిరిగి ఇవ్వక పోవడంతో వామదేవుడు తన శిష్యుడు ఆత్రేయుడిని ఆ గుఱ్ఱాలను తీసుకు రమ్మని రాజు వద్దకు పంపాడు.

ఆత్రేయుడు రాజు వద్దకు వెళ్ళి 'రాజా! మీరు నా గురువుగారైన వామదేవుని దగ్గర ఉన్న అశ్వాలను తీసుకుని తిరిగి ఇవ్వలేదు. వాటిని ఇస్తే నేను వాటిని తీసుకు వెళతాను' అన్నాడు. అందుకు శలుడు కోపించి 'ఆయన పంపడం నువ్వు రావడం! చాలాబాగుందిలే! వెళ్ళు'అన్నాడు.

ఆత్రేయుడు ఆ విషయం తన గురువుకు చెప్పాడు.

వామదేవుడు ఆగ్రహించి రాజు వద్దకు వచ్చాడు. 'రాజా! నీకు ఇది తగదు. నువ్వు అప్పుగా తీసుకున్న గుర్రాలను తిరిగి ఇవ్వు. నీ పని పూర్తయ్యింది కదా! అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వక లోభంతో అలాగే ఉంచుకోవడం పాపం కదా! అలాంటి పాపం చేసిన వాళ్ళు నరకానికి పోతారు' అన్నాడు. శలుడు 'అయ్యా! విప్రులకు గుర్రాలు ఎందుకు? కావాలంటే రెండు ఎద్దులను ఇస్తాను తీసుకుపో! అవి నచ్చక పోతే కంచరగాడిదలను ఇస్తాను కానీ గుర్రాలను మాత్రం ఇవ్వను. ఊరికే ఆశలు పెట్టుకోవద్దు' అన్నాడు. వామదేవుడూ 'రాజా! ఇది అధర్మం. విప్రుల సొమ్ము తీసుకుని ఇవ్వననడం, పాపం కాదా!' అన్నాడు. శలుడికి కోపం వచ్చింది. 'ఈ బ్రాహ్మణుని పట్టి బంధించి శూలాలతో పొడిచి చంపండి' అనిభటులకు ఆజ్ఞాపించాడు.

వామదేవుడికీ కోపం వచ్చింది. అతని ముఖం నుండి ఎందరో రాక్షసులు పుట్టుకు వచ్చారు. రాజునూ, భటులనూ చంపారు.

శలుడు చనిపోయిన తరువాత నలుడు రాజయ్యాడు. వామదేవుడు నలుడి దగ్గరకు వచ్చి 'రాజా! మీరు ధర్మపరులు. నాగుర్రాలను నాకు ఇప్పించండి' అని అడిగాడు. నలుడికి కూడా కోపం వచ్చింది 'ఈ బ్రాహ్మణుడిని చంపటానికి విషం పూసిన బాణం తెప్పించండి' అని భటులను ఆజ్ఞాపించాడు. అందుకు వామదేవుడు నవ్వి 'రాజా! అంతఃపురంలో ఉన్న నీ కుమారుని అది చంపగలదు జాగ్రత్త' అని హెచ్చరించాడు. అంతలో అంతఃపురం నుండి హాహాకారాలు చేస్తూ చనిపోయిన రాజకుమారుణ్ణి తీసుకువచ్చారు. అది చూసి నలుడు కోపంతో ఒళ్ళు మరచి 'అహంకారంతో మాట్లాడుతున్న ఈ బ్రాహ్మణుణ్ణి నేనే సంహరిస్తాను' అని విల్లు

ఎక్కు పెట్టాడు. కానీ అతని రెండు చేతులూ, విల్లూ, బాణం స్తంభించి పోయాయి. రాజుకు గర్వం దిగి పోయింది.

ప్రజలను చూసి 'నా గర్వం అణిగి పోయింది. బ్రాహ్మణశక్తి ముందు నా శక్తి పనికిరాదని తెలుసుకున్నాను. వామదేవుడికి నమస్కరిస్తున్నాను' అన్నాడు.

వామదేవుడు ప్రసన్నుడై రాజకుమారుణ్ణి బ్రతికించి, నలుణ్ణి పూర్వస్థితికి తీసుకువచ్చాడు. నలుడు గుర్రాలను వామదేవుడికి తిరిగి ఇచ్చాడు. 'ధర్మరాజా! బ్రాహ్మణుల మహిమ అలాంటిది' అని మార్కండేయుడు చెప్పాడు. ధర్మరాజు మార్కండేయుడితో 'అయ్యా! మీరు చిరంజీవులు కదా! మీ కంటే వయసులో పెద్ద వాళ్ళున్నారా?' అని అడిగాడు. మార్కండేయుడు 'ధర్మజా! పూర్వం ఇంద్రద్యుమ్నుడు అనే రాజు ఉండేవాడు. అతడు చేసిన పుణ్యం కారణంగా చాలా కాలం స్వర్గ సుఖాలు అనుభవించాడు. పుణ్యం క్షీణించడం వల్ల అతడిని తిరిగి భూలోకానికి వెళ్ళమన్నారు. అతడు నా దగ్గరకు వచ్చి 'మహర్షీ! నేనెవరో మీకు తెలుసా?' అని అడిగాడు.

అందుకు నేను 'అయ్యా! మీరెవరో నాకు తెలియదు. హిమాలయాలలో నాకన్నా వయసులో పెద్ద వాడు ఉన్నాడు. అతని పేరు ప్రవారకర్ణుడు అనే గుడ్లగూబ. దానిని అడుగు' అని చెప్పాను. ఇంద్రద్యుమ్నుడు నన్ను కూడా తనతో రమ్మన్నాడు. నేను వృద్ధాప్యం వల్ల రాలేనని చెప్పాను. అతను గుర్రం రూపం ధరించి నన్ను తీసుకు వెళ్ళాడు.

ఆ గుడ్లగూబను కూడా నన్ను ప్రశ్నించినట్లే ప్రశ్నించాడు. ఆ గుడ్లగూబ కూడా "అయ్యా! నేను నిన్ను ఎరుగను. కానీ ఇంద్రద్యుమ్నం అనే కొలనులో నాడీజంఘుడు అనే కొంగ ఉన్నది. దానికి తెలిసి ఉంటుంది" అంది. ఇంద్రద్యుమ్నుడు నన్నూ గుడ్లగూబనూ తీసుకుని నాడీజంఘుడి వద్దకు తీసుకు వెళ్ళి నన్ను అడిగినట్లే అడిగాడు. అందుకు నాడీజంఘుడు 'అయ్యా! నేను కూడా ఎరుగను. నా కంటే పెద్దవాడైన అకూపారుడు అనే తాబేలుకు తెలిసి ఉండచ్చు. దానిని అడగచ్చు' అంది.

ఇంద్రద్యుమ్నుడు నన్నూ, గుడ్లగూబనూ, కొంగనూ, తీసుకొని ఆ తాబేలు వద్దకు వచ్చాడు. తాబేలును కూడా నన్ను అడిగినట్లే అడిగాడు. ఆ తాబేలు 'అయ్యా! నేను ఎరుగక పోవడం ఏమిటి? ఆయన మహాత్ముడు. గుణవంతుడు. ఆయన నన్ను ఎన్నో ఆపదల నుండి కాపాడాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. బ్రాహ్మణులకు ఆవులను దానాలు చేశాడు. ఆయన దానాలు చేసిన ఆవుల గిట్టల రాపిడితోనే ఈ మడుగు ఏర్పడింది' అని చెప్పింది.

తాబేలు చెప్పిన మాటలకు దేవతలు స్వర్గం నుండి విమానం తీసుకు వచ్చి మీరు పుణ్యాత్ములు. మీకు శాశ్వతస్వర్గలోక ప్రాప్తి' అని చెప్పారు. ఇంద్రద్యుమ్నుడు 'నా మాట ప్రకారం వీరంతా నా వెంట వచ్చారు. వీరిని వారి వారి స్వస్థలాలలో వదిలి వస్తాను'అని చెప్పి అందరినీ వారి వారి స్థలాలలో దింపి వచ్చి స్వర్గానికి వెళ్ళాడు.

**కం. తన కీర్తి యెంతకాలము**
**వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ**
**కను పుణ్యలోకసౌఖ్యం**
**బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా! (అరణ్య: 4-369)**

**'నరుడు తన కీర్తి లోకంలో ఎంతకాలం ప్రచారంలో ఉంటుందో అంతకాలం అతడు పుణ్యలోకాలలో సుఖాల్ని అనుభవిస్తాడు'** అంటూ అందుకు నిదర్శనంగా ఈ విధంగా ఇంద్రద్యుమ్నుడి చరిత్రనూ, ఆ తరువాత కువలయాశ్వుడి వృత్తాంతాన్నీ చెప్పి, 'ధర్మరాజా!

**కం. జననియు జనకుఁడు నెవ్వని**
**యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ ద**
**త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు**
**ననూనముగఁ బడయుఁ బొందు నక్షయగతులన్ (అరణ్య: 5-6)**

**కన్న తల్లిదండ్రులను తన నడవడిక ద్వారా ఆనందింపజేసే కొడుకే ధర్మాన్నీ, కీర్తినీ సమృద్ధిగా సాధిస్తాడు. శాశ్వతంగా పుణ్యలోకాల్ని పొందుతాడు. సామాన్య వ్యక్తి కూడా ధర్మాన్ని ఆచరిస్తే ఉత్తమలోకాల్ని పొందుతాడు.** అందుకు కౌశికుడే చక్కని ఉదాహరణ.

## కౌశికుడు

కౌశికుడు ఒక బ్రాహ్మణుడు. చెట్టు కింద కూర్చొని తపస్సు చేస్తుంటే పై నుంచి ఒక కొంగ రెట్ట వేసింది. కౌశికుడు దానిని కోపంగా చూశాడు. వెంటనే అది మరణించింది. 'అయ్యో! తన కోపం వల్ల ఒక పక్షి బలైపోయిందే' అని చాలా బాధపడ్డాడు.

తరువాత భిక్షాటనకు వెళ్ళి ఒక ఇంటిముందు నిలబడి 'భిక్షాం దేహి' అన్నాడు. ఆ ఇంటిలోని బ్రాహ్మణగృహిణి భిక్ష తీసుకురావడానికి ఆలస్యం చేసింది. కారణం – అప్పుడే ఆమె భర్త వచ్చాడు. అతడికి సపర్యలు చేస్తూ ఉండిపోవలసి వచ్చింది. కొంత సేపటి తర్వాత భిక్ష వేసింది. కౌశికుడికి మళ్ళీ కోపం వచ్చింది. ఆమెను నిందించాడు.

దానికా గృహిణి – 'అయ్యా! నువ్వు అతిథిదేవుడివే! కాదనను. కానీ **నా భర్త నాకు దైవం. అతణ్ణి సేవించడం కంటే వేరే గొప్ప ధర్మం ఏదీ లేదు.** నీకు కోపం ఎక్కువ. నీ కోపానికి ఒక కొంగ బలైపోయిందనీ తెలుసు. ఎలా తెలుసునను కొంటున్నావా? అది నా పాతివ్రత్య మహిమ. నువ్వు ఉత్తముడైన బ్రాహ్మణుడివి.

**తే.గీ. క్రోధమోహనామకులైన ఘోర శత్రు**
**లిరువు రెరియించుచుండుదు రెపుడు నంత**
**రంగ మయ్యుభయంబు నడంగకున్నఁ**
**గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు? (అరణ్య: 5–23)**

**ప్రతి ఒక్కరికీ ఇద్దరు శత్రువులు ఉంటారు. వాళ్ళు క్రోధం, మోహం. వీళ్ళు నిత్యం హృదయాన్ని వేపుకు తింటారు. వాటిని అణుచుకోకపోతే బ్రాహ్మణుడికి దక్కవలసిన గౌరవం దక్కదు.**

**అసలు బ్రాహ్మణుడంటే తెలుసా? ఎప్పుడూ సత్యాన్నే పలికేవాడు, ఎవ్వరినీ ఎప్పుడూ బాధపెట్టనివాడు, తల్లిదండ్రుల గురువుల మేలు కోరేవాడు, అందరినీ ఆదరించేవాడు, కోరికలు లేనివాడు, షట్కర్మల్ని ఆచరించేవాడూనూ.** నీకు ధర్మ సూక్ష్మాలు సరిగ్గా తెలిసినట్లు లేదు' అంటూ ధర్మవ్యాధుడి వద్దకు పంపింది.

## ధర్మవ్యాధుడు

మిథిలానగరంలో ఉన్న ధర్మవ్యాధుడు మాంసం అమ్ముతూ కన్పించాడు. ధర్మవ్యాధుడు కౌశికుణ్ణి చూసి 'అయ్యా! మీరు ఎందుకు వచ్చారో తెలుసు. నాకు ఈ శక్తి ఎలా వచ్చిందో తెలుసా? నా తల్లిదండ్రుల్ని నిత్యం సేవించడం వల్ల వచ్చింది. నేను జంతువుల్ని వధించను. మాంసం కొని కొంచెం లాభానికి అమ్ముతాను. ఇది నా కులవృత్తి' అంటూ కౌశికుణ్ణి తన ఇంటికి తీసుకువెళ్ళాడు. ధర్మలక్షణాలను వివరంగా చెప్పాడు.

**సీ. సత్యహితాలాప చతురత యర్థంబు**
**సంతత సుజన పూజనము వలయు,**
**విను కామసంరంభ విద్వేషములఁ జేసి**
**మతి గలంగినను ధర్మంబు దప్పఁ**
**ద్రొక్కక నడచు టత్యుత్తమ సరణి, య**
**ప్రియములయందును బ్రియములందు**
**దైన్య హర్షంబులఁ దగులక యున్నట్టి**
**కల్యాణవర్తనకాంక్ష లెస్స**

**తే. ఎగ్గు చేసినవారికి హితము సేఁత**
**యార్యజనములు కీర్తింతు; రన్యదోష**
**కారి తనపాపమునఁ దాన కాలిపోవు**
**వేఱ వానికిఁ గీడు గావింప నేల? (ఆరణ్య: 5-39)**

**మానవుడికి సత్యమూ, హితమూ అయిన మాటల నేర్పు ఉండాలి. ఎల్లవేళలా మంచి వారిని మన్నిస్తూ ఉండాలి. కోరికల విజృంభణంవల్ల ఏర్పడే పగలచేత మనస్సు కలతపడినా ధర్మాన్ని తప్పకుండా మెలగటం చాలా గొప్పపద్ధతి. అప్రియం కలిగినప్పుడు క్రుంగిపోవటం, ప్రియం చేకూరినపుడు పొంగిపోవటం లేని శుభప్రదమైన జీవనవిధానం మేలైనది. కీడు చేసినవారికి కూడా మేలు చేయటాన్ని సజ్జనులు**

కొనియాడతారు. ఇతరులకు కీడు చేసేవాడు తన పాపంతో తానే కాలిపోతాడు. వేరుగా వానికి కీడు చేయటం ఎందుకు?

సీ. దానంబు, సత్యంబు, దపము, యజ్ఞము, నార్జ
వముఁ, గామలోభాదివర్జనంబు
గురుజనశుశ్రూష, క్రోధరాహిత్యంబు
దమము, సంతోష, మధ్యయననిరతి,
దాంభికత్వము లేమి, దైన్యంబు వొరయమి
యనసూయ, యనహంక్రియాభియుక్తి,
దలపంగ నాద్యమై తనరు ధర్మమ యెప్డు
గొనియాట, నాస్తికగోష్ఠిజనమి,

తే. శీలసంరక్ష, తీర్థసంసేవ, శౌచ,
మఖిలభూతంబులందు దయార్ద్రుండగుట,
మితహితోక్తులు, సంశ్రితమిత్రగుప్తి
యిన్నియును శిష్టచరితంబు లిద్ధచరిత (ఆరణ్య: 5-44)

ప్రకాశించే నడవడి గల ఓ కౌశికా! దానం, సత్యం, తపస్సు, యజ్ఞం, కపటం లేకుండటం, కామాన్ని లోభాన్ని వదలి వేయటం, గురువులైన వారికి సేవచేయటం, క్రోధాన్ని విడనాడటం, ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకొనటం, సంతోషంతో ఉండటం, వేదశాస్త్రాలను నిరంతరమూ పఠించటం, ఇతరుల మెప్పు కోసం ప్రాకులాడకుండా మెలగటం, అసూయ, అహంకారం లేకుండా ఉండటం, అనాదిగా కొనసాగుతున్న ధర్మాన్ని ఎల్లవేళలా ఆచరిస్తూ ఉండటం, పుణ్యతీర్థాలను చక్కగా సేవించటం, లోపలా వెలుపలా శుద్ధంగా ఉండటం, అన్ని ప్రాణుల యందు దయ కలిగి ఉండటం, మితంగా హితోక్తులు పలకడం, ఆశ్రయించిన మిత్రులను కాపాడటం - ఇవన్నీ శిష్టుల ఆచారాలు అని చెప్పాడు.

కౌశికుడు ఎన్నో ధర్మ సందేహాలను అతడి ద్వారా నివృత్తి చేసుకున్నాడు. ఆ తరువాత జీవలక్షణాన్ని చెబుతూ -

చం. స్థిరమగు పుణ్యకర్మమున దేవభవంబగుఁ; బుణ్యపాపసం
కరమున మానుషత్వమగుఁ, గల్మషముల్ పశుకీట భావముం
బొరయగఁ జేయు; నిప్పగిదిఁ బుట్టుచుఁ జచ్చుచు మోహవార్ధిలోఁ
దిరుగుచునుండుఁ గాని యొకతీరము సేరఁడు జీవుఁ డెన్నడున్
(ఆరణ్య: 5-75)

పుణ్యకార్యం వల్ల దేవలోకంలో పుట్టుక కలుగుతుంది. పుణ్యపాపాల కలగాపులగంచేత మనుష్య జన్మ ఏర్పడుతుంది. ఇంకా పాపాలు చేస్తే పశువుల్లాగా, పురుగుల్లాగా పుడతారు. జీవుడు ఈవిధంగా పుడుతూ మరణిస్తూ అజ్ఞానమనే సముద్రంలో తిరుగుతూ ఉంటాడు కానీ ఎన్నటికీ ఒక ఒడ్డుకు చేరుకోడు. (కర్మఫలాపేక్ష లేకపోతే ఈ అనర్థం ఉండదు).

చం. ఇది సకలంబు గాంచి బుధుఁ డెన్నఁడుఁ బాపము పొంతఁ బోక ని
ర్మద నిరహంక్రియాత్ముఁడును మత్సరదూరుఁడు నై చరించుఁ బెం
పొదవఁగ ధర్మమార్గమున నొయ్యన ధర్మము తీపెఱింగి తా
వదలఁడు సత్క్రియావిధము; వారక యెక్కుడొనర్చు ధర్మముల్
(ఆరణ్య: 5-76)

ఈ స్థితిని మొత్తంగా పరిశీలించి వివేకం కలవాడు పాపం వైపు పోకుండా, మదంలేని, అహంకారంలేని బుద్ధి కలవాడై, మొండి పట్టుదల లేనివాడై, ధర్మ మార్గంలో ప్రవర్తిస్తాడు. దానితో అతడికి మంచిస్థితి కలుగుతుంది. క్రమంగా అతడికి ధర్మం మీద రుచి ఏర్పడుతుంది. సత్కార్యాలను ఆచరించటం వదలలేని దశకు వస్తాడు. అటుపై ఇంకా ఎక్కువగా ధర్మాలు చేస్తూ ఉంటాడు అని ఆ తరువాత ధర్మవ్యాధుడు కౌశికుడికి బ్రహ్మవిద్యగురించి చెబుతూ -

చం. అరదము దేహ, మింద్రియము లశ్వము, లాత్ముఁడు సూతుఁ డమ్మహో
తురగచయంబు ధైర్యమను తోరపుఁ బగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోకయుండ వెరవొప్పగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువున నేఁగు; నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్
(ఆరణ్య: 5-92)

దేహమే రథం. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అనే ఇంద్రియాలు గుఱ్ఱాలు. బుద్ధి దీనికి సారథి. గుఱ్ఱాల సముదాయాన్ని ధైర్యం అనే దృఢమైన పగ్గాలతో గట్టిగా పట్టుకొని అవి తప్పించుకొని పారి పోకుండా ఉపాయంతో నిలువరించగలిగినవాడు క్షేమమార్గంలో ప్రయాణిస్తాడు. ఆ మహోన్నత ధీరుడే చాలా గొప్పవాడు.

**కం. కామంబును గ్రోధంబును**
**నేమఱక జయింపవలయు నెల్లవిధములన్**
**ధీమహిత! యిదియ సతత**
**క్షేమంకరమైన పథము కృతబుద్ధులకున్ (ఆరణ్య: 5-109)**

గొప్ప బుద్ధి గలవాడా! **కామక్రోధాలను ఏమరకుండా అన్ని విధాలుగా గెలవాలి. ఇదే ఎల్లవేళలా క్షేమం కలిగించే బాట.**

**చం. నిజగుణ దోషకర్మముల నెట్టన మేలునుఁ గీడువచ్చుఁ; ద**
**త్ప్రజనిత సౌఖ్య దుఃఖములఁ బ్రాజ్ఞులు దుల్యమనస్కులై మనో**
**రుజలును దేహజంబులగు రోగములున్ హితధర్మకర్మభే**
**షజములఁ జేసి పాపుదురు సర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్**
**(ఆరణ్య: 5-139)**

మానవులకు తమ గుణాలను బట్టి మేలూ, దోషాలను బట్టి కీడూ వస్తూ ఉంటాయి. వాటి వల్ల సుఖాల పట్లా, దుఃఖాల పట్లా ప్రజ్ఞ కలవారు ఒకేవిధంగా ఉంటారు. మనస్సునకు చెందిన రోగాలను, దేహసంబంధమైన జబ్బులను తగిన ధర్మకార్యాలనే ఔషధాలతో పోగొట్టుకుంటారు. **'అన్నింటికంటే అహింస గొప్పది. అది సత్యంతో కలిస్తే మరీ మంచిది. ధర్మం ఎన్నో రకాలుగా ఉంటుంది. ధర్మసూక్ష్మం అంత సులభంగా అర్థం కాదు. కాబట్టి వేదం వల్ల గానీ, పెద్దల నుంచి గానీ తెలుసుకోవాలి'** అంటూ ఇలా ఎన్నో ధర్మాలు చెప్పి మార్కండేయుడు వెళ్ళిపోయాడు. తరువాత పాండవులు ద్వైతవనానికి చేరుకున్నారు.

## ఘోషయాత్ర

పాండవుల్ని అవమానించాలి. తన వైభవాన్ని చూసి వాళ్ళు కుమిలిపోవాలి. అందుకు దుర్యోధనుడు వేసిన పథకమే ఘోషయాత్ర. ద్వైతవనానికి బయలుదేరాడు దుర్యోధనుడు సపరివారంగా.

ద్వైతవనంలో గంధర్వులు ఉన్నారు. వారికీ కౌరవులకూ ఘర్షణ జరిగింది. చిత్రాంగదుడు అనే గంధర్వరాజు స్వయంగా యుద్ధానికి వచ్చాడు. కర్ణాదుల్ని తరిమికొట్టి, దుర్యోధనుణ్ణి రెక్కలు విరిచి కట్టి పడవేశాడు. పారిపోయిన కౌరవులు ధర్మరాజును శరణు వేడారు.

అప్పుడు ధర్మరాజు దుర్యోధనుణ్ణి కాపాడమని సోదరుల్ని ఆజ్ఞాపించాడు. భీముడు – 'అన్నయ్యా! కాగల కార్యం గంధర్వులే తీర్చారు. మనమెందుకు రక్షించడం?' అన్నాడు. అప్పుడు ధర్మరాజు –

**కం. శరణంబని వచ్చిన భీకర**
**శత్రువు నయినఁ బ్రీతి గావఁగ వలయుం**
**గరుణాపరుల తెఱంగిది**
**యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్ (అరణ్య: 5-413)**

**'శరణు కోరినవాడు గొప్ప శత్రువే అయినా ప్రేమతో రక్షించాలి. ఇదే దయామయుల పద్ధతి. దీనికి సాటి వచ్చే ధర్మాలు ఏవీ లేవు' అని పంపాడు.**

భీమార్జునులు వెళ్ళి యుద్ధం చేసి అతణ్ణి విడిపించారు. పాండవులముందు తనకు జరిగిన అవమానానికి తట్టుకోలేక దుర్యోధనుడు అడవిలోనే ప్రాయోపవేశానికి పూనుకున్నాడు. పూర్వం దేవేంద్రుడికి భయపడి పాతాళంలో దాక్కొన్న రాక్షసులకు దుర్యోధనుడు ప్రాయోపవేశం చేస్తున్న విషయం తెలిసింది. వాళ్ళు కృత్య అనే రాక్షసిని పంపి దుర్యోధనుణ్ణి పాతాళానికి రప్పించారు. అక్కడ ఆ రాక్షసులంతా దుర్యోధనుడికి ఉత్సాహం కలిగించేసరికి ప్రాయోపవేశం విరమించి, హస్తినాపురానికి చేరుకున్నాడు దుర్యోధనుడు.

***

పాండవుల నివాసం వల్ల ద్వైతవనంలో పర్యావరణానికి చేటు కలుగుతోంది. అందుకే మళ్ళీ కామ్యకవనానికి చేరుకున్నారు. అప్పుడు వ్యాసుడు వాళ్ళ వద్దకు వచ్చి ఇలా హితవు పలుకుతున్నాడు.

**కం. క్షమయు నహింసయు సత్యము**
**సమతయు నింద్రియజయంబు శమముఁ బరిత్యా**
**గమును దపోలక్షణములు**
**గ్రమమున నిన్నియును నూర్ధ్వగతి కారణముల్ (అరణ్య: 6-108)**

**'ధర్మరాజా! క్షమ, అహింస, సత్యం, సమత, ఇంద్రియ నిగ్రహం, శాంతి, దానం, ఇవన్నీ తపస్సు లక్షణాలు, ఈ గుణాలే మానవుణ్ణి స్వర్గానికి చేరుస్తాయి. ఈ లోకంలో చేసిన పుణ్యమే పరలోక సుఖాలను కలిగిస్తుంది. తరువాత జన్మలో కూడా మంచి పుట్టుకను ఇస్తుంది. కాబట్టి ఎప్పుడూ దానధర్మాలు చేస్తూ ఉండాలి. లోకంలో మానవులకు ప్రాణం అంటే ఎంత తీపో చెప్పలేం. దానికోసం ఏమైనా చేస్తారు. నిజానికి కష్టపడి సంపాదించిన సొమ్మును దానం చేయడానికి మనసొప్పదు. అలా అని అన్యాయంగా ఆర్జించిన ధనాన్ని దానం చేస్తే దాని వల్ల ఫలితం ఉండదు. కొంచెమే అయినా న్యాయమార్గంలో సంపాదించిన దానితో చేసే దానమే సత్ఫలితాల్ని ఇస్తుంది. ఆ దానం కూడా తగిన వాడికి చెయ్యాలి.**

## ముద్గలుడు

పూర్వం ముద్గలుడు అనే మహర్షి భిక్షాటన చేస్తూ జీవించేవాడు. పక్షం రోజుల్లో ఒక ద్రోణం పరిమాణంలో (నాలుగు కుంచాలు) ధాన్యాన్ని పోగు చేసేవాడు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఆ ధాన్యాన్ని వండి, అతిథులకు వడ్డించేవాడు. వాళ్ళు తినగా మిగిలినదానినే తన భార్యాపిల్లలతో తినేవాడు.

ఇదిలా ఉండగా ఒకరోజు దుర్వాసమహర్షి పిచ్చివాడి రూపంలో ఇతడి దగ్గరకు వచ్చాడు. ఒంటి మీద నూలుపోగైనా లేకుండా అసహ్యంగా ఉన్నాడు. అయినా ముద్గలుడు అతణ్ణి అసహ్యించుకోలేదు. సాదరంగా వండి వడ్డించాడు. తాను తినగా మిగిలిన అన్నాన్ని కూడా మిగల్చకుండా ఒంటికి పూసుకొని అరుస్తూ

వెళ్ళిపోయాడు దుర్వాసమహర్షి. దాంతో వాళ్ళకు తినడానికి ఏమీ మిగల్లేదు. ఇలా ఆరుసార్లు జరిగింది. పైగా దుర్వాసుడు ఇష్టం వచ్చినట్లు అసహ్యంగా ప్రవర్తించేవాడు. తిట్టేవాడు. అయినా ముద్గలుడు చలించలేదు. దానికి దుర్వాసుడు ఆశ్చర్యపోయి 'ముద్గలా! నువ్వెంతో **శాంతమూర్తివి. దానగుణం, ప్రసన్నత, సత్యం, ధైర్యం, ఇంద్రియనిగ్రహం లాంటి గుణాలను పుణికి పుచ్చుకున్నావు. మనిషి నాలుక ఎప్పుడూ రుచినే కోరుతుంది. ఆకలి సహనాన్ని నశింపజేస్తుంది. నువ్వు రుచినీ, ఆకలినీ జయించావు. నీ శాంతగుణానికి మెచ్చాను. ఈ శరీరంతోనే నీకు స్వర్గం లభిస్తుంది' అని దీవించి వెళ్ళిపోయాడు.**

అన్నట్లుగానే స్వర్గం నుంచి విమానం వచ్చింది. అందులో నుండి ఒక దేవదూత వచ్చి ముద్గలుణ్ణి స్వాగతించాడు. అప్పుడు ముద్గలుడు స్వర్గం గురించి చెప్పమని అడిగాడు. దానికా దేవదూత –

'మహర్షీ! భూమి మీద చేసిన పుణ్యాన్నిబట్టి స్వర్గం వస్తుంది. పుణ్యఫలం పూర్తి కాగానే స్వర్గం నుండి కిందపడతాడు. ఒక్క బ్రహ్మలోకంలో తప్ప తక్కిన అన్ని పుణ్యలోకాలలోనూ ఇంతే' అన్నాడు.

దానికి ముద్గలుడు 'సరే! నాకు ఇలాంటి స్వర్గం వద్దు. శాశ్వతమైన ఉత్తమ లోకం కోసం ప్రయత్నిస్తాను' అని అతణ్ణి పంపివేశాడు. యథాప్రకారం తన జీవనాన్ని కొనసాగిస్తూ కొన్నాళ్ళ తరువాత జ్ఞానయోగం ద్వారా సిద్ధిని పొందాడు.

**కాబట్టి ధర్మరాజా! పోయిన దాని కోసం చింతించకు. సుఖదుఃఖాలు చక్రంలోని ఆకులులాగా పైకీ కిందకీ తిరుగుతూనే ఉంటాయి. తపస్సు, ధర్మాచరణ ద్వారా అన్నీ లభిస్తాయి'** అని చెప్పి వ్యాసుడు దీవించి వెళ్ళిపోయాడు.

## సైంధవుడు

ఒకరోజు ద్రౌపది తృణబిందుమహర్షి ఆశ్రమంలో ఒంటరిగా ఉంది. పాండవులు వేటకు వెళ్ళారు. అప్పుడు అటుగా వచ్చిన సైంధవుడు ద్రౌపదిని బలవంతంగా రథంపై ఎక్కించుకొని బయలుదేరాడు. ద్రౌపది గట్టిగా అరిచింది.

ఆశ్రమంలో ఉన్న ధౌమ్యుడు పరుగునవచ్చాడు. అప్పటికే రథం అందనంత దూరానికి వెళ్ళిపోయింది.

వేట నుండి తిరిగివచ్చారు పాండవులు. జరిగింది తెలుసుకొని సైంధవుణ్ణి అటకాయించారు. పాండవుల ముందు సైంధవుడు ఏపాటి? ఒక్కక్షణంలోనే నిరాయుధుడై కూలబడ్డాడు.

'ఈ ద్రోహిని సంహరించి నాకు ఆనందాన్ని కలిగించండి' అంది ద్రౌపది కోపంతో. ధర్మరాజు శాంతంగా 'ద్రౌపదీ! వీడి భార్య దుస్సల. కౌరవులకీ మాకూ ఒక్కగా నొక్క చెల్లెలు. వీణ్ణి చంపితే ఆమె అనాథ అవుతుంది. ఆలోచించి క్షమించు' అన్నాడు.

అంతలోనే భీముడు సైంధవుడికి దేహశుద్ధి చేశాడు. గుండు గీయించి బుద్ధి చెప్పి సైంధవుణ్ని విడిచిపెట్టారు పాండవులు.

అవమాన భారంతో సైంధవుడు హరిద్వార్ వెళ్ళి శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. 'పరమేశ్వరా! ఆ పాండవుల్ని జయించే వరాన్ని నాకు ప్రసాదించు' అన్నాడు. దానికి శివుడు 'సైంధవా! ఒక్క అర్జునుణ్ణి తప్ప తక్కిన పాండవుల్ని నువ్వు ఒక రోజు మాత్రమే యుద్ధంలో జయిస్తావు' అని వరాన్ని అనుగ్రహించాడు.

## సావిత్రి వృత్తాంతం

కొన్నాళ్లు గడిచాయి. తమ వద్దకు వచ్చిన మార్కండేయ మహర్షిని ధర్మరాజు 'మహర్షీ! లోకంలో నాలాగా కష్టాలు పడ్డవాళ్ళెవరైనా ఉన్నారా?' అని అడిగాడు. దానికి మహర్షి చిరునవ్వు చిందిస్తూ 'లేకేం? శ్రీరామచంద్రుడు లేడూ! ఆయన పడ్డ కష్టాలముందు నీవి ఓ లెక్కా!' అంటూ శ్రీరామవృత్తాంతాన్ని చెప్పాడు. ఆ తరువాత మహాపతివ్రత అయిన సావిత్రి చరిత్రను చెప్పడం మొదలుపెట్టాడు.

మద్రదేశానికి రాజు అశ్వపతి. సంతానం కోసం సావిత్రీదేవిని ఉపాసించాడు. ఆమె ప్రత్యక్షమయ్యింది. పుత్రుణ్ణి ప్రసాదించమని కోరాడు. కానీ ఆమె పుత్రికను

ప్రసాదిస్తూ 'ఈమె లోకప్రసిద్ధురాలవుతుంది. తరువాత నీకు నూరుగురు పుత్రులు కలుగుతారు' అని వెళ్ళిపోయింది.

అతడి భార్య మాధవి కొన్నాళ్ళకు నవమాసాలూ నిండకుండానే ఒక పుత్రికను జన్మనిచ్చింది. ఆమే సావిత్రి.

సావిత్రి పెరిగి పెద్దదయ్యాక తండ్రి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ పక్కనే సాళ్వదేశం ఉంది. దానికిరాజు ద్యుమత్సేనుడు. అతడి కుమారుడు సత్యవంతుడు. మంచివాడని పేరు తెచ్చుకున్నాడు. అది తెలిసి సావిత్రి అతణ్ణి ఇష్టపడింది. అయితే సత్యవంతుడి తండ్రికి కళ్ళులేవు. రాజ్యమూ పోయింది. ప్రస్తుతం అడవుల్లో ఉన్నాడు. అయినా సత్యవంతుణ్ణే పెళ్ళి చేసుకోవాలని సావిత్రి నిశ్చయించుకొంది.

ఒకరోజు నారదుడు వాళ్ళింటికి వచ్చాడు. ఆ మహర్షి సమక్షంలోనే తన తండ్రితో తన మనసులోని మాట చెప్పింది సావిత్రి. అంతా విన్న నారదుడు ఇలా అన్నాడు.

'రాజా! ఆ సత్యవంతుడి అసలు పేరు చిత్రాశ్వుడు. సావిత్రి చెప్పింది నిజమే. అతడు చాలా మంచివాడు. అయితే అతడు వివాహం అయ్యాక ఒక్క సంవత్సరమే బతికి ఉంటాడు. అది విధినిర్ణయం' అన్నాడు.

అశ్వపతి భయపడిపోయాడు. అయినా సావిత్రి సత్యవంతుణ్ణే చేసుకుంటానని కచ్చితంగా చెప్పింది. కూతురు మాట కాదనలేక, నారద మహర్షి అంగీకారంతో వివాహం జరిపించాడు. నారచీరలు ధరించి సావిత్రి అత్తవారింటికి వెళ్ళింది.

కాలచక్రం గిర్రున తిరిగింది. సంవత్సరం పూర్తవుతోంది. నారదుడు చెప్పిన దాని ప్రకారం సత్యవంతుడు మరణించడానికి ఇంకా నాలుగురోజులే మిగిలి ఉన్నాయి. సావిత్రి ముందు మూడు రోజులూ కఠోరమైన ఉపవాసదీక్ష చేపట్టింది.

అది నాలుగోరోజు. తెల్లవారక ముందే మేల్కొంది సావిత్రి. భర్తకూ, అత్తమామలకూ ఎప్పటిలాగే సపర్యలు చేసింది. సత్యవంతుడు దర్భలు, పండ్లు తీసుకువస్తానని బయలుదేరుతుంటే తానూ అతడి వెంట వెళ్ళింది.

సత్యవంతుడు బుట్టనిండా పళ్ళు కోశాడు. కట్టెల కోసమని గొడ్డలి చేతపట్టి చెట్టు నరుకుతున్నాడు. అంతే! అతడికి కళ్ళు తిరుగుతున్నాయి. శరీరం వణికిపోయింది. చేతిలోని గొడ్డలి క్రింద పడింది. 'సావిత్రీ! నిలబడలేకపోతున్నాను. ఏదీ! నీ ఒడిలో కాస్త విశ్రాంతి తీసుకోనీ!' అంటూ వాలిపోయాడు.

కొన్ని క్షణాల తర్వాత ఎవరో ఒక పురుషుడు. చేతిలో పాశం. వేగంగా వస్తున్నాడు. నల్లగా, కోరలతో భయంకరంగా ఉన్నాడు. అతడే యమధర్మరాజు. సావిత్రి మహాపతివ్రత కాబట్టి ఆయన ఆమెకు కన్పించాడు.

సావిత్రి లేచి నమస్కరించింది. తమరెవరని అడిగింది. యముడు తన గురించి చెప్పి 'నీ భర్త గుణవంతుడు కాబట్టి నేనే వచ్చాను. ఇతడి ఆయుష్షు తీరిపోయింది' అని పాశం వేసి ప్రాణాలు గుంజి, జీవుణ్ణి తీసుకొని దక్షిణం వైపు బయలుదేరాడు.

కళ్ళ ముందే జరిగిన ఈ దృశ్యాన్ని చూసి సావిత్రి చలించి పోయింది. దుఃఖం ఆపుకోలేకపోయింది. ఏడుస్తూనే యమధర్మరాజు వెంటపడింది.

యముడు అది గమనించాడు. 'సావిత్రీ! ఇలా రావడం తప్పు. వెళ్ళిపో' అన్నాడు.

ఆమె ఎంతమాత్రమూ భయపడకుండా 'యమధర్మరాజా! **భర్త ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్ళడం భార్య ధర్మం కదా? అన్నింటికంటే ధర్మమార్గమే ముఖ్యం.** నీ దయ వల్ల నేను వెళ్ళలేని మార్గమంటూ ఉంటుందా? నీ దర్శనం జరిగాక నాకు పొందరాని ఫలమంటూ ఉంటుందా?' అంది.

ఆమె మాటలకు ఆనందించిన యముడు 'సావిత్రీ! నీ పతిప్రాణం తప్ప, మరేదైనా వరం కోరుకో!' అన్నాడు. సావిత్రి ఆనందంగా తన మామగారికి చూపురావాలని కోరింది. అలాగే అని యముడు ముందుకు సాగిపోయాడు. సావిత్రి మళ్ళీ వెంటపడింది. యముడు వెనక్కి తిరిగి చూశాడు. వెంటనే సావిత్రి చేతులు జోడించి –

చం. ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింసయొనర్పఁ బూన రె
యొడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవఁగఁ జూతు రిచ్చుచోఁ
గడమ వడంగనీ కెదిరి కాంక్షితముల్ దుది ముట్టఁ దీర్తు; రె
క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకున్ విను మిన్నియు నార్యధర్మముల్.
(అరణ్య: 7-228)

**యమధర్మరాజా! పూజ్యులైనవాళ్ళు మనస్సుతో గానీ, మాటతోగానీ, చేష్టల ద్వారా గానీ ఎవరినీ హింసించరు. ఎప్పుడూ దీనుల్ని రక్షించాలనే చూస్తారు. ఇచ్చేటప్పుడు కూడా కోరిన కోర్కెల్ని పూర్తిగా తీరుస్తారు. ఆశ్రయించిన వారిని మనస్ఫూర్తిగా ఆదరిస్తారు. ఇవన్నీ నీలాంటి ఆర్యుల ధర్మాలు.**

'సమవర్తీ! నువ్వు అన్ని ప్రాణుల పట్లా సమానంగా ప్రవర్తిస్తావు కాబట్టే నిన్ను 'సమవర్తి' అంటారు. సకల ప్రాణికోటినీ నియమిస్తావు కాబట్టి 'యముడు' అంటారు. పాపాల్ని పోగొడతావు కాబట్టి 'శముడు' అంటారు' అని ప్రశంసించింది.

యముడు పొంగిపోతూ మరో వరం కోరుకోమన్నాడు భర్త ప్రాణం తప్ప. తన మామగారికి పోయిన రాజ్యం తిరిగి రావాలని కోరింది. అనుగ్రహించి 'ఇంక నా వెంట రాకు. వెళ్ళు' అన్నాడు మృదువుగా. అప్పుడు సావిత్రి –

**'మహాత్మా! ధర్మాత్ములు ధర్మాన్ని ఎన్నటికీ తప్పరు కదా! వాళ్ళ హృదయంలో భ్రాంతిగానీ తాపంగానీ పుట్టవు. నేను నా భర్తను విడిచివెళ్ళడం ధర్మమేనా? మీరే చెప్పండి?' అంది వినయంగా.**

ఆమె వాక్చాతుర్యానికి, ధర్మనిష్ఠకు పరవశించిపోయిన యముడు మరో వరం కోరుకోమన్నాడు అది కూడా పతి ప్రాణం తప్ప. తన తండ్రికి పుత్రభిక్ష పెట్టమని వేడుకుంది సావిత్రి. 'వందమంది పుత్రుల్ని ప్రసాదించాను. సరేనా? ఇక వెళ్ళు. ఇప్పటికే చాలా అలసిపోయావు' అన్నాడు లాలనగా.

దానికి సావిత్రి 'ధర్మరాజా! నువ్వు ధర్మాత్ముడివి. లోకంలో ఎవరైనా ఎవరితోనైనా ఏడు అడుగులు నడిస్తే వారితో స్నేహం కలుగుతుందంటారే! నేను నీతో ఎంతో దూరం నడిచాను. కాబట్టి నాకు నీతో సఖ్యత ఏర్పడినట్లేగా. స్నేహితురాలి కష్టం తీర్చడం ధర్మం కాదూ!' అంది.

యముడు నవ్వుతూ 'సావిత్రీ! నువ్వన్నది ధర్మబద్ధంగానే ఉంది. సరే! ఏం వరం కావాలో కోరుకో!' అన్నాడు.

ఈసారి మాత్రం 'పతి ప్రాణం తప్ప' అన్న నియమం పెట్టలేదు. సావిత్రి ఆనందంగా తన భర్త ప్రాణాలు కోరుకుంది.

యముడు ఆనందంగానే 'సావిత్రీ! నీ పతిభక్తి గొప్పది. నీ కృషి, పట్టుదల నాకు నచ్చాయి. తీసుకో! నీ భర్త 400 సంవత్సరాలు జీవిస్తాడు. నీకు వందమంది పుత్రులు కలుగుతారు. నీ పేరు శాశ్వతంగా ఈ లోకంలో నిలిచి ఉంటుంది' అని దీవించి వెళ్ళిపోయాడు' అని చెప్పి మార్కండేయ మహర్షి పాండవులను ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

## దానకర్ణుడు

కర్ణుడి రాజప్రాసాదం.

కర్ణా! అని ఒక గొంతు వినిపించింది. కర్ణుడు బయటకు వచ్చి చూశాడు. ఒక ముసలి బ్రాహ్మణుడు వచ్చి 'కర్ణా! ఇంద్రుడు నీ కవచకుండలాల్ని అపహరించాలని చూస్తున్నాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని ఇవ్వవద్దు. ఇచ్చావో నీ ప్రాణాలకే ప్రమాదం' అన్నాడు.

ఆ బ్రాహ్మణుడు ఎవరో కాదు. సాక్షాత్తూ సూర్య భగవానుడు. కర్ణుడి తండ్రి. తన రూపం కూడా చూపించాడు. అయినా కర్ణుడు వినయంగా 'దేవా! బ్రాహ్మణుడు వచ్చి నన్ను ఏది కోరినా ఇస్తానని ప్రతిజ్ఞ చేశాను. దాని కోసం నా ప్రాణాలనైనా అర్పిస్తాను' అన్నాడు.

కొంతకాలం తర్వాత ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి కవచకుండలాల్ని దానం చెయ్యమని అడిగాడు. కర్ణుడు తడబడకుండా వెంటనే దానం చేశాడు. దానికి ప్రతిగా కర్ణుడు కోరిన మీదట ఇంద్రుడు తన వద్దనున్న 'శక్తి' అనే ఆయుధాన్ని ఇస్తూ 'ఇది ఒక్కసారి మాత్రమే పని చేస్తుంది. జాగ్రత్త.' అని దీవించి వెళ్ళిపోయాడు.

## యక్షప్రశ్నలు

ద్వైతవనం. పాండవుల దగ్గరకు ఒక బ్రాహ్మణుడు పరుగుపరుగున వచ్చి 'నా అరణిని (యజ్ఞంలో అగ్నిని పుట్టించే సాధనం) ఒక జింకపిల్ల తీసుకొని ఎటో పారిపోయింది. దయచేసి దాన్ని నాకు తెచ్చి ఇవ్వండి' అన్నాడు.

పాండవులు బయలుదేరారు. ఎంతదూరం వెళ్ళినా దాని జాడలేదు. అలసిపోయారు. దాహం వేసింది. నీళ్ళ కోసం నకులుడు వెళ్ళాడు. పక్కనే ఒక కొలను ఉంది. కానీ నకులుడు ఎంతసేపటికీ రాలేదు. తర్వాత సహదేవుడు వెళ్ళాడు. అతడూ రాలేదు. ఈసారి అర్జునుడు ఆ తరువాత భీముడూ వెళ్ళారు. వెళ్ళిన వాళ్ళు ఎవరూ తిరిగి రాలేదు. ధర్మరాజు ఆందోళనగా తనే బయలుదేరాడు.

కొలను దగ్గర సోదరులందరూ అచేతనంగా పడి వున్నారు. నీళ్ళు తాగుదామని కొలనులోనికి దిగాడు. 'రాజా! ఇది నా కొలను. నీ సోదరులు నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఇందులో దిగి మరణించారు. నీకూ అదే గతి పట్టకుండా ఉండాలంటే ముందు నా ప్రశ్నలకు సమాధానం చెప్పు' అనే మాటలు వినిపించాయి.

ధర్మరాజు అలాగే నన్నాడు వినయంగా.

1) సూర్యుణ్ణి ఉదయించేలా చేసేది ఏది? 2) అతడి చుట్టూ ఎవరు తిరుగుతారు? 3) అస్తమింపజేసేది ఎవరు? 4) అతడు దేనిలో ఉంటాడు? 5) మనిషి దేనివల్ల శ్రోత్రియుడవుతాడు? 6) బ్రాహ్మణులలో మనుష్యభావం ఏది? 7) క్షత్రియులకు దేనివల్ల దేవత్వం వస్తుంది? 8) క్షయంకాని నరకాన్ని పొందే వాడు ఎవడు? 9) మనిషికి బ్రాహ్మణత్వం ఎలా లభిస్తుంది? 10) అన్నింటికన్నా ఆశ్చర్యకరమైనది ఏది? 11) మానవుడికి ఏది అసలైన మార్గం? 12) ఎవడు పురుషుడు? 13) అందరికన్నా ధనవంతుడు ఎవరు? అని ప్రశ్నించిందా గొంతు.

ధర్మరాజు ఎంతమాత్రం తడుముకోకుండా – 1) 'సూర్యుణ్ణి ఉదయింపజేసేది బ్రహ్మ. 2) అతడి చుట్టూ తిరిగేది దేవతలు. 3) సూర్యుణ్ణి అస్తమింపజేసేది ధర్మం. 4) సూర్యుడు సత్యంలో ప్రతిష్ఠింపబడతాడు. 5) మనిషి వేదం వల్ల శ్రోత్రియుడవుతాడు. 6) బ్రాహ్మణుల్లో మనుష్యభావం మరణమే! 7) క్షత్రియులకు

దేవత్వం విద్య వల్ల వస్తుంది. 8) యాచించిన బ్రాహ్మణుల్ని ముందు రమ్మని తరువాత పొమ్మనేవాడు, వేదాలన్నా, విప్రులన్నా, ధర్మశాస్త్రాలన్నా, దేవతలన్నా, పితరులన్నా ఆసక్తిలేని వాడు, ధనం ఉండీ తాను అనుభవించక, ఇతరులకు దానం చెయ్యక లేదని చెప్పేవాడు అక్షయ నరకానికి పోతాడు. 9) సదాచారమే బ్రాహ్మణత్వాన్ని ఇస్తుంది. 10) కళ్ళముందే అందరూ మరణిస్తూ ఉన్నా తాను మాత్రం శాశ్వతం అనుకుంటాడు మనిషి అదే ఆశ్చర్యం. 11) మహాత్ములు నడిచిన దారే మానవుడికి అసలైన మార్గం. 12) పుణ్యకర్మలు చేసి భూమిపైనా, స్వర్గంలోనూ కీర్తింపబడేవాడే పురుషుడు. 13) ప్రియాన్నీ, అప్రియాన్నీ, సుఖాన్నీ, దుఃఖాన్నీ, భూత భవిష్యత్తులనూ ఒకేలా చూడగలిగే వాడే ధనవంతుడు" అన్నాడు. వెంటనే ఒక యక్షుడు ప్రత్యక్షమై –

ధర్మరాజు చెప్పిన సమాధానాలకు ఎంతగానో సంతోషించి 'ధర్మరాజా! నీ తమ్ముళ్ళలో ఒకరి ప్రాణాన్ని నువ్వు కోరుకో' అని వరం ఇచ్చాడు. వెంటనే ధర్మరాజు తడుముకోకుండా 'మహానుభావా! నాకు నకులుడి ప్రాణాన్ని ప్రసాదించు' అన్నాడు వినయంగా. భీమార్జునుల్ని కాకుండా నకులుణ్ణి కోరడమేమిటో అర్థం కాలేదు యక్షుడికి. వెంటనే అడిగాడు. దానికి ధర్మరాజు 'అయ్యా! కుంతీదేవికి కొడుకుగా నేను బ్రతికే ఉన్నాను కదా! మా పినతల్లి మాద్రికి కూడా ఆమె పుత్రులలో పెద్దవాడైన నకులుణ్ణి కోరుకున్నాను' అన్నాడు.

'ధర్మరాజా! నువ్వు నిజంగా ధర్మరాజువేనయ్యా!' అన్నాడు. యక్షుడి రూపంలో వచ్చినది మరెవరో కాదు యమధర్మరాజు.

ధర్మరాజు సోదరుల్ని బతికించి 'మీ అరణ్యవాసంలో 12 ఏళ్ళు పూర్తయ్యాయి. ఇక చేయవలసింది అజ్ఞాతవాసమే! మీరు ఎక్కడ ఎప్పుడు ఏ రూపంలో ఉండాలనుకొంటే అలా ఉండగలరు. మిమ్మల్ని ఎవరూ గుర్తించలేరు' అంటూ వరాన్ని అనుగ్రహించి, విప్రుడి అరణిని ధర్మరాజుకు ఇచ్చి అంతర్ధానమయ్యాడు యముడు. ఆ అరణిని తెచ్చి, ధర్మరాజు విప్రుడికి అందించాడు.

# విరాటపర్వం

**విరాట రాజ్యంలో అజ్ఞాతవాసం చెయ్యాలనుకొన్నారు పాండవులు. ధౌమ్యుడు వచ్చి 'పాండవులారా! మీరు మీ గతాన్ని మర్చిపోండి. ఇప్పుడు మీరు రాజుకు సేవకులు. రాజుకు నచ్చినట్లు నడుచుకోవాలి. అదే గౌరవం. మీ ఇల్లు రాజ భవనాన్ని మించి ఉండకూడదు. రాజును అనుకరించకూడదు. రాజుకు గనక కోపం వస్తే సొంతవారినైనా హతమారుస్తాడు. జాగ్రత్త. ఎంత గొప్ప పదవిలో ఉన్నా పదిమందికీ ఆపద కలిగించే పనులు చేయకూడదు. రాజుగారి ముందు ఇతరుల్ని విమర్శించకూడదు. గట్టిగా మాట్లాడకూడదు. రాజుగారు అప్పగించిన పనిని ఎంతకష్టమైనా సాధించాలి. సభామర్యాదలూ, రాజమర్యాదలూ తప్పక పాటించాలి. రాజధనం విషంగా భావించాలి. ఐశ్వర్యం వచ్చినా మిడిసి పడకూడదు. ఎప్పుడూ వినయంగా ఉండాలి'.అని ఎన్నో నీతులూ, సూచనలూ, సలహాలు చెప్పి పంపించాడు.**

పాండవులు తమతో ఉన్న వాళ్ళందరినీ వెనక్కి పంపి, ద్రౌపదితో కలిసి విరాటనగరం వైపు దారి తీశారు. నగరం పొలిమేరలలోనికి రాగానే తమ ఆయుధాల్ని ఒక జమ్మి చెట్టు మీద శవాకారంలో మూటకట్టి దాచిపెట్టారు.

ధర్మరాజు 'ఓ ఆయుధ దేవతల్లారా! నాకూ అర్జునుడికీ తప్ప మిగిలినవాళ్ళకు సర్పాల్లాగా కన్పించండి' అని ప్రార్థించాడు.

అజ్ఞాతవాసంకోసం పాండవులు తమకు తాము తెలియడం కోసం జయుడు, జయంతుడు, విజయుడు, జయత్సేనుడు, జయద్బలుడు అనే మారు పేర్లను పెట్టుకొన్నారు.

పుణ్య నదుల్లో స్నానం చేశారు. యమధర్మరాజు వరమిచ్చిన కారణంగా కోరిన రూపాల్ని పొందారు. అప్పుడు ధర్మరాజు 'కంకుడు' అనే పేరుతో సన్యాసి

రూపంలో విరాటరాజు కొలువులో చేరాడు. తరువాత భీముడు 'వలలుడు' అనే పేరుతో వంటవాడిగా చేరాడు. అర్జునుడు 'బృహన్నల' అనే పేరుతో విరాట రాజకుమార్తె ఉత్తరకు నాట్యాచార్యుడయ్యాడు. నకులుడు దామగ్రంథి అనే పేరుతో గుర్రాలకాపరిగా, సహదేవుడు 'తంత్రీపాలుడు' అనే పేరుతో ఆవుల కాపరిగా చేరాడు. ఇక ద్రౌపది 'మాలిని' అనే పేరుతో విరాటరాజు భార్య సుధేష్ణ వద్ద సైరంధ్రిగా చేరింది.

## కీచకుడు

రోజులు గడుస్తున్నాయి. సుధేష్ణాదేవికి ఒక తమ్ముడు ఉన్నాడు. అతడి పేరు కీచకుడు. మహాబలవంతుడు. నిత్యం మద్యం తాగుతూ ఉంటాడు. ఒకరోజు తన అక్కగారి అంతఃపురానికి వచ్చి మాలినిగా ఉన్న ద్రౌపదిని చూశాడు. ఆమె అందానికి మతిపోయింది కీచకుడికి. ఎలాగైనా ఆమెను పొందాలకున్నాడు. అతడికి అడ్డేముంది? వెంటనే వెళ్ళి తన మనసులోని మాటను ఆమెకు నిస్సంకోచంగా చెప్పేశాడు.

ఆ మాటలు విన్న ద్రౌపదికి కంపరం పుట్టింది. అయినా తాము చేస్తున్నది అజ్ఞాతవాసం కాబట్టి తమాయించుకొని ఇలా అంది. 'అన్నా! నీలాంటి ఉత్తముడు ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా? నీకూ అక్కాచెల్లెళ్ళు ఉన్నారు కదా! నేను నీకన్నా తక్కువ కులంలో పుట్టినదాన్ని. పైగా పతివ్రతను. నాతో నువ్విలా మాట్లాడడం పద్ధతి కాదు' అంది నిర్భయంగా.

కీచకుడు వింటేనా? మళ్ళీ అదేమాట. అప్పుడు ద్రౌపది కోపంగా 'ప్రభూ! తొందరపడి తప్పు చేస్తున్నారు. తరువాత బాధపడవలసి వస్తుంది.

శా. **దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాపస్ఫురత్**
**గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్**
**గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసంగట్టి గం**
**ధర్వుల్ మానము బ్రాణమున్ గొనుట తథ్యంబెమ్మెయిన్ గీచకా!**

**(విరాట: 2-172)**

నాకు అయిదుగురు భర్తలు ఉన్నారు. వాళ్ళు మహాబలవంతులు. దేవతల్లా ఉంటారు. ఈ విషయం వాళ్ళకు తెలిస్తే ఇక అంతే! మిమ్మల్ని దారుణంగా సంహరిస్తారు. జాగ్రత్త!' అని హెచ్చరించింది.

అయినా కీచకుడు వెనక్కి తగ్గలేదు. ఈసారి తన అక్క సుధేష్ణ ద్వారా పావులు కదిపాడు. సుధేష్ణ కూడా 'ఇది తప్పు నాయనా' అని నచ్చ చెప్పింది. వినలేదు కీచకుడు. అతడి బెదిరింపులకు భయపడింది సుధేష్ణ. ద్రౌపదిని పిలిచి 'మాలినీ! నాకు బాగా దాహంగా ఉంది. నా తమ్ముడు కీచకుడి మందిరంలో ఉన్న మదిరను కాస్త తెచ్చిపెట్టు' అని ఆజ్ఞాపించింది.

రాణీగారి ఆజ్ఞ. తప్పలేదు ద్రౌపదికి. భయపడుతూనే వెళ్ళింది. ఇదే అదనుగా భావించిన కీచకుడు ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

ద్రౌపది చెయ్యి విదుల్చుకొని పరుగు తీసింది. వెంటపడ్డాడు కీచకుడు. అలా పరిగెత్తి నేరుగా విరాటరాజు కొలువులోనికే వచ్చేసింది. కీచకుడూ ఆగలేదు.

నిండు సభ. ధర్మరాజూ, భీముడూ అక్కడే ఉన్నారు. 'మహారాజా! చూడండి. ఈ కీచకుడి దురాగతం. నా భర్తలు చాలా గొప్పవాళ్ళు. పరాక్రమవంతులు. అయితేనేం? ఒక్కరూ నన్ను కాపాడడానికి రాలేకపోయారు' అంది ఎత్తిపొడుస్తూ.

విరాటరాజు కీచకుణ్ణి దండించలేక ఏదోలా సర్ది చెప్పి పంపివేసి 'సైరంధ్రీ! నువ్వు కూడా అంతఃపురానికి వెళ్ళు' అని ఆమెనూ పంపి వేశాడు.

అవమానభారంతో తిరిగి అంతఃపురానికి వెళ్ళింది ద్రౌపది.

సుధేష్ణ ఏమీ ఎరగనట్టు 'మాలినీ! ఏమయ్యింది?' అని అడిగింది. జరిగినదంతా చెప్పింది ద్రౌపది. 'అంత పని చేశాడా? ఉండు వాడికి తగిన బుద్ధి చెబుతాను' అంది. దానికి ద్రౌపది 'మీకా శ్రమ అక్కర్లేదు. మహావీరులైన నా భర్తలే మీ తమ్ముడికి బుద్ధి చెప్తారు లెండి!' అంది.

అర్ధరాత్రి భీముడు ఉండే వంటశాలలోనికి వెళ్ళింది ద్రౌపది. 'ఆ కీచకుణ్ణి చంపకపోతే నాకు మరణమే శరణ్యం' అంది ఆవేశంగా.

భీముడు ఆమెను చూసి చలించిపోయాడు. కీచకుడిపై పగతో రగిలిపోయాడు. గుట్టుచప్పుడు కాకుండా వాణ్ణి మట్టుపెట్టే ఉపాయం ఒకటి చెప్పి ఆమెను అక్కణ్ణుంచి పంపివేశాడు.

***

అది నర్తనశాల. రాత్రి కావడంతో నిర్మానుష్యంగా ఉంది. భీముడు ముందుగానే సైరంధ్రిలా ముస్తాబై నర్తనశాలలో హంస తూలికా తల్పంపై కూర్చున్నాడు. ద్రౌపది అక్కడే ఒక ప్రక్కగా దాక్కొని ఉంది. ఇది వీళ్ళిద్దరి పన్నాగమే!

ద్రౌపది కీచకుడితో ప్రేమగా మాట్లాడి, అతణ్ణి నమ్మించి ఒంటరిగా రమ్మని కోరింది. అందుకే ఉత్సాహంగా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు కీచకుడు. అతడు మందిరంలోనికి రాగానే దీపం చల్లారిపోయింది. చుట్టూ చీకటి. మంచంపై కూర్చొని సైరంధ్రి భుజంపై చెయ్యి వేశాడు. అంతే! భీముడు మెరుపువేగంతో వాణ్ణి రెండు చేతులతో ఎత్తి నేల మీదకు విసిరి కొట్టాడు. ఏం జరిగిందో తెలుసుకోవడానికి కూడా వాడికి కొంచెం సమయం పట్టినా వెంటనే తేరుకొని తిరగపడ్డాడు.

గుట్టుచప్పుడు కాకుండా ఒకరినొకరు పొడుచుకుంటూ, కుమ్ముకుంటూ, గుద్దుకుంటూ యుద్ధం చేశారు. చివరికి భీముడు వాడి ఆయువుపట్లలో కొట్టి మరీ దారుణంగా చంపాడు. తెరచాటున ఉన్న ద్రౌపది వచ్చి చూసింది. ఆమె కళ్ళు ఆనందంతో విప్పారాయి.

'గంధర్వులైన నా భర్తలే ఈ కీచకుణ్ణి వధించారు' అని చెప్పింది ద్రౌపది. అందరూ నమ్మారు. ఉపకీచకులు తండ్రికి దహన సంస్కారాలు చేస్తున్నారు. అప్పుడు సుధేష్ణతో పాటూ సైరంధ్రి కూడా వచ్చింది. ఆమెను ఉపకీచకులు బంధించారు. ఆమెను కూడా కీచకుడి శవంతో కలిపి దహనం చెయ్యాలని వాళ్ళ ఆలోచన. ఇంతలో ద్రౌపది తన గంధర్వ భర్తల్ని గట్టిగా అరిచి మరీ పిలిచింది. భీముడు మారువేషంలో శ్మశానానికి వచ్చి, ఒక పెద్ద చెట్టును పెళ్ళగించి నిలబడ్డాడు. అతడి భీకరరూపాన్ని చూసి ఒక్కడుంటే ఒట్టు. చివరికి ఉపకీచకులు 105 మందీ ముందుకు వచ్చి భీముడి చేతుల్లో చచ్చారు.

కీచక, ఉపకీచకుల మరణానికి కారణం సైరంధ్రే కాబట్టి ఆమెను రాజ్యం విడిచి వెళ్ళి పొమ్మంది సుధేష్ణ. ద్రౌపది పదమూడు రోజులు గడువు కోరింది.

కీచకుడి మరణవార్త దుర్యోధనుడికి చేరింది. అప్పటికే పాండవుల ఆచూకీ కోసం గూఢచారుల్ని పంపి గాలిస్తున్నాడు దుర్యోధనుడు. ఇప్పుడీ వార్త. పాండవులు బతికే ఉన్నారో! మరణించారో తెలియడం లేదు. 'పాండవులు మరణించడం కల్ల' అన్నాడు ద్రోణుడు. 'ధర్మరాజు ఏ రాజ్యంలో ఉంటే ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. అలాంటి రాజ్యమేదో గుర్తించి అక్కడ ప్రయత్నం చెయ్యి' అన్నాడు భీష్ముడు. అప్పుడు దుర్యోధనుడు –

'సభాసదులారా! భూలోకంలో ఉన్న మహాబలవంతుల్లో కీచకుడు, బలరాముడు, శల్యుడు, భీముడు గొప్పవాళ్ళు. వీళ్ళను ఇతరులు గెలవలేరు. వీళ్ళను వీళ్ళే ఓడించగలరు. అయితే శల్యుడు, బలరాముడు, కీచకుడికి దూరంగా ఉన్నారు. అందువల్ల వాళ్ళు కీచకుణ్ణి చంపే అవకాశం లేదు. ఇక మిగిలింది భీముడే! కాబట్టి కీచకుణ్ణి చంపింది భీముడే కావచ్చు. పైగా విరాట రాజ్యం సుభిక్షంగా ఉంది. ధర్మరాజు అక్కడే ఉండి ఉంటాడు. ఆ సైరంధ్రి ద్రౌపది అయి ఉంటుంది. ఇక ఆలస్యం చెయ్యవద్దు. విరాటరాజు రాజ్యంపైకి సైన్యంతో వెళ్ళి అతడి గోవులను అపహరిద్దాం. అప్పుడు పాండవుల బండారం బయటపడుతుంది. ఒకవేళ అలా జరగకపోతే మనకు గోసంపదైనా దక్కుతుంది' అన్నాడు.

## దక్షిణగోగ్రహణం

వెంటనే త్రిగర్తరాజు సుశర్మ 'ప్రభూ! పూర్వం కీచకుడు నన్ను అవమానించాడు. ఇప్పుడు అవకాశం వచ్చింది. నన్ను పంపండి' అన్నాడు ఆవేశంగా.

దుర్యోధనుడు వ్యూహం పన్నాడు. సుశర్మ అష్టమినాడు దక్షిణ గోగ్రహణం, దుర్యోధనుడు నవమినాడు ఉత్తరగోగ్రహణం చేస్తారు.

పథకం ప్రకారం సుశర్మ దాడి చేశాడు. అతడి ధాటికి తాళలేక గోసంరక్షకులందరూ లబోదిబోమంటూ విరాటరాజుకు మొరపెట్టుకున్నారు. వెంటనే

విరాటరాజు సైన్యాన్ని సిద్ధం చేశాడు. అక్కడే ఉన్న కంకుభట్టు (ధర్మరాజు) రాజుగారి అనుమతితో మారువేషాల్లో ఉన్న భీమ, నకుల సహదేవుల్ని కూడా యుద్ధానికి పిలిపించాడు.

యుద్ధంలో విరాటరాజు నిరాయుధుడయ్యాడు. సుశర్మ అతణ్ణి బంధించి రథంపై తీసుకుపోతుంటే పాండవులు అడ్డుపడి సుశర్మనీ, అతడి సైన్యాన్ని తరిమి తరిమి కొట్టారు. తమ గోవుల్ని విడిపించారు. అప్పటికే రాత్రి అయ్యింది. ఒక చోట విశ్రమించారు.

## ఉత్తరగోగ్రహణం

తెల్లవారడంతోనే దుర్యోధనుడు భీష్మద్రోణ కర్ణాది వీరులతో విరాటరాజ్యానికి ఉత్తరం వైపున సైన్యంతో విరుచుకుపడ్డాడు. ఆవుల్ని తరలించుకుపోసాగాడు.

ఆ వార్త అంతఃపురంలో కలకలం రేపింది. విరాటరాజు కుమారుడు ఉత్తరకుమారుడు అది విని ప్రగల్భాలు పలికాడు. వెంటనే బయలుదేరి కౌరవ సైన్యాన్ని జయించి వస్తానని తెగ కోతలు కోయడం మొదలుపెట్టాడు.

అప్పుడు అక్కడే ఉన్న సైరంధ్రి 'మన నాట్యాచార్యులు బృహన్నలవారిని మీ రథసారథిగా తీసుకువెళ్లండి' అని ఉత్తరకుమారుడితో చెప్పింది. సమయానికి ఏ సారథీ లేకపోవడంతో బృహన్నలతో బయలుదేరాడు ఉత్తర కుమారుడు.

రథం నగరానికి వెలుపల ఒక శ్మశానం దగ్గర ఆగింది. దూరంగా కౌరవ సైన్యం. చూడగానే ముచ్చెమటలు పోశాయి ఉత్తరకుమారుడికి.

'బృహన్నలా! రథాన్ని వెనక్కి పోనియ్యి' అన్నాడు తడబడుతూ. కానీ బృహన్నల రథాన్ని ముందుకే నడిపించాడు. రథం నుండి దూకి పరుగు లంఘించుకున్నాడు ఉత్తరకుమారుడు. మొత్తానికి అర్జునుడు అతణ్ణి పట్టుకొని ధైర్యం చెప్పి, 'యుద్ధం నేను చేస్తాను గానీ నువ్వు సారథిగా ఉండు. ముందు రథాన్ని ఆ జమ్మిచెట్టు దగ్గరకు పోనియ్యి' అన్నాడు. పోనిచ్చాడు ఉత్తరకుమారుడు. 'ఏదీ! ఆ చెట్టు ఎక్కి అక్కడ మా ఆయుధాలు ఉంటాయి. అందులో నా గాండీవం అందుకో!' అన్నాడు.

ఆయుధాల మూట శవంలా కన్పించింది దూరంనుంచి. వెళ్ళనన్నాడు ఉత్తరుడు. 'వెళ్ళు నీకే తెలుస్తుంది' అని పంపాడు బృహన్నల.

ఆశ్చర్యం! వెళ్ళి చూస్తే నిజంగా అవి ఆయుధాలే. 'అందులో ఒక ధనువు ఉంటుంది. దాని పేరు గాండీవం. దానిని తీసుకురా' అన్నాడు బృహన్నల. తీసుకువచ్చాడు ఉత్తరుడు.

'బృహన్నలా? ఎవరివి ఈ ఆయుధాలు? అసలు నువ్వు ఎవరు?' అని అడిగాడు ఉత్తరుడు. అప్పటికే అజ్ఞాతవాసం సమయం పూర్తయ్యింది. అందుకే తమ వివరాలు చెప్పాడు అర్జునుడు.

ఉత్తరకుమారుడు నిరుత్తరుడై అర్జునుడి పాదాలకు నమస్కరించాడు.

గాండీవంతో పాటు కవచాన్నీ, ఖడ్గాన్నీ ధరించి, ఇంద్రుణ్ణి తలుచుకున్నాడు అర్జునుడు. కిరీటమూ, కుండలాలు వచ్చి అమరిపోయాయి. అగ్నిదేవుణ్ణి స్మరించాడు. కపిధ్వజం వచ్చింది. దేవదత్తం అనే శంఖమూ చేతిలో నిలిచింది.

దేవదత్తాన్ని పూరించాడు అర్జునుడు. రథం వేగంగా కౌరవ సైన్యం వైపు దూసుకుపోయింది.

అదుగో! వచ్చేవాడు అర్జునుడే!

**శా. సింగం బాఁకటితో గుహాంతరమునం జేద్పాటుమై నుండి మా**
**తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చు నో**
**జం గాంతార నివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ**
**చ్చెం గుంతీసుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్**

**(విరాట: 4-95)**

ఒక గుహలోపల విపరీతమైన ఆకలితో ఉన్న సింహానికి ఏనుగుల గుంపు కనిపిస్తే అది ఎంత వేగంగా మీదికి విరుచుకుపడుతుందో అలాగే ఇప్పటిదాకా వనవాసకష్టాలు పడి పడీ ఉన్న అర్జునుడు మన సేనపై విరుచుకుపడుతున్నాడు అన్నాడు ద్రోణుడు.

'భళీ! అజ్ఞాతవాసం భగ్నం అయ్యింది' అన్నాడు సుయోధనుడు ఆనందంగా.

వెంటనే భీష్ముడు 'సుయోధనా! వాళ్ళ అజ్ఞాతవాసం గడువు ఎప్పుడో తీరిపోయింది. అర్జునుడు అంత తెలివితక్కువ వాడేమీ కాదు. ముందు అతణ్ణి ఎలా ఎదుర్కోవాలో ఆలోచించు.'

**ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు రా**
**లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే?**
**హెచ్చుగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా**
**కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్' (234)**

వచ్చినవాడు ఫల్గుణుడు. తప్పకుండా గెలుస్తామని అనుకోకూడదు. రాజ్యలక్ష్మికోసం యుద్ధం చేస్తే రెండుబలాలూ గెలవడం ఎన్నటికీ జరగదు. కాబట్టి దుఃఖం కలగకుండా ఉండాలంటే సంధి చేసుకోవడమే ఉత్తమం' అన్నాడు.

అర్జునుడు వస్తూ వస్తూనే విలు విద్యా సంప్రదాయంలో ద్రోణ, భీష్మ, కృపాచార్యుల పాదాల చెంత రెండు రెండు బాణాలు వేసి నమస్కరించాడు. ఆపైన రథాన్ని గోవులవైపు తిప్పి, వాటికి రక్షణగా ఉన్న కౌరవ సైన్యాన్ని క్షణాల్లో మట్టుపెట్టి, గోవుల్ని తమ రాజ్యంవైపుకు మళ్ళించాడు.

ఎందుకైనా మంచిదని భీష్ముడు ఒక పావువంతు సైన్యాన్నిచ్చి దుర్యోధనుణ్ణి హస్తిన వైపు పంపించాడు. అలా వెళ్తున్న సుయోధనుణ్ణి చూసిన అర్జునుడు విరుచుకు పడ్డాడు. అది చూసి భీష్మాది వీరులూ దుర్యోధనుణ్ణి రక్షించడానికి వచ్చారు. ముందుగా కర్ణుడు అడ్డుపడ్డాడు. చివరికి అర్జునుడి ధాటికి తట్టుకోలేక పారిపోయాడు. ఆ తరువాత భీష్ముడు. అతడూ మూర్ఛపోయాడు.

పారిపోతున్న దుర్యోధనుణ్ణి మాటలతో రెచ్చగొట్టాడు అర్జునుడు. వెంటనే రథాన్ని వెనక్కి తిప్పి అర్జునుడిపైకి దాడి చేశాడు. ద్రోణాది వీరులు అతడికి అండగా నిలిచారు. వెంటనే అర్జునుడు సమ్మోహనాస్త్రం వేయడం అందరూ మూర్ఛపోవడం రెప్పపాటులో జరిగిపోయాయి.

ఉత్తరకుమారుణ్ణి పంపి కౌరవవీరుల తలపాగాలలో ఉన్న కుచ్చుల్ని తెమ్మన్నాడు అర్జునుడు. భీష్ముడిది మాత్రం వద్దన్నాడు. వాటిని తెమ్మని ఉత్తర కోరింది. తరువాత గోవుల్ని తరలించుకొంటూ విరాటనగరానికి వచ్చేశాడు.

కొద్దిసేపటికి గానీ తేరుకోలేదు కౌరవవీరులు. 'పదండి! ఆ అర్జునుణ్ణి వెంబడించండి' అని అరిచాడు దుర్యోధనుడు వీరావేశంగా.

వెంటనే భీష్ముడు కలుగజేసుకొని 'చాలు! ఇప్పటిదాకా జరిగింది చాలు! అర్జునుడు దయతలిచాడు కాబట్టి మనల్ని చంపకుండా వదిలివేశాడు. పదండి' అంటూ అందర్నీ హస్తిన బాట పట్టించాడు.

అక్కడ విరాటరాజు ముందుగానే నగరానికి వచ్చి జరిగినదంతా తెలుసుకొని కంగారు పడుతున్నాడు. అంతలో శుభవార్త! 'రాకుమారుడు ఉత్తరకుమారుడు విజయుడై తిరిగివస్తున్నాడు' అని. విరాటరాజు మనసు ఆనందంతో పరవళ్ళు తొక్కింది. ఆ విజయాన్ని నగరమంతా ఆనందోత్సాహాలతో జరుపుకుంటోంది. తానూ ఆ ఆనందాన్ని పంచుకోవాలని కంకుభట్టును పిలిచి జూదమాడడం మొదలుపెట్టాడు. ఆడుతూ ఆడుతూ మధ్యలో తన కుమారుడి వీరత్వాన్ని పొగడడం ప్రారంభించాడు.

ఆ మాటలకు కంకుడు అడ్డుతగిలి 'రాజా! బృహన్నల వల్ల నీ కుమారుడికి ఆ ఘనత లభించింది' అన్నాడు. అంతే! రాజుకు కోపం వచ్చింది. చేతిలో ఉన్న పాచికల్ని కంకుడి ముఖంపై విసిరికొట్టాడు. అవి కంకుడి తలకు గట్టిగా తగిలాయి. రక్తం కారసాగింది.

పక్కనే ఉన్న సైరంధ్రి కంకుడి రక్తాన్ని కింద పడనివ్వకుండా వస్త్రంతో తుడిచింది. 'ఏం చేస్తున్నావు?' అన్నాడు విరాటరాజు. దానికి సైరంధ్రి 'ఈ మహానుభావుడి రక్తం ఎన్ని బొట్లు భూమ్మీద పడితే, ఆ ప్రదేశంలో అన్ని సంవత్సరాలు వర్షాలు పడవు. అందుకే తుడిచాను' అంది.

అంతలో ఉత్తరకుమారుడు అక్కడికి వచ్చి, పక్కనే ఉన్న ధర్మరాజును గుర్తించి నమస్కరించాడు. ధర్మరాజు తలకు తగిలిన గాయాన్ని చూసి, దానికి కారణమైన తన తండ్రి చేత ధర్మరాజుకు క్షమాపణలు చెప్పించాడు.

యుద్ధంలో తనకొక వీరుడు సహాయం చేశాడనీ, రేపో మాపో అతడిని నీకు చూపిస్తాననీ చెప్పాడు ఉత్తరకుమారుడు తన తండ్రితో.

అర్జునుడు మళ్ళీ బృహన్నలలా వెళ్ళి కౌరవుల తల పాగా కుచ్చులు ఉత్తరకు ఇచ్చాడు. ఆమె ఎంతగానో మురిసిపోయింది.

ఆ మరునాడు విరాటరాజు కొలువులోనికి పాండవులు రాజకుమారుల దుస్తులు ధరించి వెళ్ళారు. ధర్మరాజు నేరుగా వెళ్ళి సింహాసనంపై కూర్చున్నాడు. అది చూసి విరాటరాజు ఆగ్రహించేలోగా పక్కనే ఉన్న అర్జునుడు 'ఈ మహానుభావుడు ఎవరో కాదు. సాక్షాత్తు ధర్మరాజు' అన్నాడు. అక్కడే ఉన్న ఉత్తరుడు 'నాన్నగారూ! ఇతడే అర్జునుడు. నాకు యుద్ధంలో సహాయం చేసిన బృహన్నల' అన్నాడు. భీముడూ, నకుల సహదేవులూ, ద్రౌపది అందరూ తమ అసలు రూపాల్లో కనిపించారు.

పాండవుల్నీ, ద్రౌపదినీ ఘనంగా సత్కరించాడు విరాటరాజు. తన కుమార్తె ఉత్తర నిచ్చి అర్జునుడితో వివాహం జరిపించి, బంధుత్వం కలుపుకుంటానన్నాడు. అప్పుడు అర్జునుడు 'ఉత్తర నా శిష్యురాలు. నాకు కూతురుతో సమానం. అందుకే కోడల్ని చేసుకుంటాను' అన్నాడు.

ఒక శుభముహూర్తంలో ఉత్తర – అభిమన్యుల వివాహం కన్నుల పండుగగా జరిగింది.

# ఉద్యోగపర్వం

విరాటరాజు సభ.

పాండవులు, శ్రీకృష్ణుడు, బలరాముడు ఇంకా మిత్ర రాజులూ ఉండగా శ్రీకృష్ణుడు 'మిత్రులారా! పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేశారు. ధర్మబద్ధంగా వాళ్ళ రాజ్యం వాళ్లకి కౌరవులు ఇచ్చారా సరేసరి! లేకపోతే యుద్ధం తప్పదు. అయితే పాండవులకు తగినంత సైన్యం లేదు. కాబట్టి మనమంతా అండగా నిలవాలి. మనమే ముందు కయ్యానికి కాలు దువ్వకూడదు. ఒక దూతను పంపి అర్ధరాజ్యం ఇవ్వమని అడుగుదాం! కాదంటారా? అప్పుడు ఆలోచిద్దాం! ఏమంటారు?' అన్నాడు.

వెంటనే బలరాముడు 'శ్రీకృష్ణుడు చెప్పినది బాగానే ఉంది. జూదంలో పోగొట్టుకున్న దాన్నే పాండవులు ఇప్పుడు అడుగుతున్నారు. దుర్యోధనుడు ఒప్పుకుంటాడనే అనుకుందాం! అసలు చెప్పాలంటే ధర్మరాజు సరిగ్గా జూదం ఆడలేకపోయాడు. దుర్యోధనుడు చూడండి! తనకు ఆడడం సరిగ్గా రాదని తన మామ శకుని చేత ఆడించాడు. శకుని మహాఘటికుడు. ధర్మరాజును చిత్తుగా ఓడించాడు. ఇందులో దుర్యోధనుడి తప్పేముంది? అంతమాత్రానికే అతడు అధర్మపరుడని నిందించలేం' అన్నాడు.

వెంటనే సాత్యకి బలరాముడి మాటల్ని ఖండిస్తూ 'పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యాన్ని కౌరవులు ఇచ్చారా! సరేసరి! లేకపోతే యుద్ధం చేసి గెలుచుకోవడమే వీరుల లక్షణం' అన్నాడు. ద్రుపదుడూ సాత్యకి మాటల్ని సమర్థించాడు.

ఇలా అందరూ చర్చించుకొని ద్రుపద పురోహితుణ్ణి కౌరవుల దగ్గరకు దూతగా పంపాలని నిశ్చయించుకున్నారు. మరోవైపు మిత్రరాజులందరికీ

వర్తమానాలు పంపి, సైన్యాన్ని సమీకరించడంలో మునిగిపోయాడు ద్రుపదుడు. అక్కడ దుర్యోధనుడూ ఆ పని మీదే ఉన్నాడు.

శ్రీకృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకొని ద్వారకానగరానికి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళ తరువాత శ్రీకృష్ణుణ్ణి స్వయంగా కలిసి, యుద్ధంలో అతడి సహకారం కోరడానికి అర్జునుడు ద్వారకకు బయలుదేరాడు. అదే సమయానికి దుర్యోధనుడు హస్తినాపురం నుండి ద్వారకకు వచ్చాడు.

శయనమందిరంలో నిద్ర పోతున్నాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు, దుర్యోధనుడు ఒకేసారి అక్కడికి వచ్చారు. నిద్రపోతున్న శ్రీకృష్ణుణ్ని లేపడం ఇష్టం లేక ఇద్దరూ వేచి ఉన్నారు.

దుర్యోధనుడు శ్రీకృష్ణుడికి తలవైపు ఉన్న సింహాసనంపై కూర్చొంటే, అర్జునుడు పాదాలవైపు ఉన్న ఆసనంపై కూర్చున్నాడు. కొంతసేపటి తర్వాత నిద్రలేచాడు శ్రీకృష్ణుడు. ముందుగా అర్జునుణ్ణి చూసి 'బావా! ఎప్పుడు వచ్చావు' అన్నాడు. వెంటనే దుర్యోధనుడు 'బావా! ఇటు! ముందు వచ్చింది నేను' అన్నాడు కొంచెం బింకంగా. మళ్లీ తనే –

'ఇద్దరూ వచ్చింది యుద్ధంలో సాయం కోసమే! అయితే ముందు నేను వచ్చాను కాబట్టి నాకు సాయం చేయటం ధర్మం' అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు 'సుయోధనా! ఆగు ఆగు. నువ్వు ముందు వచ్చావు. కానీ నేను ముందు చూసింది అర్జునుణ్ణి. సరే! నేను ఇద్దరికీ సాయం చేస్తాను. నా సైన్యాన్ని రెండు భాగాలు చేస్తున్నాను. నేను ఒక్కడినీ ఒకవైపు. నాతో సమానమైన బలపరాక్రమాలు కల నారాయణ గోపాలక సైన్యం పదివేలమంది ఒకవైపు. నేను ఆయుధం పట్టను. యుద్ధం చేయను. కేవలం సలహాలే ఇస్తాను. ఈ రెండింటిలో ఏది కావాలో మీరే కోరుకోవాలి. అయితే లోకన్యాయం ప్రకారం 'మొదటి అవకాశం బాలుడైన అర్జునుడికే!' అన్నాడు.

అప్పుడు అర్జునుడు నమస్కరించి 'బావా! నాకు నువ్వే కావాలి' అన్నాడు నిస్సంకోచంగా.

హమ్మయ్య! అనుకున్నాడు దుర్యోధనుడు. తృప్తిగా బయలుదేరి బలరాముడి ఇంటికి వెళ్ళిపోయాడు. అతణ్ణీ సాయం అడిగాడు. కానీ బలరాముడు ఎవరికీ సాయం చేయనన్నాడు. తరువాత కృతవర్మను కలిసి అతడి నుండి ఒక అక్షౌహిణి సైన్యాన్ని సాయంగా పొంది హస్తినాపురానికి వెళ్ళిపోయాడు.

శయనమందిరంలో శ్రీకృష్ణుడు 'అర్జునా! నన్నెందుకు కోరుకున్నావయ్యా!' అని అడిగాడు. దానికి అర్జునుడు 'శ్రీకృష్ణా! నిజానికి నాకు యుద్ధంలో సహాయం అక్కర్లేదు. నువ్వు యుద్ధం చేస్తే మాకు పేరెలా వస్తుంది? పైగా ప్రతిపక్షంలో నువ్వు ఉంటే నిన్ను గెలవడం కష్టం. నువ్వు నా పక్కన ఉంటే ఉత్సాహం. నాకు రథసారథిగా ఉండు. అదే పది వేలు' అని ప్రార్థించాడు.

## శల్యుడు

శల్యుడి సహాయం కోరుతూ ధర్మరాజు దూతలను పంపాడు. శల్యుడు వెంటనే బయలుదేరాడు. ఆ విషయం తెలిసి దుర్యోధనుడు మార్గమధ్యంలోనే అతణ్ణి కలిసి, సకల మర్యాదలూ ఘనంగా చేశాడు. అయితే ఇదంతా తాను చేస్తున్నట్లు తెలియనివ్వకుండా దుర్యోధనుడు జాగ్రత్త పడ్డాడు. శల్యుడు ఆనందంతో 'ఈ ఏర్పాట్లన్నీ చేసిన వాడికి వరం ఇవ్వాలని ఉంది' అన్నాడు. అంతే! అతడి ముందు ప్రత్యక్షమయ్యాడు దుర్యోధనుడు. రాబోయే యుద్ధంలో తన పక్షంలో ఉండి సహకరించమని కోరాడు. శల్యుడు అంగీకరించి, 'ఎలాగూ బయలుదేరాను కదా! పాండవుల్ని ఒకసారి పలకరించి నీ వద్దకే వస్తాను' అని ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల్ని కలిశాడు. జరిగిన విషయం చెప్పాడు. అప్పుడు ధర్మరాజు 'అయ్యా! మీరు కౌరవపక్షంలో కర్ణుడికి సారథిగా ఉంటూ అతణ్ని మాటలతో నిరుత్సాహపరచండి. ఇదే మీరు మాకు అక్కణ్నుంచి చేసే సాయం' అన్నాడు. సరేనన్నాడు శల్యుడు.

సాత్యకి, ధృష్టకేతుడు, సహదేవుడు, ద్రుపదుడు, విరాటుడు మొదలైన రాజుల సైన్యంతో కలిపి పాండవుల సైన్యం మొత్తం ఏడు అక్షౌహిణులు. కౌరవుల సైన్యం 11 అక్షౌహిణులు.

కౌరవసభ. ధృతరాష్ట్రుడు కొలువు తీరి ఉన్నాడు. కౌరవ ప్రముఖులంతా సమావేశమై ఉన్న ఆ సభకు ద్రుపద పురోహితుడు వచ్చి 'రాజా! పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలు ముగించుకొని ఉపప్లావ్యంలో ఉన్నారు. వారి రాజ్యభాగం వారికి ఇస్తే వాళ్ళు సంధికి సిద్ధమని చెప్పారు. మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అన్నాడు స్పష్టంగా.

భీష్ముడు వెంటనే 'బావుంది! పాండవులు సంధి కోరడం శుభసూచకం. ఒప్పుకోవడం మంచిది' అన్నాడు. కర్ణుడు దాన్ని ఖండించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు కల్పించుకొని 'సరే! మేము ఆలోచించుకొని ఒక దూతను పంపుతాం. మీరు వెళ్ళవచ్చు' అన్నాడు.

అన్నట్టుగానే కొన్నిరోజుల తర్వాత ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి పిలిచి, రాజ్యం ఊసు ఎత్తకుండా, పాండవులు యుద్ధం చేయకుండా పని చక్కబెట్టుకు రమ్మని పంపించాడు.

## సంజయ రాయబారం

ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల వద్దకు వచ్చాడు సంజయుడు. ధృతరాష్ట్రుడు పాండవుల కుశలమడిగినట్లు చెప్పాడు. శ్రీకృష్ణుడితో సహా పాండవుల మిత్రులందరూ అక్కడే ఉన్నారు. అప్పుడు 'ధర్మనందనా! జరిగింది ఘోరమే! కాదనను. నువ్వు ధర్మరాజువి. యుద్ధం వల్ల కలిగే జయాపజయాలు ఇరువంశాలకీ నష్టాన్నే కలిగిస్తాయి. అంతమందిని చంపి సంపాదించే రాజ్యం నీకు సుఖాన్ని కలిగిస్తుందా చెప్పు! యుద్ధమే గనక వస్తే నీవైపు పెట్టని కోటలాగా శ్రీకృష్ణుడున్నాడు. యుద్ధంలో కార్చిచ్చులాగా చెలరేగిపోయే భీమార్జునులు ఉన్నారు. ఇంకా గొప్ప గొప్ప వీరులు ఉన్నారు. అటువైపు కూడా భీష్మ, ద్రోణ, కర్ణాది వీరులు ఉన్నారు. ఇంతటి హేమాహేమీలు వ్యర్థంగా యుద్ధానికి సిద్ధపడుతూ ఉంటే నేను సహించలేకపోతున్నాను. అందుకే ధర్మరాజా! నువ్వు శాంతించాలి' అన్నాడు.

దానికి ధర్మరాజు 'సంజయా! నా ఉద్దేశమూ అదే! మా రాజ్యాన్ని మాకు ధర్మబద్ధంగా ఇస్తే యుద్ధం ఎందుకు చేస్తాం? అయినా మమ్మల్ని ఆదరించే పెద్ద మనసు ధృతరాష్ట్రుడికి ఉందా? ఆ రోజే విదురుడి మాట విని, జూదాన్ని ఆపి

ఉంటే ఇన్ని అనర్థాలు జరిగేవా? కథ ఇంతవరకూ వచ్చేదా? భీష్మ ద్రోణాదులు మహావీరులని చెప్తున్నావే! అంటే వాళ్ళని మేము గెలవలేమనేగా నీ ఉద్దేశం! న్యాయంగా మా రాజ్యం మాకు ఇస్తే అందరికీ మంచిది' అన్నాడు స్పష్టంగా.

ధర్మరాజు మాటలకు సంజయుడు 'ధర్మరాజా! ఎదుటివాళ్ళు చేసింది తప్పే. కాదనను. కానీ వాళ్ళని క్షమించే దయాగుణం నీకు ఉంది. అలాంటి నువ్వే కోపగిస్తే ఎలా?

**కం. పాలీక కౌరవులు దు**
**శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ జెప్పెద రుధిరా**
**భీలాన్నంబునకంటెను**
**మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్ (ఉద్యోగ: 1-329)**

రాజ్యభాగాన్ని ఇవ్వకుండా కౌరవులు చెడుప్రవర్తనతో నాశనమై పోవాలని కోరుకొంటే కోరుకోవచ్చుగాక! కానీ మీలాంటి నడవడి గల వాళ్ళకు రక్తంతో కూడిన భయంకరమైన అన్నం కంటే భిక్షాన్నం మేలు కదూ!' అన్నాడు తెలివిగా.

వెంటనే ధర్మరాజు 'సంజయా! ధర్మాధర్మాలను తెలుసుకోవడం అంత సులభం కాదు. నన్ను నిందించాలనుకొంటే ముందు నేను చేసేది అధర్మమని నిరూపించు. **అహింసను పాటించాలి. కోపాన్ని నిగ్రహించుకోవాలి. కానీ పాపాత్ముల్ని, లోకాన్ని పీడించేవారినీ వధించడం కూడా ధర్మమే.** అసలు యుద్ధం క్షత్రియధర్మమా కాదా? మన మధ్య ఇన్ని మాటలెందుకు? శ్రీకృష్ణుడు ఇక్కడే ఉన్నాడుగా, ఏది చేయవచ్చో ఏది చేయకూడదో అతడే నిర్ణయిస్తాడు. అతడి మాటే మాకు వేదవాక్కు' అంటూ శ్రీకృష్ణుణ్ణి అడిగాడు.

శ్రీకృష్ణుడు చిద్విలాసంగా నవ్వుతూ 'సంజయా! నీ రాయబారం చాలా బాగుంది. కౌరవులు రాజ్యం ఇవ్వరనీ, అయినా పాండవులు యుద్ధం చేయకూడదనీ కర్రా విరగకుండా పామూ చావకుండా తెలివిగా చెప్పావు. మా ధర్మరాజు ఏమన్నాడో విన్నావుగా. ఆ మాటల్ని బట్టి సంధి కుదరడం కష్టమే! ఇంత జరిగాక పాండవులు న్యాయంగా తమకు రావలసిన దానికోసం పోరాడడం అధర్మమెలా అవుతుంది? అయినా ధర్మం ఆ కౌరవులకు ఉండక్కర్లేదా? పాండవులకేనా? సరే! పాండవుల

పక్షాన నేనే మీ వద్దకి వస్తాను. ఇరుపక్షాలవారికీ మంచి జరిగేలా మాట్లాడతాను. వెళ్ళు. వెళ్ళి మీ ప్రభువులకు ఇది చెప్పు' అన్నాడు.

చివరిగా ధర్మరాజు 'సంజయా! మేము చివరిదాకా శాంతినే కోరుకుంటున్నాం. మా రాజ్యం మొత్తం మాకు ఇవ్వకపోయినా కుశస్థలం, ఇంద్రప్రస్థం, వృకస్థలం, వాసంతం, వారణావతాలలో దేనినిచ్చినా చాలు. అదీ కాకపోతే మా అయిదుగురికీ అయిదు ఊళ్ళు ఇచ్చినా చాలు. ఇలా చేస్తే అందరికీ శాంతి. ఈ మాట నామాటగా మహారాజుతో చెప్పు' అని పంపాడు.

***

'మహారాజా! నా ప్రయత్నం నేను చేసివచ్చాను. ధర్మరాజు మెత్తటి పులి. ఆ పులి చెలరేగిపోతే ఎవరూ ఆపలేరు' అని సంజయుడు ధృతరాష్ట్రుడికి తన రాయబార సారాంశం క్లుప్తంగా నివేదించి వెళ్ళిపోయాడు.

ధృతరాష్ట్రుడి మనసు మనసులో లేదు. వెంటనే విదురుణ్ణి పిలిపించుకున్నాడు. విదురుడు వచ్చాడు. 'విదురా! సంజయుడు వచ్చి నన్ను నిందించాడు. మిగిలిన విషయాలన్నీ రేపు సభలో చెప్తానని వెళ్ళిపోయాడు. నా మనసు ఏదోలా ఉంది. నిద్ర పట్టడం లేదు'. అన్నాడు దీనంగా. అప్పుడు విదురుడు –

## విదురనీతి

రాజా! లోకంలో ఎవరికి నిద్రపట్టదో తెలుసా?!

**కం. బలవంతుఁడు పైనెత్తిన**
**బలహీనుఁడు, ధనము గోలుపడిన యతఁడు, ద్రు**
**చ్చిల వేచువాఁడు, గామా**
**కులచిత్తుఁడు, నిద్రలేక కుందుదు రధిపా! (ఉద్యోగ: 2-21)**

**బలవంతుడు దాడి చేసినప్పుడు బలహీనుడికీ, ధనం పోగొట్టుకొన్న వాడికీ, దొంగతనం చేయాలని వేచి ఉండేవాడికీ, కామంతో కలత చెందేవాడికీ నిద్ర పట్టదు.** ఇందులో నువ్వు ఏ వర్గానికి చెందుతావో చెప్పు' అన్నాడు.

'ఏమోగానీ, ధర్మరాజు ఏమన్నాడో తెలియక నాకీ బాధ' అన్నాడు ధృతరాష్ట్రుడు.

'రాజా! న్యాయంగా పాండవుల రాజ్యాన్ని వాళ్ళకు ఇవ్వండి. మీకీ అవస్థ తప్పుతుంది' అన్నాడు.

'సరే విదురా! రేపు సభలో సంజయుడు ఏం చెబుతాడో విని, తగిన నిర్ణయం తీసుకుంటాను' అన్నాడు. అప్పుడు విదురుడు 'మహారాజా! **లోకంలో అందరూ కలిసి ఉండాలి. ఇతరుల సంపదను ఆశించకూడదు. కోపం, గర్వం, అసహనం, అసంతృప్తి, దురహంకారం, అకృత్యాలు ఇవన్నీ చెడ్డవారి లక్షణాలు.**

**కం. జనులకు నొడబాటగు విధ**
**మున నడచుచు, లోకనింద్యముల నుడుగుచు, మీ**
**దని యొకని కలిమి కులుకక,**
**మనుజులతో బొంది పొసగి మను టొప్పు నృపా! (ఉద్యో: 2-31)**

**రాజా! అందరికీ ఇష్టమైన తీరులో నడవాలి. అందరూ తిట్టే పనులు వదలాలి. తనకంటే మేలుగా ఉన్న ఇతరుల సంపదని చూచి ఈర్ష్యపడకూడదు. జనులందరితో కలిసి మెలిసి బ్రతకటం మంచిది.**

**కం. ధనమును, విద్యయు వంశం**
**బును, దుర్మతులకు మదంబుఁ బొనరించును స**
**జ్జనులైన వారి కడఁకువ**
**యును, వినయము నివియ తెచ్చు నుర్వీనాథా! (ఉద్యోగ: 2-35)**

**ధనం, విద్య, వంశం అనే మూడూ చెడ్డవాళ్ళకి మదాన్ని కలిగిస్తే, మంచివాళ్ళకి అణకువను, వినయాన్నీ పెంపొందింపజేస్తాయి.**

**తే.గీ. ఒకటిఁగొని రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి**
**మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి**
**యేనిటిని గెల్చి యాఱింటి నెఱిఁగి యేడు**
**విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు (ఉద్యో: 2-37)**

ప్రభుత్వం అనే ఒకదానిని స్వీకరించి, మంత్రమూ ఉత్సాహమూ అనే రెంటినీ చేర్చి కదలనీయకుండా ఉంచి, మిత్రులు, శత్రువులు, తటస్థులు అనే మూడురకాలవారినీ, సామ, దాన, భేద, దండాలనే నాలుగు ఉపాయాలతో పూర్తిగా వశపరుచుకొని, చర్మం, కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు అనే అయిదు ఇంద్రియాలను జయించి, సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, ఆశ్రయం అనే ఆరింటినీ తెలుసుకొని, స్త్రీ, జూదం, పానం, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం ధనదుర్వినియోగం అనే ఏడు వ్యసనాలనూ విడిచి ప్రవర్తించే వాడే వివేకం అనే ధనం కలవాడు.

**కం. పురుషుండు రెండు దెఱఁగుల**
**ధర నుత్తముఁ డనఁగ బరఁగు దానెయ్యెడలం**
**బరుసములు పలుకకునికిన్**
**దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్ (ఉద్యోగ: 2- 41)**

**లోకంలో పరుషాలను పలుకకుండా, పాపాలు చేయకుండా ఉండేవాడే ఉత్తముడు. ఇక సహనంగా ఉన్నవాణ్ణి అందరూ 'చేతకానివాడు' అంటారు. కాని ఆ క్షమాగుణమే అందరికీ గొప్ప ఆభరణం. ఉత్తములు కావాలంటే ఈ గుణం ఉండాలి. తనకు గొప్పతనం ఉన్నా ఓర్పుగా శాంతంగా ఉండేవాడూ, పేదవాడే అయినా ఉన్న దాంట్లోనే ఆదరంగా దానం చేసేవాడూ పుణ్యపురుషుడు.**

**తే.గీ. వెలది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు**
**ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము**
**సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేఁత**
**యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల (ఉద్యోగ: 2-44)**

**స్త్రీవాంఛ, జూదం, మద్యపానం, వేట, నోటిదురుసు, దండపారుష్యం, వృథాగా ధనాన్ని ఖర్చు చేయడం - ఈ ఏడూ సప్తవ్యసనాలు. తగిన వేషం, ఆత్మస్తుతి చేసుకోకపోవడం తాను బాధపడినా సరే ఎదుటి వారిని నొప్పించకుండా ఉండడం, దానం చేసిన తర్వాత బాధపడకుండడం, ఎంతకష్టమైనా మంచిదారిని విడువకపోవడం వ్యక్తిత్వానికి వన్నె తెస్తాయి.**

పరుల సంపదను, విద్యను, తేజస్సును, బలాన్ని చూసి సహించలేనివాడు ఏ రోగం లేకపోయినా బాధపడుతూనే ఉంటాడు.

కం. నడవడి యను మున్నీటిం
గడవం బెట్టంగ నోడకరణిం దగి, తా
నొడఁ గూడుననిన, సత్యము
గడచిన గుణమింక నొందు గలదే యరయన్ (ఉద్యోగ: 2-39)

నడవడి అనే సముద్రాన్ని దాటించడానికి సత్యం ఓడ వంటిది. ఎంత వెదకి చూసినా దానిని మించిన గుణం మరొకటి ఉందా?

ఆ.వె. పాడి దప్పకుండఁ బడయు సొమ్ములకు న
పాత్రములకు నీగి, పాత్రములకుఁ
బెట్టకునికి, యనగ నెట్టన రెండు వి
ధముల గీడు దొడరు ధరణినాథ! (ఉద్యోగ: 2-43)

రాజా! న్యాయం తప్పకుండా సంపాదించిన ధనం అయోగ్యులకు ఇవ్వటం, యోగ్యులకు ఇవ్వకపోవటం అనే రెండు రూపాల్లో నశించిపోతుంది.

కం. చెలిమియు, సంభాషణమును
బలిమి వివాదంబు, ద్రోపు, బాడియు, దమయం
తలవారితోన తగు, నధి
కుల హీనులతోడనైనఁ గొరగా వధిపా! (ఉద్యోగ: 2-46)

స్నేహం, సంభాషణం, బలమైన వివాదం, కలహం, వ్యవహారం అనే వాటిని సాటివారితోనే చేయాలి. ఎక్కువవారితో గానీ, తక్కువవారితో గానీ చేస్తే ఫలానికి రావు.

తే. కొంచెమైనను దగఁ బంచి కుదువ మేలు
పనులయెడ దుఃఖమోర్చి యల్పంబు సుఖము
ననుభవించుట హితము, శత్రునకు నైన
నిచ్చుటయ లెస్స యడిగిన యెడ నృపాల! (ఉద్యోగ: 2-47)

ప్రభూ! తనకున్నది కొంచెమైనా నలుగురితో పంచుకొని తినాలి. పనుల విషయంలో కష్టాలకు తట్టుకొని, లభించిన అల్పసుఖాన్ని అనుభవించటం మంచిది. అడిగితే పగవానికి కూడ ఇవ్వటమే మేలు.

ఆ.వె. తనియఁ బడకుండ మును గోసికొనఁ జవి
చేటె కాదు విత్తు చేటు గలుగుఁ,
బక్వమైనఁ గొనిన ఫలమించుఁ, జెడదు బీ
జంబు, గార్యసిద్ధి చందమిట్లు (ఉద్యోగ: **2-56**)

బాగా పండక ముందు కాయ కోస్తే రుచే కాదు, విత్తనం కూడ చెడిపోతుంది. పండిన పిదప తీసుకుంటే పండు రుచిగా ఉంటుంది. విత్తనమూ చెడదు. కార్యం సిద్ధించటం ఇలా ఉంటుంది.

తే. మాలకరి పుష్పములు గోయు మాడ్కిఁ, దేటి
పువ్వుదేనియ గొనియెడు పోల్కి, నెదురు
గందకుండంగఁ గొనునది కార్యఫలము
బొగ్గులకు బోలె మొదలంట బొదువఁ జనదు (ఉద్యోగ: **2-57**)

పూమాలలు అల్లేవాడు పువ్వులు ఎలా కోస్తాడో, తుమ్మెద పూదేనె ఎలా గ్రహిస్తుందో ఆ విధంగా అవతలివారు కందిపోకుండా కార్యఫలాన్ని గ్రహించాలి. అంతేకాని బొగ్గుల కోసం అన్నట్లు మొదలు నరికెయ్యకూడదు.

కం. ఎదిరికి హితమును బ్రియమును
మది కింపును గాగ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స, యటుగా
కిది యది యన కూరకునికి యెంతయు నొప్పున్ (ఉద్యోగ:**2-59**)

మనం పలికే పలుకు ఎదుటివానికి మేలు చేకూర్చేదిగా ఉండాలి. విన్నవెంటనే హాయిగా ఉంది అనిపించాలి. మనస్సుకు ఇంపుగా ఉండాలి. అలాంటి పలుకులు ఎన్నైనా మంచివే. అలా పలక లేకపోతే అసలు మాట్లాడకుండటం ఎంతోమేలు.

కం. బెడిదముగఁ గత్తిఁ గొడ్డటఁ
బొడువఁ దెగిన మ్రానఁ జిగురు వొడముఁ బలుకులం
జెడఁ దునిసిన కార్యంబు ని
గుడనేరదు పిదప నెట్టుఁ గురువంశనిధీ! (ఉద్యోగ: 2-61)

కత్తితోనో, గొడ్డలితోనో నరికిన మాను ఎప్పటికైనా చివురిస్తుందేమో కానీ కఠినమైన మాటలతో చెరిచిన పని ఎప్పటికీ ఫలవంతం కాదు. రాజా! బాధపడకండి. బాధవల్ల బలం నశిస్తుంది. అందం పోతుంది. మనసు చలించి పోతుంది. రోగాలు కమ్ముకువస్తాయి. ఇన్ని జరిగితే శత్రువులు సంతోషిస్తారు.

నియమంతో కూడిన తపస్సు, ఇంద్రియనిగ్రహం, విద్య - మనశ్శాంతి నిస్తాయి. లోభమనే దుర్గుణాన్ని విడిచిపెడితే అంతకన్నా శాంతి మరొకటి లేదు.

కం. తనువున విరిగిన యలుగుల
ననువునఁ బుచ్చంగవచ్చు, నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా! (ఉద్యోగ:2-62)

రాజా! దేహంలో గ్రుచ్చుకొన్న బాణాలను ఏదో ఉపాయంతో తీసివేయవచ్చు. కానీ మహాకఠినంగా హృదయంలో దిగబడిన మాటలు ఎన్ని ఉపాయాలతోనూ వెలుపలికి రావు.

ఆ.వె. చేటుకాలమైనఁ జెట్టమాటలు నెరి
గాని తెరువు వట్టు కర్జములను
దగినయట్ల తోచుఁ, దగియెడునవి యవి
నీతులని మనంబు నిశ్చయించు (ఉద్యోగ: 2-64)

వినాశకాలం దాపురిస్తే చెడ్డమాటలూ, అధోగతికి త్రోసివేసే పనులూ మంచిగానే కనిపిస్తాయి. మంచివాటిని నీతిమాలినవిగా మనస్సు నిశ్చయిస్తుంది.

ఆ.వె. సకలపుణ్య కర్మచయమును నొకడెన
విసుము, పాడి దప్పకునికి యొక్క
దిక్కు, దీని శ్రుతులు తెలిపెడు నెడ బాడి
కలిమి యెందు బెద్దగా నుతించె (ఉద్యోగ:2-66)

రాజా! విను సృష్టిలో ఉన్న పుణ్యకార్యాలన్నీ ఒక ఎత్తు. న్యాయం తప్పక పోవటం ఒక ఎత్తు. ఈ విషయం ప్రసక్తికి వచ్చినప్పుడు వేదాలు న్యాయాన్ని పాటించడమే మంచిదని గొప్పదని వేయినోళ్ళతో కొనియాడాయి.

తే.గీ. పాడి గలిగిన నిహలోక ఫలము లెల్ల
జేరుటయ కాద, కీర్తియు నొందు బురుషు
ధరణి బొగడిత యెందాక బరగు, నంత
కాలమును బుణ్యలోకంబు గల్గు దంద్రు (ఉద్యోగ: 2-67)

మనిషి, న్యాయం తప్పకుండా ఉంటే ఈ లోకంలో ఫలితాలన్నీ పొందటమే కాదు, కీర్తి కూడా పొందుతాడు. భూమిలో కీర్తి ఎంతదాకా నిలుస్తుందో అంతకాలం పుణ్యలోకాలు కలుగుతాయి అంటారు.

కం. పాపంబులుకర్జములని
యేపునఁ జేయంగ నవియు నింపగు, ధర్మ
వ్యాపారంబు లకార్యము
లై పరిణితిఁ బొందె నేని నట్టుల చెల్లున్ (ఉద్యోగ: 2-69)

పాపాలు చేయవచ్చు అని పొగరెక్కి ఉంటే అవే రుచిగా ఉంటాయి. ధర్మకార్యాలు చేయరానివిగా మనస్సులో నిర్ణయం కలిగితే అవీ అలాంటివే అనిపిస్తాయి.

చ. అది సభయే ప్రియం బెసగ నార్యులు నిల్వరయేని; నార్యులే
మది దలపంగ వారలు సమంచిత ధర్మము పల్కరేని; న
ట్టిదియును ధర్మవే తగ ఘటించిన నిక్కము లేదయేని; దాఁ
బదిలపు నిక్కమే యొక నెపంబిదు చొప్పుగునేని భూవరా! (ఉద్యోగ:2-70)

రాజా! ఆర్యులు ఉండని సభ, సభ కాదు. చక్కని ధర్మాన్ని చెప్పనివారు ఆర్యులు కారు. సత్యంలేని ధర్మం ధర్మం కాదు. ఏదో ఒక నెపంతో కూడుకుంటే ఆ సత్యం సత్యం కాదు.

కం. కారణము లేకయును నుప
కారపరత్వమున నొరుల కార్యంబులకున్
వారని యలజడిఁ బడియెడు
వారల చూ యేడుగడయు వారికి నధిపా! (ఉద్యోగ: **2-76**)

ఓ చక్రవర్తీ! ఆ పాండవులు దిక్కులేని వారనుకోకు. ఏ కారణం లేకుండా ఉపకారం చేయటమే ధర్మంగా పెట్టుకొన్న మహాత్ములు లోకంలో ఉంటారు. అలాంటివారు ఇలాంటి వారికోసం హృదయంలో తీరని ఆవేదన చెందుతూ ఉంటారు. వారే వీరికి సర్వరక్ష.

ఆ.వె. బ్రదుకు చేటు, పొగడువడుట దూరొందుట
యీగి వేడుకొనుట, యిట్లు మరియు
గలుగు సౌఖ్య దుఃఖములు వచ్చు నెడపడి
వాని కింత యేల వగవ నధిప! (ఉద్యోగ: **2-79**)

ఒకప్పుడు సుఖంగా బ్రతుకుతాం. ఒకప్పుడు చెడుబ్రతుకు దాపురిస్తుంది. ఒకప్పుడు అందరూ కొనియాడుతారు. మరొకప్పుడు నిందవస్తుంది. ఒకప్పుడు దానాలు ఇవ్వగలుగుతాం. మరొకవేళ అడుగుకోవలసివస్తుంది. ఇలా ఎన్నో సుఖదుఃఖాలు వస్తూ ఉంటాయి. వానికోసం ఇంతగా కుమిలి పోవటం ఎందుకు?

కం. అలమికొని యొండొరుల ప్రో
పులఁ బ్రాపుల నెలమి కలిమి బొంది బహుజ్ఞా
తులు నెమ్మి గూడి తామర
కొలని క్రియన్ సిరికిఁ బట్టగుదు రుజ్జ్వలులై (ఉద్యోగ: **2-87**)

**చుట్టాలను ఒకరినొకరు దగ్గరకు చేర్చుకోవాలి. రక్షించుకోవాలి. ఆశ్రయం ఇవ్వాలి. ప్రేమాదరాలతో ఒక్కటిగా మెలగాలి. అలా ఉంటే తామర కొలనులాగా తేజస్సుతో సిరితో వెలిగిపోతారు.**

**కం. దైవంబ నేర్చుగా కిటు**
**పోవగ నే నేర్తు నేరఁ బొమ్మని పలుకం**
**గా వశమె నరున కెక్కుడు**
**దైవము పౌరుషముకంటె ధరణీనాథా! (ఉద్యోగ: 2-99)**

**రాజా! అంతా దైవాధీనం. మానవుడు ఇది నాకు సాధ్యం, ఇది అసాధ్యం అని అహంకరించి పలుకగలడా? పౌరుషం కంటే దైవమే గొప్పది.**

***

తరువాత రోజు నిండు సభలో సంజయుడు అన్నీ వివరంగా చెప్పాడు. సంజయుడి మాటలు విన్న తరువాత భీష్ముడు, ద్రోణుడు పాండవుల్ని జయించడం కష్టమనీ సంధి చేసుకోవడమే మంచిదనీ హితవు పలికారు.

అన్నీ విన్న ధృతరాష్ట్రుడు 'మనవాళ్ళకు ఇష్టమైతే సంధి చెయ్యి సంజయా!' అన్నాడు.

ఆ మాటలకు దుర్యోధనుడు మండిపడుతూ 'మహారాజా! మనవైపూ వీరులు ఎందరో ఉన్నారు. ఇప్పుడు సంధి చేసుకుంటే పాండవులకు భయపడ్డామని లోకం అనుకుంటుంది. అందుకే సంధి కుదరదు' అన్నాడు నిష్కర్షగా. ధృతరాష్ట్రుడు నచ్చజెప్పాడు. అతడు వినలేదు. దానికి కర్ణుడు వత్తాసు పలికాడు. యుద్ధంలో అర్జునుణ్ణి మట్టిగరిపిస్తానని బీరాలు పేలాడు.

కర్ణుడి డాంబికాలు భీష్ముడికి నచ్చలేదు. 'ఉత్తరగోగ్రహణంలో ఏమయ్యింది నీ ప్రతాపం! చాలించు నీ ప్రలాపాలు' అన్నాడు. దానికి కర్ణుడు నొచ్చుకొని ఈ భీష్ముడు ఆయుధం పట్టినంతవరకూ నేను యుద్ధరంగంలో అడుగుపెట్టను' అని ప్రతిజ్ఞ చేశాడు.

సభ ముగిసింది. అందరూ వెళ్ళిపోయారు. ధృతరాష్ట్రుడికి యుద్ధంలో తన కొడుకే గెలుస్తాడని నమ్మకం. అయినా బలాబలాలు ఏమిటో? ఎవరు గెలుస్తారో చెప్పమని సంజయుణ్ణి అడిగాడు ధృతరాష్ట్రుడు.

గాంధారినీ వేదవ్యాసుణ్ణీ పిలిపించి వారి సమక్షంలోనే **'సత్యం ఉన్నచోట శ్రీకృష్ణుడు ఉంటాడు. అతడు ఉన్న చోట జయం ఉంటుంది' అని నిర్మొహమాటంగా చెప్పాడు సంజయుడు.**

## ధర్మరాజు వేడుకోలు

ఇక్కడ ధర్మరాజు తన తమ్ముళ్ళతోనూ సామంత రాజులతోనూ సమావేశమై 'మనం శ్రీకృష్ణుడిని రాయబారానికి పంపుదాం. యుద్ధాన్ని వారిద్దాం. ఒకరిని ఒకరు చంపుకునే దురవస్థను తప్పిద్దాం' అన్నాడు.

అందరూ ద్వారకకు వెళ్ళారు 'శ్రీకృష్ణా! మా తండ్రి పాండురాజు నిన్ను మాకు పెద్ద దిక్కుగా చూపించాడు. నువ్వు మాకు మిత్రుడివి. నువ్వే సుయోధనుడిని సంధికి ఒప్పించాలి. మమ్మల్ని నీ పుత్రుడు ప్రద్యుమ్నుడితో సమానంగా చూసి రక్షించు.

శ్రీకృష్ణా! మా తండ్రి ఆలోచనా సుయోధనుడి నిర్ణయం సంజయుడి ద్వారా తెలిసింది. మమ్మల్ని బుజ్జగించి రాజ్యం ఇవ్వకుండా ఉండాలని చూస్తున్నారు. మేము ధర్మాన్ని అనుసరించాం. అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తి చేశాం. మా తండ్రి ధృతరాష్ట్రుడు తన కుమారుడిపై ఉన్న దురభిమానం కారణంగా అతడి వక్రబుద్ధిని మాన్పలేకపోతున్నాడు. ఇదే మాకు ఆపదలను తెచ్చి పెట్టింది. మా తల్లికీ బంధు మిత్రులకూ ఆనందం కలిగించేలా సంధి కుదర్చకుండా ఊరుకోవటం పౌరుషం అనిపించుకోదు.

వాసుదేవా! నాడు నిండు సభలో ఐదు ఊళ్ళు ఇచ్చినా చాలు అని చెప్పాను. కానీ సుయోధనుడు అదీ ఇస్తాడో లేదో! నాకు యుద్ధం చేయడానికి మనస్కరించడం లేదు. కానీ నన్ను ఆశ్రయించిన వారిని పోషించవలసిన బాధ్యత నాకు ఉంది. కాబట్టి సంధి అవసరం ఎంతైనా ఉంది.

శ్రీకృష్ణా! యుద్ధం తప్ప వేరే మార్గమే లేదా? కౌరవపక్షంలో ఉన్న మా బంధువులనూ మిత్రులనూ రాజ్యం కోసం చంపడం ధర్మమేనా? క్షాత్రధర్మం ఇంత కష్టమైనదా? యుద్ధం చేస్తే రాజ్యం వస్తుంది కానీ వంశం నశించిపోతుందే! అలా అని పరధర్మం ఆచరించలేం కదా. అలా ఆచరించకూడదని పెద్దలు చెప్తారు కదా! యుద్ధంచేస్తే ప్రాణహాని జరుగుతుంది కాబట్టి అది నా అభిమతం కాదు. యుద్ధంలో గెలువవచ్చు ఓడిపోనూ వచ్చు. ఓటమి మరణం కంటే వేదన. యుద్ధం జోలికి వెళ్ళకుండా పనులు చక్కపరచుకునే వాడికే ఎక్కువ సుఖం.

**ఆ.వె. పగయ కలిగె నేనిఁ బాము న్న యింటిలో**
**నున్న యట్లకాక యూఱడిల్లి**
**యుండు నెట్లు చిత్త మొకమాటుఁ గావున**
**వలవ దధిక దీర్ఘ వైరవృత్తి**

**చ. పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం**
**బగ? వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం**
**దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే**
**మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!**

**(ఉద్యోగ: 3-20, 21)**

పగ ఉంటే పాము ఉన్న ఇంటిలో ఉన్నట్లే. మనసు కుదుట పడదు. కాబట్టి దీర్ఘకాలం పగతో ఉండకూడదు.దానిని అణచడమే శ్రేయస్కరం.పగను పగతో అణచి వేయడం కష్టం. పగతో ఉంటే ఎదుర్కోకుండా మాట్లాడకుండా ఉండగలమా! పగను నిర్మూలించాలంటే క్రూరంగా ప్రవర్తించాలి. పగ వల్ల కీడే కాని మేలు జరగదు.కాబట్టిశాంతియుతంగా కార్యాన్ని చక్క పెట్టడం మంచిది. మంచిగా చెప్తే వింటారా సరే సరి! వినరా!మందలించి అయినా కార్యం చక్కపెట్టు. మనకు ముఖ్యం కురువృద్ధులు. కాబట్టి దుర్యోధనుడు పరుషంగా మాట్లాడినా సహించు. నీ మాట మాకు శిరోధార్యం.

సుయోధనుడు దుర్మార్గుడు. ఎంతకైనా తెగిస్తాడు. నీ మాటలు లక్ష్య పెట్టడు. నీకు కష్టం కలిగించేది దేవేంద్ర పదవైనా నాకు వద్దు. కాబట్టి ఒంటరిగా వెళ్ళకు' అన్నాడు.

ధర్మజుడి మాటలు విన్న శ్రీకృష్ణుడు 'ధర్మజా! దుర్యోధనుడే కాదు. అతడి తండ్రీ అలాంటివాడే. నీ ఆందోళన నాకు తెలుసు. నాకే గనక కోపం వస్తే అక్కడ ఎవరైనా మిగులుతారా! ఆనాడు సంజయుడి అభిప్రాయం విన్నాను. ఇప్పుడు నువ్వు చెప్పిందీ విన్నాను. నువ్వు ధర్మనిష్ఠుడివి. వారేమో విరోధం వదిలి పెట్టరు. భీష్మ, ద్రోణులు వారి వైపు ఉన్నారని వారికి గర్వం. మీరెందుకు వారికి అణిగి మణిగి ఉండాలి! అక్రమంగా రాజ్యం అనుభవిస్తున్నది వాళ్ళు. అన్యాయానికీ, అధర్మానికీ జంకరు. నువ్వు సందేహించకుండా యుద్ధం చేసి, శత్రువులను జయించి రాజ్యాన్ని కైవశం చేసుకో! కీర్తి గడించు. వారికి ఈనాటికీ పశ్చాత్తాపం లేదు. అలాంటి వారిపై నువ్వు కరుణ చూపడం అనవసరం. వాళ్ళు అన్నమాటలు నా నోటితో తిరిగి చెప్పలేను. పాపాత్ములైన వాళ్ళని పాముల్ని చంపినట్లు చంపడమే కర్తవ్యం.

సరే! నువ్వు కురువృద్ధులైన భీష్మ, ద్రోణ, కృపాచార్యులకు భక్తి ప్రపత్తులతో ఉండు. నీ తరఫున నేను నీ సత్ప్రవర్తననూ, వినయ విధేయతలనూ, ధర్మనిరతినీ కౌరవ సభలో అందరికీ తెలియచేస్తాను. నా మాటలు వినకుండా దుర్యోధనుడు అధర్మంగా మాట్లాడినా, ధృతరాష్ట్రుడు ఊరుకున్నా సభలోని వారు వారినే ఛీకొడతారు. మనకు కావలసింది కూడా అదే కదా! ధర్మజా! నా శక్తి కొద్దీ సంధి ప్రయత్నాలు చేస్తాను. సంధి కుదిరితే మేలే! సంధి చెడినా వారి మనోభావాలు మనకు తెలుస్తాయి. వారి యుద్ధ ప్రయత్నాలు, బలాబలాలు తెలుసు కోవడం మంచిదే కదా!

సుయోధనుడు తన దేహంలో ప్రాణం ఉన్నంత వరకు నీకు రాజ్యంలో భాగం ఇవ్వడు. కాబట్టి నువ్వు కూడా యుద్ధ సన్నాహాలలో ఉండు' అన్నాడు.

## భీముడితో పరిహాసం

ఆ మాటలు విన్న భీమసేనుడు 'యుద్ధం యుద్ధం అంటూ మమ్మ భయపెట్టకు శ్రీకృష్ణా! మాట్లాడితే సుయోధనుడు మాతో కయ్యానికి కాలు దువ్వుతుంటాడు. మా అన్నగారి మాటకు తలవంచి సంధికి అంగీకరిస్తున్నాం కానీ యుద్ధం చెయ్యలేకా కాదు చేతకాకా కాదు. కలసి ఉంటే కలదు సుఖం'అన్నాడు.

ఆమాటలకు శ్రీకృష్ణుడు 'ఏమిటి భీమసేనా ! నువ్వేనా? అగ్ని చల్లారినట్లూ, పర్వతం తేలికైపోయినట్లూ కనిపిస్తోందే! అసలు నీ సంకల్పం ఏమిటో మర్చిపోయావా ! యుద్ధం చేసి మీ అన్నకి రాజ్యం కట్టబెట్టడమే లక్ష్యంగా కలవాడివి నువ్వు. భయం అంటే ఎరగని నీ నోట ఇలా పిరికి మాటలా' అంటూ నవ్వగానే భీముడికి కోపం వచ్చి 'నా శక్తి ఏమిటో తెలియక మాట్లాడుతున్నావు. నాకు కోపం వస్తే భూమ్యాకాశాలు ఏకం చేస్తాను' అన్నాడు.

శ్రీకృష్ణుడు 'భీమసేనా! ఆగాగు. అంతటి ఘనుడవే! ఏదో పరిహాసానికి. అంతే! నువ్వు పక్కన లేకపోతే మాకు విజయం ఎక్కడిది? యుద్ధమే వస్తే మాకందరికీ నువ్వే దిక్కు సుమా' అన్నాడు నవ్వుతూ.

ఆ తరువాత అర్జునుడు 'వాసుదేవా! మా అన్న ధర్మరాజు చెప్పిన తరువాత నేను చెప్పటానికి ఏముంది? నువ్వే మాకు మార్గదర్శకుడివి. నువ్వు తలపెట్టిన ఏ కార్యమైనా దిగ్విజయం ఔతుంది'. అన్నాడు.

తరువాత నకులుడు 'శ్రీకృష్ణా! మా అన్నయ్యల మాటలే మాకు వేదవాక్కులు. వనవాస కాలంలో ఉన్నంత ఆవేశం ఇప్పుడు లేదు. వాళ్ళు తప్పు చేశారని మనమూ చేస్తామా! నీమాటలు వారిలో పరివర్తన తీసుకువస్తాయన్న నమ్మకం నాకు ఉంది అన్నాడు.

అన్నీ విన్న సహదేవుడు మాత్రం 'శ్రీకృష్ణా! భీమార్జునులే తమ పరాక్రమం విడిచిపెట్టి ఇలా దీనంగా మాట్లాడడం బాగుందా! కౌరవులు విసిరిపారేసిన బిచ్చపు కూడు మనకు రుచిస్తుందా! యుద్ధమే శరణ్యం.కాబట్టి నా మాటగా సుయోధనునికి

'సుయోధనా! మాకు రాజ్యభాగం ఇవ్వక తప్పదు. లేకుంటే నీకు చావు తప్పదు' అని చెప్పమన్నాడు.

సహదేవుడి మాటలకు సాత్యకి పొంగిపోతూ 'అవును. ఇక్కడ ఉన్న రాజులకు కూడా యుద్ధమే ఇష్టం' అన్నాడు. అతడి మాటలకు అందరూ హర్షధ్వానాలు చేశారు.

## ద్రౌపది అవేదన

తరువాత ద్రౌపది వచ్చింది. 'మా రాజ్యాన్ని అపహరించారు. మమ్మల్ని అడవులకు పంపారు. అది చాలక సంజయుడి ఊరడింపు ఒకటి! ఆ మాటలకు ధర్మరాజు పొంగిపోవడమూ ఐదు ఊళ్ళు ఇచ్చినా చాలు అనడమూనూ. ఏమిటీ వింత? పాండవులంతటి పిరికి వాళ్ళు, అసమర్థులు, అవివేకులు, సిగ్గులేని వారు లేరని లోకం నిందించదా!వారి ఆగడాలు సహించి ఊరుకోవడానికి పాండవులేమైనా బ్రాహ్మణులా! ఒకవేళ సంధి కుదరక పోతే పాండవులు యుద్ధం చేస్తారో మళ్ళీ అడవులకే పోతారో వారికే తెలియాలి. నాకు తోచింది చెప్పాను. మీకు తోచింది చెయ్యండి.

**చం. వరమున బుట్టితిన్, భరతవంశము జొచ్చితి, నందు బాండు భూ**
**వరునకు గోడలైతి జనవంద్యుల బొందితి, నీతి విక్రమ**
**స్థిరులగు పుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్**
**సరసిజనాభ! యిన్నిట ప్రశస్తికి నెక్కిన దాన నెంతయున్**

**(ఉద్యోగ: 3-108)**

నేను వరంవల్ల పుట్టాను. భరత వంశం మెట్టాను. పాండురాజుకు కోడలు అయ్యాను. లోకవంద్యులైన భర్తలను పొందాను. నీతిమంతులు, పరాక్రమవంతులైన పుత్రులను కన్నాను. నీ చెల్లెలు సుభద్ర కంటే ఎక్కువగా నీ అభిమానాన్ని పొందాను. కృష్ణా!అలాంటి నన్ను రాజసూయ యాగానంతరం అవభృథస్నానం చేసిన నన్ను కొప్పు పట్టుకుని సభలోకి ఈడ్చి వలువలు లాగాడు. లోకంలో మరే స్త్రీ కైనా ఇటువంటి అవమానం జరిగిందా? అప్పుడు వీళ్ళంతా నోరుమూసుకొని ఉంటే

నువ్వే కదా! నన్ను రక్షించావు. ఈ సంగతి నువ్వు గుర్తుంచుకొని సంధి గురించి మాట్లాడు అంటూ ద్రౌపది ఒక్కసారిగా –

ఉ. **ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెంద్రుకల్**
**దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో**
**నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్**
**గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై**

**(ఉద్యోగ: 3-114)**

తన కొప్పు విప్పింది. పొడవైన వెంద్రుకలు నల్లగా నిగనిగలాడే మహాభుజంగంలా వేళ్ళాడుతూ ఉంటే వాటిని కుడి చేత్తో పట్టుకొని మనసులో ఒకపక్క రోషం మరో పక్క విషాదం పొంగుతూ ఉంటే కన్నీరు కారుతూ ఉండగా దిగ్గన లేచి ఆర్తితో –

క. **'ఇవి దుస్ససేను వ్రేళ్ళం**
**దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి; కౌ**
**రవుల కడఁ దీఋమాటల**
**యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్ (ఉద్యోగ:3-116)**

'శ్రీకృష్ణా! ఈ శిరోజాలు ఆనాడు దుశ్శాసనుడి చేతిలో చిక్కి సగం తెగిపోగా మిగిలినవి. కౌరవులవద్ద సంధిగురించి మాట్లాడేటప్పుడు వీటిని గుర్తుపెట్టుకో. నా కురులు పట్టి ఈడ్చిన వాడి చేతులు యుద్ధభూమిలో తెగిపడినప్పుడే నాకు మనశ్శాంతి. నేను ధర్మరాజు కలిసి సుయోధనుడి శవాన్ని కళ్ళారా చూడకపోతే అర్జునుడి గాండీవం ఎందుకు? తగులబెట్టనా! మహావీరులైన భర్తలూ నీలాంటి అన్న అండగా ఉండగా పరాభవం అనే అగ్నిని ఇంకా ఎన్నాళ్ళు ఒడిలో నేను పెట్టుకోవాలో నువ్వే చెప్పు?'అని ద్రౌపది నిట్టూర్పు విడిచింది.

ఆ మాటలకు కృష్ణుడు ద్రౌపదితో 'అమ్మా! కౌరవులు ఎలాగూ మనకు రాజ్యభాగం ఇవ్వరు. కాబట్టి నువ్వు అనుకున్నట్లు యుద్ధమే జరుగుతుంది. ఇప్పటి వరకు నువ్వు అనుభవించిన దుఃఖం కంటే అధికమైన దుఃఖాన్ని ఆ కౌరవకాంతలు

అనుభవించే రోజు ఎంతో దూరంలో లేదు. యమునిమహిషపు లోహఘంటల చప్పుళ్ళు వినే కౌరవుల చెవులకు నా మాటలు ఎలా వినిపిస్తాయి? కాబట్టి యుద్ధం తప్పదు. నువ్వు నిశ్చింతగా ఉండు'అని ఊరడించాడు.

## శ్రీకృష్ణుడి హస్తిన ప్రయాణం

అర్జునుడు 'శ్రీకృష్ణా! ఇరువర్గాలకూ మేలు చెయ్యి. ఇదే నేను కోరేది' అన్నాడు.

ధర్మజుడు 'శ్రీకృష్ణా! నీ జన్మ నక్షత్రం రోహిణి. రేపు రేవతి నక్షత్రం. నీకు చంద్రబలం తారాబలం బాగుంది కాబట్టి రేపే బయలుదేరు' అన్నాడు.

శ్రీకృష్ణుడు సాత్యకిని పిలిచి తన ఆయుధాలను రథంలో పెట్టించమన్నాడు. యాదవులలో తన వెంట రావలసిన వారిని నిర్ణయించాడు. దారుకుని పిలిచి రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు.

సాత్యకిని చూసి 'సాత్యకీ! కౌరవులు కుటిలబుద్ధులు. నువ్వు కూడా నా వెంట రా!' అని హస్తినకు పయనమయ్యాడు.

పాండవులు ఊరి చివరివరకూ వచ్చి సాగనంపడంతో శ్రీకృష్ణుడి రథం హస్తినవైపు సాగిపోయింది.

దారిలో శ్రీకృష్ణుడు కుశస్థలిలో విడిది చేశాడు. అది తెలిసి అక్కణ్ణుంచి సుయోధనుడు స్వాగత సన్నాహాలు చేస్తున్నాడు. ధృతరాష్ట్రుడు విదురుడితో 'విదురా! శ్రీకృష్ణుడికి విడిది ఎక్కడ చేస్తే బావుంటుంది? అతడికి ఏవి కానుకలుగా ఇవ్వాలి?' అని అడిగాడు.

విదురుడు 'రాజా! పాండవులకు ఐదంటే అయిదు ఊళ్ళు కూడా ఇవ్వలేని మనం శ్రీకృష్ణునికి కానుకలు ఇవ్వగలమా? నీ మనసు అర్థమయ్యింది. శ్రీకృష్ణుడు కానుకలకు లొంగడు. ఈ ఆలోచనతో నువ్వు ఎంత తెలివి తక్కువ వాడివో అర్థమయ్యింది! మేరు పర్వతాన్ని ఇచ్చినా శ్రీకృష్ణుడు అర్జుడిని విడిచిపెట్టడు. కాబట్టి నువ్వు శ్రీకృష్ణుడి కాళ్ళకు నీళ్ళిచ్చి కుశల మడిగితే చాలు. శ్రీకృష్ణుడు ఏ పనిమీద వస్తున్నాడో అది నెరవేర్చడం తప్ప వేరేమీ శ్రీకృష్ణుడికి అక్కర్లేదు. ఇచ్చినా అది అతడికి నచ్చదు'అన్నాడు.

సుయోధనుడు 'తండ్రీ! విదురుడు సరిగానే చెప్పాడు. మనం ఏమిచ్చినా ఇవ్వకపోయినా శ్రీకృష్ణుడు పాండవులను విడిచిపెట్టడు కదా! ఇచ్చి లాభం ఏముంది? మనకు అపకీర్తి తప్ప' అన్నాడు.

భీష్ముడు కల్పించుకొని 'రాజా! నువ్వు కానుకలు ఇస్తే ఒకరకంగా ఇవ్వకపోతే ఒకరకంగా చేసేవాడు కాడు శ్రీకృష్ణుడు. అతడి మాట వినడం వచ్చిన పనిని సఫలం చేసి పంపడమే నీ బాధ్యత' అన్నాడు.

మళ్ళీ సుయోధనుడు 'శ్రీకృష్ణుడిని ఇక్కడే బంధించి కారాగారంలో పెడితే పాండవులు రెక్కలు తెగిన పక్షులౌతారు. యాదవులు, పాంచాలురూ మనపక్షమే వహిస్తారు. అందుకు నేను అంతా సిద్ధం చేస్తున్నాను. ఇక మీరేం చేస్తారో చెయ్యండి' అన్నాడు.

అతడి మాటలకు అంతా నిర్ఘాంత పోయారు.

ధృతరాష్ట్రుడు 'సుయోధనా!నీకు మతి భ్రమించ లేదు కదా! శ్రీకృష్ణుడు మన దూత. దూతను మర్యాద చెయ్యాలి. బంధించకూడదు. అయినా అతడు ఏం అపరాధం చేశాడని' అన్నాడు.

'రాజా! నీ కుమారుడు అన్నంత పనీ చేస్తే సర్వనాశనం ఔతాడు. ఇక నేను ఇక్కడ ఉండలేను' అని భీష్ముడు వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణుడు తనకు స్వాగతం చెప్పిన వారిని గౌరవించి వారిలో తన మిత్రుడైన కృతవర్మను తన వెంట బెట్టుకుని హస్తినలోనికి ప్రవేశించాడు. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడికి ఎదురేగి కౌగిలించుకున్నాడు. శ్రీకృష్ణుడు భీష్మ, ద్రోణ, కృపాచార్యులకు నమస్కరించి ధృతరాష్ట్రుడి అనుమతితో విదురుడి మందిరానికి వెళ్ళాడు. అక్కడ విదురుడితో పాండవులను గురించిన విషయాలు కొంత సేపు చర్చించి తరువాత కుంతీదేవి మందిరానికి వెళ్ళాడు.

కుంతీదేవి తన మేనల్లుడిని చూసి బోరున ఏడ్చేసింది అందరి యోగక్షేమాలు అడిగి 'భుజబలంతో జీవించడమే క్షత్రియ ధర్మమనీ అలా కానిదేదైనా హేయమైనదని తన మాటగా పాండవులకు చెప్పమని చెప్పింది.

శ్రీకృష్ణుడు 'అత్తా! అంతా నువ్వు అనుకున్నట్లే జరుగుతుందని ఆమెను ఓదార్చి మళ్ళీ విదురుడి మందిరం చేరుకున్నాడు.

## విదురుడి విందు

అక్కడ నుండి బయలుదేరిన శ్రీకృష్ణుడు కృతవర్మను, సాత్యకిని తీసుకుని సుయోధనుడి మందిరానికి వెళ్ళాడు. సుయోధనుడు అతడిని స్వాగతించి తన ఇంటిలో భోజనానికి ఆహ్వానించాడు. కానీ శ్రీకృష్ణుడు సున్నితంగా తిరస్కరిస్తూ సుయోధనా! **నేను రాయబారిని. వచ్చిన పని పూర్తి కాకుండా మీ ఇంట విందులు వినోదాలూ నాకు ధర్మం కాదు కదా! ప్రేమతో పెట్టే భోజనం అత్యంత ప్రియమైనది. ఆపద ఉన్న చోట భోజనం మంచిది కాదు. నాకు మీ పట్ల ప్రేమ ఉంది. మీ ఇంట నాకు ఆపద లేదు. అయినా ప్రస్తుతం భోజనం చేయలేను. పగ వారి ఇంట్లో భోజనం చేస్తే వారు ఏమి పెడతారో అన్న అనుమానం తొలిచేస్తూ ఉంటుంది. నాకేమో పాండవులు అంటే ప్రాణం. నీకు వారంటే పగ. వాళ్ళకు అపకారం చేసే మీ ఇంట్లో భోజనం నాకు మంచిది ఎలా అవుతుంది? కాబట్టి నేను విదురుడి ఇంట్లో భోజనం చేస్తానులే!'** అని చెప్పి వెళ్ళిపోయాడు.

విదురుడు భక్తిశ్రద్ధలతో విందును ఏర్పాటు చేశాడు. విందు పూర్తి అయ్యాక విదురుడు 'శ్రీకృష్ణా! దుర్యోధనుడు దురభిమాని, నీ మాట వింటాడా! తనకు పదకొండు అక్షౌహిణుల సైన్యం ఉందని గర్వం. పైగా కర్ణుడు ఒక్కడే తనకు విజయం చేకూరుస్తాడని గట్టి నమ్మకం. రాజసూయ యాగంలో ఓడిన రాజులతో కలిసి పాండవులకు వ్యతిరేకంగా యుద్ధానికి సిద్ధం అవుతున్నాడు. కాబట్టి సంధి పొసగదు. కౌరవులకు పోయేకాలం దాపురించింది. నువ్వు కురుసభకు వెళ్ళడం మంచిది కాదు'అన్నాడు అవేదనగా. అప్పుడు శ్రీకృష్ణుడు విదురుడితో –

'విదురా! నాకు అంతా తెలుసు. దుర్యోధనుడు సంధికి ఇష్టపడడనీ తెలుసు. అయినా ఎందుకు వచ్చాననంటావా? **ప్రయత్నిస్తే నష్టం లేదుగా! పైగా ఇది పుణ్య కార్యం. ఫలించకపోయినా, ప్రయత్నం చేశామన్న ఫలం దక్కుతుంది. ఇద్దరూ మనకు బంధువులు. వాళ్ళ మధ్య గొడవ తీర్చకపోతే మనల్ని పెద్దలు నిందిస్తారు.**

**అందుకే వచ్చాను' నువ్వు నా హితం కోరే చెప్పావు.** కానీ నేను ఎందుకు వచ్చానో వారికి తెలియాలి. వారి మనసులో ఏముందో నాకూ లోకానికీ తెలియాలి. అప్పుడే దానికి అనుగుణంగా చెయ్యగలం! ఈ సంధి పొసగదని నాకూ తెలుసు. నా ప్రయత్నం చేస్తాను. అన్నాడు. ఆరోజుకు అక్కడే విశ్రాంతి.

## శ్రీకృష్ణరాయబారం

మరునాడు కౌరవసభ కొలువుతీరింది. ఉన్నతాసనంపై శ్రీకృష్ణుడు. అందరూ ఉండగా శ్రీకృష్ణుడు లేచి సభను ఉద్దేశించి – 'మహారాజా! భరత వంశ క్షేమం కోసం ఇరు కుటుంబాలకూ మేలు కలిగేలా నాకు తోచినది చెప్తున్నాను. మీ భరత వంశం ధర్మం, సత్యం, కరుణ, ఐకమత్యం, అభివృద్ధి అనేవాటికి ప్రసిద్ధి. అలాంటి వంశంలో నువ్వూ, నీ సహోదరుడు పాండురాజు జన్మించారు.

పాండవులు తండ్రిలేని బిడ్డలు. చిన్నప్పటినుండీ ఎన్నో కష్టాలు పడ్డారు. నువ్వే వాళ్ళను ఆదరించావు. పెంచి పెద్ద చేశావు. వాళ్ళకూ నువ్వు తండ్రివే. కాబట్టి వాళ్ళ రక్షణ బాధ్యత నీదే! నీ పుత్రులూ పాండుపుత్రులూ పాలూ నీళ్ళలా కలిసి ఉండాలి. అలా ఉండకపోతే అప్రతిష్ఠే. నీదే బాధ్యత. ఈ కురు వంశానికి నువ్వే పెద్దదిక్కు. ఇరు కుటుంబాల యోగక్షేమాల్ని దృష్టిలో పెట్టుకుని ప్రవర్తించాలి. యుద్ధం వస్తే నాశనం తప్పదు. కాబట్టి ఇరు పక్షాలకూ సంధే మంచిది. అది నీ చేతిలోనే ఉంది.

ఇక బలాబలాలంటావా! అటు భీమార్జునులతోగానీ ఇటు భీష్మద్రోణాదులతో గానీ ఎదుర్కొనే వీరులు ఎవరుంటారు? ఇరు పక్షాలలోని వీరులంతా చనిపోవడం తప్ప యుద్ధంవల్ల ప్రయోజనం ఏముంటుంది! నువ్వు కురుసామ్రాట్టువి. నీ కుమారులైన కౌరవ, పాండవులలో ఒకరి పట్ల శత్రుత్వం వహించడం తగదు. ఈ సమయంలో నువ్వు ఉపేక్షిస్తే అది లోకానికే ద్రోహం. కాదు నీకు నువ్వే చేసుకునే ద్రోహం.

కురు, పాండవులలో ఎవరు మరణించినా కీడు నీకే కదా! పండితులూ, బలాఢ్యులూ, పరాక్రమ వంతులూ అయిన కురు వంశజులు మరణించకుండా నీ రాజ నీతిని ప్రదర్శించు. అందరి మెప్పునూ పొందు.

పాండవులు నీకు ఎంతో వినయంగా 'తండ్రీ! నీ మాట ప్రకారం మేం అరణ్య అజ్ఞాత వాసాలను పూర్తి చేసుకున్నాం. మా తండ్రిగారి అర్ధరాజ్యానికి అర్హులమని భావిస్తున్నాం. మాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం అన్నీ నువ్వే. మావల్ల ఏదైనా అపరాధం జరిగితే మన్నించండి. మాకు క్షేమాన్ని కలిగించి ధర్మాన్ని నిలపండి అంటూ వాళ్ళు అయిదుగురూ నీకు నమస్కరిస్తూ –

**ఉ. సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ**
**బారముఁ బొందలేక చెడఁ బారినదైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసి రదివారల చేటగుఁ గాని ధర్మని**
**స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడున్**

**(ఉద్యోగ: 3-273)**

**'మహారాజా! ఉత్తమమైన ధర్మం, పాపంవల్లా, స్వచ్ఛమైన సత్యం అసత్యం వల్లా దరిచేరలేక నాశనమైపోతున్నప్పుడు సమర్థులైనవాళ్లు రక్షించగలిగీ ఉపేక్ష చేసినట్లయితే అది వారికే చేటు తెస్తుంది. అయితే ధర్మాన్ని గట్టెక్కించేందుకూ, సత్యానికి శుభాన్ని కలిగించేందుకూ భగవంతుడు ఉన్నాడు' అన్నారు.**

ఇక నిర్ణయం నీదే! సత్యాన్నీ, ధర్మాన్నీ రక్షించు. పాండవులకు ధర్మంగా ఇవ్వవలసిన రాజ్యాన్ని ఇచ్చేయి. పాండవులు గొప్పవీరులే అయినా శాంతం వహించి, అన్నీ మర్చిపోయి నిన్ను సేవించాలని భావిస్తున్నారు. దానికి నువ్వు ఒప్పుకోకపోతే యుద్ధానికైనా వాళ్ళు సిద్ధమే. నీకు ఏది మంచిదనిపిస్తే అదే చెయ్యి' అని చెప్పమన్నారు.

కాబట్టి మహారాజా! నువ్వు సముచితమైన నిర్ణయం తీసుకుని వారి రాజ్యభాగాన్ని వారికి ఇచ్చి మిగిలినది మీ కుమారునికి ఇచ్చి, పుత్ర పౌత్రాదులతో సుఖంగా జీవించు. ధర్మరాజులోని ధర్మనిష్ఠ, శాంతస్వభావం నువ్వు ఎరుగనిదా! మీరు అన్ని కష్టాలు పెట్టినా మీతో సఖ్యత కోరుతూ సంధి ప్రయత్నాలు చేస్తున్న ధర్మజుడి మంచిమనస్సు ఎవరికి ఉంటుంది!

ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారుల క్షేమం కోరి ఇవన్నీ నీకు చెప్తున్నాను. పాండవుల రాజ్యభాగాన్ని వారికి ఇవ్వు. పిలిపించు. పాండవులు మీ పాద సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నీకు అది ఇష్టం లేకపోతే వారు యుద్ధానికి కూడా సిద్ధమే. ఏది కావాలో నువ్వే నిర్ణయించు' అని చెప్పి శ్రీకృష్ణుడు కూర్చున్నాడు.

## మహర్షులు హితోపదేశాలు

అంతా నిశ్శబ్దం. ఇంతలో జమదగ్ని మహాముని లేచి 'సుయోధనా! పూర్వం దంభోద్భవుడు అనే ఒక మహారాజు ఉండేవాడు. అతడు మహా గర్విష్టి. నర నారాయణులు గంధమాదన పర్వతం పై తపస్సు చేసు కుంటుంటే ఈ దంభోద్భవుడు వారి మీదకు యుద్ధానికి వెళ్ళాడు. మునులు ఎంత చెప్పినా వినలేదు. ఆ సమయంలో నరుడు చేతిలో ఉన్న దర్భలతోనే దంభోద్భవుడితో యుద్ధం చేసి, అతడిని ఓడించి, ప్రాణాలతో వదిలిపెట్టాడు. ఆ నర నారాయణులే ఈ శ్రీకృష్ణార్జునులు. కాబట్టి దంభోద్భవుడిలా గర్వంతో వారిని ఎదిరించకుండా సంధి చేసుకో' అని హితవు పలికాడు.

ఆ తరువాత కణ్వ మహాముని లేచి 'సుయోధనా! బలాబలాలు తెలుసుకోకుండా గర్వంతో, అహంకరించి యుద్ధానికి దిగితే పూర్వం గరుత్మంతుడిలా భంగపడక తప్పదు. దేవేంద్రుడి రథసారథి మాతలి. అతడి కూతురు గుణకేశి. మాతలికి తన కుమార్తెకూ సర్పనాయకుడైన ఆర్యకుడి మనుమడూ కురుడి కుమారుడూ అయిన సుముఖుడికీ పెళ్ళి చెయ్యాలని ఉంది. ఆ విషయం ఆర్యకుడితో చెప్పాడు.

అప్పుడు అర్యకుడు 'అయ్యా! నా కుమారుడైన కురుడిని గరుత్మంతుడు చంపాడు. ఆ తరువాత సుముఖుణ్ణి కూడా ఒక నెలరోజులలో చంపుతానని చెప్పి కోపంతో వెళ్ళాడు. కాబట్టి ఈ సంబంధానికి నేను ఒప్పుకోలేను' అన్నాడు.

అందుకు మాతలి 'నేను దేవేంద్రుడితో చెప్పి సుముఖుడి ప్రాణాలు కాపాడతాను' అని దేవేంద్రుడి దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

ఆ సమయంలో దేవేంద్రుడూ మహావిష్ణువూ ఒకేచోట ఉన్నారు. మాతలి వచ్చి దేవేంద్రుణ్ణి శరణువేడాడు.

అప్పుడు దేవేంద్రుడు శ్రీమహావిష్ణువు అనుమతితో సుముఖుడిని దీర్ఘాయుష్మంతుణ్ణి చేశాడు. మాతలి తన కుమార్తెను సుముఖునికి ఇచ్చి వివాహం జరిపాడు. ఇది విని గరుత్మంతుడు కోపావేశంతో అక్కడికి వచ్చి విష్ణువు ముందరే 'ఇంద్రా! నువ్వు అదితి పుత్రుడివి. నేను వినతాపుత్రుడిని. మన ఇద్దరికీ తండ్రి కశ్యపుడే. మనం ఇద్దరం రాక్షసులను వెతికి వెతికి చంపుదాం. నీ కంటే నేను ఎందులో తక్కువ? నావిషయంలో నువ్వెందుకు జోక్యం చేసుకున్నావు' అన్నాడు.

అందుకు ఇంద్రుడు 'ఇది నా నిర్ణయం కాదు. విష్ణుమూర్తి నిర్ణయం'అన్నాడు.

గరుత్మంతుడు 'తమ్ముడా! నేను ఏమిటో నా బలమెంతో నీకు తెలియదు. నీ దేవతా కులమంతా నా ఒంటి మీది ఒక ఈకతో సమం కాదు' అన్నాడు.

విష్ణుమూర్తి 'నువ్వు అంత బలవంతుడివా ఏదీ చూపించు?' అని గరుడుడి వీపుపై తన చెయ్యి వేశాడు. అంతే! గరుడుడు కెవ్వుమని అరిచి,కుప్ప కూలిపోయాడు. విష్ణుమూర్తి చేయి తీశాడు. అప్పుడు 'బ్రతుకు జీవుడా' అంటూ లేచి నిలబడ్డాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు నవ్వి 'గరుడా! గర్వం ఎందుకు? బుద్ధిగా ఉండవచ్చు కదా! అని హితవు పలికి వెళ్ళిపోయాడు'.

**తరువాత నారదుడు 'సుయోధనా! ఎంతటి శక్తివంతులకైనా ధర్మమార్గమే బలం.ఆ శక్తిని అహంకారం బలహీన పరుస్తుంది. ఏది ఏమైనా నేను అనుకున్నది చేస్తాను అని మూర్ఖంగా ప్రవర్తిస్తే గాలవుడికి కలిగిన ఆపదలే మనకూ ఎదురౌతాయి' విను.**

పూర్వం గాలవుడు అనే ఒక ముని కుమారుడు ఉండేవాడు. అతడు విశ్వామిత్రుడి వద్ద విద్యను అభ్యసించాడు. విద్యాభ్యాసం పూర్తి కాగానే గురుదక్షిణ ఇస్తానని అన్నాడు. విశ్వామిత్రుడు వద్దులే అన్నాడు. అయినా గాలవుడు వినలేదు. మూర్ఖంగా గురుదక్షిణ అడగాలి అని పట్టుపట్టాడు.

విశ్వామిత్రుడు 'సరే! ఒక చెవి మాత్రం నల్లగా ఉండే తెల్లని గుర్రాలు ఎనిమిది వందలు తీసుకురా! అదే నాకు గురుదక్షిణ' అన్నాడు.

గాలవుడు అందుకు అంగీకరించి బయలు దేరాడు. కానీ అతడికి ఎక్కడ వెతికినా అలాంటి గుర్రాలు దొరక లేదు. నిద్రాహారాలు కూడా మానివేసి వెదకడం మొదలు పెట్టాడు. మార్గమధ్యంలో అతనికి తన చిన్న నాటి నేస్తమైన గరుత్మంతుడు కలిశాడు. గరుత్మంతుడు గాలవుణ్ణి తన వీపుమీద ఎక్కించుకుని యయాతిమహారాజు వద్దకు తీసుకు వెళ్ళాడు.

గాలవుడి కోరిక విన్నాడు యయాతి. కానీ తన వద్ద అలాంటి గుర్రాలు లేవన్నాడు. అయితే తనకో కుమార్తె ఉందనీ అమె పేరు మాధవి అనీ చెప్పి, ఆమెను గాలవుడికి ఇచ్చి, వివాహం చేశాడు. మాధవితో సహా గాలవుడు గుర్రాలను వెదకడం మొదలు పెట్టాడు. అలా అతడు గుర్రాల కోసం ఇక్ష్వాకు మహారాజు వద్దకు వెళ్ళాడు.

ఇక్ష్వాకు మహారాజు వద్ద అలాంటి గుర్రాలు రెండు వందలే ఉన్నాయి. అయితే సంతానం కోసం పరితపిస్తున్నాడు ఇక్ష్వాకుమహారాజు. అతడిదగ్గర ఉన్న ఆ గుర్రాలను తీసుకొని, బదులుగా సంతానం కలిగే వరకు మాధవిని తన వద్ద ఉంచమని అడిగాడు. గాలవుడు అలాగేనని ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఇక్ష్వాకువు మాధవి ద్వారా ఒక కుమారుణ్ణి పొందాడు. ఆ తరువాత మాధవిని గాలవునికి ఇచ్చివేశాడు.

ఇదేవిధంగా మిగిలిన గుర్రాలను కూడా సమకూర్చుకొమ్మని చెప్పి గరుత్మంతుడు వెళ్ళిపోయాడు.

గాలవుడు కాశీరాజు దివోదాసుకు మాధవిని ఇచ్చి రెండు వందల గుర్రాలను తీసుకున్నాడు. మాధవివల్ల దివోదాసుకు ప్రత్యర్దనుడు అనే కుమారుడు కలిగాడు.

తరువాత గాలవుడు మాధవిని భోజపురాధీశుడైన ఔశీనరుడికి ఇచ్చి మరో రెండు వందల గుర్రాలను పొందాడు. ఔశీనరుడికీ మాధవికీ శిబి అనే కుమారుడు కలిగాడు. అయినా మాధవి కన్యాత్వం చెడలేదు.

మిగిలిన గుర్రాల కోసం గాలవుడు అన్వేషిస్తుంటే గరుత్మంతుడు వచ్చి గాలవుడిని విశ్వామిత్రుడి వద్దకు తీసుకువెళ్ళి 'అయ్యా! గాలవుడు పసివాడు. అతడిని అనుగ్రహించండి. ఈ ఆరువందల గుర్రాలను తీసుకుని మిగిలిన రెండు వందల గుర్రాలకు బదులుగా ఈ మాధవిని స్వీకరించండి' అన్నాడు.

విశ్వామిత్రుడు అందుకు అంగీకరించాడు. ఆమె ద్వారా అష్టకుడు అనే కుమారుణ్ణి పొందాడు. తిరిగి మాధవిని గాలవుడికి ఇచ్చాడు. కాబట్టి గాలవుడిలా మూర్ఖుడిలా ప్రవర్తించ వద్దు. గురు దక్షిణ వద్దు అన్నప్పుడు విజ్ఞతతో ఊరుకుంటే ఇన్ని తిప్పలు ఉండేవి కాదు కదా! కాబట్టి తెలివిగా శ్రీకృష్ణుడి మాట విను' అన్నాడు.

మునీశ్వరుల మాటలు పట్టించుకోలేదు సుయోధనుడు. భీష్ముడు 'సుయోధనా! నీ తండ్రి మాటలు ప్రశాంతంగా విను. శ్రీకృష్ణుడి మాటలు వింటే నీకు మేలు కలుగు తుంది. నీ సిరి సంపదలు నిలుస్తాయి. లేకపోతే లేదు అంతే నేను చెప్పేది'అన్నాడు.

కొడుకు పక్షాన ధృతరాష్ట్రుడు మహర్షులకు క్షమాపణలు చెప్పి 'శ్రీకృష్ణా! నేను అశక్తుణ్ణి. సంధి చేసుకోమని నువ్వే నా కొడుకులకు హితబోధ చెయ్యి' అని వేడుకొన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు 'సుయోధనా! పాండవులు గొప్ప వీరులు. వాళ్ళను యుద్ధంలో ఓడించడం ఆ దేవతలవల్ల కూడా కాదు. అయినా అన్నీ మరిచిపోయి సంధిని కోరుతున్నారు. ఉత్తరగోగ్రహణంలోనే అర్జునుడి సత్తా ఏమిటో మీ అందరికీ తెలిసింది కదా! దురహంకారానికి పోయి, ఎందుకు నీవాళ్ళ నందరినీ చంపుకుంటావు?' అన్నాడు.

భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్రాదులు కూడా చెప్పి చూశారు. అన్నీ విన్న సుయోధనుడికి కోపం కట్టలు తెంచుకుంది.

'శ్రీకృష్ణా! ఈ పెద్దలున్నారే! ఎప్పుడూ ఇంతే! నన్ను నిందించడం తప్ప వీళ్ళకు వేరే పని లేదు. ఇప్పుడు నువ్వు కూడా వాళ్ళకు తోడయ్యావు. మా శకునితో ధర్మరాజు జూదంలో ఓడిపోయాడు. అది నా తప్పా?! ఒకవేళ ధర్మరాజు గెలిస్తే

మేమూ పందెంలో పెట్టిన నియమాల్ని పాటించేవాళ్ళమే! మేమేమీ యుద్ధాన్ని కోరడం లేదు. అనవసరంగా వాళ్ళే మాతో కయ్యానికి కాలుదువ్వుతున్నారు. యుద్ధం రాజధర్మమే కదా! గెలిచినా ఓడినా కీర్తి లభిస్తుంది. మాకు ఊహ తెలియనప్పుడు మా పెద్దలు వాళ్ళకు రాజ్యంలో భాగం ఇచ్చారు. ఇప్పుడు అలా చేస్తే ఊరుకోం. అయిదు ఊళ్ళూ కాదు కదా! సూది మొన మోపినంత భూభాగం కూడా వాళ్ళకు ఇచ్చే ప్రసక్తి లేదు. చేతనైతే యుద్ధం చేసి గెల్చుకోమను. ఇదే నా తుది నిర్ణయం' అని తల బిరుసుగా సమాధానం చెప్పాడు.

'ఓరీ మూర్ఖా! మొదట్నుంచీ నువ్వు అధర్మపరుడివే! పాండవులకు ఎన్నోసార్లు కీడు చేశావు. వాళ్ళు ధర్మపరులు. అందుకే ఇంకా బతికే వున్నారు. యుద్ధం జరుగుతుంది. అందులో నువ్వూ నీ వాళ్ళూ నాశనం కాక తప్పదు' అన్నాడు శ్రీకృష్ణుడు కోపంగా.

ఆ మాటలు రుచించని దుర్యోధనుడు తన వాళ్ళందరితో కలిసి సభలో నుంచి బయటికి వెళ్ళిపోయాడు.

వెంటనే ధృతరాష్ట్రుడు పిలిపించడంతో గాంధారీదేవి సభలోనికి వచ్చింది. దుర్యోధనుణ్ణి పిలిపించి, సంధి చేసుకోమని చెప్పింది. అయినా దుర్యోధనుడు పట్టించుకోలేదు. బయటకు వెళ్ళి శ్రీకృష్ణుణ్ణి బంధించే ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అది గ్రహించిన సాత్యకి సభలోనికి వచ్చి ఆ విషయాన్ని చెప్పాడు. అది విన్న ధృతరాష్ట్రుడు దుర్యోధనుణ్ణి పిలిపించి తీవ్రంగా మందలించాడు. 'ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు? మీ చావు మీరు చావండి' అంటూ ఆక్రోశించాడు.

## విశ్వరూపం

వెంటనే శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని చూపించాడు. సమస్త దేవతల్నీ సమస్త శక్తుల్నీ తనలో నింపుకొని ఉంది ఆ విరాట్ స్వరూపం. అలా కనిపించిన శ్రీకృష్ణుడి తేజస్సును సభలోని వాళ్ళెవరూ చూడలేకపోయారు. కళ్ళు మూసుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు నారదాది మహర్షులకూ, భీష్మద్రోణులకూ,

విదురుడికీ, సంజయుడికీ దివ్యదృష్టిని అనుగ్రహించాడు. ధృతరాష్ట్రుడు వేడుకోవడంతో అతడికీ విశ్వరూపాన్ని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించాడు.

ధృతరాష్ట్రుడు అమితమైన ఆనందంతో శ్రీకృష్ణుడి పాదాలపై పడి 'పరంధామా! చాలు. నా జన్మ తరించింది. నా చూపును తిరిగి తీసేసుకో. నిన్ను చూసిన కళ్ళతో వేరెవ్వరినీ చూడలేను' అన్నాడు.

కొంతసేపటి తర్వాత శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించాడు. నారదాది మహర్షులూ అతడికి నమస్కారం చేసి వెళ్ళిపోయారు. ఆ తరువాత శ్రీకృష్ణుడు కూడా అందరికీ వీడ్కోలు పలికి సాత్యకి కృతవర్మలను తీసుకొని కుంతీదేవి మందిరానికి వెళ్ళాడు. జరిగినదంతా ఆమెకు విన్నవించాడు.

కౌరవుల అహంకారానికి ఆమెకు ఒళ్ళు మండింది. 'శ్రీకృష్ణా! రాబోయే సంగ్రామంలో తమ ప్రతాపాన్ని చూపించడానికి నా కొడుకుల్ని సిద్ధంగా ఉండమను' అంది.

***

శ్రీకృష్ణుడి రథం హస్తినాపురాన్ని దాటి పొలిమేరల్లో ఆగింది. 'నీతో ఏకాంతంగా మాట్లాడాలి' అని కర్ణుణ్ణి తనతోపాటు తీసుకువచ్చాడు శ్రీకృష్ణుడు. ఒక చెట్టు కింద రథం నిలిపి 'కర్ణా! నువ్వు ధర్మాత్ముడివి. మాకు పరాయివాడివి కావు. కుంతీదేవికి కొడుకువు. అంటే పాండురాజుకు పెద్ద కొడుకువి. ఈ విషయం తెలిస్తే ధర్మరాజు నిన్ను అందలం ఎక్కిస్తాడు తెలుసా?! నువ్వు పాండవులతో కలిస్తే రాజ్యాధికారం నీకే వస్తుంది. ఆలోచించు' అన్నాడు.

కర్ణుడు నిరాకరించాడు. నన్ను పెంచిన తల్లినీ, ఆదరించిన సుయోధనుణ్ణీ విడిచి రావడం ధర్మం కాదన్నాడు.

'సరే! కర్ణా! రాబోయే అమావాస్యనాడు యుద్ధం మొదలవుతుంది. వెళ్ళు. మీ పెద్దలందరినీ సిద్ధం కమ్మని చెప్పు' అంటూ ఉపప్లావ్యంవైపు బయలుదేరాడు శ్రీకృష్ణుడు.

***

కర్ణుడు గంగాతీరంలో అనుష్ఠానంలో ఉన్నాడు. కుంతీదేవి మెల్లగా అతణ్ణి సమీపించింది. 'నాయనా! కర్ణా!' అని పిలిచింది. కర్ణుడు తలెత్తి చూశాడు. ఎదురుగా కుంతీదేవి. 'ఏమిటమ్మా! ఇలా వచ్చావు?' అని అడిగాడు.

'నాయనా! నువ్వు ఎవరో కాదు. నా పెద్ద కొడుకువి. పాండవులకన్నా ముందే సూర్యుడి అనుగ్రహంతో పుట్టావు. పాండవులు నీకు సోదరులు. వాళ్ళతో కలహించడం మానుకో! అందరూ కలసి ఉంటే నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. పాండవులతో కలిసి నువ్వూ రాజభోగాలు అనుభవించు' అంది ప్రేమగా.

అంతా విన్న కర్ణుడు నిర్లిప్తంగా 'అమ్మా! నాకు ఈ విషయం ముందే తెలుసు. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో నా జన్మ రహస్యాన్ని బయట పెట్టడం నాకు ఇష్టం లేదు. పాండవులతో కలిస్తే ఈ రహస్యం బయటపడకమానదు. అంతేకాదు, దుర్యోధనుడు నాకు ప్రాణస్నేహితుడు. నన్ను నమ్మి యుద్ధానికి దిగుతున్నాడు. అతడికి ద్రోహం చెయ్యలేను. నీ బాధ నాకు అర్థమయ్యింది. పాండవుల్ని కాపాడుకోవాలన్నదే నీ తాపత్రయం. చెబుతున్నా విను. ఒక్క అర్జునుణ్ణి తప్ప మిగిలిన నలుగురినీ చంపను. నేనో అర్జునుడో ఎవరో ఒకరే ఈ భూమ్మీద ఉండాలి. అప్పుడూ నీకు పాండవులు అయిదుగురే అవుతారు' అని కుంతీదేవికి అభయమిచ్చి పంపివేశాడు.

## యుద్ధసన్నాహం

పాండవ శిబిరంలో యుద్ధ సన్నాహం ప్రారంభమయ్యింది. ధర్మరాజు ధృష్టద్యుమ్నుణ్ణి సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. ద్రుపద, విరాట, సాత్యకి, మాగధ, సహదేవ, చేకితాన, ధృష్టకేతు, శిఖండులను అక్షౌహిణులకు అధిపతులుగా నియమించాడు.

పాండవ సైన్యం కురుక్షేత్రానికి దగ్గర్లో విడిది చేసింది. అక్కడ దుర్యోధనుడు కూడా ద్రోణ, కర్ణ, అశ్వత్థామ, బాహ్లీక, శల్య, కృప, భూరిశ్రవ, శకుని, కృతవర్మ,

సుదర్శన, సైంధవుల్ని తన పదకొండు అక్షౌహిణుల సైన్యానికి అధిపతుల్ని చేశాడు. సర్వసైన్యాధ్యక్షుడుగా భీష్మాచార్యుడిని నియమించాడు.

అప్పుడు భీష్ముడు – 'సుయోధనా! ఒక్క అర్జునుడు తప్ప నన్ను ఎదిరించే మొనగాడు ఈ భూమ్మీద లేడు. పాండవుల్ని చంపడానికి నాకు మనసొప్పదు. వాళ్ళను విడిచిపెట్టి మిగిలిన సైన్యాన్ని అవలీలగా జయిస్తాను. కర్ణుడితో పాటు నన్ను పంపవద్దు. అతడు యుద్ధంలో ఉంటే నేను సేనాధిపత్యాన్ని వహించను' అని తేల్చిచెప్పేశాడు.

దుర్యోధనుడి సైన్యాలు కురుక్షేత్రం వైపు సాగిపోయాయి. యుద్ధం తప్పలేదని తెలిసి బలరాముడు బాధపడ్డాడు. తన కళ్ళముందు జరిగే ఈ ఘోరాన్ని చూడలేక తీర్థయాత్రలకు బయలుదేరాడు.

దుర్యోధనుడు పాండవుల బలాబలాల గురించి చెప్పమని భీష్ముణ్ని అడిగాడు. భీష్ముడు 'పాండవుల బలాబలాలన్నీ చెప్పి 'సుయోధనా! ఇంకా ఎందరో వీరులు ఉండవచ్చు. కానీ వాళ్ళెవరూ నన్ను ఎదిరించలేరు. అయితే ఒక్క శిఖండిని మాత్రం నేను జయించలేను. పూర్వం మీ తాత విచిత్రవీర్యుడి కోసం కాశిరాజు కుమార్తెల్ని ముగ్గుర్ని తీసుకువచ్చాను. అందులో 'అంబ' అనే ఒక కుమార్తె సాళ్వరాజును ప్రేమించానని చెప్పింది. నేను తిరిగి పంపివేశాను. కానీ ఆమెను సాళ్వరాజు చేపట్టలేదు. దాంతో అంబ నామీద పగతో తపస్సు చేసింది. ఈశ్వరుడి అనుగ్రహంతో ద్రుపదరాజుకు శిఖండిగా జన్మించింది. నన్ను చంపగలిగే వరాన్ని పొందింది. నేను స్త్రీలను, నపుంసకుల్ని వధించను. అది నా వ్రతం. శిఖండి పూర్వం స్త్రీగా జన్మించింది కాబట్టి ఆమెను వధించను. ఇక నా బలమంటావా? రోజుకు వెయ్యిమంది రథికుల్ని అవలీలగా చంపగలను. ఈ లెక్కన నెలరోజుల్లో మొత్తం పాండవసైన్యాన్ని నేనే అంతం చెయ్యగలను' అన్నాడు.

ఆ తరువాత ద్రోణుడు కూడా 'నేనూ నెలరోజుల్లో పాండవ సైన్యాన్ని మట్టికరిపిస్తాను' అన్నాడు.

వెంటనే కృపుడు 'నేను రెండు నెలల్లో అందర్నీ హతమారుస్తాను' అంటే కర్ణుడు 'నాకు అయిదంటే అయిదురోజులు చాలు' అన్నాడు.

ఇక్కడ వీళ్ళు ఇలా మాట్లాడుకున్న మాటలన్నీ చారుల ద్వారా ధర్మరాజుకు తెలిశాయి. అర్జునుణ్ణి పిలిచి 'అర్జునా! కౌరవ సైన్యాన్ని హతమార్చడానికి నీకు ఎంత సమయం కావాలి?' అని అడిగాడు. అప్పుడు అర్జునుడు –

'అన్నయ్యా! శ్రీకృష్ణుడి సహకారంతో పాశుపతాస్త్రాన్ని వేశానంటే ఒక్కరోజులోనే ముల్లోకాలూ దహించుకుపోతాయి. కానీ అలా చేస్తే నా గొప్పతనం లోకానికి ఎలా తెలుస్తుంది? అందుకే తక్కిన ఆయుధాలతోనే యుద్ధం చేసి ఈ అర్జునుడంటే ఏమిటో లోకానికి తెలిసేలా చేస్తాను' అన్నాడు ఆత్మవిశ్వాసంతో.

# భీష్మపర్వం

'కురుక్షేత్రంలో సంగ్రామం జరగబోతోంది. ఇది దైవ నిర్ణయం. నీకు దివ్యదృష్టిని ఇస్తున్నాను. ఆ యుద్ధాన్ని నువ్వు ఇక్కడ నుండే చూడగలవు' అన్నాడు వేదవ్యాసుడు ధృతరాష్ట్రమహారాజు వద్దకు వచ్చి.

ధృతరాష్ట్రుడు 'తండ్రీ! నావల్ల కాదు. ఆ శక్తిని మా సంజయుడికి ప్రసాదించు. అతడి ద్వారా వింటాను' అని వేడుకున్నాడు. వ్యాసుడు సరేనంటూ ఆ వరాన్ని సంజయుడికి అనుగ్రహించి **'ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే జయం ఉంటుంది'** అని వెళ్ళిపోయాడు.

వేదవ్యాసుడి వరప్రభావంవల్ల సంజయుడు యుద్ధరంగంలో యథేచ్ఛగా సంచరిస్తూ రహస్యంగా మాట్లాడుకునే మాటలూ వినగలుగుతాడు.

యుద్ధం ప్రారంభమయ్యింది. పది రోజులు గడిచిపోయాయి. సంజయుడు దిగులుగా ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు.

'రాజా! ఘోరం జరిగిపోయింది. ఈ పదిరోజులూ పాండవ సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేసిన భీష్ముడు ఒక దుర్బలుడైన శిఖండి వల్ల నేలకూలిపోయాడు' అన్నాడు విచారంగా.

ఇక్కడ ధృతరాష్ట్రుడూ నేలమీద కూలబడిపోయాడు. తెప్పరిల్లి 'అయ్యో! ఎంత దారుణం? సంజయా! ఇది ఎలా జరిగిందో వివరంగా చెప్పు?' అని అడిగాడు. సంజయుడు మొదలుపెట్టాడు.

'రాజా! నేను వెళ్ళేసరికి దుర్యోధనుడు దుశ్శాసనుణ్ణి ఇలా హెచ్చరిస్తున్నాడు. 'భీష్ముడి ఆట కట్టించేందుకు పాండవులు తప్పకుండా శిఖండిని తెస్తారు. ఆ శిఖండి ఎక్కడ కన్పించినా తరిమి తరిమికొట్టు. ఇటువైపు రాకుండా చూడు' అని.

ధర్మరాజు కౌరవుల సైన్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ సైన్యం మధ్యలో తాళధ్వజం రెపరెపలాడుతున్న రథంపై ఠీవిగా ఉన్నాడు భీష్ముడు. విజయమో వీరస్వర్గమో అన్నట్లుగా పోరాడమని వీరుల్ని ప్రోత్సహిస్తున్నాడు.

కౌరవ సైన్యాన్ని చూసి మొదట ధర్మరాజు ఆందోళన చెందినా అర్జునుడి ప్రోత్సాహంతో పుంజుకున్నాడు. ధృష్టద్యుమ్నుడు అచలవ్యూహాన్ని పన్నాడు. ఇరుపక్షాలూ ఎదురెదురుగా నిలిచాయి. శ్రీకృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తాల్ని పూరించారు. ఆ శంఖధ్వనులకు కౌరవుల గుండెలు గుభేలుమన్నాయి. అంతలో కౌరవ సైన్యంపై నెత్తుటి వాన కురిసింది. అయినా దుర్యోధనుడు వెనుకంజ వేయకుండా యుద్ధ వాద్యాలు మ్రోగించమన్నాడు.

ఉభయులూ యుద్ధ నియమాల్ని చెప్పుకున్నారు. **యుద్ధం చేస్తూ అందుకు తగిన విధంగా మాట్లాడుతూ ఉంటే ఆ సమయంలోనూ, ఆయుధం చేతిలో లేనప్పుడూ, ఎదిరించి నేలమీద పడిపోయినప్పుడూ, బలం లేక పారిపోతున్నప్పుడూ, యుద్ధాన్ని విరమించినా, శత్రువుపై ఆయుధం ప్రయోగించకూడదు. చంపకూడదు.** ఇవీ నియమాలు.

అప్పుడు ఒక వింత సంఘటన జరిగింది. ఉన్నట్లుండి ధర్మరాజు రథం దిగి భీష్మ ద్రోణాది వీరులవైపు వెళ్ళాడు. ఉభయ పక్షాలవారికీ ఎందుకో అర్థం కాలేదు. తక్కినవారూ అతణ్ణి అనుసరించారు.

అలా వెళ్ళిన ధర్మరాజు భీష్మాచార్యుడిని ఆశీర్వదించమని అడిగాడు. భీష్ముడు ఆనందంగా 'నా ఆశీర్వాదబలం నీకు ఎప్పుడూ ఉంటుంది. నీ వినయానికి మెచ్చాను. నన్ను నీవైపు పోరాడమనడం తప్ప వేరే ఏదైనా వరం కోరుకో' అన్నాడు వాత్సల్యం కురిపిస్తూ.

అప్పుడు ధర్మరాజు 'పితామహా! నిన్ను జయించే మార్గాన్ని ఉపదేశించు' అన్నాడు. దానికి భీష్ముడు 'నా మనసు కరిగేలా నన్ను ప్రార్థిస్తే తప్ప నేను యుద్ధం మానను. నన్ను జయించే ఉపాయాన్ని చెప్పడానికి ఇది సమయం కాదు' అన్నాడు.

ఆ తరువాత ధర్మరాజు ద్రోణాచార్యుడికీ, కృపాచార్యుడికీ నమస్కరించి వారినీ ఇలాగే అడిగాడు. ద్రోణుడు 'నాకు బాధ కలిగించే విషయాన్ని నమ్మకస్థుడైన వ్యక్తి చెప్పినప్పుడు మాత్రమే నేను అస్త్రసన్యాసం చేస్తాను' అన్నాడు.

కృపాచార్యుడైతే తనకు చావే లేదన్నాడు. అయినా యుద్ధంలో పాండవులే గెలుస్తారని ఆశీర్వదించాడు.

ధర్మరాజు వెనక్కి వచ్చి తన సైన్యంతో నిలబడి 'కౌరవవీరులారా! ఇప్పటికైనా మించిపోయినది లేదు. మీలో ఎవరైనా నావైపుకి రావచ్చు. వచ్చినవాళ్ళని సోదరుడిలా ఆదరిస్తాను' అన్నాడు ఎలుగెత్తి.

రాజా! అప్పుడు నీ కుమారుడు యుయుత్సుడున్నాడే! అతడు దుర్యోధనుణ్ణి తీవ్రంగా నిరసిస్తూ పాండవుల పక్షంలో చేరిపోయాడు.

భీష్ముడు శంఖాన్ని పూరించాడు. అదే యుద్ధ ప్రారంభానికి సూచన. అటువైపు శ్రీకృష్ణుడు పాంచజన్యం, అర్జునుడు దేవదత్తం, భీముడు పౌండ్రం, ధర్మరాజు అనంత విజయం, నకుల సహదేవులు సుఘోషం, మణిపుష్పకం అనే పేర్లు గల శంఖాల్ని పూరించారు.

## గీతోపదేశం

శ్రీకృష్ణుడు అర్జునుడికి రథసారథి. రథాన్ని ముందుకు పోనిచ్చాడు. రథం సరిగ్గా రణరంగం మధ్యలో నిలిచింది. కౌరవసైన్యాన్ని తదేకంగా చూశాడు అర్జునుడు. అందరూ తనవాళ్ళే. ఎదురుగా సోదరులు, సుతులు, గురువులు, బంధువులూ. ఒక్కసారిగా దుఃఖం కమ్ముకు వచ్చేసిందతడికి. శరీరం వణికిపోయింది. కాళ్ళూ చేతులూ ఆడలేదు. నిరుత్సాహంతో చతికిలపడిపోయాడు.

'శ్రీకృష్ణా! అయినవాళ్లని ఇంతమందిని చంపి నేను సాధించేదేమిటి? ఆ వచ్చిన రాజ్యం నాకు సుఖాన్నీ, కీర్తినీ ఇస్తుందా? నేనీ యుద్ధం చేసి పాపాన్ని మూటకట్టుకోలేను' అంటూ గాండీవాన్ని విడిచిపెట్టేశాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! ఏమిటీ బేలతనం? ఏమాత్రమూ బాధపడకూడనివాళ్ళ కోసం బాధపడుతున్నావా? ఇదంతా నీ అజ్ఞానం. అసలు చంపేదెవడు? చచ్చేదెవడు? ఆత్మకు చావు లేదు. శరీరం శాశ్వతం కాదు.

**కం. పురుషుఁడు సెడు నను వాఁడును**
**బురుషుఁడు సెఱచునని పలుకు పురుషుండును న**
**య్యిరువురు నవివేకుల; య**
**ప్పురుషుఁడు సెఱుపండు సెడఁడు భుజవీర్యనిధీ! (భీష్మ:1-198)**

**అర్జునా! ఆత్మ నశిస్తుంది అనేవాడూ, ఆత్మ నశింపజేస్తుంది అనేవాడూ ఇద్దరూ అవివేకులే. ఆత్మ నశించదు. నశింపజేయదు. ఆత్మకు బాధ ఉండదు. అది బాధించదు కూడా. యుద్ధం క్షత్రియధర్మం. అది నీకు స్వధర్మం. స్వధర్మమే అందరికీ శ్రేయోదాయకం. పరధర్మం భయావహం. నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించు. అక్కడివరకే నీకు అధికారం ఉంది. ఫలితాన్ని ఆశించడంపై నీకు అధికారం లేదు.** అంటూ జగత్తు, ఆత్మ, పరమాత్మ, కర్మ, కర్మయోగం, స్థితప్రజ్ఞ, యజ్ఞం, ధర్మం, జ్ఞానం, విజ్ఞానం, క్షేత్రం-క్షేత్రజ్ఞుడు, సాంఖ్యం, త్రిగుణాలు, సంన్యాసం, రాజయోగం, ధ్యానం, భక్తి, శరణాగతి, భగవంతుడి వైభవం, పాపపుణ్యాలు, తారకబ్రహ్మం, మోక్ష సంన్యాసం మొదలైన అనేక విషయాలను విశేషంగా చెప్పి అతడికి గీతోపదేశాన్ని చేశాడు చివరిగా...

**'అర్జునా! ఏ ఫలితాన్నీ ఆశించకుండా పనులు చేయాలి. ఆ పనులకు కర్తను నేనేననీ, నా వల్లే అయ్యాయనీ భావించకూడదు. ఈవిధంగా చేసే ప్రతి పనినీ బ్రహ్మార్పణం అంటూ చేయాలి. ఈ తత్త్వజ్ఞానం కలిగితే చాలు. కర్మ తనంతటతాను నశించి పోతుంది'** అన్నాడు. ఇలా శ్రీకృష్ణుడు చెబుతూ ఉంటే మధ్యలో అర్జునుడు అనేక ప్రశ్నలు వేశాడు. శ్రీకృష్ణుడు అతడి సందేహాలన్నింటినీ తీర్చాడు.

అప్పటికి అర్జునుడి మనసు కుదుటపడింది. దుఃఖం వీడిపోయింది. కర్తవ్యం తేటతెల్లమైంది. ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించిన శ్రీకృష్ణుడే పరమాత్మ అని బోధపడి

విశ్వరూపాన్ని చూపించమని వేడుకున్నాడు. శ్రీకృష్ణుడు అలాగే అంటూ అతడికి దివ్యనేత్రాల్ని ప్రసాదించి తన విశ్వరూపాన్ని చూపించాడు.

**సీ. దేవ! నీదగు దివ్యదేహంబు నందు, సు**
**రాసుర గంధర్వులాదిగాఁగఁ**
**గల దేవమౌనులుఁ, గమలాసనుండును**
**సచరాచరంబైన జగమునాకుఁ**
**దోఁచె; మొగంబులు, దోర్దండములును, బా**
**దములుఁ, గన్నులు, ననేకములు గంటి;**
**మకుటాదిభూషణనికరంబుఁ, జక్రగ**
**దాద్యాయుధములు, మాల్యాంబరములుఁ**

**ఆ.వె. బెక్కు గానవచ్చె నక్కజమై యిది**
**నడుము, మొదలు, దుది యనంగరాదు;**
**తేజ మప్రమేయ దేదీప్యమాన ని**
**ర్వికృతిమహిమ దుర్నిరీక్ష్యమయ్యె (భీష్మ: 1-211)**

దేవా! నీ దివ్యదేహంలో దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలైన వారూ, దేవర్షులు, బ్రహ్మ, చరాచరమైన జగత్తూ నాకు కనిపించింది. ఎన్నో ముఖాలు, చేతులు, కాళ్ళు, నేత్రాలను చూశాను. కిరీటాది ఆభరణాలూ చక్రగదాది ఆయుధాలూ, పూలమాలలూ వస్త్రాలూ ఎన్నో కనిపించాయి. అశ్చర్యకరంగా ఇది మొదలు, ఇది తుది అని చెప్పలేకపోతున్నాను. నీ తేజస్సు అలవికానిది. అంటూ అర్జునుడు విస్మయంతో, గగుర్పాటుతో, ఆనందంతో దండప్రణామం ఆచరించి నిలిచి, చేతులు జోడించి ఆ విశ్వరూపాన్ని పొగిడాడు.

'రాజా! **ఎక్కడ యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, విల్లును ధరించిన అర్జునుడు ఉంటారో అక్కడ నీతి, ఐశ్వర్యం, విజయం ఉంటాయి.'**

మొదటిరోజు భీష్మాచార్యుడు యుద్ధంలో చెలరేగిపోయాడు. మరోవైపు ఇరుపక్షాలూ భీకరంగా పోరాడుతున్నాయి. భీముడూ, అర్జునుడూ, అభిమన్యుడూ

ఎంతో పోరాడారు గానీ ఆ రోజు యుద్ధంలో పై చెయ్యి భీష్ముడిదే అయ్యింది. పాండవుల పక్షంలో ఉన్న ఉత్తరకుమారుడు పాపం! శల్యుడి చేతిలో మరణించాడు. రెండోరోజు పాండవుల సైన్యంలో క్రౌంచవ్యూహాన్ని పన్నాడు ధృష్టద్యుమ్నుడు. ఇటువైపు దుర్యోధనుడూ ప్రతివ్యూహం పన్నాడు. భీష్మాచార్యుడు వస్తూనే క్రౌంచవ్యూహాన్ని ఛిన్నాభిన్నం చేశాడు. అది చూసి అర్జునుడు శ్రీకృష్ణుడి సారథ్యంలో భీష్ముడిపై బాణవర్షాన్ని కురిపించాడు. దారిలో అడ్డపడ్డ ఎందరో కురువీరుల్ని సంహరించాడు.

భీష్ముడు ఊరుకోలేదు. వరుసగా ఏభై బాణాలను అర్జునుడిపై గుప్పించాడు. అర్జునుడు వాటిని ఛేదించి, భీష్ముణ్ణి విడిచి తక్కిన కురువీరులపై విరుచుకుపడ్డాడు. అది చూసి భీష్ముడు, ద్రోణుడు, దుర్యోధనుడు, వికర్ణుడు, అశ్వత్థామ మొదలైన వీరులు అర్జునుడితో తలపడ్డారు. యుద్ధం భీకరంగా జరిగింది. అందులో ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి ధాటికి విలవిలలాడిపోయాడు. అది చూసి భీముడు ద్రోణుడిపైకి వచ్చాడు. దుర్యోధనుడు భీముడిపైకి కళింగ రాజ సైన్యాన్ని ఉసి కొల్పాడు. వాళ్ళందర్నీ భీముడు సంహరిస్తుంటే భీష్ముడు భీముడిపై బాణాలు గుప్పించాడు. అది చూసి సాత్యకి భీష్ముడి రథసారథిని బాణం వేసి కూలగొట్టాడు. భీష్ముడి గుర్రాలు మాత్రం రథాన్ని ఒక ప్రక్కకు తీసుకువెళ్ళి పోయాయి. ఆ రోజుకి యుద్ధం ముగిసింది.

ఇక మూడోరోజు. భీష్ముడు గరుడవ్యూహం పన్ని, ఆ వ్యూహానికి ముక్కు స్థానంలో తానే నిలబడ్డాడు. పాండవులు అర్ధచంద్రవ్యూహం పన్నారు. భీముడు ముందుకు దూసుకువచ్చి చెలరేగిపోతుంటే దుర్యోధనుడు ఎదుర్కొన్నాడు. కానీ భీముడు వేసిన పదునైన బాణానికి మూర్ఛపోయాడు.

మరోవైపు పాండవవీరుల ధాటికి కౌరవసైన్యం కకావికలమైపోయింది. మూర్ఛ నుంచి తేరుకున్న దుర్యోధనుడు భీష్ముణ్ణి సూటిపోటి మాటలతో బాధపెట్టాడు. ఆ మాటలకు భీష్ముడు కోపంతో పాండవ సైన్యంపై విరుచుకుపడ్డాడు. అతణ్ణి ఎదుర్కోవడం ఎవరివల్లా కావడం లేదు.

అర్జునుడూ భీష్ముడు కురిపించిన బాణవర్షానికి కుదేలైపోయాడు. అంతా గమనిస్తున్న శ్రీకృష్ణుడు ఇక లాభం లేదని రథంపై నుండి దూకి, సుదర్శనచక్రాన్ని చేతిలో పట్టుకొని భీష్ముడిపైకి లంఘించాడు.

'ఆహా! శ్రీకృష్ణా! రా! నన్ను చంపు. నీ చేతుల్లో మరణించే అదృష్టాన్ని నాకు ప్రసాదించు' అంటూ నిలబడ్డాడు భీష్ముడు. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఇంతలో అర్జునుడు చటుక్కున రథంపై నుండి దూకి శ్రీకృష్ణుణ్ణి గట్టిగా పట్టుకొని 'బావా! అంతపని చెయ్యకు. మేము నవ్వులపాలైపోతాం. నువ్వు ఈ భీష్ముణ్ణి చంపావో ఈ సాత్యకి మీద ఒట్టే!' అన్నాడు.

శ్రీకృష్ణుడు శాంతించాడు. తిరిగి రథం ఎక్కి పాంచజన్యం పూరించాడు. అర్జునుడూ రథం ఎక్కాడు. రథం రివ్వున కౌరవసైన్యం వైపు దూసుకుపోయింది. కౌరవవీరులు బాణాల్ని గుప్పిస్తూ ఉంటే అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతే! కౌరవసైన్యంపై వందలకొద్దీ బాణాలు పరంపరగా వచ్చి మీద పడ్డాయి. ఆ రోజు అర్జునుడిదే యుద్ధంలో పై చెయ్యి అయ్యింది.

నాలుగోరోజు దుర్యోధన, ద్రోణ, బాహ్లికులు వెంటరాగా భీష్ముడు యుద్ధరంగంలోనికి దూసుకుపోయాడు. అటువైపు అర్జునుడు నిలబడ్డాడు. దుర్యోధనుడు ఒక బలమైన అస్త్రాన్ని వేశాడు. దానివల్ల భీముడు మూర్ఛపోయాడు. సరిగ్గా అదే సమయానికి ఘటోత్కచుడు రంగప్రవేశం చేసి కురుసేనల్ని మట్టికరిపించాడు.

ఘటోత్కచుడు చేస్తున్న మాయా యుద్ధాన్ని భగదత్తుడు గజసైన్యంతో ఎదుర్కొన్నాడు. కానీ ఎంతోసేపు నిలువలేకపోయాడు. మొత్తంగా ఘటోత్కచుడి వీరవిజృంభణ, పాండవుల వీరపరాక్రమాల ముందు కౌరవ సైన్యం వణికిపోయింది. అప్పటికే సాయంకాలం కావడంతో, చీకటిపడితే రాక్షసుడైన ఘటోత్కచుణ్ణి తట్టుకోవడం చాలా కష్టమని కౌరవులు యుద్ధాన్ని ఆ రోజుకు చాలించారు.

ప్రభూ! ఐదోరోజు మనవాళ్ళు మకరవ్యూహాన్ని పన్నారు. పాండవులు శ్యేనవ్యూహాన్ని పన్నారు. భీష్ముడు – భీముడు, అర్జునుడు – అశ్వత్థామ, ద్రోణుడు

– సాత్యకి, అభిమన్యుడు – లక్ష్మణకుమారుడు భీకరంగా యుద్ధం చేశారు. కౌరవ పక్షంలో ఉన్న భూరిశ్రవసుడు, సాత్యకి కొడుకులు పదిమందిని వధించాడు.

ఆరో రోజు పాండవులు మకర వ్యూహాన్ని పన్నితే, భీష్ముడు క్రౌంచవ్యూహాన్ని పన్నాడు. పాండవుల పక్షంలో భీముడూ, ధృష్టద్యుమ్నుడూ కౌరవసైన్యాన్ని ఊచకోతకొస్తున్నారు.

ద్రుపదుడు ద్రోణుడితో తలపడ్డాడు కానీ అతడి ముందు నిలవలేకపోయాడు. దుర్యోధనుడూ – భీముడూ, అర్జునుడూ – భీష్ముడూ భయంకరంగా యుద్ధం చేశారు. సాయంత్రం అయ్యింది. అందరూ గాయాలతో శిబిరాలకు వెళ్ళిపోయారు.

ఏడో రోజు భీష్ముడు మండలవ్యూహాన్ని పన్నితే, పాండవులు వజ్రవ్యూహాన్ని పన్నారు. ఎందరో రాజులు మూకుమ్మడిగా అర్జునుడిపై దాడిచేస్తే, అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. వాళ్ళంతా లబోదిబోమంటూ భీష్ముణ్ని శరణుజొచ్చారు. అప్పుడు భీష్ముడు అర్జునుడితో తలపడ్డాడు. అంతలో ద్రోణుడు విరాటుడి కొడుకును వధించాడు. అది చూసి విరాటరాజు భయంతో పారిపోయాడు. మరోవైపు శిఖండి విజృంభిస్తున్నాడు. అతణ్ణి అశ్వత్థామ తరిమికొట్టాడు. ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడి రథాన్ని కూల్చేస్తే శకుని దుర్యోధనుణ్ణి తన రథంపై తీసుకువెళ్ళిపోయాడు.

పాండవుల పక్షంలో అభిమన్యుడు శత్రుసేనలపై విరుచుకుపడ్డారు. తమ తండ్రులు చేసిన ప్రతిజ్ఞలు గుర్తుకువచ్చి ఆగిపోయాడు గానీ లేకపోతే మనవాళ్ళందరినీ చంపేసేవాడే!

భీష్ముడు ధర్మరాజుపై కలబడ్డాడు. అతడి ధ్వజాన్ని, విల్లునీ ముక్కలు చేశాడు. దానికి ప్రతిగా ధర్మరాజు తనవాళ్ళందరినీ కూడగట్టి భీష్ముడిమీదికి పంపాడు. అప్పుడు భీష్ముడు అందరినీ చెరదగొట్టాడు. ఇంతలో శిఖండి భీష్ముడివైపు వచ్చాడు. దాంతో భీష్ముడు రథాన్ని వెనక్కి తిప్పి వెళ్ళిపోయాడు.

ఇక ఎనిమిదోరోజు. కౌరవులది కూర్మవ్యూహం. అయితే పాండవులది శృంగాటకవ్యూహం. ఈరోజు యుద్ధంలో భీముడు సునాభుణ్ణీ అతడి ఏడుగురు

తమ్ముళ్ళనీ చంపాడు. అది చూసి దుర్యోధనుడు భీష్ముణ్ణి నిందిస్తూ రెచ్చగొట్టాడు. ఇక చూడాలి! భీష్ముడు ప్రళయకాలరుద్రుడే అయిపోయాడు.

ఉలూచి కుమారుడైన ఇరావంతుడు శకుని తమ్ముళ్ళు ఆరుగురినీ వరుసపెట్టి చంపుకుపోతుంటే దుర్యోధనుడు అలంబుసుడు అనే రాక్షసుణ్ణి వాడిమీదికి పంపాడు. వాడు ఇరావంతుణ్ణి సంహరించాడు.

తన సోదరుణ్ణి చంపాడన్న కోపంతో ఘటోత్కచుడు రెచ్చిపోయాడు. కురువీరులందరూ మూకుమ్మడిగా ఎదుర్కొన్నారు. అయినా ఎవరూ నిలువలేకపోతున్నారు. భగదత్తుణ్ణి రాక్షసమాయ ఏమీ చెయ్యదు. అది తెలిసిన భీష్ముడు అతణ్ణి ఘటోత్కచుడి మీదికి పంపాడు.

ఘటోత్కచుడితో పోరాడుతూనే మధ్యలో అడ్డువచ్చిన పాండవసైన్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాడు భగదత్తుడు. అతణ్ణి నిలువరించడం కోసం అర్జునుడు రంగంలోనికి దిగాడు. అటువైపు నుండి కృపాచార్యుడూ భీష్ముడూ అర్జునుణ్ణీ నిలువరించారు. మరోపక్క మనవైపు ద్రోణుడు. అటువైపు భీముడు. ఇలా ఆరోజు యుద్ధం భీకరంగానే ముగిసింది.

రాజా! తొమ్మిదోరోజున భీష్ముడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నాడు. ధృష్టద్యుమ్నుడు శిఖండిని భీష్ముడి ముందు నిలబెట్టి దానికి ప్రతివ్యూహం పన్నాడు. రెండు సేనలూ ఢీకొన్నాయి. అభిమన్యుడు విజృంభిస్తున్నాడు. అటువైపు అలంబుసుడూ రెచ్చిపోతున్నాడు. మరోప్రక్క ద్రోణార్జునులు ద్వంద్వయుద్ధం చేస్తున్నారు. భీష్ముడు – ధర్మరాజు, భగదత్తుడు – భీముడు. యుద్ధం సాగుతోంది. మధ్యాహ్నం అయ్యింది. భీష్ముడు కణకణమండే సూర్యుడిలా ఉన్నాడు. అందువల్ల ఎవరు ఎంత ప్రయత్నించినా భీష్ముడి ప్రతాపం ముందు నిలువలేకపోయారు. సాయంత్రం అయ్యింది. యుద్ధం విరమించారు.

ఆ రోజు రాత్రి శ్రీకృష్ణుడి సలహాపై ధర్మరాజు భీష్ముణ్ణి రహస్యంగా కలిశాడు. అతడికి నమస్కరించి, ఆశీస్సులు పొంది, అతణ్ణి జయించే ఉపాయాన్ని చెప్పమని ప్రార్థించాడు. అప్పుడు భీష్ముడు **'ధర్మరాజా! నేను కవచం తీసినవాణ్ణి, ఆయుధం**

**లేనివాణ్ణి, పూర్వం స్త్రీగా ఉన్నవాణ్ణి, సోదరులూ, పుత్రులూ లేనివాణ్ణి చూస్తే బాణం వెయ్యను. ద్రుపదుడి సంతానమైన శిఖండి పూర్వజన్మలో స్త్రీ. ఈ జన్మలోనూ ముందు స్త్రీగా పుట్టి పురుషుడు అయ్యాడు. కాబట్టి అతణ్ణి ముందు నిలబెడితే అస్త్రసన్యాసం చేస్తాను. అప్పుడు అర్జునుడు అస్త్రాన్ని ప్రయోగించి నన్ను గెలవవచ్చు'** అని చెప్పాడు.

పదో రోజు యుద్ధం మొదలయ్యింది. దుర్యోధనుడికి ఇచ్చిన మాటకోసం రోజుకు వెయ్యిమంది చొప్పున వీరుల్ని సంహరిస్తూ ధర్మయుద్ధం చేస్తున్నాడు భీష్ముడు. అయినా దుర్యోధనుడు సూటీపోటీ మాటలు అంటూనే ఉన్నాడు. ఇక భీష్ముడికి విసుగువచ్చింది. పాండవ సైన్యాన్ని చీల్చిచెండాడుతూనే ధర్మరాజుతో 'నాయనా! ధర్మరాజా! శిఖండిని అడ్డుపెట్టుకొని నాపై బాణం వెయ్యమను. ఇంక నావల్ల కాదు' అన్నాడు.

అర్జునుడు శిఖండితో కలిసి భీష్ముడివైపు వచ్చాడు. దుర్యోధనుడు తక్కినవీరులతో కలిసి భీష్ముణ్ని కాపాడాలని ప్రయత్నించాడు. కానీ అర్జునుడు అందర్నీ తరిమికొట్టి భీష్ముడి ముందుకు వచ్చాడు. శిఖండిని అడ్డుపెట్టి భీష్ముడిపై బాణాల్ని ప్రయోగించాడు.

భీష్ముడు నేలకొరిగాడు. అతడి శరీరంపై గుచ్చుకున్న బాణాలే అతడికి ఒక శయ్యగా తయారయ్యింది. దానిపై అస్తమిస్తున్న సూర్యుడిలా ఒరిగిపోయాడు. సూర్యాస్తమయం అయ్యింది. ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తూ ప్రాణాలతో నిలిచి ఉన్నాడు భీష్ముడు.

కర్ణుడికి ఆ వార్త తెలిసింది. హుటాహుటిన వచ్చి భీష్ముడికి నమస్కరించాడు. అప్పుడు భీష్ముడు 'నాయనా! కర్ణా! నీమీద నాకు కోపం ఎప్పుడూ లేదు. నువ్వు గొప్ప వీరుడివి. జయాపజయాలు దైవాధీనాలు. నీ కర్తవ్యాన్ని నువ్వు నెరవేర్చు' అని ఆశీర్వదించాడు. కర్ణుడు తృప్తిగా తన శిబిరానికి వచ్చాడు.

# ద్రోణపర్వం

సంజయుడు మళ్ళీ యుద్ధరంగానికి వెళ్ళి మరో అయిదురోజుల యుద్ధ విశేషాలతో తిరిగి వచ్చాడు. ధృతరాష్ట్రుడికి కళ్ళకు కట్టినట్లు వివరిస్తున్నాడు.

'ప్రభూ! పదకొండో రోజు కౌరవసైన్యానికి సర్వసైన్యాధ్యక్షుడు ద్రోణుడు. దుర్యోధనుడు ధర్మరాజును బందీగా తీసుకురమ్మని ద్రోణాచార్యుణ్ణి కోరాడు. ఎందుకో అర్థం కాలేదు ద్రోణుడికి. అప్పుడు దుర్యోధనుడు 'ఆచార్యా! మనం ధర్మరాజును చంపితే అర్జునుడు ఊరుకోడు. కౌరవుల్నందర్నీ సంహరిస్తాడు. పోనీ మనమే పాండవుల్ని చంపామనుకుందాం! అప్పుడు శ్రీకృష్ణుడు ఊరుకుంటాడా? మనల్ని నాశనం చెయ్యడం ఖాయం. కాబట్టి ధర్మరాజును పట్టుకొని మళ్ళీ అతడితో జూదం ఆడించి అడవులకు పంపించాలి. ఇదీ నా పథకం' అన్నాడు.

ద్రోణుడు 'ఛీ' అనుకొని 'సరే! నేను ధర్మరాజును బంధించే సమయంలో అర్జునుడు రాకుండా చూడండి' అని శకటవ్యూహం పన్నాడు. అటువైపు ధర్మరాజుది క్రౌంచవ్యూహం. ఇరుసైన్యాలూ తలపడ్డాయి. ద్రోణుడు వీరవిహారం చేస్తుంటే అర్జునుడు ధృష్టద్యుమ్నుడితో కలిసి అతణ్ణి ఎదిరించాడు.

సైంధవుడూ, శల్యుడు అభిమన్యుడితో పోరాడుతున్నారు. ద్రోణుడు మహాకోపంతో అస్త్రాలు ప్రయోగిస్తూ ధర్మరాజును బంధించాలని విశ్వప్రయత్నం చేశాడు కానీ అర్జునుడు ఉండగా అది నెరవేరలేదు.

మరుసటిరోజు. అంటే పన్నెండో రోజన్నమాట. ద్రోణుడు గరుడవ్యూహంతో ముందుకు కదిలాడు. కౌరవ పక్షంలోనే ఉన్న త్రిగర్తరాజు సుశర్మ అతడి సోదరులు అర్జునుణ్ణి కవ్వించారు. ధర్మరాజుకు రక్షణగా ఉన్న అర్జునుడు ధర్మరాజుతో 'అన్నా! శత్రువు యుద్ధానికి పిలిస్తే రాననడం వీరలక్షణం కాదు' అని సత్యజిత్తును ధర్మరాజుకు రక్షణగా ఉంచి రథాన్ని సుశర్మవైపు పోనిచ్చాడు. ఇదే సమయమని

ద్రోణుడు ధర్మరాజు వెంటపడ్డాడు. కానీ ధర్మరాజు చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఇంకోవైపు విజృంభిస్తున్న భగదత్తుణ్ణి అణచడానికి అర్జునుడు తిరిగి వచ్చాడు. వచ్చి ఒక దివ్యాస్త్రంతో వాణ్ణి సంహరించాడు. ఆ తరువాత శకుని తమ్ముళ్ళ నిద్దరినీ మట్టి కరిపించాడు. శకుని పారిపోయాడు.

అర్జునుడి ధాటికి తాళలేక సుశర్మాదులు కర్ణుణ్ణి ఆశ్రయించారు. అప్పుడు కర్ణుడు అర్జునుడిపై ఆగ్నేయాస్త్రాన్ని సంధించాడు. వెంటనే అర్జునుడు వారుణాస్త్రాన్ని వదిలాడు. భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు వచ్చి కర్ణుణ్ణి చుట్టుముట్టారు. చివరికి కర్ణుడి రథసారథినీ, గుర్రాల్నీ వధించారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్ణుడిని దుర్యోధనుడు, ద్రోణుడు, జయద్రథుడు వచ్చి కాపాడారు. అంతటితో ఆ రోజు యుద్ధం ముగిసింది.

## అభిమన్యుడు

రాజా! పదమూడోరోజు ద్రోణాచార్యులవారు ఒక దుర్భేద్యమైన వ్యూహాన్ని పన్నారు. దానిని ఛేదించలేకపోయారు పాండవవీరులు. అదే పద్మవ్యూహం. దానిని అర్జునుడు, అభిమన్యుడు, ప్రద్యుమ్నుడు ఈ ముగ్గురే ఛేదించగలరు. అర్జునుణ్ణి సంశప్తకులు (త్రిగర్తరాజు సుశర్మ మొదలైనవాళ్ళు) చుట్టుముట్టారు. కాబట్టి అభిమన్యుణ్ణి పంపాడు ధర్మరాజు.

అభిమన్యుడు అరివీరభయంకరుడై వ్యూహంలోనికి చొచ్చుకు వచ్చి వీరంగం సృష్టించాడు. అతడి పరాక్రమానికి ద్రోణాచార్యుడితో సహా అందరూ ఆశ్చర్యపోయారు. అభిమన్యుడి వెనుక భీముడు మొదలైన వీరులు వస్తున్నారు. అయితే వాళ్ళను సైంధవుడు అడ్డగించాడు. అతడు శివవరప్రసాది. ఆ వరం వల్ల పాండవవీరుల్ని ముందుకు పోకుండా నిలువరించాడు.

అభిమన్యుడు ఒంటరిగానే వ్యూహంలోనికి ముందుకు వెళ్ళి కర్ణుణ్ణీ, దుర్యోధనుణ్ణీ తరిమికొట్టి, లక్ష్మణకుమారుణ్ణి వధించి స్వైరవిహారం చేశాడు. 'అభిమన్యుడు రథంపై ఉన్నంతవరకూ, అలాగే అతడి చేతిలో విల్లు ఉన్నంతవరకూ ఎవరూ ఏమీ చేయలేరు. కాబట్టి వాటికి అతణ్ణి దూరం చెయ్యాలి' అన్నాడు ద్రోణుడు. అప్పుడు కౌరవవీరులందరూ కలిసి అలాగే చేశారు. అయినా

అభిమన్యుడు కిందపడ్డ రథచక్రాన్ని తీసుకొని విజృంభిస్తుంటే అందరూ కలిసి రకరకాల ఆయుధాలతో అభిమన్యుణ్ణి చంపివేశారు.

***

పాండవ శిబిరంలో విషాదం. వేదవ్యాసమహర్షి వచ్చి పాండవులకు ధైర్యం చెప్తున్నాడు.

వ్యాసుని మాటలతో ఊరట చెందాడు ధర్మరాజు. క్షత్రియ ధర్మాన్ని అనుసరించి వీరస్వర్గమలంకరించిన అభిమన్యుడు స్వర్గ సుఖాలు అనుభవిస్తాడు అని సంతృప్తి చెంది 'మునీంద్రా! పూర్వ మహారాజులు చేసిన యజ్ఞయాగాలు ఏమిటి? వాటి ఫలితము ఏమిటి'అని అడిగాడు.

ధర్మరాజు మనసులో మాట గ్రహించిన వ్యాసుడు 'ధర్మరాజా! నీ కుమారుడు అభిమన్యుడు కూడా పూర్వపు మహారాజుల్లాంటి వంటి వాడే. కాబట్టి అభిమన్యుడికి ఎలాంటి పుణ్యలోకాలు లభిస్తాయా అని నీ చింత అంతే కదా'అన్నాడు.

వెంటనే ధర్మరాజు 'అవును మహాత్మా! నీకు తెలియనిది ఏముంటుంది?దాని గురించే వినాలనుకుంటున్నాను'అన్నాడు.

వ్యాసుడు 'ఎన్నో యజ్ఞ యాగాలు, తపస్సులు, దానధర్మాలు చేసిన వారికంటే, ఉదాత్తమైన సద్గుణాలు కలవారికంటే నిస్స్వార్థంగా అభిమన్యుడిలా యుద్ధంలో వీరమరణం పొందిన వారు అంతకంటే ఉన్నతమైన పుణ్యలోకాలు పొందుతారు. అదీ కాక మహారాజులు చేసిన యజ్ఞయాగాదులు గురించీ వారి కర్మానుష్ఠానం గురించీ చెప్పమన్నావు కదా! అయితే విను.

## సువర్ణష్ఠీవి కథ

'పూర్వం సృంజయుడు అనే ఒక రాజు ఉండేవాడు. అతడికి సంతానంలేదు. అందుకోసం అతడు చేయని కర్మ లేదు. ఎప్పుడూ బ్రాహ్మణులను పూజిస్తుండే వాడు. అతడికి నారదుడు మంచి మిత్రుడు. అందువల్ల నారదమహర్షి సృంజయుడి వద్దకు తరచుగా వస్తుండేవాడు. యథాప్రకారంగానే ఒక రోజు అక్కడికి నారదమహర్షి వచ్చాడు. అప్పుడు అక్కడ ఉన్న బ్రాహ్మణులు అంతా కలిసి సృంజయుడి కోరిక తీర్చమని నారదమహర్షిని ప్రార్థించారు.

అప్పుడు నారదమహర్షి 'మిత్రమా! నీ కోరిక ఏమిటో నాకు ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు?' అని అడిగాడు.

దానికి సృంజయుడు 'నారదుడితో తనకు గుణవంతుడు రూపవంతుడు అయిన కుమారుడు కావాలి. అయితే ఆ పుత్రుడి స్వేద, మూత్రాదులన్నీ చివరికి కన్నీరు సైతం బంగారం కావాలి' అని కోరుకున్నాడు.

నారదుడు నవ్వి 'తథాస్తు' అని వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళకు నారదుడి వరప్రభావంతో ఒక కుమారుడు జన్మించాడు. అతడికి సృంజయుడు సువర్ణష్ఠీవి అని నామకరణం చేశాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు.

ఆ కుమారుడివల్ల అతడి ఇంట్లో ఎక్కడ చూసినా బంగారమే. పడుకునే మంచం, కూర్చునే ఆసనం, ఇళ్ళూ, ప్రాకారాలూ ఇలా సమస్త వస్తువులూ సువర్ణమయం అయిపోతున్నాయి. ఇది తెలిసిన కొందరు దొంగలు ఒకరోజు సువర్ణష్ఠీవిని అపహరించుకుని అరణ్యానికి పారిపోయారు. అక్కడ వారు రాజకుమారుణ్ణి చంపి, పొట్ట చీల్చి చూశారు. బంగారం కనపడలేదు. ఇక ఆ శవాన్ని అక్కడే వదలి వెళ్ళిపోయారు. కానీ వాళ్ళు చేసిన పాపం వాళ్ళను వదల్లేదు. వెంటాడింది.వాళ్ళలో వాళ్ళే కొట్టుకుని మరణించారు.

సృంజయుడు తన కుమారుడి కోసం వెతికించాడు. అడవిలో అతడి మృతదేహం లభించింది. ఏడుస్తూ అంత్యక్రియలు జరిపించాడు.

పుత్రశోకంతో అలమటిస్తున్న సృంజయుణ్ణి పలకరించడానికి నారదుడు వచ్చి 'సృంజయా! ఎంత ఏడిస్తే మాత్రం పోయివాళ్ళు తిరిగి వస్తారా! ఇలా ఏడుస్తూ కూర్చుంటే నీ ప్రాణాలూ పోతాయి. కాబట్టి బాధపడవద్దు. పూర్వం మరుత్తు అనే రాజు ఎన్నో యాగాలు చేసి, బంగారం, వెండి వస్త్రాలు దానం చేసి. అమితమైన కీర్తి గడించాడు. అలాంటి మరుత్తు ఏడీ? ఇప్పుడు ఉన్నాడా! కాలగర్భంలో కలిసి పోలేదూ! సుహోత్రుడు అనే మరో మహారాజు అనేక పుణ్యకార్యాలు చేశాడు. అతడు కూడా ఇప్పుడు లేడు కదా? అంగుడు అనే చక్రవర్తి ఎన్నెన్నో విలువైన రత్నాదికాలు బ్రాహ్మణులకు దానం చేశాడు. అతడు కూడా నశించిపోయాడు!

శిబి చక్రవర్తి కూడా ధనం కోసం ప్రజలను అడగకుండానే పరమేశ్వరుడు ఇచ్చిన ధనంతోనే అనేక అశ్వమేధాలు నిర్వహించాడు. లెక్కలేనన్ని గోవులను బ్రాహ్మణులకు దానం చేశాడు. అతడూ ఈ లోకాన్ని విడిచివెళ్ళకుండా ఉండలేకపోయాడు కదా! మరి శ్రీరాముడి చరిత్ర నీకు తెలీదూ! చిన్న వయసులో రాక్షససంహారం చేసి, రావణాసురుణ్ణి సంహరించి జనరంజకంగా పరిపాలన చేసిన దశరథరాముడూ అవతారం చాలించాడు కదా! గంగను భూమికి తీసుకు వచ్చిన భగీరథుడూ అద్భుతమైన క్రతువు చేసి ఎన్నో దానధర్మాలు చేసిన దిలీపమహారాజు, ఈ భూమిని చక్కగా పరిపాలించి, అగ్నిష్టోమ, అశ్వమేధ, వాజపేయ, అతిరాత్ర, పౌండరీకాది యజ్ఞాలు చేసి కీర్తి గడించిన యయాతి మహారాజు పరలోకగతుడయ్యాడు. ఇలా చెప్పుకుంటూపోతే మహామహులైన అంబరీషుడూ, శశిబిందుమహారాజు, రంతిదేవుడు, భరతుడు, పృథుచక్రవర్తి, భార్గవరాముడు మొదలైనవాళ్ళు కూడా మృత్యువునుంచి తప్పించుకోలేపోయారు.

అలాంటి వారికే మృత్యువు తప్పనప్పుడు ఇక సామాన్యుల సంగతి చెప్పాలా! కాబట్టి సృంజయా!నీ కుమారుడు వీరికంటే ఉదాత్తుడైనా సరే! మృత్యువు నుండి తప్పించుకోలేడు'అన్నాడు.ఆ మాటలు విని కొంచెంసేపు మౌనంగా ఉండి ఆ తరువాత సృంజయుడు 'నారదా! నీ మాటలు నాకు ఊరట కలిగించాయి. నేను ప్రశాంతచిత్తుడ నయ్యాను'అన్నాడు.

నారదుడు 'సృంజయా! నీకు ఏం కావాలో కోరుకో' అని అడిగాడు.

సృంజయుడు 'మహర్షీ! నువ్వు నాకు ప్రసన్నుడవయ్యావు. అంతకంటే కావలసినదేముంటుంది?'అన్నాడు.

దానికి నారదుడు 'సృంజయా ఇడుగో! నీ కుమారుడు. అంటు సువర్ణష్ఠీవిని బతికించి సృంజయుడికి తెచ్చి ఇచ్చాడు.

సృంజయుడు ఆనందంతో తన కుమారుడికి అస్త్రశస్త్రవిద్యలన్నీ నేర్పి ఆ తరువాత వివాహం జరిపించాడు. అతడికీ సంతానం లభించింది. ఆ తరువాత కాలం తీరిపోగానే అతడూ మరణించాడు.

ధర్మరాజా! మృత్యువును జయించడం ఎవరితరం కాదు. నీ కుమారుడు అభిమన్యుడు వీరస్వర్గం అలంకరించాడు. కాబట్టి అతడి మృతికి చింతించకు. కర్తవ్యాన్ని నిర్వహించు' అని వ్యాసుడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

***

అప్పుడే సంశప్తకుల్ని చంపి శిబిరానికి వచ్చాడు అర్జునుడు. అభిమన్యుడి మరణవార్త అతడి హృదయాన్ని కలచివేసింది. ఇంతటికీ కారణం అయిన ఆ సైంధవుణ్ణి రేపు సూర్యుడు అస్తమించేలోగా వధిస్తాననీ, అలా చేయలేకపోతే గురుద్రోహం, బ్రహ్మద్రోహం చేసిన వాడినౌతాననీ, అంతేకాదు; గాండీవంతో సహా ప్రాణత్యాగం చేస్తాననీ ప్రతిజ్ఞ చేశాడు.

ఆ విషయం అక్కడ సైంధవుడికి తెలిసింది. గజగజ వణికిపోయాడు. 'నీకేం భయంలేదు. మేమున్నా'మని కౌరవవీరులు అండగా నిలిచారు. ఇక్కడ అర్జునుడు శ్రీకృష్ణుడిని శరణువేడాడు. ఎలాగైనా తాను ప్రతిజ్ఞ నిలుపుకొనేలా చెయ్యమన్నాడు. సరేనన్నాడు శ్రీకృష్ణుడు.

పద్నాలుగో రోజు. ద్రోణుడు శకటవ్యూహాన్ని పన్ని, అందులో భాగంగా పద్మ, సూచీవ్యూహాల్ని రూపొందించాడు. సైంధవుడికి రక్షణ కవచంలా పెద్ద ఎత్తున సైన్యం మోహరించింది.

కౌరవ సైన్యం నుంచి ముందుగా దుర్మర్షణుడు వచ్చాడు. వాణ్ణి క్షణంలో తోకముడిచేలా చేసి అర్జునుడు, శరవేగంతో దూసుకువచ్చాడు. శకటవ్యూహం మొనలో ఉన్న ద్రోణుడికి నమస్కరించి 'గురువర్యా! నా ప్రతిజ్ఞ నెరవేరాలని ఆశీర్వదించండి' అన్నాడు. మనసులో ఆశీస్సులందిస్తూనే అర్జునుణ్ణి లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నాడు ద్రోణుడు. అయినా అర్జునుడు వేగంగా దూసుకుపోయాడు. దారిలో అడ్డువచ్చిన కేకయుడు, ప్రభద్రకుడు, నారాయణుడు, శ్రుతాయుధుడు, శ్రుతాయువు, అయుతాయువు మొదలైన వాళ్ళను సంహరించాడు.

అర్జునుడి విజృంభణను చూసి దుర్యోధనుడు 'ఆచార్యా! మీరు పాండవ పక్షపాతం చూపిస్తున్నారు. అర్జునుణ్ణి లోపలికి ఎందుకు రానిచ్చారు?' అని నిందించాడు. అందుకు ద్రోణుడు 'నేను వ్యూహానికి ముందు భాగంలో లేకపోతే

పాండవ సైన్యం లోపలికి ప్రవేశిస్తుంది. అప్పుడు సైంధవుణ్ణి కాపాడడం ఇంకా కష్టం. కాబట్టి ఇదుగో ఈ కవచం వేసుకో! ఇది బ్రహ్మదేవుడి దగ్గర నుండి పరంపరగా వచ్చిన కవచం. ఇది ధరించినవాడిని ఏ అస్త్రమూ ఏ శస్త్రమూ ఏమీ చేయలేదు' అని పంపాడు.

అర్జునుడు విందానువిందుల్ని మట్టి కరిపించి దుర్యోధనుడిపై బాణాల్ని వెల్లువలా వేశాడు. అయితే దుర్యోధనుడు నిక్షేపంలా ఉన్నాడు. అది కవచ ప్రభావమని శ్రీకృష్ణుడు చెప్పడంతో అర్జునుడు ఎలాంటి కవచాన్నైనా ఛేదించగలిగే అస్త్రాన్ని వేస్తానని బయటకు తీశాడు. అలాంటి అస్త్రాన్ని పూర్వం అంగిరసుడు ఇంద్రుడికి ఇస్తే ఇంద్రుడు అర్జునుడికి ఇచ్చాడు. ఇంతలో అశ్వత్థామ వచ్చి అర్జునుడి చేతిలోని అస్త్రాన్ని ఖండించాడు. అర్జునుడు తీవ్రమైన కోపంతో దుర్యోధనుడి రథాన్ని, రథసారథినీ గుర్రాలనూ నేలకూల్చాడు.

అక్కడ వ్యూహం ముందుభాగంలో ధర్మరాజు ద్రోణుడికి పట్టుబడ్డాడు. కానీ ద్రోణుడు దయతలచి వదిలిపెట్టాడు. లోపలినుంచి పాంచజన్యనాదం వినబడింది. కానీ దానివెంటనే అర్జునుడి శంఖధ్వని వినబడలేదు. ధర్మరాజు కంగారుపడి, సాత్యకిని పంపాడు.

అప్పటికే అలంబాసురుణ్ణి ఘటోత్కచుడు సంహరించాడు.

సాత్యకిని కృతవర్మ అడ్డగించాడు. అతణ్ణి దెబ్బతీసి ముందు సాగిపోయాడు. జలసంధుణ్ణి వధించాడు. అప్పుడు సాత్యకిని కురువీరులు చుట్టుముట్టారు. సాత్యకి వాళ్ళందర్నీ ఒక ఆట ఆడిస్తున్నాడు.

అక్కడ ధర్మరాజు ఈసారి భీముణ్ణి పంపాడు. భీముడు సైన్యం మొనలో ఉన్న ద్రోణుడి రథాన్ని, రథసారథినీ నుగ్గునుగ్గు చేసి, ఆచార్యుడిని వదిలి లోపలికి ప్రవేశించాడు. లోపల అర్జునుడు కనిపించగానే సింహనాదం చేశాడు. అది విని ధర్మరాజు అర్జునుడు బ్రతికే ఉన్నాడని ఊపిరి పీల్చుకున్నాడు.

భీముడితో కర్ణుడు తలపడ్డాడు. అతడికి సాయంగా దుర్జయుడు, దుర్ముఖుడు వచ్చారు. వాళ్ళిద్దరినీ భీముడు వధించాడు. అంతేకాదు ఆ తరువాత దుర్మర్ష, దుర్మద, దుస్సహాదుల్నీ సంహరించాడు.

కర్ణుడికీ భీముడికీ యుద్ధం హోరాహోరీగా జరిగింది. భీముడు కర్ణుణ్ణి నానా రకాలుగా హింసించాడు. కర్ణుడు తన సర్వశక్తుల్నీ ఒడ్డి భీముణ్ణి నేలమీదికి పడగొట్టి అవమానించాడు. ఆ అవమానానికి అర్జునుడు కర్ణుణ్ణి వధించాలని బయలుదేరాడు. ఇంతలో అశ్వత్థామ వచ్చి అడ్డుపడ్డాడు.

ఆ తరువాత సాత్యకి భూరిశ్రవుణ్ణి సంహరించాడు. శ్రీకృష్ణార్జునులు సైంధవుడివైపు కదిలారు. అశ్వత్థామ, దుర్యోధనుడు వాళ్ళను అడ్డగించారు. అప్పటికే సంధ్యాసమయం కావస్తోంది. 'మనం కొద్దిసేపు అర్జునుణ్ణి ఆపగలిగితే చాలు! పదండి!' అంటూ అందరినీ కూడదీశాడు దుర్యోధనుడు. అందరూ సైంధవుడికి రక్షణ కవచంలా ఏర్పడి అర్జునుడితో యుద్ధం చేస్తున్నారు.

ఇంతలో శ్రీకృష్ణుడు ఒక మాయచేశాడు. ఆకాశంలో చీకటి వ్యాపించింది. చీకటి పడింది. ఇక సైంధవుడు బతికిపోయాడు. అర్జునుడి ప్రతిజ్ఞ భగ్నమై పోయింది' అని కౌరవవీరులు ఆయుధాలు దించారు. అంతలోనే చీకటి మాయ మయ్యింది. అర్జునుడు వేసిన ఒక బాణం రయ్యిన దూసుకొని వచ్చి సైంధవుడి తలను ఖండించింది. అయితే ఆ తల నేలమీద పడకుండా శమంతపంచకంలో తపస్సు చేసుకుంటున్న వృద్ధక్షత్రుడి ఒళ్ళో పడేలా కొట్టమన్నాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు అలాగే చేశాడు.

వృద్ధక్షత్రుడు సైంధవుడికి తండ్రి. సైంధవుడు పుట్టిన కొద్దిసేపటికి 'వీడు యుద్ధరంగంలో తలతెగి మరణిస్తాడు' అని ఆకాశవాణి చెప్పిందట. అప్పుడు వృద్ధక్షత్రుడు 'నా కొడుకు తలను ఎవడు నేలమీద పడవేస్తాడో వాడి తల వెయ్యి ముక్కలవుతుంది' అని శపించాడట.

ఇప్పుడు ఆ తల వచ్చి వృద్ధక్షత్రుడి ఒళ్ళో పడింది. తపస్సులో ఉన్న అతడు ఏదో హఠాత్తుగా ఒళ్ళో పడేసరికి కంగారుగా దానిని నేలపైకి విసిరేశాడు. అంతే! అతడి తల వెయ్యిముక్కలయ్యింది.

సైంధవుడి మరణంతో దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని తీవ్రంగా నిందించాడు. ద్రోణాచార్యుడు బాధపడ్డాడు. 'సరే! ఈ రోజు రాత్రి కూడా యుద్ధం చేద్దాం! పాంచాల రాజుల్ని చంపిగానీ నా కవచం తీయను' అన్నాడు.

అలా ఆరోజు రాత్రి యుద్ధం మొదలయ్యింది. దుర్యోధనుడు ధర్మరాజుతో పోరాడి మూర్ఛ పోయాడు. భీముడు భానుమంతుడి కొడుకునూ, ధ్రువుణ్ణీ, జయరాతుణ్ణీ వధించి కురుకుమారుల్ని చిత్రహింసలు పెట్టాడు. అప్పుడు కర్ణద్రోణులు వచ్చి వాళ్ళను కాపాడారు.

ఇంతలో ఘటోత్కచుడు తన కొడుకు అంజనపర్వుడితో వచ్చి కౌరవ సైన్యంలో ప్రళయం సృష్టిస్తున్నాడు. ద్రోణుడు, అశ్వత్థామ పోరాడుతున్నారు. అశ్వత్థామ వేసిన అస్త్రానికి ఘటోత్కచుడు కొంతసేపు మూర్ఛపోయాడు. అప్పుడు కర్ణుడు వచ్చి వీరవిహారం చేస్తున్నాడు. శ్రీకృష్ణుడు అతణ్ణి నిలువరించడానికి ఘటోత్కచుణ్ణి పంపాడు. ఘటోత్కచుడికీ కర్ణుడికీ యుద్ధం ఘోరభీకరంగా సాగుతోంది.

బకాసురుడి తమ్ముడు అలాయుధుడు కౌరవుల వైపు వచ్చాడు. ఘటోత్కచుడు అతణ్ణి వధించాడు. రాత్రి పెరుగుతున్న కొద్దీ ఘటోత్కచుడి బలం పెరుగుతోంది. అతడు సృష్టిస్తున్న బీభత్సాన్ని ఆపకపోతే కౌరవులకు ఈ రాత్రే చివరి రాత్రి అయ్యేలా ఉందన్నాడు దుర్యోధనుడు. వెంటనే అతడి సూచనతో ఇంద్రుడు తనకు ఇచ్చిన 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు కర్ణుడు. అంతే! అది ఘటోత్కచుణ్ణి వధించింది.

శ్రీకృష్ణుడు ఆనందంగా పాంచజన్యం పూరించాడు. 'అందరూ ఘటోత్కచుడు మరణించాడని విషాదంలో ఉంటే ఏమిటీ ఆనందం బావా?' అడిగాడు అర్జునుడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! ఘటోత్కచుడు రాక్షసుడు. వాడు తర్వాతైనా లోకాన్ని పీడించవచ్చు. అలాంటివాడిప్పుడు వీరస్వర్గాన్ని పొందాడు. అది అలా ఉంచు. నీ కోసం కర్ణుడు దాచిన ఆయుధం ఖర్చు అయిపోయింది. కాబట్టి విజయం నీదే' అన్నాడు. అర్జునుడు ఆనందించాడు.

ఘటోత్కచుడి మరణానికి బాధపడుతున్న ధర్మరాజును వేదవ్యాసుడు వచ్చి ఓదార్చాడు. 'మరో అయిదురోజుల్లో నీకు విజయం లభిస్తుంది' అని దీవించి వెళ్ళిపోయాడు.

ఇరుసైన్యాలూ కొంతసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ యుద్ధం ప్రారంభించాయి. ద్రోణుడి చేతిలో ద్రుపదుడూ విరాటరాజూ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఇంతలో సూర్యోదయం అయ్యింది. కొంత విరామం తరువాత

మళ్ళీ యుద్ధం ప్రారంభమయ్యింది. మహారాజా! అది పదిహేనో రోజుయుద్ధం. ఆ రోజూ ద్రోణుడు పాండవసేనలను ఊచకోత కోస్తూనే ఉన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'ధర్మరాజా! ద్రోణుడు వినేలా 'అశ్వత్థామా హతః' అని బిగ్గరగా అని 'కుంజరః' అని మెల్లగా అను. భీముడు అశ్వత్థామ అనే పేరు కల ఏనుగును చంపాడు. కాబట్టి అది అసత్యం కాదు' అన్నాడు.

ధర్మరాజు అలాగే చెప్పటంతో ద్రోణుడు క్రుంగిపోయి, అస్త్రసన్యాసం చేశాడు. పరమాత్మనే ధ్యానిస్తూ కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు ద్రోణుడి శరీరంలో నుండి ఒక దివ్యజ్యోతి పైకి వెళ్ళింది. రాజా! అది నాకు, శ్రీకృష్ణార్జున ధర్మరాజకృపులకు మాత్రమే కన్పించింది. తర్వాత ధృష్టద్యుమ్నుడు పాండవులు వారిస్తున్నా వినకుండా ద్రోణుడి తలను ఖండించాడు.

అశ్వత్థామ తన తండ్రి మరణ వార్త విని కోపంతో రగిలిపోయాడు. పాండవులపైకి నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు వీరులనందరినీ ఆయుధాలు విడిచిపెట్టమన్నాడు. ఆయుధాలులేని వాళ్ళని నారాయణాస్త్రం ఏమీ చెయ్యదు. అందుకే శాంతించి వెళ్ళిపోయింది.

అశ్వత్థామ కోపంతో ఈసారి ఆగ్నేయాస్త్రం వేశాడు. అర్జునుడు బ్రహ్మాస్త్రం వేసి దాని ఆటకట్టించాడు. తన వద్ద ఉన్న అస్త్రాలన్నీ అయిపోవడంతో దిగులుగా వెళ్ళిపోయాడు అశ్వత్థామ.

వేదవ్యాసుడు అశ్వత్థామ వద్దకు వచ్చి, 'అశ్వత్థామా! శ్రీకృష్ణార్జునులు సామాన్యులు కారు. సాక్షాత్తూ నరనారాయణులు. నువ్వు వాళ్ళను ఏమీ చెయ్యలేవు. మనసు ప్రశాంతంగా ఉంచుకో' అని చెప్పి అర్జునుడి వద్దకు వెళ్ళాడు. అర్జునుడు నమస్కరించి 'మహర్షీ! నేను యుద్ధం చేస్తుంటే నా ముందు ఒక వీరుడు నిలబడి శూలంతో శత్రువుల్ని చంపుతున్నాడు. అతడి వెనుక ఉండి నేను బాణాలు వేస్తూ నేనే చంపుతున్నానని అనుకుంటున్నాను. అయితే అతడి పాదాలు నేలను తాకడం లేదు. ఇంతకీ అతడెవరు?' అని అడిగాడు. దానికి వేదవ్యాసుడు 'అర్జునా! అతడెవరో కాదు! సాక్షాత్తూ పరమశివుడు!' అని చెప్పి వెళ్ళిపోయాడు.

# కర్ణపర్వం

ద్రోణుడు మరణించడంతో పదహారోరోజు కురుసేనలకు సర్వసైన్యాధ్యక్షుడు కర్ణుడు అయ్యాడు. కర్ణుడు మకరవ్యూహం పన్నితే, పాండవులు అర్ధ చంద్రవ్యూహంతో ముందుకువచ్చారు. యుద్ధం మొదలయ్యింది. అటు భీముడు. ఇటు కర్ణుడు. అదే సమయంలో నకులుడూ, సాత్యకి తక్కువవారా! విందానువిందుల్ని చంపివేశారు.

నకుల – కర్ణుల యుద్ధం. నకులుడు నిరాయుధుడయ్యాడు. కర్ణుడు ప్రాణభిక్ష పెట్టి వదిలివేశాడు.

అర్జునుడు సంశప్తక సైన్యాలను చీల్చి చెండాడుతున్నాడు. ధర్మరాజుతో దుర్యోధనుడు తలపడ్డాడు. అశ్వత్థామ అర్జునుణ్ణి నిలువరిస్తున్నాడు. అయినా కృపుడు, కృతవర్మ, దుశ్శాసనుడూ మొదలైన వీరుల్ని చెదరగొడుతూనే ఉన్నాడు అర్జునుడు. యుధామన్యువు, శిఖండి, ఉత్తమౌజసుడు, ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడు, చేది – కరూశ – మత్స్య– కేకయ – వత్స రాజ్య సైన్యాలు కర్ణుడిపై విరుచుకుపడడంతో కర్ణుడు మాత్రం తొణకకుండా బెణకకుండా పోరాడుతున్నాడు. అర్జునుడూ శరపరంపరతో విరుచుకు పడుతున్నాడు. అప్పటికే సమయం కావడంతో యుద్ధం ముగిసింది.

రాజా! ఆ రోజు రాత్రి కౌరవులంతా సమావేశమయ్యారు. కర్ణుడు 'సుయోధనా! ఇంద్రుడు ఇచ్చిన శక్తి ఆయుధం చేజారిపోయింది కాబట్టి అర్జునుడు ధైర్యంగా ముందుకువస్తాడు. దివ్యాస్త్రాల విషయంలో నేనేమీ తక్కువకాదు. అంతేకాదు బలంలో, యుద్ధనైపుణ్యంలో నాదే పైచెయ్యి. నాకు పరశురాముడు 'విజయం' అనే విల్లును ఇచ్చాడు. అది నా చేతుల్లో ఉంది. నువ్వు నిశ్చింతగా ఉండు. శ్రీకృష్ణుడికి సమవుజ్జీ శల్యుడే. అతణ్ణి నాకు సారథిగా నియమించు' అని అడిగాడు.

దుర్యోధనుడు కర్ణుణ్ణి తీసుకొని వెళ్ళి శల్యుణ్ణి రథసారథిగా ఉండమని కోరాడు. శల్యుడు ఒప్పుకోలేదు. కానీ నువ్వు శ్రీకృష్ణుడికి సమవుజ్జీవని పొగడడంతో ఒప్పుకున్నాడు. అయితే 'నేను ఇష్టం వచ్చినట్లు మాట్లాడతాను. వాటిని పట్టించుకొని నన్ను తిడితే నేను వెనక్కి వచ్చేస్తాను' అని షరతు పెట్టాడు.

పదిహేడోరోజు అర్జునుడు శత్రుసైన్యాల్ని చీల్చుకుంటూ కర్ణుడివైపు వస్తున్నాడు. ఇక్కడ శల్యుడు సూటిపోటి మాటలతో కర్ణుణ్ణి గాయపరుస్తూనే ఉన్నాడు. ఆ మాటలకు కర్ణుడు పాండవసైన్యంపై మరింత రెచ్చిపోయాడు. పాండవవీరులు ధీటుగానే సమాధానం చెబుతున్నారు. అంతలో సాత్యకి, ద్రౌపదిపుత్రులు, శిఖండి, నకుల సహదేవులూ, భీముడూ అందరూ బాణవర్షం కురిపించారు కర్ణుడిపై. వీళ్ళందరికీ సమాధానం చెప్తూనే కర్ణుడు ధర్మరాజు మీదికి వెళ్ళాడు. బాణాలతో బాధించాడు. ధర్మరాజు తనే స్వయంగా రథం నడుపుకుంటూ పారిపోతున్నాడు. కర్ణుడు వెంటబడి మరీ అతణ్ణి ఎద్దేవా చేశాడు. ఈసారి భీముడు కోపంతో ఒక బల్లెం విసిరాడు. అది కర్ణుడి రొమ్మును తాకింది. దాంతో కర్ణుడు మూర్ఛపోయాడు.

అర్జునుడు తనను చుట్టుముట్టిన సంశప్తకవీరుల్ని మట్టికరిపించి కర్ణుడి కోసం వస్తుంటే మధ్యలో అశ్వత్థామ అర్జునుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేశాడు బాణాలతో. అప్పుడు శ్రీకృష్ణుడు ప్రోత్సహించడంతో ఉత్సాహం తెచ్చుకొని అర్జునుడు అశ్వత్థామను పరుగులుపెట్టించాడు.

కొంతసేపటికి కోలుకున్న కర్ణుడు పాండవసైన్యాన్ని హడలెత్తించాడు. క్రమక్రమంగా పట్టు సాధించాడు. అయితే అంతలోనే శల్యుడు అతణ్ణి మాటలతో నిందిస్తూ నీరుగారుస్తున్నాడు. అయినా దుర్యోధనుడి ప్రోద్బలంతో కర్ణుడు భార్గవాస్త్రం ప్రయోగించాడు. దాని నుండి వేలకొద్దీ బాణాలు వచ్చి శత్రు సైన్యంలోని రథాల్నీ, ఏనుగుల్నీ, గుర్రాల్నీ, భటుల్నీ మట్టి కరిపించాయి. అందరూ హాహాకారాలు చేస్తున్నారు. ఇది సరైన సమయం కాదని అర్జునుణ్ణి తీసుకొని శ్రీకృష్ణుడు శిబిరానికి వెళ్ళిపోయాడు.

శిబిరంలో దిగులుగా ధర్మరాజు.

శిబిరానికి వచ్చి కర్ణుడు ఇంకా చావలేదని చెప్పారు శ్రీకృష్ణార్జునులు. ధర్మరాజు కోపంతో 'అర్జునా! నువ్వూ ఒక వీరుడివేనా? ఇంకా కర్ణుణ్ణి

చంపలేకపోయావు' అంటూ ఇష్టం వచ్చినట్లు తిట్టిపోశాడు. చివరిగా 'నీ గాండీవం శ్రీకృష్ణుడికి ఇచ్చెయ్యి' అన్నాడు. ఆ మాట ఎవరైనా అంటే వాడి తల తీసేస్తానని పూర్వమే ప్రతిజ్ఞ చేశాడు అర్జునుడు. అందుకే వెంటనే ధర్మరాజుపైకి కత్తి దూశాడు. శ్రీకృష్ణుడు అడ్డుపడి –

**కం. సత్యంబు నహింసయు నను**
**నత్యుత్తమ ధర్మయుగళమందు నహింసన్**
**సత్యము గాచుట ధర్మ మ**
**సత్యమున నహింస గావఁ జను నంద్రు బుధుల్ (కర్ణ: 3–73)**

**అర్జునా! సత్యమూ, అహింసా రెండూ గొప్ప ధర్మాలే! అహింసను సత్యం ద్వారా కాపాడడం చాలా గొప్పది. అలా కుదరకపోతే అసత్యంతోనైనా అహింసను కాపాడవచ్చు.** ఇది పెద్దల మాట. అంతేకాదు.

**ఆ.వె. ప్రాణహాని వచ్చు పట్టున, సర్వధ**
**నాపహార వేళయందు, నడపు**
**సత్య మనృత మంద్రు సత్యంబు సూ**
**నృతమని పరిగ్రహింతు రార్యజనులు (కర్ణ: 3–77)**

**ప్రాణానికి హాని కలిగితేనూ, ధనం మొత్తం పోయేటప్పుడూ, సత్యాన్ని అసత్యంగా అసత్యాన్ని సత్యంగా భావించవచ్చు. కాబట్టి నువ్వు ధర్మరాజును నిందించావంటే, అతణ్ణి చంపినట్లే' అన్నాడు.**

**అర్జునుడు అలాగే చేసి, ఆ తరువాత ధర్మరాజును క్షమాపణలు కోరాడు. పెద్దల్ని దూషించిన దోషం ఆ క్షమాపణలతో తొలగిపోయింది.**

మళ్ళీ యుద్ధరంగంలోనికి వచ్చారు శ్రీకృష్ణార్జునులు. అర్జునుడు పాములపై విరుచుకుపడే గరుత్మంతుడిలా వీరవిహారం చేస్తున్నాడు. ఇంతలో సాత్యకి – కర్ణుడి కొడుకు సుషేణుణ్ణి అతడి కళ్ళముందే మట్టికరిపించాడు. రాజా! మరోవైపు భీముడు దుశ్శాసనుడిపై విరుచుకుపడ్డాడు. జబ్బలు చరుస్తూ పిలిచి గదాఘాతంతో అతడి తలను పగలగొట్టాడు. అంతే! దెబ్బకి దుశ్శాసనుడు నెత్తురు కక్కుతూ నేలపై పడ్డాడు. అయినా భీముడు మళ్ళీ వాడి శరీరాన్ని గిరగిరా తిప్పి కసిగా నేలపై కొట్టాడు. వెచ్చని నెత్తురు వాడి వక్షస్థలాన్ని చీల్చుకొని ఉబికివచ్చింది. ఆ

రక్తాన్ని దోసిటపట్టి వళ్ళంతా చల్లుకొని జబ్బలు చరుచుకుంటూ సింహనాదం చేశాడు భీముడు.

కర్ణుడు వీరావేశంతో 'అర్జునా! రా! తేల్చుకుందాం! నువ్వో నేనో!' అంటూ ముందుకు వచ్చాడు.

కర్ణార్జునులు తలపడబోతున్నారు. ఆకాశంలో దేవతలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇద్దరూ ఎవరికి ఎవరూ తీసిపోలేదు. అస్త్రం మీద అస్త్రం వేసుకొంటూనే ఉన్నారు. అర్జునుడు బ్రహ్మాస్త్రం వేశాడు. కర్ణుడూ బ్రహ్మాస్త్రంతో దాన్ని తిప్పికొట్టాడు. చివరికి అర్జునుడు బాణాల్ని వరుసగా గుప్పించి కర్ణుడి కవచాన్ని ముక్కలు చేశాడు. కర్ణుడు నాగాస్త్రం వేశాడు. అది అర్జునుడి తలకు తగలకుండా శ్రీకృష్ణుడు రథాన్ని అయిదంగుళాలు భూమిలో కిందికి దించాడు. అప్పుడా అస్త్రం అర్జునుడి కిరీటాన్ని తాకింది. నాగాస్త్రం విఫలం కావడంతో కర్ణుడు రకరకాల అస్త్రాలను ప్రయోగిస్తున్నాడు. అంతలో పూర్వం ఒక విప్రుడిచ్చిన శాపం వల్ల అతడి రథం భూమిలోనికి కూరుకుపోయింది. భార్గవాస్త్రాన్ని ప్రయోగిద్దామనుకున్నాడు కానీ ఆ మంత్రాలు గుర్తుకు రాలేదు. రథచక్రాన్ని పైకి తియ్యాలని ప్రయత్నిస్తుంటే అర్జునుడు బాణాన్ని సంధిస్తున్నాడు. అప్పుడు కర్ణుడు 'అర్జునా! ఆగు. రథం లేని వాడిపై బాణం వెయ్యటం యుద్ధధర్మం కాదు' అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు నవ్వి –

'ఓహో! కర్ణా! నీకు ధర్మం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? లక్క ఇంట్లో పాండవుల్ని చంపాలని ప్రయత్నించినప్పుడూ, ద్రౌపదిని నిండు సభలో అవమానించినప్పుడూ, అభిమన్యుణ్ణి ఇలాగే నిరాయుధుణ్ణి చేసి చంపినపుడూ ఏమయింది ఈ ధర్మం?' అన్నాడు.

అర్జునుడు ఆలస్యం చెయ్యలేదు. దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. అది త్రిశూలంగా మారి కర్ణుడి తలను తుంచివేసింది.

కౌరవసైన్యంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. అందరూ చూస్తుండగానే ఒక దివ్యజ్యోతి కర్ణుడి శరీరంలో నుండి వచ్చి ఆకాశంలో కలిసిపోయింది.

# శల్యపర్వం

పద్దెనిమిదో రోజున యుద్ధానికి సర్వసైన్యాధ్యక్షుడు శల్యుడు. అంతకుముందే కృపాచార్యుడు 'జరిగినదేదో జరిగింది. ఇకనైనా సంధి చేసుకో' అని దుర్యోధనుడికి హితబోధ చేశాడు. కానీ దుర్యోధనుడు వినలేదు.

శల్యుడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నాడు. పాండవులవైపు భీమార్జునులు కౌరవసేనల్ని అల్లకల్లోలం చేయడం ప్రారంభించారు. మరోవైపు ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ధర్మరాజు, నకుల సహదేవులూ విజృంభిస్తున్నారు.

అటువైపు శల్యుడూ పాండవసైన్యాన్ని కకావికలం చేస్తూనే ఉన్నాడు. కృపాచార్యుడు, కృతవర్మ, శకుని, అశ్వత్థామలు తోడుగా నిలుస్తున్నారు.

సహదేవుడు శల్యుడి కుమారుడైన రుక్మాంగదుణ్ణి వధించాడు. అది చూసి కోపంతో చెలరేగిపోయాడు శల్యుడు. కానీ భీముడి ధాటికి తట్టుకోలేక మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకొని, ధర్మరాజుతో యుద్ధం మొదలుపెట్టాడు. పాండవసైన్యాన్ని నానాతిప్పలు పెట్టాడు. చివరికి ధర్మరాజు అతడిపైకి 'మహాశక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించడంతో శల్యుడు మరణించాడు.

ఆ తరువాత సాత్యకి సాళ్వుణ్ణి, సహదేవుడు – శకుని కొడుకు ఉలూకుడినీ, శకునినీ సంహరించాడు. కౌరవ సైన్యంలో ఒకటే హాహాకారాలు. సైన్యం ఛిన్నాభిన్నమైపోతోంది. అది చూసిన దుర్యోధనుడు ఒంటరిగా యుద్ధరంగం నుంచి నిష్క్రమించాడు.

మహారాజా! ఇదంతా చూస్తూ నేను యుద్ధరంగంలో తిరుగుతూ ఉంటే నన్ను సాత్యకి చంపాలని చూశాడు. కానీ వేదవ్యాసుడు ప్రత్యక్షమై నన్ను రక్షించాడు.

అక్కణ్ణుంచి ద్వైపాయనహ్రదానికి వెళ్ళాను. అక్కడే నీ కొడుకు దుర్యోధనుడు కన్పించాడు. ఒళ్ళంతా గాయాలు. ఆ మడుగులో దాక్కొని విశ్రాంతి తీసుకోవాలని లోపలికి ప్రవేశించాడు. అతడికి 'జలస్తంభనవిద్య' తెలుసు.

పాండవులూ దుర్యోధనుడికోసం వెదుకుతున్నారు. ఈ మడుగులో ఉన్నాడని కొందరు వేటగాళ్ళ ద్వారా తెలుసుకొని అక్కడికి వచ్చారు. దుర్యోధనుణ్ణి తమ మాటలతో రెచ్చకొట్టారు. దానికి దుర్యోధనుడు – నాకు రాజ్యంపై కోరికలేదు. దానిని మీరే ఏలుకోండి' అన్నాడు. అప్పుడు ధర్మరాజు 'దుర్యోధనా! నువ్వెవరు నాకు దానం చేయడానికి? వీరుడైన వాడు దానం స్వీకరించడు. నిన్ను చంపి ఆ పరాక్రమంతోనే రాజ్యాన్ని చేపడతాం. రా! నువ్వు వీరుడివే అయితే రా!' అన్నాడు.

'సరే! నేను ఒక్కడిని మీరు అయిదుగురు. బాగా అలసిపోయాను. కాబట్టి ఒక్కొక్కరు రండి. తేల్చుకుందాం!' అన్నాడు దుర్యోధనుడు. అప్పుడు శ్రీకృష్ణుడి ప్రోత్సాహంతో తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడానికి భీముడు రంగంలోనికి దిగాడు. అప్పుడే బలరాముడు తీర్థయాత్రలు ముగించుకొని అక్కడికి చేరుకున్నాడు.

అది శమంతపంచకం. అక్కడే భీమదుర్యోధనుల మధ్య ద్వంద్వయుద్ధం మొదలయ్యింది. రెండు మదించిన ఏనుగులు కొట్టుకొంటున్నట్లు ఉంది. వారి అరుపులతో గదల చప్పుళ్ళతో వాటి నుండి వచ్చే నిప్పురవ్వలతో దిక్కులు నిండిపోతున్నాయి. ఇద్దరూ ఇద్దరే! ఎవరూ తక్కువకాదు. అప్పుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! భీముడికి బలం ఉంది కానీ సరైన సాధన లేదు. సుయోధనుడు సాధన చేసీ చేసీ రాటుదేలిపోయాడు. అందుకే చూడు! ఎలా తప్పించుకొంటున్నాడో! వెళ్ళు. దుర్యోధనుణ్ణి తొడలమీద కొట్టి చంపమని చెప్పు. ఇది ధర్మాధర్మాల గురించి ఆలోచించే సమయం కాదు' అన్నాడు.

అర్జునుడి సూచనతో భీముడు గదను గిరగిరా తిప్పి అమాంతంగా దుర్యోధనుడి తొడపై దభేలుమని కొట్టాడు. అంతే! దుర్యోధనుడు

కుప్పకూలిపోయాడు. అయినా దుర్యోధనుణ్ణి కాళ్ళతో తన్నుతూ భీముడు సింహనాదం చేశాడు.

తన కళ్ళముందే తన ప్రియశిష్యుడిని అధర్మంగా నేలకూల్చినందుకు బలరాముడుకి ఆగ్రహం ముంచుకు వచ్చింది. తన నాగలిని తీసుకొని భీముడి మీదికి వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణుడు బలరాముడికి దుర్యోధనుడు చేసిన దురాగతాలన్నీ చెప్పి, శాంతింపజేశాడు. ధర్మరాజూ అధర్మయుద్ధానికి కొంత బాధపడినా శ్రీకృష్ణుడి మాటలకు శాంతించాడు.

***

కౌరవుల శిబిరం నిర్మానుష్యంగా ఉంది. పాండవులు అందులోనికి ప్రవేశించారు. శ్రీకృష్ణార్జునులు రథం నుండి దిగి దూరంగా రాగానే ఆ రథం భస్మమైపోయింది. 'అర్జునా! భీష్మద్రోణాది వీరులు వేసిన అస్త్రాలకు ఈ రథం ఎప్పుడో భస్మమైపోవాల్సింది. నేను దీనిని నా శక్తితో ఇప్పటిదాకా కాపాడాను' అన్నాడు శ్రీకృష్ణుడు.

తరువాత అందరూ ఓఘవతీ తీరానికి వెళ్ళారు. అక్కణ్ణుంచి శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి ధృతరాష్ట్రుడినీ గాంధారినీ ఓదార్చాడు. అక్కడికి వేదవ్యాసుడు కూడా వచ్చి వాళ్ళకు హితోపదేశం చేసి వెళ్ళిపోయాడు.

రాజా! రక్తం మడుగులో పడి ఉన్న దుర్యోధనుడి వద్దకు కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ వచ్చారు. నేనూ వెళ్ళాను. అప్పుడు దుర్యోధనుడు –

**కం. మనుజులకు నిట్టి చందము**
**మును ధాత సృజించినది, ప్రమోదము, ఖేదం**
**బును వచ్చును బర్యాయం**
**బున, దీని నెఱుగవలదె పురుషుం దనఘా!** (శల్య: 2–406)

**మానవులకు ఏది జరగాలో దానిని బ్రహ్మ ముందే రాసిపెట్టేస్తాడు. దాని ప్రకారమే సుఖమూ, దుఃఖమూ ఒకదాని తర్వాత ఒకటి వస్తూ ఉంటాయి. అది తెలుసుకోవాలికదా!** నా కోసం ఇంతమంది మరణించారు. అయితే నేను ధర్మయుద్ధం చేశానన్న తృప్తితో స్వర్గానికి వెళ్తాను. మీరు నా కోసం బాధపడకండి' అన్నాడు.

దుర్యోధనుణ్ణి చూసి అశ్వత్థామ చలించిపోయాడు. 'రారాజా! ఆజ్ఞాపించు. శ్రీకృష్ణుడి కళ్ళముందే ఈ లోకాన్ని అపాండవం చేస్తాను' అన్నాడు ఆవేశంగా.

దుర్యోధనుడు ఆనందించాడు. అశ్వత్థామనే తన చిట్టచివరి సైన్యాధ్యక్షుడిగా నియమించాడు.

# సౌప్తికపర్వం

మహారాజా! అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మా తమ తమ రథాలపై దక్షిణ దిక్కుగా ఉన్న పాండవ శిబిరాలవైపు బయలుదేరారు. ఆ సమయంలో పాండవ శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఇదే అదను అనుకొని అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మల్ని తీసుకొని లోపలికి ప్రవేశించాడు. కానీ ఆసమయంలో అక్కడికి పోతే వారి చేతిలో చావు తప్పదని అక్కడి నుండి తూర్పుదిక్కుగా వెళ్లారు. కొంతదూరం వెళ్ళాక ఒక కొలను కనిపించింది. అక్కడ సాయంసంధ్యావందనం ముగించి రాత్రికి అక్కడే ముగ్గురూ నేల మీద పడుకున్నారు.

పాండవుల్ని నిద్రలోనే మట్టుపెట్టాలన్నది అశ్వత్థామ ఆలోచన. దానికి మొదట కృపాచార్యుడు ఒప్పుకోలేదు. తరువాత ఒప్పుకోక తప్పలేదు. అసలు ఆ ఆలోచన అశ్వత్థామకు ఎలా వచ్చిందంటే దానికో సంఘటన జరిగింది.

కృపాచార్యుడూ, కృతవర్మ నిద్రపోయారు. కానీ అశ్వత్థామకు నిద్రపడితే ఒట్టు. లేచి దిక్కులుచూస్తూ కూర్చున్నాడు. అక్కడే ఓ మర్రిచెట్టు. దానిమీద ఎన్నోకాకులు గూళ్లు కట్టుకొని ఉన్నాయి. ఆ గూళ్లలో ఎన్నో కాకిపిల్లలు నిద్రిస్తూ ఉన్నాయి. ఆ సమయంలో ఒక గుడ్లగూబ ఆ చెట్టుమీద వాలింది. చప్పుడు చేయకుండా ఆ కాకి గూళ్లను సమీపించి, కొన్ని కాకుల పీకలు కొరికింది. మరికొన్నింటిని కాళ్లు విరుగగొట్టింది. కొన్నింటి రెక్కలు విరిచింది. పొట్టలు చీల్చింది.

అశ్వత్థామమెదడులో ఒక మెరుపులాంటి ఆలోచన.

ధర్మాధర్మాలగురించి ఇప్పుడు ఆలోచించవలసిన అవసరం లేదు అని నిశ్చయించుకొని వెంటనే తన మేనమామ కృపాచార్యుణ్ణీ, కృతవర్మను మేల్కొలిపి నిద్రపోతున్నప్పుడే గుడ్లగూబలాగా శత్రువుల్ని చంపాలన్న తన ఆలోచనను బయటపెట్టాడు ఇద్దరిముందూ.

**కృపాచార్యుడు అప్పుడు అశ్వత్థామతో - ఏ పనికైనా పురుష ప్రయత్నం, దైవసాహాయ్యం రెండూ తప్పకుండా కావాలి.**

**ఆ.వె. కాఁపు లావు వెరవు గల్గి కర్శనము సే**
**యంగ వృష్టి దగినయట్లు గలుగ**
**ఫలము గల్గునట్లు పౌరుషంబునకు దై**
**వంబు తోడుపాటు వలయు నెందు (సౌప్తిక: 1-31)**

**'అశ్వత్థామా! ఒక పని జరగాలంటే దానికి పురుషప్రయత్నం, దైవానుగ్రహం రెండూ ఉండాలి. రైతు భూమిని దున్ని విత్తనాలు చల్లకపోతే వాన కురిసినా పంట పండదు. అలాగే రైతు విత్తనాలు జల్లితే వానకురవకపోయినా పంట పండదు. ఈ రెండూ జరగాలి. అప్పుడే కృషి సఫలం అవుతుంది. కాబట్టి ధర్మం తప్పకూడదు. అప్పుడే ఫలం, గౌరవం దక్కుతాయి.**

**ధర్మం తప్పకుండా చేసే ఏ పనికైనా దైవసాయం ఉంటుంది. ఆ పని సానుకూలమవుతుంది. అధర్మంతో చేసే పనులు ప్రారంభంలో మంచి ఫలితాన్ని ఇచ్చినా, కాలక్రమంలో అవి ఆ వ్యక్తిని బాధిస్తాయి.** మన సుయోధనుడి విషయంలో ఇదే జరిగింది. సుయోధనుడు వివేకం కోల్పోయాడు. క్రోధం, మోహం మనసులో గూడు కట్టుకుపోయి, దురభిమానంతో, ఎన్ని చెప్పినా వినకుండా పాండవులనూ ద్రౌపదినీ పరాభవించాడు. దానికి తగిన ఫలితం అనుభవిస్తున్నాడు. కాబట్టి ధర్మాన్ని తప్పకుండా మనం మన కార్యం నెరవేర్చాలి.

**క్రోధం, లోభం, భయం వీటన్నింటితో ఒక దుర్మార్గుడు చెలరేగి పోయినప్పుడు సజ్జనులు అతడికి హితవు పలుకుతారు. అయినా అతడు వారి మాటల్ని పెడచెవిన పెట్టి తాను చేయదలుచుకున్న దుర్మార్గాల్ని చేసితీరతాడు. అలా చేసిన వాటికి ఫలితాన్నీ అనుభవిస్తాడు.** తప్పదు. దుర్యోధనుడు చేసింది ఇదే! అందుకే అతడికి ఈ స్థితి వచ్చింది. అయినా అతడు ఇంకా బతికే ఉన్నాడు కదా! మనమెందుకు సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం? అదీగాక అర్ధరాత్రి నిద్రపోతున్న వాళ్ళని చంపడం తప్పు!.

ఇప్పుడు మనం అందరం ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్దాం. అతడూ గాంధారీ ఏం చెబితే అది ఆచరిద్దాం. పైగా అక్కడ విదురుడు ఉండనే ఉంటాడు.' అన్నాడు కృపాచార్యుడు.

'మామా! ధర్మం దేశ కాలమాన పరిస్థితులను బట్టి మారుతుంటుంది. ఒకడు ధర్మం అనుకొన్నది మరొకడికి అధర్మం కావచ్చు. పేదవాడుగా ఉన్నప్పుడు ధర్మంగా తోచినదే ధనవంతుడైనపుడు అధర్మంగా తోచవచ్చు. కాబట్టి నేను నమ్మినదే ధర్మం. దానిని ఆచరించడానికి భయపడను. నేను బ్రాహ్మణుణ్ణి. కానీ నా దౌర్భాగ్యం కొద్దీ విల్లు పట్టాను. క్షాత్రం అవలంబించాను. ఇంతకాలం తరువాత మళ్ళీ నేను బ్రాహ్మణ్యం వైపు ఎలా వెళ్తాను? అది నాకు చేతకాని పని.

అస్త్రసన్యాసం చేసిన నాతండ్రిని ఒకడు దారుణంగా చంపాడు. వాడింకా బతికే ఉన్నాడు.నా తండ్రిని చంపినవాడు బతికి ఉండగా నేను మనశ్శాంతితో ఎలా ఉండగలను? ఈరోజు, నాపగ చల్లార్చుకుంటాను.

నా శత్రువులు అందరూ విజయగర్వంతో ఆనందోత్సాహాలలో తేలియాడుతున్నారు. వాళ్ళు అలా అలసిసొలసి గాఢంగా నిద్రపోతున్నారు. ఇదే మంచి సమయం. పైగా మనం బతికి ఉన్నామని వాళ్లకు తెలియదు. నేను వచ్చి వాళ్ళను వధిస్తాను. వాళ్ళు ఊహించను కూడా ఊహించలేరు. మామా! ఇదే నా శపథం. ఆ నీచుడు ధృష్టద్యుమ్నుడి పీక పట్టుకుంటాను. వాడి మదం అణుస్తాను. వాడిని అస్త్రశస్త్రాలతో చంపను. పశువును చంపినట్టు చంపుతాను. పాండవులను, పాండవసుతులను నా ఇష్టంవచ్చినట్టు అత్యంత దారుణంగా వధిస్తాను. వారి రక్తంతో నాతండ్రికి పితృతర్పణం విడుస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ. నా ప్రస్తుత కర్తవ్యం' అని అన్నాడు అశ్వత్థామ.

దానికి కృపాచార్యుడు.'సరే! అశ్వత్థామా! మనం ముగ్గురం బాగా అలసిపోయాం. ఈ రాత్రికి విశ్రాంతి తీసుకో. రేపు ఉదయమే మన ప్రయత్నం ప్రారంభిద్దాం' అన్నాడు.

'కృపాచార్యా! **కోపం ఉన్నవాడికీ, ధనం సంపాదించాలన్న యావ ఉన్నవాడికీ, వ్యాధిగ్రస్థుడికీ , కామంతో కళ్లు మూసుకుపోయిన వాడికీ**

**నిద్రపడుతుందా.** నా శరీరం దహించుకు పోతోంది. నా తండ్రి మరణాన్ని తలుచుకొని నాగుండెలు రగులుతున్నాయి. ఈ రాత్రికి రాత్రే నా శత్రువులను చంపి, నా స్వామి సుయోధనుడి ఋణం తీర్చుకోవాలి. అంతదాకా నాకు నిద్రరాదు' అన్నాడు అశ్వత్థామ.

**'అశ్వత్థామా! కోపం ఉన్నవాడికి విచక్షణ ఉండదు. ప్రస్తుతం నీ స్థితీ అదే. ధర్మాధర్మాలు మరిచిపోతున్నావు. కాబట్టి ధర్మమార్గంలో నడువు. నీకు మేలు కలుగుతుంది. కాబట్టి కోపం, క్రూరత్వం, విడిచినా మాటలు సావధానంగా విను. నిద్రించే వారినీ, ఆయుధాలు విడిచిపెట్టిన వారినీ, వాహనం విరిగిపోయిన వారినీ, శరణుచొచ్చినవారినీ, జుట్టుముడి వీడినవారినీ వధించడం ధర్మం కాదు.** ఈ సమయంలో పాండవుల సమస్త సైన్యమూ, పాండవులూ, పాంచాలురూ, అందరూ గాఢనిద్రలో ఉంటారు. నిద్రపోయే మనిషి చచ్చినవాడితో సమానం. మహారథుడివైన నీకు ఇలాంటి నీచపు టాలోచన ఎలా వచ్చింది?' అన్నాడు కృపాచార్యుడు.

'మామా! కృపాచార్యా! నువ్వు పెద్దవాడివి. నువ్వు చెప్పినదంతా సత్యమే. కానీ నేను చెప్పేది కూడా వినండి. అందరు రాజులు చూస్తుండగా అస్త్రసన్యాసం చేసిన నా తండ్రిని, పాంచాల రాజకుమారుడైన ఆ ధృష్టద్యుమ్నుడు జుట్టుపట్టుకొని మరీ తల నరికాడే. శిఖండిని అడ్డంపెట్టుకొని భీష్ముడిని అర్జునుడు పడగొట్టాడే! ఇవన్నీ ధర్మాలేనంటావా? ఇంకా చెప్పాలంటే చాలా ఉన్నాయి. ఇదంతా ఎందుకు. ఎక్కడో మడుగులో దాక్కున్న రారాజును బయటకు లాగి, అందరూ చుట్టుముట్టి, అధర్మంగా తొడలు విరుగగొట్టి మరీ పడగొట్టారే! మామా! తొడలు విరిగి నేల మీదపడి ఉన్న రారాజు నన్ను చూసి దీనంగా పలికిన పలుకులు నువ్వు వినలేదా! నీకు కోపం రాలేదా! అందుకనే మామా! నేను చేసేది అధర్మమైనా సరే బాధపడను. భయపడను. నాతండ్రిని అధర్మంగా చంపిన ధృష్టద్యుమ్నుణ్ణి ఆ అధర్మమార్గంలోనే చంపుతాను. దానివల్ల నేను పురుగై పుట్టినా బాధపడను. ఇది నా నిశ్చయం. నన్ను ఆపడం ఎవరితరమూ కాదు.' అంటూ రథం ఎక్కాడు అశ్వత్థామ.

ఇక చేసేది లేక ఎలాగూ కలిసే వచ్చాము కాబట్టి మేమూ వస్తామని కృపాచార్యుడు, కృతవర్మ రథాలు ఎక్కారు. వారి రథాలు పాండవుల శిబిరాల వైపు సాగిపోయాయి.

అశ్వత్థామ ముందుకు దూసుకుపోతున్నాడు. కృపాచార్యుడు కృతవర్మ వెనుకబడ్డారు. ఆ సమయమున ఒక భయంకరమైన భూతం అశ్వత్థామ ఎదురుగా వచ్చి నిలిచింది. ఎంత ప్రయత్నించినా దాన్ని అణచలేక పోయాడు. దిక్కుతోచని స్థితిలో శివుణ్ణి ప్రార్థిస్తూ అక్కడే ఉన్న ఒక అగ్నిగుండంలోనికి ఆత్మార్పణం చేసుకోవాలని దూకాడు. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై 'అశ్వత్థామా! ఇదుగో దివ్యఖడ్గం. తీసుకో! నీ వల్ల పాండవయోధుల్లో కొంతమందికి నేటితో ఆయువు తీరబోతోంది' అంటూ తన తేజస్సును అశ్వత్థామలో ప్రవేశపెట్టాడు.

ఒక్కసారిగా అశ్వత్థామకి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయ్యింది. వెంటనే కృపుణ్ణీ, కృతవర్మనీ అక్కడే ఉంచి శిబిరంలోనికి దూసుకుపోయాడు.

అపర రుద్రావతారంలా రెచ్చిపోతూ ధృష్టద్యుమ్నుడు, ఉత్తమౌజుడు మొదలైన వీరుల్ని వాళ్ళ వాళ్ళ శిబిరాలల్లోనే దారుణంగా వధించాడు. పాండవ శిబిరాల్లో ఒకటే హాహాకారాలు.

శిఖండి, ఉపపాండవులు, అశ్వత్థామను నిలువరించారు. కానీ అతడి ముందు నిలువలేక అతడి కత్తికి బలైపోయారు. కృపాచార్యుడూ, కృతవర్మ తక్కిన పాండవవీరుల్ని దొరికినవాళ్ళను దొరికినట్లు మట్టుపెట్టారు. శ్రీకృష్ణుడు, పాండవులు మాత్రం వాళ్ళకు దొరకలేదు. నేరుగా దుర్యోధనుడి వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పారు. దుర్యోధనుడు సంతోషంగా ప్రాణాలు విడిచాడు.

మహారాజా! అర్ధరాత్రి అశ్వత్థామ సృష్టించిన బీభత్సం గురించి తెలిసి ధర్మరాజు కుప్పకూలిపోయాడు. ద్రౌపది ఉపప్లావ్యం నుండి హుటాహుటిన బయలుదేరి వచ్చింది. శిబిరంలో పీనుగుల్లా పడి వున్న తన కొడుకుల్ని చూసి చలించిపోయింది. బోరున ఏడుస్తూ పెద్దగా ఆక్రోశిస్తూ 'ప్రభూ! ఆ అశ్వత్థామ తల తీసుకురాకపోతే నా ప్రాణాలు దక్కవు' అని హెచ్చరించింది. ఈ పని నీవల్లనే అవుతుందని భీముణ్ని రెచ్చగొట్టి పంపింది.

భీముడు నకులుడితో కలిసి బయలుదేరాడు. ఆ వెనుక శ్రీకృష్ణుడు ధర్మరాజునూ, అర్జునుణ్ణీ తీసుకొని బయలుదేరాడు.

కొంతదూరం వెళ్ళాక అశ్వత్థామ తపస్సు చేసుకుంటూ కన్పించాడు. భీముడు అతణ్ణి చూడగానే ఆవేశంగా అరుస్తూ యుద్ధానికి కవ్వించాడు.

కళ్ళు తెరిచాడు అశ్వత్థామ. వెంటనే పక్కనే ఉన్న గడ్డిపరకను పీకి మంత్రం చదివి విసిరాడు. అదే 'బ్రహ్మశిరోనామకం' అనే అస్త్రం అయ్యింది. 'ఆలస్యం చెయ్యకు అర్జునా! నువ్వూ అదే అస్త్రాన్ని ప్రయోగించు' అన్నాడు శ్రీకృష్ణుడు.

అర్జునుడు ప్రయోగించాడు. ఆ రెండు అస్త్రాలూ భీకరంగా ఢీకొన్నాయి. వాటి శక్తికి ప్రకృతి విలవిలలాడిపోయింది. వెంటనే నారదమహర్షి వేదవ్యాసమహర్షి అక్కడికి వచ్చి ఇద్దరినీ ఆ అస్త్రాలను ఉపసంహరించమని చెప్పారు. అర్జునుడు ఉపసంహరించాడు. అశ్వత్థామకు సాధ్యం కాలేదు.

అప్పుడు అశ్వత్థామ 'మహాత్మా! భీముడు సుయోధనుణ్ణి చంపాడన్న కోపంలో బుద్ధి లేక ఈ అస్త్రాన్ని ప్రయోగించాను. దీన్ని ఉపసంహరిస్తే భీముడు నన్ను బతకనివ్వడు' అంటూ ఏడ్చాడు.

అప్పుడు వేదవ్యాసుడు 'నాయనా! అశ్వత్థామా! ఇకనైనా రాగద్వేషాలు విడిచిపెట్టు. నీ తల మీద ఉన్న మణిని తీసి ఇవ్వు. దానిని ఇస్తే నీ తలను ఇచ్చినట్లే. పాండవులు తృప్తిగా వెళ్ళిపోతారు' అన్నాడు.

అశ్వత్థామ దానిని తీసి భీముడికి ఇచ్చి 'ఈ అస్త్రం పాండవులకు కాక, పాండవుల పత్నుల గర్భాలకు హాని కలిగించి సంతృప్తి చెందుగాక!' అని పైకి అన్నాడు. కానీ మనసులో పాండవుల సంతానానికే కాక వాళ్ళ సంతానానికి కూడా హాని కలగాలని భావించాడు. దానివల్ల ఆ అస్త్రం ఉత్తరాగర్భంలో పెరుగుతున్న శిశువును చంపడానికి బయలుదేరింది.

శ్రీకృష్ణుడు అది గ్రహించి తన సుదర్శన చక్రాన్ని అడ్డువేసి ఆ శిశువును రక్షించి 'ఓరీ మూర్ఖా! ఇంత దారుణానికి ఒడిగట్టిన నువ్వు తిండి లేక, సాయం చేసే వాళ్ళు దొరక్క కంపుకొట్టే శరీరంతో మూడువేల సంవత్సరాలు తిరుగుతూ ఉండు' అని శపించాడు.

అశ్వత్థామ తలవంచుకొని మౌనంగా అడవుల్లోకి వెళ్ళిపోయాడు.

అశ్వత్థామ శిరస్సు నుండి తీసిన మణిని పాండవులు తెచ్చి ద్రౌపదికి ఇచ్చారు. అప్పుడామె శాంతించి, ఆ మణిని ధర్మరాజును ధరించమని అతడికి ఇచ్చింది.

## స్త్రీపర్వం

'మహారాజా! అంతా సర్వనాశనం అయిపోయింది. మనవైపు అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, వాళ్ళవైపు పాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు మాత్రమే మిగిలారు' అన్నాడు సంజయుడు.

తన నూరుగురు కుమారులు యుద్ధంలో మరణించారని తెలిసిన ధృతరాష్ట్రుడు మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు. అతడి హృదయం కకావికలై పోయింది. దుఃఖభారంతో తనలో తనే కుమిలిపోతున్న ధృతరాష్ట్రుడిని చూసి సంజయుడు–

'మహారాజా! ఏమిటీ పిచ్చితనం? ఎవ్వరికోసం మీ దుఃఖం? కురుక్షేత్ర మహాసంగ్రామంలో 18 అక్షౌహిణుల సైన్యం మట్టిగొట్టుకొని పోయింది. నీ తాతలు, తండ్రులు, అన్నలు, తమ్ములు, మిత్రులు, బంధువులు, ఇలా ఒకరేమిటి ఎందరో రాజులు, నీకోసం నీ కొడుకులకోసం అసువులు బాశారు. వారందరికీ దహన సంస్కారాలు చెయ్యాలి కదా! పద యుద్ధభూమికి' అన్నాడు.

ధృతరాష్ట్రుడు చలించలేదు. తలబాదుకుంటూ 'సంజయా! నా కొడుకులంతా మరణించారు. నా వైభవం తుడిచిపెట్టుకొని పోయింది. ఇంత దీనంగా బతకడం దేనికి! ఈశరీరం మాత్రం నాకెందుకు చెప్పవయ్యా! ఒకరి దయాదాక్షిణ్యాల మీద బతకడానికా! ఇదీ ఒక బతుకేనా! బతికి నేను సాధించే దేముంది?

శ్రీకృష్ణుడు సంధి చేయాలని చాలా ప్రయత్నించాడు. ఎంతగానో నాకు నచ్చ చెప్పాడు. భీష్ముడూ ద్రోణుడూ నాకు హితం చెయ్యాలని పరితపించారు. పరశురాముడు లాంటి మహానుభావులూ ఎన్నోవిధాల చెప్పి చూశారు. కానీ నేను వింటేగా. వాళ్ళు చెప్పిన మాటలు పెడచెవిని పెట్టాను. ఇదుగో ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాను.

కన్న కొడుకులూ బంధుమిత్రులూ, సామంతరాజులూ అందరూ మరణించారు. వారికి దహనక్రియలు చెయ్యడానికే నన్నట్లు నేను మాత్రం బతికి ఉన్నాను.

సంజయా! రాబోయే ఆపద తెలిసి కూడా పాండవులకు రాజ్యభాగం ఇవ్వలేదంటే నేనెంతో మూర్ఖుణ్ణి కదూ! నేనే నా చేతులారా కొడుకులనూ బంధువులనూ దూరం చేసుకున్నాను. ఇది నా పూర్వజన్మ కర్మఫలం. అంతే కాక మరేమిటి?

యుద్ధంలో చనిపోయిన వారందరికీ దహనక్రియలు నేను జరిపించాలా ఏం? ధర్మరాజు ఉన్నాడుకదా! నేనెందుకు? నాకొడుకులను చంపి మరీ తమ తమ తమ ప్రతిజ్ఞలు నెరవేర్చుకున్నవారు ఆ పాండవులు. ఈ మాత్రం పని వారు చెయ్యలేరా! అన్నాడు కొంచెం ఉక్రోషంగా. అంతా విని సంజయుడు ఇలా అన్నాడు.

'ధృతరాష్ట్ర మహారాజా! నువ్వు విద్యావంతుడివి. అన్ని శాస్త్రాలూ నీకు తెలుసు. నువ్వే పామరుడిలా ఇలా ఏడుస్తూ కూర్చుంటే అందరూ నిన్ను చూసి నవ్వరా! నీ కొడుకు ఎప్పుడూ ఎదుటి వారినే నిందిస్తాడు. కారణం లేకుండానే కత్తి దుయ్యడానికి సిద్ధంగా ఉంటాడు. విదురుడు చెప్పింది ఏనాడైనా విన్నాడా! పోనీ నువ్వు అతడిని ఆపగలిగావా? బుద్ధి చెప్పావా! కారణం ఏమిటో చెప్పనా? నీకూ నీ కుమారుడికి లోభత్వం బాగా మనసులో నాటుకు పోయింది. అందుకే ఎవరీ మాటా మీరు వినలేదు. దానికి ఒకరిని నిందించడం తప్పు. అంతా నీ స్వయంకృతాపరాధం. జరిగిన దానికి ఈనాడు ఎంత ఏడిస్తే మాత్రం ఏ లాభం? కాబట్టి నీ దుఃఖం విడిచిపెట్టు. చుట్టూ నీకు నువ్వే మంటపెట్టుకొని మధ్యలో కూర్చుని అయ్యో! కాలిపోతున్నాను, కాపాడండి' అంటూ గొంతు చించుకొని అరిచినట్టుంది నీ వ్యవహారం. ఈ పరిస్థితులలో నిన్ను చూసి అందరూ నవ్వుతారు గానీ జాలి పడరు. ఇది తెలుసుకో! నీ కుమారుడి నోటినుండి వచ్చే పరుషోక్తులకూ, అర్జునుడి కోపాగ్నికే నీవారందరూ బూడిదైపోయారు' అంటున్నాడు సంజయుడు.

ఇంతలో విదురుడు అక్కడికి వచ్చి ధృతరాష్ట్రుడిని తానూ ఓదార్చాడు. విదురుడి మాటలకు ఆయన కొంత తేరుకొన్నాడు. తరువాత ఇలా హితవు పలుకుతున్నాడు విదురుడు.

## విదురుడి హితవు

'ధృతరాష్ట్ర మహారాజా! పెరగుట విరగుట కొరకే! కొత్తరుచుల కోసం అర్రులు చాస్తే అసలు రుచే పోతుంది. పుట్టిన ప్రతి మనిషీ గిట్టక తప్పదు. ఎంత దగ్గరయితే అంతదూరం అవుతారు. ఇది ప్రకృతి సహజం. దీనిని తప్పించుకోవడం ఎవరితరమూ కాదు. యమధర్మరాజు తన పాశంతో ప్రాణాలు తీసేటప్పుడు వీడు ధనవంతుడా, పేదవాడా; మహారాజా, వీరుడా, శూరుడా, పిరికివాడా, అని ఎంతమాత్రమూ ఆలోచించడు. మనిషి ఎలాంటి వాడైనా వాడికి మరణం తప్పదు. ఒక్క యుద్ధం వల్లనే మనిషి చావడు! ఇలాగే చావాలని గానీ, ఇక్కడే చావాలని గానీ నియమం లేదు. ఎక్కడున్నా, ఎలా ఉన్నా మరణం తప్పదు. కాబట్టి చావును గురించి, చచ్చినవారి గురించి దుఃఖించడం ఎందుకు? దండగ.

నీ కొడుకులందరూ వీరస్వర్గం అలంకరించారు. వాళ్ళు స్వర్గంలో సుఖంగా కులాసాగానే ఉన్నారు. ఇక్కడ నువ్వే ఏడుస్తున్నావు. ఇది సరికాదు. అయినా నీకు తెలియనిదేముంది! అంతా మిథ్య. అశాశ్వతం. ఏదీ స్థిరంగా ఉండదు. వాటికోసం దుఃఖించడం ఎందుకు? **దుఃఖం అన్ని అనర్థాలకూ మూలం. తెలివైనవారు ఎప్పుడూ దుఃఖించరు.** కాబట్టి దుఃఖాన్ని వదిలి, జరగవలసినది చూడు.

మహారాజా! మామూలు మనుషుల ఆలోచనాపరిధి చాలా తక్కువగా ఉంటుంది. అందుకే వారు చిన్నకష్టం వచ్చినా తట్టుకోలేరు. విలవిలలాడి పోతారు. నచ్చినదేదైనా చెయ్యిదాటిపోతే దుఃఖిస్తారు. వారిజ్ఞానం నశిస్తుంది. చెయ్యకూడని పనులు చెయ్యడానికి కూడా వెనుకాడరు.

కానీ పండితులకూ జ్ఞానులకూ అలా కాదు. ఇది ప్రియం, ఇది అప్రియం అన్నదేదీ ఉండదు. అన్నీ ఒకటే! అంతా సమానమే.' అన్నాడు విదురుడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు 'విదురా! నీమాటలతో నా దుఃఖం పోయింది. నువ్వు ఇప్పుడే చెప్పావు కదా! పండితులూ, జ్ఞానులూ ఇష్టానిష్టాలకు అతీతంగా ఉంటారనీ అన్నీ సమానంగానే చూస్తారనీ. వారు అలా ఎలా ఉండగలరో కాస్త వివరించు' అని అడిగాడు. విదురుడు మళ్ళీ ఇలా చెప్తున్నాడు.

**ఓ ధృతరాష్ట్ర మహారాజా! సంసారం అనే ఈ వృక్షం అరటి చెట్టులా దుర్బలం. చాలా నిస్సారమైనది. కానీ మానవుడు ఈ సంసారంపై అనురక్తితో నిరంతరం బాధలు పడుతున్నాడు. ప్రస్తుతం మనకు ఈ శరీరం లభించింది. ఇది నాశనం కాగానే మరొక శరీరం లభిస్తుంది కానీ శరీరం శాశ్వతం కాదు కదా! ఇది తెలుసుకున్న వాడు నీలా బాధపడడు.**

**ఒక ఇంటి నుండి మరో ఇంటికి వెళ్ళినట్లు, ఒక వస్త్రం విడిచి మరో వస్త్రం ధరించినట్లు ఒక శరీరం పోయాక మరొక శరీరం. కుమ్మరివాడు కుండను చెయ్యడానికి మట్టిని సారె మీద పెట్టి తిప్పుతాడు. అది వెంటనే విరిగిపోవచ్చు. లేక కుండగా మారాక పగిలిపోవచ్చు. లేక అది కాల్చేటప్పుడు గానీ లేదా మనం వాడుకునేటప్పుడు గానీ పగిలిపోవచ్చు. ఏ దశలోనైనా పగిలిపోవచ్చు చెప్పలేం! అలాగే మానవుడు కూడా.**

**తల్లి గర్భంలో అండం రూపంలో ఉన్నప్పుడే విచ్ఛిన్నం కావచ్చు. ఆ పిండం శిశువుగా రూపుదిద్దుకొనే సమయంలోనో, ప్రసవం అయ్యే వేళలోనో, శిశువుగా జన్మించాకో, బాల్య, యౌవన, వృద్ధాప్య దశలలో ఎప్పుడన్నా మరణం సంభవించవచ్చు. కాబట్టి మరణం ఈవిధంగా సంభవిస్తుంది అని చెప్పలేం. మరణానంతరం, మనం చేసిన మంచి చెడుల ఫలితం ప్రకారం మనకు స్వర్గనరకాలు వస్తాయి.**

కాబట్టి మరణించిన వారి గురించి బాధపడకుండా నీ ముక్తిమార్గం గురించి ప్రయత్నించు. ఈ సంసారం ఏదశలోనూ సుఖప్రదం కాదు. కాకపోగా నిరంతర దుఃఖమే కలుగజేస్తుంది. ఈ శరీరంలో ఉన్నప్పుడు మానవులు లోభ, క్రోధ, మదోన్మత్తులై ఎన్నో దుర్మార్గాలు చేస్తారు. కాస్త సుఖం కోసం ఒకరిని ఒకరు

చంపుకుంటారు. ధర్మం వదిలిపెట్టి అధర్మపరులవుతారు. చివరికి యమభటులచేతికి చిక్కుతారు. ఈ విషయాలను పెద్దల ద్వారా విన్న సజ్జనులు మాత్రం, సన్మార్గంలో పయనించి, నిత్యానందాన్ని పొందుతారు.

ఈ సంసారం ఎలాంటిదో, దానిని ఎలా దాటాలో చెబుతాను శ్రద్ధగా విను.

ఒక బ్రాహ్మణుడు అరణ్యంలో నుండి వెళుతున్నాడు. అప్పుడు క్రూర జంతువులు అతడిని చుట్టు ముట్టాయి. ఆ బ్రాహ్మణుడికి భయం వేసి పరుగెత్తాడు. ఆ క్రూరజంతువులు ఎలాగో అతడిని వదిలిపెట్టి వెళ్లి పోయాయి. ఇంతలో ఒక దొంగల గుంపు వచ్చి అడ్డగించింది. ఆ బ్రాహ్మణుడు భయంతో వణికిపోయాడు. కాళ్లు తడబడుతున్నాయి. ప్రాణ భయంతో చలనం లేకుండా ఉండిపోయాడు. దిక్కులు చూస్తున్నాడు. ఆ అడవిలో తనను కాపాడే వాళ్లు ఎవరూ లేరని తెలిసి ఇంకా భయం పట్టుకుంది. వెనక్కి తిరిగి పారిపోతున్నాడు. కాని ఎంత పరుగెత్తినా అడవి వస్తూనే ఉంది. అంతు చిక్కడం లేదు. వెనకనుండి దొంగలు, ముందు నుండి క్రూరమృగాలు తరుముతున్నాయి. ఇంతలో ఒక భయంకరాకారంతో ఉన్న స్త్రీవచ్చి అతడిని కౌగిలించుకుంది. ఐదు తలల ఏనుగులు ఆ అడవిలో తిరగుతున్నాయి. ఆ బ్రాహ్మణుడు. ఆ భయంకరమైన స్త్రీని తప్పించుకొని పరుగెత్తాడు. అంతలో పక్కనే ఒక బావి ఉంది. అయితే ఆ బావి మీద తీగలు దట్టంగా అల్లుకుని బావి ఉన్నట్టు కూడా తెలియడం లేదు. అది తెలియక ఆ బ్రాహ్మణుడు వెళ్ళి వెళ్ళి ఆ బావిలో పడ్డాడు. పడుతూ పడుతూ అదృష్టవశాత్తూ ఒక తీగను గట్టిగా పట్టుకొన్నాడేమో తలకిందులుగా వేలాడుతున్నాడు. కిందికి చూశాడు. ఆ బావిలో ఒకపెద్ద పాము ఉంది. నాలుకలతో విషం కక్కుతూ అతడి మీదికి రాసాగింది. పైకి చూశాడు. 6 తలలు, పన్నెండు కాళ్లూ ఉన్న ఒక ఏనుగు ఆ బావి ఒడ్డున ఉన్న ఒక చెట్టు వద్దకు వచ్చింది. ఆచెట్టు కొమ్మలు రెమ్మలు రకరకాల రంగులతో మెరిసి పోతున్నాయి. తుమ్మెదలు ఆ చెట్టుపూవులలోని మకరందాన్ని తాగుతున్నాయి. కానీ ఆ చెట్టు మొదలును నల్లని, తెల్లని ఎలుకలు కొరుకుతున్నాయి. ఆ చెట్లపూల నుండి కారుతున్న మకరందం ఆ బ్రాహ్మణుడి

నోటిలో బొట్టు బొట్టుగా కారుతుంటే ఆ మధువును తాగుతూ ఆనందిస్తున్నాడు. ఆ మధువు ఎంత తాగినా అతనికి తృప్తి కలగలేదు. తాను ఏ దుస్థితిలో ఉన్నాడో కూడా మరిచిపోయి ఆనందిస్తున్నాడు.

ఈ విధంగా తీగలను పట్టుకొని తలకిందులుగా వేలాడుతున్న ఆ బ్రాహ్మణుడికి కింద ఉన్న పాములు, పైన ఉన్న ఏనుగు, అడవిలో ఉన్న క్రూరమృగాలు, ఆ భయంకరాకారంతో ఉన్న స్త్రీ, చెట్టును కొరుకుతున్న ఎలుకలు, ఆ చెట్టు పడిపోతుందన్న ఆలోచన, చుట్టూ ఝుంకారంతో తిరుగుతున్న తుమ్మెదలు, వీటితో అతని మనసు కకావికలయింది. కాని అతడికి జీవితం మీద వ్యామోహం పోలేదు. ప్రాణాల మీద తీపి చావలేదు' అని అన్నాడు విదురుడు. అంతా విన్న ధృతరాష్ట్రుడు తెల్ల మొహం వేసి 'విదురా! ఈ కథ నాకేమీ అర్థం కాలేదు. వివరంగా చెప్పు'అని అడిగాడు. విదురు ఇలా చెప్పసాగాడు.

'మహారాజా! మన జీవితం లాంటిదే ఈ కథ. ఆ బ్రాహ్మణుడు ప్రయాణం చేస్తున్న అడవే సంసారం. అందులో ఉన్న క్రూరమృగాలు దొంగలు. భయంకరాకారంతో కౌగలించుకున్న స్త్రీముసలితనం. ఐదుతలల ఏనుగు మన పంచేంద్రియాలు. బావిలో ఉన్న పాము యమధర్మరాజు. ఆ బ్రాహ్మణుడు పట్టుకున్న తీగ, జీవించాలన్న ఆశ. బావి ఒడ్డున ఉన్న చెట్టు ఆయుష్షు. దానివంకకు వస్తున్న ఏనుగు ఒక సంవత్సరం. దాని ఆరు తలలు ఆరు ఋతువులు. దానికి ఉన్న పన్నెండు కాళ్లు పన్నెండు నెలలు. ఆ చెట్టును కొరుకుతున్న నల్లని తెల్లని ఎలుకలు, రాత్రి పగలు. ఆ బ్రాహ్మణుడి చుట్టూ ఝుంకారం చేస్తూ తిరుగుతున్న తుమ్మెదలు కోరికలు. ఆ బ్రాహ్మణుడి నోట్లోకి కారుతున్న మకరందం సుఃఖ సంతోషాలు.

తన చుట్టూ ఇన్ని బాధలు ఉన్నా ఆ సుఖసంతోషాల కోసం పాకులాడుతుంటాడు జీవుడు. కలకాలం బతకాలనుకుంటాడు. ఇందులో ఉన్న బ్రాహ్మణుడే జీవుడు. ఇదే సంసార చక్రం. వివేకవంతులైన వాళ్లు ఈ సంసార చక్రం అనే వలలో పడరు. పడకుండా శాశ్వతానందం పొందుతారు. ఒకవేళ పడ్డా ఆ పాశాలను ఛేదించుకొని బైట పడతారు.

నిరంతరం ప్రాపంచిక సుఖాల కోసం వ్యామోహంలో పడి, ఆ బురదగుంటలో మునుగుతూ తేలుతూ తనను తాను మరిచిపోతాడు మానవుడు. శరీరంలో శక్తి తగ్గగానే రోగాలు ఆవరిస్తాయి. ఇంతలో ముసలితనం మీద పడుతుంది. అందం పోతుంది. సుఖాలు అనుభవించడానికి శరీరం పనికిరాదు. చివరకు దిక్కులేని చావు చస్తాడు.

ఆలోచిస్తే ఈ దేహమే ఒక రథం. బుద్ధి రథసారథి. పంచేంద్రియాలే గుర్రాలు. మన ఆలోచనలే పగ్గాలు. పంచేంద్రియాలు అనే గుర్రాలు వేగంగా అటూ ఇటూ పరుగుపెడుతుంటాయి. బుద్ధి అనే పగ్గాలు పటిష్ఠంగా లేకపోతే రథాన్ని గుర్రాలు తమ ఇష్టం వచ్చినట్లు లాగుకొని వెళతాయి. కాబట్టి బుద్ధి తన ఆలోచన లనే పగ్గాలతో పంచేంద్రియాలను నియంత్రించాలి. అలా చేస్తే మానవుడికి సంసార దుఃఖం లేదు.

పుట్టినప్పటి నుండి మన జీవితం యమధర్మరాజు అధీనంలో ఉంటుంది. ఈ జీవితం అనేక దుఃఖాలకు ఆలవాలం. పుణ్యాత్ములు వివేకం అనే మందును ఉపయోగించి తమ దుఃఖాలను తొలగించుకుంటారు. ఈ శరీరం అనే రథాన్ని అదుపులో ఉంచుకుంటారు. వివేకవంతులు తమ గుణశీలాలతో ఆలోచనలనే పగ్గాలను పట్టుకొని ఈ శరీరం అనే రథాన్ని సక్రమమార్గంలో నడిపిస్తారు. వారికి చావుపుట్టుకలంటే భయం ఉండదు. చివరికి మోక్షాన్ని పొందుతారు' అని అన్నాడు విదురుడు.

విదురుడు చెప్పిందంతా విన్నాడు ధృతరాష్ట్రుడు. కుమారులు గుర్తుకు వచ్చారు. ఏడుస్తూ మూర్ఛపోయాడు. పరిచారికలు చల్లని నీళ్లు జల్లి సేద దీర్చారు. ఇంతలో వ్యాసుడు అక్కడికి వచ్చి–

## వేదవ్యాసుడి హితోపదేశం

'కుమారా! నీ దుఃఖం పోగొట్టడానికే నేను ఇక్కడకు వచ్చాను. నువ్వు నీతిశాస్త్ర కోవిదుడివి. **చనిపోయిన వారి కోసం దుఃఖించడం ఎందుకు? ఈ ప్రాణాలు శాశ్వతం కాదు. పుట్టినవాడు గిట్టక తప్పదు. ఇలా జరగాలని విధి**

**నిర్ణయించింది. అలాగే జరిగింది.** కాబట్టి నీ శోకాన్ని పోగొట్టుకో. బాధపడకు. నీమేలు కోరి నీకు దేవరహస్యం ఒకటి చెబుతాను. శ్రద్ధగా విను.

ఒకసారి నేను దేవసభకు వెళ్లాను. అక్కడ ఇంద్రాది దేవతలు, నారదుడు ఉండగా భూదేవి వచ్చి దేవతలను ఇలా అంది. 'దేవతలారా! ఇదివరకు మీరు బ్రహ్మసభలో భూభారం తగ్గిస్తామని తెగ ఉత్సాహం చూపించారు. ఆ తరువాత ఆ ప్రయత్నమే లేదు. నేను భారం భరించలేక పోతున్నాను. దీనిని తగ్గించే ఉపాయం ఆలోచించండి' అని అడిగింది.

అప్పుడు శ్రీమహావిష్ణువు భూదేవీ! దానికి తగిన సమయం వచ్చింది. ధృతరాష్ట్రుడు అనే మహారాజు సంతానంలో దుర్యోధనుడు అనే వాడి కారణంగా నీ భారం అంతా పోతుంది. అది తొందరలోనే జరుగుతుంది. నిశ్చింతగా ఉండు' అన్నాడు.

ఆ మాటలకు సమ్మతించి భూదేవి అక్కడనుండి వెళ్లిపోయింది.

విష్ణువు మాటప్రకారం కలి పురుషుడి అంశతో దుర్యోధనుడు నీకు కొడుకుగా జన్మించాడు. అతడు పరుల ఉన్నతిని సహించలేడు. ఎవరి మాటా వినడు. అందరితోనూ వైరమే. అతడికి తోడు దుశ్శాసనుడు, శకుని, అంగరాజు కర్ణుడు. వారి మాటలు వింటూ ఎన్నో తప్పులు చేశాడు. తాను నశించాడు. అందరినీ నశింప చేశాడు. కాబట్టి ఇది దైవనిర్ణయం. కాబట్టి నువ్వు శోకించవలసిన అవసరం లేదు. పాండవులవల్ల నీకు ఎలాంటి కీడు జరగదు. నీ కుమారుడు దుర్బుద్ధి. సంధి చేసుకోమని ఎంత మంది చెప్పినా ఎవరి మాటా వినలేదు. చివరికి ఫలితం అనుభవించాడు. కాబట్టి అలాంటి కుమారుల గురించి నువ్వు శోకించ పని లేదు.

ధర్మరాజు అజాతశత్రువు. అతడు తోటి మానవులపట్లే కాదు పశు పక్ష్యాదులన్నా జాలి పడతాడు. ఇకమీద పాండవులే నీ కుమారులు. వాళ్ళను ఆదరించు. నువ్వు మహాజ్ఞానివి. ఆ జ్ఞానాగ్నిలో నీ శోకాన్ని దగ్ధం చెయ్యి. శాంతిని పొందు' అని హితవు పలికి వ్యాసుడు ధృతరాష్ట్రుణ్ణి ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

ఆ తరువాత ధృతరాష్ట్రుడు సంజయుడితో చెప్పి గాంధారినీ, అంతఃపుర స్త్రీలను రప్పించి వాళ్ళను తీసుకొని యుద్ధభూమికి బయలుదేరాడు.

పుత్రశోకంతో గాంధారి నడవలేక పోతోంది. కాళ్లు ఆడడం లేదు. ఆమె కోడళ్లు కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తున్నారు. వారి జుట్టు ముళ్ళు ఊడి పోయాయి. పైటలు తొలగిపోయాయి. అయినా పట్టించుకొనే స్థితిలో లేరు. శోకభారంతో కుమిలిపోతున్నారు. కుంతీదేవి మొదలైనవాళ్ళు వారిని ఓదారుస్తున్నారు.

అందరూ యుద్ధభూమికి వస్తున్నారు. హస్తినాపురంలో ఉన్న సైనికుల భార్యలూ, సైనికాధికారుల భార్యలూ పెద్దపెట్టున ఏడుస్తున్నారు. మగవారందరూ యుద్ధంలో మరణించారు కాబట్టి వారిని ఓదార్చే వారే కరువయ్యారు. ఒకరిని ఒకరు ఓదార్చుకుంటూ ఆవేదన చెందుతున్నారు. అందరి ఇళ్లలో ఏడుపులూ పెడబొబ్బలూనూ. ఎక్కడ చూసినా ఆర్తనాదాలే. అవి తప్ప మరొకటి వినిపించడం లేదు.

ఇదంతా చూసి విదురుడు యుద్ధపరిణామాలు ఇంత భయంకరంగా ఉంటాయా? అని మనసులో బాధపడుతూ యుద్ధభూమికి తానూ వెళ్ళాడు. అక్కడ అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుడు వారికి ఎదురు వచ్చి ధృతరాష్ట్రుడితో – 'మహారాజా! నీ కుమారుడు సుయోధనుడు, దేవతలు మెచ్చేలా యుద్ధం చేసి వీరమరణం పొందాడు. మేము ముగ్గురమే మనవైపు మిగిలిన వాళ్ళం. తక్కిన వాళ్ళందరూ మరణించారు' అన్నారు.

కృపాచార్యుడు గాంధారిని చూశాడు. అతడికి దుఃఖం ఆగలేదు. 'అమ్మా! గాంధారీ! నీకుమారులు వీరోచితంగా తమ ప్రాణాలు అర్పించారు. వారి గురించి నువ్వు చింతించవద్దు! అమ్మా! గెలిచిన పాండవులూ సంతోషంగా లేరమ్మా! భీముడు అధర్మయుద్ధంలో సుయోధనుణ్ణి క్రూరంగా చంపాడు. అతడి తలమీద తన్నాడు. మాకు కోపం ఆగలేదు. అందుకే మేం ముగ్గురం అర్ధరాత్రి పాండవశిబిరాలలో ప్రవేశించి, పాండవులను తప్ప మిగిలిన వారందరినీ, చివరికి ఉప పాండవులతో

సహా చాలామందిని దారుణంగా హతమార్చాం. కాబట్టి పాండవులు సాధించిన విజయం వ్యర్థమే. ఆ సమయంలో పాండవులు శిబిరంలో లేరు. కాబట్టి బతికిపోయారు. లేకపోతే ఈ నేల అపాండవం అయ్యేది. సుయోధనుడి చివరి కోరిక నెరవేరేది' అన్నాడు.

'పాండవులు అపరిమితమైన క్రోధంతో మా కోసం వెతుకుతూ ఉంటారు. ఇక సెలవు'. అంటూ వాళ్ళు ముగ్గురూ తమ రథాల మీద వెళ్లిపోయారు.

కొంతదూరం వెళ్లాక కృపాచార్యుడు హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. కృతవర్మ ద్వారకకు వెళ్తే అశ్వత్థామ గంగాతీరంలో ఉన్న వ్యాసమహాముని ఆశ్రమం వైపు సాగిపోయాడు.

ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి వస్తున్నాడు అని తెలిసి ధర్మరాజు తన తమ్ముళ్ళనూ, శ్రీకృష్ణుడినీ తీసుకొని వాళ్ళకు ఎదురువచ్చాడు.

కౌరవవనిత లందరూ ధర్మరాజును చూసి హాహాకారాలు చేశారు. ఇంకొంతమంది ధర్మరాజును తిట్టిపోశారు. 'ఇతడు ధర్మరాజా! ఇతడికి అసలు ధర్మం అంటే ఏమిటో తెలుసా! జాలి, దయ మచ్చుకైనా ఉన్నాయా! నిర్దాక్షిణ్యంగా తండ్రులను, మామలను, తమ్ముళ్లను, కొడుకులను హతమార్చాడే! చదువు చెప్పిన గురువులనూ వదల్లేదే!' అని ఈసడించు కున్నారు.

ఎవరేమన్నా, పాండవులు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయినా ధర్మరాజు శాంతంగానే ఉంటూ వచ్చి ధృతరాష్ట్రుడి పాదాలకు నమస్కరించాడు. వెంటనే ధృతరాష్ట్రుడు అతణ్ణి లేవనెత్తి కౌగిలించుకున్నాడు. తరువాత భీముడు వచ్చాడు. అతణ్ణి కౌగిలించుకోబోయాడు. శ్రీకృష్ణుడు భీముణ్ణి పక్కకు తప్పించి, అతడి స్థానంలో ఒక ఉక్కుబొమ్మను ఉంచాడు. అది భీముడే ననుకొని ధృతరాష్ట్రుడు కోపంతో గట్టిగా ఆ బొమ్మను తన కౌగిట్లో నలిపివేశాడు. అతడి బలానికి ఆ బొమ్మ తునాతునకలై పోయింది. 'అయ్యో! భీమసేనా! అప్పుడే నీకు నిండునూరేళ్ళు నిండిపోయాయా నాయనా!' అంటూ మొసలికన్నీరు కార్చాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అసలు విషయం చెప్పి హితబోధ చేశాడు. ధృతరాష్ట్రుడికి కనువిప్పు కలిగింది. ఈసారి పాండవుల్ని ప్రేమగా కౌగిలించుకున్నాడు.

గాంధారీ అంతే! తనకు నమస్కరించడానికి వచ్చిన ధర్మరాజును శపించాలనుకుంది. కానీ వేదవ్యాసుడు వచ్చి హితబోధ చేసేసరికి ఆమెలోనూ మార్పు వచ్చింది.

తరువాత పాండవులు తమ తల్లి కుంతీదేవిని కలిశారు. ద్రౌపది వచ్చి తన కొడుకుల మరణ దుఃఖాన్ని ఆమెతో పంచుకుంది. కుంతీదేవి ద్రౌపదిని ఓదార్చింది. కొంతసేపటికి గాంధారి కూడా అక్కడికి వచ్చి ద్రౌపదిని ఓదార్చింది.

వ్యాసభగవానుడు వచ్చి గాంధారికి దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆ దృష్టితో ఆమె యుద్ధభూమిని చూసింది. కానీ అక్కడ పడి ఉన్న శవాలూ, వాటిని పీక్కుతింటున్న నక్కలూ, కాకులూ, గ్రద్దలూ వీటన్నింటినీ చూసి భయపడిపోయింది. ఎటుచూసినా హాహాకారాలే. కౌరవస్త్రీలు తమ తమ భర్తలకోసం వెతుకుతూ ఏడుస్తున్నారు.

గాంధారి కూడా తన పుత్రుల్ని గుర్తించి బోరున విలపించింది. ఇంకా తన తక్కిన కొడుకుల కోసం వెంపర్లాడుతోంది. ఆమె దుఃఖం అంతా ఇంతా కాదు. మరోవైపు దుస్సల, ఇంకోవైపు ఉత్తర ఏడుస్తూ కనిపించారు. అలా తిరిగి తిరిగి అందరినీ చూసి గాంధారి హృదయం ఆగ్రహంతో రగిలిపోయింది.

'శ్రీకృష్ణా! ఇదంతా నీ పనే! నా కొడుకుల్ని అందరినీ పొట్టన పెట్టుకొన్నావు. నువ్వూ, నీ తమ్ముడు సాత్యకి, పంచపాండవులూ మాత్రం క్షేమంగా ఉన్నారు. నువ్వు కావాలనే సంధి జరగకుండా కౌరవ పాండవుల మధ్య చిచ్చుపెట్టావు. నా పాతివ్రత్య బలంవల్ల చెబుతున్నాను. చూడు! నువ్వు ఇంతకి ఇంతా అనుభవిస్తావు. నేటికి 36వ సంవత్సరంలో నీ వాళ్ళూ ఇలాగే ఒకళ్ళనొకళ్ళు చంపుకొని నాశనమైపోతారు. నువ్వూ దిక్కులేని స్థితిలో ప్రాణాలు కోల్పోతావు' అని శపించింది.

దానికి శ్రీకృష్ణుడు నవ్వుతూ 'అత్తా! ఈ శాపాన్ని ఇంతకుముందే దుర్వాసమహర్షి మా వంశానికి ఇచ్చాడు. యాదవులు ఎలాగూ నశిస్తారు. అది

తథ్యం. నీ కొడుకులు తప్పు చేశారు. దానికి తగిన శిక్షను అనుభవించారు. అంతే! మధ్యలో నేనేం చేశాను? సరే! పద! మరణించినవాళ్ళకు అంత్యక్రియలు జరిపించాలి. శాంతించు. నీ కొడుకులు వీరమరణం పొందారని సంతోషించు' అన్నాడు.

***

గంగాతీరం. ధర్మరాజు బంధువులందరికీ దహనసంస్కారాలు జరిపించాడు. తక్కినవాళ్ళందరికీ సామూహికంగా అంత్యక్రియలు జరిపించాడు. తరువాత గంగాస్నానం చేసి అందరికీ తిలోదకాలు విడిచిపెట్టారు. అప్పుడు కుంతీదేవి ధర్మరాజు వద్దకు వచ్చి 'నాయనా! కర్ణుడు ఎవరో కాదు. నీకు స్వయానా అన్న. అతడికి కూడా నువ్వు ఈ సంస్కారాలు జరిపించు' అంది ఏడుస్తూ.

ధర్మరాజూ, తక్కిన సోదరులూ అవాక్కైపోయారు. 'అమ్మా! ఎంత పని జరిగిపోయింది. ఈ విషయం ముందే తెలిస్తే ఇంత జరగనిచ్చేవాణ్ణా!? అన్నాడు బాధగా. వెంటనే జరగవలసిన కార్యక్రమాలన్నింటినీ యథావిధిగా జరిపించాడు.

# శాంతిపర్వం

ధర్మరాజు కుమిలిపోతున్నాడు. అయినవాళ్ళని ఇంతమందిని హతమార్చవలసి వచ్చిందేనన్న దుఃఖం అతణ్ణి కలిచివేస్తోంది. మరోవైపు కర్ణుడు తనకు సోదరుడైన విషయాన్ని దాచిన కుంతీదేవిపై కోపం వచ్చింది. 'అమ్మా! నువ్వు ఈ రహస్యాన్ని దాచి ఉంచడంవల్లనే ఇంత అనర్థం దాపురించింది. కాబట్టి 'ఇకపై స్త్రీల దగ్గర ఏ రహస్యమూ దాగదు' అని శపించాడు. తన సోదరుల్ని పిలిచి 'ఈ రాజ్యం మీరే ఏలుకోండి! నాకు దేనిమీదా ఆశగానీ, కోరికగానీ లేదు' అన్నాడు వైరాగ్యంతో.

అప్పుడు సోదరులు 'అన్నగారూ! ఏమిటీ వైరాగ్యం? ఇంతవరకూ వచ్చాక అడవులకు వెళ్తే లోకం హర్షిస్తుందా?! తెలివితక్కువ వాడిగా జమకడుతుంది. ఒకవేళ పాపభీతిగనక ఉంటే అశ్వమేధయాగం చెయ్యండి. **ఐశ్వర్యం లభించినప్పుడు స్వీకరించాలి. అలా స్వీకరించనివాడు నడిచే శవంలాంటి వాడే' అన్నారు. అర్జునుడు 'అగ్రజా! ధనమే అన్నింటికీ మూలం. ధర్మకామమోక్షాలు మూడూ ధనం వల్లనే వస్తాయి. ధనమే బంధువుల్నీ స్నేహితుల్నీ దగ్గర చేస్తుంది. కాబట్టి ధనం సంపాదించడం రాజధర్మం'** అన్నాడు.

భీముడు వచ్చి 'అన్నా! నీటికోసం పెద్ద బావిని తవ్వి చివరికి ఆ బావినీళ్ళు తాగకుండా వదిలివేసినట్లుంది నువ్వు చెప్తున్నది! అడవుల్లో ఉంటే మోక్షం వస్తుందా?

**కం. ఫలముల యెడ బ్రహ్మార్పణ**
**కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్**
**వలయుం తత్త్వజ్ఞానము**
**దలకొనినం గర్మశమము దానై కలుగున్ (శాంతి: 1-69)**

**ఫలాన్ని బ్రహ్మార్పణంగా భావించి పనుల్ని చేస్తే మోక్షం వస్తుంది. అప్పుడు కర్మ అదే పోతుంది'** అన్నాడు. నకుల సహదేవులు వచ్చి 'అన్నయ్యా! మేం చిన్నవాళ్ళం. నీకు చెప్పేటంతటివాళ్ళం కాము. కానీ ఆలకించు. ఆశ్రమాల్లోకెల్లా గృహస్థాశ్రమం గొప్పదని అంటారు కదా! దానిని విడిచి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించడం ఎందుకు? హింస లేకుండా భూమిని ఏ రాజైనా పాలించగలడా? ఆలోచించు' అన్నాడు.

అంతలో ద్రౌపది వచ్చింది. 'ప్రభూ! నువ్వూ నీ సోదరులూ పాటించింది ధర్మమే. తప్పుచేసినవాళ్ళని శిక్షించడాన్ని దండనీతి అంటారు కదా! అది రాజధర్మం. దాన్నే మీరు పాటించారు'

క. **గరదుని, గృహదాహకు, మం**
**త్రరహస్యవిభేది, వధవిధాయిఁ, బరసతీ**
**హరు, బంధుఘాతిఁ, బరధన**
**హరణపరునిఁ, జంపి పుణ్యుఁడగు నృపుఁ డనఘా! (శాంతి:1-95)**

**విషం పెట్టినవాడినీ, ఇల్లు కాల్చిన వాడినీ, రహస్యం బయటపెట్టినవాడినీ, మోసంతో చంపేవాడినీ, పరసతిని హరించేవాడినీ, బంధువులను చంపేవాడినీ, ఇతరుల ధనాన్ని హరించేవాడినీ చంపి రాజు పుణ్యాత్ముడవుతాడు. రాజా! దండించదగిన వారిని దండించకపోతే ఇంద్రుడికైనా పాపం తప్పదు' అని నచ్చచెప్పింది.**

అంతా విన్న ధర్మరాజు 'మీకు యుద్ధం గురించే తెలుసుగానీ తత్త్వం గురించి తెలియదు. **ఈ సంసారం ఒక అరటిస్తంభంలాంటిది. అది నిస్సారమైనది. అసలైన జ్ఞానం కలవాళ్ళు శమం (మనోనిగ్రహం), దమం (ఇంద్రియనిగ్రహం), త్యాగం అనే మూడు గుణాలే గొప్పవని అంటుంటారు. నిజానికి ఈ గుణాలు గొప్ప ఆనందాన్ని కలిగిస్తాయి'** అన్నాడు. అంతలో వ్యాస భగవానుడు అక్కడికి విచ్చేశాడు. 'ధర్మరాజా! నువ్వే పాపమూ చెయ్యలేదు. నీ ధర్మం నువ్వు నిర్వర్తించావు. నిశ్చింతగా రాజ్యాన్ని చేపట్టు.

**చం. మనుజులు సేయ నెవ్వరు? సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడున్**
**వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱకంగఁ బాపమొం**
**దునొకొ! కుఠారమున్, జనులు దోసముఁ బొందరు, కర్త యీశ్వరుం**
**డనియెడి నిశ్చయమ్ము దృఢమై మదినిల్చినఁ జాలు భూవరా!**

**(శాంతి: 1-277)**

రాజా! అంతా ఈశ్వరుడి ఆజ్ఞ. ఏ పనైనా చేయడానికి మానవులెవరు? గొడ్డలితో చెట్టును నరికితే ఆ పాపం గొడ్డలికి అంటుతుందా?! కర్త ఆ సర్వేశ్వరుడే. అని భావిస్తే చాలు. దోషం అంటుకోదు. కాబట్టి నీ రాజ్యాన్ని నువ్వు స్వీకరించు' అన్నాడు.

ధర్మరాజు కొంచెం తేరుకొని 'మహాత్మా! నాకు కొన్ని సందేహాలు ఉన్నాయి. వాటిని తీర్చండి.' అంటూ అడగడం మొదలుపెట్టాడు. అప్పుడు వ్యాసుడు 'ధర్మరాజా! నీ సందేహాలన్నీ తీర్చగల ధర్మకోవిదుడు భీష్మాచార్యుడు. చ్యవన, మార్కండేయ, వసిష్ఠాది మహర్షుల ద్వారా ఎన్నో ధర్మాలు అతడు తెలుసుకున్నాడు. అతడిని ఆశ్రయించు' అన్నాడు.

ధర్మరాజు మనసులో గూడుకట్టుకున్న విషాదం తొలగిపోవడంతో అతడికి వైభవంగా పట్టాభిషేకం జరిపించారు. తరువాత కొంతకాలానికి శ్రీకృష్ణుడు, ధర్మరాజునీ, తక్కిన పాండవుల్నీ, సాత్యకినీ భీష్మాచార్యుడి వద్దకు తీసుకువెళ్ళాడు.

భీష్ముడు అంపశయ్యపై పడుకొని ఉన్నాడు ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తూ. అందరూ ఆయనకు నమస్కరించారు. ఆయన వాళ్ళందరినీ తగిన విధంగా గౌరవించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'భీష్మాచార్యా! ధర్మరాజు అనేక సందేహాలతో సతమతమవుతున్నాడు. నువ్వా! గొప్ప రాజనీతిజ్ఞుడివి. అన్నీ తెలిసినవాడివి. మరో 56 రోజుల తర్వాత ఉత్తరాయణం వస్తుంది. అప్పటివరకే నువ్వు జీవించి ఉంటావు. నువ్వు లేకపోతే ఈ లోకం అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతుంది. కాబట్టి నీ జ్ఞానాన్ని ఈలోగా ధర్మరాజుకు బోధించు' అన్నాడు.

భీష్ముడు పరవశించిపోయాడు. కానీ శరీరమంతా పచ్చిపుండులా ఉంది. ఒకటే దాహం. ఏదీ జ్ఞాపకం రావడం లేదు. ఎలా చెప్పడం? అందుకే 'శ్రీకృష్ణా!

నువ్వుండగా నేను చెప్తే అది గురువు ముందు శిష్యుడు చెప్పిన పాఠంలా ఉంటుంది. నువ్వే చెప్పరాదూ!' అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు భీష్ముడికి ఆకలిదప్పికలు లేకుండా, గాయాలు బాధించకుండా, జ్ఞాపకశక్తి ఉండేలా వరాన్ని అనుగ్రహించాడు.

ధర్మరాజు వినయంగా 'పితామహా! రాజధర్మాల గురించి వివరంగా తెలుసుకోవాలని ఉంది. దయచేసి వివరించవూ!' అని అడిగాడు. భీష్ముడు మొదలుపెట్టాడు.

**'ధర్మరాజా! పూర్వం అంటే కృతయుగంలో అందరూ ధర్మబద్ధంగానే ఉండేవాళ్ళు. అందువల్ల 'రాజు' అవసరమే ఉండేదికాదు.** కానీ కాలక్రమంలో అధర్మం పెరుగుతూ వచ్చింది. అందుకని బ్రహ్మదేవుడు రాజు, మంత్రి, రాష్ట్రం, దుర్గం, కోశం, మిత్రులు, సైన్యం, ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి, శత్రువులు, మిత్రులు, ఉదాసీనులు అనే పేర్లతో మొత్తం 14 రాజమండలాల్ని సృష్టించాడు. ఆ తరువాత సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే వాటి గురించిన శాస్త్రాల్నీ, నీతి శాస్త్రాన్నీ రచించాడు. లక్ష అధ్యాయాలతో ఉన్న ఆ నీతిశాస్త్రాన్ని కాలక్రమంగా ఎందరో సంక్షేపిస్తూ వచ్చారు. అలా శుక్రాచార్యుడి నాటికి అది వెయ్యి అధ్యాయాల గ్రంథం అయ్యింది. దానిని ఇంకా సంక్షేపించారు మునులు. ఈ రాజనీతిని అనుసరించే చక్రవర్తులు భూమిని పరిపాలిస్తున్నారు.

**కం. కోపంబు లేమి, సత్యా**
**లాపము, నిజదారపరవిలాసము, శుచితా**
**గోపన, మద్రోహం బవ**
**నీపాలక! సర్వవర్ణ నియత గుణంబుల్ (శాంతి: 2-221)**

**కోపం లేకపోవడం, సత్యాన్నే పలకడం, తన భార్య పట్ల మాత్రమే లగ్నమైన దృష్టి, శుచిత్వాన్ని కాపాడుకోవడం, ఎవరికీ ద్రోహాన్ని తలపెట్టకపోవడం అనే లక్షణాలు అన్ని వర్ణాల వాళ్ళు విధిగా పాటించవలసిన నియమాలు.** ఇక రాజధర్మాలు చెబుతాను విను.

ధర్మరాజా! రాజు అందర్నీ రక్షించాలి. ఆపదలు వచ్చినప్పుడు ఒక వర్ణం వాళ్ళు ఇంకో వర్ణం వారి పనుల్ని చేసినా తప్పులేదు. రాజుకు వేదాధ్యయనం, యజ్ఞ నిర్వహణ, ప్రజారక్షణ బ్రహ్మ విధించిన ధర్మాలు. వీటిని తప్పితే ఆ రాజుకు నరకం ఖాయం. కాబట్టి వర్ణాశ్రమ ధర్మాల్ని రాజు విధిగా రక్షించాలి.

రాజు ప్రజలనుండి అధికంగా పన్నులు వసూలు చేయకూడదు. అలా చేస్తే పులి ఆకలితో తన పిల్లల్ని తానే తిన్నట్లు అవుతుంది. దానివల్ల ధనాగారం నిండదు. ప్రజలకు బాధ కలగకుండా జలగ నెత్తురు పీల్చినట్లు ధనం ప్రజల నుండి రాబట్టాలి. అలా చేస్తే ధనాగారం తెలియకుండానే నిండిపోతుంది.

**క. "గతమునకు వగవక నా**
**గతమునకు నోరుదెఱచి కడుఁగోరక, దీ**
**నతఁ బొందక, దైవంబే**
**గతిఁ బుచ్చిన దానఁ బోదుఁగా కనవలయున్ (శాంతి: 3-30)**

జరిగిపోయిన దానికి చింతించకుండా, జరగవలసిన దానికి ఆశతో నోరు తెరచి అడగకుండా, దీనత్వాన్ని పొందకుండా, దైవం ఎలా నిర్ణయిస్తే అలాగే జరగనీ అనుకోవాలి.

**సీ. విను తల్లియును, దండ్రియును, గురుండును సేవ**
**నీయులు; సద్భక్తి సత్యనిరతి**
**వారలఁ గొలుచుచు, వారెద్ది సెప్పిన**
**నది యాచరించుట యధిక ధర్మ;**
**మాగమత్రయమును, నగ్నిత్రయంబు లో**
**కత్రయంబును దేవతాత్రయంబు**
**నను వస్తువులు; వారలందును జనని గౌ**
**రవమున నెక్కుడు రాజవర్య!**

**తే. యీజగంబున, దివమునం బూజవడయు**
**మాతృభక్తుండు పితృభక్తిమానసుండు**
**నట్ల యవ్యయానందసంప్రాపణంబు**
**గురుపదాబ్జసమారాధకుండు గాంచు (శాంతి: 3-43)**

తల్లి, తండ్రి, గురువు పూజించదగిన వారు. భక్తితో ఎల్లప్పుడూ వారిని సేవించడం, వారు చెప్పినది చేయడం గొప్పధర్మం. ఈ ముగ్గురూ వేదత్రయంలాంటివారు. త్రేతాగ్నులలాంటివారు. త్రిమూర్తులలాంటివారు. వారిలో తల్లి ఎక్కువగా గౌరవించదగినది. మాతృభక్తుడు ఈ లోకంలోనూ పరలోకంలోనూ పూజార్హుడు. పితృభక్తుడు కూడా అలాగే ఇహపరాలలో గౌరవాదరాలను పొందుతాడు. అలాగే గురువు పాదాలను పూజించిన వాడూ అవ్యయానందాన్ని పొందుతాడు.

సీ. సత్యంబు పలుకుట సర్వధర్మములకు
మిక్కిలి; యనృతము మేటి పాత
కము; తద్విశేషంబు గలదు; చెప్పెద; నొరు
నర్థంబుఁ బ్రాణంబు నపహరింపఁ
జూచు పాతకులతో సూనృతం బాడుట
పాపంబు బొంకులు పలికియట్టి
వారి హింసించుట పరమధర్మ మిదియొక్క
డేల? భూతములకు హితముసేయు

తే.గీ. బొంకులెల్లను ధర్మముల్, భూతబాధ
కంబులగు నిక్కములు పాతకములు; వినుము
భూతముల దుష్టశిష్టత్వములు వివేక
సూక్ష్మతావేద్యములు; వానిఁ జూడవలయు (శాంతి: 3-45)

అన్ని ధర్మాలలో గొప్పది సత్యం పలుకడం. అసత్యం మహాపాపం. అయినా అందులో ఒక విశేషం ఉంది. ఇతరుల ధన, ప్రాణాలను అపహరించే పాతకులతో సత్యం చెప్పడం పాపం. అసత్యం ఆడి అయినా ఆ పాతకులను హింసించడం పరమధర్మం. ఇది ఒకటే ఎందుకు? జీవులకు మేలు చేసే అసత్యములన్నీయు ధర్మాలే. జీవులకు బాధ కలిగించే నిజాలు, పాపాలు. ఇలా జీవుల దుష్టత్వశిష్టత్వాలు సూక్ష్మబుద్ధితో తెలిసికోవాలి.

ఆ.వె. నమ్మఁ దగని వారి నమ్మకయున్నది;
తగిన వారినైనఁ దగ నమ్మి
యుండఁ దగదు; తన్ను నొరులు నమ్మెడునట్ల
యుండి యొరుల నమ్మకునికి నీతి (శాంతి: 3-239)

నమ్మకూడనివారిని నమ్మకుండా ఉండాలి. నమ్మదగిన వారినైనా పెద్దగా నమ్మకూడదు. ఇతరులు తనను నమ్మేలా ఉండి, ఇతరులను తాను నమ్మకుండా ఉండడమే నీతి. అంతేకాదు ఎవరినీ అతిగా నమ్మకూడదు. అలా అని అసలు ఎవర్నీ నమ్మకుండానూ ఉండకూడదు. తన పరివారాన్ని నమ్మినట్టే ఉంటూ తెలివిగా రాజు తన పనులు చక్కబెట్టుకోవాలి. అవినీతిలేని అధికారుల్ని నియమించుకోవాలి.

ఉత్తమశీలం వల్ల ధర్మం, ధర్మం వల్ల సత్యం, సత్యం వల్ల మంచి ప్రవర్తన దానివల్ల బలం కలుగుతాయి. కాబట్టి రాజు ఎప్పుడూ శీలవంతుడై ఉండాలి. అప్పు, నిప్పు, పగ ఏ కొంచెం మిగిల్చినా అవి చేటు చేస్తాయి. కాబట్టి వాటిని సమూలంగా నాశనం చెయ్యాలి. ఒకవేళ తెలియక చేసిన పాపానికి పశ్చాత్తాపం చెందితే చేసిన పాపంలో పావుభాగం పరిహారమైపోతుంది. అలాగే మళ్ళీ అలాంటిపాపం చేయకూడదనీ ధర్మమార్గంలో జీవిస్తాననీ భావిస్తే మరో రెండు పావుభాగాలు నశించిపోతాయి. ఆ పాపపరిహారంకోసం ఇతరులకు మేలుచేస్తే ఆ పావుభాగం నశించిపోతుంది.

ధర్మరాజా! శీలం గొప్పతనం ఏమిటో చెబుతాను విను. ఒకసారి దేవేంద్రుడు బ్రాహ్మణ వేషంలో ప్రహ్లాదుడివద్దకు వచ్చి అతడి శీలాన్ని తనకు ఇవ్వమని కోరాడు. ప్రహ్లాదుడు దయతో తన శీలాన్ని దానం చేశాడు. అప్పుడు శీలం బయటకు వెళ్ళిపోయింది. దానివల్ల ధర్మ, సత్యం, సత్ప్రవర్తన, బలం, ఆ తర్వాత 'లక్ష్మీదేవి' కూడా అతణ్ణి విడిచి వెళ్ళిపోయాయి. శీలం లేకపోతే ఇవేమి ఉండవు. నీకు మరొక కథ చెబుతాను విను.

పూర్వం విదిశానగరంలో ఒక దంపతు లుండేవాళ్ళు. వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు పసివయసులోనే చనిపోతే, ఆ బాలుణ్ణి తీసుకొని ఏడుస్తూ శ్మశానానికి

వెళ్ళాడు. అక్కడికి ఒక గ్రద్ద వచ్చి 'ఎందుకయ్యా ఏడుస్తున్నారు? ఏడిస్తే చనిపోయిన పిల్లవాడు వస్తాడా ఏమిటి? వెళ్ళండి. రాత్రికావొస్తోంది. ఇక్కడ ఉన్నారంటే ఇక్కడ ఉండే భూతప్రేతాల చేతుల్లో మీరు చావడం ఖాయం' అని భయపెట్టింది. వాళ్లు వెళ్ళిపోగానే ఆ శవాన్ని తాను తినవచ్చన్న ఆలోచనతో.

అప్పుడు అక్కడికి ఒక నక్క వచ్చి 'మీరు ఆ గ్రద్ద మాటలు నమ్మకండి! మీ ఏడుపులు విని ఏమో! పరమేశ్వరుడు కరుణించవచ్చు. ఈ పిల్లాణ్ణి బతికించనూవచ్చు. మీరు వెళ్ళకండి' అంది. రాత్రి అయ్యాక గ్రద్ద వెళ్ళిపోతే, వీళ్ళని ఎలాగోలా పంపి, తానే ఈ శవాన్ని తినాలన్న ఆశ దానిది.

అంతలో చీకటిపడిపోయింది. శివుడు ప్రత్యక్షమయ్యాడు. కరుణించి ఆ బాలుణ్ణి బ్రతికించాడు. ఈ గ్రద్దకూ, నక్కకూ ఆకలి అన్నదే లేకుండా వరాన్ని ప్రసాదించాడు. ఈ కథలో చెప్పినట్టుగా గ్రద్దలాంటివాళ్లూ, నక్కలాంటివాళ్ళు తమ అవసరంకోసం కల్లబొల్లి మాటలు చెబుతూ ఉంటారు. వాళ్ళని నమ్మకూడదు. రాజు అలాంటి వారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

**ఆ. లుబ్ధ జనులఁ దొఱఁగి, లోభ మను తిరిం బడని, స**
**త్యవ్రతులను, బరమధార్మికులను**
**బాపభీతమతులఁ బనిగొను; లోభంబుఁ**
**జెందనీకు నీదు చిత్తవృత్తి (శాంతి: 3-399)**

**లోభమే అన్ని పాపాలకూ మూలం. ఆలోభం కామాన్నీ, కోపాన్నీ, మాత్సర్యాన్నీ, ద్రోహాన్నీ, పరధనంపైనా పరభార్యలపైనా కోరికనూ, దైన్యాన్నీ కలిగిస్తుంది. సిగ్గు, ఓర్పు, సత్యం, మొదలైన వాటిపై విముఖతను కలిగిస్తుంది, ధర్మాన్ని కలచివేస్తుంది. మానవుణ్ణి సిగ్గులేనివాడిగానూ దేనిపైనైనా ఆశపడేవాడిగానూ చేస్తుంది. అందువల్ల లోభులకు దూరంగా ఉండాలి. లోభం అనే సుడిలో చిక్కుకోని సత్యమే వ్రతంగా కలవారిని, పాపం అంటే భయపడేవారిని వశం చేసుకొనే లోభానికి ఎప్పుడూ లోబడకూడదు. అలాగే రాజుకు హితవు చెప్పడానికి మంచి రాజగురువు ఉండాలి. రాజు తనే స్వయంగా ఎంచుకొని నియమించుకోవాలి. మరో ముఖ్యమైన విషయం – కృతఘ్నుణ్ణి దరిచేరనివ్వకూడదు. ఇక అరిషడ్వర్గం గురించి చెబుతాను విను.**

సీ. మనుజేంద్ర! సంకల్పమునఁ బుట్టుఁ గామంబు;
　　రూపఱు దేహనిరూపణమునఁ
బరులదోషంబునఁ బ్రభవించుఁ గ్రోధ; మ
　　క్షీణ క్షమాయుక్తిఁ జేసి పొలియు;
భూతాస్థిరత్వంబు బుద్ధిగానమి లోభ
　　మనఘ! జనించుఁ; గాంచిన నడంగు;
నజ్ఞానమున మోహ మావహిల్లు; నధర్మ
　　లేపవర్జనమున లేక తక్కుఁ;

తే. గులముననను, విద్య, ధనమునఁ గలుగు మదము;
మరలివాని పెంపూహింప ప్రమందిపోవు;
సాత్త్వికుఁడు గామిఁ బొడము మాత్సర్య; మదియు
జెడుఁ గురూత్తమ సాధుసంసేవనమున (శాంతి: 3-421)

ధర్మరాజా! మనసులోని కోరికలవల్ల కామం పుడుతుంది. ఆ కోరిక స్వభావాన్ని తెలుసుకొంటే అది నశిస్తుంది. ఇతరులు చేసే తప్పులవల్ల మనిషికి కోపం వస్తుంది. ఓర్పు అధికంగా ఉంటే ఆ క్రోధం నశిస్తుంది. 'జీవులు ఈ భూమి మీద స్థిరంగా ఉంటారు' అనుకోవడంవల్ల లోభం పుడుతుంది. కానీ 'జీవులు ఈ భూమిపై స్థిరంగా ఉండరు' అని తెలుసుకొంటే ఆ లోభం నశిస్తుంది. అజ్ఞానంవల్ల మోహం కలుగుతుంది. అధర్మాన్ని వదలితే మోహం తొలగిపోతుంది. కులం, విద్య, ధనాల కారణంగా మదం పుడుతుంది. 'తనకు మదం కలుగుతోంది' అని గుర్తిస్తే, అది నశిస్తుంది. తాను సాత్త్వికుడు కాకపోతే మాత్సర్యం పుడుతుంది. ఉత్తమ గురువులనూ, సాధువులనూ సేవిస్తే ఆ మాత్సర్యం పోతుంది.

ఈ ఆరింటివల్ల అన్ని అపాయాలూ కలుగుతాయి. వీటిని దూరంగా తరమగలినవారికి శుభం, సద్గతీ కలుగుతాయి.

## నాడీజంఘుడు

పూర్వం గౌతమవంశంలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఒక బోయవనితను పెళ్ళాడాడు. అప్పటినుండీ వాళ్ళతోనే తిరుగుతూ బతుకుతున్నాడు. ఒకరోజు అతనికి బాగా ధనం సంపాదించాలని కోరిక కలిగింది. ఒక వర్తకుల గుంపు వెళ్తుంటే వారితోకలసి నగరానికి బయలుదేరాడు. దారిలో ఒక ఏనుగుల గుంపు వారిపై దాడిచేసింది. అందరూ చెట్టుకొకరూ, పుట్టకొకరుగా పారిపోయారు. ఈ బ్రాహ్మణుడూ బ్రతుకు జీవుడా అని పారిపోయి ఒక చెట్టు క్రిందికి చేరాడు. అది నాడీజంఘుడు అనే కొంగ నివాసం. ఆ కొంగ ఈ బ్రాహ్మణుణ్ణి సాదరంగా ఆదరించి ఆకలి తీర్చింది. ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు బ్రాహ్మణుడు. తరువాతిరోజు నిద్రలేవగానే నాడీజంఘుడు తన మిత్రుడైన విరూపాక్షుడు అనే రాక్షసరాజు దగ్గరకు ఈ బ్రాహ్మణ్ణి పంపాడు.

విరూపాక్షుడు ఈ బ్రాహ్మణ్ణి సత్కరించి కావలిసినంత బంగారం, వజ్రవైడూర్యాలూ ఇచ్చి పంపాడు. బ్రాహ్మణుడు ఐశ్వర్యంతో నాడీజంఘుడి వద్దకు తిరిగి వచ్చాడు. నాడీజంఘుడు మళ్ళీ ఆ బ్రాహ్మణుడికి ఆతిథ్యం ఇచ్చాడు. ఇద్దరూ నిద్రపోయారు. కానీ అర్ధరాత్రి బ్రాహ్మణుడు నిద్రలేచి, రేపు నాకు ఆహారం ఎలా? అని ఆలోచించి, తనకు ఆశ్రయం ఇచ్చిన కొంగనే చంపి, మాంసాన్ని మూటగట్టుకొని బయలుదేరాడు.

విరూపాక్షుడికి ఈ సంగతి తెలిసింది. తన మిత్రుణ్ణి చంపిన ఆ బ్రాహ్మణుణ్ణి ముక్కలు ముక్కలుగా నరికించి, ఆ ముక్కల్ని కుక్కలకి వేయించాడు. విచిత్రమేమిటంటే ఒక్క కుక్క కూడా ఆ మాంసాన్ని ముట్టుకోలేదు. అంటే కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవన్న మాట! తరువాత విరూపాక్షుడు నాడీజంఘుడి మాంసం ముద్దను తీసి దహన సంస్కారాలు జరిపించాడు. చితిమండుతోంది. ఆ చితిపైన ఆకాశంలో సురభి గోవు వచ్చి నిలబడింది. దాని మూతి నుంచి పాలతో కూడిన నురుగు జారి చితిమీద పడింది. నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు. విరూపాక్షుడు ఎంతో సంతోషించాడు. అంతలో దేవేంద్రుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. నాడీజంఘుడు, బ్రాహ్మణుణ్ణి బ్రతికించమని దేవేంద్రుణ్ణి అడిగాడు. దేవేంద్రుడి అనుగ్రహంతో బ్రాహ్మణుడు బ్రతికి, చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందాడు.

కం. ఆరయ మిత్రద్రోహము
దారుణమగు పాతకము గృతఘ్నతకంటెన్,
వైరముగొని విడువవలయు
నారెండు దెఱఁగులవారి నాప్తులనైనన్ **(శాంతి:3-525)**

ధర్మరాజా! మిత్రద్రోహం, కృతఘ్నత కంటే దారుణమైన పాపం. ఈ రెండూ కలవాళ్ళని ఎంత ఆప్తులైనా విడిచిపెట్టెయ్యాలి.

అన్ని ధర్మాలలో కెల్లా గొప్పది దమమే (ఇంద్రియనిగ్రహం). ఇదే ముక్తిని ప్రసాదిస్తుంది. ఇదే పరమధర్మం. ఉత్తమగుణాలన్నీ దీనివల్లనే లభిస్తాయి.

చం. కుదురు సమస్త ధర్మములకున్ విను సత్యము; యోగ మోక్ష స
త్పదములు సత్యకార్యములు; పాప మసత్యముకంటె నొండు లే
దు దలఁప; నశ్వమేధములు దొమ్మిదినూఱులు వెండి నూఱునై
యొదవిన నీడు గావు భరతోత్తమ! సత్యము తోడ నారయన్
**(శాంతి: 3-419)**

ధర్మరాజా! అన్ని ధర్మాలకూ మూలం సత్యమే! యోగం, మోక్షం, ఉత్తమస్థానం సత్యంవల్లనే కలుగుతాయి. అసత్యం కంటే పాపం వేరే ఏదీ లేదు. వెయ్యి అశ్వమేధ యాగాలు కూడా ఒక్క సత్యంతో సమానమైనవి కాదు.

కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం అనే ఆరింటినీ అరిషడ్వర్గం అంటారు. కామం కోరిక వల్ల పుడుతుంది. ఆ కోరిక స్వభావం తెలుసుకొంటే కామం నశిస్తుంది. కోపం నశించాలంటే ఎవరు ఎన్ని తప్పులు చేసినా సహనంగా ఉండాలి. అప్పుడు కోపం నశిస్తుంది. ధర్మరాజా! విను. ఇప్పుడు నీకు అన్నింటికంటే గొప్పవి అయిన ధర్మాలు చెబుతాను.

క. నరనాథ! సుఖము దుఃఖముఁ
బరువడిమెయిఁ బొరయుఁ గాక, పన్నుగ నరునిం
బొరయునె యందొక్కటి; యవి
పొరసిన వల దూఁద మోదమును ఖేదంబున్ **(శాంతి: 4-12)**

**ధర్మరాజా! సుఖం, దుఃఖం ఒకదాని తరువాత ఒకటి వస్తాయే కానీ, అందులో ఏ ఒక్కటో వస్తుందా? అందువల్ల సుఖంవస్తే సంతోషం, దుఃఖం వస్తే సంతాపం పొందడం తగదు.**

**క. వినుము; పురాతనజన్మం**
**బున జేసినయట్టి కర్మముల ఫలములు ప్రా**
**జ్ఞుని నైనఁ బొందు; వానికి**
**మనుజేశ్వర! మందు ధైర్యమహిమయ చుమ్మీ! (శాంతి: 4-14)**

**విను, పూర్వజన్మలో చేసిన కర్మఫలాలు పండితుడిని కూడా విడిచిపెట్టవు. వాటిని తొలగించ గలిగిన మందు ధైర్యమే సుమా!**

ధర్మరాజా! పూర్వం అజగరమహర్షి ప్రహ్లాదుడికి శమప్రకారం చెప్పాడు. దానిని నీకు వినిస్తాను అంటూ భీష్ముడు ధర్మరాజుతో -

**తే.గీ. వఱదఁ గాష్ఠముల్ గూడినవడువు బంధు**
**సంగమం; బవి వాసిన చాడ్పు తద్వి**
**యోగ; మింత సూచినవాని నుమ్మలికము**
**వొరయనేరదు, దానవవరతనూజ! (శాంతి: 4-56)**

**'ప్రహ్లాదా! బంధువులు కలవడం వరదలో కర్రలు కలుసుకొన్నట్లే ఉంటుంది. ఆ కర్రలు ఎలా విడిపోతాయో ఆ విధంగానే బంధువుల వియోగం కూడా ఉంటుంది. ఇది గ్రహించిన వాడికి దుఃఖం కలగదు.** అని చెప్పి -

**క. కలవుపయిఁ గలవు వొరయుచు**
**వెలవుపయిన్ వెలవు దోఁప, విడువని యిడుమం**
**దొలఁగమిఁపై బురుషుఁ డిడుమఁ**
**దొలఁగమి, జేద్పడుచు నడచు దుష్కర్మములన్ (శాంతి: 4-72)**

**ఆ.వె. ఉత్సవంబు మీఁద నుత్సవ మందుచు,**
**సుఖము మీఁద సుఖము సొప్పడంగఁ**
**బుణ్యపదముమీఁదఁ బుణ్యపదంబున**
**కరుగు నరుఁడు సుకృతియైన నధిప! (శాంతి: 4-74)**

దుష్కర్మలు చేసిన వాడికి కలవుపై కలవు, భయం మీద భయం కలుగుతాయి. తీరని కష్టాల మీద కష్టాలు కలుగుతాయి. అలా కష్టపడుతూ అతడు దుష్కర్మలనే ఆచరిస్తాడు.

మంచి పనులు చేసిన వాడికి ఉత్సవం మీద ఉత్సవం, సుఖం మీద సుఖం కలుగుతాయి. ఒక పుణ్యపదం మీద ఇంకొక పుణ్యపదం లభిస్తాయి అని చెప్పి, ఇంకా అనేకవిధాలైన ధర్మాలను బోధిస్తున్నాడు.

కం. సత్యమ బ్రహ్మము దపమును;
సత్యమ ప్రజలను సృజించు; సత్యమ లోక
స్థిత్యాధానముఁ జేయును;
సత్యం బనృతంబు చేత సంపిహితమగున్ (శాంతి:4-100)

సత్యమే బ్రహ్మం, తపస్సు. సత్యమే ప్రజల్ని సృష్టిస్తుంది. లోకాన్ని స్థిరంగా ఉంచుతుంది. అయితే సత్యం అసత్యం వల్ల మరుగునపడిపోతుంది.

ధర్మమూ, అధర్మమూ, జ్ఞానమూ, అజ్ఞానమూ, సుఖమూ, దుఃఖమూ, స్వర్గమూ, నరకమూ, వెలుగూ, చీకటీ ఇవన్నీ సత్యాసత్య స్వరూపాలే. కాబట్టి మనిషి ఎలాంటి కష్టాలువచ్చినా చలించకూడదు. ధైర్యంగా ఉండాలి. ధర్మరాజా! పూర్వం భృగుమహాముని భరద్వాజుడికి వర్ణాశ్రమధర్మాలు చెప్పాడు. అవి నేను నీకు వినిపిస్తాను -

క. ఇది కర్మభూమి; భోగా
స్పద మాలోకంబు; ధర్మపరులకు సులభం
బది; సత్యశౌచసౌజ
న్యదయాదులు లేనివారి కప్రాప్యమగున్ (శాంతి: 4-110)

ఈలోకం కర్మభూమి. అంటే మంచి కార్యమైనా చెడ్డకార్యమైనా ఇక్కడే చేయాలి. స్వర్గలోకం భోగాస్పదం. అంటే ఈ లోకంలో చేసిన కర్మల కనుగుణమైన సుఖాలను ఆలోకంలో అనుభవిస్తారు. ధర్మపరులకు స్వర్గలోకం సులువుగా లభిస్తుంది. సత్యం, శౌచం, సౌజన్యం, దయ మొదలైననవి లేకపోతే స్వర్గం

**లభించదు. అంటూ ఒకప్పుడు బృహస్పతి మనువుకు ఉపదేశించిన మాయాప్రకారం ధర్మరాజుకు ఉపదేశించి 'రాజా! –**

**ఆ. మణిమయములు గనకమయములు రజతమ**
**యములు మఱియు మృణ్మయాదికములు**
**నైన పెక్కుపూసలందుఁ ద్రాదున్నట్లు**
**భూతకోటియందుఁ బురుషుఁడుండు (శాంతి: 4–194)**

**మణులతో, బంగారంతో, వెండితో, మట్టితో చేసిన పూసలలో త్రాదు ఉన్నట్లుగా, అన్నివిధాలైన జీవరాసులలోనూ పురుషుడు (పరమాత్ముడు) ఉంటాడు. ఇది తెలుసుకోలేక మానవుడు ఆత్మశాంతి లేక అలమటిస్తూ ఉంటాడు. దీనికి మార్గం ఒకటే.** నారదుడికి సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడే చెప్పిన విష్ణు మంత్రోపాసన. విష్ణుమంత్రప్రభావం నీకు చెబుతాను. విను. శ్రీహరి నారదుడితో 'నారదా!

**విష్ణుమంత్రప్రభావం**

**కం. హరియం దేనును నాయం**
**దరయంగా హరియుఁ గలము; హరి నాకును నా**
**హరి కేను ననశ్వరులము**
**హరిప్రసాదోదయము మహత్తర మహిమన్ (శాంతి: 4–244)**

**నారాయణుడిలో నేనున్నాను. నాలో నారాయణు డున్నాడు. ఆయననుండి నేను, నాకు ఆయన విడదీయరాని వారము' పెద్దల దయ వల్లనే విష్ణువు అనుగ్రహం కలుగుతుంది' అని భావించాలి.**

**కం. జ్ఞానముఁ గేవలకృప న**
**జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రజనితము సేయం**
**గా, నది సకల ధరిత్రీ**
**దానంబున కంటె నధికతర ఫలదమగున్ (శాంతి: 4–255)**

కేవలం దయతో, ప్రతిఫలాపేక్ష లేకుండా, జ్ఞానంలేని వానికి జ్ఞానాన్ని ఉపదేశిస్తే అది భూమినంతటినీ దానం చేస్తే వచ్చే ఫలితంకంటే అధికమైన ఫలం ఇస్తుంది.

తే. అశ్వమేధ సహస్రంబు లాచరించి
పడయరాని మహోన్నతపదము, నస్మ
దీయ భక్తిరసైక పరాయణుండు
వడయనేర్చు సుకరముగ బ్రహ్మపుత్ర! (శాంతి: 4-257)

నారదా! వేలకొలది అశ్వమేధయాగాలు చేసికూడా పొందలేని మహోన్నతమైన స్థితిని నాపై భక్తి కలవారు సులభంగా పొందగలరు.' అంటూ భక్తిమార్గాన్ని సెలవిచ్చాడు.

ఇక నీకు అధ్యాత్మవిద్యలో ఏలా ప్రవర్తించాలో సూక్ష్మంగా చెబుతాను.

## అధ్యాత్మవిద్యాప్రకారం

క. విను; తెవులుడుపఁగ, భేషజ
మునకుం దలకొనిన చందమున, మది సత్యం
బును, శౌచము, శమమును దమ
మును నెలకొలుపంగవలయు మోహచ్యుతికిన్ (శాంతి: 4-286)

రోగాన్ని వదిలించుకోవడానికి మందులు వాడినట్లే, మోహాన్ని వదలించుకోవడానికి మనసులో సత్యాన్ని, శౌచాన్ని, శమాన్ని, దమాన్ని నెలకొల్పుకోవాలి.

సీ. ఇరుప్రొద్దుఁ గుడుచుచు, నెడనెడఁ గుడువక
యుండునాంత డు సదోపవాసి;
ఋతుకాలమున, నాత్మ సతియంద రతిసల్పు
భవ్యశీలుఁడు సదాబ్రహ్మచారి;
దేవపిత్రతిథి పుజావిధులందిడి,
మఱి నంజు పురుషుఁ దమాంసభోజి;
దనయట్ల పంక్తివారును భుజింప, భుజించు
నంచితాత్ముఁడు విఘసాశనుండు

తే. భృత్యవర్గము గుడిచిన పిదపఁ గుడుచు
నాతఁ డమృతాశి; దివసమునందు నిదుర
వోని పుణ్యుఁ డస్వప్నుఁ; డిప్పొలములగు మ
హాధిక వ్రతములు దేహబాధకములు (శాంతి: 4-368)

రోజుకు రెండుపూటల మాత్రమే భుజిస్తూ, మధ్యమధ్యలో ఏమీ తిననివాడు సదా ఉపవాసం ఉన్నవాడితో సమానుడు. ఋతుకాలంలో (గర్భధారణకు యోగ్యమైన కాలంలో) మాత్రమే, అదికూడా తన భార్యతో మాత్రమే కలిసే ఉత్తముడు నిత్య బ్రహ్మచారి. దేవతలకు, పితరులకు, అతిథులకు పూజచేసి వారికి పెట్టాక, మిగిలిన మాంసాన్ని తినేవాడు మాంసం తినని వాడితో సమానుడు. తన పంక్తిలోని వారందరూ, తనలాగే భుజిస్తుంటే భుజించేవాడు విఘసాశనుడు. (దేవతలకు, అతిథులకు, సమర్పించి మిగిలినది తినేవాడు విఘసాశనుడు) తన సేవకులందరూ తిన్న తరువాత తాను తినేవాడు అమృతం తినేవాడితో సమానం. పగటిపూట నిదురపోనివాడు కలలు కనని వాడితో సమానుడు. ఇవన్నీ పెద్ద పెద్ద వ్రతాలే. అన్నీ దేహాన్ని బాధించేవే.

కం. ధృతి యారోగ్యము నొసఁగును
ధృతి యుజ్జ్వలలక్ష్మిఁ దెచ్చు; ధృతి కీర్తిసము
న్నతిఁజేయుఁ గాలగత్యవ
గతి గలిగినఁ గలుగు ధృతి వికారవిదూరా! (శాంతి: 4-421)

ధైర్యగుణమే ఆరోగ్యాన్నీ, గొప్ప ఐశ్వర్యాన్నీ, కీర్తి ప్రతిష్ఠల్నీ అందిస్తుంది. కాలస్వరూపం తెలిసిన వాడికే ఈ ధైర్యగుణం అబ్బుతుంది.

ధర్మనందనా! శాస్త్రజ్ఞాని, సదాచార సంపన్నుడు, దుర్గుణాలు లేనివాడు, చక్కటి వేషం, భాష కలవాడు, నీతిమంతుడు, ధైర్యవంతుడు, మంచిగా మాట్లాడేవాడు అందరి మన్ననల్నీ పొందుతాడు.

అన్ని ధర్మాలూ అహింస అనే గొప్ప ధర్మంలో ఇమిడిపోతాయి. సన్యాసియైనా భూతదయను కలిగి ఉండాలి. అందుకే అహింస పరమధర్మం.

ధర్మరాజా! ఇతరులకు తాను భయపడకుండా, తాను ఇతరుల్ని భయపెట్టకుండా సమభావంతో మెలగుతూ, పరిపక్వమైన మనసు కలవాడే అసలైన బ్రాహ్మణుడు. నాయనా! వేదంపై నమ్మకం, మంచి ఆచారాల్ని తు.చ. తప్పకుండా పాటించడం, ధైర్యంపై విశ్వాసం, ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించడం అనేవి ధర్మానికి అలంకారాలు.

అక్రమార్జన అన్ని పాపాలకన్నా నీచమైనది. అసత్యమాడకుండ ఉండడం, పరుల సొమ్ముకు ఆశపడకపోవడం ధర్మాలలోకెల్లా గొప్పవి.

ఏ ధర్మమైనా శాస్త్ర విరుద్ధం కాకూడదు. ధర్మాలు అనేక రకాలుగా ఉంటాయి. వీటన్నింటిలోకెల్లా గొప్ప ధర్మం ఏమిటో చెబుతున్నాను. విను.

ఆ.వె. ఇంద్రియముల గెల్చి, హృదయంబు శాంతి
సుఖంబుఁ బొంద, నిర్వికారవృత్తి
యైనవానిపొందు మానితగతి, దేవ
తలకుఁ బొంద నరిది ధర్మనిరత! (శాంతి: 5-27)

ఇంద్రియాలను గెలిచి, హృదయం శాంతిసుఖాలను పొందగా, వికారంలేని ప్రవర్తన కలవారు పొందే పూజనీయస్థితిని, దేవతలు కూడ పొందలేరు. అన్నాడు భీష్మపితామహుడు.

కం. ఒరు లేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథముల కెల్లన్ (శాంతి:5-220)

రాజా! ఇతరులు ఏమి చేస్తే మన మనసుకు బాధకలుగుతుందో తెలుసుకొని ఆ పనుల్ని మనం వారిపట్ల చేయకుండా ఉండటమే ధర్మాలలో కెల్లా గొప్పది. ఏ పనీ తొందరపడి చేయకు. బాగా ఆలోచించి మాత్రమే చెయ్యి. చంపతగినంత తప్పు చేస్తే వాడు ఎవడైనాసరే దండించితీరాలి. రాజు దొరికిన దాన్ని అనుభవించాలి. దొరక్కపోయినా నిశ్చింతగా ఉండాలి. ఇలా ఉంటే మనసులో 'తృష్ణ' అనేది ఉండదు. అలాగే ఒక పని చెయ్యాలని నిశ్చయించుకొంటే వెంటనే చెయ్యాలి. వాయిదా వెయ్యకూడదు. మనం ఆపనిని పూర్తి చేసే దాకా మృత్యువు ఆగదుకదా!

కలిమీ లేమీ ఈ రెండూ కాలం అధీనంలో ఉంటాయి. జ్ఞానం లేనివాళ్ళకి కలిమి వల్ల అహంకారం, లేమివల్ల దీనత్వం కలుగుతాయి.

తే. పాపకర్మంబు లెల్లనుఁ బాయఁ బెట్టి
పుణ్యకృత్యంబు లగువానిఁ బురుషుఁ డోపి
నట్లు శుద్ధమనస్కుఁడై యాచరించు
వాఁడు; సజ్జనసంగతి వలయునెపుడు (శాంతి: 5-451)

పాపకర్మలన్నింటినీ వదిలి శుద్ధమైన మనస్సుతో చేతనైనంత పుణ్యకార్యాలు చేయాలి. ఎప్పుడూ సజ్జనులతో కలసి మెలసి ఉండాలి.

క. పలుకు పడి నతనిఁ బాపం
బులు విడుచుం; బలికినతనిఁ బొందుచు బాపం
బులు; నొరుపాపము దనపై
నొలయింపగ నేల? నింద యుడిగినఁగాదే? (శాంతి: 5-553)

జనులు తనను ఎంత అవమానించినా, నిందించినా, అందుకు ప్రతీకారం తీర్చుకోకుండా సహించుకున్న వాడే శాంతాత్ముడు. తనను ఎవరైతే అవమానించారో వారు అంతకముందు ఏమైనా పుణ్యాలు చేసి ఉంటే అవన్నీతనకు లభిస్తాయి.మాట పడ్డవారి పాపాలుపోయి అన్నవాళ్ళకు తగులుకుంటాయి.కాబట్టి ఇతరుల పాపాలు మనకు రాకుండా ఉండాలంటే ఎవరినీ నిందించకపోవడం మంచిది కదూ?

కాబట్టి ధర్మనందనా! ఎవరైనా మనల్ని అవమానించినా, తిట్టినా, చంపాలని ప్రయత్నించినా మనం శాంతంగా ఉండాలి. ప్రతీకారం తీర్చుకోకూడదు. అప్పుడు వాళ్ళ పుణ్యాలన్నీ మనకి వస్తాయి. మన పాపాలు వాళ్ళకు పోతాయి' అన్నాడు

అందరూ పవిత్రమైన మనస్సుతో పుణ్యకర్మల్నే ఆచరించాలి. పాపకర్మల్ని విడిచిపెట్టాలి. ఎప్పుడూ మంచివారితోనే గడపాలి. లోకంలోని ప్రాణులన్నీ తనలాంటివేనన్న భావనతో మెలగాలి. అలాంటి వాడికి దైవానుగ్రహం ఎప్పుడూ ఉంటుంది.

ఆ.వె. ధర్మబద్ధమైన ధనము పాతికయేని
బహుళ ఫలము నిచ్చుఁ; బాపవృత్త్యు
పార్జితంబు కోటియైన నిష్ఫలమండ్రు
దానశాస్త్రవిదులు దానవేంద్ర! (శాంతి: 5-492)

ధర్మంగా లభించిన ధనం పాతికైనా గొప్ప ఫలాన్ని ఇస్తుంది. పాపవృత్తితో సంపాదించిన ధనం కోటియైనా ఎలాంటి ఫలితమూ రాదు. ఇది శాస్త్రకోవిదుల మాట!

# అనుశాసనికపర్వం

ధర్మరాజుకు ఇంకా తెలుసుకోవాలని ఉంది. ప్రశ్నిస్తూనే ఉన్నాడు. అతడి ప్రశ్నలకు భీష్మాచార్యుడు ఇలా సమాధానాలు ఇస్తున్నాడు.

'రాజా!

క. క్షేత్రమ్ము పురుషకారము
ధాత్రీశ్వర! బీజమరయ దైవము, రెండున్
సూత్రపడఁ గూడెనేనియుఁ
బాత్రంబగుఁ గర్మకరుఁడు ఫలమున కెందున్ (అనుశాసనిక:1-134)

దైవానుగ్రహం విత్తనం. పురుషప్రయత్నం నేల. ఈ రెండూ సరిగ్గా కుదిరితేనే కర్మ అనే పంట పండుతుంది.

క. విను పౌరుషమును, దైవము
నన రెండును గార్యఫలము నందింపఁగ నె
ట్టనఁ గారణములు; గావున
జననాయక! సదృశములు విచారింపంగన్ (అనుశాసనిక: 1-141)

**మానవ ప్రయత్నం, దైవ సాహాయ్యం కర్మఫలాల నందించడానికి తప్పనిసరియైన కారణాలు. అందువల్ల అవి రెండూ సమానమైనవే.**

**కామక్రోధాలకు అతీతంగా ఉంటూ సత్త్వగుణాన్ని పెంపొందించు కోవడమే వైష్ణవధర్మం. ఆకలితో ఉన్న బ్రాహ్మణుణ్ణి భోజనానికి పిలిచి తృప్తిగా పెట్టకపోవడం, బాగా చదువుకున్న బ్రాహ్మణుడి వృత్తిధర్మానికి ఆటంకం కలిగించడం, నీళ్ళు తాగుతున్న గోవుల్ని తరిమికొట్టడం, వికలాంగుల ధనాన్ని హరించడం, వేదశాస్త్రాల్ని**

**నిందించడం, కోపంతో ఊరికిగానీ, తోటకుగానీ నిప్పంటించడం, పాపపు బుద్ధితో అబద్ధాలు చెప్పి విప్రుల మనసు నొప్పించడం – ఇవన్నీ బ్రహ్మహత్యతో సమానమైన పాతకాలే!**

**కం. బ్రహ్మచర్యంబు కంటెను బరము మద్య**
**మాంసములు రెండు నుడుగుట మనుజనాథ!**
**లోకయాత్ర వాటించు చలోలుపతయు,**
**శమముఁగల్గి వర్తించుట శౌచవిధము (అనుశాసనిక: 2-45)**

**రాజా! మద్యమాంసాలు విసర్జించడం బ్రహ్మచర్యవ్రతంకంటే శ్రేష్ఠమైన ఫలితాన్ని ఇస్తుంది. సంసారంలో ఉంటూనే ఆశను వదిలి శమంతో ప్రవర్తించడం చాలా మంచి పద్ధతి.**

**కం. దొరకొనని వానిఁ గోరక**
**దొరకొనినందున మమత్వతుష్ట హృదయతం**
**బొరయక విగతస్పృహులగు**
**పురుషులు శుచు లేల తీర్థములు వారలకున్? (అనుశాసనిక: 2-92)**

**తనకు లభించనిదానిని కోరుకోకుండా, లభించిన దానిపై కూడా మమకారం పెంచుకోక, కోర్కెలను జయించే పురుషులు పరమపవిత్రులు. వారికి ఇంక తీర్థాలతో పనిలేదు.**

రాజా! సోమం లేని యజ్ఞం, చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశం, స్వధర్మం లేని ఆశ్రమం, పువ్వులు పూయని చెట్టు, అలాగే గంగానది లేని దేశం వ్యర్థమైనవి. ఇక గోవు గొప్పదనం చెప్తాను విను.

## చ్యవనమహర్షి

పూర్వం 'చ్యవనుడు' అనే మహర్షి ప్రయాగలో త్రివేణీసంగమక్షేత్రంలో తపస్సు చేస్తూ నీళ్ళలో సమాధి స్థితిలో ఉండిపోయాడు. కొంతకాలం తరువాత జాలరులు వలవేస్తే, చేపలతో పాటు ఈ మహర్షి కూడా చిక్కాడు. వారు మహర్షిని చూసి

భయపడిపోయారు జాలరులు. మన్నించమన్నారు. కానీ వాళ్ళ తప్పు ఏమీ లేదనీ, తనను కూడా చేపల్లాగే అమ్ముకొమ్మనీ చెప్పాడు చ్యవనుడు.

ఈ సంగతి రాజుగారైన నహుషుడికి తెలిసింది. 'మా జాలరులు తప్పు చేస్తే అది నేను చేసినట్లే! దీనికి పరిహారం చెప్పండి' అని వేడుకున్నాడు.

'రాజా! జాలరులు తమ కులధర్మాన్ని పాటించారు. కాబట్టి వాళ్ళ తప్పేమీ లేదు. నన్ను మీరు కొనుక్కొని, ఆ ధనాన్ని జాలరులకు ఇవ్వండి' అన్నాడు చ్యవనుడు.

సరే! 'వెయ్యి మాడలు' అన్నాడు రాజు. కుదరదన్నాడు చ్యవనుడు. పదివేలు, లక్ష... ఇలా పెంచుకుంటూ పోయాడు. అయినా చ్యవనుడు ఒప్పుకోడే! సరే! పూర్తి రాజ్యాన్ని ఇస్తానన్నాడు. అదీ సరిపోలేదు చ్యవనుడికి. ఏం చెయ్యాలో పాలుపోలేదు నహుషుడికి. అప్పుడు కవిజాతుడు అనే మహర్షి వచ్చి 'ఈ చ్యవనమహర్షికి తగిన వెల గోవు మాత్రమే' అని చెప్పాడు. అప్పుడు నహుషుడు ఒక గోవును జాలరులకు ఇచ్చి చ్యవనుణ్ణి విడిపించాడు.

అప్పుడు చ్యవనుడు 'నహుషా! మంచి పని చేశావు. ఇప్పటికి నా వెల నిర్ణయించగలిగావు. గోవుల్ని కీర్తించడం, వాటి గురించి వినడం, దానం చెయ్యడం ఇవన్నీ మంచి కార్యాలు. గోవుల్లో ఎప్పుడూ పాపం ఉండదు. అంతేకాదు గోవులు లక్ష్మీదేవికి నిలయాలు. సకల పాపాల్ని పోగొట్టి పుణ్యాల్ని ప్రసాదించే భూలోకదేవతలు.. అంటూ గోమాహాత్మ్యాన్ని విపులంగా చెప్పాడు చ్యవనుడు.

## నృగమహారాజు

**'ధర్మరాజా! దానం ఎలా చేస్తే మంచి ఫలితం లభిస్తుందో తెలుసుకో! ఎవరినీ ఏదీ అడగనివారుంటారే! వాళ్ళకు చేసే దానం గొప్ప ఫలితాన్నిస్తుంది. నిజానికి యాచన చెయ్యడం అంటే చచ్చి బ్రతకడమే! అలాగే ఎవరైనా దానం చెయ్యమని కోరితే చెయ్యకపోవడమూ చావుతో సమానమైనదే! మరో విషయం. రాజు విప్రులకు ఇచ్చిన ధనాన్నీ, గోవుల్నీ రక్షించాలి. అలా రక్షించకపోతే నృగమహారాజుకు పట్టిన గతే పడుతుంది.**

నృగమహారాజు ఒక గోవును ఒక విప్రుడికి దానం చేశాడు. అది ఎలాగో తప్పించుకొని వచ్చి మళ్ళీ రాజుగారి ఆవులమందలో కలిసిపోయింది. ఆ ఆవునే మరోసారి ఇంకో విప్రుడికి దానం చేశాడు. చివరికి ఆ గోవు నాదంటే నాదని ఆ విప్రులిద్దరూ గొడవపడి, ఆ గోవే కావాలని పట్టుపట్టారు. రాజు వాళ్ళ తగవు తీర్చలేకపోయాడు. దానివల్ల అతడు పాపఫలాన్ని ముందుగా అనుభవించవలసి వచ్చింది. దాని ఫలితంగా వెయ్యి సంవత్సరాలు ఒక బావిలో రాకాసి తొండలా పడి ఉన్నాడు. చివరికి శ్రీకృష్ణుడు వచ్చి పైకి తీయడంతో అతడికి శాపవిమోచనం కలిగింది.

**ధర్మరాజా! లోకంలో చాలామంది ఉపవాసం చేస్తూ అదేదో పెద్ద తపస్సుగా భావిస్తారు. అది తప్పు. ఉపవాసం చెయ్యడం అంటే ఆత్మహత్య చేసుకున్నట్లే. సత్యం, బ్రహ్మచర్యం, పవిత్రత, మౌనవ్రతం, మనోనిగ్రహం, దయ, శుద్ధమైన దానం, ఇవన్నీ తపస్సులే. తపస్సును మించిన ధర్మం లేదు. యాగరక్షణ తపస్సు కన్నా గొప్పధర్మం.**

**అన్నదమ్ములు కలసిమెలసి ఉండాలి. వాళ్ళలో పెద్దవాడు తెలివితక్కువవాడైతే అతడి తమ్ముళ్ళకు కష్టాలు తప్పవు. తల్లి, తండ్రి, గురువు ఈ ముగ్గురిలో గురువు కంటే తండ్రి, తండ్రికంటే తల్లి పదిరెట్లు ఎక్కువగా గౌరవించదగినవాళ్ళు.**

**అందరూ పుణ్యతీర్థాల్లో మునిగి పరిశుద్ధులమై పోయామనుకుంటారు. కానీ అసలు తీర్థాలంటే ఏమిటో తెలుసా? దమం, తపస్సు, అహింస, శమం ఇలాంటి ఉత్తమ గుణాలే తీర్థాలు.**

**లోకంలో హింస నాలుగురకాలు. మనసుతో, మాటతో, శరీరంతో హింసించడం, మాంసాహారం తినటమూ. మాంసాహారం విడిచిపెట్టడం అశ్వమేధయాగాన్ని చేయడం కన్నా గొప్ప పని అని పెద్దలు చెప్తారు.**

మనం మన పనులు చేస్తున్నప్పుడు మనకు తెలియకుండానే ఎన్నో జీవులు చనిపోతుంటాయి. ఆ పాపం మనకు అంటదు.

**విధికి ఎవరిపైనా కోపంగానీ ప్రేమగానీ ఉండదు. తగిన సమయం వచ్చినపుడు ఎవరి కర్మను వాళ్ళు అనుభవించవలసినదే!**

దానం అన్నింటికన్నా గొప్ప కార్యం. దానం చేశాక బాధపడినా, తనను తాను పొగడుకున్నా దానం నిష్ఫలమైపోతుంది. ఎవరి శక్తి కొలదీ వాళ్ళు దానం చేస్తారు. అందరికీ ఒకేరకమైన పుణ్యఫలం లభిస్తుంది.

చ. అడిగిన నిచ్చుకంటెను, నయాచకుఁ గాఁగ నెఱిఁగి యిచ్చుటె
క్కుడు ఫలమిచ్చు; దానకోవిద! వేడుట సావు! వేడఁగా
బడుటది పెద్ద సావు; దగుప్రార్థన పూర్ణము సేయునాతఁడా
యడిగినవానిఁ, దన్నును దయారతిఁ గావఁగఁజాలు వాఁడగున్
(అనుశాసనిక: 2-343)

దానకోవిదా! అడిగితే ఇవ్వడం కంటే, అడగకుండానే అవసరం తెలుసుకొని ఇస్తే ఎక్కువ ఫలితం లభిస్తుంది. అడగడం చావు లాంటిది. అడగబడడం ఇంకా పెద్ద చావు (ఎందుకంటే తన దగ్గరలేనిదైనా, ఉన్నదానికంటే ఎక్కువైనా అడిగితే దానం ఇవ్వడం కష్టం కాబట్టి). అలా యాచించినప్పుడు దానిని తీర్చినవాడు అడిగిన వాడినీ తన్నుతానూ రక్షించుకొన్నవాడు అవుతాడు.

ఆ.వె. అన్నదానసదృశ మగుదాన మెందు నె
న్నఁడును లేదు గావునను విధేయ
మన్నదాన మధిక యత్నపూతంబుగాఁ
బూని దానిచేఁత పుణ్యతమము (అనుశాసనిక: 2-370)

అన్నదానానికి పోలినదానం ఎక్కడా, ఎప్పుడూ లేదు. కాబట్టి మానవుడు చాలా గట్టి ప్రయత్నంచేత పవిత్రమైన పద్ధతిలో అన్నదానం చేయాలి. అలా మిక్కిలి శ్రద్ధతో అన్నదానం చేయటం అన్ని పుణ్యాలకంటే మిన్న.

క. అనుజుఁ డొకఁడు వెంగలియై
నను దప్పెడుఁ గాని, పెద్దనకుఁ గార్యజ్ఞా
ననిరూఢి లేక తక్కిన,
ననుజన్ములు సిక్కుపడుదు రవనీనాథా! (అనుశాసనిక: 4-133)

రాజా! అన్నదమ్ములలో తమ్ముడొకడు మూర్ఖుడయినా ఫరవాలేదుకానీ, అన్నదమ్ములలో పెద్దవాడు కార్యజ్ఞానంలో దృఢత్వంలేని వాడయితే తమ్ములు చిక్కులలో పడతారు.

క. జనకుం డధికుఁ డుపాధ్యా
యునకుఁ బదిమడుగు లెక్క దుర్వినాథా!
జనకునకు దశగుణంబులు
జనని గురుత్వమున నిది ప్రశస్తము శ్రుతులన్ (ఆనుశాసనిక: 4-139)

రాజా! గురువుకంటె తండ్రి పదింతలుగా గౌరవించదగిన గొప్పవాడు. అలాంటి తండ్రికంటే తల్లి, గౌరవంలో పదింతలు గొప్పది. ఈ విషయాన్ని వేదాలే ప్రశంసిస్తున్నాయి.

క. దంతియడుగులోనఁ దక్కిన జంతుచ
యంబు నడుగులెల్ల నడఁగియుండు
నట్లు, ధర్మకోటులన్నియు లోనగు
నిద్ధగుణ! యహింస కింత నిజము (ఆనుశాసనిక: 4-283)

ధర్మరాజా! ఏనుగు పాదముద్రలో మిగిలిన అన్ని జంతువుల పాదాలు ఇమిడి పోయినట్లుగా, అన్ని ధర్మాలూ అహింసలోనే ఇమిడిపోతాయి. అది నిజం. కాబట్టి అహింసను పాటిస్తే మిగిలిన ధర్మాలన్నింటినీ పాటించినట్లే.

తే. చేయు టెంతయు మేలైనఁ జేసి పిదప
వగచినట్టి దానము, దనుఁ బొగడికొన్న
దానవిధి నిష్ఫలంబులు గాన రెండు
నుడుగుదాత మహాఫల మొందగాంచు (ఆనుశాసనిక: 5-189)

దానం చేయడం ఎంతో మేలైనది. అయినా దానం చేసిన తరువాత పోయిందే అని చింతించినా, తన దానం గురించి తానే పొగడుకొన్నా ఆ దానము నిష్ఫలం. అందువల్ల ఆరెంటినీ విడిచిన దాత గొప్ప ఫలాన్ని పొందుతాడు.

క. విను మొక కుంచెఁడు ధాన్యము
తన కాయతి గల్గు నతఁడు, దాని నొసఁగినన్,
ధనకోటి గల్గువాఁ డ
ద్ధనమొసఁగిన, నొక్కరూప తత్తత్ఫలముల్ (అనుశాసనిక: **5-211**)

కుంచెడు ధాన్యం మాత్రమే కలిగినవాడు, దానిని దానం చేసినా, కోట్లుకొద్దీ ధనం గలిగినవాడు, ఆ ధనమునంతటినీ దానం చేసినా, వారికి లభించే పుణ్యం సమానమే.

ఆ. విను; ధనార్జనంబు, ధనరక్షణంబు, ధ
నవ్యయంబు, ధనవినాశముఁ, బ్ర
గాఢ దుఃఖదములు; గావున దుఃఖ భా
జనము ధనము; గాల్చు మనఁగవలయు (అనుశాసనిక: **5-231**)

క. రమణీ! తృష్ణాసమదుః
ఖమును, పరిత్యాగ సమసుఖముఁ గలవే? కా
యము ముదిసిన ముదియదు; ప్రా
ణము గొని పోఁజాలు తెవులనం జనుఁ దృష్ణన్ (అనుశాసనిక: **5-232**)

ధనార్జన, ధనరక్షణ, ధనవ్యయం, ధననాశనం ఈ నాలుగు మనిషికి దుఃఖాన్నే మిగులుస్తాయి. కాబట్టి 'ధనతృష్ణ'ను విడిచిపెట్టాలి. మనిషికి ఆశతో సమానమైన దుఃఖం లేనే లేదు. ఆశకు ముసలితనం లేదు. అది మనిషి ప్రాణాలు తీసే మాయరోగం. దానిని విడిచిపెడితేనే మనిషికి సుఖం.

ధర్మరాజా! అహింస, దానం, సత్యం, శాంతం అనే నాలుగూ ఉత్తమ ధర్మాలు. వీటిని మించినవి లేవు. కాబట్టి వీటిని ఎప్పుడూ ఆచరించేలా ప్రయత్నించు' అంటూ అనేక ఉదాహరణలతో భీష్మాచార్యుడు ధర్మరాజుకు ధర్మాలన్నింటినీ చెప్పి పంపివేశాడు.

కొంతకాలం తర్వాత ఉత్తరాయణం వచ్చింది. ధర్మరాజు శ్రీకృష్ణుడితో సహా సపరివారంగా భీష్ముడి వద్దకు వచ్చాడు. భీష్ముడికి స్వచ్ఛందమరణం (కోరినప్పుడు వచ్చే మరణం) అనే వరం ఉంది. ఆ వరాన్ని ఉపయోగించుకొంటూ శ్రీకృష్ణుడికి నమస్కరిస్తూ, అతడి ఆదేశంతో యోగమార్గంలో ప్రాణాలను విడిచిపెట్టి, పుణ్యలోకాలకు చేరుకున్నాడు భీష్ముడు. భీష్ముడికి దహనసంస్కారాలు జరిపించాడు ధర్మరాజు. గంగాదేవి వచ్చి తన పుత్రుడి మరణానికి దుఃఖించింది. శ్రీకృష్ణుడు ఆమెను ఓదార్చి పంపాడు.

# అశ్వమేధపర్వం

భీష్మాచార్యుడి మరణంతో ధర్మరాజు కథ మళ్ళీ మొదటికి వచ్చింది. అడవులకు వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు ధర్మరాజుకు నచ్చచెప్పి మనశ్శాంతి కోసం అశ్వమేధయాగం చెయ్యమన్నారు.

ఆ యాగంలో గొప్ప గొప్ప దానాలు చేయాలి. అందుకు ధనం కావాలి. పూర్వం 'మరుత్తు' అనే మహారాజు యాగం చేసి అపారమైన ధనాన్ని విప్రులకు దానం చేశాడు. అతడికి ఆ సంపద హిమవంతానికి ఉత్తరాన ఉన్న 'మంజువంతం' అనే పర్వతసానువుల్లో లభించింది. వేదవ్యాసుడి ఆదేశంతో ధర్మరాజు కూడా ఆ ధనాన్ని సంపాదించి అశ్వమేధయాగాన్ని ప్రారంభించబోతున్నాడు.

శ్రీకృష్ణుడు కూడా అర్జునుడి కోరికపై మళ్ళీ అతడికి గీతోపదేశాన్ని చేశాడు. అదే అనుగీతగా ప్రసిద్ధి చెందింది. ఆ తరువాత శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు.

## పరీక్షిత్తు

ధర్మరాజు తలపెట్టిన యాగానికి యాదవులంతా తరలివచ్చారు. ఇంతలో ఉత్తరాదేవి గర్భంలో ఒక మృతశిశువు పుట్టాడన్న కలకలం రేగింది. శ్రీకృష్ణుడు హుటాహుటిన వెళ్ళాడు. అప్పటికే అశ్వత్థామ వేసిన బ్రహ్మశిరోనామక అస్త్ర ప్రభావం వల్ల శిశువు చనిపోయి ఉన్నాడు. శ్రీకృష్ణుడు వెంటనే ఆ అస్త్రాన్ని తన సుదర్శనశక్తితో అణచివేశాడు. శిశువు బ్రతికాడు. శరీరంలో చలనం వచ్చింది. వంశం పరిక్షీణం (నాశనం) అయ్యే సమయంలో జన్మించాడు కాబట్టి ఆ బాలుడికి పరీక్షిత్తు అని పేరు పెట్టాడు శ్రీకృష్ణుడు.

## బభ్రువాహనుడు

తరువాత ధర్మరాజు ఘనంగా అశ్వమేధయాగం చేసి యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. అర్జునుడు ఆ అశ్వసంరక్షుడిగా వెళ్ళాడు. ఆ అశ్వాన్ని బంధించిన త్రిగర్తదేశరాజుల్నీ, వజ్రదత్తుణ్ణీ, సింధురాజకుమారుల్నీ జయించాడు. తరువాత అశ్వం మణిపూరదేశంలోనికి చేరుకుంది. దానికి అధిపతి బభ్రువాహనుడు. ఇతడు అర్జునుడి పుత్రుడు. అందుకే వచ్చి నమస్కరించాడు.

కానీ అర్జునుడు అతణ్ని ఆదరించకుండా 'యాగాశ్వం నీ రాజ్యంలో తిరుగుతూ ఉంటే దానిని బంధించకుండా నా కాళ్ళమీద పడతావా? నువ్వసలు వీరుడివేనా?' అన్నాడు.

అప్పుడు నాగలోకంలో ఉన్న ఉలూచి వచ్చి 'నాయనా! బభ్రువాహనా! నీ ప్రతాపం చూడాలనే నీ తండ్రి నిన్నలా అవమానించాడు. యుద్ధం చేసి నీ వీరత్వాన్ని నిరూపించుకో' అంది.

బభ్రువాహనుడు యాగాశ్వాన్ని బంధించి, అర్జునుడితో తలపడ్డాడు. తండ్రీకొడుకుల మధ్య యుద్ధం భీకరంగా సాగింది. ఆ యుద్ధంలో అర్జునుడు మరణించాడు. బభ్రువాహనుడు మూర్ఛపోయాడు. బభ్రువాహనుడి తల్లి చిత్రాంగద అక్కడికి వచ్చి అర్జునుణ్ణి చూసి బోరున విలపించింది.

బభ్రువాహనుడు కళ్ళు తెరిచాడు. జరిగిన దారుణాన్ని తెలుసుకొని తండ్రిని చంపిన పాపానికి ప్రాయశ్చిత్తంగా తనను తాను చంపుకోబోయాడు. అప్పుడు చిత్రాంగద ఉలూచితో 'నువ్వు అర్జునుణ్ణి బ్రతికించు. లేకపోతే నా కొడుకు నాకు దక్కడు' అని ప్రాధేయపడింది.

ఉలూచి తన దగ్గర ఉన్న సంజీవమణితో అర్జునుణ్ణి బ్రతికించి 'నాథా! మీరు భీష్మాచార్యుణ్ణి వధించినప్పుడు వసువులు మిమ్మల్ని శపించాలని చూశారు. అప్పుడు నా తండ్రి వాళ్ళను శాంతింపజేశాడు. అప్పుడు వసువులు 'అర్జునుడు తన కొడుకు బభ్రువాహనుడి చేతిలో మరణిస్తేనే అతడి పాపం పరిహారం అవుతుందని చెప్పారు. అందుకే నేను ఈ పని చేశాను' అంది ఉలూచి.

తరువాత అర్జునుడు రాజగృహంలో ఉన్న జరాసంధుడి కొడుకు మేఘసంధినీ, దశార్ణరాజు చిత్రాంగదుణ్ణీ, గాంధారరాజు శకుని కొడుకునూ ఓడించి, తన చేతుల్లో ఓడినవాళ్ళనందర్నీ యాగానికి ఆహ్వానించి హస్తినాపురానికి చేరుకున్నాడు.

వ్యాసభగవానుడే ఋత్విజుడిగా ప్రారంభమైన యాగం అత్యంత వైభవంగా పూర్తయ్యింది. ధర్మరాజు తన రాజ్యాన్నంతా వేదవ్యాసుడికి దానంగా ఇచ్చాడు. ఆ రాజ్యానికి ప్రతిగా కోటికోట్ల బంగారు మాడల్ని తీసుకొని వ్యాసుడు ఆ రాజ్యాన్ని ధర్మరాజుకే ఇచ్చివేశాడు. ఆ బంగారాన్నంతా యాగం నిర్వహించిన విప్రులకు దానంగా ఇచ్చాడు వ్యాసుడు. ఆకాశం నుండి పుష్పవర్షం కురిసింది.

అందరూ ఆనందంగా సంబరాలు జరుపుకొనేవేళ ముంగిస ఒకటి బిలంలో నుండి బయటకు వచ్చి 'ఈ యాగం సక్తుప్రస్థుడి ధర్మానికి సాటిరాదు' అంది. అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు ముంగిస చెప్పడం ప్రారంభించింది.

## సక్తుప్రస్థుడు

'కురుక్షేత్రంలో ఏ కోరికా లేని ఒక బ్రాహ్మణుడు తన కుటుంబంతో కలిసి భిక్షాటన చేస్తూ జీవిస్తూ ఉండేవాడు. ఒకసారి తీవ్రమైన అనావృష్టి వచ్చింది. వాళ్ళకే తినడానికి ఏమీ లేదు. పస్తులుంటున్నారు. ఒకరోజు ఎంతో కష్టపడితే కొన్ని వడ్లు దొరికాయి. వాటిని దంచితే కుంచెడు పేలపిండి వచ్చింది. దానిని వాళ్ళు తినబోతుండగా ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. ఆ పేల పిండిని అందరూ ఆ అతిథికే భక్తిగా, వినయంగా సమర్పించారు. అప్పుడా అతిథి 'మహాత్మా! నేను ధర్ముణ్ణి. నీ వ్రతాచరణకు ఆనందించాను.

**కం. భక్తియు వినయము శ్రద్ధా**
**యుక్తియునుం దాల్మితోడి యొప్పును గరుణా**
**సక్తియు నతిథులయెడ నను**
**రక్తియు నీయంద సుస్థిరత్వముఁ బొందెన్** **(అశ్వమేధ: 4-239)**

**'భక్తి, వినయం, శ్రద్ధ, సహనం, కరుణ, అతిథి ఆదరణ ఇవన్నీ నీలో సుస్థిరంగా ఉన్నాయి. నీ వ్రతనిష్ఠకు బ్రహ్మాది దేవతలు ఆశ్చర్యపోతున్నారు. నీకోసం**

ఒక దివ్యవిమానం వస్తుంది’ అన్నాడు. అంతలోనే విమానం రావడం, ఆ బ్రాహ్మణ కుటుంబం బ్రహ్మలోకానికి వెళ్ళిపోవడం జరిగిపోయాయి.

ఇదంతా చూస్తున్న నేను బిలంలో నుండి బయటకు వచ్చాను. తర్పణం చేస్తూ దానం చేస్తారు కదా ఆ చేసిన నీళ్ళు నాకు తగిలి నాతలలో ఒక ప్రక్క బంగారమైపోయింది. అదీ ఆ దాన మహిమ. అప్పటినుండీ రెండో ప్రక్క కూడా బంగారం అవుతుందన్న ఆశతో ఎన్నో యాగాలకు వెళ్ళాను. నా కోరిక తీరలేదు. కనీసం ధర్మరాజు చేసిన యాగంలోనైనా తీరుతుందనుకున్నాను. నాకు నిరాశే మిగిలింది. అందుకే అలా చెప్పాను’ అని ముంగిస అదృశ్యమైపోయింది.

# ఆశ్రమవాసపర్వం

అశ్వమేధయాగం తరువాత పరిస్థితులన్నీ దాదాపు చక్కబడ్డాయి. ధర్మరాజు ప్రశాంతంగా చక్కగా రాజ్యపాలన చేస్తున్నాడు. గాంధారీ ధృతరాష్ట్రుల్ని కన్న తల్లిదండ్రుల్లాగా గౌరవిస్తున్నాడు. వాళ్ళూ అలాగే ఉన్నారు. కానీ భీముడికి మాత్రం ఇది నచ్చలేదు. ధృతరాష్ట్రుడికీ భీముణ్ణి చూసినప్పుడల్లా దుర్యోధనుడే గుర్తుకు వచ్చేవాడు. దాంతో అతడికీ భీముడిపై ద్వేషమే నిండిపోయింది.

కాలం గడుస్తోంది. కొన్నాళ్ళ తరువాత ధృతరాష్ట్రుడు వానప్రస్థం స్వీకరించాలనుకున్నాడు. అందరినీ పిలిచి తన మనసులోని మాట చెప్పాడు.

ధర్మరాజు ఆ మాట విని ఎంతగానో బాధపడ్డాడు. వెళ్ళడానికి ససేమిరా అన్నాడు. ఇంతలో వ్యాసుడు వచ్చి చెప్పడంతో మొత్తానికి ఒప్పుకున్నాడు.

వానప్రస్థానికి వెళ్ళేముందు తన పుత్రులందరికీ శ్రాద్ధ క్రియలు జరిపించమని కోరాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజు అలాగే చేయించాడు. ధృతరాష్ట్రుడు గాంధారితో కలిసి తృప్తిగా అరణ్యవాసానికి బయలుదేరాడు. కుంతీదేవి కూడా వారి వెంట వెళ్ళింది. సంజయుడు, విదురుడు కూడా వాళ్ళతో ఉన్నారు. అందరూ అరణ్యంలో తపస్సు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.తపస్సు చేస్తున్న ధృతరాష్ట్రుడి వద్దకు నారదుడు, దేవలుడు, పర్వతుడు, మహర్షులు వచ్చారు. వారితో శతాయుమహర్షి కూడా వచ్చాడు. కుంతీదేవి వారికి అతిథిసత్కారాలు చేసింది. ధృతరాష్ట్రుడు వారికి సంభ్రమాశ్చర్యాలతో నమస్కరించాడు. వారు ధృతరాష్ట్రుడిని ఆశీర్వదించారు.

ధృతరాష్ట్రుడు వారికి దర్భాసనం వేసి కూర్చోమని చెప్పాడు. అప్పుడు నారదుడు “ ‘ధృతరాష్ట్రమహారాజా! ఈ ఆశ్రమంలో తపస్సు చేయడం అందరికీ సాధ్యం కాదు. వ్యాసుడి దయ వల్ల నీకు ఆ అదృష్టం కలిగింది. ఇక్కడ తపస్సు చేయడంవల్ల నీకు కూడా  ఉత్తమ గతులు లభిస్తాయి. నీ భార్య గాంధారి కూడా

నిన్ను అనుసరించి వస్తుంది. మీకు సేవలు చేసినందుకు కుంతీదేవి కూడా ఉత్తమ గతులు పొందుతుంది. తన భర్త పాండురాజును చేరుకుంటుంది. ఇప్పుడు పాండురాజు స్వర్గలోకంలో ఉన్నాడు. సదా నిన్నే తలచుకుంటున్నాడు. యమధర్మరాజు ఆత్మగా కలిగిన విదురుడు కూడా యమధర్మరాజును చేరుకుంటాడు. సంజయుడు కూడా మిమ్మల్ని అనుసరించి వస్తాడు' అని చెప్పాడు.

ఆమాటలు విన్న ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవి ఎంతో సంతోషించారు. ఆ శతాయువు నారదుడిని 'నారదమహర్షీ! మీకు అన్నీ తెలుసు కదా! నాకు ఒక సమాధానం చెప్పండి. మీరు కురుసార్వభౌముడికి ఉత్తమ గతులు కలుగుతాయని చెప్పారు కదా! అది ఎలాగో వివరించండి' అన్నాడు.

అందుకు నారదుడు 'శతాయువూ! నేను ఒకసారి దేవేంద్రుడితో ముచ్చటిస్తున్న సమయంలో ధృతరాష్ట్రుడి ప్రస్తావన వచ్చింది. ధృతరాష్ట్రుడి తీవ్రమైన తపస్సు గురించి దేవలోకం అంతా ప్రశంసించారు. అప్పుడు దేవేంద్రుడు 'నారదా! ఇంతటి తీవ్రమైన తపస్సు చేస్తున్న ధృతరాష్ట్రుడు తన భార్య గాంధారితో సహా దేవలోకం చేరుకుంటాడు' అన్నాడు ఇంద్రుడు. ఆ సమయంలో అక్కడ ఉన్న పాండురాజు అది విని చాలా సంతోషించాడు అని నారదుడు చెప్పాడు.

ఆ మాటలు విని ధృతరాష్ట్రాదులు సంతోషించారు. నారదాది మహామునులు అక్కడి నుండి తమ నివాసాలకు వెళ్ళారు.

## పాండవుల ఆశ్రమ సందర్శనం

కొంతకాలం తర్వాత ధర్మరాజు సపరివారంగా ధృతరాష్ట్రాదుల్ని చూడడానికి అరణ్యానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. తాము లేని సమయంలో రాజ్యరక్షణ యుయుత్సుడికీ, కృపాచార్యుడికీ, ధౌమ్యుడికీ అప్పగించి, సపరివారంగా అడవులకు వచ్చాడు.

గంగానది దాటాక కురుక్షేత్రంలో శతాయువు ఆశ్రమం ఉంది. దానికి సమీపంలో ఉంది ధృతరాష్ట్రుడి ఆశ్రమం. అక్కడికి చేరుకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు యమునానదిలో స్నానం చెయ్యడానికి వెళ్ళాడని తెలుసుకొని వెంటనే అందరూ యమునానదీతీరానికి వెళ్ళారు.

అప్పటికే యమునలో స్నానం జపతపాదులు ముగించుకుని ధృతరాష్ట్రుడు మొదలైనవాళ్ళు ఎదురు వచ్చారు. కుంతీదేవి పాండవులను చూసింది. ప్రేమతో అందరినీ ఆశీర్వదించింది. సహదేవుడు కుంతీదేవి పాదాల మీదపడి ఏడ్చాడు. కుంతీదేవి గాంధారికి, ధృతరాష్ట్రుడికి తన కుమారులు వచ్చిన విషయము చెప్పింది. పక్కనే ఉన్న సంజయుడు పాండవులను చూసి సంతోషంగా పలకరించాడు.

ద్రౌపది మొదలైన అంతఃపుర స్త్రీలు అందరూ వచ్చి గాంధారికి, కుంతీదేవికి నమస్కరించారు. వారు అంతఃపుర స్త్రీలను ఆదరించారు. తన వారు అందరూ చుట్టూ ఉండగా ధృతరాష్ట్రుడికి తాను హస్తినాపురంలో ఉన్నట్లు అనిపించింది. అందరూ కలసి ఆశ్రమానికి వెళ్ళారు.

## ధృతరాష్ట్రుడి కుశల ప్రశ్నలు

**పాండవులు, ధర్మరాజు అరణ్యాలకు వచ్చారని తెలిసి చుట్టుపక్కల ఉన్న మునులు, ఋషులు వారిని చూడవచ్చారు. పరిచయాలు అయ్యాయి. తరువాత ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'ధర్మనందనా! నువ్వు, నీ తమ్ముళ్ళు, నీ మిత్రులు, బంధువులు అందరూ కుశలమే కదా! నీ అంతరంగ పరిజనం సుఖంగా ఉన్నారా! నువ్వు నీ పెద్దలు నడచిన మార్గంలోనే నడుస్తున్నావా! దేవాలయాలు, బ్రాహ్మణులకు ఇచ్చిన అగ్రహారాలు మాన్యాలు 'అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్నావా! ప్రజకు బాధకలిగించని విధంగా పన్నులు విధించి కోశాగారాన్ని నింపుతున్నావు కదా! నువ్వు నీ మిత్రులపట్ల స్నేహభావాన్ని శత్రువులపట్ల కాఠిన్యాన్ని ప్రదర్శిస్తున్నావు కదా! నీకు మిత్రులు శత్రువులు కాక తటస్థంగా ఉన్న రాజుల పట్ల అప్రమత్తంగా ఉంటున్నావు కదా! ఎందుకంటే వారు ఎప్పుడు ఏవైపు ఉంటారో తెలియదు కదా! దేవతలను, పితృదేవతలను, అతిథులను నైవేద్యాలు భోజనాలు పెట్టి సంతృప్తిపరుస్తున్నావు కదా! నీ రాజ్యములో నాలుగువర్ణాల వారు తమకు విధించిన వృత్తులు క్రమం తప్పకుండా పాటిస్తున్నారు కదా! నీ రాజ్యంలో బాలలు, వృద్ధులు, స్త్రీలు, అందరూ భయము లేకుండా జీవిస్తున్నారు కదా! నీ ఆజ్ఞను పురప్రజలు కచ్చితంగా పాటిస్తున్నారు కదా!'అని గబగబా ప్రశ్నించాడు.**

## ధర్మరాజు కుశల ప్రశ్నలు

వెంటనే ధర్మరాజు 'తండ్రీ! మీరు నాకు చేసిన రాజనీతి ఉపదేశం వల్ల రాజ్యపాలన అంతా చక్కగా జరుగుతోంది. కానీ మా దిగులంతా తమరి గురించే. తమరి తపస్సు ఎలా కొనసాగుతోంది? మా తల్లి కుంతీదేవి తమకు సేవలు చేస్తున్నది కదా! మా గాంధారీదేవి తపస్సు కూడా బాగానే సాగుతోంది కదా! అవును! విదురుడు కనిపించడం లేదే! ఎక్కడికి వెళ్ళాడు? నాకు చూడాలని ఉంది. అన్నాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'కుమారా ధర్మరాజా ! నేను ఇక్కడ బాగానే ఉన్నాను. నా తపస్సు బాగానే సాగుతోంది. కుంతీదేవి మాకు బాగా సేవలు చేస్తుంది. గాంధారి తపస్సుకూడా బాగానే జరుగుతుంది. సంజయుడు కూడా తనకు తోచిన విధంగా తపస్సుచేస్తున్నాడు.

కానీ విదురుడు మాత్రం ఎక్కడ ఉంటాడో ఎక్కడ తిరుగుతుంటాడో మాకు తెలియదు. వేళకు ఆహారం తీసుకోడు. ఒక్కోసారి గాలి, నీరు మాత్రమే అతడి ఆహారం. ఒక్కో సారి అది కూడా తీసుకోడు. చాలా విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. మనుష్యులు తిరగడానికి భయపడే ఈ కారడవిలో ఒంటరిగా స్వేచ్ఛగా నిర్భయంగా సంచరిస్తుంటాడు. ఈ క్షణంలో ఇక్కడ ఉంటాడు. మరు క్షణంలో ఎక్కడ ఉంటాడో తెలియదు. ఇక్కడే ఎక్కడో తిరుగుతున్నాడు చూడు! అని దూరంగా తిరుగుతున్న విదురుడిని ధర్మరాజుకు చూపించాడు ధృతరాష్ట్రుడు.

## విదురుడి అవతార సమాప్తి

ధృతరాష్ట్రుడు చూపించిన వైపు చూశాడు ధర్మరాజు. నిజమే! అక్కడే ఉన్నాడు విదురుడు. విదురుడి శరీరం అంతా మట్టి కొట్టుకుని ఉంది. దుస్తులు ధరించ లేదు. జుట్టంతా జడలు కట్టి ఉంది. ఆశ్రమ సమీపానికి వచ్చి, అక్కడ జనాన్ని చూసి దూరంగా వెళ్ళిపోతున్నాడు. ధర్మరాజు 'విదురా! విదురా! ఆగు. నేను ధర్మనందనుణ్ణి'అంటూ విదురుడి వెంట పరిగెత్తాడు.

విదురుడు వెళ్ళి వెళ్ళి ఒక చెట్టు కింద ధ్యానం చేస్తూ నిలబడ్డాడు. ధర్మరాజు పరుగున వెళ్ళి విదురుడి ముందుకు వెళ్ళి –

'విదురా! నేను నిన్ను చూడాలని వచ్చాను. కళ్ళుతెరవండి' అని ప్రార్థించాడు. విదురుడు కళ్ళు తెరచి ధర్మరాజు వైపు తదేకంగా చూస్తూ తన యోగబలంతో తన శరీరాన్ని విడిచి పెట్టాడు.

విదురుడి ఇంద్రియాలు, విదురుడి ప్రాణాలు విదురుడిని విడిచిపెట్టి తేజో రూపంలో ధర్మరాజులో ప్రవేశించాయి. విదురుడి పాంచభౌతిక శరీరం కింద పడిపోయింది. ధర్మరాజు అప్పుడు ఇనుమడించిన కాంతితో ప్రకాశించాడు.

ఇది అయోమయంగా తోచింది ధర్మరాజుకు. ఆశ్చర్యచకితుడై కొంత తేరుకొని విదురుడికి అంత్యక్రియలు చెయ్యాలనుకున్నాడు.అప్పుడు ఆకాశం నుండి ఒక వాక్కు వినిపించింది

'విదురుడు యతీశ్వరుడు. యతిధర్మం స్వీకరించాడు. అతడి శరీరానికి అగ్నిసంస్కారం చేయకూడదు. కాబట్టి అతడి శరీరాన్ని అక్కడే విడిచి పెట్టు' అని వినిపించింది.

తరువాత ధర్మరాజు వడివడిగా నడుస్తూ ఆశ్రమానికి వెళ్ళి అక్కడ ఉన్న వారికి జరిగినదంతా వివరించాడు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు.

ధర్మరాజును చూడడానికి వచ్చిన తాపసులు అందరూ ధృతరాష్ట్రుడి వద్ద సెలవు తీసుకుని అక్కడ నుండి వెళ్ళారు. తరువాత ధృతరాష్ట్రుడు ధర్మరాజును చూసి'ధర్మనందనా! నీకు ఫలాలు, దుంపలు ఇస్తాను ఆహారముగా స్వీకరించు' అన్నాడు. అలాగే అని ధృతరాష్ట్రుడి ఆతిథ్యాన్ని ధర్మరాజు సంతోషంగా స్వీకరించాడు. అందరూ ఫలాలను, కందమూలాలను సంతోషంగా స్వీకరించారు. ఆ రోజు రాత్రి ఆశ్రమంలోనే నిద్రించారు. తెల్లవారింది. కాలకృత్యాలు పూర్తి చేసుకున్న తరువాత భార్య ద్రౌపది, తమ్ముళ్ళతో, పరివారంతో కలసి ఆశ్రమం అంతా తిరిగి చూశారు. తరువాత ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి అతడికి నమస్కరించి ఎదురుగా ఒక ఆసనం మీద కూర్చుని ఇష్టాగోష్ఠి జరిపాడు. ఈ విధంగా ధర్మరాజు ఒక నెలరోజులు అక్కడే గడిపాడు.

## వేదవ్యాసుడి ఆగమనం

ఒకరోజు ధృతరాష్ట్రుడు, ధర్మరాజుతో శతాయువు మొదలైన మహా మునులతో కూర్చుని సంభాషిస్తున్న సమయంలో అక్కడికి వ్యాసమహర్షి వచ్చాడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజు అర్ఘ్యపాద్యాలు ఇచ్చి సత్కరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడిని చూసి వ్యాసుడు –

'ధృతరాష్ట్రా! నీకు వనవాసం అలవాటయ్యిందా? తపస్సు చేస్తున్నవా? తాపసులకు అనువైన పనులను నియమం తప్పక ఆచరిస్తున్నవా? నీ పుత్ర శోకం పోయిందా? నీ భార్య గాంధారి దుఃఖాన్ని మరచి పోయిందా? నీకు నీ భార్యకు పరిపూర్ణ జ్ఞానం లభించిందా? కుంతీదేవి మీకు సేవలు చక్కగా చేస్తుందా? మీరు అడవిలో ఉంటే తాను రాజభవనంలో ఉండలేనని కుంతీదేవి మీతో అరణ్యాలకు వచ్చింది. ఆమె త్యాగము వర్ణనాతీతం కదా! నువ్వు ధర్మరాజు మీద, భీమార్జున నకుల సహదేవుల మీద ప్రేమానురాగాలు కలిగి ఉన్నావా? నీ మనస్సు నిర్మలంగా ఉందా? **శత్రుత్వాన్ని, ఒకరికి అపకారం చేసే గుణాన్నీ కలకాలం నిలుపుకోకూడదు. మనసు సదా నిర్మలంగా ఉన్నప్పుడే సంపదలు కలుగుతాయి.** విదురుడు శరీరాన్ని త్యజించాడని విన్నాను. విదురుడు ఎవరో కాదు. అతడు సాక్షాత్తు యమధర్మరాజే. మాండవ్యముని శాపం కారణంగా మానవజన్మ ఎత్తాడు. బ్రహ్మదేవుడి ఆదేశంపై అంబిక దాసికి పుత్రుడిగా శూద్రగర్భంలో జన్మించాడు. అతడే కాదు ధర్మరాజు కూడా యమధర్మరాజుకి ప్రతిరూపమే. అందుకే విదురుడు యోగబలంతో తన అంశను ధర్మరాజులోనే విలీనం చేశాడు. అలాంటి దైవస్వరూపుడైన ధర్మరాజు నీకు సేవలు చేస్తున్నాడు. అందుకు సంతోషంగా ఉందా! అన్నాడు.

## ధృతరాష్ట్రుడి వైరాగ్యం

అంతా విన్న ధృతరాష్ట్రుడు వ్యాసుడితో 'మునీంద్రా! ఈ వనవాసం నాకు ఏమాత్రమూ బాధగా లేదు. నా దేహమూ చిత్తమూ తపస్సులోనే నిమగ్నమైపోయాయి. నాకూ గాంధారికీ ఇప్పుడు పుత్రశోకం లేదు. నాకు ధర్మరాజు మీద, అతడి తమ్ముళ్ళ మీద అంతులేని అనురాగం ఉంది. ఈ ధర్మరాజు సాక్షాత్తు ధర్మస్వరూపుడని నాకు తెలుసు. కుంతీదేవి రాజభోగాలు వదులుకుని మా వెంట అరణ్యాలకు వచ్చింది. మాకు సేవలు చేస్తోంది. అదే మాకు ఎంతో ఆశ్చర్యాన్ని

కలిగిస్తోంది. తమరి దయవల్ల మాకు అధ్యాత్మపరిజ్ఞానం, మానసికశుద్ధి కలిగాయి' అని వినయంగా చెప్పాడు.

ఆ సమయంలో ద్రౌపది, సుభద్ర మొదలైన అంతఃపురకాంతలు వచ్చి వ్యాసుడికి భక్తితో నమస్కరించారు. అందరినీ ఆశీర్వదించి ధృతరాష్ట్రుణ్ణి చూసి వ్యాసుడు 'మీ మీ చింతలను పోగొట్టి మంచిబుద్ధి కలిగించాలన్న అలోచనతో ఇక్కడకు వచ్చాను. మీకు ఇష్టం వచ్చింది అడగండి. మీ కోరికలు తీరుస్తాను' అని అన్నాడు.

## ధృతరాష్ట్రుడి కోరిక

'వ్యాసమునీంద్రా! మీరు మా వద్దకు రావడమే మహాభాగ్యం. ఇంతకంటే మాకేం కావాలి. మీ అనుగ్రహమే చాలు! నా జన్మ ధన్యం అయ్యింది. నాకు ఉత్తమలోక ప్రాప్తి కలుగుతుందో లేదో అన్న భయం ఇప్పుడు పోయింది. నేను ధన్యులలో ధన్యుడిని అయ్యాను. అయినా మీరు కోరమన్నారు కాబట్టి అడుగుతున్నాను. నా కుమారుడు దుష్టస్వభావం కలవాడు. పాండవులు పుణ్యాత్ములు. అలాంటి వారిని నా కుమారుడు సుయోధనుడు పరాభవించాడు. తన మిత్ర రాజులందరినీ ససైన్యంగా యుద్ధానికి బలి చేశాడు. భీష్మ, ద్రోణ, కర్ణులనూ బలి ఇచ్చి చివరకు తాను కూడా బలైపోయాడు. అధముడైన సుయోధనుడి కోసం తమ భార్యాపుత్రులను, రాజ్యాలనూ వదిలి వచ్చిన అనేక దేశాల రాజులకు ఎటువంటి సద్గతులు లభించాయి? మరణించిన తరువాత వారు పొందిన లోకాలు ఏమిటి? నాకు తెలుసుకోవాలనిఉంది. తెలియజేయండి' అని అడిగాడు.

## గాంధారి కోరిక

గాంధారి వ్యాసుడికి నమస్కరించి 'వ్యాసమునీంద్రా! భారతయుద్ధం జరిగి 16 సంవత్సరాలు అయ్యాయి. ఈ 16 సంవత్సరాలు నా భర్త ధృతరాష్ట్రుడు కొడుకుల కోసం పరితపిస్తూనే ఉన్నాడు. ఆయనే కాదు నేను, ద్రౌపది, సుభద్ర, కుంతీదేవి, నా కోడళ్ళు, యుద్ధంలో చనిపోయిన భూరిశ్రవుడు, సోమదత్తుడు, బాహ్లికుడిభార్యలు యుద్ధంలో చనిపోయిన తమ భర్తలు, కొడుకులు ఎలా ఉన్నారో అని పరితపిస్తున్నారు. వారిని చూడాలని ఆత్రుతగా ఉన్నారు. ఈ సృష్టిలో ఎన్ని

లోకాలు ఉన్నాయో అన్నింటినీ చూపించగల యోగశక్తిసంపన్నులూ సమర్థులు మీరే! కాబట్టి మాకు మావాళ్ళను చూపించండి. ఈ మాత్రం చూపించలేరా? మా దుఃఖములు తొలగించండి. ఇదే మా కోరిక' అని అందరి పక్షానా కోరింది గాంధారి.

## కుంతీదేవి సందేహం

ఆ తరువాత కుంతీదేవి వ్యాసుడికి నమస్కరించింది. ఆ సమయంలో కుంతీదేవికి మనసులో తన కుమారుడు కర్ణుడు మెదిలాడు. కుంతీదేవి మనసు బాధపడింది. అది వ్యాసుడు గ్రహించి ఇలా అన్నాడు.

'అమ్మా కుంతీదేవీ! గాంధారి తన కోరిక తెలియజేసింది. నీ మనసులో కూడా ఏదైనా కోరిక ఉంటే చెప్పు?అది కూడా తీరుస్తాను' అని అన్నాడు.

కుంతీదేవి వ్యాసుడికి మళ్ళీ నమస్కరించి 'వ్యాసమునీంద్రా! నువ్వు దేవతలకు దేవతవు. నువ్వు నా భర్తకు తండ్రివి. నిన్ను మామగారుగా పొందడం మా అదృష్టం. నా మీద దయతో నా విన్నపము ఆలకించు.

నేను కన్యగా ఉన్నప్పుడు దుర్వాస మహాముని మా తండ్రి వద్దకు వచ్చాడు. ఆయనకు సేవలు చెయ్యడానికి నా తండ్రి నన్ను నియమించాడు. నా సేవలకు దుర్వాసుడు మెచ్చుకుని 'నీకు ఒక వరం ఇస్తాను కోరుకో' అన్నాడు.

నేను 'ఓ మహానుభావా! మీ అనుగ్రహం మా మీద ఉంది అదే నాకు చాలు' అన్నాను. అప్పుడు దుర్వాసుడు 'నేను వరం ఇస్తానంటే నువ్వు కాదనకూడదు' అన్నాడు.

నేను భయపడి నాకు పుత్రుడిని ప్రసాదించమని అడిగాను. అప్పుడు ఆ ముని నాకు ఒక మంత్రం ఉపదేశించి 'ఈ మంత్రం మననం చేసి ఏ దేవతను పిలిస్తే ఆ దేవత వచ్చి నీకు పుత్రుడిని ప్రసాదిస్తాడు. కుంతీ! సాక్షాత్తు యమధర్మరాజు నీకు కుమారుడిగా జన్మిస్తాడు' అని చెప్పాడు. తరువాత దుర్వాసుడు వెళ్ళిపోయాడు. నేను బాల్యచాపల్యం చేత ఆ మంత్రాన్ని పరీక్షించాలని ఏ దేవతను పిలవాలా అని ఆలోచిస్తుండగా ఆకాశంలో సూర్యుడు కనిపించాడు. నేను మంత్రం మననం చేశాను. సూర్యదేవుణ్ణి ప్రార్థించాను. నేను ఇది కేవలం వినోదం కోసమేచేశాను.

కానీ సూర్యదేవుడు నిజంగానే నా ముందు ప్రత్యక్షమయ్యాడు. 'నీకు ఏమి వరం కావాలో కోరుకో'అని అడిగాడు. నాకు భయం వేసింది. చేతులు జోడించి 'అయ్యా!మీరు ఎందుకు వచ్చారు? వెళ్ళిపోండి' అని ప్రార్థించాను. అందుకు సూర్యదేవుడు 'కన్యామణీ! వృథాగా ఎవరినైనా ఆహ్వానించడం తప్పు. నీకు మంత్రం ఎవరు ఉపదేశించారో నేను వారిని శపిస్తాను' అని కోపంతో అన్నాడు.

నేను భయంతో వణికిపోయాను. నా బాల్యచాపల్యంవల్ల నిరపరాధి అయిన గురుదేవులు దుర్వాసులవారు శాపగ్రస్తులు కావడం నాకు ఇష్టంలేక 'దేవా! తమరు నా మీద దయ ఉంచి తమరితో సమానతేజస్సు కలిగిన పుత్రుడిని ప్రసాదించండి' అని కోరాను.

అప్పుడు సూర్యభగవానుడు 'కన్యామణీ! నీకు నా ప్రభావంతో నాతో సమానుడూ తేజస్వి అయిన కుమారుడు జన్మిస్తాడు. నువ్వు కన్యవు కాబట్టి నీ కన్యాత్వం చెడకుండా పుత్రుడు కలిగేలా వరం ప్రసాదిస్తున్నాను' అని సూర్యభగవానుడు వెళ్ళి పోయాడు.

నేను గర్భవతిని అయ్యాను. తల్లి తండ్రులకు తెలియకుండా అంతఃపురంలో పుత్రుడిని ప్రసవించాను. కానీ నేను కన్యను కదా! లోకనిందకు భయపడి కుమారుడిని పెంచలేక నదిలో విడిచి పెట్టాను. ఇదంతా ఒక కలలా జరిగి పోయింది. కలలా మిగిలిపోయింది. తమరు జ్ఞానులు కాబట్టి జరిగినదంతా గ్రహించారు. నేను చేసింది పాపమో కాదో నాకు తెలియదు. కానీ నేను నా కుమారుడిని నిర్దయగా నదిలో వదిలి వేసినందుకు ఇప్పటికీ నా హృదయం దహించుకుపోతోంది. ఆ భయం ఇప్పటికీ నన్ను వదలడం లేదు. కాబట్టి మీరు నా భయాన్ని పోగొట్టండి' అని వేడుకొంది.

## కురుక్షేత్ర రహస్యం

వ్యాసుడు కుంతీదేవితో 'కుంతీ! నువ్వు చెప్పినది యథార్థం. ఇందులో నీ తప్పు ఏమీ లేదు. దేవతలు ఇలాంటి అద్భుతాలు చేస్తూ ఉంటారు. కర్ణుడు అలా జీవించవలసి ఉంది. కాబట్టే నువ్వు ఆ పని చేశావు. కర్ణుడి పుట్టుక వల్ల నీ కన్యాత్వానికి భంగం కాలేదు. కాబట్టి నువ్వు స్త్రీలలో అగ్రగణ్యురాలివి. నువ్వు

నిష్కళంకమైన చరిత్ర కలదానివి. గాంధారీ నువ్వు కోరినట్లు నీ కుమారులను, బంధువులను, సోదరులను, కర్ణుడిని, మీ మీ బంధువులను చూపిస్తాను. ద్రౌపది, సుభద్ర, మిగిలిన స్త్రీలు వారివారి పుత్రులను, కుమారులను, మనుమలను చూస్తారు. నేను ఈ పని చేయడానికే ఇక్కడకు వచ్చాను. మీరు కోరిన కోరికలు నెరవేరుస్తాను. కానీ గాంధారీ! నువ్వు నీ కుమారుల గురించి, మనుమల గురించి చింతించ వద్దు. వారు యుద్ధం చేసి వీరమరణం పొందారు.

భారతయుద్ధం ఇలా జరగాలని ఎప్పుడో నిర్ణయమయ్యింది. ఎందరో దేవతలు తమ తమ అంశలతో ఈ భూమిమీద జన్మించారు. నీ భర్త పూర్వజన్మలో ధృతరాష్ట్రుడు అనే గంధర్వరాజు. అతడు ఈ జన్మలో అంధరాజుగా జన్మించాడు. యమధర్మరాజు అంశతో ధర్మరాజు, వాయుదేవుడి అంశతో భీముడు, అశ్వినీ దేవతల అంశతో నకులసహదేవులు, నరనారాయణులే అర్జున శ్రీకృష్ణులుగా జన్మించారు. ద్వాపరుడు శకునిగా, కలి అంశతో సుయోధనుడు జన్మించారు. రాక్షసాంశలతో దుశ్శాసనాది నీ మిగిలిన కుమారులు జన్మించారు.

సూర్యుడి అంశతో కర్ణుడు, చంద్రుడి అంశతో అభిమన్యుడు జన్మించారు. అగ్నిలో నుండి పుట్టిన ద్రౌపదికి అన్నయైన ధృష్టద్యుమ్నుడు ఎవరనుకున్నావు? సాక్షాత్తూ అగ్నిదేవుడే అలా జన్మించాడు. వాయుదేవుడి అంశతో అతడి సోదరుడు శిఖండి జన్మించాడు. బృహస్పతి అంశతో కులగురువు ద్రోణుడు జన్మించారు. అష్టవసువులలో ఎనిమిదవ వసువు శాపగ్రస్తుడై దేవవ్రతుడుగా జన్మించి భీష్ముడుగా ఖ్యాతి గాంచాడు. రుద్రుడి అంశతో అశ్వత్థామ జన్మించాడు. మిగిలిన రాజులంతా దేవతాంశలతో రాక్షసాంశలతో జన్మించారు. కాబట్టి వీరంతా కారణజన్ములు. వారి వారి జన్మసాఫల్యం కలుగగానే ఈ లోకాన్ని విడిచిపెట్టేశారు. కాబట్టి ఎవరూ ఎవరినీ చంపలేదు.

ఇక మీరందరూ నాతో గంగాతీరానికి వచ్చారంటే అక్కడ మీ మనసులోని దుఃఖాన్ని పోగొట్టేలా మీ మీ మిత్రులను, కుమారులను, పౌత్రులను, బంధువులను అందరినీ చూపిస్తాను' అన్నాడు వేదవ్యాసుడు.

అందరూ వ్యాసుడితో గంగాతీరానికి చేరారు. వారితో శతాయువు లాంటి మునులు కూడా ఆ ఆశ్చర్యకరమైన దృశ్యాల్ని చూడడానికి కుతూహలంగా గంగాతీరానికి చేరుకున్నారు.

అప్పటికే సాయంత్రము అయ్యింది. 'పొద్దుపోయింది కాబట్టి మీమీ బంధువులను రేపు చూద్దాం' అన్నాడు వ్యాసుడు.

అక్కడికి చేరిన వారంతా ఆ రాత్రి తమ వారిని చూడాలన్న ఉత్సాహంతో నూరు సంవత్సరాల పాటు ఎదురు చూసినట్లు ఎదురు చూశారు.

చనిపోయిన వీరులను పరలోకాల నుండి ఆవాహన చేస్తున్నాడు వ్యాసుడు.

మరునాడు ఉదయమే అందరూ నిద్రలేచారు. ప్రాతఃకాలం నిర్వర్తించ వలసిన విధులను నిర్వర్తించారు. ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీ, పాండవులు ఉత్సాహంతో వ్యాసుడి వద్దకువెళ్ళి చుట్టూ చేరారు. అందరూ జరగబోయే అద్భుతాన్ని తిలకించడానికి ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

వ్యాసుడు గంగానదిలో దిగాడు. ఒక్క మునక వేసి, పైకిలేచి చేతులు చాచి 'అందరూ రండి' అని ప్రేమగా పిలిచాడు. ఇంతలో పెద్దగా చప్పుడు వినిపించింది. బిల బిల మంటూ నీళ్ళలో నుండి యుద్ధంలో చనిపోయిన దుర్యోధనుడు, అతడి నూరుగురు తమ్ముళ్ళు, అతడి మొత్తం కుటుంబం, అభిమన్యుడు, అశ్వత్థామ చేతిలో హతులైన ఉపపాండవులు మొదలైన పాండురాజు సంతానం, కర్ణుడు, బాహ్లికుడు మొదలైన కురుప్రముఖులు, ద్రుపదుడు, అతడి సంతతివారు, విరాటుడు, అతడి కుమారులు, శకుని అతడి అన్నదమ్ములు, అతడి కుమారులు, వీరందరికీ ముందు భీష్ముడు, ద్రోణుడు ముందు నడుస్తూ ఉంటే గంగానది నుండి దివ్యశరీరాలు ధరించి వెలుపలికి వచ్చారు.

ధృతరాష్ట్రుడు అంధుడు కాబట్టి వ్యాసుడు అతడికి దివ్యదృష్టి ప్రసాదించాడు. గాంధారి కూడా తన కళ్ళకు కట్టుకున్న వస్త్రాన్ని తీసింది. అందరూ తమ పుత్ర పౌత్ర సమేతంగా బంధువులను చూశారు. అందరూ కలిసే సరికి వారంతా నవ్వుతూ తుళ్ళుతూ ప్రేమగా హాయిగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నారు.

వీరేనా యుద్ధంలో ఒకరి మీద ఒకరు కత్తులు నూరుకున్నవాళ్ళు అని సుయోధనుడు అనుకున్నాడు. పూర్వం ఉన్న అభిమానం, క్రౌర్యం మచ్చుకు కూడా లేవు. అంతా ప్రేమగా ఉన్నారు. అందరూ కలసి ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చారు. వారిరాక అక్కడి వారికి ఆశ్చర్యం, ఆనందం కలిగించింది.

చిన్న వారందరూ తమకన్నా పెద్ద వారికి నమస్కారాలు చేస్తున్నారు. పెద్ద వాళ్ళు చిన్న వారిని ఆశీర్వదిస్తున్నారు. అంతా ఆనందంగా ఉన్నారు. అక్కడ దివ్యశరీరులు మానవశరీరులు కలసిమెలసి ఉన్నారు.

భీష్ముడు తనకంటే చిన్న వారిని పలకరిస్తూ దీవిస్తున్నాడు.ద్రోణుడు తన శిష్యులను ఆదరంగా పలకరిస్తున్నాడు. ఇక అందరూ తమ తమ బంధువులను కలుసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆ రోజంతా అందరూ పూర్వ వైరాలు మరచిపోయారు. హాయిగా గంగాతీరంలో గడిపారు.

మరునాడు ఉదయం. దివ్యశరీరులు మానవశరీరుల వద్ద వీడ్కోలు తీసుకున్నారు. తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యారు. దివ్యశరీరులు తమ తమ లోకాలకు వెళ్ళడానికి గంగానదిలో దిగారు. వారికి వీడ్కోలు పలికే సమయంలో వ్యాసుడు 'చనిపోయిన మీ భర్తలను కలుసుకున్నారు. మీలో ఎవరైనా మీ భర్తలను అనుసరించి వారితో దివ్యలోకాలకు వెళ్ళాలని అనుకుంటే వెళ్ళవచ్చు అలాంటి వారు వచ్చి గంగానదిలో మునగండి' అన్నాడు.

వెంటనే యుద్ధంలో చనిపోయిన వీరుల భార్యలు ధృతరాష్ట్రగాంధారుల అనుమతి తీసుకుని తమ భర్తలను అనుసరించడానికి గంగానదిలో మునిగారు. వెంటనే వారంతా తమ మానవశరీరాలను వదిలి దివ్యశరీరాలను ధరించి తమ భర్తలను అనుసరించారు.

ఆ దృశ్యాన్ని చూసిన వారు ఆశ్చర్యపోయారు. ధృతరాష్ట్రుడికి తిరిగి అంధత్వం ప్రాప్తించింది. శతాయువు మొదలైన మహామునులు ధృతరాష్ట్రుడి వద్ద సెలవు తీసుకుని తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు.

వ్యాసుడు ధృతరాష్ట్రుడితో 'కుమారా! చూశావా? నీ కుమారులు ఈ లోకంలో కంటే పై లోకాలలోనే సుఖంగా ఉన్నారు. ఇకనైనా వారి మరణం గురించి చింతించకు. ధర్మరాజు ఇక్కడకు వచ్చి ఒక మాసం అయ్యింది. అతడు నువ్వు వెళ్ళమని చెప్పే వరకు వెళ్ళడు. అతడు వెళ్ళక పోతే అక్కడ రాజ్యపాలన కుంటువడుతుంది' అని వ్యాసుడు చెప్పాడు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'నాయనా ధర్మతనయా! నువ్వు ఇక్కడికి వచ్చి చాలారోజులు అయింది. అక్కడ రాజ్యపాలన కూడా చెయ్యాలి కదా! నువ్వు రాజనీతి గురించి భీష్మాదుల వల్ల చక్కగా తెలుసుకున్నావు. నేను ప్రత్యేకంగా చెప్పవలసినది ఏమీ లేదు. నువ్వు రాజధానిలో లేని సమయం చూసి శత్రువులు విజృంభించే ప్రమాదం ఉంది. కాబట్టి నువ్వు నీ తమ్ముళ్ళను తీసుకుని వెంటనే హస్తినాపురానికి వెళ్ళు. నువ్వు రావడం వల్ల నా మనసులో ఉన్నబాధ మటుమాయం అయ్యింది. ఇప్పుడు నా మనసు ప్రాపంచిక విషయాలపై లేదు. తపస్సు చేయాలని మాత్రమే ఉంది. మీరు ఇక్కడ ఉంటే నా తపస్సుకు భంగం కలుగుతుంది. కాబట్టి అందరూ రాజధానికి తిరిగి వెళ్ళండి' అన్నాడు.

ధర్మరాజు చేతులు జోడించి 'మీరు చెప్పినట్లే చెస్తాను. రాజ్యభారం వహించడానికి భీముణ్ణీ, అర్జునుణ్ణీ, నకులసహదేవులను పంపి నేను ఇక్కడే ఉండి మీ పాదసేవ చేసుకుని తరిస్తాను. నాకు అనుమతి ఇవ్వండి' అన్నాడు.

ఆ మాటలకు గాంధారి 'కుమారా! ధర్మనందనా! నువ్వు ఇలా మాట్లాడవద్దు. నువ్వు సన్యాసదీక్ష తీసుకుని ఇక్కడ ఉంటే అక్కడ రాజ్యపాలన ఎవరు చేస్తారయ్యా? పితరులకు ఎవరు శ్రాద్ధకర్మలు నిర్వహిస్తారు? కాబట్టి నువ్వు రాజధానికి వెళ్ళడమే ఉత్తమం' అంది.

ధర్మరాజు 'అమ్మా! మీరు ఎన్ని చెప్పినా ఇంత ప్రశాంతంగా ఉన్న ఈ అరణ్యాన్ని విడిచివెళ్ళడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు. నా మనసులో ఇదివరకటిలా రాజ్యకాంక్ష లేదు. అమ్మా! అటు పాంచాలవంశంలోనూ ఇటు మత్స్య వంశం లోనూ స్త్రీలు తప్ప పురుషులు అందరూ యుద్ధంలో మరణించారు. కేవలం స్త్రీలు మాత్రమే మిగిలారు. ఇదంతా నా వల్లనేకదా! ఆ వంశంలో కేవలం ఒక్క పురుషుడు కూడా లేని రాజ్యం నాకు అవసరం లేదు. భారతయుద్ధం జరిగినప్పటినుండి నా మనసు రాజ్యపాలన మీద లేదు. తపస్సు మీదే లగ్నం అయ్యింది. నేను మీకు ఎటువంటి ఇబ్బంది కలిగించను. నన్ను ఇక్కడ ఉండడానికి అనుమతించండి. మరేమీ మాట్లాడకండి' అన్నాడు.

వెంటనే సహదేవుడు కలుగజేసుకొని 'అన్నయ్యా! నేను కూడా ఇక్కడే ఉండి తపస్సు చేసుకుంటాను. పెద్దలకు సేవ చేసుకుంటూ ఉంటాను. తమరు అంతఃపుర కాంతలను తీసుకుని హస్తినాపురానికి వెళ్ళండి' అన్నాడు.

ఆ మాటలకు పొంగిపోయింది కుంతీదేవి. సహదేవుడిని గుండెలకు హత్తుకుని 'నాయనా! సహదేవా! మీరు అందరూ రాజధర్మంలో సమర్థులు. మీరు సమర్థవంతంగా రాజ్యపాలన చేయాలి కానీ మాకు సేవలు చేస్తూ అరణ్యంలో ఉంటే మీ ప్రతిభ అడవిని కాసిన వెన్నెల అవుతుంది. ఇంకో మాట. మీరు ఇక్కడ ఉంటే మాకు తపోభంగం. మాకు ఏకాగ్రత కుదరదు. ఎలా చూసినా మీరు ఇక్కడ ఉండడం అన్నివిధాలా అందరికీ మంచిది కాదు. కాబట్టి మీరందరూ హస్తినాపురానికి వెళ్ళండి' అంది.

ఇక చేసేది ఏమీ లేక ధర్మరాజు అందరివద్ద సెలవు తీసుకుని హస్తినాపురానికి వెళ్ళిపోయాడు.

## నారదుడి రాక

కొన్ని రోజులు గడిచాయి. ధర్మరాజు తన తమ్ముళ్ళతో ఇష్టాగోష్ఠి జరుపుతున్న సమయంలో అక్కడికి నారదుడు వచ్చి – 'ధర్మనందనా! నేను లోకసంచారం చేస్తూ ఎన్నో దేశాలు తిరిగాను. నిన్ను చూసి చాలారోజులు అయ్యింది కాబట్టి నిన్ను చూడాలని వచ్చాను. గంగానది వద్ద ఉన్న మహర్షుల ద్వారా మీ పెద్దనాన్న ధృతరాష్ట్రుడి తపస్సు గురించి విన్నాను' అన్నాడు.

అది విని ధర్మరాజు 'మహాత్మా! మా పెద్దతండ్రిగారూ, మా పెద్దతల్లిగారూ, మా తల్లి కుంతీదేవి క్షేమమేనా? వారికి ఏ ఇబ్బంది లేదు కదా?' అని అడిగాడు.

నారదుడు 'ధర్మనందనా! నీకు అన్ని విషయాలు సవిస్తరంగా చెప్తాను. సావధాన చిత్తుడవై విను. మీరందరూ ధృతరాష్ట్రుడి ఆశ్రమం నుండి వచ్చాక కొంత కాలం బాగానే జరిగింది.

ఒక రోజు ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవి, సంజయుడు అగ్నిహోత్రంతో సహా తపస్సు చేసుకోవడానికి గంగానదీ తీరంలో ఉన్న అరణ్యాలకు వెళ్ళారు. అక్కడ ధృతరాష్ట్రుడు కేవలం గాలి మాత్రమే తీసుకుంటూ, గాంధారి కేవలం నీరు

మాత్రమే ఆహారంగా తీసుకుంటూ కుంతీదేవి నెలకు ఒకసారి మాత్రమే ఆహారం, సంజయుడు వారానికి ఒకసారి మాత్రమే ఆహారం తీసుకుంటూ తపస్సు చేస్తున్నారు.

ఒక రోజు వారందరూ గంగానదిలో స్నానం చేసి వస్తున్న సమయంలో అడవిలో దావానలం తీవ్రంగా వ్యాపించింది. అడవి అంతా చుట్టుముట్టింది. పక్షులూ జంతువులూ కకావికలు అయిపోయాయి. గాంధారీ, ధృతరాష్ట్రులు నిరాహారులైన కారణంతో అక్కడ నుండి వేగంగా పరిగెత్తి ఆ మంటల బారి నుండి ప్రాణాలు రక్షించుకోలేక అక్కడే నిలబడిపోయారు.

ధృతరాష్ట్రుడు సంజయుడితో 'సంజయా! నువ్వు అగ్నిజ్వాలలు లేని చోటుకు పారిపో. పారిపోవడానికి మాకు శక్తిలేదు కాబట్టి మేము రాలేము. నువ్వు పారిపోయి నీ ప్రాణాలు రక్షించుకో' అని చెప్పాడు.

సంజయుడు 'మహారాజా! మిమ్ము వదిలి వంటరిగా వెళ్ళలేను' అన్నాడు.

ధృతరాష్ట్రుడు 'సంజయా! మేము తప్పించుకునే పరిస్థితిలో లేం. కానీ నువ్వు తప్పించుకు పారి పోగలవు. ఇది పాపం కాదులే వెళ్ళిపో'అన్నాడు.

మొత్తానికి సంజయుడు ఆ మంటలు తప్పించుకుని హిమాలయాలకు పారిపోయాడు. ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవులు ఆ మంటలకు ఆహుతి అయ్యారు. ఇదంతా నాకు గంగాతీరాన ఉండే మునులు చెప్పారు అన్నాడు నారదుడు విచారంగా. పాండవులు ఆ వార్త విని తీవ్రమైన ఆవేదనకు గురయ్యారు. దుఃఖంతో రోదించసాగారు. ఈ విషయము అంతఃపురస్త్రీలకు తెలిసింది. అంతా శోకసముద్రంలో మునిగి పోయారు. తమ మహారాజు మరణానికి అందరూ దుఃఖిస్తున్నారు.

ధర్మరాజు ఏడుస్తూనే నారదుడితో 'మునీంద్రా! ఎవరి చావు ఎక్కడ రాసి పెట్టి ఉందో ఎవరికి తెలుసు? మేమంతా ఉండగా మా పెద్దనాన్న దిక్కు లేని చావు చచ్చాడు. నూరుగురు కుమారులు ఉండీ, వేయి ఏనుగుల బలం ఉండీ కూడా ధృతరాష్ట్రుడు నిస్సహాయంగా అగ్నికి ఆహుతైపోయాడు. పట్టు పానుపు మీద హాయిగా నిద్రిస్తూ వందిమాగధుల కైవారాలతో నిద్ర లేవవలసిన ధృతరాష్ట్రుడు ఇప్పుడు కటిక నేల మీద పడి ఉండి, నక్కలు తోడేళ్ళ ఊళలు వింటూ దిక్కు

లేకుండా పడి ఉన్నాడు. నారద మహర్షీ! గాంధారి తన భర్తతో మరణించింది. ఆమె గురించి చింతించవలసిన పని లేదు.

కానీ మా తల్లి కుంతీదేవి మేమంతా రాజభోగాలు అనుభవిస్తుంటే అడవులకు వెళ్ళి అక్కడ అగ్నికి ఆహుతి అయ్యింది. ఆమె గురించే నా దుఃఖం అంతా. ఆమె కడుపున పుట్టిన భీమార్జునులు, నేను నకులసహదేవులు ఇంతమంది కుమారులను పెట్టుకుని మా తల్లి అనాథగా దిక్కులేని చావు చచ్చింది. ఆమె గురించి దుఃఖించకుండా ఎలా ఉండగలను చెప్పు? నారదమహర్షీ! తమరికి తెలుసు కదా! ఖాండవ వనదహన సమయంలో అర్జునుడు అగ్నిదేవుడికి చేసిన సాయం మరచి అగ్నిదేవుడు మా తల్లిని ఎలా దహించాడు? ఆ అగ్నిదేవుడికి కృతజ్ఞత లేదా! అగ్నిదేవుడు ఇంత కృతఘ్నుడా! మునీంద్రా! ఇక ఎంత బాధపడి ఏమి ప్రయోజనం? వారికి మేము ఏమి చెయ్యాలి చెప్పండి?' అని అడిగాడు.

నారదుడు 'ధర్మనందనా! మరో విషయం. ఇది జరిగిన ముందు రోజు ధృతరాష్ట్రుడికి విరక్తి అధికమయ్యింది. అగ్నికి ప్రత్యేక పూజలు చేశాడు. ఆ అగ్నిని వ్రేల్చిన ఋత్విక్కులు అగ్నికి అక్కడ ఉద్వాసన చేసి అగ్నిని అక్కడే వదిలి వెళ్ళారు. ఆ అగ్ని కార్చిచ్చుగా మారి ఆ అడవిని దహించి వేసింది. ఆ అగ్నిలో వారు ఆహుతి అయ్యారు. కాబట్టి నువ్వు, నీ తమ్ముళ్ళు, ద్రౌపది మొదలైన అంతఃపుర కాంతలు అందరూ గంగానదికి వెళ్లి స్నానం చేసి తిలోదకాలు ఇవ్వండి'అన్నాడు.

వెంటనే పాండవులు, అంతఃపురకాంతలు, పురజనులు అంతా గంగాతీరానికి వెళ్ళి గంగా స్నానం చేసి తిలోదకాలు ఇచ్చారు. పదిరాత్రులు గంగాతీరంలో కుటీరాలు నిర్మించుకుని అక్కడే నివసించారు. సమర్థులైన వారిని పిలిపించి ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవుల అస్థికలు సేకరించి వాటిని గంగానదిలో నిమజ్జనం చేశారు. శ్రాద్ధకర్మలు శ్రద్ధగా చేశారు. దానధర్మాలు విరివిగా చేసారు. వారికి ఉత్తమలోక ప్రాప్తికి కావలసిన అన్ని కార్యక్రమాలను శ్రద్ధగా చేశారు. శ్రాద్ధకర్మలు జరిగిన 12 రోజులు నారదుడు అక్కడే ఉండి అన్నీ సక్రమంగా జరిపి ధర్మరాజునూ అతడి తమ్ముళ్ళనూ ఆశీర్వదించాడు.

# మౌసలపర్వం

ద్వారకానగరం. శ్రీకృష్ణుడి దర్శనం కోసం విశ్వామిత్రుడు, కణ్వుడు, నారదుడు విచ్చేశారు. తిరిగి వెళ్తుంటే దారిలో యాదవులు వాళ్ళను ఆపారు. శ్రీకృష్ణుడి కొడుకైన సాంబుడికి స్త్రీ వేషం వేసి 'మహర్షులూ! ఈమెకు ఎవరు పుడతారు? ఆడా? మగా?' అని ప్రశ్నించారు. మహర్షులకు అసలు విషయం తెలియదా? వెంటనే కోపంతో 'ఈమె కడుపులో యాదవవంశాన్ని నాశనం చేసే ముసలం పుడుతుంది. మీరంతా దానివల్ల కొట్టుకు చస్తారు. బలరాముడు మరణించి సముద్రానికి చేరుకుంటాడు. శ్రీకృష్ణుడు 'జర' అనే రాక్షసి వల్ల మరణిస్తాడు' అని శపించి వెళ్ళిపోయారు.

అన్నట్లుగానే సాంబుడి కడుపున ముసలం పుట్టింది. వసుదేవుడి ఆదేశంతో దానిని అరగదీసి సముద్రంలో కలిపేశారు.

కొంతకాలం తర్వాత ద్వారకలో అపశకునాలు కన్పిస్తున్నాయి. గాంధారి శాపం ప్రకారం జరగబోతోంది. వెంటనే శ్రీకృష్ణుడు యాదవులందర్నీ పిలిచి 'మీరు రేపు అందరూ వెళ్ళి సముద్రానికి ఉత్సవాలు జరిపించండి' అని ఆజ్ఞాపించాడు.

మరునాడు యాదవులు సముద్రతీరానికి చేరుకున్నారు. ఉద్ధవుడూ, బలరాముడూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. బలరాముడు దారిలో ఒక చెట్టు దగ్గర ఆగిపోయాడు. ఉద్ధవుడు ముందుకు సాగిపోయాడు.

అక్కడ యాదవులు ఉత్సాహంగా సముద్రానికి పూజలు చేశారు. తరువాత మద్యం తాగుతూ విందులూ వినోదాలతో కాలక్షేపం చేస్తున్నారు. పీకలదాకా తాగిన మద్యం ఊరుకుంటుందా? ఒకరినొకరు నిందించుకొనేలా చేసింది. అంతే గొడవలు పెరిగి పెరిగి ఒకర్నొకరు పొడుచుకొన్నారు. అందరూ నేలకొరిగారు.

శ్రీకృష్ణుడు అంతా చూస్తూనే ఉన్నాడు. మౌనం వహించాడు. వసుదేవుడు నీటిలో కలపమన్న ముసలం (రోకలి) పొడి– నీళ్ళలో కొట్టుకు వచ్చి ఆ ఒడ్డునే నిలిచిన తుంగకాడల్లోకి ప్రవేశించింది. ఆ తుంగల్నే పట్టుకొని యాదవులు ఒకరినొకరు కొట్టుకొని ప్రాణాలు తీసుకున్నారు.

మునుల శాప ప్రభావం వల్ల శ్రీకృష్ణుడు కూడా కోపంతో రెచ్చిపోయాడు. తక్కిన వాళ్ళను తానూ ఆ తుంగలతోనే కొట్టి చంపాడు. చివరికి శ్రీకృష్ణుడు ఒక్కడే మిగిలాడు. అప్పుడు అతడి వద్దకు దారుకుడు, బభ్రుడు వచ్చి బలరాముడి వద్దకు తీసుకువెళ్ళారు. బలరాముడు ఒక చెట్టు కింద ధ్యానంలో ఉన్నాడు.

తరువాత శ్రీకృష్ణుడు దారుకుడిని అర్జునుణ్ణి తీసుకురమ్మని పంపాడు. బభ్రుణ్ణి 'ఇక్కడి ఏనుగుల్నీ, గుర్రాల్నీ, స్త్రీలని నగరానికి చేర్చిరా!' అని పంపాడు. ఇంతలో ఒక వేటగాడు బభ్రుణ్ణి వధించడంతో తానే నగరానికి బయలుదేరాడు శ్రీకృష్ణుడు. అందర్నీ వసుదేవుడికి అప్పగించి, అర్జునుడు వస్తున్నాడనీ అతడు అందరినీ కాపాడతాడనీ చెప్పి బలరాముడి వద్దకు వచ్చాడు.

బలరాముడు ధ్యానంలో ఉన్నాడు. అతడి ముఖంలో నుండి వేయిపడగల మహాసర్పం ఒకటి బయటకు వచ్చి సముద్రంలో కలిసిపోయింది. బలరాముడు యోగమార్గం ద్వారా అవతారాన్ని చాలించాడు.

శ్రీకృష్ణుడికి కూడా తను అవతారం చాలించాల్సిన సమయం ఆసన్న మయ్యిందని అర్థమయ్యింది. పూర్వం దుర్వాసమహర్షి ద్వారకానగరానికి వచ్చాడు. శ్రీకృష్ణుణ్ణి పరీక్షించాలని పాయసం తెప్పించి తన ఒంటికి పూయమన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు పాదాలకు తప్ప మిగిలిన శరీరానికి పాయసాన్ని పూశాడు. అప్పుడు దుర్వాసమహర్షి 'నీకు భవిష్యత్తులో అరికాలు ద్వారానే ప్రాణాపాయం కలుగుతుందని హెచ్చరించి వెళ్ళిపోయాడు. అది గుర్తుకువచ్చింది. ఏం చెయ్యాలో పాలుపోక అటూ ఇటూ తిరిగి అలసిపోయి ఒక చెట్టుకింద పడుకొన్నాడు. ఆదమరచి నిద్రపోయాడు.

**మునుల శాప ప్రభావం. 'జర' అనే ఒక రాక్షసి అడవిలోనికి వచ్చింది. అక్కడో వేటగాడు ఉన్నాడు. వాడికి శ్రీకృష్ణుడి పాదం జింకపిల్లలా కన్పించేలా మాయలు పన్నింది జర.**

వేటగాడు బాణం వేశాడు. శ్రీకృష్ణుడి అరికాలును చీల్చుకొని వచ్చిందా బాణం. దగ్గరకు వచ్చి విషయం తెలుసుకున్న బోయవాడు బిత్తరపోయాడు. శ్రీకృష్ణుడి కాళ్ళపై పడ్డాడు.

శ్రీకృష్ణుడు వాణ్ణి ఓదార్చి పంపివేశాడు. ఆ తరువాత తన అవతారం చాలించాడు. శ్రీకృష్ణుడిలో ఉన్న తేజస్సు వైకుంఠానికి చేరుకుంది.

అర్జునుడు ద్వారకానగరానికి వచ్చాడు. మరో ఏడురోజుల్లో ద్వారక సముద్రంలో మునిగిపోతుందని తెలుసుకొని అందరినీ హెచ్చరించాడు. ఆ రాత్రి అర్జునుడు అక్కడే ఉన్నాడు. తెల్లవారుతూనే వసుదేవుడు శరీరాన్ని విడిచిపెట్టాడు. అతడి భార్యలు దేవకి, రోహిణి, భద్ర, మదిర మొదలైన వాళ్ళు అతడి చితిలో ప్రవేశించి స్వర్గానికి చేరుకున్నారు.

మరునాడు అర్జునుడు శ్రీకృష్ణ బలరాముల కోసం అన్వేషణ ప్రారంభించాడు. చివరికి ప్రయత్నం ఫలించింది. ప్రాణాలు కోల్పోయిన శ్రీకృష్ణుణ్ణి చూసి, కుప్పకూలిపోయాడు. బలరామకృష్ణులకు అంత్యక్రియలు నిర్వహించాడు.

ఆరోజే సముద్రుడు ద్వారకను ముంచెత్తబోతున్నాడు. వెంటనే అర్జునుడు నగరంలో ఉన్న వాళ్ళందరినీ, పశుసంపదనీ తరలించి 'పంచవటం' అనే ప్రదేశానికి చేర్చాడు. ఆ రోజు రాత్రి ఒక దొంగల గుంపు వచ్చి వీళ్ళని అడ్డగించింది. అర్జునుడు కోపంతో బాణాలు వేశాడు. కానీ వాళ్ళను అవేమీ చెయ్యలేకపోయాయి. సమయానికి మంత్రాలూ అతడికి గుర్తుకు రాలేదు. గాండీవంతోనే వాళ్ళపై విరుచుకుపడ్డాడు. వాళ్ళు స్త్రీల ఆభరణాలు దోచుకొని పారిపోయారు. చివరికి దిగులుగా యాదవస్త్రీలను తీసుకొని దీనంగా కురుక్షేత్రానికి చేరుకున్నాడు అర్జునుడు.

కొద్దిరోజుల తర్వాత అర్జునుడు శ్రీకృష్ణుడి భార్యలతో శ్రీకృష్ణ మరణవార్తను చెప్పాడు. అందరూ బోరున విలపించారు. రుక్మిణి, జాంబవతి మొదలైన వాళ్ళు ప్రాణత్యాగం చేశారు. సత్యభామ మొదలైనవాళ్ళు అడవులకి వెళ్ళిపోయారు.

మరికొంతకాలం గడిచింది. అర్జునుడు వేదవ్యాసుడి దగ్గరకు వెళ్ళాడు. జరిగిన ఈ విపరీతాలన్నింటికీ కారణం ఏమిటని అడిగాడు. దానికి వేదవ్యాసుడు– 'ఇదంతా శాపాల ప్రభావం. నువ్వేమీ బాధపడకు. నీ అస్త్రాల ప్రభావానికి కూడా కాలం చెల్లిపోయింది. అందుకే అవి పని చెయ్యలేదు. కాలాన్ని ఎవరూ తప్పించలేదు.

**కం. బలమును బుద్ధియుఁ జేవయు**
**నలఘుమతీ! యుల్లసిల్లు నగుకాలమునం**
**బొలియుం గాలవిపర్యయ**
**కలనంబున బుధుల కుబ్బుఁ గలఁకయుఁ గలవే**

**తే.గీ. కాలమూలంబు సర్వంబుఁ గాన దీని**
**కొండు తలఁపులు దక్కి మీ రుత్తమంపు**
**గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు**
**విడిచి యార్యజనంబులు వినుతి సేయ (మౌసల: 1–221, 222)**

**నాయనా! అన్నింటికీ కాలమే మూలం. బలమూ బుద్ధీ చేవ అన్నీ కాలం అనుకూలిస్తేనే. కాలం అనుకూలించకపోతే ఎన్ని ఉన్నా కార్యం సఫలం కాదు. కాబట్టి దీనిని గురించి మీరు ఇతరమైన అలోచనలు మానండి. ఏ విచారమూ లేకుండా వికారమైన శరీరాలను విడిచిపెట్టి ఆదర్శప్రాయమైన శీలంగల జనులు కొనియాడే విధంగా ఉత్తమగతికి చేరుకోండి.మరోవిషయం – ఎవడికైనా కాలం అనుకూలిస్తే బుద్ధి, శక్తి చురుకుగా పనిచేస్తాయి. కాలం అనుకూలించకపోతే ఏమీ పనిచెయ్యవు. మీకూ అంత్యకాలం వచ్చేసింది. శరీరాల్ని త్యాగం చేసి ఉత్తమ గతుల్ని పొందండి' అని వెళ్ళిపోయాడు వేదవ్యాసుడు.**

# మహాప్రస్థానికపర్వం

వైశంపాయనుడు జనమేజయమహారాజుకు చెప్తున్నాడు.

'జనమేజయా! శ్రీకృష్ణుడు, బలరాముడు, యాదవులూ మరణించారు. అర్జునుడిని వ్యాసమహర్షి మహాప్రస్థానానికి సిద్ధం కమ్మన్నాడు. అదే విషయాన్ని అర్జునుడు హస్తినాపురానికి వచ్చి ధర్మరాజుకు చెప్పాడు. ఆ మాటలు విన్న ధర్మరాజు అర్జునుడితో –

'అర్జునా! కాలుడు అన్ని ప్రాణులనూ కాల్చి పరిపక్వం చేస్తాడు. మనకు కూడా అంతిమ కాలం ఆసన్నమయింది. కాబట్టి మనం మన కర్మలను త్యజించాలి. ఆ సమయం వచ్చింది. నువ్వు కూడా ఇదే అనుకుంటున్నావు కదా!' అన్నాడు.

'అవును అన్నయ్యా! కాలానికి సాటి కాలమే! కాబట్టి మనం కూడా కాలంతో పాటు ప్రయాణించాలి'అన్నాడు అర్జునుడు.

వెంటనే ధర్మరాజు భీమ, నకులసహదేవులను పిలిపించాడు. వారికి కూడా అన్ని విషయాలూ చెప్పాడు. వారూ అలాగే అన్నారు. ధృతరాష్ట్రుడి కుమారులలో యుయుత్సుడు ఒక్కడే మిగిలి ఉన్నాడు. ఇతడు ధృతరాష్ట్రుడికి వైశ్యస్త్రీవల్ల పుట్టినకుమారుడు. మహాభారత యుద్ధం ప్రారంభంలో 'కౌరవుల పక్షంనుండి మాపక్షానికి రావాలనుకొనేవాళ్ళు రావచ్చు' అని ధర్మరాజు ప్రకటించగానే వచ్చి పాండవుల పక్షంలో చేరాడు. అందుకే అతడు ఒక్కడే మిగిలాడు. **అలా మిగిలిన యుయుత్సుడిని కౌరవ సామ్రాజ్యానికి సేనానాయకుడిగా నియమించాడు ధర్మరాజు. ఉత్తర కుమారుడైన పరీక్షిత్తును యువరాజుగా అభిషేకించాడు.** యుయుత్సుడికి రాజ్యపాలన గురించి అన్ని జాగ్రత్తలూ చెప్పి, తరువాత సుభద్రను చూసి ఇలా అన్నాడు. 'అమ్మా! సుభద్రా! ఈ భరత సామ్రాజ్యానికి నీ మనుమడు

ఉత్తరాధికారి అయ్యాడు. శ్రీకృష్ణుడి మనుమడైన వజ్రుడు ఇంద్రప్రస్థానికి రాజు అయ్యాడు. ఈ ప్రకారంగా కురు, యాదవ వంశాలు వర్ధిల్లుతాయి. ఈ రెండు వంశాలనూ నువ్వే రక్షించాలి. అని ఆ రెండు వంశాలకు అమెనే సంరక్షకురాలిగా నియమించాడు.

తరువాత భారత యుద్ధంలో మరణించిన వీరుల కుటుంబాలకు అగ్రహారాలు, గ్రామాలు, ధనం ఇచ్చి వారికి ఏలోటూ లేకుండా తగిన ఏర్పాట్లు చేశాడు. బ్రాహ్మణులకు గో, భూ, సువర్ణదానాలు విరివిగా చేశాడు. పరిక్షిత్తును కృపాచార్యుడికి శిష్యుడిగా అప్పగించి చివరిగా అందర్నీ పిలిచి కొలువు తీరాడు. ఆ సభలో హస్తినాపుర ప్రజలనూ పిలిపించి వారిని ఉద్దేశించి అసలు విషయం చెప్పాడు.

ప్రజలంతా ఒక్కపెట్టున 'మీరు వెళ్ళడానికి వీల్లేదు వీల్లేదు' అని గొడవచేశారు. అప్పుడు ధర్మరాజు వాళ్ళతో 'ప్రజలారా! మా ఐదుగురినీ అభిమన్యుడి కుమారుడు పరీక్షిత్తులో చూసుకోండి. అతడిపై కూడా మీరు మీ ప్రేమనూ అభిమానాన్నీ చూపించండి.' అని పౌరులకు నచ్చచెప్పాడు. పాండవులు మహాప్రస్థానం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. ఎందుకంటే జరిగిన సంఘటనల వల్ల పాండవులకు వైరాగ్యం కలిగింది. అందరూ ఒకే నిర్ణయానికి వచ్చారు.

ద్రౌపదినీ సోదరుల్నీ వెంటబెట్టుకొని మహాప్రస్థానానికి బయలుదేరాడు ధర్మరాజు. వారి వెనుక ఒక కుక్క కూడా బయలుదేరింది.

గంగాతీరానికి చేరుకున్నారు. కొండలూ, కోనలూ దాటి పోతున్నారు. ఇంతలో అగ్నిదేవుడు ప్రత్యక్షమై 'అర్జునా! నీకు ఆ గాండీవంతో ఇంక పని లేదు. దాన్ని వరుణదేవుడికి సమర్పించు' అన్నాడు. అర్జునుడు అలాగే అంటూ దాన్ని సముద్రంలోనికి విసిరివేశాడు.

తూర్పు సముద్రతీరం నుండి పాండవులు భూమికి ప్రదక్షిణంగా ప్రయాణిస్తూ కన్యాకుమారీ తీరానికి వెళ్ళారు. అక్కణ్ణుంచి పశ్చిమ సముద్ర తీరానికి చేరుకున్నారు. బదరికాశ్రమం వచ్చింది. అది దాటితే మేరుపర్వతం. ఈలోగా

వెనుకనున్న ద్రౌపది నేలపై కూలబడిపోయింది. భీముడు వెంటనే 'అన్నయ్యా! ఈమె ఎప్పుడూ అధర్మంగా ప్రవర్తించలేదు కదా! ఎందుకిలా ముందే పడిపోయింది?' అని అడిగాడు.

అప్పుడు ధర్మరాజు 'భీమసేనా! ఈమె మనందరికంటే అర్జునుడిపై కొంచెం ఎక్కువ ప్రేమను చూపేది. ఆ పక్షపాతమే ఈ పతనానికి కారణం' అన్నాడు.

కొంతదూరం వెళ్ళాక సహదేవుడు పడిపోయాడు. 'సహదేవుడు అహంకారి. తానే జ్ఞానినని విర్రవీగుతాడు' అన్నాడు ధర్మరాజు. వింటున్నాడు భీముడు.

కొంతదూరం వెళ్ళాక నకులుడు నేలకొరిగిపోయాడు. 'నకులుడికీ తాను గొప్ప అందగాడినని గర్వం' అన్నాడు ధర్మరాజు.

నడక సాగుతోంది. చక్రతీర్థం అనే ప్రాంతం వచ్చింది. అర్జునుడు 'సోదరా!' అని అరుస్తూ నేలకొరిగిపోయాడు. 'తప్పదు. కౌరవుల్ని ఒకే రోజులో చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. అది చెయ్యలేకపోయాడు. పైగా తాను గొప్ప విలుకాడిననే గర్వం. దాంతో అందర్నీ హీనంగా చూసేవాడు అర్జునుడు' అని ముందుకు నడిచాడు ధర్మరాజు.

హఠాత్తుగా భీముడు నేలపై కూలబడ్డాడు. అలా కూలబడుతూనే 'అన్నయ్యా! మరి నేనెందుకు?' అన్నాడు గొంతు పెగుల్చుకుంటూ.

'భీమా! నువ్వు పెద్ద తిండిపోతువి. పైగా బలవంతుణ్ణన్న గర్వం ఉండనే ఉంది. ఆ గర్వం వల్ల అందరినీ నోటికొచ్చినట్లు దూషిస్తూ ఉంటావు. అందుకే నీకీ దుర్గతి' అని ముందుకు సాగిపోయాడు. ఆ వెనుక కుక్క వస్తూనే ఉంది.

దేవేంద్రుడు దివ్యరథంతో వచ్చి స్వర్గానికి ఆహ్వానించాడు. తన వాళ్ళందరూ ప్రాణాలు కోల్పోయారనీ వాళ్ళు లేకుండా తాను రాలేననీ అన్నాడు ధర్మరాజు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పోయిన ద్రౌపదీ, తక్కిన సోదరులూ స్వర్గానికి చేరుకున్నారు. అదే విషయం చెప్పి ధర్మరాజును రమ్మన్నాడు ఇంద్రుడు. అప్పుడు ధర్మరాజు 'మొదటి నుండీ నన్ను ఈ కుక్క అనుసరించి వస్తోంది. నాతో దీనిని కూడా తీసుకువస్తాను' అన్నాడు. ఇంద్రుడు అందుకు ఒప్పుకోలేదు. అప్పుడు ధర్మరాజు 'దేవేంద్రా!

**చం. అనఘచరిత్ర! విన్ము శరణాగతుఁ జేకొనకున్కి శుద్ధ మి**
**త్త్రునియెడఁ జేయుద్రోహము వధూటి వధించుట విప్రునర్థముం**
**గొనుట యనంగఁ గల్గునివి గూడ సమంబగు నాకుఁ జూడ భ**
**క్తు ననపరాధునిన్ విడుచు దోషముతో నిది యోర్వవచ్చునే!**

**(మహా:58)**

**శరణుకోరినవాణ్ణి రక్షించకపోవడం, స్నేహితుడికి ద్రోహం తలపెట్టడం, స్త్రీని చంపటం, బ్రాహ్మణుడి ధనాన్ని అపహరించడం, సేవ చేస్తూ ఏ తప్పూ చేయని భక్తుణ్ణి విడిచిపెట్టడం ఇవన్నీ ఘోరమైన పాపాలు. కాబట్టి ఈ కుక్కను విడిచి నేను నీతో రాను' అన్నాడు.**

ఆ కుక్క రూపంలో ఉన్నది ఎవరో కాదు. యమధర్మరాజు. ఆయనకు ఎంతో సంతోషం కలిగింది. వెంటనే ప్రత్యక్షమై ధర్మరాజును స్వర్గానికి పంపాడు. దేవదుందుభులు మార్మోగాయి.

స్వర్గానికి చేరగానే నారదుడు వచ్చి 'ధర్మరాజా! నేను ఎంతోమంది ధర్మాత్ముల్ని చూశానుగానీ నీలాంటి ధర్మాత్ముణ్ణి చూడలేదు. నీలా శరీరంతో స్వర్గానికి వచ్చిన వాళ్ళు ఎవ్వరూ లేరు. ఇదంతా నీ ధర్మ మహిమ' అన్నాడు.

# స్వర్గారోహణ పర్వం

మహాభారతాన్ని వింటున్న జనమేజయుడు వైశంపాయనుడితో– 'మునివర్యా! మా తాతలు పాండవులు స్వర్గారోహణ చేసి ఏ యే లోకాలకు వెళ్లారు? ఎక్కడెక్కడ ఉన్నారు? కాస్త వివరంగా చెప్పండి' అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్తున్నాడు.

ధర్మరాజుకు తన సోదరుల్ని చూడాలన్న కోరిక కలిగింది. నారదుడితో చెప్పాడు. నారదుడు నవ్వుతూ 'నీలో ఇంకా మానవ స్వభావం పోలేదు. ఇప్పుడు నువ్వు స్వర్గవాసివి.

ఆ బంధాలన్నీ అక్కడితో సరి' అన్నాడు. అయినా ధర్మరాజు వింటేనా? ఒక్కసారి తన వాళ్ళని చూపించమని ప్రాధేయపడ్డాడు. అతడి కోరికను ఇంద్రుడు మన్నించి, వెంటనే ఒక దూతను పిలిచి 'ఈయన ధర్మరాజు. ఈయనకు తన వారిని చూడాలని కోరికగా ఉంది. నువ్వు ఈయన్ని తీసుకొనిపోయి ఆయన బంధువులనందరినీ చూపించు' అని ఆజ్ఞాపించాడు. ఆ దేవదూతతో ధర్మరాజు తన వాళ్ళను చూడడానికి వెళ్తున్నాడు. నారదుడూ మొదలైన వాళ్ళు వెంట వస్తున్నారు. దారిలో మొట్టమొదట దుర్యోధనుడు కన్పించాడు. సుయోధనుడు పెద్దసింహాసనం మీద కూర్చుని ఉంటే అతడి చుట్టూ దేవకాంతలు చేరి సేవలు చేస్తుంటే అంతులేని సుఖాలు అనుభవిస్తున్నాడు సుయోధనుడు. ఎంతో వైభవంగా ఉన్నాడు. అది చూసి ధర్మరాజు ఆశ్చర్యపోయాడు.

అప్పుడు నారదుడు 'ధర్మరాజా! ఇతడు దుర్మార్గుడే! కానీ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరస్వర్గాన్ని పొందాడు. అందుకే ఈ భోగం!' అన్నాడు.

దేవమునులను చూసి ఇలా అన్నాడు. ఓ దేవర్షులారా! ఈ సుయోధనుడు పరమలోభి. ఇతడికి ముందుచూపు లేదు. ఎందరో రాజులను యుద్ధానికి రప్పించి వాళ్ళను వాళ్ళ సైన్యంతో సహా మరణించేలా చేశాడు. రాజసూయ యాగం చేసి,

పవిత్రురాలైన ద్రౌపదిని నిండుకొలువులో ఘోరంగా అవమానించాడు. అలాంటి వాడు స్వర్గ సుఖాలు అనుభవిస్తుంటే వాడితో పాటు వాడి పక్కనే నేనూ స్వర్గ సుఖాలు అనుభవించాలా! నాకు వద్దు.నేను నా తమ్ముళ్ళు, ద్రౌపది ఉన్నచోటుకి వెళ్ళిపోతాను. అక్కడికి తీసుకొని వెళ్లండి.' అని అంటూ చటుక్కున వెనక్కి తిరిగిపోయాడు ధర్మరాజు.

అప్పుడు నారదుడు నవ్వుతూ 'ఓ ధర్మనందనా! ఈ సుయోధనుడు తన లోపంతో కూడిన శరీరాన్ని వదిలిపెట్టాడు. ఇప్పుడు ప్రకాశిస్తున్నది దివ్యశరీరం. అందుకే ఈ గౌరవం. చూడు.. ఇతడు యుద్ధంలో మరణించాడు. యుద్ధంలోనే రాజులను చంపాడు. అది పాపం ఎలా అవుతుంది? ఇతడు భూలోకంలో చేసిన పాపాలను ఇక్కడ తలుచుకోవడం దేనికి? ఇది పుణ్యలోకం. ఇక్కడ ఏ పాపమూ అంటదు.

'ధర్మరాజా! స్వర్గానికి వచ్చినా నువ్వు ఈర్ష్యాద్వేషాలను విడిచి పెట్టలేదే! ఇక్కడ అలాంటి వాటికి తావు లేదు. కాబట్టి కోపతాపాలూ, ఈర్ష్యాద్వేషాలూ ముందు విడిచిపెట్టు. నువ్వు ఆడిన జూదం గురించీ, దానివల్ల కలిగిన దుఃఖాల గురించీ అన్నీ మరిచిపో. ప్రశాంతంగా ఉండు' అని అన్నాడు నారదుడు.

వెంటనే ధర్మరాజు 'ఓ మహర్షీ! పుణ్యం చేస్తే స్వర్గం, పాపం చేస్తే నరకం వస్తుందంటారు కదా! మరి ఈ సుయోధనుడు చేసినవన్నీ పాపాలే. ఇతరులకు ఒక్క ఉపకారమూ చేసి ఎరుగడు. కురు వంశం మొత్తాన్నీ సర్వనాశనం చేశాడు. ఇలాంటి వాడికి స్వర్గమా! పోనీలే అది మీ ఇష్టం. నాకెందుకు గానీ. నన్ను మాత్రం నా తమ్ముళ్ళు, భార్య, నా కుమారుల వద్దకు తీసుకొని వెళ్లండి. నేను వారిని చూడాలి.నేను తిలతర్పణాలు ఇస్తున్నప్పుడు మా అమ్మ కుంతీదేవి నా వద్దకు వచ్చింది. కర్ణుడి జన్మరహస్యం చెప్పింది. అప్పటి నుండి నాకు కర్ణుణ్ణి కూడా చూడాలని ఉంది.

ఆ కర్ణుడూ మేమూ కలిస్తే ఆ ఇంద్రుడు కూడా మమ్మల్ని జయించలేడు కదా! కర్ణుడు మా అన్న అని తెలియక అతణ్ణి చంపమని నేనే అర్జునుణ్ణి పంపి పాపం చేశాను. ఆ పాపమే నన్ను నిరంతరమూ వేధిస్తూ ఉంది. దయచేసి నాకు మా అన్న కర్ణుణ్ణి చూపండి. ఇంకా ద్రుపదుడు, విరాటుడు మొదలైన వీరులూ

యుద్ధంలో మరణించారు. వారిని కూడా చూడాలని ఉంది. ఒక వేళ నా వాళ్ళు స్వర్గంలో లేకపోతే నాకూ ఈ స్వర్గం వద్దు' అంటున్నాడు ధర్మరాజు.

అప్పుడు ఆ దేవదూత ఓ మహాత్మా! నీ మనసులోని కోరిక తీర్చమని ఇంద్రుడి ఆదేశం. రండి. అంటూ తీసుకువెళ్ళాడు.ఆ దారి అంతా ఒకటే దుర్గంధం. దారిలో వెంట్రుకలు, ఎముకలు కుప్పలుగా పడి ఉన్నాయి. ఒకటే దోమలూ ఈగలూ.గుట్టలు గుట్టలుగా శవాలు. ఆ శవాల కోసం కాకులు. ఇంతలో వైతరిణీ నది వచ్చింది. ఆ నదిలో నీరు సలా సలా కాగుతూ తెర్లుతోంది. దాని ఒడ్డున కత్తుల్లాగా సూదుల్లాగా ఉన్న ఆకులతో కూడిన మొక్కలు. అక్కడ రకరకాల పాపాలకు శిక్షలు అనుభవించే పాపులు నానాయాతనలు పడుతున్నారు. వారిని చూసి ధర్మరాజు తట్టుకోలేక 'వద్దు వద్దు వెళ్ళిపోదాం. నన్ను తీసుకువెళ్ళిపోండి' అన్నాడు. అప్పుడు ధర్మరాజుకు –

'ఓ పుణ్యచరితా! నీ రాక వల్ల మా పాపాలు పటాపంచలైపోయాయి. నీ శరీరంమీదినుండి వచ్చే సువాసన వల్ల మా బాధలూ ఉపశమించాయి. కాసేపు ఇక్కడే ఉండి మాకు సంతోషాన్ని కలిగించు' అన్న కొన్ని మాటలు వినిపించాయి.

ధర్మరాజు 'అయ్యో! వీరంతా ఎన్ని బాధలు పడుతున్నారో కదా! అని అనుకుంటూ ఎవరు మీరు?ఏం పాపాలు చేశారు? అని అడిగాడు

'మేము ఎవరో కాదు. నీ అన్నదమ్ములం. నేను కర్ణుణ్ణి, నేను భీముణ్ణి' అంటూ అందరూ దీనంగా చెప్పారు. మరోవైపు 'మహారాజా! నేను ద్రౌపదిని, నేను ధృష్టద్యుమ్నుణ్ణి. మేము ద్రౌపది కొడుకులం.' అనే మాటలూ వెనువెంటనే వినిపించాయి. ధర్మరాజు నిశ్చేష్టుడై 'అయ్యో దైవమా! ఇదేమిటి? నా వాళ్ళంతా ఏం పాపం చేశారు? ఇక్కడ ధర్మం లేదు. న్యాయం అంతకన్నా లేదు. లేకపోతే నా తమ్ముళ్ళు, ద్రౌపది ఎంత గొప్పవాళ్ళు. పరమ నిష్ఠాగరిష్ఠులే! సత్యం, దయ, దానం, యజ్ఞయాగాది నిర్వహణలు కలవారే? అలాంటి వారికి ఇటువంటి దురవస్థా? కనీసం జీవితంలో ఏ ఒక్కరికైనా రవ్వంత కూడా మేలు చేయని సుయోధనుడికి స్వర్గ సుఖాలా? ఒకటే విలవిలలాడిపోతున్నాడు ధర్మరాజు.

ఇది కలా నిజమా! లేక దేవతల మాయా! అర్థం కాలేదతడికి. ఇంద్రుడి మీద పట్టరాని కోపం వచ్చింది. దేవ దూతను చూసి ఇంక నాకు నీ సాయం

అక్కరలేదనీ నా వాళ్ళు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాననీ నా మాటగా ఇంద్రుడికి చెప్పు' అన్నాడు.

ఆ దేవదూత ఇంద్రుడికి చెప్పడంతో వెంటనే ఇంద్రుడు దిక్పాలకులతో, దేవర్షులతో అక్కడికి వచ్చాడు. యమధర్మరాజు కూడా తన కుమారుణ్ణి ఓదార్చడానికి వచ్చాడు. వారి రాకతో అక్కడ ఉన్న వాతావరణం అంతా మారిపోయింది. నరకయాతనలూ, దుర్వాసనలూ, శవాల గుట్టలూ,ఎముకల పోగులూ, పాపుల ఆక్రందనలూ అన్ని మాయం అయ్యాయి. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. సమస్తదేవగణాలతో వచ్చిన ఇంద్రుడు ధర్మరాజుతో 'ధర్మజా! నువ్వు నరకంలో ఉండటం ఏమిటి? నిన్ను తీసుకొని పోవడానికే దేవతలందరూ ఇక్కడకు వచ్చారు. నీ కోపం వదిలిపెట్టు. నీకు శాశ్వతబ్రహ్మలోక ప్రాప్తి కలిగింది. నీలోని వికారాలన్నీ పోయాయి. సద్బుద్ధి కలిగింది. **'రాజ్యాంతే నరకం ధ్రువం' అని వేదోక్తి. రాజ్యం చేసిన వాడికి నరకం తప్పదు.** అందుకే నీకు నరక ద్వారదర్శనం కలిగింది. పుణ్యమూ పాపమూ రెండూ ఒకదాని వెంట ఒకటి ఉంటాయి. పుణ్యానికి స్వర్గలోకమూ, పాపానికి నరకలోకమూ కలుగుతాయి.

**కొద్దిగా పుణ్యం చేసిన వాడు ముందు ఆ పుణ్యానికి సరిపడే స్వర్గసుఖాలు అనుభవించి, తరువాత ఎక్కువ పాపాలకు తగిన నరకలోకబాధలు అనుభవిస్తాడు. అధికంగా పుణ్యం చేసుకున్న వాడు, ముందు తాను చేసిన కొద్దిపాటి పాపాలకు నరకయాతన ముందే అనుభవించి, తరువాత ఎక్కువకాలం స్వర్గలోక సుఖాలు అనుభవిస్తాడు. ఇది ఇక్కడి నియమం.** నువ్వు తక్కువ పాపం చేశావు. అందుకే ముందు నరకద్వారదర్శనం చేయించాం. ఇక సుదీర్ఘకాలం నువ్వు స్వర్గసుఖాలే అనుభవిస్తావు. నీ అన్నయ్య కర్ణుడూ, నీ తమ్ముళ్ళు కూడా ఉత్తమ లోకాలు పొందారు. చూడు వారంతా ఎలా వెలిగిపోతున్నారో! చూసి సంతోషించు. నువ్వు చేసిన రాజసూయాది యాగాలూ, వ్రతాలూ, దానధర్మాలే నీకు ఉత్తమ లోకాలు రావడానికి కారణం. నీ పూర్వికులైన మాంధాత, నలుడు, హరిశ్చంద్రుడు, దిలీపుడు, దుష్యంతుడు, భరతుడు పొందిన ఉత్తమ లోకాలే నీకూ లభించాయి. అరుగో! నిన్ను అభినందించడానికి గంధర్వులు, నాగులు, గరుడులు, సిద్ధులు, సాధ్యులు, అందరూ వచ్చారు. ఇదే ఆకాశ గంగ. పుణ్యానికి ప్రతిరూపం. ఇందులో స్నానం

చేసి దివ్య దేహంతో ప్రకాశించు' అని అన్నాడు ఇంద్రుడు. తరువాత యమధర్మరాజు వచ్చి ధర్మరాజుతో 'ఇదంతా నా పరీక్షే కుమారా! మొదటిసారి ద్వైతవనంలో, రెండోసారి మేరుపర్వతప్రాంతంలో కుక్కరూపంలో, మూడోసారి ఇక్కడా పరీక్షించాను. నీ మనసు చలించలేదు సరికదా!శమదమాది గుణాలు నీలో నిలకడగా ఉన్నాయి. కాబట్టి నువ్వు జితేంద్రియుడివి. పరీక్షలన్నీ పూర్తి అయ్యాయి. నువ్వే గెలిచావు. ఇంక స్వర్గసుఖాలు అనుభవించు. నువ్వు విన్న నీ వాళ్ళ ఆక్రందనలన్నీ మేము కల్పించినవే. నీ వాళ్ళంతా ఇప్పటికే పుణ్యలోకాలు చేరుకున్నారు. ఇంద్రుడు చెప్పినట్టు నువ్వు ఈ ఆకాశ గంగలో స్నానం చేస్తే మానవ సహజమైన లక్షణాలన్నీ పోతాయి. దైవత్వం సిద్ధిస్తుంది.' అన్నాడు యమధర్మరాజు. ధర్మరాజు తండ్రిమాటను పాటించాడు. వెంటనే మానుష శరీరం పోయింది. దివ్యశరీరం వచ్చింది. ధర్మరాజు సాక్షాత్తూ అగ్నిలా ప్రకాశిస్తూ ఎదురుగా ఉన్న ఇంద్రుణ్ణీ, యమధర్మరాజునూ స్తుతించి వారితో కలిసి ముందుకు సాగిపోయాడు.

కొంత ముందుకు వెళ్ళిన తరువాత చతుర్భుజ, శంఖ, చక్ర, గదాయుధాలతో ప్రకాశిస్తున్న శ్రీమహావిష్ణువును సేవిస్తూ అర్జునుడు కనిపించాడు. ద్వాదశాదిత్యుల పక్కన పదమూడో ఆదిత్యుడిలా కర్ణుడు ఆ పక్కనే ఉన్నాడు. మరుత్తులలో ఒకడిగా ఒప్పుతూ భీముడూ అశ్వినీ దేవతల్లా వెలిగిపోతున్న నకులసహదేవులూ కనిపించారు. చూశాడు ధర్మరాజు.

ఆ పక్కనే కొంచెం దూరంలో మహారాణిలా దివ్యకాంతితో వెలిగిపోతున్న ఒక స్త్రీమూర్తి. అమెను చూసి ధర్మరాజు ఇంద్రుడితో 'దేవేంద్రా! ఈమె ఎవరు?' అని అడిగాడు.'ధర్మనందనా! ఈమె శ్రీ మహాలక్ష్మి. ద్రౌపదిగా ద్రుపదుడికి కుమార్తెగా అయోనిజగా జన్మించింది.

ఆ పక్కన ఉన్నారే గంధర్వులు. వాళ్ళే ఆమె కుమారులైన ఉపపాండవులు. వారికి కొంచెం అవతల కనిపిస్తున్నాడే! అతడే 'ధృతరాష్ట్రుడు' అనే పేరు గల గంధర్వరాజు.

అరుగో! దివ్యాంశసంభూతులుగా భూమిపై యాదవ వీరులుగా పుట్టిన సాత్యకి, కృతవర్మ మొదలైనవారు చూడు. అక్కడ స్వర్గ సుఖాలు అనుభవిస్తున్నారు.

ధర్మనందనా! చంద్రాంశతో పుట్టాడు అభిమన్యుడు. అపరచంద్రుడిలా ఎలా ప్రకాశిస్తున్నాడో చూడు!' అన్నాడు ఇంద్రుడు.

ఇంతలో పాండురాజు, కుంతీదేవి, మాద్రులతో కలిసి దివ్యవిమానంలో వస్తున్నాడు. 'ధర్మజా! చూడు' అని ఇంద్రుడు చూపించాడు.

అక్కడే అష్ట వసువులలో ఒకడైన భీష్ముడు, బృహస్పతి పక్కన కూర్చుని ఉన్న ద్రోణుడు, గంధర్వాది గణంతో కలిసి ఉన్న ద్రుపదుడు, విరాటుడు, వాళ్ళ అన్నదమ్ములూ, కుమారులూ, బంధువులూ, కేకయ, పాండ్యాది దేశాల రాజులూ, ఇంకా యుద్ధంలో ప్రాణాలు విడిచిన ఇతరరాజులూ ఉన్నారు. వాళ్ళందరినీ చూపించి వీరందరికీ ఉత్తమ లోకాలు లభించాయని చెప్పాడు.

ఎంతో వివరంగా చెబుతున్న వైశంపాయనుడితో జనమేజయుడు – 'ఓ మునివర్యా! వీళ్ళంతా శాశ్వతంగా స్వర్గంలోనే ఉండిపోతారా? లేక కొంతకాలం మాత్రమే ఉండి తిరిగి మనుష్య జన్మ ఎత్తుతారా? అని అడిగాడు. దానికి వైశంపాయనుడు 'ఓ జనమేజయ మహారాజా! వేదవ్యాస మహర్షిద్వారా నాకు తెలిసిన వివరాలు నీకు చెబుతాను విను.

ప్రద్యుమ్నుడు సనత్కుమారుడిలో కలిసిపోయాడు. గాంధారీ ధృతరాష్ట్రులు, కుబేరలోకం చేరారు. పాండురాజు కుంతీదేవి, మాద్రి స్వర్గంలోనే ఉన్నారు. అభిమన్యుడు చంద్రుడిలో, ద్రోణాచార్యుడు బృహస్పతిలో, శకుని ద్వాపరుడిలో కలిసిపోయారు.

సుయోధనుడు కొంతకాలమే స్వర్గసుఖాలు అనుభవించి, తరువాత నరక లోకంలో శిక్షలు అనుభవించి, చివరికి కలిపురుషుడిలో ఐక్యమయ్యాడు. తక్కిన కౌరవులందరూ కర్మఫలాల్ని అనుభవించి రాక్షసుల్లో ఐక్యమయ్యారు.

కర్ణుడు సూర్యుడిలో, భీష్ముడు అష్టవసువులలో ఆఖరివాడిలోనూ, ద్రుపదుడు, విరాటుడు, ధృష్టకేతుడు, భూరిశ్రవుడు, శల్యుడు, శంఖుడు, ఉత్తరుడు, వీరంతా విశ్వేదేవతలలో కలిసిపోయారు.

ధృష్టద్యుమ్నుడు అగ్నిలో, విదురుడు, ధర్మరాజు యమధర్మరాజులో లీనమయ్యారు. బలరాముడు అనంతుడిలో కలిసిపోయాడు. శ్రీకృష్ణుడితో

రాసలీలలాడిన పదహారువేలమంది గోపికలు సరస్వతీ నదిలో మునిగి అప్సరసలుగా మారి మహావిష్ణువును సేవిస్తున్నారు. శ్రీకృష్ణుడితో పాటు సహగమనం చేసిన రుక్మిణీదేవీ, తక్కిన ఏడుగురు భార్యలు కూడా లక్ష్మీదేవిలో కలిసిపోయారు. ఈవిధంగా వైశంపాయన మహర్షి జనమేజయుడికి ఈ కథను చెప్పాడని ఉగ్రశ్రవసుడు శౌనకాదిమహర్షులకు చెప్పి,నేను ఈ కథను జనమేజయుడు చేసిన సర్పయాగ సందర్భంలో వేదవ్యాసమహర్షి శిష్యుడైన వైశంపాయనుడు చెప్పగా విన్నాను. తరువాత సర్పయాగం పూర్తి అయింది. ఆ సర్పయాగాన్ని ఆపి, సర్పాలను రక్షించిన ఆస్తీకుడిని జనమేజయుడు పూజించి సత్కరించాడు. ఋత్విక్కులకు కానుకలు దక్షిణలు ఇచ్చి సంతోషపరిచాడు. తరువాత వేదవ్యాసమహర్షినీ, వైశంపాయన మహర్షినీ సత్కరించి తాను హస్తినాపురానికి వెళ్ళిపోయాడు.

ఓ మహర్షులారా! ఈ మహాభారతాన్ని రచించిన వేదవ్యాసమహర్షి సత్యజ్ఞాన సంపన్నుడు. వేదస్వరూపుడు. విజ్ఞానఖని. పుణ్యశాలి. బ్రహ్మజ్ఞాని. శౌచం, శాంతి, క్షమ, దాంతి, తపోనిష్ఠ కలవాడు. ధర్మాత్ముడు.

పాండవుల కీర్తిని లోకానికి చాటడానికీ, రాజుల చరిత్రలూ రాజవంశాల చరిత్రలూ తెలియజేయడానికీ, వాసుదేవుడి దివ్యలీలా విశేషాలను విశదం చేయడానికీ, సకలధర్మాలను లోకానికి తెలియజెయ్యడానికీ, పంచమవేదంగా ఈ మహాభారతాన్ని వేదవ్యాసుడు మూడు సంవత్సరాలలో రచించి పూర్తిచేశాడు.

**తే.గీ. అమల ధర్మార్థ కామమోక్షముల గుఱిచి**
**యొలయు తెరువెద్దియును నిందుఁ గలుగు నదియ**
**యొండెడలఁ గల్గు; దీన లేకుండు చొప్పు**
**దక్కొకంటను లేదు వేదజ్ఞులార! (స్వర్గా: 82)**

**ఓ వేదజ్ఞులారా! ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలను సాధించడానికి కావలసిన మార్గాన్ని ఈ గ్రంథం చక్కగా చూపిస్తుంది. వాటి విషయంలో ఇందులో ఉన్నదే లోకంలో ఉంది. ఇందులో లేనిది లోకంలో మరెక్కడా లేదు" అన్నాడు వైశంపాయన మహర్షి జనమేజయుడితో.**

'మహర్షులారా! ఈ భారతాన్ని కోరి విన్నా, భక్తితో చదివినా ఐశ్వర్యమూ, ఆయువు, గొప్పయశస్సు, ఆనందం, గట్టి విద్య కలుగుతాయి. అంతేకాదు అలా విన్నవారికి గానీ చదివినవారికి గానీ కోరికలు వెంటనే తీరిపోతాయి.

ఈ పుణ్య కథను మొదటి నుండి చివరి వరకూ పర్వదినాలలో ఎవరు భక్తిశ్రద్ధలతో వింటారో, వారికి పాపాలన్నీ నశించిపోతాయి. వారికి స్వర్గలోకసుఖాలు లభిస్తాయి. మోక్షమూ లభిస్తుంది. బ్రహ్మహత్యాపాతకం లాంటి ఘోరమైన పాపాలూ నశిస్తాయి.

దైవ, పితృకార్యాలు జరిపేటప్పుడు ఎవరైతే ఈ మహాభారత కథను బ్రాహ్మణులకు వినిపిస్తారో, వారికి ఆ యా పుణ్యకార్యఫలం దక్కుతుంది. మహాభారత కథను పూర్తిగా వినలేకపోయినా, ఏకొంచెమయినా చెవిలో పడితే, అలాంటి వారికి కూడా సమస్త పాపాలు తొలగిపోతాయి.

ఓ మునీంద్రులారా! మొదట ఈ ఇతిహాసం జయం అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. అందుకని, క్షత్రియులు ఈ ఇతిహాసం వింటే వారికి ఎల్లప్పుడూ జయమే. భక్తితో చదివినా, విన్నా, సకల సంపదలూ కలుగుతాయి. ఆయువు వృద్ధి చెందుతుంది. విద్య అబ్బుతుంది. గర్భిణులు వింటే వారికి పుత్రసంతానం కలుగుతుంది. కన్యలు వింటే మంచి వరుడు లభిస్తాడు.

అన్నింటికంటే ముఖ్యంగా ఈ మహాభారతం కృష్ణమూలమైనది కాబట్టి ఆ శ్రీకృష్ణపరమాత్మపై అచంచలమైన భక్తి విశ్వాసాలతో వింటే పుణ్యలోకప్రాప్తి తథ్యం.

వ్యాసమహర్షి అనుగ్రహంవల్ల మహాభారతేతిహాసంలోని అంతరార్థం తెలుసుకున్న వారికి వేదోపనిషత్తులూ, పురాణాలూ, సకలశాస్త్రాలూ కరతలామలక మవుతాయి. అలాంటి వ్యక్తిని లోకం కీర్తిస్తుంది. అతడే బ్రహ్మజ్ఞాని అవుతాడు అని సూతుడు శౌనకాది మహామునులకు ఆనందం కలిగించేలా మహాభారతేతిహాసాన్ని చెప్పాడు.

వారు ఎంతో సంతోషించారు. ఆ మహామునులందరూ తమకు అంత ఆనందాన్ని కలుగజేసిన ఉగ్రశ్రవసుడు అనే సూతమహర్షికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించారు.

– స్వస్తి –